# ఆధునిక సాహిత్యం-నాటకం

## (నిర్ణయించిన పాఠ్యాంశాలు, నాటకం)

### ఎం.ఏ. తెలుగు, రెండవ సంవత్సరం

### సెమిస్టర్-IV, పేపరు-I

### పాఠ్య రచయితలు


**ఆచార్య ఇరపని మాధవి,**
ఎం.ఏ., ఎం.ఫిల్., పిహెచ్.డి.
ప్రొఫెసర్
తెలుగు & ప్రాచ్యభాషా విభాగం,
ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, నాగార్జున నగర్.

**డా॥ కందిమళ్ళ సాంబశివరావు**
ఎం.ఏ., పిహెచ్.డి.
తెలుగు శాఖాధ్యక్షులు (రిటైర్డ్)
డి.ఆర్.ఎన్.ఎస్.సి.వి.ఎస్. కళాశాల,
చిలకలూరిపేట, పల్నాడు జిల్లా.

**డా॥ దొప్పలపూడి సుజాత,**
ఎం.ఏ., టి.పి.టి., ఎం.ఫిల్., పిహెచ్.డి.
తెలుగు అధ్యాపకులు
ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాల,
యర్రగొండపాలెం, ప్రకాశం జిల్లా.

**డా॥ కొమ్మనబోయిన సుజాత**
ఎం.ఏ., పిహెచ్.డి.
తెలుగు అధ్యాపకులు
టి.ఆర్.ఆర్. ప్రభుత్వ డిగ్రీ కళాశాల,
కందుకూరు, ఎస్.పి.ఎస్.ఆర్. నెల్లూరు జిల్లా.

**డా॥ తంగి ఓగేశ్వరరావు,**
ఎం.ఏ., పిహెచ్.డి.
తెలుగు అధ్యాపకులు
వి.వి. గిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల,
దుంపలగూడెం, ప.గో. జిల్లా.


### సంపాదకులు


**ఆచార్య ఇరపని మాధవి,**
ఎం.ఏ., ఎం.ఫిల్., పిహెచ్.డి.
ప్రొఫెసర్
తెలుగు & ప్రాచ్యభాషా విభాగం
ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, నాగార్జున నగర్.


### డైరెక్టర్


**డా॥ నాగరాజు బట్టు,**
**ఎం.హెచ్.ఆర్.ఎం., ఎం.బి.ఏ., ఎల్.ఎల్.ఎం., ఎం.ఏ. (సై.), ఎం.ఏ (సో.), ఎం.ఇడి., ఎం.ఫిల్., పిహెచ్.డి.**


### దూర విద్యా కేంద్రము


ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, నాగార్జున నగర్-522 510.
ఫోన్ నెం.: 0863-2346208, 0863-2346222, 0863-2346259 (స్టడీ మెటీరియల్)
వెబ్‌సైట్: www.anucde.info ఇ-మెయిల్: anucdedirector@gmail.com

# ఎం.ఏ. తెలుగు - ఆధునిక సాహిత్యం-నాటకం

First Edition: 2023

No. of Copies:

© Acharya Nagarjuna University

This book is exclusively prepared for the use of students of **M.A. (TELUGU)** Centre for Distance Education, Acharya Nagarjuna University and this book is mean for limited circulation only.

**Published by:**

**Dr. NAGARAJU BATTU**

Director

Centre for Distance Education

Acharya Nagarjuna University

**Printed at:**

## ముందుమాట

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం 1976లో స్థాపించినది మొదలు నేటి వరకు ప్రగతి పథంలో పయనిస్తూ వివిధ కోర్సులు, పరిశోధనలు అందిస్తూ 2016 నాటికి NAAC చే గ్రేడ్ 'A'ను సంపాదించుకొని దేశంలోనే ఒక ప్రముఖ విశ్వవిద్యాలయంగా గుర్తింపు సాధించుకొన్నదని తెలియజేయడానికి సంతోషిస్తున్నాను. ప్రస్తుతం గుంటూరు, ప్రకాశం జిల్లాలోని 447 అనుబంధ కళాశాలల విద్యార్థులకు డిప్లమో, డిగ్రీ, పీజి స్థాయి విద్యాబోధనను ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం అందిస్తోంది.

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఉన్నత విద్యను అందరికీ అందించాలన్న లక్ష్యంతో 2003-04లో దూరవిద్యా కేంద్రాన్ని స్థాపించింది. పూర్తిస్థాయిలో కళాశాలకు వెళ్ళి విద్యనభ్యసించలేని వారికి, వ్యయభరితమైన ఫీజులు చెల్లించలేని వారికి, ఉన్నత విద్య చదవాలన్న కోరిక ఉన్న గృహిణులకు ఈ దూర విద్యాకేంద్రం ఎంతో ఉపయోగపడుతుంది. ఇప్పటికే డిగ్రీ స్థాయిలో బి.ఏ., బి.కాం., బి.ఎస్సి., పీజీ స్థాయిలో ఎం.ఏ., ఎం.కాం., ఎం.ఎస్సి., ఎం.సి.ఏ., ఎల్.ఎల్.ఎం., ఎం.బి.ఏ., కోర్సులను ప్రారంభించిన విశ్వవిద్యాలయం గత సంవత్సరం కొత్తగా జీవన నైపుణ్యాలు అనే సర్టిఫికేట్ కోర్సును కూడా ప్రారంభించింది.

ఈ దూర విద్యా విధానం ద్వారా విద్యనభ్యసించే విద్యార్థుల కొరకు రూపొందించే పాఠ్యాంశాలు సులభంగాను, సరళంగాను విద్యార్థి తనంతట తానుగా అర్థం చేసుకునేలా ఉండాలనే ఉద్దేశ్యంతో విశేష బోధనానుభవం కలిగి రచనా వ్యాసంగంలో అనుభవం గల అధ్యాపకులతో పాఠ్యాంశాలను వ్రాయించడం జరిగింది. వీరు ఎంతో నేర్పుతో, నైపుణ్యంతో నిర్ణీత సమయంలో పాఠ్యాంశాలను తయారుచేశారు. ఈ పాఠ్యాంశాలపై విద్యార్థినీ, విద్యార్థులు, ఉపాధ్యాయులు నిష్ణాతులైనవారు ఇచ్చే సలహాలు, సూచనలు, సహృదయంతో స్వీకరించబడతాయి. నిర్మాణాత్మకమైన సూచనలు గ్రహించి మున్ముందు మరింత నిర్దిష్టంగా అర్థమయ్యే రీతిలో ప్రచురణ చేయగలం. ఈ పాఠ్యాంశాల అవగాహన కోసం, అభివృద్ధి కోసం సంశయాల నివృత్తి కోసం వారాంతపు తరగతులు, కాంటాక్టు క్లాసులు ఏర్పాటు చేయడం జరిగింది.

దూరవిద్యా కేంద్రం ద్వారా విజ్ఞాన సముపార్జన చేస్తున్న విద్యార్థులు, ఉన్నత విద్యార్హతలు సంపాదించి జీవనయాత్ర సుగమం చేసుకోవడమే కాక చక్కటి ఉద్యోగావకాశాలు పొంది, ఉద్యోగాలలో ఉన్నత స్థాయికి చేరాలని, తద్వార దేశ పురోగతికి దోహదపడాలని కోరుకుంటున్నాను. రాబోయే సంవత్సరాలలో దూరవిద్యా కేంద్రం మరిన్ని కొత్త కోర్సులతో దిన దినాభివృద్ధి చెంది ప్రజలందరికీ అందుబాటులో ఉండాలని అకాంక్షిస్తున్నాను. ఈ ఆశయ సాధనకు సహకరిస్తున్న, సహకరించిన దూరవిద్యా కేంద్రం డైరెక్టర్లకు, సంపాదకులకు, రచయితలకు, అకడమిక్ కోఆర్డినేటర్లకు, అకడమిక్ కౌన్సిలర్లకు మరియు అధ్యాపకేతర సిబ్బందికి నా అభినందనలు.

**ప్రొఫెసర్. పి. రాజశేఖర్**

**ఉపకులపతి**

**ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం.**

# ఎం.ఏ. తెలుగు, రెండవ సంవత్సరం

# సెమిస్టర్-IV, పేపరు-I

# 401TL21- ఆధునిక సాహిత్యం-నాటకం

# (నిర్ణయించిన పాఠ్యాంశాలు, నాటకం)

## సిలబస్

1. శంకరంబాడి సుందరాచారి-గీతాంజలి
2. కరుణశ్రీ-విజయశ్రీ
3. విద్వాన్ విశ్వం-పెన్నేటి పాట
4. ఆవంత్స సోమసుందర్-వజ్రాయుధం
5. గురజాడ-కన్యాశుల్కం నాటకం

**ఆధార గ్రంథాలు:**

1) గీతాంజలి- శంకరంబాడి సుందరాచారి

2) విజయశ్రీ -కరుణశ్రీ

3) పెన్నేటి పాట - విద్వాన్ విశ్వం

4) వజ్రాయుధం - ఆవంత్స సోమసుందర్

5) కన్యాశుల్కం - గురజాడ

# ఆధునిక సాహిత్యం-నాటకం

## (నిర్ణయించిన పాఠ్యాంశాలు, నాటకం)

## విషయ సూచిక


| సంఖ్య | పాఠం | పుట |
|---|---|---|
| 1. | గీతాంజలి -కవి పరిచయం, పాఠ్యభాగ సారాంశం | 1.1-1.24 |
| 2. | గీతాంజలి-కఠినపదాలకు అర్థాలు, సందర్భ సహిత వ్యాఖ్యలు | 2.1-2.16 |
| 3. | గీతాంజలి-ప్రశ్నలు, సమాధానాలు | 3.1-3.15 |
| 4. | విజయశ్రీ-కవి పరిచయం, పాఠ్యభాగ సారాంశం | 4.1-4.18 |
| 5. | విజయశ్రీ-కఠినపదాలకు అర్థాలు, సందర్భ సహిత వ్యాఖ్యలు | 5.1-5.11 |
| 6. | విజయశ్రీ-ప్రశ్నలు, సమాధానాలు | 6.1-6.18 |
| 7. | పెన్నేటిపాట-కవి పరిచయం, పాఠ్యభాగ సారాంశం | 7.1-7.8 |
| 8. | పెన్నేటిపాట-కఠినపదాలకు అర్థాలు, సందర్భ సహిత వ్యాఖ్యలు | 8.1-8..8 |
| 9. | పెన్నేటిపాట-ప్రశ్నలు, సమాధానాలు | 9.1-9.9 |
| 10. | వజ్రాయుధం-కవి పరిచయం, పాఠ్యభాగ సారాంశం | 10.1-10.13 |
| 11. | వజ్రాయుధం-కఠినపదాలకు అర్థాలు, సందర్భ సహిత వ్యాఖ్యలు | 11.1-11.5 |
| 12. | వజ్రాయుధం-ప్రశ్నలు, సమాధానాలు | 12.1-12.8 |
| 13. | కన్యాశుల్కం-నాటక పరిచయం, కథావివరణ | 13.1-13.12 |
| 14. | కన్యాశుల్కం-పాత్రలు, సందర్భ సహిత వ్యాఖ్యలు | 14.1-14.13 |
| 15. | కన్యాశుల్కం-ప్రశ్నలు, సమాధానాలు | 15.1-15.8 |

**పాఠం - 1**

# గీతాంజలి

**- శంకరంబాడి సుందరాచారి**

**విషయ క్రమం:**


**1.0.** పాఠ్యభాగ లక్ష్యం

**1.1.** కవి పరిచయం

**1.2.** గీతాంజలి

**1.3.** పాఠ్యభాగ సారాంశం

**1.4.** ఆధార గ్రంథాలు


## 1.0. పాఠ్యభాగ లక్ష్యం:

"మా తెలుగుతల్లికి మల్లెపూదండ" రచించిన శంకరంబాడి సుందరాచారిగారి గురించి తెలియపరచడం మరియు రవీంద్రనాథ్ ఠాగూర్ రచించిన "గీతాంజలి" అనువాదమైన శంకరంబాడి సుందరాచారిగారు రచించిన "గీతాంజలి" సారాంశం విద్యార్థులకు వివరించుట.

## 1.1. కవి పరిచయం:

**"వారును వీరు మెచ్చుకొను భంగిని కోరి కలమ్ముపట్టినే**
**నేరను వ్రాయ కబ్బముల నిండు మనమ్మది పొంగియేరులై**
**పారెడుదాక యుక్త పదబంధము తీరెడుదాక భావముల్**
**జారవు నా కలమ్మువిడి సత్యము నా హృదయమ్ము తెల్పితిన్"**

అని చెప్పుకున్న కవి శంకరంబాడి సుందరాచారిగారు. శంకరంబాడి సుందరాచారిగారు సదాచారులైన వైష్ణవ బ్రాహ్మణ కుటుంబంలో రాజగోపాలాచారి, కమలమ్మ దంపతులకు 1914 ఆగష్టు10న ప్రథమ సంతానంగా తిరుపతిలో జన్మించారు. వీరి తాతగారు డా॥ సర్వేపల్లి రాధాకృష్ణన్ గురువుగారైన కృష్ణమాచారిగారు. రెండు సంవత్సరాల వయస్సు నిండక ముందే వారి తాతగారైన కృష్ణమాచారి స్వర్గస్థులయ్యారు. సుందరాచారిగారి తండ్రిగారైన రాజగోపాలాచారి ఉద్యోగ బాధ్యతల కారణంగా సుందరాచారిని వారి అమ్మమ్మగారింట్లో ఉంచవలసి వచ్చింది. సుందరాచారి తమ ప్రాథమిక విద్యను తిరుపతిలోని తిరుపతి దేవస్థానం వారి హైందవోన్నత పాఠశాలలో పూర్తిచేశారు. వీరు సంస్కృతాంధ్ర భాషలను బాగా చదువుకున్నారు. మదనపల్లిలోని అనిబిసెంట్ థియోసాఫికల్ కళాశాలలో ఇంటర్ ప్రథమ స్థానంలో ఉత్తీర్ణులయ్యారు.

సుందరాచారిగారు బి.ఏ. పూర్తిచేసిన తర్వాత కొంతకాలం స్కూళ్ళ ఇన్స్పెక్టర్‌గా పనిచేశారు. ఆ రోజుల్లో ప్రతివారం వీరు కంచికి వెళ్ళి కామాక్షి అమ్మవారిని దర్శించేవారు. శని, ఆదివారాలు రాత్రిళ్ళు ఏదో ఒక ఇంటి అరుగు మీద పడుకుని సోమవారం ఉదయాన్నే బయలుదేరి డ్యూటికి వెళ్ళేవారు. ఒకరోజు అదేవిధంగా ఒక ఇంటి అరుగుమీద పడుకొని ఉండగా ఆ ఇంటిలోనుండి భార్యాభర్తల మధ్య జరుగుతున్న గొడవ వీరి చెవినబడింది. మంచినీళ్ళకోసమని తలుపుకొట్టి కారణమడిగారు. వారికి ముగ్గురు ఆడపిల్లలు. పెద్దమ్మాయి వేదమ్మాళ్, మానసిక వ్యాధిగ్రస్తురాలు. ఆమెకు వివాహం అయితేగాని మిగిలిన ఇద్దరికీ వివాహం జరుగదు. ఈ మధ్య కుదిరిన సంబంధం కూడా తప్పిపోయింది అని వారు చెప్పగా సుందరాచారిగారు

ఆలోచించి ఒక స్థిర నిర్ణయానికి వచ్చి తను పుట్టిన ఊరు, కులం, వృత్తి, ఆదాయం వంటి వివరాలు వారికి తెలిపి వారికి ఇష్టమైతే తన తల్లిదండ్రులను పంపించి మాట్లాడి వివాహం చేసుకుంటానని తెలిపారు. అన్న మాట ప్రకారం తల్లిదండ్రులను పంపి ఆమెనే 1939వ సంవత్సరంలో వివాహం చేసుకున్నారు. పెళ్ళి తర్వాత కూడా వేదమ్మాళ్‌కి నయం కాలేదు. ఆమెకు వైద్యం చేయిస్తూనే కాపురం చేసేవారు సుందరాచారిగారు. వారికి ఒక కూతురు జన్మించి ఐదేళ్ళ వయసులో మరణించింది. కొంతకాలానికి వేదమ్మాళ్ కూడా మరణించింది. సుందరాచారిగారు ఏకాకిగానే జీవితాన్ని వెళ్ళదీశారు. తన సతీమణి గురించి సుందరాచారిగారు

**"నిన్ను తెలియలేని నన్ను నమ్మినదాని**
**అబల నాద పత్ని నరసిపెంచు**
**ధర్మమొకటి మిగిలె ధరణిలో నినుజేర**
**నీ నిబంధకముగ శ్రీనివాస"** అని రాశారు.

శ్రావణ పౌర్ణమి రోజున సదాచార సంపన్నులైన బ్రాహ్మణులు గాయత్రీ స్వరూపమైన యజ్ఞోపవీతాన్ని మార్చుకుంటారు. అలా ఒక శ్రావణ పౌర్ణమి రోజున కూడా సుందరాచారిగారు ఎక్కడెక్కడో తిరిగి ఇంటికి ఆలశ్యంగా వచ్చారు. వీరి తండ్రి కోపంగా "ఈ ఒక్క పూట కూడా కొంపలో ఉండటానికి కుదరకపోయిందా! నీకెందుకురా జంధ్యం" అని ఆవేశంతో, ఆవేదనతో అన్నారు. వెంటనే సుందరాచారిగారు 'అవును నాన్నా, నాకెందుకీ బంధం' అని జంధ్యాన్ని పుటుక్కున తెంచి ఇంటి ముందు పడుకొని ఉన్న కుక్క మెడలో వేసి తిరిగి చూడకుండా తిరుపతి రైల్వేస్టేషన్‌కు వెళ్ళారు. ఆకలి బాధకు తాళలేక సుందరాచారిగారు రైల్వే కూలిగా చేరారు. అది చూసి వారి తండ్రి తన కంటి ముందు ఇలాంటి పనులు చేయవద్దని ఇతరులతో చెప్పించారు. సుందరాచారిగారు రైల్వే కూలిపని మాని హోటల్లో పిండిరుబ్బే పనికి కుదురుకున్నారు. మళ్ళీ వారి తండ్రి కలత చెందటంతో సుందరాచారిగారు ఉన్న ఊరిలో తాను ఏ పని చేసినా తండ్రి బాధపడతాడని తెలిసి తిరుపతి వదిలి మద్రాస్ చేరారు. అక్కడ ఆర్యభవన్ హోటల్‌కు వెళ్ళి "అయ్యా నేను తెలుగు బాగా రాస్తాను, ఏదైన ఉద్యోగమివ్వండి" అనగా ఆ మేనేజర్ 'మాకు తెలుగుతో పనిలేదు, తంబుచెట్టి వీధిలో ఒక తెలుగు ఆఫీస్ ఉంది అక్కడికి వెళ్ళు' అని తమిళంలో చెప్పాడు. మంచి ఉద్యోగం కోసం ఆశతో మద్రాసు వచ్చిన సుందరాచారిగారు

**"ఈ లోకమున నను ఏల సృష్టించితివి?**
**సృష్టించి ఏ పనిని చేయ నియమించితివి**
**చిన్నబుచ్చక నాకు చెప్పరావా దొరా**
**ఈ చిన్ని గుండెలో ఎన్ని గుండ్రాలురా**
**ఈ లేత బుర్రలో ఎన్ని కంపాలురా**
**వద్దురా ఈ బ్రతుకు వద్దురా దేవుడా"** అని దేవుడిని నిలదీశారు.

**పత్రిక, సినీరంగ ప్రవేశాలు:** హోటల్ మేనేజర్ చెప్పినట్లుగా సుందరాచారి తంబుచెట్టి వీధిలోని ఆంధ్రపత్రిక కార్యాలయానికి వెళ్ళి కాశీనాథుని నాగేశ్వరరావు పంతులుగారిని కలిసి తనను పరిచయం చేసుకున్నారు. అప్పుడు పంతులుగారు "మీకు తెలుగు వచ్చా" అని అడుగగా సుందరాచారిగారు 'నేను ఇంతసేపు మాట్లాడింది తెలుగే కదండి, మీకు తెలుగు రాదా!' అని

ప్రశ్నించారు. పంతులుగారు సుందరాచారికి ప్రూఫ్ రీడర్‌గా ఉద్యోగం ఇచ్చారు. సుందరాచారిగారు క్రమంగా ఎదిగి సంపాదకులయ్యారు. “కళావని” అనే శీర్షికతో ఎంతో వైవిధ్యమున్న వ్యాసాలను ప్రకటించారు. ముఖ్యంగా బళ్ళారి రాఘవ, స్థానం నరసింహారావుగార్ల నటనకు సంబంధించి అనేక వ్యాసాలు రాశారు.

ఆంధ్రపత్రిక ఉద్యోగానికి స్వస్తి చెప్పి బెంగుళూరులోని “హిజ్ మాస్టర్స్ వాయిస్” కంపెనీలో ప్రముఖ చలనచిత్ర నటులు చిత్తూరు నాగయ్యగారి ప్రోత్సాహంతో కవిగా చేరి కొన్ని నాటకాల సెట్లను రచించారు. నాగయ్యగారి సాహచర్య ప్రభావంతో సినీకవిగా జీవితం ప్రారంభించారు. 1946వ సంవత్సరంలో సినిమా సంస్థ నుంచి పిలుపు రావటంతో ఉపాధ్యాయ ఉద్యోగానికి 2 సం॥లు శెలవు పెట్టి “దీనబంధు” చిత్రానికి మాటలు పాటలు రాశారు. ఈ సినిమా కోసమే “మా తెలుగు తల్లికి మల్లెపుదండ” గేయాన్ని రచించగా అది చాలా పెద్ద పాటని హెచ్.యం.రెడ్డి గారు ఆ పాటను సినిమాలో చేర్చలేదు. ప్రముఖ గాయని ‘టంగుటూరి సూర్యకుమారి’ గారు ఆ పాటను పాడి సుందరాచారిగారికి రూ. 116/- రూపాయలిచ్చి ఆ గేయంపై సర్వహక్కులు పొందారు. సుందరాచారిగారి భార్యకు మనోవ్యాధి ఎక్కువవటంతో సినిమాలను వదిలి మళ్ళీ ఉపాధ్యాయ వృత్తిలో చేరారు.

సినిమా సంస్థలో చేరడానికి 6 సంవత్సరాల ముందు నుంచే చిత్తూరు బోర్డు హైస్కూలులో ఉపాధ్యాయ వృత్తిలో ఉన్న సుందరాచారిని 1952వ సంవత్సరంలో ప్రభుత్వం జూనియర్ డెప్యూటి ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్‌గా నియమించింది. మూడు సంవత్సరాలు ఈ ఉద్యోగం చేశారు. ఒకసారి విద్యాశాఖాధికారి తిరుపతికి రాగా అతడికి స్వాగతం చెప్పడానికి కొందరు విద్యాశాఖాధికారులతో కలిసి సుందరాచారిగారు కూడా వెళ్ళారు. రైల్లో నుండి క్రిందకు దిగుతూ ఆ అధికారి తన చేతిలోని ఫైల్‌ని సుందరాచారిగారికి ఇవ్వబోగా అతడిని ఎగాదిగా చూసి ‘ఆఫీసు జవాను ఎవరో, ఇన్‌స్పెక్టర్ ఎవరో తేడా తెలియని వ్యక్తి ఒక డైరెక్టరా! అలాంటి శాఖలో ఉద్యోగం చెయ్యడం సిగ్గుసిగ్గు’ అని అక్కడికక్కడే ఉద్యోగానికి రాజీనామా ఇచ్చారు.

**రచనలు:**

సుందరాచారి తన 12వ యేటనే కవితలల్లడం మొదలుపెట్టారు. ఎన్నో కవితా ఖండికలను, గేయాలను రచించారు. ఉద్యోగానికి రాజీనామా ఇచ్చిన సుందరాచారిగారు షోలింగర్‌లో 15 రోజులున్నారు. అప్పుడు ఒకరోజు “శంకరంబాడి సుందరాచారి నేను” అనే గీతపాదం అనాలోచితంగా వీరి నోటి నుండి వెలువడింది. ఆనాటి నుండి తనను తేటగీత కవిగా భావించుకొని మొత్తం 15000 తేటగీతులను రచించారు. వీరికి వాల్మీకి, వ్యాసుడు, కాళిదాసు, భవభూతి, నన్నయ, తిక్కన, ఎర్రన, శ్రీనాథుడు, పోతన, వేమన మొదలైన భారతీయ కవులను, షేక్స్పియర్, మిల్టన్ వంటి ఆంగ్ల కవులను ఎక్కువగా ఇష్టపడేవారు. ఆధునిక కవులలో విశ్వనాథ, రాయప్రోలు, జాషువా, శ్రీశ్రీ, దుర్భాక రాజశేఖరం, శతావధాని గడియారం వేంకటకృష్ణశాస్త్రి, పుట్టపర్తి నారాయణాచార్యులు, రాళ్లపల్లి అనంతకృష్ణశర్మలతో సన్నిహిత పరిచయం కలిగి ఉండేవారు. తనను ఎక్కువగా ప్రభావితం చేసిన గురువులు పాతాళభేది సుబ్రహ్మణ్యం, అల్లసాని రామనాథశర్మ అనే గురువులని సుందరాచారిగారే చెప్పుకున్నారు.

సుందరాచారిగారిది శ్రావ్యమైన కంఠం. చక్కగా పాటలు పాడేవారు. ప్రముఖ సంగీతజ్ఞులైన డి.కె. పట్టామ్మాళ్, ఎం.ఎస్. సుబ్బలక్ష్మి, చెంబై విద్యానాథన్, భగవతార్, టైగర్ వరదాచారి, మంగళంపల్లి బాలమురళీకృష్ణ, నేదునూరి టి.ఆర్. మహాలింగం వంటివారి గానం అమితాసక్తితో వినేవారు. కవిత్వం, సంగీతమే కాక నటన, చిత్రలేఖనంలో కూడా వీరికి

అభిరుచి ఉంది. వీరికున్న భాషా పటిమ కూడా గొప్పది. సుందరాచారిగారు 1955వ సంవత్సరంలో రాష్ట్రపతిని, ప్రధానమంత్రిని కలిసి తిరిగి వస్తూ బెనారస్ విశ్వవిద్యాలయానికి వెళ్ళి అక్కడ ఎర్నేని వెంకటేశ్వరరావుగారితో "ఆంధ్ర అసోసియేషన్ వారిని కలవాలి. "మా తెలుగు తల్లికి" పాట రచయిత వచ్చారు. రేపు నాలుగు గంటలకు మీటింగ్ అని నోటీసు పెట్టమన్నారంట. విద్యార్థులంతా 4 గంటలకు వచ్చి ఎదురుచూస్తుండగా సుందరాచారిగారు 6 గంటలైనా రాలేదు. విద్యార్థులందరూ అసహనంగా ఉండగా వామనావతారులైన సుందరాచారిగారు మెల్లగా చేతి సంచితో లోపలికి వచ్చి నేరుగా స్టేజి వైపు వెళుతుండగా ఒక విద్యార్థి గట్టిగా "ఇప్పుడొచ్చాడయ్యా 2 గంటలు ఆలస్యంగా ఇప్పుడు మొదలుపెడితే ఎప్పటికి వదులుతాడో" అన్నాడు. దానికి సుందరాచారిగారు "నేను మాట్లాడటం ప్రారంభించి ఆపేలోపు నీ అంతట నువ్వు లేచి వెళ్ళగలిగితే వెళ్ళు సవాల్" అన్నారు. సుందరాచారి అనర్గళంగా తెలుగు జీవన మాధుర్యాన్ని, తెలుగు భాషలోని విశిష్టతను కళ్ళకు కట్టినట్లుగా చూపించి "ఏమోయ్ కుర్రోడా! గంటన్నరయింది లేచి వెళ్ళలేదే" అనగా ఆ కుర్రాడు నన్ను వదిలేయండి అన్నాడంట. సరే ఇంక ఆపేస్తున్నానని సుందరాచారిగారు అనగా ఆపేందుకు వీలులేదు ఇంకా మాట్లాడమని అందరూ కోరారంట. ఈ సంఘటన వారి వాగ్ధాటికి, భాషా పటిమకు తార్కాణం.

సుందరాచారిగారు తన రచనల గురించి అనేక సందర్భాలలో పేర్కొన్నారు కానీ అవి అన్ని ఇప్పుడు లభించడం లేదు.

**వచన రచనలు:** నాటి కవిత్వము, సంగ్రహ సుందర భారతము, ఏకలవ్యుడు, కళా పూర్ణోదయం.

**కావ్యాలు:** కెరటాలు, సుందర సుధాబిందువులు, బుద్ధగీత, అపవాదు, పేదకవి, నా స్వామి, ఏకలవ్యుడు, కాంచీ వరదరాజావతారణము, సంగ్రహ వాల్మీకి సుందర రామాయణము, సుందర భారతము, జపమాల, శాంతిదూతలు, స్వప్న సుందరుడు, గీతాంజలి.

ఇవేకాక రంగిరాస్యం, గాలిమేడలు, అరాచకము అనే అముద్రిత నాటక రచనలున్నాయి. ఇవేకాక ప్రచురించబడని ఎన్నో రకాల పాటలు, గేయాలు రచించారు. ఆకాశవాణి, మద్రాస్ కేంద్రం నుంచి అనేక కవితలు, ప్రసంగాలు ప్రసారమయ్యాయి. తన 12వ యేట వీరి గురువుగారైన శ్రీ పాతాళభేది సుబ్రహ్మణ్యంగారు కందపద్యం రాయడానికి ఛందోగతులు నేర్పి కందం చెప్పి కవివనిపించుకోమనగా 10 నిముషాలలో

**"కందమ్ము వ్రాయగలవా**
**అందంబుగ సుందరుండవనుచును నిపుడీ**
**చందంబున ననుగోరగ**
**కందంబిదె వ్రాసితయ్య కవికులవర్యా"** అని రాసి చెప్పారంట.

12వ సంవత్సరంలో కవిత్వం చెప్పిన సుందరాచారిగారి రచనలు ఇన్ని ఉన్నా ఆంధ్ర ప్రజానీకానికి అవన్నీ అపరిచితమే. ఒక్క "మా తెలుగుతల్లికి మల్లెపూదండ" మాత్రమే అశేష ఆంధ్రావనికి చిరపరిచితం. 1975వ సంవత్సరం వరకు వీరు కవి అని ఎక్కువ మందికి తెలియదు. అంత నిరాడంబర కవి, పేరు ప్రఖ్యాతులు కోరని కవి.

**బిరుదులు సన్మానాలు:** "మా తెలుగుతల్లికి మల్లెపూదండ" గేయానికి 116 రూపాయలందుకున్నారు. 1975 ఏప్రియల్ 12న ఇది రాష్ట్రగేయమైంది. ఈ గేయం నిమిత్తం 40 విద్యాలయాలు వీరిని సత్కరించాయి. చిత్తూరు టాగూర్ సెంటినరీ సెలబ్రేషన్

కమిటీవారు బంగారు ఉంగరంతో సత్కరించారు. శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం ఉపకులపతేగాక గోవింద రాజుల నాయుడు, మానవల్లి రామకృష్ణ కవి, రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ వంటివారు "ప్రసన్నకవి" బిరుదుతో వీరిని సత్కరించారు. 1976వ సంవత్సరంలో కడప జిల్లా పంచాయితీ రాజ్‌రబలో ఉత్సవాలలో భాగంగా అప్పటి జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో ఘన సన్మానం జరిగింది. ఢిల్లీ ఆంధ్రా సంఘం సన్మానసభలో అప్పటి రాష్ట్రపతి మీకు ఏమి కావాలి అని అడుగగా, రూ. 116, శాలువా అని అన్నారు. 1976వ సంవత్సరంలో ఉపరాష్ట్రపతి అయిన సర్వేపల్లి రాధాకృష్ణన్ గారిని కలవడానికి సుందరాచారి ఢిల్లీ వెళ్ళినపుడు కేవలం ఐదు నిముషాల సమయమిచ్చిన రాధాకృష్ణన్ వీరి విద్వత్తును గుర్తించి కొన్ని గంటలు వీరితో గడిపారు. సుందరాచారిగారు రచించిన బుద్ధగీతలోని విశేషాలను నెహ్రూకు తెలియజేయాలని భావించి ఆ రోజంతా కూర్చొని ఆంగ్లంలోకి అనువదించి రాధాకృష్ణన్‌కు ఇచ్చారు. ఆయనే ముద్రణకు ఇచ్చారు. ఆంగ్ల ప్రతులను తీసుకొని సుందరాచారి, రాధాకృష్ణన్‌లు ప్రధాని నెహ్రూను కలువుగా కొన్ని నిమిషాల సమయమిచ్చిన ప్రధాని దానిని గంటన్నరకు పొడిగించటం సుందరాచారి గారి ప్రతిభకు నిదర్శనం. నెహ్రూ రూ. 500/- చెక్కు ఇవ్వగా సుందరాచారి బ్యాంకుకు వెళ్ళగా అనుమానించిన అధికారులు ప్రధాని కార్యాలయానికి ఫోన్‌చేసి ధృవీకరించి సుందరాచారిని గౌరవించటంతో పాటు నగదు, జ్ఞాపికగా చెక్కును తిరిగి ఇచ్చి పంపారంట.

**అంత్యదశ:** సుందరాచారి ఏనాడు ఎవరికి తలవంచలేదు, పేదరికంలో మ్రగ్గినా, ఎన్ని కష్టాలు పడినా ఆత్మాభిమానం వీడలేదు. సర్వేపల్లి, నెహ్రూ వంటి వారు పరిచయమున్నా ఏనాడు ఎవరి ముందు చేయి చాపలేదు. మిత్రుల ఆర్థిక సహకారంతో తమ రచనలను ముద్రించేవారు. చిత్తూరు జిల్లాలో వివిధ పాఠశాలలకు తిరుగుతూ పద్యాలు పాడి పిల్లల, పెద్దల మనసు దోచుకునేవారు. తన పుస్తకాలు అమ్మి జీవనం సాగించారు. చివరిరోజుల్లో శిష్యుడు మన్నవ భాస్కర నాయుడు గారింటిలో కొన్ని సంవత్సరాలు గడిపారు. వీరికున్న ప్రధానలోపం 'మద్యానికి బానిస కావటమే'. "మా తెలుగు తల్లికి మల్లెపూదండ" గేయాన్ని స్వయంగా సుందరాచారిగారు పాడగా కడప ఆకాశవాణి రికార్డు చేసింది. ఇది జరిగిన 2 రోజులకే అంటే ఏప్రిల్ 8, 1977లో తన 63వ ఏట సుందరాచారిగారు స్వర్గస్థులయ్యారు.

## 1.2. గీతాంజలి:

ప్రపంచంలోనే భారతదేశానికి గుర్తింపు తెచ్చిన రవీంద్రుని రచన ఇది. తన ఎనిమిదవ యేటనే ఒక ఫ్రెంచ్ కవితానువాదంతో సాహితీరంగంలోకి అడుగుపెట్టిన రవీంద్రనాథ్ ఠాగూర్ తన జీవితంలో ముప్పై సంవత్సరాల నుంచి యాభై రెండో సంవత్సరం వరకు ప్రకటించిన పది కావ్య సంపుటాల నుంచి మొత్తం 103 కవితావచనాలను ఎంపిక చేసి W.B. Yeats సూచనమేరకు Poetric Prose గా ఆంగ్లంలోకి అనువదించారు.

1913 మార్చి నెలలో దీనిని "గీతాంజలి" గా ముద్రించారు. ఆ సంవత్సరం డిసెంబర్ నాటికి ఇది 13 ముద్రణలు పొందిందంటే దీని గొప్పతనం అర్థమవుతుంది. 1913వ సంవత్సరంలో నవంబర్ 13న ఈ గీతాంజలి భారతదేశానికే కాదు ఆసియా ఖండానికి మొట్టమొదటి నోబెల్ బహుమతిని అందించింది. దీనికి నోబెల్ బహుమతి రావటానికి ముందే 1913వ సంవత్సరంలోనే తొలి తెలుగు అనువాదం ఆదిపూడి సోమనాథ్ చేశారు. ఇప్పటికీ అనువాదాలు వస్తూనే ఉన్నాయి. 2021వ సంవత్సరంలోనే సీనియర్ జర్నలిస్ట్, రచయిత బెందాళం కృష్ణారావుగారు దీనిని అనువదించారు. దాదాపుగా తెలుగులోనే 100కి పైగా అనువాదాలున్నాయి. సినీ నటులు కొంగర జగ్గయ్య, బెల్లంకొండ రామదాసు, గుడిపాటి వెంకటాచలం వంటి అనేక మంది గీతాంజలిని అనువదించారు. వివిధ అనువాదకులు ఎలా అనువదించారో తెలియజేస్తూ వందమంది చేసిన

అనువాదాలను 2014వ సంవత్సరంలోనే 'నివేదన' పేరుతో గుంటూరులోని సంస్కృత సంస్థ ద్వారా మోదుగుల రవికృష్ణ ప్రకటించారు. ఇంత మంది అనువదించటానికి కారణం గీతాంజలిని చదివినవారిని రవీంద్రుని ఆత్మీయత కట్టిపడేస్తుంది. ప్రతిపదంలో రవీంద్రుని ఆత్మీయత కనిపిస్తుంది. భగవంతుడి పట్ల రవీంద్రుని అనురక్తి కనిపిస్తుంది. ప్రకృతితో మమేక మవ్వాలనే ఆకాంక్ష గోచరిస్తుంది. సున్నిత భావాలకు లోతైన ఆధ్యాత్మిక విషయాలకు ప్రాధాన్యత కనిపిస్తుంది. రవీంద్రుని భావుకతకి పరాకాష్ట ఈ రచన. కాలానికి, ప్రాంతాలకు, భాషలకు అతీతమైన విశ్వభావనలు కలిగి రవీంద్రుని విశ్వకవిని చేసిన రచన ఇది. ఈ రచన మరో విశేషం చదివే వారి స్థాయిని బట్టి ఎవరికి తగిన విధంగా వారికి అర్థమవుతుంది. ఈ గీతాంజలిని అనువదించిన మరొక కవి శంకరంబాడి సుందరాచారిగారు.

స్వతంత్ర రచన చేయాలంటే ఉండే స్వేచ్ఛ అనువాద రచనలో ఉండదు. ఒక అనువాదర రచనను స్వతంత్ర్య కావ్యంగా రాయాలంటే అది ఎంతో కష్టమైన పని. మూలరచనలోని కవి ఆత్మీయతను పట్టుకొని తెలగు భాషకు అనుగుణంగా దానిని మార్చగలగాలి. అది దేని అనువాదమో అనిపించనంత స్వతంత్ర రచనగా రాసినప్పుడే గుర్తించబడుతుంది. అలా రాయాలంటే అనువాదకుడు సహృదయుడైనప్పుడే సాధ్యం. అంటే మూలరచన చేసిన కవి హృదయంతో సమానమైన హృదయం కలవాడవ్వాలి. అదే భావజాలం కలిగి అన్నీ తాను అనుభూతి చెందగలగాలి. అప్పుడే ఆ రచన పాఠకులను అలరించగలుగుతుంది.

జాతీయగీత రచయిత అయిన రవీంద్రనాథ్ ఠాగూర్ గీతాంజలిని రాష్ట్ర గీత రచయిత అయిన శంకరంబాడి సుందరాచారిగారు అనువదించటం విశేషం. గీతాంజలిని తెలుగుదనం ఉట్టిపడేటట్లుగా అసలు రవీంద్రులే తెలుగులో రాశారా అనే విధంగా సుందరాచారి గీతాంజలిని అనువదించారు. రవీంద్రుడిలోని సౌకుమార్య, సౌమనస్యాలు, ఆంతరమైన శ్రాద్ధిక లయ, మార్ధవ కవిత వంటి లక్షణాల సుందరాచారిగారిలో కనిపిస్తాయి. సుందరాచారి మిత్రులు కపిస్థలం శ్రీరంగాచార్యులతో కలిసి మొదట్లో కొంత అనువదించారు. రంగాచార్యులు గతించటంతో మొత్తం తానే పూర్తిగా ఆంధ్రీకరించారు. దీనిని మొదటగా 1961వ సంవత్సరంలో చిత్తూరు జిల్లా ఠాగూరు శత జయంతి ఉత్సవ నిర్వాహక సంఘం ప్రచురించింది.

విశ్వనాథ సత్యనారాయణగారు దీనికి ఆముఖం రాస్తూ "ఈ గ్రంథము సర్వ సుకుమారముగనున్నది. తెలుగుదనముట్టి పడుచున్నది. నిజముగా నేడు తెలుగులోనిట్టి తర్జుమాలే కావలయును. సుందరాచారిగారు రవీంద్రుని తెలుగువానిగా చూపించుచున్నారని చెప్పవచ్చును" అని అన్నారు. 103 పద్యకాలుగా మాత్రా ఛందస్సులో సాగిన రచన ఇది. దీనిని సుందరాచారిగారు "సరాగం" అని ముద్రించారు. గానయోగ్యంగా రచించారు. భగవంతునికి గీతాలతో అర్పించిన అంజలి "గీతాంజలి".

## 1.3. పాఠ్యభాగ సారాంశం:

**"నన్ననంతుని జేసినావు – నీ స్వేచ్ఛ యది**

**నా ప్రభూ ! నవ జీవనము పోసి నింపెదవు**

**పలుమాఱులీ యుత్తపాత్రను బోర్లించి"** అని ప్రారంభమవుతుంది గీతాంజలి.

1. నన్ను అనంతుడిగా చేశావు, నీ స్వేచ్ఛ అది. అనేకసార్లు ఈ ఖాళీపాత్రను బోర్లించి మరలా మరలా కొత్త కొత్త చైతన్యాన్ని నింపుతావు. చిన్న వేణువుగా మారిన వెదురుపుల్లను దీనిని కొండలలోకి కోనలలోకి తీసుకువెళ్ళి కొత్త కొత్త రాగాలను ఊదావు. అమృతమయమైన నీ చేతి స్పర్శతో ఉప్పొంగి ఆనంద తీరం దాటి నా ఈ చిన్ని గుండె ఏమేమో పలికింది.

అంతులేని నీ బహుమతులను అందుకోవటానికి నా దగ్గర రెండు చేతులే ఉన్నాయి. యుగాలు గడిచినా నీవు పోత పోయటం ఆగిపోదు, ఇంకా పోయగలవు.

2. నా దొరా! నను పాడమని నీవంటే సంతోష గర్వంతో నా ఎద నిండి పగులుతుందనిపిస్తుంది. నిను చూడగా నా కళ్ళు నీటితో నిండిపోతాయి. నా జీవితంలో అతికీ అతకనట్లున్న భావాలన్నీ శ్రావ్యంగా శ్రుతికట్టి కలుస్తాయి. సముద్రాన్ని దాటే పక్షిలాగా నా భక్తి రెక్కలు విప్పి పాటలై బయటకొస్తుంది. నా పాట నువ్వు ఇష్టపడుతున్నావని నీ ముందు నేను గాయకుడను అవుతాను. నా పాటల రెక్కలు నీ పాదాలను తాకుతాయి. గానం చేస్తూ ఆ సుఖంలో లీనమైన నేను నిన్ను 'ప్రాణసఖా' అని పిలుస్తాను.

3. నీవు ఎలా పాడతావో నాకు తెలియదు స్వామి. నిశ్శబ్దంగా పులకించి వింటాను. నీ పాటలోని వెలుగు జగత్తునంతా వెలిగిస్తుంది. నీ పాటలోని ఉచ్ఛ్వాసనిశ్వాసలు ఆకాశాన్ని పరుచుకుంటాయి. బండలను కూడా దొర్లిస్తూ సెలయేరులు నిండి పారిస్తూ ఉంటుంది నీ పాట. నీ గొంతులో గొంతు కలిపి పాడాలని ఉన్నా పాడలేకున్నాను నా గొంతు పెగలదు, పాటకు పదాలు దొరకవు. పాడలేకపోయినందుకు సిగ్గుపడి ఏడుస్తాను. నా ప్రభూ! మొదలు చివరలేని నీ గానపు వలలలో నా హృదయాన్ని బంధించావు.

4. నా ప్రాణానికి ప్రాణమా! నా అన్ని అవయవాల మీద సజీవమైన నీ స్పర్శ నిండి వుండటం చూచి ఎప్పుడూ నా శరీరాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవటానికి ఏమరుపాటులేకుండా ప్రయత్నిస్తాను. స్వామి! మంచి చెడులను తెలుసుకోగలిగే తెలివి దీపాన్ని నా మనసులో వెలిగించింది నీవని తెలిసి నా ఆలోచనలను అబద్ధాలు తాకకుండా ఎప్పుడూ ఉంచుతాను. నీవు నా హృదయ సింహాసనంపై కూర్చుంటావని నా యెదలోనున్న చెడునంతా మళ్ళీ నా దగ్గరకు చేరనీయనట్లు తొలగిస్తాను. నీ శక్తే నాకు కష్టించే బలాన్ని ఇచ్చిందని తెలిసి నేను చేసే ప్రతిపనిలోను నిన్ను దర్శింపజేయటానికి నా శక్తివంచన లేకుండా పనిచేస్తాను.

5. ఒక క్షణమైనా నన్ను నీ దగ్గర ఉండనివ్వు, ఆ తరువాత ఎన్నైనా నా పనులు చేస్తాను. నీ చూపుకు దూరమైన కొంచెం సేపైనా నా మనసు విశ్రాంతి పొందక విసుగు చెందుతుంది, నా పనులన్నీ సముద్రంలో కష్టాలౌతాయి. నా కిటికీ దగ్గరకు వెచ్చని నిట్టూర్పుతో గ్రీష్మమొచ్చింది. పూపొదల గుబురులలో తుమ్మెదలు ఆలపిస్తున్నాయి చూడు. నిశ్శబ్దమైన ఈ విశ్రాంతి సమయంలో నా జీవితాన్ని అంకితం చేసే పదం పాడటానికి కనులు మూసి కూర్చుండే సమయమిదేరా! నా ముందు నువ్వు, నీ ముందు నేను.

6. ఈ చిన్న పువ్వు ఇప్పుడే కోసుకొని పోరా! ఎండిపోతే దుమ్ములో పడిపోతుంది. నీ పూలదండతో దీనికి స్థానం లేకపోయినా నీ గోటిగిల్లే చాలు. పగలు గడిచే కొలదీ పూజా సమయం దాటిపోతుందని భయపడతాను. దీనికి రంగు, వాసన తక్కువే అయినా దీనిని నీ పూజకు వాడుకో, సమయముండగానే నా రాజ ! ఈ పువ్వు కోసుకో.

7. నా పాట తనకున్న నగలను పోగొట్టుకొని ఆడంబరాలన్నిటిని వదిలింది. నన్ను నిన్ను విడదీసేది ఆ నగలే. మన ఐక్యభావాన్ని పోగొట్టేవి ఆ సొమ్ములే, నా చెవులలో నీ మాట వినబడకుండా చేసేది ఆ సొమ్ములే. నీ చూపును చూడగానే నేను కవిని అన్న నా గర్వం సిగ్గుతో తలవొంచి చిన్నబోతుంది. కవిసార్వభౌమ! నీ పాటల తీపిని నింపేవెదురు పిల్లనగ్రోవిలాగా నన్ను కూడా నింపు. నీ కాళ్ళ దగ్గర పడి వున్నాను.

8. అమ్మా! పసిపిల్లలకు రాజ కుమారులు తొడిగేటటువంటి సున్నితమైన దుస్తులు ధరింపజేసి, మెడలో బంగారు గొలుసు వేసి బంధించినట్లుగా వదిలితే అడుగడుగుకి దుస్తులు అడ్డుపడుతుంటే, మురికి అవుతాయని ఆటలో సంతోషంగా పాల్గొనలేరు. భూమి మీద ఉండే ఆరోగ్య రేణువులని అంటనివ్వకుండా సర్వ సహజమైన బ్రతుకు బ్రతకనివ్వకుండా ఇంట్లోనే మూసివుంచితే ఫలితమేమీ లేదు.

9. నీ వీపు మీదనే నిన్ను మోయగలవా? నీ వాకిట్లోనే నువ్వు యాచిస్తావా? నీ కోరికలు ఏంటి ? అన్నీ మోయగలిగిన ఆ స్వామికి ఇవ్వు. ఆ ఆశ దీపంలో వెలుగునే ఆర్పివేస్తుంది. కలుషితమైన కానుకలు తీసుకోవద్దు, అది పాపమవుతుంది. ప్రేమపూర్వకమైన ఫలితాన్నే స్వీకరించు.

10. తుది అనేది లేక దాసానుదాసులై మెతుకు గతికే వారి బ్రతుకుల మధ్యలో నీ పాదాలు పదిలంగా ఉన్నాయి. వారి మధ్యలో నీ పాదాలు స్థిరంగా పాతుకుపోయాయి. ఆ పాదాలు స్థిరమైన ఆ లోతులకు దిగలేని ఈ నమస్కారాలెందుకు? దాసానుదాసులై మెతుకు గతికే వారి కోసం నువ్వు చినిగిపోయిన దుస్తులు ధరించి బురదలో దిగిపోతుంటే ఇంక గర్వం కలుగుతుందా ? ఆ దీనులతో జతకలిపి మాట్లాడుతూ కాలం వెళ్ళబుచ్చే నీ మార్గాన్ని నా మనసు ఎలా అనుసరించగలదు?

11. మంత్రతంత్రా లెందుకు? మణులెందుకు? ఎన్ని పాటలున్నా ఇక పనికిరావు. తలుపులన్నీ మూసిన గుడి చీకట్లో మూలన కూర్చొని నువ్వు ఎవరిని కొలుస్తున్నావురా? నీ స్వామి నీ ముందు లేదు చూడు. కఠినమైన నేలలను దున్నే కాపుతో, రాళ్ళు రప్పల కొట్టి గుట్టలుగా పోసే వాడితో, వానలో ఎండలో గడిపే వాడితో ఉన్నాడు. శుభ్రమైన ఉత్తరీయాన్ని వదిలి వానిలాగా దుమ్ము నేలలలోకి నువ్వు దిగి రా ! మోక్షం అంటే ఏంటి? అది ఎక్కడుంది? మన దేవుడే ఈ సృష్టి బంధాలను స్వీకరించి కలకాలం మనలను విడువకుండా మనతోనే ఉన్నాడు. ఈ ధ్యానమెందుకు ? ఇవతలికి రా! పూలను వదిలి ఇవతలకు వచ్చి వానిని కలిసి కష్టపడు ఇంక, వానికి చేయూతనివ్వు.

12. నా ప్రయాణం పూర్తవటానికి చాలా కాలంపడుతుంది. దారి కూడా చాలా పొడవు, చాలా దూరం వెళ్ళాలి. తొలి వేకువనే బయలుదేరి గ్రహాలను, నక్షత్రాలను త్రొక్కుతూ వెళ్ళి ఆది అంతం లేని లోకాల చుట్టూ తిరిగాను. అంత దూరమైన ఆ మార్గం నీ దగ్గరికి వచ్చే వారికి మాత్రం దగ్గరనిపిస్తుంది. సరళమైన స్వరాన్ని పొందే అభ్యాసం శ్రమంతో కూడింది. తన ఇల్లు చేరాలనుకొన్న బాటసారి ప్రతి ఇంటి తలుపును తట్టాలి, బాహ్య ప్రపంచాలన్నీ చుట్టి గర్భగృహంలోకి వెళ్ళాలి. చూపులు దిక్కులన్నీ వెతికి అలసిపోగా నువ్వు 'ఇదిగో' అన్నావు. 'ఎక్కడెక్కడ' అనే ఆర్తనాదం వేల కన్నీటి ధారల క్రింద కరిగి 'నే ఇక్కడే ఉన్నాను' అనే నీ మాట అర్థమై వరదలై ప్రవహించి భూమిని ముంచివేసింది.

13. నాకు వచ్చిన పాట పాడటానికి కాలాన్నంతా తీగలను సరిచేస్తూ వృధాగా గడిపాను. మాటల పొందిక లేదు, లయ లేదు, పాడే సమయం రాలేదు. పాడగలనా అనే ఆలోచన బాధపెడుతుంది. అతడి ముఖం చూడటానికి, వాని మాటలు వినటానికి పూయలేని పూమొగ్గ చుట్టూ గాలే వేడి నిట్టూర్పులను విడుస్తుంది. నా ఇంటి ముందు దారిలో వాని అడుగుల శబ్దం విన్నాను. కానీ ఆసనం ఏర్పాటు చేసే లోపల రోజు గడిచిపోయింది. దీపం వెలిగించే తీరికే లేదు. లోపలికి రమ్మని వానిని నేను పిలువలేను. వానిని ఏనాటికైనా చూడాలనుకుంటాను కానీ ఆ అదృష్టం ఇంత వరకు కలుగలేదు.

14. నా మనసులో ఎన్నో కోరికలు, వాటిని తీర్చవా అని వేడుకుంటాను. కాదు పోపో అని నన్ను రక్షిస్తున్నావురా ! నా జీవితంలో నీ దయ మిళితమై పోయింది. కాలక్రమంగా అడగకుండానే నీవు ఇచ్చే కానుకలను స్వీకరించగలిగే అర్హతను ఇస్తున్నావు. ఈ ఆకాశాన్ని, వెలుగుని, శరీరాన్ని, ఈ జీవితాన్ని, ఈ మనసును ఇచ్చి అత్యాశలలో పడకుండా రక్షిస్తూ

ఉన్నావు. ఒక్కోసారి ఏమీ తోచక తిరుగుతాను, పరుగెత్తుతాను, ఇంకోసారి కళ్ళు విప్పి చూచి గమ్యం చేరాలని తొందరపడతాను. క్రూరుడిలా నా కోరికలు కూల్చివేసి కనిపించకుండానే చాటుగా దాక్కుంటావు. అల్పమైన, అశాశ్వతమైన కోరికల నూతిలో పడనీయకుండా రక్షిస్తూ కనిపించకుండానే నన్ను నీవాడిగా మన్నించావనిపిస్తావు.

15. నా పాట వినిపించాలని నీ దివ్యభవనంలో వేచి వున్నాను, ఇందులో ఏమూలో నాకూ చోటుంది. వ్యర్థమైన ఈ బ్రతుకు కారణం లేకుండానే కంఠం సవరించి పాడుతుంది. నా దొరా! దయాసాగరా! అర్ధరాత్రి మసక తెరలలో గుడిలో శాంతి పూజా సమయాలలో నీ ఎదుట పాడటానికి నన్ను ఆజ్ఞాపించరా! ఒకవేళ ఉదయకాలపు గాలుల బంగారు వీణ శ్రుతిచేసుకొని పాడటానికి సిద్ధపడితే నా కొరకు మాటను పంపు.

16. విశ్వోత్సవానికి పిలుపు వచ్చింది, నా పతితమైన జీవితం పావనమైంది. కళ్ళారా చూశాను, చెవులారా విన్నాను, నన్ను పాడమన్నారు. నేను పాడగలిగినంత నా వాద్యాన్ని మీటి పాడాను స్వామి! ఇకనైనా నేను లోపలికి రావచ్చా, నీ ముఖం చూడవచ్చా, శాంతి పూజలు చేయవచ్చా?

17. ఆత్మ సమర్పణ చేసి అతడి చేతులలో పడే ప్రేమ కోసం ఇక్కడ వేచి ఉన్నాను. అక్కడక్కడ కనిపించడంతో ఆలశ్యం అయింది. నీతినియమాలతో నను బంధించాలని పదిమంది వస్తారు, వారికి వశం కాకుండా నివారించి పంపుతాను ఎందుకంటే ఆత్మ సమర్పణ చేసి అతడి కోసం వేచివున్నాను కనుక. వారి మాటలు విననని ప్రజలంతా నిందిస్తారు, వారిని ఖండించాలని అనుకోను, వారి తప్పేమి లేదు. పనులన్నీ ముగించుకొని అందరూ వెళ్ళిపోయారు. పగలు గడిచి సాయంత్రమైంది. సంత అయిపోయిందని దగ్గరకొచ్చి పిలిచి, విసిగి వెళ్ళిపోయారు. నేను ఆత్మార్పణ చేసి అతడి చేతులలో పడి అతడి ప్రేమ పొందటానికి ఎదురుచూస్తున్నాను ఇక్కడ.

18. నా ప్రియుడా! మబ్బులపై మబ్బులు, చీకట్లు పెరుగుతున్నాయి. నన్ను ఒంటరిగా తలుపు బయట ఇలా నిలిపి ఉంచావెందుకు? పదిమందిలో పనులున్న సమయంలో మధ్యాహ్నం ఎలాగో గడపగలను కాని ఎవరూ తోడులేని ఈ చీకటి సమయంలో ప్రభూ! నువ్వు తప్ప నాకు తోడెవరున్నారు? నువ్వు కనబడక పోయినా, పిలవకపోయినా ఈ చీకటి వానాకాలాన్ని నేనెలా గడపగలనో తెలియదు. ఆకాశంలో దూరంగా కనిపించే చీకట్లను చూస్తున్నాను, ఈ వానగాలితో నా గుండె ఏడుస్తుందిరా!

19. స్వామి! నువ్వు నాతో మాట్లాడని పక్షంలో నేను బాధపడను, సహనంతో ఎదురుచూస్తాను. నక్షత్రాలే కళ్ళైన ఈ రాత్రి సమయంలో కదలక మెదలక వేచి ఉంటాను. వెలుతురు రానే వస్తుంది, చీకటులు పోతాయి. ఆకాశాన్ని చీల్చుకొని నీ మాటలు బంగారు కాల్వలు గట్టి ప్రవహించి తీరుతుంది. ప్రతి పక్షి గూటిలో నుండి పాటలై నీ పలుకులు వెలువడుతాయి, అప్పుడే పూల పొదరిల్లు పుష్పించేటపుడు వాటినుండి నీ రాగాలు వినిపిస్తాయి.

20. నా పాడుబుద్ధి అటు ఇటూ తిరుగుతుండగానే కమలం పూచివాడింది. నా పూల బుట్ట ఖాళీగా ఉంది ఈరోజు. అప్పుడప్పుడు కలత కమ్ముకుంటుంటే కలనుంచి మెలకువ వచ్చి లేచాను, దక్షిణగాలితో ఒక వింత సువాసన మనసును తాకి ఆశలను పురిగొల్పింది. ఆ వాసనే వేసవి చివరిలో విడిచే నిట్టూర్పని తెలుసుకున్నాను. అలాంటి సమయం సమీపించిందని నాకు తెలియదు, నా హృదయంలోనే ఆ పరిశుద్ధ మధురిమలు పూచాయనే రహస్యం నేను మరిచిపోయాను.

21. ఆ ఒడ్డుకు నేను పడవలో బయలుదేరి వెళ్ళాలి. అయ్యో! కాలా బరువుగా సాగుతుంది. వసంతం ఈ పూలమొగ్గలనన్నీ పూయించి శెలవడిగి వెళ్ళింది. వాడిపోయిన పూల భారంతో నేను ఇక్కడే వేచి ఉన్నాను. ఒడ్డును తంతూ సముద్రపు అలలు

విరిగి పడుతుంటే తీరం మీద నీడల్లో పండుటాకులు జలజలా రాలిపడుతున్నాయి. ఈ శూన్యాన్ని ఏమని చూస్తున్నావు? తీరం వెంట గాలిలో తేలియాడుతూ పులికింతలను కలిగిస్తున్న పాటను వినవదేంటి?

22. వానాకాలపు దట్టమైన నీడలతో దారి వెంట నిను చూసేవారి కళ్ళుగప్పి అడుగుల శబ్దం వినపడని విధంగా నడచి రహస్యపు దారిలో నువ్వు ప్రయాణిస్తావు. తూర్పుగాలి హోరుమని అరుస్తూ పిలుస్తున్నా పగలు వినకుండా కళ్ళు మూసుకొంది. కళ్ళు మూయకుండా మేలుకొని ఉండే ఆకాశంపై ఎవరో తెరదించారు. అడవి ప్రదేశాలలో పాటలు అణగిపోయాయి, ఊరి తలుపులన్నీ మూయబడ్డాయి. పాడుబడిన ఈ దారిలో నీవు ఒక్కడివే ఇలా తిరుగుతున్నావురా. నా ప్రియా! ఏకైక మిత్రమా! స్వప్నంలోని రూపంలా వెళ్ళిపోవద్దు, నీ కోసమే నేను తలుపు తీసి ఉంచాను.

23. గాలివానలు ముసిరే నల్లటి చీకటిలో కదిలి ప్రేమయాత్రలకోసం బయలుదేరావా ఏంటి? ఆకాశం దిగులుపడి దిక్కులేక అరుస్తుంటే నా సఖా! తలుపు తెరచి మళ్ళీమళ్ళీ కన్నుమూయక చూస్తున్నాను. నాకింకెక్కడి నిద్ర ఈ రాత్రి ఇంక, కళ్ళ ముందు ఏమీ కనిపించదు. ఏ దారి వెంట నీవు వెళతావో నాకు తెలియదు. కాటుక కరిగి పారుతుందా అనిపిస్తున్న కాలువ గట్టువెంటో, భయంకరమైన అడవి మార్గం నుండో నువ్వు దారి చేసుకొని నా దగ్గరికి చీకటిలో రానున్నావో తెలియలేను సఖా!

24. పగలు పూర్తయి పక్షులు పాటలు పాడి ఆపినపుడు, పిల్లగాలులు అలిసి చెట్ల నీడలలో పడుకున్నప్పుడు తలవంచిన తామర రేకులను మృదువుగా మండిచే విధంగా, భూమిపై నిద్ర దుప్పటి కప్పివేసిన విధంగా, నామీద చీకటి తెరను చక్కగా జారవిడువు నా స్వామి. కరుణించి కాపాడే చీకటి తల్లి ఒడిలో దాగి మళ్ళీ పుష్పించే పూలలాగా, దుస్తులు మాసి చిరుగగా, పైకి వెళ్ళే శక్తి తగ్గిపోతే బాధతో ప్రయాణించే బాటసారిని సిగ్గు పడకుండా ఉండేవిధంగా నడిపించి, పాపం పోగొట్టి క్రొత్త బ్రతుకుదారులను చూపి రక్షించరా దొరా!

25. నా స్వామి! శరీరం కష్టపడి ఉన్నప్పుడు రాత్రిళ్ళు, ఎలాంటి కలత తాకని విధంగా కళ్ళు మూసి నిద్రించనివ్వు. నేను నిన్ను నమ్ముతాను. నీ పూజకు సరిపోని ప్రయత్నాలు చాలా చేశాను, బాగా అలిసిన నా శక్తులను శాసించలేను ఇప్పుడు. బలం సరిపోక పగటి వేళల్లో తూగే కళ్ళపైన రాత్రి అనే ముసుగు వేసి సంతోషంగా క్రొత్త చూపుతో మేల్కొనే విధంగా చేసేది నీవేకదా!

26. నా స్వామి నా దగ్గరకు వచ్చి కూర్చొని ఉండగా ఎందుకనో నేను కన్నులు విప్పలేకపోతిని. ఓ పాపిష్టి మనసా! పాడు నిద్ర ఎందుకు? చేతిలో వీణతో నిశ్శబ్దమైన రాత్రిలో స్వామి నా కలలన్నీ మహాతీనినాదాలలతో మారు మ్రోగుతుండగా నా దగ్గరకు వచ్చాడు. నిద్రపై ఎవరి నిట్టూర్పు ప్రాకిందో అతడినే చూడలేక వదిలిపెడుతున్నాను.

27. వెలుగేది? మండే ఆశలతో దానిని వెలిగించు. దీపం ఉంది కానీ దీపశిఖలేదురా! హృదయమా! చివరి వరకు నీ రాత ఇదేనా? ఆలోచనలతో కలత నీ చెవినబడుతుంటే స్వామి అప్రమత్తుడు అని చెప్పుచున్నది. ప్రేమ కోశం చేరటానికి ప్రయాణమై నల్లటి చీకటిలో నిను రమ్మన్న వాని పిలుపందింది. ఆకాశంలో కారుమబ్బులు క్రమ్మాయి, భూమంతా మునిగేవిధంగా జడివాన కురుస్తుంది, కనిపించనిదేదో నా గుండెను కలిచివేస్తుంది, కారణం తెలుసుకోలేకపోతున్నాను. ఇంత చిక్కటి చీకటిలను పోగొట్టి మెరిసిన మెరుపు క్షణకాలం కాళ్ళపై పడింది. నా మనసులోని బాధలనన్నీ పోగొట్టుకొని ఈ చీకటిగానాలు నన్ను ఏ దిక్కుకు పిలుస్తాయో ఆ దిక్కునే వెదుకుతూ ఉంటాను. శూన్యంలో చెలరేగి పెనుగాలి పిడుగులను దొర్లిస్తూ వీస్తుంది. నల్లరాయిలాగా ఈ రాత్రి నల్లబడింది, కాలమంతా వృధా పోకూడదు, ప్రేమ దీపాన్ని వెలిగించరా !

28. నీ బంధాలు పట్టు సడలకుండా నన్ను కట్టివేశాయి. బాధపడుతున్న గుండెపట్టు విడుద్దామన్నా స్వాతంత్ర్యాన్ని ప్రేమిస్తా కాని దానిని తల్చుకోగానే సిగ్గు నన్ను అణుస్తుంది. నీ దగ్గర ఎన్నో గొప్ప నిధులున్నాయని తెలుసు. ఇంకా నీవే ప్రాణ సఖుడవని బాగా తెలుసు, అయినా నా గదిలోని వస్తువులను చిమ్మి అవతల త్రోసివేయటానికి మనసు బాధపడుతుంది. నన్ను కప్పిందంతా మట్టి, మరణమే అయినా వాటిని ఉంచుకోవటానికి ఇష్టపడతాను. మనసులో ఊపిరి పోసుకుంటున్న పరాజయాలు, అప్పులు, అవమాన భారాలు నిత్యం నన్నింటి బాధ కలిగిస్తాయి. అయినా మంచిని కోరుకుంటే నువ్వు ఇస్తావేమో అనే భయంతో నిన్ను అడిగే పాపం చేయలేను.

29. నా పేరుతో పిలవబడేవాడు ఈ చీకటింటిలో వేదనతో ఏడుస్తున్నాడు. చుట్టూ ఈ గోడలు కట్టే పనిలో ఎప్పుడూ శ్రమిస్తున్నాను. రోజురోజుకి ఈ గోడ ఆకాశానికి పెరుగుతుంటే దాని నీడలో నన్ను నేనే చూసుకోలేకపోతున్నాను. ఈ గోడ చూసి గర్విస్తాను. నా పేరుతో ఏ చిన్న రంధ్రం ఉండకూడదని సున్నం, మట్టి పూస్తున్నాను. నన్ను నేనే కోల్పోయే పని ఇది.

30. ఈ సమయంలో ఒంటరిగా దారివెంట నా నిధి ఉన్న దగ్గరకు నడిచాను. ఎలాంటి శబ్దంలేని చీకటిలో దాక్కొని ఎవడో నా వెంటే వదలక నడుస్తున్నాడు. దారి తప్పించాలనుకున్నా నన్ను విడువక వెన్నంటాడు. బిగ్గరగా పలుకుతాడు, గట్టిగా నడిచి కళ్ళల్లో దుమ్ముకొడతాడు. మానావమానాలు లేని మనిషి వీడు. వీడు ఎవరో కాదు నేను అనే చిన్నవాడే, వాడితో కలిసి నీ దగ్గరకు రావటానికి సిగ్గుపడతాను నేను.

31. ఓ బంధితా ! నిన్నెవరు బంధించారు? నన్ను నా స్వామి బంధించాడు. ఈ భూమిపై కల బలవంతులను, ధనవంతులను చివరకు నెట్టగలను అనే గర్వంతో నా స్వామికి అర్పించాలనే ఆశతో ధనమంతా పదిలంగా దాచాను. నిద్ర ముంచుకు రాగా నా స్వామి కోసం పరిచిన పక్కమీదే పడుకున్నాను. కళ్ళు తెరిచి చూచి బంధితుడిగా ఉండటం గమనించాను. ఈ బిగువైన సంకెళ్ళను ఎవరు చేశారో చెప్పగలవా? నేనే దీనిని ఎంతో నేర్పుతో చేశాను. నా నిజశక్తిని జయించి, లోకమంతా నేను అనే నిశ్చలమైన స్వాతంత్ర్య మార్గంలో పయనిస్తుందనే భ్రాంతిలోపడి, రాత్రి పగలనకుండా పట్టు వీడకుండా పెద్ద మంట వేసి, పెద్ద దెబ్బలు వేసి, సాగదీసి, సరిచేసి సంకెళ్ళు చేశాను. త్రెంపినా తెగని విధంగా తయారై చివరకు నన్నే గట్టిగా బంధించాయి.

32. ఈ భూమిపై నను ప్రేమించేవారందరు తమతో నన్ను ఉంచుకోవాలని కష్టపడుతున్నారు. వారి కంటే పదింతలు ఎక్కువగా నన్ను ప్రేమించే నీవు మాత్రం నన్ను స్వేచ్ఛగా వదులుతావు. ప్రక్కన లేకపోతే నేను మరిచిపోతానేమో అని వారు నన్ను ఒంటరిగా వదలరు. కానీ రోజులు ఒక్కొక్కటే గడిచిపోతున్నా నీవు నా కళ్ళకు అందవు, దగ్గరకు రావు. పూలతో నిను పూజింపకపోయినా, నా హృదయంలో స్థానమివ్వకపోయినా నా ప్రేమ కోసం నీ ప్రేమ వేచివుంటుంది.

33. తెల్లవారుతుండగా వచ్చి వారు వసతి కల్పించమని అడిగారు. తలదాచుకోవడానికి ఇంత స్థలమిస్తే చాలు పూజలలో సహాయం చేస్తాం, దయతలచి ఇచ్చిన ఫలభాగాన్నే తీసుకొని తృప్తిపడుతామని భక్తితో చెప్పి ఒక మూల స్థిరపడ్డారు. అర్ధరాత్రి సమయంలో నా దేవాలయాన్ని చొరబడి నా స్వామికి అర్పించిన కానుకలన్నీ దోచుకొని తలుపులనన్నీ పడగొట్టి వెళ్ళిపోయారు

34. స్వామి! నీవే నా సర్వస్వమనే తెలివి నాలో మిగిలితే అది చాలు. ఎప్పుడూ నిను చూస్తూ, నీ నీడలా ఉంటూ నా ప్రేమతో అర్పించాలనే స్థిరబుద్ధి నాలో చెదరకుండా ఉంటే అది చాలు. నీ మనసు నన్ను కట్టి, నీ కోరికతో నా బ్రతుకు పండి,

ఈచిన్న ప్రేమబంధం నన్ను వదలక ఉంటే అది చాలు.

35. భయం వదిలి మనసు పదిలమైనప్పుడు, పరువుతో తల ఎత్తబడినప్పుడు, విజ్ఞాన బంధాలు విడిపోయినప్పుడు, ఇరుకు సంసారాల కఠిన గోడల మధ్య భువనాలు ముక్కలైపోకుండా మిగిలినప్పుడు, మాటలన్నీ సత్యాలే అయినప్పుడు, అలసటే తెలియని చేతులు తాకి పరిపక్వదశను చేరే సమయమప్పుడు, చెడ్డ అలవాట్లనే ఎడారిలో తెలివి అనే దారి తప్పనప్పుడు, నిర్మలమైన భావాలను స్వామి నువ్వే ముందుకు నడపాలనుకున్నప్పుడు స్వాతంత్ర్యమనే స్వర్గ సౌభాగ్య వీధులలో మాతృభూమి ధన్యయై మేల్కొంటుంది.

36. పేద తలపులనన్నీ నా హృదయం నుండి వేళ్ళతో సహా పెకలించి వేయరా నా ప్రభూ! ఇదే నా ప్రార్థన ఇంకేమి వద్దు. కష్టసుఖాలను సమానంగా చూడగలిగే సత్త్వగుణాన్ని ఇవ్వు. బలగర్వితులైన ధనవంతులకు మ్రొక్కి, బలహీనులైన పేదవారిని త్రొక్కాలి అనే ఆలోచనలను వదిలే బలం ఇవ్వు. నిత్యజీవితంలో అల్ప విషయాలను వదిలి పైకెదిగే పట్టు ఇవ్వు. నా స్వామి! నా సర్వశక్తులు నీ దివ్యశక్తులకు వశమయ్యేటందుకు సహాయం చెయ్యి.

37. నా శక్తి నశించినప్పుడు, ముందుకు వెళ్ళే దారి మూయబడినప్పుడు, తినుబండారాలన్నీ అయిపోయినప్పుడు నా యాత్ర ముగిసిందనుకున్నాను. ఇతరులు దగ్గరకు రాలేని ప్రదేశంలో ఒంటరిగా తలదాల్చుకునే సమయమనుకొన్నాను. కానీ నీ కోరిక నా అంతు కోరని విధంగా ఉన్న పరమార్థాన్ని చూశాను. పాత పదాలు నాలుకపై సాగుతుంటే కొత్త రాగాలను గుండె క్రుమ్మరిస్తుంది. పాత దారులు కనిపించకపోతే వేయి వింతలలో, శక్తులతో కళ్ళముందు క్రొత్త లోకాలు కనిపిస్తాయి.

38. నిరంతరం నా గుండె నీవే కావాలి అనే ప్రార్థనా వాక్యాలను పలుకనివ్వు. పగలు రాత్రి అనక నా కోరికలన్నీ నా ఆలోచనలను నాలుగుదిక్కులకు తరుముతుంటే అవన్నీ సత్యదూరాలైన స్వప్నాలే అని తెలుసుకొన్నాను. కావలసిన వెలుగును చీకటి దాచివుంచిన విధంగా అజ్ఞానహృదయ అగాధాలలో దాక్కొని నీవే కావాలి అనే స్వరం మార్మోగుతుంది. శాంతిని కాలరాచే గాలివానలు చివర కూడా శాంతే ఉంటుంది. అలాగే నా స్వామి ! నా మనసు నీ ప్రేమ తలపులతో నీవే కావాలి అంటుంది.

39. గుండె కఠినమై ఎండినప్పుడు కరుణామృతాన్ని చిలికించి దయచూపు. బ్రతుకు మీద ఆశలు తగ్గుతుంటే నా పంచకు రారా! పనుల సందడితో బాహ్యవిశ్వం నన్ను అనేక రకాల పట్టి వుంచితే విశ్రాంతి సమయంలో నా దగ్గరకు రారా మౌనమూర్తి! నేను కృంగి ఒక మూల కూర్చునుంటే నా పేద గుండె పగులగొట్టి లోనికి రాజమార్తాండ వైభవంతో రా, పుణ్యమూర్తి! నా మనసు భ్రాంతితో కోరికలు కళ్ళను కప్పుతుండగా నా దగ్గరకు ఉరుములు మెరుపులతో రా!

40. చాలకాలమైనా నా హృదయంలో చిలిపివానలు పడలేదు. శూన్యం నన్ను భయంలో ముంచింది. చిన్న మబ్బుతునక ఆకాశంలో లేదు. చిన్న చినుకైనా పడుతుందనే ఆశే లేదు. నీవు ఇష్టపడితే ఈ క్షణంలోనే గొప్ప వర్షపాతాన్ని పంపు, నేను మారు మాట్లాడను. నిశితమైన, క్రూరమైన, నిశ్చలంబైన గుండె కాల్చే ఎండలను ఓర్చుకోగల శక్తి నా దగ్గర లేదు. తండ్రి కోపంగా ఉన్నప్పుడు కన్నీళ్ళతో చూచే తల్లి లాగా ఆకాశంనుండి కరుణా బిందువులను భూమికి దిగిరానివ్వు.

41. వారి వెనుక నీడలో నన్ను ప్రేమించేవాడ నిలిచావెందుకు దాగుకొని? మట్టి దారులను త్రొక్కి దూసుకొని పోయేవారు నిన్ను లెక్కచేయక పైకెళుతున్నారు. నేనిక్కడ నీకోసం బట్టలో పువ్వులతో వేచి ఉన్నాను. వచ్చేపోయేవారు పూలను ఒకటొకటి పట్టుకొనిపోగా నా బుట్ట ఖాళీ అయింది. ఉదయం, మధ్యాహ్నం, సాయంసంధ్యా గడిచిపోయాయి. నిదుర

మత్తుతో నా కళ్ళు తూగుతున్నాయి చూడు. ఇళ్ళకెళ్ళే వారందరూ నను చూచి నవ్వుతూ అవమానిస్తారు. ముసుగు కప్పి ముఖాన్ని కప్పుకొన్న బిచ్చగత్తెలాగా నీకేమి కావాలని వారడిగితే సమాధానం చెప్పకుండానే కళ్ళు మూసుకుంటాను. నా స్వామికోసం వేచివున్నానని చెప్పాలనుకొని పేదరికాన్నే కానుకగా సమర్పిస్తానని చెప్పటానికి సిగ్గుపడి చెప్పలేక వున్నాను. ఆశ్చర్యంగా ఆకాశమంతా వెలుగు, బాటసారులందరూ చూపు మరలించి చూడగా రథంపై వచ్చిన నీవు దుమ్ములో నున్న నన్ను నీవు పైకెత్తి రథంపై పక్కనే కూర్చోబెట్టుకోగా చింపి గుడ్డల బిచ్చగత్తెలాగా వేసవిగాలులకు కదిలే లతలాగా శరీరం కంపించగా నీతో నేను వస్తున్నట్లుగా కలగాంచి ఆ పచ్చికల భూమిపై కూర్చున్నాను, శూన్యాన్నే చూస్తున్నాను, నీవు ఇక్కడకు వస్తావు ఏ క్షణంలోనైనా అని, కాలం బరువుగా కదులుతుంది, స్వామి రథచక్రాల శబ్దమే వినిపించదు. ఆడంబరంగా ఆహ్లాదంగా కొంచెం దూరంలో ప్రజాసంఘాలు జయజయధ్వానాలు చేస్తూ వెళ్ళుతున్నాయి. ఇక్కడ ఒంటరిగా నీకోసం ఎదురుచూస్తూ కన్నీళ్ళు కారుస్తూ అడియాసలను పేర్చుకొని ఉన్నాను.

42. కోడి కూసే సమయంలో పడవలో మనమింక ప్రయాణమవుదామన్న గుసగుసలు వినిపించాయి. ఏ తీరాన్ని చేరాలని, ఏ దేశానికి వెళ్ళాలని ఈ ప్రయాణమో విశ్వంలో ఎవరికీ వినిపించినే వినిపించదు. మనమిద్దరమే ఈ రహస్యం తెలుసుకోవాలి. మధురమైన చిరునవ్వు నీ పెదాలపై విరియగా, మారు మాట్లాడక మౌనిలా తీరంలేని సముద్రంపై తేలు అలలలాగా నా అంతరంగం నుండి స్వేచ్ఛగా పొంగి వచ్చే గేయాలను నువ్వు వింటుండగా వెళ్ళిపోదాం ఇంక ఆలశ్యం చేస్తావెందుకు? పనులేమైనా మిగిలి ఉన్నాయా? అదుగో సంధ్యారాగం దగ్గరకు వచ్చింది, పక్షులన్నీ పలుచబడుతున్న వెలుగులో గూళ్ళు చేరుతున్నాయి. కనిపించి మాయమయ్యే అస్తమయ కాంతులలో ఎప్పుడో ఈ పడవ ఈ తీరాన్ని వదిలి చీకటి రాత్రులలో అదృశ్యమౌతుంది.

43. ఆ రోజు నేను నిను పిలిచి చక్కగా పూజించి పంపటానికి సిద్ధపడిలేను. నాకు తెలియకుండానే నువ్వు నా హృదయంలోకి సామాన్యుడిలా ప్రవేశించి, క్షణం కూడా నిలువకుండానే జీవితంలో పరుగెత్తే అనేక నిమిషాలపై నీ చిహ్నాలను ముద్రించావు. అనుకోకుండా ఈ రోజు నేను ఆ గుర్తులను చూడగా ఆనాటి కష్టసుఖాలతో కలిసి దుమ్ములో అవి ముక్కలై చెదిరి పడిపోయినట్లుగా కనుగొన్నాను. పసిపాపలా దుమ్ములో పడి ఆడుకొనే నన్ను క్షమించి విడవకుండా రక్షిస్తావు నా దొరా! నీ అడుగుల శబ్దాన్ని నేను భూమిపై ఎప్పుడూ వింటాను.

44. వేసవి మొదలయ్యే కాలంలో చినుకులు రాలగా నీడ వెలుతురులను వెన్నంటి ఆ దారిలో కాచుకొని ఉండటమే నాకిష్టం. కనిపించని శూన్య లోకాల వార్తలను దూతలు వినిపించి పయనమైపోతున్నారు. చల్లని గాలి మధురంగా తాకగా హృదయభావం పొంగెరా! తెల్లవారు ఝామున మొదటి వెలుగుల నుంచి సాయం సంధ్యలో ముసలి వెలుగుల వరకు నిను చూచే సంతోష సమయం ఎప్పుడో చెప్పకుండానే వస్తుందని ఇంటి వాకిలిలో ఎదురుచూస్తుంటాను, పెదాలపై చిరునవ్వులు విరుస్తుంటే ఈ మధ్యకాలంలో ఒంటరిగా గానం ఆలపిస్తాను, గాలులు నీ వాగ్దానాల వాసనలతో నింపుతాయి.

45. ప్రతిరోజు దగ్గరకు వస్తున్నాడు. శబ్దం చేయని అడుగుసడి వినిపించలేదా? ప్రతి నిముషం, ప్రతి యుగం, ప్రతి రాతి, ప్రతి పగలులో నీకోసం వస్తున్నాడు. ఎప్పుడెప్పుడో నేను ఏమేమో తల్చుకుంటూ ఎన్నో రాగాలను పాడుచుండగా అవి అన్నీ వస్తున్నాడని ప్రకటిస్తాయి. ఎక్కువ తాపంతో కూడిన చైత్రమాసంలో వనాల దారులవెంట స్వామి వస్తున్నాడు. కారు చీకటిలో వానరాత్రిలో మేఘ రథమెక్కి వస్తున్నాడు. కష్టాలపై కష్టాలు కలుగగా వాని పాదాల శబ్దాలే నా హృదయాన్ని అదుముతాయి. ఆ బంగారు పాదం నన్ను తాకగానే సంతోషభావం వెలుతురులు వెదజల్లుతుంది.

46. నా స్వామి నను చూచి పోవాలని ఎన్ని యుగాల నుంచి ఇలా నా దగ్గరకు వస్తున్నాడో తెలియదు నాకు. ఈ సూర్యుడు, నక్షత్రాలు నాకు రెండు కళ్ళుండగా నిన్ను దాయగలవు? ఎన్నో ఉదయాలలో, సంధ్యలలో నీ అడుగుల శబ్దాలను వినగలిగాను. నా గుండె లోపల నీ దూత రహస్యంగా దూరి కనుగో స్వామి అని అరిచాడు. ఈ రోజు నా జీవితం చైతన్య జీవభావాన్ని పొంది చిందులాడతుంది. ఆనందం నా ఎద అంతా నిండి అంతా తానే అయి తిరుగుతుంది. ఎందుకో ఏమో ఇదంతా నేను ఎరుగను. పనులన్నీ ముగించాలనిపించే విధంగా నీ రాక తెలిపే సుగంధం నా ముక్కుకు తాకినట్లు నాకు కనిపించింది.

47. రాత్రంతా కళ్ళు మూయకుండానే గడిపాను. వాలిలో వాని రాక కోసం ఎదురుచూశాను. పగటి సమయంలో అలిసి నిద్రిస్తే ఒకవేళ వాడు వస్తాడేమోనని భయపడ్డాను. దారి వదలండి అతడిని రానివ్వండి ప్రార్థిస్తాను. నా నిద్రని కలతపెట్టద్దు. ఉదయ ఉత్సాహంలో పక్షులన్నీ కలిసి పిలిచినా, చిరుగాలులు సోకి నిద్ర భంగపరిచినా, చివరకు నా స్వామే వచ్చి మేల్కొలిపినా నేను మేల్కోలేదు. నా స్వామి స్పర్శతో నిద్రాదేవి వీడిపోతుంది. చీకటులను చీల్చుకొని బయటపడి నా ముందు నిలబడి కలలాగా నా స్వామి కనిపించి చిరునవ్వు మెరుపులను పరచే వరకు నా కనులు తెరుచుకోవు. అన్ని రూపాలకన్నా, వెలుగుకన్నా ముందు నా స్వామే నాకు కనిపించాలి. నా ఆత్మ తెలివితెచ్చుకొని పొందే సుఖానుభూతి స్వామి కనుల నుండి కరుణాస్రవంతియై కరిగి నాపై పారవలెను, నేను మేలుకొని నేనయ్యాను, నేనే వాడైపోయి వానిలో కలుస్తాను.

48. ఉదయ సమయంలో బంగారు వెలుగుతో పక్షుల గాన పరంపరలతో నిశ్చలమైన గంభీరమైన సముద్రం కదలాడింది. పువ్వులన్నీ వికసించాయి. సెలయేరుల చీలికలలో బంగారు ముక్కలు రాలిపాడుతున్నాయి. మేము చూడకుండా, వినకుండా మా దారిలో వెళుతున్నాము. ఆడుకోలేము, పాడుకోలేము, పల్లె సంతకైనా వెళ్ళలేము, కాలగమనంలో కలిసి కదిలాము, ఆగకుండానే మా దారిన వెళ్ళిపోయాము. నెత్తిపైకి సూర్యుడొచ్చాడు. వేడిగాలులతో ఎండుటాకులతో ఉన్నాయి చెట్లు కూడా, మర్రిచెట్టు నీడలో గోపబాలుడు కూడా కునికిపాట్లు పడుతున్నాడు. నీటి ఒడ్డుపై పచ్చి గడ్డి నేలపై అలిసిన మేము సాగిలపడ్డాము. నా తోటి వారందరూ నన్ను చూసి నవ్వి తలపైకెత్తి వెనుకకైనా చూడక వెళ్ళిపోమారు, కొండకోనలను దాటి క్రొత్త దారుల వెంట దూరదేశాలకు వెళ్ళారు. చివరే లేని మార్గాల వెంట సాగే శూరులకు, వీరులకు జోహార్లు. వెక్కిరింపులు, నిందలు గుండెను కష్టపెట్టినా నేను లెక్కచేయక కూర్చున్నాను. మానసానందంలో శాంతిని పొందాను. సూర్యుడి పచ్చటి చీకట్లు యెదను ముసురుకోగా ఎందుకువచ్చానో కూడా మర్చిపోయాను. పాటలను వదిలాను, చిరునవ్వుతో నా నిదురపోగొట్టి నా దగ్గర ఆగావు. ఇంతకాలం నిన్ను చేరేదెలా అని ప్రయత్నిస్తూ ఎంతగా భయపడ్డానో కదా!

49. నీ సింహాసనాన్ని దిగి నేరుగా నా ఇంటి గడప ముందు నిలిచావురా స్వామి! మూలలో ఒంటరిగా పాడుకుంటుంటే నీ చెవులబడిందేమో, నీ కొలువులో ఎందరో నిపుణులున్నారు, నీకిష్టమైనట్లు రోజు పాడుతారు. నేర్చుకొని నేర్చుకొని నా నేర్పు నిన్ను అలరించి నా ముందు నిన్ను నిలిపిందా, అది నీ ప్రేమ, సరళమైన ఒక గొంతువిని నీ సింహాసనాన్ని దిగి నా ముందుకు వచ్చావా? పువ్వునొకదానిని కానుకగా తెచ్చావురా తండ్రి!

50. పల్లెబాలను నేను, ప్రతి ఇంటి వాకిటిలో నిలబడి బిచ్చమెత్తుతుంటే దూరాన నీ బంగారపు రథం కనిపించింది కలలాగా. ఆశ్చర్యంతో అందులో ఉన్న రాజు ఎవరని ప్రశ్నించాను. ఆకాశానంటుతూ నా కోరిక పెరిగింది, నా కష్టకాలం పోయిందింక

అనిపించింది. అన్ని దిక్కులలో నేలపై అడగకుండానే సంపదలు వెలజల్లబడతాయని వేచాను. నేను నిలబడిన దగ్గర నీ రథం ఆగింది, నను చూసి చిరునవ్వుతో రథం దిగావు. నా అదృష్టం పండిందనుకున్నాను. అంతలోకే ఏమిస్తావని నీ చేతులను చాపి నన్ను అడిగావు నన్నే ప్రేమించి, బిచ్చగాడిని వెదికి బిచ్చమడుగుటంతా ఎత్తుకు పై ఎత్తు ఎందుకీ పరీక్షలు. పాలుపోని విధంగా నేను నిలబడ్డాను. చివరకు ఒక చిన్న బియ్యపు గింజ నీ చేతిలో పెట్టాను. ఆ రోజు సాయంత్రం పాత్ర బోర్లించగా ఒక బంగారపు బియ్యపు గింజ నేలపై పడింది, చాలా బాధపడ్డాను. లోలోన నాకున్నదంతా నీకెందుకివ్వలేదని.

51. రాత్రి నలుపెక్కింది నా స్వామి! మా పగటి సమయంలోని పనులన్నీ ముగిశాయి, చివరి అతిథి కూడా వచ్చివెళ్ళాడు. పల్లెలో అందరు తమ ఇంటి తలుపులు మూసి నిద్రకుపక్రమించారు. రావలసినవారు ఇంకా కొందరున్నారట. తలుపులను ఎవ్వరో తట్టినట్లు తోచింది, గాలి తోసిందని ఊరకున్నాము. పడకలను పరిచి దీపాలను ఆర్పాము. కొందరు రాజదూతే అన్నారు, కాదని నవ్వాము. అర్ధరాత్రిలో శబ్దం ఒకటి వినిపించింది. నిద్రమత్తులో పిడుగెక్కడో పడిందని మేము లెక్కచేయలేదు. భూమి కంపించింది, గోడలూగాయి, నేల అదురుతుంటే నిద్ర చెడిపోయింది. రథచక్రాల గొప్ప శబ్దమది అన్నారు. చీకటి మరికొంత దట్టమైంది. ఆలశ్యం చేయకుండా వెంటనే మేల్కోమని భేరి మ్రోగింది చెవులను చీలుస్తూ. రెండు చేతులను గుండెపై అదుముకొని భయంతో మేమంతా వణికాము. అదిగో రాజపతాకమ్మా, రారాజు వచ్చాడు, రండి రండి అని మమ్మల్ని మేమే పిలుచుకున్నాము. రాజు రానే వచ్చాడు. పూజలకు పువ్వేది, దీపాలను వెలిగించు మార్గమేది? ఆసనం ఏది, ఆలయం ఎక్కడ? ఇది అవమానకరం అని అల్లాడాము. అంతలో ఎవరో ఉన్న గదే చాలు, ఉత్త చేతులే చాలు, బాధపడవలసిన పనిలేదు, వానిని పిలవటానికి పొండి అని ధైర్యమిస్తూ పలికారు. చెప్పటానికి ముందే చీకటింటికి రాజు వచ్చాడు. ఆకాశం ఉరుముతుంది, మెరుపులు మెరిశాయి, చీకట్లు తప్పుకున్నాయి. తలుపులను తెరవండి ఆలశ్యం చేయకుండా, చింపిచాపను పరచి సిద్ధపడండి. ఈ రోజు గాలివానలతో కబురుపంపకుండానే చీకటిరాజు పయనమై వచ్చాడు.

52. స్వామి! నీ మెడలోని సన్నజాజులదండ అడుగుదామనే ఆశ ఉన్నది కాని, అలాంటి సాహసం చేయలేకున్నాను. నీవు నా ఇంట్లో రాత్రి గడిపి ఉదయాన నీ దారి పట్టి వెళ్ళే నేరానికి కాచుకొని, మట్టిపై రాలిపడున్న రేకులను కొన్నిటిని భిక్షుకుడిలాగా కొనగోరి వెదికాను. స్వామి! ప్రేమ చిహ్నంగా నాకై నీవు వదిలిపోయినదెలాంటి వస్తువో కనుగొన్నాను. అది పువ్వు కాదు, అది పన్నీరు నది, పరిమళ ద్రవ్య సంపద కాదు. నా చేతిలో వెలుగొందుతుండే ఖడ్గం. ఎలాంటి కానుక ఇచ్చావని అనేకసార్లు ఆశ్చర్యం కలిగింది. దానిని దాచగలిగే స్థలం కనిపించదు, దానిని ధరించటానికి అర్హుడిని కాను అంటూ నడుముపై కట్టుకోవడానికి సిగ్గుపడి భయపడతాను. గుండెకు హత్తుకోవటానికి పుండు పడుతుంది అనిపిస్తుంది. బాధాకరమైనా నీవు ప్రేమించి ఇచ్చిన నిండు కానుకను భరిస్తాను. భూమిపై నాకింక భయం లేదు. స్వామి! నా యుద్ధాలలో నీవు జయిస్తావు. మరణదేవతను తోడుగా వదిలావు, వాని శిరసుపై జీవన కిరీటాన్ని ఉంచుతాను. పాశాలన్నీ ఖండించగలిగే ఖడ్గమిది, కనుక నాకు ఇక కష్టాలే లేవు. నీవిచ్చిన ఖడ్గమే ఉందని తెలుసు నాకు, కలవరించను. అలంకారాలు, బింకాలు, ఏవీ ఈరోజు నుంచి నాకు వద్దు, వాకిళ్ళ దగ్గర ఎదురు చూడనింక, ఊరికే ఏడువను.

53. నవనవలాడే చుక్కల నగిషీతో రంగురంగుల రత్నాల సొమ్ముతో నీ చేతి కడియం నిగ్గులు ఒలుకుతుంది. కానీ నీ చేతి కత్తి అస్తమించే సూర్యారుణ కాంతితో సరితూగుతూ, గరుత్మంతుడి రెక్కవలె మెరపు వంపులు తీరి అంతకు మించి వెలుగుతుంది. కఠినమైన మరణదూత చిట్టచివరి పోటుతో కూలిపోయే బ్రతుకు కొన ఊపిరిలాగా, భావాలన్నిటిని భస్మం చేయగా అతి

భయంకరమైన ధాటితో తాకి కాల్చే జ్వాలలాగా కళలీనుతుంది నీ కత్తి. చుక్కల నగిషీల సొంపైన పొదుగుతో నీ చేతి కడియం నిగ్గులొలుకుతుంది. కానీ కమనీయ రుచులతో తలచినా భీకరంగా నీ చేతిలోని ఖడ్గం మెరుస్తుంది ఆశ్చర్యకరమైన ప్రభతో, విడరాని నా దొరా !

54. ఏమీ అడుగను, పేరు కూడా చెప్పను, శెలవు నదికి నీవెళ్ళగా మాట్లాడలేకున్నాను. బావి గట్టుపై ఏటవాలుగా పడున్న చెట్టు నీడలలో కూర్చున్నాను. మధ్యాహ్న మవుతుంది. మాతో రమ్మని పిలిచి పిలిచి విసిగి మట్టికుండలను నింపుకొని స్త్రీలు ఒక్కొక్కరే ఇండ్లకు వెళ్ళిపోయారు. అక్కడ స్పష్టంగా వినరాని పాటలను పాడుతూ వెళ్ళిపోకుండా అక్కడే తారాడుతున్నాను. అడుగు శబ్దం వినలేక నిన్ను తెలుసుకోలేకపోతున్నాను. కలత నిండిన కళ్ళను చూసి, దీనస్వరంతో నీవు అడిగావు బాటసారిని నేను అలిసివున్నాను, దాహం తీరటానికి నీరు కొంచెం పోయమని. నేను పగటి కలలను వదిలి దోసిట్లో నీరు పోశాను. అంధకారం నుంచి కోయిలలు పాడాయి, బాట మలుపుల నుంచి సువాసనతో కూడిన గాలులు వీచాయి. నీపేరు చెప్పు అని నీవు నన్ను అడుగగా చెప్పలేక సిగ్గుపడి నిలిచాను. దొరా! నను దృష్టిలో ఉంచుకోవటానికి నేను చేసిన మేలేంటి? చెప్పు. నీరు పోసి నీ దాహం తీర్చాననే మధుర స్మృతులను నా మనసులో ఎప్పుడూ బంగారపు అక్షరాలతో చెక్కివుంచుతాను. మధ్యాహ్నమైంది, నుదిటిపై ఆకులు ఏమేమో పలుకుతున్నాయి, అలిసి పక్షులన్నీ కలతతో కూడిన గొంతులను రాల్చాయి. చివరంటూ లేని ఆలోచనలతో కదలకుండా కూర్చున్నాను.

55. అలిసిపోయిన గుండె పదిలపడలేదింక. నిదురమత్తుతో కళ్ళు తెరుచుకోకున్నాయి. ముళ్ళ కంపల మధ్యలోని మురిపాలొలికేపూలు కొలువు దీరుంటాయని నీకెవరూ తెలియజేయలేదా? ఏకాంత భూమిలో రాళ్ళదారి చివరలో ఒంటరిగా నా ప్రాణసఖుడున్నాడు. వానిని మోసం చేసే పాపంలో పడకురా. మేలుకోరా తండ్రి మేలుకో, మధ్యాహ్నపు సమయంలో మండే సూర్యుడి ధాటికి ఆకాశం అల్లాడినా, వేడి ఇసుక నేల దాహపు వస్త్రం పరిచినా ఏమైంది? ఎంతో ఆనందమది నీ హృదయ సముద్రంలో నిండి ఉంది కదా! పద్య వీణ నీ ప్రతి అడుగు స్పర్శకు తీయతీయని శోకగీతాలు పాడదా?

56. నీ విచ్చిన సంతోషం నా హృదయాన్ని నింపింది, నీవు ఇలాగే నాలోన నిలిచున్నది కూడా. నిఖిలలోకప్రభూ! నేనే లేకపోతే నీ ప్రేమ నిలిపే స్థానమేదిరా! నన్ను నీ భాగస్వామిగా చేశావు, నీ సంపదంతా సమానంగా పంచుకోనిచ్చావు. నిరంతరం నా హృదయంలో గజ్జెలు కట్టి ఆడుతున్నావు నువ్వు. నీ కోరెకలన్నీ నాలో నిండుతాయి. అందుకే రారాజువైనా నను లోబరుచుకోవటానికి మురిపాల మూటలాగా మారుతావు.

57. ఈ వెలుగు, నా వెలుగు, ఈ భూమినంతా నింపే వెలుగు, కళ్ళను ముద్దుపెట్టుకొని కదలిపోయే వెలుగు. మనసులో అమృతం కురిపించే వెలుగు. నా బ్రతుకులో నాట్యమాడుతుంది. నా వలపు చెలికాడా! ఈ వెలుగు చూడరా, ఈ వలపు తీగలను యెదమీటుతుందిరా ఆకాశం విచ్చుకుంది, పెనుగాలి వీచింది, లోకమంతా నవ్వు ఆక్రమిస్తుందిరా. వెలుగుల సముద్రంపై అందమైన సీతాకోకచిలుక తెరచాప విప్పిందిరా! తెల్లకలువులతో మల్లెపూలు కలిసి వెలుగుతరగలని వెలికితెస్తున్నాయి. బంగారు ఛాయలతో పరుచుకొన్న వెలుగు కమలాలలో వెదజల్లిబడిఉంది. రంగురంగుల వేయి రత్నరాశులు కురవగా ఈ ఆకు చివర నుంచి ఆ ఆకు చివర వరకు ఆనందం పరచుకొని ఉందిరా. ఆనందానికి అంతేలేదింక. మిన్నేరు పారింది, సంతోషం పొంగిపొర్లింది.

58. ఆనందపు ధ్వనులన్నీ ఒకటై నా చివరి పాటలో కలిసిపోని ధారాళంగా పంటలతో ఈ భూమి అందం ఇనుమడించగా

ఆనందం శోభిస్తుంది. బ్రతుకంతా పరిచి నాట్యం చేసేటట్లుగా చేయగలిగిన ఆనందం, నవ్వుతూ నాట్యం చేస్తూ గాలి వానలతో కదిలే ఆనందం, బాధలతో నిండిన ఎర్రతామరై కదలకుండా మెదలకుండా కన్నీళ్ళతో కూర్చున్న ఆనందం. నేలపై తనకున్న మొత్తాన్ని వదిలిపెట్టి ఒకమాటైనా మాట్లాడకుండానే పరుచుకునే ఆనందం నా చివరి పాటలో కలిసిపోనివ్వు.

59. ఆకులపై నాట్యంచేసే బంగారపు వెలుగు, నక్షత్రాలు పందిరిపై తేలే సోమరి మబ్బులు, నుదిటిపై చల్లదనాన్ని విసిరిపోయే గాలి, ఇవన్నీ నీ ప్రేమ యత్నాలని నే తెలుసుకున్నాను. కళ్ళలో తూర్పు వెలుగు వెల్లువ కట్టి నీ సందేశం భావాన్ని అందించింది. నీ కళ్ళు నా కనులను చూడగా నా హృదయం నీ పాదపద్మాలను అంటింది.

60. చివరేలేని సముద్రతీరాలలో అనేకమంది పసిపిల్లలు ఆడుకోవటానికి కలుస్తారు. తీరంలేని గంగ తలపైన కదలకుండానే కనిపించగా కెరటాలు ఒడ్డులు ఒరుసుకొనేవిధంగా గర్జిస్తాయి. ఆ కడలేని లోకాల కడలి తీరాలలో పసివారు పాడుతూ ఆడుతూ కలుస్తారు. ఇసుకతో వారు ఇల్లు కట్టి, వేడుకతో పండుటాకులతో పడవలను తయారు చేసి నవ్వుతూ సముద్రంలో తేలుస్తారు వాటిని వారు ఈదలేరు. వల కూడా వేయలేరు. అక్కడ ముత్యాలకోసం మునిగేవారుంటారు, వ్యాపారులు అనేకమంది పడవ ఎక్కుతుంటారు. పసిపిల్లలు మాత్రం ఆలోచనలు లేకుండా హాయిగా గులకలను వేస్తుంటారు, గుప్తనిధిని వారెప్పుడూ కోరుకోరు. సముద్రం నవ్వగానే పొంగిపోయి తీరంలోని ఇసుకనేలపై పలుచని వెలుగులో చిరునవ్వులు వెలయిస్తారు. చావుదెబ్బలు కొట్టగలిగిన అలలు భావశూన్యమైన పాటలు పాడాయి. తల్లి జోజో అని పాడినట్లు పసిపిల్లలకు అనిపించింది. సముద్రం పసిపిల్లలతో కలిసి ఆటాడుతుంటే ఇసుకనేల చిరునవ్వు నవ్వింది. చివరే లేని సముద్రపు గర్భాలలో పసిపిల్లలు కలిసి ఆడుకోవటానికి కలుస్తారు. గాలివానలు కదలాడగా, దారే లేని సముద్ర గర్భంలో పడవలు వెళ్ళలేక ముక్కలై మునిగాయి. చావు దగ్గరకొచ్చింది, అంతులేని ఆ సముద్ర తీరాలలో పసిపిల్లలు గొప్పగా కలసి ఆడుతారు.

61. పసివారి కళ్ళపైకి అంటీఅంటకుండా పారాడే నిద్ర ఎక్కడినుండి వచ్చింది? ఇక్కడున్నవారిలో ఎవరు చెప్పగలరు. అప్సరసల పల్లెలో అడవిలో అందీ అందకుండా ఉండే మిణుగురుల తళుకులు గల స్థలంలో భయంతో వణికిపోయే అందమైన రెండు మొగ్గలున్నాయి. వాని నుండే నిద్ర వచ్చి ముద్దుపెట్టిపోతుంది అని చెప్పగా నేను విన్నాను. నిద్రించే సమయంలో మెరుపు ముక్కలాగా మెరిసే చిరునవ్వు ఎక్కడ పుట్టిందంటే ఎవరు చెప్పగలరు? నెలవంక నుండి వచ్చిన చిన్న వెలుగు తీగ హేమంతంలోని మబ్బుని తాకే సమయంలో మంచు చుక్కలు కడిగిన ఉదయకాల సమయంలో కలరాగా ఆ మురిపాల చిరునవ్వు ఉదయించింది అని చెప్పగా నేను విన్నాను. పాప ప్రతి అంగంలో కలిగే కొత్తదైన మధుర మంజులమైన సున్నిత భావం ఎక్కడ దాగింది అంటే ఎవరు చెప్పగలరు? కన్నమ్మ ఎప్పుడో కన్యగా ఉన్నప్పుడు వ్యక్తీకరించబడక హృదయంలో సందడి లేక మృదులమై మెదలే ప్రేమ భావంలో పాప ప్రతి అంగంలో జనించిన మధుర మంజుల సున్నిత భావం దాగి వుంటుందని మనసులో నేననుకుంటాను.

62. పసివాడా ! నీకు నేను అనేక రంగుల బొమ్మలను కొనిపించగా, రంగులు నీళ్ళల్లో, మబ్బుల్లో నాట్యం చేశాయి, పూవులన్నీ వింతవింత రంగులద్దుకున్నాయి, అదెందుకో నాకర్థమయిపోయింది. నిన్ను ఆడిపించటానికి నేను కమ్మగా పాట పాడటం మొదలుపెట్టగా కొమ్మలు, ఆకులు కమ్మగా పాడాయి, భూమి చెవులప్పగించి వినింది, కెరటాలన్నీ కలిసి పదాలను అల్లి పాడాయి, అవన్నీ ఎందుకలా చేస్తున్నాయో తెలుసు. నీవు కోరికలతో నేను తెచ్చిన తియ్యనైన వస్తువులను అందుకోగా, పూల నుండి తేనె పొంగి పొర్లింది, పండ్లన్నీ రసపూరితాలయ్యాయి, అలాంటి పనులన్నీ అందుకేనని తెలుసు. నిన్ను

నవ్వించటానికి నీ చెక్కిళ్ళను నేను ముద్దాడితే ఆకాశంలో కాలువగట్టి వెలుగులు పారాయి, నా శరీరం మీద గాలులు ఆడుకోగా అందులోని సుఖభావం ఎలాంటిదో నాకు పూర్తిగా అర్థమవుతుంది.

63. పరాయివారిని, తెలియని వాళ్ళను పరిచయం చేశావు. వారి ఇళ్ళల్లో నాకు వసతి నిచ్చావు, దూరమైన వారిని దగ్గరకు తెచ్చావు, చూడనివారిని సోదరుడిగా చేశావు. నా స్థానం విడిచి పరాయి ఇళ్ళల్లో నివసించాలంటే నా మనసు బాధపడుతుంది. క్రొత్తదైన స్థానంలో కూడా నువ్వు ఉన్నావని తెలిసీ మరిచిపోతుంటాను. ఈ లోకంలోగాని, ఏ లోకంలోగాని పుట్టుక చావుల మధ్య దారిలో నను నడిపి ఆ తీరంలో నను కలిసి ఆనందింపజేయగలవాడివి నువ్వొక్కడివే.అంతులేని ఈ బ్రతుకు నడపటానికి సహాయమందిస్తున్న స్నేహితుడివి. నిన్ను అర్థం చేసుకుంటే పరాయివారు లేరింక. తలుపులు తెరిచే ఉంచుతారు. భూమిపై అందరూ కలిసి ఆడుతుంటే వేరని లేని సంతోషభావంతో ప్రవర్తించగలిగే ఐక్యభావాన్ని నాలో నెలకొల్పరా, ప్రభూ! ప్రార్థిస్తున్నాను.

64. ఇంకా తోడనేది లేకుండానే పారుతూ ఉండే కొండవాగు, ఆ వాగు గట్టుపై గడ్డిపరకల మధ్య నుండి నేనడిగాను. ఓ స్త్రీ! ఈ దీపాన్ని పైట చాటున గప్పి ఈ రాత్రివేళలో ఎక్కడికి వెళుతున్నావు? నేను ఒంటరివాడిని, చీకటి ఇల్లు, దయతో చేతి దీపం ఇచ్చి పొమ్మని అడిగాను. నిముషం సేపు మెల్లగా తన కలువల వంటి కళ్ళు తెరచి నా ముఖం చూచి వంచిన తలతో పడమటి దిక్కున పగటి వెలుగు తగ్గుతుంది, వాగులో దీపం వదలటానికి వచ్చానని అంది. గడ్డిపోచల మధ్య నిలబడి కదలకుండా వాగుపై కదులుతున్న దీపశిఖను కళ్ళు విప్పి చూస్తూ ఉన్నాను. చీకటులు శబ్దం చేయకుండా తొలిగి పోయాయి. నీ దీపాలన్నీ వెలుగుతున్నాయి కదా, ఇంకా ఎందుకు దీపం వదలకుండా వెళుతున్నావని అడిగాను, నా ఇంట్లో చీకటుంది, నాకు తోడు ఎవరూ లేరు, నా ఇంట్లో ఆ దీపముంచి దయచూపమని అడిగాను. ఆమె నల్ల కలువల వంటి కళ్ళను మెల్లగా విప్పి నిముషం నాపై చూపు నిలిపి, నాపై సందేహం కలుగగా ఈ దీపాన్ని ఆకాశానికి అంకితం చెయ్యాలని అనుకుంటున్నానని వంచిన తలతోనే చెప్పింది. ఉపయోగపడకుండా ఆ దీపం శూన్యంలో ఉండగా నేను చూస్తూ ఉన్నాను. జవ్వనీ! చంద్రుడు లేని చీకటి రాత్రిలో ఇంట్లో చీకటులు, ఒంటరిగా ఉన్నాను, నా దగ్గర పెట్టిపో దీపాన్ని అని వేడుకున్నాను. రెండు కళ్ళువిప్పి భయపడకుండా నను తేరిపారచూచి, దీనిని విశ్వదీపోత్సవపు వెలుగులో వెలుగుగా కలుపదలిచాను అన్నదామె. వేయి వెలుగుల మధ్యలో కనిపించకుండా వృధా అవుతున్న ఆ వెలుగును చూస్తూ నిల్చున్నాను.

65. నా ప్రభూ! ఆశ్చర్యం, నువ్వు నా బ్రతుకు పాతరల నుండి ఏ దివ్య సుధను ఆస్వాదిస్తున్నావో, నా కళ్ళల్లో ఇల్లు కట్టుకొని చూస్తుంటాను నీ సృష్టిని. గానస్వరాలన్నీ ఐక్యమవ్వగా వింటావు నువ్వు. నీదైన ఈ జగత్తు నా మనసులో నిండి పదాలు పాటలై మ్రోగుతాయి, నిర్మలమైన ఆనందాన్ని నా హృదయం అందుకొంటుంది. నన్ను ప్రేమించటం కోసం నిన్ను నాకు ఇచ్చుకొనిన నీ మధురమైన రూప సౌందర్యాన్ని నాలో చూస్తాను.

66. పగలు పోతుండగా, చీకటి ముసురుకుంటుండగా మధ్య మసలుతోన్న మసగ వెల్గులలో కదిలే దృశ్యాల బాటలో నా అంతరంగంలో నెలకొన్న రాణిని చివరిపాటగా సంతోషంతో చివరి కానుకగా నీ చేతికిస్తున్నాను స్వామి! పలుకులన్నీ ఆమెను పొందలేమని విడిచిపెట్టాయి. ప్రోత్సాహభావాలు సాధ్యంకాక ముడుచుకున్నాయి. ఆమెను నా గుండెలో వుంచుకొని దేశాలన్నీ తిరిగాను. పెరిగింది, తగ్గింది, పైకెగసింది, నా బ్రతుకును విడువకుండా పట్టుకొనే ఉంది. నా ఆలోచనలు శాసించి నా కళ్ళల్లో, కలల్లో నన్ను ఏలే నా రాణి నన్ను అంటీ అంటకుండా నాతోటే ఉంది. ఇంటి తలుపులు తట్టి ఆమె

నివ్వమని అడిగి ఎందరో విసిగి వెళ్ళిపోయారు. ఇంతకు ముందు ఎవ్వరూ ఆ స్త్రీని చూచి వుండరని నేను భావిస్తాను.

67. నా స్వామి సర్వేశ్వరా ! ఆకాశం నువ్వే, గూడు నీవే. ఆ గూటిలో మాయ అంటకుండా నీ పవిత్రమైన ప్రేమే రంగులను, మాటలను, వాసనతో కప్పి ఆత్మను భద్రంగా దాస్తుంది. ఉదయాన్నే కదిలి సంతోషంతో అందాల పూల దండను బంగారపు బుట్టలో కుడి చేతితో పట్టుకొని కిరీటాన్ని పెట్టి భూమిని పరిపాలించటానికి నడిచివస్తున్నావనే సూచనలు ఏర్పడతాయి. పడమటి సముద్రం మధ్యలోగల శాంతి అనే చల్లనైన సుధల బంగారు కలశాన్ని నింపుకొని ఆత్మ స్వేచ్ఛగా ఎగిరి అంతేలేని ఆకాశమంతా తానే అయి తెల్లటి వెలుగులతో పరిపాలిస్తున్నది. అక్కడ రంగు, రూపాలు, భావాలు లేవు, పగలు రాత్రి లేదు, మాట ఒక్కటీ వినపడదు.

68. కన్నీళ్ళు, నిట్టూర్పు, గానం కలిసి మేఘమై నీ కాళ్ళ దగ్గరకు తీసుకురావాలని నీ తలుపువాకిట్లోనే కళ్ళు ఆర్పకుండా రోజంతా వేచుంది. నక్షత్రాలతో నిండిన నీ వక్షస్థలాన్ని ఆ మబ్బుదుప్పటి కప్పి గడియకి ఒక రంగు కలిగిస్తుంది. మడతపెట్టి రూపం మారుస్తావు. తేలికైంది, నల్లటిది మేఘం కనుక దానిని నీవు ప్రేమిస్తావు ప్రభూ!

69. నా రక్తనాళాలలో పారుతున్న జీవనదే పగలురాత్రి అనకుండా విశ్వంలో లయతాళాలు పొంది నవ్వుతుంది. ఆ జీవభావమే భూమిపై నున్న దుమ్ము నుంచి ఆనందమై మొలకెత్తుతుంది. లెక్కపెట్టలేనట్టి గడ్డిపోచలుగా, ఆకులుగా, పూవులుగా కదలాడుతుంది. జనన మరణాలనే అలలుగల సముద్రపు జీవన విధానమదే. కొత్త కొత్త రీతులుగా నేడు యుగయుగాల నుండి ఉన్న జీవభావమే నా రక్తంలో నర్తిస్తుంది.

70. అటూ ఇటూ కొడుతూ భయపెట్టే సంతోషమనే సుడిగుండంలో పడబోతున్న రాగాల మేళవింపు ధ్వనులతో నీవు సంతోషాన్ని చూడలేవు, విను. వస్తు సముదాయమంతా వేగంగా ఆగకుండా పరుగెత్తుతున్నాయి. వాటిని ఆపగలిగే శక్తిలేదు. గాన గమనంతో కలిపి అడుగులు వేసి నృత్యం చేస్తూ ఆరు ఋతువులు వచ్చిపోతాయి. రంగులు, రాగాలు, వాసనలు అన్నీ క్షణంలో గతిస్తాయి.

71. నన్ను నేనే గొప్పవాడిననుకుంటూ నా చుట్టూ అనేక రంగుల నీడలను పరిచి నీ చుట్టూ వెలిగే వెలుతురులను తక్కువ చేయాలని మనసులో తలుస్తాను, అది నీ మాయే. నీ నుండి ఇంకో రూపాన్ని నిర్మించావు. ఆ రూపాన్నే అనేక పదాలతో అల్లి వర్ణిస్తాను, ఆ రూపమే నాలో నిండింది. మారుమూలల నుండి నీ విషాదపు గీతి ఆకాశమంతా పరుచుకొని అనేక రంగు కన్నీళ్ళను, నవ్వులను, హెచ్చరింపులను చూడనిచ్చి, విననిచ్చి మారుమ్రోగుతుంది. నీకూ నాకూ మధ్య నువ్వు కట్టిన తెర అనేక చిత్రాలతో అందగిస్తుంది. నా, నీ ప్రదర్శనల నాటకాలు ఆకాశంలో ఆక్రమించటం మొదలైంది. నీ నుంచి నా నుండి వచ్చే ధ్వనులతో వాయుమండలమంతా ప్రతిధ్వనిస్తుంది. దాక్కుంటూ వెతుకుతూ మనసు దాగుడుమూతలాడుతుంటే యుగాలే గడుస్తున్నాయి.

72. నా అంతరంగంలో ఉన్నవాడే నన్ను మేలుకొల్పుతున్నాడు, నా హృదయాన్ని మీటి అనేక రకాలైన వాదాలతో సుఖదుఃఖాల మధ్య భేదాన్ని వివరించి ఆనందపడుతున్నాడు. క్షణంలో నశించే బంగారు, వెండి వంటితో వలపన్ని ఏ పాదాలు తాకితే నేను మెరుస్తున్నానో ఆ మడతల నుండి తొంగి చూసేటట్లు చేయువాడు అతడే. రోజులు వస్తాయి, పోతాయి, యుగాలు గడుస్తాయి, ఎన్నో పేర్లు, వేషాలు, సంతోషాలు, కష్టాలు అయినా నా హృదయాన్ని వశపరచుకున్నది వాడే.

73. సన్యసిస్తే స్వాతంత్ర్యం రాదు. వందల వేల బంధాలు కౌగలించటానికి వస్తాయి, అవే నన్ను స్వతంత్రుడిని చేశాయని భావిస్తుంటాను నేను. రంగురంగుల రసాలను చేసి ఈ మట్టిపాత్రను నీవు నిరంతరం నింపుతున్నావురా. నీ చేతి దీపంతో

వేయిదీపాలు వెలిగించి ఆలయంలో పూజాపీఠం మీద నిలుపుతాను. పంచేంద్రియాలనే ద్వారాలను తెరిచే ఉంచుతాను, మరచిపోయి కూడా మూయను. కళ్ళ సంపద, చెవుల సంపద, భుజ భాగ్యం అనేక రకాలుగా నీవిచ్చే ఆనందాన్ని చూస్తాయి. వింటాయి, తాకుతాయి. నాలోని భ్రమలన్నీ కాలి వెలుగుతాయి, సంతోష దీపాల వెలుగులు పండ్లై ఫలిస్తాయి, కోరికలన్నీ తీరుతాయి.

74. పగలులేదింక, నీడ భూమిపై పరుచుకుంది. నేను ఇంకా వాగుదారిలో వెళ్ళాలి. కడవనింపే సమయమైంది. సంధ్యరాగాలు జాలిగొల్పుతూ జలగీతంలో కలవడానికి వేగిరపడుతున్నాయి. అవ్యక్తగానంతో నన్ను అవి పిలిచాయి, మసక చీకట్లో తిరుగుదువురా అని. దారిలో ఇంకొకడు కనిపించడు, చిరుగాలే పెనుగాలై వీచింది. నదిలోని కెరటాలు ఉరిమాయి, నేను తిరిగి ఇంటికి వెళ్ళగలనో, లేదో. ఈ దారిలో ఎవరిని చూస్తానో, వాగుదాటటానికి దారున్న ప్రదేశంలో ఎవరో వేణువు చేతపట్టి పాడుతున్నట్లుగా ఒక నాదం వినిపించింది.

75. మానవులు నీ చేతి కానుకలు పొందుతారు, తిరిగి అవి నిన్నే చేరతాయి. ప్రతిరోజు చేసే పనులు నదికి ఉన్నాయి. పంట భూములలో పారాలి, పల్లెటూర్లను చేరాలి అయినా తిరిగి నీ పాదాలు కడగటానికి తిరిగి వస్తాయి. పువ్వులు గాలులకు సువాసనలిచ్చి మళ్ళీ నిండు మనసుతో వాడకుండానే నీ సేవకై చేరతాయి. వసుధ నిను పూజించి ఏమీ పొగొట్టుకోలేదు. కవి కావ్యాలనుంచి మనసుకి నచ్చిన అర్థాన్నే ప్రజలు స్వీకరిస్తారు. కాని ఆ కావ్యాల చివరి మాట నిన్ను చూపగలిగే మాటే అవుతుంది.

76. నేను నీ ముందు ప్రతిరోజు నిల్చుంటాను, నా జీవన సామ్రాజ్య నాథుడా! నా స్వామి! నిఖిలలోక ప్రభూ! ప్రతిరోజు నీ ముందు ముఖాముఖిగా నమస్కరించి నిలుచుంటాను. అంతులేని ఆకాశం క్రింద పెదాలను బిగించి వినమ్రుడినై ఒంటరిగా నీ ముందు ఎల్లప్పుడూ నిలుస్తాను. కడుపుకూటి కోసం కష్టాలు, బాధలు పడుతూ, శ్రమిస్తూ కూడా సమయం చూసి నీ ముందు నిలుస్తాను. రారాజా! ఈ భూమిపై నేను చేయవలసిన పనులన్నీ అయిపొయ్యాయా? నిను వదలకుండా నీ ముందు ముఖాముఖిగా నిలుస్తాను.

77. నువ్వు నా దేవుడవని దూరంగా నిలుస్తాను, తండ్రి నీవని తల్చి నిను చేరటానికి నేను నమస్కరిస్తాను. పరమమిత్రుడవని చేతులను పట్టుకోవడానికి, నన్ను నీవానిగా చేసుకోవటానికి నీవు ఆలోచిస్తే నేను కౌగిట చేర్చి స్నేహితుడిగా చేసుకొని సఖ్యాన్ని పొందకుండా దూరం వెళ్ళిపోతుంటాను. నా సహోదరులలో నువ్వు ఒకడివి, వారికి ఈ అదృష్టం ఇవ్వను. నీకే ఈ భాగ్యమిచ్చి నీ పంచ బ్రతకాలనుకున్నాను. కష్ట సుఖాలలో నీ దగ్గరే నిలుస్తాను కానీ మానవులతో ఉండటానికి మనసు ఒప్పుకోదు. ప్రాణాలపై ఆశ వదులుకోలేదు కనుక బ్రతుకు అనే సముద్రంలో పడటానికి అంగీకరించలేకున్నాను.

78. అది మొదటిసారిగా భూమి సృష్టించబడినప్పుడు ఆకాశంలో పడి నక్షత్రాలు మెరిశాయి, దేవతలందరూ సభ తీర్చి పాడారు, అంతా తానైన ఆనంద జీవమిది, మచ్చలేనిది, మెచ్చుకోదగిన సృష్టి ఇది. ఎవడో ఒకడు వెలుతురులో వెలితి కనిపించిందని, ఒక నక్షత్రం నేలపై రాలి పడుంటుందని గుర్తించి అన్నాడు. బంగారు వీణ తీగతెలింది, పాటలాగాయి, వారు ఏడ్చారు. అవును రాలిన చుక్క అత్యుత్తమమైనది, గగనరత్నమనదగింది అని వారు అరిచారు. ఆకాశవాసులందరు ఆ గొప్ప నక్షత్రం కోసం వెదకసాగారు. అది నష్టమైతే భూమికే ఒక సుఖం పోయినట్లు అనే మాటలు వినిపించాయి. ఏ శబ్దంలేని ఏకాంతంలో రాత్రి సమయంలో నక్షత్రాలు వినపడని మాటలను గుసగుసలాడాయి. ఎంత వెదికినా అది ఎక్కడా దొరకదు, అన్నిటికంటే గొప్పది, అందరికీ అందదది పరిపూర్ణ భావమది పరమాత్ముడి రూపమది.

79. ఈ జన్మలో నిన్ను నేను చేరలేనా, నను చూడటానికి దయతప్పింది అని భావిస్తాను. మనసులో నీ సత్యాన్ని మర్చిపోకుండా ఉంచటానికి, కళ్ళు తెరిచివున్నా, కలలుగంటున్నా, ఆలోచనలలో ఈ బాధను నిలిపివుంచడానికి కావలసినబలాన్ని ఇవ్వు నా స్వామి నినువేడుతున్నాను.

80. ఆకాశంలోని శరత్కాలంలోని మచ్చుతునకలాగా పనిలేక నేను తిరుగుతున్నాను. భువిపై వెల్లులను నింపే ఓ సూర్యబింబమా! నీ కిరణాలు నాలోని నీటిని ఆవిరి చేసి నీ వెలుగులో వెలుగుగా నన్ను చేయలేకున్నాయి, ఇలా నిన్ను వదిలి ఎన్నాళ్ళు రోజులు లెక్కబెట్టుకుంటూ ఉంటాను. ఇలా నేను ఉండటం నీకిష్టమైతే, ఈ ఆటే నీవు ఆడదలిస్తే రంగులద్ది, బంగారు అంచులతో దిద్ది వేగంగా వీచే గాలులను తేలిపోనివ్వు. రాత్రివేళ నీ ఆట ఆపాలనుకుంటే నేను చీకటిలో కనిపించకుండా కలిసిపోయి తెల్లటి సూర్యోదయ వెలుతురులో తిరగటం మానుకుంటాను.

81. గడిచిన కాలాన్ని తల్చుకొని పనిలేని సమయంలో అనేకసార్లు బాధపడ్డాను. ప్రతి నిముషాన్ని నీవు పట్టి వుంచటం వలన ఆ కాలమేమీ నష్టపోలేదు. వస్తు సముదాయం హృదయంలో నువ్వు దాగుండి విత్తనాలను వృక్షాలుగా, మొగ్గలను పువ్వులుగా, పూలను పండ్లుగా ఎప్పుడూ చేస్తుంటావు. పనులన్నీ అయిపోయాయనే భ్రమతో నేను సోమరిగా ప్రక్కపై పడుకున్నాను. తూర్పు తెలవారటంతో తోటలో పువ్వులన్నీ పూచి వింతగా ఉండటం నేను కనుగొన్నాను.

82. చివరలేని నీ చేతులనే కాలాన్ని నిముషాలలో లెక్కకట్టడం సాధ్యంకాదు. యుగాలు పోతున్న విధంగానే పగళ్ళు రాత్రుళ్ళు గడుస్తుంటాయి. స్వామి ! కాపాడటం నీకు తెలుసు. చిన్నదైన పువ్వును నువ్వు చక్కదిద్దుతుండగా శకాలు కొన్ని గడిచిపోతాయి. మేము కాలాన్ని వృధాచేయలేము. ఆలస్యం చేసే అత్యల్పులం మేము. అడిగిన వారందరికీ కాలాన్ని ఇచ్చి నేను చాలా కాలాన్ని కోల్పోయాను. రోజు చివరలో నీ ఆలయం మూస్తారని వేగిరపడుతుంటాను. కానీ నీ పూజలకు ఇంకా కాలముంది.

83. తల్లీ! నేను నీకోసం కన్నీళ్ళు ముత్యాల హారం గుచ్చి నీ కంఠంలో వేస్తాను. నక్షత్ర మాలికలు నీ పాదాలకు గొలుసులు కాగా నా మాలను నీ వక్షస్థలంపై నిలువనివ్వు. సంపద, కీర్తి ఎప్పుడూ నీవిచ్చేవి. వారెవ్వరూ పొందలేని నిధి అయిన వేదనలు నా సంపద. దానినే నీకు ప్రేమతో అర్పించి నీ కరుణను పొందుతాను.

84. వదలని వేదనలే విశ్వమంతా నిండి చివరంటూలేని ఆకాశభాగంలో లెక్కలేనన్ని రూపాలు కలిగిస్తాయి. రాత్రంతా శూన్యాన్ని చూచి ఏమీ తోచని విధంగా వానాకాలపు చీకటులలో ఆకుల మధ్య వేదనలే భావగేయాలుగా మారిపోతాయి. ఈ వేదనలే ఇంతై అంతై ఎప్పుడూ మానవుల ఇళ్ళల్లో ప్రేమగా, బాధగా మసలుతుంటాయి. అదే కరిగి కవి గుండెలో చేరి గాన ప్రవాహంగా బయటకు పారుతుంది.

85. దళపతి మొట్టమొదటి పిలుపందుకొని వచ్చిన సైన్యమంతా శక్తిని ఎక్కడ దాచివుంచారు? వారికి శస్త్రాలు, కవచాలు ఏమీ లేవు. వారంతా పేదవారు. వారిపై బాణాల వర్షం కురిసింది, వారు సైన్యాధిపతి కొలువులో జేరే కాలంలో. తమ శక్తులను ఎక్కడ దాచి వచ్చారో చేతిలోని ఖడ్గాలు, బాణాలు నేలపై వేచి వరుసగా నిలిచారు. వారి ముఖాలలో శాంతిదేవత తాండవించింది. వారు ఈ భూమిని వదిలి వెళ్ళేటప్పుడు వారి పూర్తి జీవిత ఫలాన్ని వదిలి వెళ్ళారు.

86. నా తలుపు దగ్గర నీ దూతైన మృత్యువు కాచుకున్నాడు. కనిపించని సముద్రందాటి అతడు వచ్చి నీ సందేశాన్ని నాకు తెలియజేశాడు. రాత్రి నలుపెక్కింది, నా గుండె వణికింది. అయినా దీపం తీసుకొని వెళ్ళి అతడిని చూచి స్వాగతం చెబుతాను. చేతులను జోడించి అతనిని పూజిస్తాను. కన్నీటి ధారలే కానుకలుగా అర్పిస్తాను, నా హృదయాన్నే అతడి

కాళ్ళ దగ్గర పెడతాను. నా పగటి సమయంలో ఒక నల్లనీడను వదిలి వచ్చిన అతడు వచ్చిన పని పూర్తి కాగా వెళ్ళిపోతాడు. దిక్కులేని నేను ఒంటరిగా ఈ ఇంట్లో నీకు చివరి కానుక కావటం కోసం, నీ చేతిలో పడటం కోసం నిశ్చింతగా ఎదురుచూస్తున్నాను.

87. ఆశలన్నీ నశించటానికి చివరి కోర్కెగా అన్ని మూలలలో ఆమె కోసం వెదికాను. ఎంత వెదికినా ఎక్కడా కనబడదు. ఈ చిన్న ఇల్లు వదిలి వెళ్ళిపోయిందా. అలా పోతే, ఇంక కనిపించదు. నా దొరా! చాలా విశాలమై కొలవటానికి వీలుకాని నీ భవనానికి ఏమీ తోచక ఆమెను వెదకటం కోసమే వచ్చాను. ఆమెను కనుగొనక బంగారపు సంధ్యా సమయంలో ఆకాశం క్రింద నిను చూడటానికి నేను తల పైకెత్తాను. కళ్ళు కడవలయ్యే విధంగా కన్నీళ్ళతో నిండిన కళ్ళతో చూచిన ఏ సుఖభావమైనా, కోరిక అయినా, చూచిన ముఖమైనా కనబడకపోయినా చివరే లేని ప్రాంత హద్దులలో పడ్డాను నేను. నా స్వామి! బ్రహ్మాండ భాండంలో అంతా తానైనటువంటి ప్రదేశాలలో కనిపించని తియ్యని దెబ్బని నేను స్వీకరిస్తాను.

88. పాడుపడిన గుడిలోని దైవమా! వీణ నీగురించి పొగడి పాడటం మాని తీగతెగి పడివుంది. సంధ్య పూజలకు సమయమైందని నాలుక పడిపోయి ఘంటారావం మ్రోగకుండా ఉంది. నీ చుట్టూ గాలులు కూడా కదలకుండా ఉన్నాయి. పువ్వులను నీ పూజ కోసమని ఇంక పంపమని పూలు వసంత గాలులకు చెప్పిపంపగా ఆ గాలులు నీ చెవుల దగ్గరకు వచ్చాయి. ఊర్లు తిరుగుతుండే పాత పూజారి, ఎప్పుడూ ఏదో కోరిక నిన్ను కోరుతూ ఉండేవాడు కూడా నిన్ను కొలవటానికి రానంటున్నాడు. మంటలు, నీడలు, చీకట్లు ముసిరే సంధ్యా సమయంలో అతడు చాలా అలసి, పస్తులుండి, ఇంక దిక్కేమీలేక నీ గుడికి తిరిగి వస్తుంటాడు. పరువాలు, పండుగలు నీకు కానట్లుగా వచ్చిపోతున్నాయి. దీపం వెలిగించే దిక్కైనా లేకుండా ఎన్నో రాత్రులు వెళ్ళిపోతున్నాయి. గొప్ప శిలలు చక్కగా చెక్కిన శిలా విగ్రహాలు ఎన్నో సమయం వచ్చినప్పుడు కనిపించని కాలువల దగ్గర చేరుతున్నాయి. పాడుగుడిలోని దైవమా! పూజలకైనా నోచుకోకుండా నీవె చచ్చికూడా చావకున్నావు.

89. ఇంక నేను పెద్దగా ఒక మాటైనా మాట్లాడకూడదని నా రారాజు నొక్కి చెప్పాడు. కనుక పాటలో నా హృదయభావం విచ్చుకోగా గుసగుసలతోనే వానిని కొలుస్తాను. అనేకమంది రాచసంతకు వెళతారు, అక్కడ అమ్మేవారు, కొనేవారు కలిసి వుంటారంట. మంచి పని సమయంలో, మధ్యాహ్న కాలంలో నేను మాత్రమే అక్కడి నుండి తిరిగి వెళ్ళిపోతాను. పూలు పుయ్యని కాలం కూడా కాదది, ఆ పగటి తుమ్మెదలు ఆనందవనిలో నీ కమ్మనైన తేనియలు ఆస్వాదించటానికి మూగాయి. చాలాకాలం నేను మంచి చెడుల గురించి మధనపడుతూ వృధాగా గడిపాను. పనిలేని బాల్యంలో నన్ను పెనవేసుకొని ఆపినవాడు ఇప్పుడు వియ్యమందటం కోసం ప్రేమించి వాత్సల్యంతో పిలుస్తున్నాడు. ఏమి కానున్నానో! ఎందుకో ఈ పిలుపు?

90. మృత్యువు నీ కోసం వచ్చి తలుపులను తడితే కానుకగా నువ్వు ఇవ్వగలిగిన వస్తువు ఏది? బ్రతుకును నే ముందు పెడతాను, ఉత్తి చేతులతో వాడిని పంపను, సత్యం తప్పనటువంటిది. వానాకాలం కోసం, వడగాలి కొట్టే ఎండా కాలపు రాత్రుల కోసం నేను ప్రోగుచేసి కలశాలలో నింపిన ద్రాక్షారసాలను ఇచ్చి మ్రొక్కుతాను.

91. జీవితాంతానికి చిహ్నమా! ఓ మృత్యుదేవా! నా చెవులలో మాట్లాడి పోదువు గాని రా. నీ కోసం ప్రతిరోజు కళ్ళు తెరిచి చూస్తాను. నేను నిన్ను చేరుకునే ప్రయత్నంలో రోజులు లెక్కబెడుతూ జీవితంలో ఎన్నో కష్టసుఖాలను భరించాను. నేను అనేదంతా, నేను తీసుకున్నదంతా, నా కోరికలన్నీ, నా ప్రేమలన్నీ ఇన్నిరోజులు నిను చేరటానికే ఇలా సాగాయి. నీ కళ్ళ

చివరలతో నను చూడవచ్చు. పెళ్ళికూతురి కోసం పూలదండ సిద్ధమైంది, పెళ్ళికాగానే ఆమె పుట్టిళ్ళు విడిచి హాయిగా చీకటిలో భర్తను కలుస్తుంది.

92. నిను ఇలా బంధించే మట్టి కూడా కనిపించని రోజు రానే వస్తుందని నాకు తెలుసు. నా బ్రతుకు తియ్యగా నన్ను విడిచిపోతుంది. కళ్ళపై చిక్కగా చివరి తెర పడగలదు. రాత్రంతా ఉండే చుక్కలు కాపలా కాస్తుంటాయి. పూర్వకర్మలలాగా ప్రొద్దు పొడుస్తుంది. సముద్రపు అలలలాగా కాలం కష్టసుఖాలను వెదజల్లుతుంది. కాలపు హద్దు ముక్కలవ్వగా నేను తుదిఘడియను ఊహిస్తున్నాను. రక్షణే లేని పెన్నిధి లాగా ఈ విశ్వాన్ని నేను చూస్తాను. మరణ దీపం వెలుగులను చల్లుతుంది. నేను కోరుకున్నవి, పొందలేనివి పోనీ నేను ఆశపడను. కళ్ళు విప్పి చూడకుండానే చాలా చులకనగా నేను వదిలిన దానిని పొందగలిగితే చాలు.

93. వెళ్ళటానికి సెలవైంది, తమ్ములా! మిమ్మల్ని అందరినీ వదిలి నమస్కరించి పోతాను. ఇంటి తాళపు చెవి మీకిచ్చి పోతాను. ఈ రోజు ఉదయమైంది, నా ఇంటిలో చిన్న దీపం ఆరింది. స్వాగతం అందింది నేను సాగిపోతాను ఇంక.

94. మిమ్మల్ని వదిలి నేను వెళ్ళే సమయంలో నా ప్రాణసఖులారా! శుభమని పలుకండి. సూర్యుడి వెలుతురులో ఆకాశం నిండింది. కన్నుల పండుగగా దారి కనిపిస్తుంది. ఇష్టంగా నీవు అక్కడకు ఏమి తీసుకెళతావని భావించి మీరు నన్ను అడుగకూడదని వేడుతున్నాను. నేను ఏదో తీసుకెళతానని భావించి ఏమీ తీసుకోకుండానే వెళుతున్నాను. పెళ్ళిదండలతో వెళ్ళాలని కోరుకున్నాను, కాషాయం కట్టి వెళతానని ఊహించలేదు. పదివేల ప్రమాదాలు దారిలో కలిగినా భయమనేది లేకుండా పట్టుదలతో ప్రయాణిస్తాను. ప్రయాణం ముగిసే సమయంలో రేచుక్క పొడుస్తుంది. నా శ్రమంతా పోయేవిధంగా రాజ భవన ద్వారం నుండి సంధ్యారాగాలు వినిపిస్తాయి, చెవులకు ఇంపుగా నేను వింటాను.

95. ప్రపంచంలో నా బ్రతుకు పొలిమేరలను విడిచిపోవటం ఎప్పుడో నేను చెప్పలేను. అడవిలో అర్ధరాత్రిలో విచ్చే మొగ్గ అనే విధంగా రహస్యంగా నన్ను మాయలో విచ్చుకొనేటట్లు చేసిన శక్తి ఎలాంటిదో ఏమో! తెల్లవారి మేల్కొని చూడగా నేను ఈ భూమికి అపరిచితుడను కాను అనే సత్యం తెలుసుకున్నాను. బ్రతుకు తియ్యగా ఉంటుందని భావిస్తున్నాను కనుక మరణాన్ని కూడా నేను మన్నించగలను.

96. మట్టిని వదిలి నేను పోయే సమయంలో చెవులు విప్పివింటే ఇహంతో నేను చూచిందంతా అసమానమని చెప్పిపోతాను. వెలుగు సముద్రం మధ్యలో విచ్చిన కమలం మధ్యలో దాగిన తేనెనంతా నేను తాగి ధన్యుడనైతిని ఈ భూమిపై అనే మాటే చివరి మాటగా ఉండనీ. ఎన్నో రూపాలు ఈ ఆటస్థలంపై ఆడగా నేను అలాగే ఆడి జన్మఫలాన్ని పూర్ణంగా పొందాను. స్పర్శకే అందని వాడి స్పర్శ పొంది శరీరమంతా పులకించగా నేను పవిత్రుడినయ్యాను. అలాంటి సుఖంలో చావు కలిగినా చల్లగా దానిని స్వీకరిస్తాననే మాటనే చివరి మాటగా ఉండనీ.

97. గానాల భావాలు నేను చూడలేకున్నాను, యంత్రంలాగా నా గొంతు ఆ పాటలో కలిసి పాడింది, హృదయం మాట్లాడింది. అలాంటి ఆటస్థలం వదిలిపోవటానికి ఈ రోజు నా దృష్టికి చూపు వచ్చింది.

98. బ్రతుకు బంధాలన్నీ కట్లు ఊడిపోతాయి. తుమ్మెదలు ఝుర్రుకోగా ఏదో ఒకరోజు కమలం తేనెలేనిది కావలసిందే, ఈ రోజుకాకపోతే రేపు. ఎక్కువకాలం గుండెలోనే తేనెలను దాచుకొని ముడుచుకొని ఉండటం ఎలా విచ్చుకుండా మొగ్గగానే!

99. నా స్థలం వదిలిపోవటానికి నా స్వామి! సమయమైంది. ఈ ప్రదేశంలోలో ఒక మాటైనా మాట్లాడకయే నీ భాగ్యమని నేను తృప్తిపడి ఉన్నాను.

100. కడలిలో సత్యమనే లోతులలో చక్కగా మునిగి, రూపమే లేని ముత్యాన్ని పొందాలి. చావన్నదే లేని చావు చావాలని నా మనసు తొందర పడుతుంది. ఎంత లోతుకు దిగినా అంతం కనిపించని మహా సముద్రం దగ్గర, నీ కొలువుకూటంలో, నిశ్శబ్ద తంత్రులతో పొంగే సంగీతం నుండి నా బ్రతుకు వీణను నేను అందుకుంటాను.

101. స్వామి ! నిన్ను చేరే సాధనంగా శ్రావ్య సంగీతాన్ని తీసుకున్నాను, అదే నన్ను ఇంటింటికి వెళ్ళనిచ్చింది. నా యాత్ర ముగిసిన తర్వాత చివరకు రోజు చివరిలో నన్ను ఆశ్చర్యపరుస్తూ దివ్యభవన ద్వారం దగ్గర నిలిపింది.

102. పదుగురికి గర్వభావం కలుగగా నేను సమాధానం చెప్పలేనని చెప్పి పొమ్మంటాను, ఇంతేనా అని వారు నన్ను అసహ్యించుకుంటారు. వారు నవ్విపోతారు నన్ను చులకనగా చూచి, చిరునవ్వులతో నువ్వు నా దగ్గర ఉండి వినుచుండగా!

103. పంచేంద్రియాలను నీ ముందు చక్కగా పరిచి నీ పాదాలను అంటే ఈ విశ్వాన్ని తాకనీ విశ్వేశ్వరా, ప్రభూ!

## 1.4. ఆధార గ్రంథాలు:

1) గీతాంజలి – శంకరంబాడి సుందరాచారి.

**– ఆచార్య ఇరపని మాధవి.**

## పాఠం - 2

# గీతాంజలి

**- శంకరంబాడి సుందరాచారి**

### కఠిన పదాలకు అర్థాలు, సందర్భ సహిత వ్యాఖ్యలు

**విషయ క్రమం:**

**2.0. పాఠ్యభాగ లక్ష్యం**

**2.1. కఠిన పదాలకు అర్థాలు**

**2.2. సందర్భ సహిత వ్యాఖ్యలు**

### 2.0. పాఠ్యభాగ లక్ష్యం:

"గీతాంజలి" పాఠ్యభాగంలోని కఠిన పదాలకు అర్థాలను తెలిపి, సందర్భసహిత వ్యాఖ్యలను వివరించటం.

### 2.1. కఠిన పదాలకు అర్థాలు:

మోదం = సంతోషం

అతి కర్కశములు = మిక్కిలి కఠినమైనవి (దయలేనివి)

జలధి = సముద్రం

పులుగు = పక్షి

సౌఖ్యం = సుఖం

నిర్ఝరీపాతం = సెలయేరు

ఎలుగు = గొంతు

అనిశమ్ము = నిరంతరం

సుంత = కొంత

గ్రీష్మము = వేసవి

గవాక్షమ్ము = కిటికి

తేటు = తుమ్మెద

తామసం = ఆలశ్యం / తమోగుణం

వన్నె = రంగు

మేలిమి = నాణ్యమైన

శంకించి = అనుమానించి

అవని = భూమి

మాతృ ధాత్రి = జన్మభూమి

మాతరో = ఓ అమ్మా

జిలుగు = పలుచని వస్త్రం

కలుషితం = మలినం, మురికి

దరి = గట్టు

రొంపి = బురద

పగిది = విధం

పూతోత్తరీయం = శుభ్రమైన వస్త్రం

పోనాడి = విడిచి

చేయూత = సహాయం

ఆర్తరవమ్ము = దుఃఖ స్వరం

దీర్ఘవాసరము = పొడవైన రోజు

మిన్ను = ఆకాశం

మానసం = మనసు

తారాడు = తిరుగు

వేగిరపడు = తొందరపడు

అనిత్యాలు = అశాశ్వతాలు

వాంఛలు = కోరికలు

కూపం = నుయ్యి

వసుధ = భూమి

రిత్త = వట్టి

ప్రత్యుషః పవనాలు = సూర్యోదయ కాలంలోని గాలులు

పసిడి వీణియ = బంగారపు వీణ

అనివార్యం = తప్పనిసరి

వారించి = నివారించి

వలపు = ప్రేమ / కామం

కడ = చివర

మదియించు = ఎక్కువవ్వు

ఒంటిగా = ఒంటరిగా

తెగడి = నిందించి

మోము = ముఖం

ముంగల = ముందు

నిశివేళ = రాత్రి సమయం

అంధకారం = చీకటి

ఝంఝానిలమ్ము = వానగాలి

నొల్లకయున్న = అంగీకరించక

నికుంజం = పొదరిల్లు

ఆవహించి = ఆక్రమించి

కలత = దిగులు

సౌరభము = సువాసన

పురికొల్పె = మేలుకొలిపె

దఱియనైనది = దగ్గరపడింది

మధురిమ = తీపి

మర్మమ్ము = రహస్యం

విరులు = పూలు

కడలి = సముద్రం

తరగ = అల

అనిలమ్ము = గాలి

సడి = శబ్దం

పట్టులో = ప్రదేశంలో / స్థానంలో

గగనం = ఆకాశం

స్వప్నం = కల

కాళనిశి = నల్లటి చీకటి

దివి = స్వర్గం

విపినం = అడవి

ప్రసవమ్ము = పువ్వు

పాటు = కష్టం

ముదం = సంతోషం

అప్రమత్తుడు = జాగరూకత కలవాడు

అలమట = అలసట, బాధ

అన్యాలు = ఇతరాలు

కుడ్యం = గోడ

సతతం = ఎల్లప్పుడు

తమసమ్ము = చీకటి

నిర్జేయము = జయించలేని

తునుక = ముక్క

బహుముఖమ్ముల = అనేక విధాల

విద్యుల్లతా దీప్తి = మెరుపు తీగ వెలుగు

ధరణి = భూమి

కరుణాంబుధం = దయ అనే బిందువు

అబ్బురం = ఆశ్చర్యం

మెరవణులు = అతిశయాలు

స్వనం = ధ్వని

వాగ్దత్తం = వాగ్దానం

అహరహమ్ము = ప్రతి రోజు

ప్రభలు = వెలుగులు

విహగ గానా రవ వీచికలు = పక్షులగానాలాపాలు

నీరధి = సముద్రం

ప్రోవులు = కుప్పలు

జలదాలు = మబ్బులు

గరిక = గడ్డి

గద్దియ = సింహాసనం

ఉర్వి = భూమి

సత్వరం = వెంటనే

అనలమ్ము = అగ్ని

కరవాలము = కత్తి

నీరమ్ము = నీరు

మస్తకము = తల / నుదురు

సైకతభూమి = ఇసుక నేల

తృష్ణ = దాహం

అంశుకం = వస్త్రం

చెలువు = అందం

పరవిపోయిన = పరిచిన

సస్య = పంట

పయనం = ప్రయాణం

కెందమ్మి = ఎర్ర తామర

సన్నలు = గుర్తులు / సూచనలు

చదలు = గంగ

తరంగాలు = అలలు

వనధి = సముద్రం

అచ్చరలు = అప్సరసలు

ప్రసనించు = పుట్టు, జనించు

మార్దవ భావమ్ము = సున్నితమైన భావం

పుడమి = భూమి

అఖ్యలు = కోరికలు

చెక్కులు = చెక్కిళ్ళు

పారమ్ము = అవతలి తీరం

పెరవారు = పరాయివారు

ఉవిద = స్త్రీ

సుధ = అమృతం

ఆనుచుండుట = ఆస్వాదించుట

అంతరాళం = అంతరంగం

శత సహస్రాలు = వందలు వేలు

నభోభాగం = ఆకాశ భాగం

మిణికినవి = మెరిసినవి

తారకలు = నక్షత్రాలు

రిక్క = నక్షత్రం

నాసం = ముక్కు

సమయు = నశించు

కార్ముకమ్ములు = విల్లులు

తాకు = దెబ్బ

మిత్తి = మృత్యువు

విరిదండ = పూమాల

ఏవగింతురు = అసహ్యంచుకుంటారు

రాగఫణుతులు = రాగాలలోని పలుకులు

వినతమై = వినయంతో.

## 2.2. సందర్భ సహిత వ్యాఖ్యలు:

**1. యుగము లేగినగాని ముగియదు నీపోత**

పరిచయం: ఈ వాక్యం "మా తెలుగు తల్లికి మల్లెపూదండ" గీత రచయిత ప్రసన్నకవి శంకరంబాడి సుందరాచారిగారు రచించిన "గీతాంజలి" నుండి గ్రహించబడింది.

సందర్భం: అనేక సార్లు ఈ ఖాళీపాత్రను బోర్లించి భగవంతుడు నవజీవనం పోసి నింపుతున్నాడని, తనను అనంతుడిని చేశాడని కవి భావించే సందర్భంలోనిదీ వాక్యం.

వివరణ: అమృతమయమైన నీ చేతుల స్పర్శతో చిన్ని గుండె ఆనందంతో ఉప్పొంగి ఏమేమో పలికింది. అనంతమైన నీ చేతి కానుకలు తీసుకోవటానికి రెండు చేతులే ఉన్నాయి. నీవు పోసే పోత యుగాలు గడిస్తే కాని పూర్తికాదు, ఇంకా పోయగలిగింది పోస్తూనే ఉంటావు.

**2. ప్రభువైన నిన్ను నేను ప్రాణసఖా యందు**

పరిచయం: ఈ వాక్యం "మా తెలుగు తల్లికి మల్లెపూదండ" గీత రచయిత ప్రసన్నకవి శంకరంబాడి సుందరాచారిగారు రచించిన "గీతాంజలి" నుండి గ్రహించబడింది.

సందర్భం: ప్రభువు తనను పాడమనగా ఆనందంతో పరవశిస్తూ పాడుతూ కవి మైరచిన సందర్భంలోనిదీ వాక్యం.

వివరణ: నే పాట పాడితే నువ్వు ఇష్టపడతావని నీ ముందు పాటగాడిగా నిలిచాను. నా పాట విప్పుకొనిన రెక్క నేను తాకలేని నీ పాదాలను తాకుతుంది. ఆలాపించే సుఖంలో మైమరచిన నేను నా ప్రభువైన నిన్ను ప్రాణస్నేహితుడా అని పిలుస్తాను.

**3. చక్కగను నుంచెదను సతతమ్ము తలపులను**

పరిచయం: ఈ వాక్యం "మా తెలుగు తల్లికి మల్లెపూదండ" గీత రచయిత ప్రసన్నకవి శంకరంబాడి సుందరాచారిగారు రచించిన "గీతాంజలి" నుండి గ్రహించబడింది.

సందర్భం: శరీరంపై ఆ దేవుడి చేతుల స్పర్శను, హృదయంలో ఆ దేవుడిని అనుభూతి చెందిన కవి ఎప్పుడూ తాను పవిత్రంగా ఉంటానని భగవంతుడికి చెప్పే సందర్భంలోనిదీ వాక్యం.

వివరణ: మంచి చెడులను తెలుసుకోగలిగే తెలివి అనే దీపాన్ని మనసులో వెలిగించింది నీవని తెలిసి స్వామి! నా ఆలోచనలను ఎప్పుడూ అసత్యం అంటకుండా ఉంచుతాను. నా హృదయ సింహాసనం మీద కూర్చుంటావని నా హృదయంలోని అన్ని చెడులను తొలగించటానికి ప్రయత్నిస్తాను.

**4. నీవు నా యెదుట – నేను నీ యెదుట**

పరిచయం: ఈ వాక్యం "మా తెలుగు తల్లికి మల్లెపూదండ" గీత రచయిత ప్రసన్నకవి శంకరంబాడి సుందరాచారిగారు రచించిన "గీతాంజలి" నుండి గ్రహించబడింది.

సందర్భం: ఆ భగవంతుడి సాహచర్యాన్ని అనుభవించిన కవి ఎడబాటు ఓర్చలేక దేవుడి ముందు! తన పాట పాడాలని కోరుకునే సందర్భంలోనిదీ వాక్యం.

వివరణ: ఒక క్షణమైనా నన్ను నీ దగ్గర ఉండనివ్వు. నిన్ను చూడక ఉన్న క్షణమైనా మనసు విసిగిపోతుంది. నిశ్శబ్దమైన ఈ విరామ సమయంలో నీ చెవికి ఇంపుకలిగించే విధంగా నా జీవితాంకిత పదం పాడేటందుకు కనుమూసి కూర్చొండే కాలమిదిరా! నీవు నా ఎదురుగా – నేను నీ ఎదురుగా.

**5. వన్నె మేలిమి లేదు, వాసనయు పలుచనే**

పరిచయం: ఈ వాక్యం "మా తెలుగు తల్లికి మల్లెపూదండ" గీత రచయిత ప్రసన్నకవి శంకరంబాడి సుందరాచారిగారు రచించిన "గీతాంజలి" నుండి గ్రహించబడింది.

సందర్భం: పూజకోసం చిన్ని పువ్వును కోసుకుపొమ్మని కవి దేవుడికి చెప్పే సందర్భంలోనిదీ వాక్యం.

వివరణ: ఈ పువ్వు నీ పూలదండలో చేరకపోయినా నీ గోటి గిల్లు చాలు దీనికి. పగలు గడిస్తే పూజవేళ తప్పిపోతుందని భయపడతాను. ఈ పువ్వుకు నాణ్యమైన రంగు లేదు, వాసన కూడా తక్కువే. అయినా దీనిని నీపూజ కోసం వాడుకో, సమయముండగానే పువ్వు కొయ్యి నా రాజా!

**6. జిలుగు సంకెళ్ళలో ఫలము లేనే లేదు**

పరిచయం: ఈ వాక్యం "మా తెలుగు తల్లికి మల్లెపూదండ" గీత రచయిత ప్రసన్నకవి శంకరంబాడి సుందరాచారిగారు రచించిన "గీతాంజలి" నుండి గ్రహించబడింది.

సందర్భం: పసిపిల్లలకు నాజూకు దుస్తులు వేసి వారికి ఆటలలోని వినోదాన్ని దూరం చేస్తున్న తల్లులకు కవి సందేశమిచ్చే సందర్భంలోనిది వాక్యం.

వివరణ: రాజకుమారులు ధరించే నాజూకు దుస్తులతో పసిపిల్లలను బంధిస్తే వారు దుస్తులు మాస్తాయని ఆడుకోవటానికి సాహసించరు. భూమి మీద ఉండే ఆరోగ్య రేణువులను తాకనివ్వకుండా వారిని ఇంటిలోనే మూసివుంచి వారి సర్వసహజమైన హక్కును దోచచూస్తున్నావా అమ్మా! సూక్ష్మమైన నాణ్యమైన వస్త్రాల వలన ఫలితం ఏమి లేదు.

**7. నీ యింట గడపనే నిలిచి యాచింతువా?**

పరిచయం: ఈ వాక్యం "మా తెలుగు తల్లికి మల్లెపూదండ" గీత రచయిత ప్రసన్నకవి శంకరంబాడి సుందరాచారిగారు రచించిన "గీతాంజలి" నుండి గ్రహించబడింది.

సందర్భం: అన్నీ ఇచ్చేది భగవంతుడే, ఆ భగవంతుడిని కోరికలు కోరటం అవివేకమనే భావన ధ్వనింపజేసే పలుకులు కవి చెప్పే సందర్భంలోనిదీ వాక్యం.

వివరణ: నీ వీపు మీదనే నిను మోసుకోవాలనుకుంటావా? ఏమి ప్రయత్నాలు ఈ మాత్రం తెలివి లేదా? నీ ఇంటి వాకిటిలోనే నిలిచి యాచిస్తావా? బిచ్చగాడా! ఏమి పిచ్చి కోరికలురా! అన్నిటిని మోయగల ఆ స్వామికి నీ భారం అందివ్వు. అతికలుషితమైన ఆ చేతి కానుకలను అందుకోవద్దు. అది పాపమవుతుంది.

**8. ఈ ధ్యానమేలరా ! యీవలకు రమ్మురా!**

పరిచయం: ఈ వాక్యం "మా తెలుగు తల్లికి మల్లెపూదండ" గీత రచయిత ప్రసన్నకవి శంకరంబాడి సుందరాచారిగారు రచించిన "గీతాంజలి" నుండి గ్రహించబడింది.

సందర్భం: కవి ముక్తి అంటే ఏమిటో, దేవుడు ఎక్కడున్నాడో తెలిపే సందర్భంలోనిదీ వాక్యం.

వివరణ: మంత్ర తంత్రాలు, పాటలు ఇవన్నీ పనికిరావు. మూలన కూర్చుని ఎవరిని కొలుస్తున్నావురా? నీ స్వామి అక్కడ లేడు. కష్టపడేవారైన రాళ్ళు కొట్టేవారు, దారులు చేసేవారి పక్కనున్నాడు. వారితో కలిసి కష్టించు, ఈ ధ్యాన మెందుకు ? ఇవతలకు రారా! కష్టించేవారికి సహాయం అందివ్వు.

**9. తట్టవలె ప్రతియింటి తలుపును తన యిల్లు**
**చేరదలచిన బాటసారి తప్పని సరిగ**

పరిచయం: ఈ వాక్యం "మా తెలుగు తల్లికి మల్లెపూదండ" గీత రచయిత ప్రసన్నకవి శంకరంబాడి సుందరాచారిగారు రచించిన "గీతాంజలి" నుండి గ్రహించబడింది.

సందర్భం: ఎవరిదైనా స్వంత ఇల్లు దేవుడి నిలయమే అది హృదయమే. ఆ ఇల్లు చేరటానికి ఎంతో కష్టమైన దారులలో బాటసారి ప్రయాణించాలి అని నర్మగర్భంగా కవి చెప్పే సందర్భంలోనిదీ వాక్యం.

వివరణ: చాలా దూరమనిపించే దారి నీ దగ్గరకు రావాలి అనుకునేవారికి దగ్గరిదారి అనిపిస్తుంది. తన ఇల్లు చేరుకోవాలి అనుకునేవాడు ప్రతి ఇంటి తలుపును తట్టాలి. బాహ్య ప్రపంచాలన్ని చుట్టిన తర్వాతనే గర్భగృహంలోకి వెళ్ళగలడు.

**10. ఇకనైన నేను లోని కేగనౌనా స్వామి!**

పరిచయం: ఈ వాక్యం "మా తెలుగు తల్లికి మల్లెపూదండ" గీత రచయిత ప్రసన్నకవి శంకరంబాడి సుందరాచారిగారు రచించిన "గీతాంజలి" నుండి గ్రహించబడింది.

సందర్భం: దేవుడిని చూడటం కోసం వేచిన కవి పిలుపునందుకొన్న తర్వాత వేగిరపడే సందర్భంలోనిదీ వాక్యం.

వివరణ: విశ్వోత్సవంలో పాడమని పిలుపందింది, నా పతితజీవనం పావనమైంది. పాడనున్నారు, పాడగలిగినంత పాడాను. ఇంకనేను లోపలికి రావచ్చా స్వామి! ఇకనైనా నీ ముఖం చూడవచ్చా? శాంతి పూజలు ఇకనైనా చేయవచ్చా!

**11. తగదు, దోషము లేదు తప్పు వారిది కాదు**

పరిచయం: ఈ వాక్యం "మా తెలుగు తల్లికి మల్లెపూదండ" గీత రచయిత ప్రసన్నకవి శంకరంబాడి సుందరాచారిగారు రచించిన "గీతాంజలి" నుండి గ్రహించబడింది.

సందర్భం: భగవంతుడికి ఆత్మార్పణ చేయాలని కవి భావిస్తే లోకంలోని పదుగురు కవిని బంధించదలచారని, అవమానపరచారని లోకం తీరు కవి చెప్పే సందర్భంలోనిదీ వాక్యం.

వివరణ: నీతి నియమాలతో నిలిపి నను బంధించాలని పదుగురు కోరారు. నేను వారికి లొంగక, వారించి పంపివేస్తాను. అతడి చేతులలో పడాలని నేను వేచి వుంటాను కనుక వారి మాటలను లక్ష్యపెట్టను. ప్రజలందరూ నను నిందిస్తూ మాట్లాడతారు, వారిని ఖండించాలని నేను భావించకూడదు. దోషం లేదు, తప్పు వారిది కాదు.

**12. నా హృదయ గర్భమ్ము నందె యా పరిశుద్ధ**

**మధురిమలు పూచెనను మర్మమ్ము మఱచితిని**

పరిచయం: ఈ వాక్యం "మా తెలుగు తల్లికి మల్లెపూదండ" గీత రచయిత ప్రసన్నకవి శంకరంబాడి సుందరాచారిగారు రచించిన "గీతాంజలి" నుండి గ్రహించబడింది.

సందర్భం: దక్షిణపు గాలిలో కలిసి ఒక వింతైన సౌరభం కవి హృదయాన్ని తాకగా ఆ సువాసన ఎక్కడనుంచి వస్తుందో కవి గ్రహించి హృదయంలోనే భగవంతుడున్నాడనే భావం అంతర్భావంగా కవి చెప్పే సందర్భంలోనిదీ వాక్యం.

వివరణ: అవ్యక్త మధురమైన పరిమళం అంతరంగంలో ఆశలను మేలుకొల్పింది. ఆ వాసనే వేసవి ముగిసే సమయంలో విడిచే నిట్టూర్పని తెలుసుకున్నాను. అలాంటి కాలం సమీపించిందని నాకు తెలియదు, నేను అనుభవించదగినదది అని తెలియదు. ఆ పవిత్రమైన మధురిమలు నా హృదయంలోనే ఉదయించాయనే మర్మం నేను మరిచాను.

**13. బ్రతుకుదారులుఁ జూపి రక్షించరా దొరా!**

పరిచయం: ఈ వాక్యం "మా తెలుగు తల్లికి మల్లెపూదండ" గీత రచయిత ప్రసన్నకవి శంకరంబాడి సుందరాచారిగారు రచించిన "గీతాంజలి" నుండి గ్రహించబడింది.

సందర్భం: భగవంతుడిని దయచూపమని, బాటసారిని నడుపమని కవి అడిగే సందర్భంలోనిదీ వాక్యం.

వివరణ: రక్షించే చీకటి తల్లి ఒడిలో దాగి మళ్ళీ తిరిగి పూయగలిగిన పువ్వులాగా అలిసి, దుస్తులు చిరిగి, పైకి వెళ్ళే శక్తి నశించి బాధతో ప్రయాణం చేస్తున్న బాటసారిని సిగ్గుపడని రీతిలో నడిపించు, క్రొత్త బ్రతుకుదారులను చూపించి దొరా! రక్షించరా.

**14. మహతీ నినాదముల మాఱు మ్రోగుచునుండ**

పరిచయం: ఈ వాక్యం "మా తెలుగు తల్లికి మల్లెపూదండ" గీత రచయిత ప్రసన్నకవి శంకరంబాడి సుందరాచారిగారు రచించిన "గీతాంజలి" నుండి గ్రహించబడింది.

సందర్భం: స్వామే స్వయంగా వచ్చి కవి దగ్గర కూర్చునప్పుడు కవి తన పరిస్థితిని చెప్పుకుంటున్న సందర్భంలోనిదీ వాక్యం.

వివరణ: నా స్వామియే వచ్చి నా దగ్గర కూర్చోగా ఎందుకనో నేను కళ్ళు తెరవలేకపోయాను. పాపిష్ఠి మనసా! పాడు నిద్ర ఎందుకు? చేతిలో వీణతో చీకటిలో స్వామి నా కలలన్నీ మహతీనినాదాలుగా మారు మ్రోగుతుండగా నా చెంతకురాగా నిద్రపై ఎవరి నిట్టూర్పు ప్రాకుతుందో వానినే చూడలేక వదిలిపెడుతున్నాను.

**15. భయముతో నిన్నడుగు పాపానఁ బడ నేను**

పరిచయం: ఈ వాక్యం “మా తెలుగు తల్లికి మల్లెపూదండ” గీత రచయిత ప్రసన్నకవి శంకరంబాడి సుందరాచారిగారు రచించిన “గీతాంజలి” నుండి గ్రహించబడింది.

సందర్భం: కోరికలనే బంధాలతో భగవంతుడు కట్టివేస్తాడనే విషయం తెలిసిన కవి దేవుడిని ఏమీ కోరలేకున్నానని చెప్పే సందర్భంలోనిదీ వాక్యం.

వివరణ: నన్ను కప్పివుంచినవన్నీ మట్టి, మరణమే, వాటిని వద్దంటూనే కోరుకుంటాను. అంతరంగంలో ఊపిరి పోసుకుంటున్న ఓటములు. అప్పులు, అవమాన భారాలు ఎప్పుడూ నన్నింటి వుండి బాధపెడుతున్నా నిన్ను అడిగితే మంచిని ఇస్తావనే భయంతో నిన్ను అడిగే పాపంలో పడను నేను.

**16. కడు సిగ్గు పడెద నీ కడచేర వీనితో**

పరిచయం: ఈ వాక్యం “మా తెలుగు తల్లికి మల్లెపూదండ” గీత రచయిత ప్రసన్నకవి శంకరంబాడి సుందరాచారిగారు రచించిన “గీతాంజలి” నుండి గ్రహించబడింది.

సందర్భం: నేను అనే భావం అహంకారంతోనే జనిస్తుంది. అటువంటి నేను కలిసి దేవుడిని చేరటానికి సిగ్గు పడతానని కవి చెపుతూ అన్యాపదేశంగా అహంకారం వీడితేనే దైవ దర్శనం కలుగుతుందనే సందేశం ఇచ్చే సందర్భంలోనిదీ వాక్యం.

వివరణ: శబ్దంలేని చీకటితో దాగుకొని నా వెంట నన్ను వదలకుండా నడుస్తున్నాడెవరో. బిగ్గరగా మాట్లాడతాడు, కళ్ళల్లో దుమ్ముకొడతాడు. మానావమానాలు లేని వింత మనిషి వాడు, ‘నేను’ అనే చిన్నవాడు వాడు. వాడితో కలిసి నీ దగ్గరకు రావటానికి ఎక్కువ సిగ్గుపడతాను.

**17. నేనే దీనిని చాలా నేర్పుతోఁ జేసితిని**

పరిచయం: ఈ వాక్యం “మా తెలుగు తల్లికి మల్లెపూదండ” గీత రచయిత ప్రసన్నకవి శంకరంబాడి సుందరాచారిగారు రచించిన “గీతాంజలి” నుండి గ్రహించబడింది.

సందర్భం: కవి తనను కట్టిన సంకెళ్ళను ఎవరు చేశారు అని ఆలోచిస్తూ కర్మలనే సంకెళ్ళను ఎవరికి వారే బిగించుకుంటారనే అంతర్గత అర్థాన్ని తెలియజేసే సందర్భంలోనిదీ వాక్యం.

వివరణ: నిద్రరాగా నా స్వామి కోసం ఏర్పాటు చేసిన పడకపైనే పడుకొని నిద్రపోయాను. మేలుకొని చూస్తే గట్టి సంకెళ్ళతో బంధింతుడనై వున్నాను. ఈ సంకెళ్ళను ఎవరు చేశారో తెలియగోరుతున్నాను. నేనే దీనిని చాలా నైపుణ్యంతో చేశాను. పగలూ రాత్రనక కష్టపడి ఈ సంకెళ్ళు చేశాను.

**18. వేచియుండును నాదు ప్రేమకై నీ ప్రేమ**

పరిచయం: ఈ వాక్యం “మా తెలుగు తల్లికి మల్లెపూదండ” గీత రచయిత ప్రసన్నకవి శంకరంబాడి సుందరాచారిగారు రచించిన “గీతాంజలి” నుండి గ్రహించబడింది.

సందర్భం: భగవంతుడిని భక్తుడు చేరేవరకు దేవుడు అతడి కోసం ఎదురుచూస్తుంటాడనే సత్యాన్ని నర్మగర్భంగా కవి తెలిపే సందర్భంలోనిదీ వాక్యం.

వివరణ: ఈ భూమిపై నను వలచే వారందరూ నన్ను తమతో ఉంచుకోవాలని కష్టపడుతున్నారు. వారికంటే ఎక్కువగా నను ప్రేమించే నువ్వుమాత్రం నన్ను స్వేచ్ఛగా వదులుతావు. రోజులు గడుస్తున్నా కళ్ళకు కనిపించవు, నా దగ్గరకు రావు. నేను పూలతో అర్చించి పూజించకపోయినా, నా హృదయంలో నీకు చోటివ్వకపోయినా నీ ప్రేమ నా ప్రేమ కోసం ఎదురు చూస్తుంటుంది.

**19. ధాత్రి మేల్కొనుగాత ధన్యాతి దన్యయై**

పరిచయం: ఈ వాక్యం "మా తెలుగు తల్లికి మల్లెపూదండ" గీత రచయిత ప్రసన్నకవి శంకరంబాడి సుందరాచారిగారు రచించిన "గీతాంజలి" నుండి గ్రహించబడింది.

సందర్భం: ఆ భగవంతుడే స్వయంగా ప్రజలను నడిపించదలచినప్పుడు మాతృభూమి ధన్యమౌతుందని కవి చెప్పే సందర్భంలోనిదీ వాక్యం.

వివరణ: మాటలు సత్యగర్భం నుంచి వెలువడినప్పుడు, చెడ్డ అలవాట్లలో పడనప్పుడు, నిర్మల భావాలతో స్వాంతాన్ని ముందుకు నడుపటానికి స్వామి నువ్వే పూనుకున్నప్పుడు, స్వాతంత్ర్య స్వర్గ సౌభాగ్య వీధులలో జన్మభూమి ధన్యాతిధన్యయై మేల్కొంటుంది.

**20. బలగర్వ మూర్తులౌ కలవారలకు మ్రొక్కి**

పరిచయం: ఈ వాక్యం "మా తెలుగు తల్లికి మల్లెపూదండ" గీత రచయిత ప్రసన్నకవి శంకరంబాడి సుందరాచారిగారు రచించిన "గీతాంజలి" నుండి గ్రహించబడింది.

సందర్భం: అందరిపట్ల సమదృష్టి కలిగి ఉండటమే భగవంతుడి తత్వమని, ఆ దివ్యశక్తిని తనకివ్వమని దేవుడిని కవి ప్రార్థించే సందర్భంలోనిదీ వాక్యం.

వివరణ: కష్టసుఖాలకు లొంగని సత్త్వగుణాన్ని ఇవ్వరా! బలగర్వితులైన ధనవంతులకు మ్రొక్కుతూ, బలహీనులైన పేదవారినందరినీ త్రొక్కాలనే ఆలోచనలను వదిలే బలమివ్వరా! నీ దివ్యశక్తులు నాకు కలిగేటట్లు సహాయం చేయరా!

**21. కనుముందు క్రొత్త లోకమ్ములు కనిపించు**

పరిచయం: ఈ వాక్యం "మా తెలుగు తల్లికి మల్లెపూదండ" గీత రచయిత ప్రసన్నకవి శంకరంబాడి సుందరాచారిగారు రచించిన "గీతాంజలి" నుండి గ్రహించబడింది.

సందర్భం: భగవంతుడి గురించిన పరమార్థాన్ని తెలుసుకున్నానని కవి చెప్పే సందర్భంలోనిదీ వాక్యం.

వివరణ: అంతులేని నా శక్తి అంతరించినప్పుడు, ముందు దారి మూయబడినప్పుడు, తినుబండారాలు అయిపోయినప్పుడు నా యాత్ర ముగిసిందని భావించినప్పుడు పరమార్థాన్ని చూశాను. పాత దారులు కనిపించకుండా ఉంటే వేయి వింతలతో, వివిధ శక్తులతో కళ్ళముందు క్రొత్త లోకాలు కనిపిస్తాయి.

**22. కరుణాంబుదం బొండు ధరణికి దిగిరాని**

పరిచయం: ఈ వాక్యం "మా తెలుగు తల్లికి మల్లెపూదండ" గీత రచయిత ప్రసన్నకవి శంకరంబాడి సుందరాచారిగారు రచించిన "గీతాంజలి" నుండి గ్రహించబడింది.

సందర్భం: కరువు సమయంలో వర్షం ఆగమనాన్ని వాంఛిస్తూ కవి భగవంతుడిని వేడుకొనే సందర్భంలోనిదీ వాక్యం.

వివరణ: నిశితమై, క్రూరమై, నిశ్చలమై గుండె కాల్చే మూగ ఎండలకు ఓర్చుకోగలిగే శక్తి నా దగ్గర లేదు, దానిని ఆర్పరా! తండ్రి కోపం చూపిస్తే ఆ సమయంలో కన్నీళ్ళతో చూచే తల్లిలాగా ఆకాశం పై నుండి దయా వర్షం భూమికి దిగిరానివ్వు,

**23. నీతోడ పయనమై నే నరుగుచున్నట్లు**

పరిచయం: ఈ వాక్యం "మా తెలుగు తల్లికి మల్లెపూదండ" గీత రచయిత ప్రసన్నకవి శంకరంబాడి సుందరాచారిగారు రచించిన "గీతాంజలి" నుండి గ్రహించబడింది.

సందర్భం: రథంపై భగవంతుడు వచ్చి కవిని తనతో తీసుకువెళుతున్నట్లు కలగన్నానని కవి చెప్పే సందర్భంలోనిది వాక్యం.

వివరణ: ఆశ్చర్యకరంగా వెలుగు భూమి అంతా పరుచుకోగా, పసిడి పతకాలు బాటసారులు ఆశ్చర్యపోయి దృష్టి మరలించి ఆ దృశ్యాన్ని చూడగా రథంతో వచ్చి దుమ్ములో భూమిపై నన్ను నీవు పైకెత్తి రథంపై దగ్గర కూర్చోబెట్టుకొని చింపి గుడ్డల బిచ్చగత్తెలాగా, వేడిగాలికి ఊరకనే కదలాడే తీగలాగ, శరీరం వణుకుతుండగా నీతో పాటు ప్రయాణమై నేను వెళుతున్నట్లు కలగని ఆ పచ్చికల భూమిపై కూర్చున్నాను, శూన్యం చూస్తున్నాను నీవు ఏదో క్షణంలో ఇక్కడకు వస్తావని తెలియకుండానే.

**24. శాశ్వత చిహ్నములు చక్క ముద్రించితివి**

పరిచయం: ఈ వాక్యం "మా తెలుగు తల్లికి మల్లెపూదండ" గీత రచయిత ప్రసన్నకవి శంకరంబాడి సుందరాచారిగారు రచించిన "గీతాంజలి" నుండి గ్రహించబడింది.

సందర్భం: జీవితంలో భగవంతుడు వేసిన గుర్తులను కవి తల్చుకోగానే దేవుడి కరుణ మదిలో మెదిలే సందర్భంలోనిది వాక్యం.

వివరణ: ఆ రోజు నేను నిన్ను పిలిచి నా ఇంట్లో పూజించి పంప సిద్ధపడిలేను. నాకు తెలియకుండానే నీవు నా హృదయంలో సామాన్యుడిలా ప్రవేశించి క్షణం కూడా నిలువకుండానే బ్రతుకుతో పరుగెత్తే అనేక నిముషాలపై నీ శాశ్వత ముద్రలను చక్కగా ముద్రించావు.

**25. అహరహమ్మును చెంత కరుదెంచుచున్నాడు**

పరిచయం: ఈ వాక్యం "మా తెలుగు తల్లికి మల్లెపూదండ" గీత రచయిత ప్రసన్నకవి శంకరంబాడి సుందరాచారిగారు రచించిన "గీతాంజలి" నుండి గ్రహించబడింది.

సందర్భం: ఆ దేవుడు నిరంతరం తన దగ్గరకొస్తున్నాడని కవి చెప్పే సందర్భంలోనిదీ వాక్యం.

వివరణ: తీవ్రమైన తాపంతో దివ్యమైన సౌరభంతో కూడిన రోజులలో నా స్వామి వనమార్గాలను అంటి వచ్చుచున్నాడురా! ప్రతిరోజు దగ్గరకు వస్తున్నాడు. కలతలపై కలతలు కలుగుతుంటే వాడి పదఘట్టాలే నా హృదయాన్ని అదుముతాయి. ఆ బంగారు అడుగు నన్ను తాకగానే నా ఆనందభావం అనేక చోట్ల వెలుగులు వెదజల్లుతుంది.

**26. నేనె వాడైపోయి వానిలో కలియుదును**

పరిచయం: ఈ వాక్యం "మా తెలుగు తల్లికి మల్లెపూదండ" గీత రచయిత ప్రసన్నకవి శంకరంబాడి సుందరాచారిగారు రచించిన "గీతాంజలి" నుండి గ్రహించబడింది.

సందర్భం: భక్తి భావం పెరిగి భగవంతుడి తత్త్వం అవగతమైన తర్వాత ఆనందాన్ని అనుభూతిచెందిన తర్వాత కవి అద్వైత తత్త్వాన్ని చెప్పకనే చెబుతున్న సందర్భంలోనిదీ వాక్యం.

వివరణ: నిద్రపోయిన నేను పక్షులు పిలిచినా, నా స్వామే వచ్చి లేపినా మేల్కొనలేదు. చీకటులు చీల్చి నా స్వామి కలలాగా కనిపించి చిరునవ్వుల వెలుగులు చిందించనిదే కనులు తెరుచుకోవు. కళ్ళు తెరవగానే వెలుగులాగా నువ్వే నా కళ్ళపడాలి. స్వామి కళ్ళనుంచి కరుణ స్రవంతిలా కరిగి పారింది. నేను మేల్కొని మరల నేనయ్యాను, అయినా నేనే వాడైపోయి వానిలో కలుస్తాను.

**27. ఎత్తులకు పై ఎత్తులు! యేల యీ శోధనలు?**

పరిచయం: ఈ వాక్యం "మా తెలుగు తల్లికి మల్లెపూదండ" గీత రచయిత ప్రసన్నకవి శంకరంబాడి సుందరాచారిగారు రచించిన "గీతాంజలి" నుండి గ్రహించబడింది.

సందర్భం: భగవంతుడు మాయవల విసిరి పరీక్షిస్తాడని, కవి దేవుడి దయవుంటేనే ఆ మాయ దాటగలమని మనం ఎంత ఇస్తే అంతే పొందగలమనే సత్యం కూడా కవి చెప్పే సందర్భంలోనిదీ వాక్యం.

వివరణ: నేను నిలిచిన చోట నీ రథం ఆగింది, నను చూచి చిరునవ్వు నవ్వుతూ దిగావు, నా అదృష్టం పండింది అని చూస్తుండగా నీవు ఏమి ఇస్తావు అని అడిగావు. బిచ్చగాడిని వెదికి బిచ్చమడగటం ఎత్తులకు పై ఎత్తు వేయడమే, ఎందుకీ శోధనలు? ఒక బియ్యపు గింజ చేత పెట్టాను, ఇంటికొచ్చి పాతర బోర్లించగా ఒక బంగారు బియ్యపుగింజ నేలపై పడింది, ఉన్నదంతా ఎందుకివ్వలేదని బాధపడ్డాను.

**28. వాకిళ్ళు కాయనిక, దమ్ముగను నేడువను.**

పరిచయం: ఈ వాక్యం "మా తెలుగు తల్లికి మల్లెపూదండ" గీత రచయిత ప్రసన్నకవి శంకరంబాడి సుందరాచారిగారు రచించిన "గీతాంజలి" నుండి గ్రహించబడింది.

సందర్భం: కవి దేవుడి గురించి ఎదురు చూసి దేవుడిచ్చిన జ్ఞాన ఖడ్గంతో తెలివొందిన సందర్భంలోనిదీ వాక్యం.

వివరణ: నీ మెడలో సన్నజాజుల దండ అడుగుదామనుకుంటే కత్తినే కానుకగా వదిలి వెళ్ళావు. స్వామి! నా యుద్ధాలలో నీవు జయమందుతావు. ఖడ్గమిది పాశాలను ఖండిస్తుంది. కాబట్టి నాకిక కలతలే లేవు. నాకింక ఈ రోజు నుంచి ఏమీ వద్దు. వాకిళ్ళు కాయనింక, ఊరకనే ఏడువను.

**29. మురిపాల మూటగా ముద్దుగా, దీరెదవు**

పరిచయం: ఈ వాక్యం "మా తెలుగు తల్లికి మల్లెపూదండ" గీత రచయిత ప్రసన్నకవి శంకరంబాడి సుందరాచారిగారు రచించిన "గీతాంజలి" నుండి గ్రహించబడింది.

సందర్భం: భగవంతుడి ప్రేమను, దాని గొప్పదనాన్ని కవి స్మరించే సందర్భంలోనిది వాక్యం.

వివరణ: నీ మోదం ఇలాగే నా యెదను నింపింది. నేననే వాడినే లేకపోతే నీ ప్రేమ నిలిచే స్థలమేదిరా! నిఖిలలోక ప్రభూ! నీ సిరులన్నిటికీ భాగస్వామిని చేశావు. నిరంతరం నా హృదయంలో గజ్జెలు కట్టి ఆనంద తాండవం ఆడుచున్నావు నువ్వు. రారాజువైనప్పటికీ నన్నులోగొనగ మురిపాల మూటగా ముద్దుగా తీరెదవు.

**30. ఆనందమునకు నిక యంతుపొంతే లేదు**

పరిచయం: ఈ వాక్యం "మా తెలుగు తల్లికి మల్లెపూదండ" గీత రచయిత ప్రసన్నకవి శంకరంబాడి సుందరాచారిగారు రచించిన "గీతాంజలి" నుండి గ్రహించబడింది.

సందర్భం: భగవంతుడు వెలుగురూపంలో ఉంటాడు. ఆ వెలుగును దర్శించగలిగినవారు పొందే ఆనందానికి ఇంక అవధులుండవు అని కవి అన్యాపదేశంగా చెప్పే సందర్భంలోనిదీ వాక్యం.

వివరణ: ఆ వెలుగు భూమిని నింపే వెలుగు. చిత్తంలో సుద్దలు చిందించే వెలుగు. రంగురంగుల వేయి రత్నరాసులు కురువగా ఈ ఆకు చివర నుంచి ఆ ఆకు చివర వరకు ఆనందం పరుచుకొని ఉందిరా! ఆనందానికి ఇంక అంతు అనేది లేదు. పట్టు విదిలించుకొని మిన్నేరు పారింది, మోదం పొంగి పొర్లింది.

**31. గొప్పగాఁ బసివారు కూడి యాటాడెదరు**

పరిచయం: ఈ వాక్యం “మా తెలుగు తల్లికి మల్లెపూదండ” గీత రచయిత ప్రసన్నకవి శంకరంబాడి సుందరాచారిగారు రచించిన “గీతాంజలి” నుండి గ్రహించబడింది.

సందర్భం: పసివారు ఆడే ఆటల గురించి చెప్పినట్లుగా ఈ భూమి మీద మనుషుల వర్తనలని చెప్పకనే చెప్పే సందర్భంలోనిదీ వాక్యం.

వివరణ: కడలేని లోకాల సముద్ర తీరాలలో పసివారు అనేకమంది కలిసి ఆడతారు. తీరం వెంట ఇసుకతో ఇల్లుకడతారు, పండుటాకులతో పడవలను చేసి నడి సముద్రంలో వదులుతారు. వారు ఈదలేరు, వల వేయలేరు. ముత్యాల కోసం సముద్రంలో మునిగేవారు ఎందరో ఉండగా వీరు సముద్రంలో గులకరాళ్ళను వేస్తుంటారు. గుప్తనిధిని ఎప్పుడూ కోరి ఎరుగరు. పడవలు మునిగి ముక్కలయ్యాయి. చావు దగ్గర చేరింది, పసివారు గొప్పగా కూడి ఆటలాడుతారు.

**32. వాని నుండియే నిద్రవచ్చి ముద్దిడిపోవు**

పరిచయం: ఈ వాక్యం “మా తెలుగు తల్లికి మల్లెపూదండ” గీత రచయిత ప్రసన్నకవి శంకరంబాడి సుందరాచారిగారు రచించిన “గీతాంజలి” నుండి గ్రహించబడింది.

సందర్భం: పసివారి కనులపైకి నిద్ర ఎలా వస్తుందో ఎంతో భావుకతతో కవి ఊహించి చెప్పే సందర్భంలోనిదీ వాక్యం.

వివరణ: పసివారి కనుదోయిపైకి అంటీ అంటకుండా నిద్ర ఎక్కడి నుంచి వచ్చి చేరింది? ఇక్కడున్నవారిలో ఎవరు వచ్చి చెప్పగలరు. అప్సరసల పల్లెలో అడవిలో మిణుగురుల అందీ అందని వెలుగులు అందందు తళుకుమనే స్థలంలో భయంతో వణికిపోతున్న సమ్మోహనమైన జంట మొగ్గలున్నాయి. వాని నుండే నిద్రవచ్చి ముద్దిడిపోతుంది.

**33. ఇంటిలో చీకటులు, ఒంటిపాటున నుంటి**

పరిచయం: ఈ వాక్యం “మా తెలుగు తల్లికి మల్లెపూదండ” గీత రచయిత ప్రసన్నకవి శంకరంబాడి సుందరాచారిగారు రచించిన “గీతాంజలి” నుండి గ్రహించబడింది.

సందర్భం: కవి ఒంటరిగా చీకటి ఇంటిలో ఉన్నప్పుడు ఒక స్త్రీ దీపం తీసుకొని వెళుతుంటే తన ఇంటిలోని చీకటి పోగొట్టడానికి దీపం ఇవ్వమని అడిగే సందర్భంలోనిదీ వాక్యం.

వివరణ: స్త్రీ దీపం తన పైట చాటున తీసుకెళుతుంటే కవి తన ఇంట్లో చీకటిగా ఉంది, ఒంటరిగా ఉన్నాను ఇవ్వమనగా ఆమె వరుసగా వాగుపై తేల్చడానికి, ఆకాశానికి అంకితం చేయడానికి, విశ్వ దీపోత్సవంలో ఉంచటానికి ఇష్టపడింది కానీ అతడికి ఇవ్వలేదు. ఇంటిలో చీకటులు, ఒంటరిగా ఉన్నాను. వేయి వెలుగుల మధ్య వృధాకాగా ఆ వెలుగు కనిపించకుండా పోవటాన్ని చూస్తూ నిలిచాను.

**34. కావ్యముల కడమాట నిను జూపంగల మాట యేయౌను**

పరిచయం: ఈ వాక్యం "మా తెలుగు తల్లికి మల్లెపూదండ" గీత రచయిత ప్రసన్నకవి శంకరంబాడి సుందరాచారిగారు రచించిన "గీతాంజలి" నుండి గ్రహించబడింది.

సందర్భం: భగవంతుడు గురించి తెలియనివారు వారు ఎవరికి తెలిసిన అర్థం వారు చెప్పుకొంటారని కవి చెప్పే సందర్భంలోనిదీ వాక్యం.

వివరణ: మనుషులు నీ చేతి కానుకలతో తృప్తిపడతారు. మళ్ళీ అవన్నీ నిన్నే వచ్చి చేరతాయి. పువ్వులు గాలులకు తమ సుగంధాన్ని ఇచ్చి మళ్ళీ నీ సేవకోసం వస్తాయి. కవికావ్యాల నుండి మనసుకు నచ్చిన అర్థాన్ని ప్రజలు తీసుకుంటారు. కానీ ఆ కావ్యాల చివరిమాట మాత్రం నిన్ను చూపగల మాటయే అవుతుంది.

**35. కన్నీటి ధారలను గాన్కలై యర్పింతు**

పరిచయం: ఈ వాక్యం "మా తెలుగు తల్లికి మల్లెపూదండ" గీత రచయిత ప్రసన్నకవి శంకరంబాడి సుందరాచారిగారు రచించిన "గీతాంజలి" నుండి గ్రహించబడింది.

సందర్భం: కవి వాకిలిలో మృత్యుదేవత నిలువగా కవి స్వాగతించే సందర్భంలోనిదీ వాక్యం.

వివరణ: నా తలుపు దగ్గర నీ దూత మృత్యువు కాచుకుంది. మృత్యుదేవత నీ సందేశం తెలియపరిచింది. దండంపెట్టి స్వాగతం పలికాను, చేతులను మోడ్చి అతనిని పూజిస్తాను నేను. కన్నీటి ధారలను కానుకలుగా అర్పిస్తాను. నా ఎదను కాళ్ళ దగ్గర పెడతాను.

**36. చావకున్నావు, పూజలకైన నోచకే**

పరిచయం: ఈ వాక్యం "మా తెలుగు తల్లికి మల్లెపూదండ" గీత రచయిత ప్రసన్నకవి శంకరంబాడి సుందరాచారిగారు రచించిన "గీతాంజలి" నుండి గ్రహించబడింది.

సందర్భం: పూజలందుకోకుండా ఉన్న గుడిలోని దేవుడి గురించి బాధతో, కోపంతోను పలికే సందర్భంలోనిదీ వాక్యం

వివరణ: పాడుపడిన గుడిలోని వీణ తీగ తెగింది, ఘంటారవం మ్రోగకుండా ఉంది, పువ్వులను పూజకు పంపలేమని విరులు చెప్పాయి, పాత పూజారి కూడా పూజ చేయటానికి రానన్నాడు. దీపం వెలిగించే దిక్కైనా లేదు, పాడు గుడిలోని దేవుడా ! నీవు చచ్చీ చావకున్నావు పూజలకైనా నోచకుండా.

**37. పెండ్లికూతురికయ్యి విరిదండ సిద్ధమైనది**

పరిచయం: ఈ వాక్యం "మా తెలుగు తల్లికి మల్లెపూదండ" గీత రచయిత ప్రసన్నకవి శంకరంబాడి సుందరాచారిగారు రచించిన "గీతాంజలి" నుండి గ్రహించబడింది.

సందర్భం: మృత్యుభయం లేకపోవటమే మృత్యువుని జయించటం అని కవి తన భావాల ద్వారా వ్యక్తీకరించే సందర్భంలోనిదీ వాక్యం.

వివరణ: జీవితాంతానికి చిహ్నమా! మృత్యుదేవా! రా! జీవితంలో కష్టసుఖాలని నిన్నే చేరే ప్రయత్నంలో భరించాను. పెళ్ళికూతురి కోసం పూలదండ సిద్ధమైంది. జీవితంలో పెళ్ళి అయిన తర్వాత ఆమె పుట్టిల్లు విడిచి చీకటిలో భర్తని కలవటానికి హాయిగా వెళ్ళింది.

**38. ఏదియును గొనిపోక యేగుచుంటిని నేను**

పరిచయం: ఈ వాక్యం “మా తెలుగు తల్లికి మల్లెపూదండ” గీత రచయిత ప్రసన్నకవి శంకరంబాడి సుందరాచారిగారు రచించిన “గీతాంజలి” నుండి గ్రహించబడింది.

సందర్భం: వెళ్ళేటప్పుడు ఏమీ తీసుకెళ్ళకుండా వెళతామని కవి నర్మగర్భంగా చెప్పే సందర్భంలోనిదీ వాక్యం.

వివరణ: మిమ్మల్ని వదిలి వెళ్ళేటప్పుడు శుభమని చెప్పండి, ఇష్టంతో నువ్వేమి అక్కడకు తీసుకెళతావని నన్ను అడుగకండి. ఏదో తీసుకెళతానని అనుకొని ఏమీ తీసుకెళ్ళకుండా వెళుతున్నాను నేను. పెళ్ళిదండలతో వెళ్ళాలనుకున్నాను, కాషాయాలు కట్టి వెళతానని అనుకోలేదు.

## ఆధార గ్రంథం:

1) గీతాంజలి – శంకరంబాడి సుందరాచారి

**– ఆచార్య ఇరపని మాధవి.**

## పాఠం - 3

# గీతాంజలి

**- శంకరంబాడి సుందరాచారి**

## ప్రశ్నలు-సమాధానాలు

### 1. శంకరంబాడి సుందరాచారి గీతాంజలిని ఆంధ్రీకరించిన విధానాన్ని వివరించండి?

జ) జాతీయగీత రచయిత రవీంద్రనాథ్ ఠాగూర్ గారి "గీతాంజలి" ని తెలుగులో రాష్ట్రగీత కవి శంకరంబాడి సుందరాచారిగారు అనువదించటమే విశేషం. గీతాంజలి భారతీయ సాహిత్యంలోనే ఆణిముత్యంలాంటిది. విశ్వవ్యాప్తంగా భారతీయ సాహిత్యానికి గుర్తు తెచ్చిన రచన ఇది. 1913వ సంవత్సరంలో నోబుల్ పురస్కారం లభించింది. ఈ సృష్టిలోని ఈశ్వరతత్వాన్ని దర్శించి, అర్చించి కవితగా రవీంద్రుడు రచించారు. దానిని తెలుగులోకి మొదటిగా ఆదిపూడి సోమనాథ్ గారు నోబుల్ పురస్కారం రాకముందే 1913వ సంవత్సరంలోనే అనువదించారు. అనువాదం చేయాలంటే మూలకవిలో ఉన్న భావపరంపర అనువాద కవిలోనూ ఉండాలి. గౌరవం, సమానగుణ ధర్మం, భావుకత, సామ్యం, భావాల కలయిక ఉన్నప్పుడే అది అనువాదమైనా స్వతంత్ర రచనంతగా పేరు సంపాదించుకుంటుంది. రవీంద్రుడిలో ఉన్న సౌకుమార్య, సౌమనస్యాలు, అంతరమైన శ్రాద్ధిక లయ, మార్దవ, కవిత వంటి లక్షణాలు సుందరాచారిని ఆకర్షించి అనువదింపజేసింది. తెలుగులోనే దాదాపుగా వంద అనువాదాలు వచ్చాయంటే గీతాంజలి గొప్పతనం అది. రవీంద్రుడు Poetic Prose గా 103 కవితా వచనాలు రాస్తే సుందరాచారిగారు మాత్రా ఛందస్సులో 103 పద్యకాలుగా రాసి 'సరాగం' అని ముద్రించారు. తెలుగు పలుకుబడిని, నుడికారాన్ని వాడుతూ రవీంద్రుని అందుకొనే ప్రయత్నం చేశారు సుందరాచారిగారు.

1961వ సంవత్సరంలో చిత్తూరు జిల్లా ఠాగూరు శతజయంతి ఉత్సవ నిర్వాహక సంఘం సుందరాచారిగారి అనువాదాన్ని ప్రచురించింది. విశ్వనాథ సత్యనారాయణగారు దీనికి ఆముఖం రాశారు. దానిలో "నేను రవీంద్రుని గ్రంథము ఇంగ్లీషు భాష ద్వారానే ఎరుగుదును. నాకు వంగ భాష రాని హేతువున నేనంతకు సమర్థుడను గాను. కాని, వీరి తెలుగు సేత చక్కని తెలుగు భాషలో వున్నది. ఈ నా మాటలోని నిజము సర్వాంధ్ర పాఠకులు తెలిసికొనగలరు. వీరు పలుచోట్ల జాతీయమైన నుడికారమును వాడిరి. ఈ కార్యమంతయు తెలుగు బాస తెలిసిన చాలును. అర్థమగుట కొరకు వ్రాయబడింది. ఈ గ్రంథము సర్వ సుకుమారముగనున్నది. తెలుగుందనముట్టిపడుచున్నది. నిజముగా నేడు తెలుగులో నిట్టి తర్జుమాలే కావలయును. సుందరాచారిగారు రవీంద్రుని తెలుగువానిగా చూపించుచున్నారని చెప్పవచ్చును" అన్నారు.

ప్రముఖ పాత్రికేయులు ఈ గ్రంథానికి మంచి మాట రాస్తూ "పీటముళ్ళు పడ వేదాంతాన్ని పట్టుకుచ్చులుగా మార్చి భాషామతల్లి పల్లకి నలంకరించిన ఆధునిక భాగవతోత్తముడు రవీంద్రుడు. సకల చరాచర వస్తు సంపదల్లో ఈశ్వర సాక్షాత్కారాన్ని దర్శించి అర్చించి కవితగా సంతరించి సరస్వతీ చరణ మంజీరాలకు కొన్ని క్రొంగొత్త మువ్వలు జత జేయజాలిన ధన్యుడు రవీంద్రుడు. రవీంద్రుని రచనలన్నిటిలో గీతాంజలికి అగ్రతాంబూల మందించింది లోకం. అనువాదాలు అవసరం. మాతృకకు అపకారం చేయని అనువాదాలు, అనువదింపబడే భాషకు ఉపకరించే అనువాదాలు స్వీకరింపదగినవి. ఈ కారణాల వల్ల తెలుగు పాఠకలోకానికి ఇది చక్కని కానుక కాగలదనే విశ్వాసం కలుగుతోంది. ఈ గీతాంజలి తెలుగు సేత పాఠక చకోరాలకు ఒక చిన్న వెన్నెల ఫలహారం" అన్నారు.

శంకరంబాడి సుందరాచారిగారి అనువాదంలో రెండు ప్రత్యేకతలు కనిపిస్తున్నాయి. ఒకటి మాతృకలోని భావానికి

ఏమాత్రం దాటిపోని భక్తి భావం. రెండవది అందరికీ అర్థమయ్యే తేట తెలుగులో మధురమైన శైలిలో రాయటం కనిపిస్తుంది. భావంలోనూ, భాషలోనూ, తెలుగుదనం ఉట్టి పడే కొన్ని అనువాదాలు పరిశీలిస్తే సుందరాచారిగారు గీతాంజలిని గానయోగ్యంగా రాశారనిపించకమానదు.

"Leave this chanting and singing and telling of beads! whom dost thou worship in this lovely dark corner of a temple with doors all shut?

Open thine eyes and see thy God is not before thee He is there where the tiller is tilling the hand ground and where the path-maker is breaking stones.

He is with them in sun and in shower, and his garment is covered with dust.

Put off thy holy mantle and even like him come down on the dusty soil!

Delivarance? where is this deliverence to be found? Our master himself has joyfully taken upon him the has the bonds of creation; he is bound with us all forever.

Come out of thy meditations and leave a side they flowers and incense! what harm is there if thy clothes become tattered and stained? Meet him and stand by him in tail and in sweet of thy brow.

దీనిని సుందరాచారిగారు

**"మంత్ర తంత్రాలేల? మణులెంతు వేలరా?**
**పాటలెన్నైన నిక పనికి రా బోవురా!**
**తలుపులన్నిటి చక్క తన్ని మూసిన గుడిని**
**మూగ చీకటిలోన మునిగిపోయిన మూల**
**కూర్చుండి యెవ్వరిని కొలుచుచున్నావురా!**
**లేదురా నీ స్వామి, చూదరా నీ ముందు!**
**కటిక నేలలు దున్ను కాపుతోనున్నాడు**
**రాళ్ళు రప్పలు గొట్టి రాశి పోయుచునున్న**
**బాట తీర్చెడు వాని ప్రక్కలో నున్నాడు**
**వానలో నెండలో వానితోనున్నాడు-**
**దుమ్ము గప్పెను వాని దుస్తులన్నిటి జూడు!**
**పూతోత్తరీయములు పోనాడి వాని వలె**
**దుమ్ము నేలల చేర రమ్మురా దిగినీవు !**
**ముక్తియను టెట్టిదది? ముక్తి యెందున్నాయది?**

**మన పాలి స్వామియే మనసార తనుదాన**

**సృష్టి బంధమ్ములను చేకొనుచు మనతోడ**

**కలకాలమును విడక కట్టువడి యున్నాడు**

**ఈ ధ్యానమేలరా! యీ వలకు రమ్మురా!**

**పూవులను పొగలవిడి యీవలకు రమ్మురా!**

**కలిసికొనరా వాని కష్టించ పొమ్మురా!**

**చెమట లూడిచిపోసి చేయూత నిమ్మురా!"** అని అనువదించారు.

ఈ అనువాదంలో 'మంత్రతంత్రాలు' అనే పదప్రయోగంలో ఎంతో నిగూఢమైన అర్థం వుంటే 'మూగచీకటిలోన' అనటం భావుకతను తెలియజేస్తుంది. 'పూతోత్తరీయములు' అనటం కూడా భారతీయ సంప్రదాయాన్ని తెలుపుతుంది. అంతకుమించి మానవత్వాన్ని తెలిపే రచన ఇది. గుడ్డిగా దేవుడి గురించి జపతపాలు ధ్యానాలు చేస్తే దేవుడు కనిపించడు, కష్టపడే వారికి సహాయం చేసినప్పుడు, వారి కష్టంలో పాలుపంచుకున్నప్పుడు మాత్రమే భగవంతుడి అనుగ్రహం కలుగుతుందనే సందేశం ఉంది. 'మానవ సేవే మాధవసేవ' అని తెలుపుతుందిది. ఒకవేళ ఈ భావ ప్రభావంతోనే ఒక సినీకవి "చుట్టూపక్కల చూడరా చిన్నవాడా, చుక్కల్లో చూపు చిక్కుకున్నవాడా! కటిక నిజం కానలేని గుడ్డి జపం సాధించదు ఏ పరమార్థం" అని రాశాదేమో!

"Where the mind is without fear and the head is held high; Where knowledge is free;

Where the world has not been broken up into fragments by narrow domestic walls;

where words come out from the depth of truth where tireless striking stretches its arms towards perfection; where the clear stream of reason has not lost its way where into the dreary desert sand of dead habit;

Where the mind is led forward by thee in to ever-widening thought and action - into that eaven of freedom, my father let my country awake".

దీనిని సుందరాచారిగారు ఎంతో సుందరంగా అనువదించారు.

**"బెదరువిడి మానసము పదిల పడినపుడు,**

**పరువుతో తలయెత్తబడి యున్నయపుడు,**

**విజ్ఞాన బంధములు వీడిపోయిన యపుడు**

**ఇఱుకు సంసారముల కఱకు గోడల నడుమ**

**భువనాలు తునకలైపోక మిగిలినయపుడు,**

**పలుకులు సత్యగర్భమ్ము వెలువడునపుడు**

**అలసి యెఱుగని యట్టి హస్తములు పరిపక్వ**

**దశనంటగను సాగు తరుణ మొదలిన యపుడు**

**చెడ్డ అలవాటనెడు చీకుటెడారిలో**

తేటతెల్లని తెలివి బాట తప్పని యపుడు,

నిత్య విస్తృతమైన నిర్మలిన భావనా

శ్రయ కర్మముల చేయస్వాంతమును ముందునకు

నా స్వామి నీవుగా నడుప బూనిన యపుడు

స్వాతంత్ర్య స్వర్గ సౌభాగ్య వీధుల మాతృ

ధాత్రి మేల్కొను గాత ధన్యాతి ధన్యయై"

మూలంలోని భావాన్ని అర్థం చేసుకొని హృదయస్థం చేసుకొని అనువదించినపుడు మూలంలోకన్నా మిన్నగా భావతీవ్రత అనువాదంలో వుంటుంది అనటానికి నిదర్శనంగా ఈ అనువాదం కనిపిస్తుంది. ఇది స్వాతంత్ర్య సంగ్రామ సమయంలో రాసింది కనుక భరతజాతికి అసలు స్వాతంత్ర్యమంటే ఏమిటో తెలియజేశారా అనే విధంగా ఈ రచన ఉంది. మూలంలో Mind with out fear అన్న దానిని మనసు భయపడకుండా అని అనువదించవచ్చు, కానీ సుందరాచారిగారు 'బెదరు విడి మానసమూ పదిలపడినపుడు' అనటంలో ఆ భయం శాశ్వతంగా తొలగిపోయి మనసుకి నిశ్చింత కలిగింది అనే భావం కనిపిస్తుంది. Head is high ని తలఎత్తబడినపుడు అనవచ్చు. కానీ పరువుతో తలయెత్తబడియున్నపుడు అనటంలో అవమానం చేసే వారు ఇంక లేరు అనే నిశ్చింత ధ్వనిస్తుంది. ఇఱుకు సంసారం, కఱకు గోడలు, సత్యగర్భం, తరుణం మొదలైన పద ప్రయోగాలన్నీ కవితాత్మకతను వెల్లడించేవే. నా తండ్రి అని అనువదించటం కన్నా నా స్వామి అనటంలో సామీప్యం, నమ్మకం, జగత్కర్త అనే భావాలు కనిపిస్తాయి. My country awake ని కూడా నా దేశం మేల్కొంటుంది అంటే అది హృదయాన్ని స్పృశించకపోవచ్చు. "మాతృధాత్రి మేల్కొనుగాత ధన్యాతిధన్యయై" అనటంలో ఎంతో ఔన్నత్యం పుట్టినభూమి పట్ల ఉన్న భక్తి గౌరవాలు, మమకారం వ్యక్తీకరించబడుతున్నాయి. ఇంకా ఇందులోనూ ఎంతో సందేశం ఉంది. సత్యవాక్యాలకున్న ప్రాధాన్యత, వ్యసనాల బారిన పడని మంచి నడవడిక గొప్పతనం తెలియజేస్తుంది. అవన్నీ భగవంతుడే నడిపినపుడు ఒక వ్యక్తికే కాదు దేశానికి భాగ్య మందుతుందనే అంతరార్థం గోచరిస్తుంది. జ్ఞానం అందరికీ అందాలనే ఆకాంక్ష కనిపిస్తుంది.

"I am here to sing thee songs. In this hall of thine.

I have a corner seat.

In thy world I have no work to do;

my useless life

can only breakout in tunes with out purpose

When the hour strikes for they silent worship at the dark temple of midnight Command me, my master, to stand before thee to sing.

When in the morning air the golden harp is tuned, honour me commanding my presence".

దీనిని సుందరాచారిగారు

"వినిపించ నా పాట వేచియున్నానురా!
నీ దివ్య భవనాన నిలిచియున్నానురా!
ఏ మూలనో నాకు నిందు చోటున్నది!
వసుధలో నాకున్న పని యేమియును లేదు:
కడు రిత్త బ్రతుకిద్ది కారణములేకయే
కంఠమ్ము సవరించి గాన మాలపించు
నల్ల మసకల తెరల నడిరేయి గుడిలోన
శాంతి పూజాసమయ సందడులు చెలరేగ
పిలిచి నీ కనుముందు నిలిచి పాడఁగ
నన్ను శాసించరా దయాసాగరా! నా దొరా!
ప్రత్యుషః పవనాల పసిడి వీణియ సిద్ధ
పడునేని శ్రుతులంది పాడుటకు ననువుగను
మన్నించి నాకొఱకు మాట పంపుము రా!"

అని మూలాన్ని మించిన ఆత్మీయత, ఆర్ద్రతతో అనువదించారు. నీ పాట పాడటం కోసం నేనున్నాను అనకుండా 'వేచియున్నానురా' అనటంలో ఒకప్రక్క దగ్గరతనం, మరోప్రక్క ఆ పని చేయటం ఎంత ఇష్టమో తెలుపుతున్నట్లైంది. 'కడు రిత్త బ్రతుకు' అనటం ఎంతో అర్థాన్ని సూచిస్తుంది. "నల్ల మసకల తెరల నడిరేయి గుడిలోన" అనటంలో భావుకత్వం, ఏకాంత ప్రియత్వం కనిపిస్తాయి. "ప్రత్యుషః పవనాల పసిడి వీణియ" ఎంతో కవితాత్మకంగా ఉంది. భావంలో, భావనలో, పద ప్రయోగంలో సుందరాచారిగారి అనువాద నిపుణత్వం కనిపిస్తుంది.

"The Rain has held back for days and days my god in my and heart. The horizon is fiercely naked not the thinnest cover of a soft cloud, not the vaguest hint of a distant cool shower"

"కలకాలమేగియును చిలిపి వానలు కూడ
తడి యార నట్టి నా యెదదలో పడలేదు!
నగ్నమై శూన్యమ్ము నన్ను భయమున ముంచె!
చిఱుమబ్బుతునకమును కఱవయ్యె గగనాన
సన్నచినుకొకటి పడు సన్నయె కనపడదు!
.............................................
నిశితమై, క్రూరమై, నిశ్చలంబై తెగించి
గుండె గాల్చెడు మూగ యెండలకు నోర్చుకో
గల శక్తి లేదు నాకడ దాని నార్పరా!" అని అనువదించారు.

భావ సౌందర్యంతో పాటు భాషా సౌందర్యం కూడా సుందరాచారిగారి అనువాదంలో కనిపిస్తుంది. చిఱుమబ్బుతునక, సన్నచినుకు వంటి పదప్రయోగాలు కనిపిస్తాయి. 'విద్యుల్లతా దీప్తి" అనే పదాలు ఈ కవితలో కనిపిస్తాయి. కరువు ఎంత భయంకరంగా ఉంటుందో దయలేని యెద కూడా అంతే అనే భావం అంతర్గతంగా ధ్వనిస్తూందీ కవితలో. అందుకే కవి చివరలో "కరుణాంబుదం బొందు ధరణికి దిగిరాని" అంటారు ఈ కవిత చివరలో. భావానికి అనుగుణంగా ఒకే అర్థాన్నిచ్చే అనేక పదాలను కవి ఉపయోగిస్తారు.

"Deliverance is not for me in renunciation. I feel the embrace of freedom in a thousand bonds of delight. Thou ever pourest for me the fresh draught of thy wine of various colours and fragrance, filling this earthen vessel to the brim".

దీనిని సుందరాచారిగారు

**"సన్యసించిన యంత స్వాతంత్ర్యమబ్బదుర!**

**శతసహస్రాలైన సంతోషబంధములు**

**కౌగలించఁగవచ్చుఁ, గననని యె నన్ను స్వ**

**తంత్రుఁ జేసినయట్లు తలచుచుందును నేను**

**రంగురంగుల నవ్యరసములను బలు చవుల**

**మధువులను చేసి యీ మంటి పాత్రను నీవు**

**నిండుగను ననిశమ్ము నింపుచున్నావురా!"** అని అనువదించారు.

సన్యసిస్తేనే స్వాతంత్ర్యం రాదని, వందల వేల సంతోషబంధాలు కౌగిలించినా అవే స్వతంత్రుడిని చేయగలవని చెబుతారిందులో Thousand Bonds ని శతసహస్రాలైన సంతోషబంధాలని అనువదించారు. ఏదైనా మన భావనలోనే ఉంటుందనే అంతరార్థం గోచరిస్తుందీ కవితలో. "వినును తాకును నీదు విరియు నానందమును" అంటారిందులోనే. స్వాతంత్ర్యమంటే మోక్షం అనే భావన స్ఫురిస్తుంది. భగవంతుడి స్పర్శను సన్యసిస్తేనే కాదు సంసారిగాను పొందవచ్చనే అనుభవపూర్వక అనుభూతి ఇందులో అంతర్లీనంగా ధ్వనిస్తుంది.

"I have got my leave. Bid me farewell, my brothers!

I bow to you all and take my departure.

Here I give back the keys of my door, and I give up all claims to my house. I only ask for last kind of words.

We were neighbours for long, but I received more than would give. Now the day has downed and the lamp that hit my dark corner is out. A summon has come and I am ready for my journey".

దీనిని సుందరాచారిగారు

**"సెలవందితిని బోవ సెలవిందు తమ్ములా!**

**వదలి మిమ్మెల్లరను వందనంబిడిపోదు**

**ఇచ్చి పోదును మీకు ఇంటి తాళపు చెవిని**

**చివరిసారిగ నన్ను. సెలవిచ్చి పంపుడిక**

**ఇన్నాళ్ళు మనమెల్ల నిరుగు పొరుగున నుంటి,**

**మల్పమ్ము నిచ్చితిని, యధికమ్ము నేగొంటి**

**నేడుదయమైనయది, పాడునా యింటిలో**

**చీకటి గూటిలో చిన్న దీపమ్మారే !**

**స్వాగతం బందినది సాగిపోయెదనింక"** అని అనువదించారు

దీనిని సెలవిందు తమ్ములూ, ఇంటి తాళపుచెవి, చీకటి గూటిలో, చిన్న దీపమ్మారె వంటి తెలుగు నుడికారాలను ఉపయోగించారు. మరణం అంటే భయపడని మహాత్ములు కొందరే ఉంటారు. మరణానికి స్వాగతం పలికే ధైర్యం వారి స్వంతం. దేవుడి సన్నిధి చేరటానికి, తన నిజనివాసం సమీపించటానికి వేగిరపడేవారే మృత్యువును దేవుడి దూతగా భావిస్తారు అన్ని బంధాలపై మమకారం విడిచి తన ఇంటి తాళం చెవి మరొకరికి అప్పగిస్తారు. మరణాన్ని పెళ్ళితో పోలుస్తారు. ఒక సందర్భంలో కవి. పెళ్ళి దండలతో వధువు నాథుని ఇంటికి వెళుతుంది అని చెబుతారు. మరణం గురించి రాస్తూనే పెళ్ళిదండలతో వెళ్ళాలనుకున్నాను. కాషాయపు వస్త్రాలతో వెళుతున్నానంటారు. ఈ కవితా వచనాలలో ఎంతో తాత్వికత, వైరాగ్యం కనిపిస్తాయి.

ఇక 103వది చివరిది అయిన కవితా వచనం గమనిస్తే

"In one salutation to thee, my God, let all my senses spread out and touch this world at the feet.

Like a rain-cloud of July hung low.

With its burden of unshed showers all my mind bend down at thy door in one salutation to thee.

దీనిని సుందరాచారిగారు

**"పంచేంద్రియమ్ములను బరవి చక్కగనొక్క**

**వందనంతో నీదు పాదముల నంటి యీ**

**విశ్వమును దాకనీ విశ్వేశ్వరా! ప్రభూ!**

**కురియని నీటితో బరువైన వర్షకా**

**లాంబుదము నేలపై వంగియుండెడునట్లు**

**మానసంబెల్ల మహా మందిర**

**ద్వారమ్ము ముందొక్క వందనముతో జక్క**

**వంగనీ వినతయై స్వామి, చక్కని దొరా!"** అని అనువదించారు.

ప్రతి సందర్భంలోను సుందరాచారిగారు స్వామి, దొరా, ప్రభూ అని సంభోదిస్తారు. దానికి తోడు "అనిపించురా, భావమ్మురా, క్రమ్మునురా, కొనిపొమ్మురా, ఉండనిమ్మురా, రమ్మురా, సేయరా" ఇలా చివర రా చేర్చటంతో భగవంతుడిని ఎంత సన్నిహితుడిగా కవి భావిస్తున్నాడో తెలిపినట్లయింది. ఇది మూలంలో కనిపించదు. అంతేగాక ఆ ప్రయోగాల కారణంగా భక్తుడు భగవంతుడి కోసం ఎదురుచూడటం, పరితపించటం అనే భావమే కాక ఒక ప్రేయసి తన ప్రియుడి కోసం తన మనసుని, అందులోని భావాలను అభివ్యక్తీకరిస్తుంది అని కూడా భావించుకునే అవకాశం కలిగింది. మొత్తం మీద ఆంగ్ల గీతాంజలిని, సుందరాచారిగారి గీతాంజలిని చూసిన తర్వాత రవీంద్రుని హృదయాన్ని సుందరాచారిగారు ఆవిష్కరించారనిపిస్తుంది. తెలుగువారికి, తెలుగు భాషా సాహిత్యాభిమానులకు ఆంగ్ల రచన కంటే మన తెలుగు రచన ఎంతో గొప్పగా ఉంది అనిపించేటంత కవితాత్మకంగా అనువదించారు. భగవంతుడి తత్వాన్ని బోధపరచటమే కాక ఆధ్యాత్మిక మార్గంలో పయనించాలనుకొనేవారికి దిక్సూచిలా మార్గనిర్దేశం గీతాంజలి చేస్తుంది. పాఠకులను అంతర్ముఖులను చేసే శక్తి ఈ రచనలో ఉంది.

**2) "గీతాంజలి" ఆధారంగా కవి తాత్త్వికతను, భావుకతను ఆవిష్కరించండి.**

**(లేదా)**

**"గీతాంజలి" ఆధారంగా కవికి భగవంతునిపట్ల ఉన్న అనురక్తిని నిరూపించండి.**

జ) రవీంద్రనాథ్ ఠాగూర్ తన మాతృభాషైన బంగ్లాలో రచించిన కవితలను ఆంగ్లంలోకి అనువదించి దానికి "గీతాంజలి" అని నామకరణం చేశారు. కవి భగవంతుడికి గీతాలతో అర్పించిన అంజలి 'గీతాంజలి'. దీనిని అనేకమంది తమ తమ మాతృభాషలలోకి అనువదించుకున్నారు. దాదాపుగా వంద తెలుగు అనువాదాలున్నాయి. వాటిలో ఒకటి, మిగిలినవారికి భిన్నమైనది శంకరంబాడి సుందరాచారి గారి అనువాదం. అనువాదం కాదు ఇది స్వతంత్ర రచనేమో అనిపించేటంత తెనుగుదనంతో అనువదించారు సుందరాచారిగారు. రవీంద్రుని, సుందరాచారిగారి భావనలు, ఆలోచనలు-ఒకటే కావటం వలన అంత గొప్పగా ఈ అనువాదం వచ్చిందేమో అనిపిస్తుంది. ఇద్దరికీ ఐహిక విషయాల పట్ల వ్యామోహం లేదు. ప్రకృతి ఆరాధన కవుల సహజ లక్షణం. ప్రకృతిలోని ప్రతి అణువులో పరమాత్ముని దర్శించటం భక్తుల లక్షణం.

భగవంతుడి తత్త్వం తెలుసుకొని వానిని ఆరాధించటం కోసమే సంగీత సాహిత్యాలనుకోవడం ఈ రచనలో చూస్తాం. భగవంతుడి పట్ల ఆరాధన, అతడి ఎడబాటు వలన వేదన, అతడి దర్శన, స్పర్శలతో ఆనందాన్ని పొందటం, పదేపదే ఆ ఆనందాన్ని తల్చుకుంటూ తన్మయత్వం పొందటం, తనకన్నా దేవుడు వేరుకాదు, తనలోనే ఉన్నాడని భావించటం, విరక్తితో మృత్యుదేవతకు ఆహ్వానం పలకటం ఇవన్నీ గీతాంజలిలో కనిపిస్తాయి. ఇదంతా కవి తాత్విక సంబంధమైన భావనలనుకుంటే ప్రతి కవితావచనంలోనూ కవి భావుకత్వం వీటితో మేళవించే కనిపిస్తుంది. భావుకత్వం కలిగిన వాడు భావుకుడు. భావుకత్వం, భావావేశం (emotions) మరియు భావనల (Imaginations) కలయిక వలన ఏర్పడుతుంది. మనసును ద్రవింపజేసే సన్నివేశం చూసినపుడు కలిగిన ఆవేశానికి తన ఊహలను కలిపి కవిత్వ రూపమిస్తాడు కవి. భావుకత్వం లేకుండా ఏ కవి ఉండడు. గీతాంజలి మొత్తం ఆత్మాశ్రయ ధోరణిలో సాగుతుంది. కవి అనుభూతులే దీనినిండా దర్శనమిస్తాయి.

"నన్ననంతుని జేసినావు - నీ స్వేచ్ఛ యది" అంటూ ప్రారంభమవుతుంది గీతాంజలి. భగవంతుడు తనను పాడమన్నాడని కవి ఆనందపడతాడు. తనకు పాడే శక్తి లేకపోయినా భగవంతుడి కోరికపై తాను గాయకుడనయ్యానంటారు.

**"నే పాటపాడితే నీ విష్టపడుదువని**

**నీ ముందు నిలిచెదను పాటగాడనై"** అంటూనే

ఆ పారవశ్యంలో తాను మైమరచిపోతానంటాడు. ఆ పరవశంలో

**"ఆలాప సౌఖ్యమ్మునందు మైమరచి నా**

**ప్రభువైన నిన్ను నే ప్రాణసఖా యందు"** అంటాడు

తల్లి, తండ్రి, గురువు, స్నేహితుడు, బంధువు అన్నీ భగవంతుడే కదా ఆ భగవంతుడిని ప్రేమించటం ప్రారంభమైన తర్వాత. పాడమన్నందుకు సంతోషంతో గర్వపడిన కవి స్వామితో కలిసి పాడలేకున్నందుకు ఆవేదన చెందుతారు.

**"కంఠాన కంఠమును కలిపి నీతో కలిసి**

**పాడ నాశించియు పాడలేకున్నాను"** అంటారు.

అలాగే విశ్వోత్సవంలో పాడటానికి పిలుపందింది అని ఎంతో సంతోషపడతారు కవి.

**"విశ్వోత్సవమునకు పిలుపందినది నాకు,**

**పావనంబయ్యె నా పతిత జీవన మింక!**

**కన్నాను కనులార విన్నాను చెవులార**

**నను పాడమన్నారు నా జంత్రమును మీటి**

**పాడితిని నేనందు పాడగల్గినయంత-**

**ఇకనైన నేలోని కేగఁనౌనా స్వామి!**

**నే చూడవచ్చునా నీ మోము నికనైన?**

**శాంతిపూజల నింక సలుపుకోనగునా?"** అంటారు కవి.

ఆ దేవుడిని దర్శించాలనే ఆరాటం కవి అనేక సార్లు వ్యక్తీకరిస్తారు. దేవుడిని చూడాలని అతడి ముందు తన పాట పాడాలనే ఆరాటం కనిపిస్తుంది.

**"వాని నెన్నటికైనఁ గాని చూడఁగ వలతు**

**కాని యా భాగ్యమ్ము కలుగలే దిప్పటికి"**

అంటూ దేవుని చూడలేకున్నానని ఆవేదన చెందుతూ ఆ దేవుడినే ప్రార్థిస్తారిలా

**"ఏ తోడు లేనట్టి యీ యొంటి నిశివేళ**

**నా ప్రభూ! నువు దక్క నాకు తోడెవ్వరిట?**

**నీవె కనబడకున్న, తావీయకే నన్ను**

**కడుదూరమున నుంచి కడకు పిల్వక యున్న**

**అతి దీర్ఘమైన యీ యంధకారపు వాన**

**కాలమును నేనెట్లు గడపగలనో తెలియ!"** అని

బాధపడుతూ మళ్ళీ తనకు తనే సమాధానం కూడా చెప్పుకుంటారిలా, ఒక ప్రక్క బాధపడుతూనే బాధపడనంటారు.

**"స్వామి ! నాతో నీవు పలుక నొల్లకయున్న**

**నిశ్శబ్దమున గుండె నింపుకొని యెట్టులో**

**సహియించియుండ నే జాలుదును వెతఁ జెంద"** అంటారు.

ఆ దేవుడే తనను బంధించాడని అంటారిలా.

**"కడ మొదలు లేని నీ గానంపు వలలలో**

**నా హృదిని బంధించినావురా నా ప్రభూ!"** అంటారు

దేవుడు భక్తుడిని ఆకర్షించనిదే, దేవుడు పిలవనిదే ఎవరూ తమంతట తాము ఆయనను చూడలేరు. ఒకసారి దేవుడిని అనుభూతి చెందిన తర్వాత అతడినుండి వేరుగా ఉండలేరు. ఆలోచనలలో, తాను చేసే ప్రతిపనిలో దైవాన్నే చూస్తారు. అందరికీ ఆయన గొప్పతనం తెలియజేయాలనుకుంటారు.

**"ప్రతి కార్యమున నిన్ను బయలుపడఁ జేయుటకు**

**సతతమ్ము యత్నించు శక్తివంచన లేక"** అంటారు కవి.

నిరంతరం ఆ తండ్రి పాదాల దగ్గరే పడివుండాలని కోరుకుంటారు.

**"కవి సార్వభౌమ! నీ కాళ్ళకడఁ బడి యుంటి**

**నీదు పాటల తీపి నింపగను నున్నట్టి**

**వెదురు పిల్లన గ్రోవి విధముగను ననుగూడ**

**నిలువుగను సుళువుగను నిలుపు మది పదివేలు".** అంటారు కవి.

ఆ దేవుడిని దర్శించాలని అంతగా కోరుకున్న కవి నిజంగా దేవుడు ఎక్కడుంటాడో తెలుసుకొని తెలియజేస్తారు.

**"దరిదాపు లేకయే దాసానుదాసులై**

**మెతుకు గతికెడువారి బ్రతుకులకు నడుమనీ**

**పాదయుగ్మమ్ములవి పదిలమై యున్నయవి"** అంటారు.

ఇంకా

**"కటిక నేలలు దున్ను కాపుతోనున్నాడు**

**రాళ్లు రప్పలు గొట్టి రాసిపోయుచు నున్న**

**బాటతీర్చెడు వాని ప్రక్కలో నున్నాడు**

**వానలో నెండలో వానితో నున్నాడు"** అంటారు.

భగవంతుడు జపతపాలు చేసే వారితో కాక కష్టించి పని చేసే వారితో దుఃఖితులు, దీనులు అయిన వారితో ఉంటాడని తెలియజేస్తారు. ఆ దేవుడిని పొందాలంటే కష్టించేవారితో కలిసి చెమట చిందించాలనీ, వారికి సహాయం చేయాలని బోధిస్తున్నారు కవి. ఇంకా భగవంతుడు హృదయంలోనే ఉంటాడని తెలియజేస్తారు. దేవుడి కోసం అంతా వెదుకుతాముగాని ఆయన నివాసం హృదయమని తెలిపారిలా.

**"నా హృదయ గర్భమ్మునందె యా పరిశుద్ధ**

**మధురిములు పూచె నను మర్మమ్ము మరచితిని"** అంటారు.

ఇంకా-

**"నా హృదయ సింహాసనమున గూర్చుందువని**

**పూని నా వలపులను పూవులలో నుంచి**

**పెంచి, యత్నించు తొలగించ చెడుగుల నన్ని**

**టిని నాదు యెద నుండి నను మఱల దఱియనటు"** అంటూ

అయితే ఆ దేవుడు ఎప్పుడు మన హృదయంలో ఉంటాడో కూడా చెప్పారు. చెడు లక్షణాలు నేనప్పుడు దేవుడు హృదయంలో నివశిస్తాడు. దేవుడు నివశిస్తాడు కాబట్టి మనలోని చెడునంతా మళ్ళీ తిరిగి రాని విధంగా ప్రయత్న పూర్వకంగా తీసివేయాలి అనే విషయాన్ని కవి తెలియజేశారు. అంతేగాక ఆ భగవంతుడు తన మనసు మనకిచ్చినప్పుడే అది సాధ్యమని తెలియజేశారు.

**"నీ మానసము నాకు నిచ్చి పేరాసలను**

**పడనీక సతము కాపాడుచున్నావురా!"** అంటారు కవి

ఇంకా భగవంతుడు ఎంతగా భక్తుడిని ప్రేమిస్తాడో, ఒకసారి చేయి పట్టుకుంటే ఇంక ఎప్పటికీ వదలడనే విషయాన్ని తెలిపారిలా.

**"పూలతో నర్చించి పూజించకుండినను**

**నా హృదయమం దాసనమ్మీయ కుండినను**

**వేచియుందును నాదు ప్రేమకై నీ ప్రేమ" అంటారు.**

ఇంకా ముందుకెళ్ళి అతిశయంతో

**"నేనన్న వాఁడొకఁడె లేనిచో నీ వలపు**

**నిలువ నెలవేదిరా! నిఖిలలోక ప్రభూ!"** అంటారు.

భగవంతుడు ఒకసారి లభించిన తర్వాత అది భగవంతుడి దయవల్లే సాధ్యంకానీ తన గొప్పతనం వల్లకాదు అనేది అప్పుడప్పుడూ మరిచి పోవటం సహజమే. ఆ దేవుడిని చూడకుండా ఉండలేని భక్తుడు మళ్ళీ తన అహం వల్లే ఎడబాటు కలిగిందని గుర్తిస్తాడు. అలా గుర్తించినపుడు మళ్ళీ ప్రార్థిస్తాడిలా.

**"నిరతమ్ము నా గుండె నీవె కావలె నన్న**

**ప్రార్ధనా వాక్యముల పలుకనీ పలుకనీ"** అంటాడు.

నేను అనే అహం వదలాలని తనకు తనే చెప్పుకుంటాడు. నేను అనే అహంకారంతో తాను దేవుడి దగ్గరకు సమీపించ లేనంటాడిలా

**"మానావమానములు లేని మానిసి వీడు**

**నేనన్న చిన్నవాఁడేను కాడింకొకడు**

**కడు సిగ్గు పడెద నీ కడచేర వీనితో"** అంటారు.

ఇంకా దేవుడి దగ్గరకు భక్తుడిని చేరనివ్వకుండా చేసేవి కోరికలు. కాబట్టి ఎన్ని కష్టాలైనా దేవుడిని తానేమీ కోరలేనని చెబుతారు కవి. అంతేగాక భగవంతుడు ఒక్కోసారి అడిగిన కోరికలేకాదు అడగనివి కూడా ఇచ్చి తన నుంచి భక్తుడి దృష్టి మళ్ళిస్తాడు. అది కూడా తెలిసిన వాడు కవి.

**"స్వామి ! నీ మెడలోని సన్నజాజుల దండ**

**నడిగి కొందామన్న యాసయున్నది కాని**

**అటు సేయ గలుగు సాహసమొదవకున్నది"** అంటారు.

భగవంతుడిచ్చే అన్ని బహుమతులకన్నా గొప్పది జ్ఞానం. దానినే ఖడ్గంగా దేవుడు కవి దగ్గర వదిలివెళ్ళారంటారు కవి. తన కోరికలు, తన బంధాలే సంకెళ్ళు. ఆ సంకెళ్ళను ఎవరికి వారే తయారు చేసి తగిలించుకుంటారు ఆ సంకెళ్ళ జ్ఞానం కలిగినప్పుడే తెంచుకోగలం. అలాగే జ్ఞానం కలిగిన తర్వాత దేవుడి కోసం కూడా కలతచెందం.

**"ఖడ్గ మిది పాశముల ఖండించగల్గినది**

**కాన నా కిలలోన గలతలే లేవింక!**

**అన్నియును నీవిచ్చినట్టి ఖడ్గమునే**

**కలదంచు నెఱుగుదును కలవరించను నేను**

**వలదలంకారములు వట్టి బింకమ్ములును**

**వలదు నాకేదియును వలదీ దినము నుండి**

**వాకిళ్ళు కాయనిక, వమ్ముగను నేడువను"** అంటారు కవి.

భగవంతుడు వెలుగు రూపంలోనే దర్శనమిస్తాడు. ఆ వెలుగు చూసిన తర్వాత కలిగే ఆనందం దానిని అనుభవించిన వారికి మాత్రమే తెలుస్తుంది. మిగిలినవారికి అది పిచ్చిగా కనిపిస్తుంది. కాబట్టి భగవంతుడిని దర్శించినవారు ఎప్పుడూ ఒంటరులే. వారు మిగిలినవారితో కలవనూలేరు, వదిలి వెళ్ళనూ లేరు. నిరంతరం ఆ ఆనందంలోనే లీనమై ఉంటారు. ఆ ఆనందంలో లీనమైన వారికి ఆ దేవుడు వేరు తాము వేరు అనిపించదు. భగవంతుడిని తమలోనే దర్శిస్తారు. అదే ఉత్కృష్టమైన స్థితి, అద్వైత భావం. ఈ భావాలన్నీ గీతాంజలిలో మనకు కనిపిస్తాయి.

**"ఈ వెలుగు, నా వెలుగు, యిలను నింపెడు వెలుగు,**

**కనుదోయి ముద్దాడి కదిలిపోయెడు వెలుగు!**

**చిత్తమ్ములో సుధలు చిలుకగల వెలుగు,**

**నాట్యమాడెడు నహో! నా బ్రతుకు నడుమ"**

**"నన్ను ప్రేమించుటను నిన్ను నా కిచ్చి, నీ**

**మధుర స్వరూప సంపదను నాలో కనెదు"**

**"భాగ్యమ్ము నొసఁగి నీ పంచ బ్రతుకగనెంచి**

**కష్ట సుఖాల నీ కడనె నిల్తునుగాని**

**మానవులతో నుండ మనసొప్పకున్నయది"**

**"అన్నిటిని మించినది, యందటికి నందనిది**

**పరిపూర్ణ భావమ్ము, పరమాత్మ రూపమ్ము"**

**"ఆత్మార్పణము చేసి యతని హస్తాలలో**

**కడకుపడ వలపునకు కాచియున్నా నిచట"**

ఈ స్థితిలో నున్నవానికి అందరిలో దేవుడే కనిపిస్తాడు. ఎవరినీ దూషించరు, తప్పుపట్టరు. సమదృష్టితో అందరినీ భగవత్ స్వరూపులుగానే చూస్తారు. నిరంతరం దైవస్మరణలోనే తమని తాము మరిచిపోతారు. ఎప్పటినుంచో భగవంతుడి రక్షణలోనే తానున్నట్లు భగవంతుడే పరమాప్తుడిగా భావిస్తారు.

**"నను జూచి పోనెంచి నా స్వామి ! యనుదినము**

**నెన్ని యుగముల నుండి యిట్లు నను దరియంగ**

**నరుదెంచుచుంటివో యరయనేరను నేను"** అంటారు.

ఇంకా

**"వచ్చుచున్నాదురా ! వచ్చుచున్నాడు**

**అహరహమ్ము చెంత కరుదెంచుచున్నాడు"** అంటారు

ప్రకృతి మొత్తంలో దేవుడినే దర్శిస్తారు. ప్రకృతిని చూసి పరవశిస్తారు.

**"తారకాభరితమై తనరు నీ వక్షమును**

**కప్పుకొని యా మబ్బు దుప్పటిని ముదమార**

**ప్రతి గడియకొక క్రొత్త వన్నియను గలిగించు"**

**"ఆకాశమును నీవె, యా గూడు నీవెరా!**

**సౌందర్యరూప నా స్వామి సర్వేశ్వరా!".**

**"అంతయు దానైన యానంద జీవమిది,**

**మచ్చులేనట్టి దిది, మెచ్చునగు సృష్టియిది!"** అని

సృష్టి సౌందర్యానికి, సృష్టికర్త గొప్పతనానికి మైరచిపోతాడు. తనను తానె భగవంతుడి కర్పించుకొనగా మృత్యుదేవత కోసం ఎదురుచూస్తాడు. ఎంతో వైరాగ్యభావంతో చావునే ఆప్తుడిగా భావిస్తాడు. ఎలాంటి బాధలేకుండానే భూమి వీడిపోను సిద్ధపడతాడు. తన జీవనంలో తనతో కలిసి నడిచిన వారందరినీ సెలసివ్వమని అడుగుతాడు. అలాగే పుట్టినవాడు గిట్టేటప్పుడు ఇక్కడ నుంచి తీసుకుపోగలిగేదేమీ లేదనే సందేశాన్ని కవి ఇస్తాడు.

**"నా తలుపుకడను నీ దూత మృత్యువు కాచె";**

**"మిత్తి నీకై వచ్చి మొత్త నీ తలుపులను**

**కాన్కగా నీ వీయగల వస్తువది యేది?"**

**"జీవితాంతమ్మునకు చిహ్నమా! మృత్యుదే**

**వా! రమ్ము నా చెవులఁ బల్కి పొదువుగాని"**

**"నన్నిట్లు బంధించు మన్నును కనరాని**

**దినము రావచ్చునని నే నెఱుంగుదును**

**నా బ్రతుకు తీయగా నను వీడిపోగలదు"**

**"ఏమియో గొందునని యెంచి నా యెదలోన**

**యేదియును గొనిపోక యేగుచుంటిని నేను"**

**"చీకటి గూటిలో చిన్న దీపమ్మారె!**

**స్వాగతం బందినది సాగిపోయెద నింక"** అంటారు కవి .

ఇంకా చివరి పద్యకంలో తాను దేవుడి దగరకు వెళ్ళి ఆయన ద్వారం ముందు ఉన్నానన్నట్లుగా

**"పంచేంద్రియమ్ములను బరవి చక్కగ నొక్క**

**వందనంతో నీదు పాదముల నంటి యా**

**విశ్వమును దాకనీ విశ్వేశ్వరా ప్రభూ!**

**కురియని నీటితో బరువైన వర్షకా**

**లాంబుదము నేలపై వంగియుండెడునట్లు**

**మానసంబెల్ల నీ మహా మందిర**

**ద్వారమ్ము ముందొక్క వందనములోఁ జిక్క**

**వంగనీవినతమై, స్వామి, చక్కని దొరా!"** అంటారు కవి.

ఈ విధంగా గీతాంజలిలో ప్రారంభ కవితావచనం మొదలు చివరి కవితావచనం వరకు మూలకవి రవీంద్రుడు వ్యక్తీకరించిన భావనలనే అనుభూతి చెంది శంకరంబాడి సుందరాచారిగారు సుందరంగా కవిత్వీకరించారు. తెలుగు వారి యెదలపై సుధలు చిలికారు సుందరకవి సుందరాచార్య.

**ఆధారగ్రంథాలు:**


1) శంకరంబాడి సుందరాచారి – గీతాంజలి

2) రవీంద్రనాథ్‌ఠాగూర్ – గీతాంజలి


**రాదగిన ప్రశ్న:**

1) గీతాంజలి సారాంశాన్ని రాయండి?

**– ఆచార్య ఇరపని మాధవి.**

## పాఠం - 4

# విజయశ్రీ

**- డా॥ జంధ్యాల పాపయ్య శాస్త్రి**

### 4.1. కవి పరిచయం:

జీవించినంతకాలం తన కవిత్వంతో పాఠకులను మురిపించి మైమరపించిన మధురకవి. డా॥ జంధ్యాల పాపయ్య శాస్త్రిగారు. కవి, పండితుడు. విమర్శకుడు, వ్యాఖ్యాత, సంపాదకుడు, బాలసాహిత్య కథకుడు, ఉపన్యాసకుడిగా పేరు గడించిన పాపయ్య శాస్త్రి గారు బహుముఖ ప్రజ్ఞాశాలి. 20 వ శతాబ్దంలో తెలుగు సాహిత్యంలో బాగా జనాదరణ పొందిన కవులలో ఒకరు. సులభశైలిలో చక్కని నుడికారంతో విన ఇంపు సొంపైన కవితలు రాసి పాఠక లోకాన్ని ఆనందింపజేసిన కవివర్యులు. వీరి కలం పేరు "కరుణశ్రీ".

**4.1.1. బాల్యం:** కరుణ రసభరిత కవిత్వం రాసి "కరుణశ్రీ"గా ప్రసిద్ధి పొందిన పాపయ్య శాస్త్రిగారు 08-04-1912 సం॥లో గుంటూరు జిల్లా పెద్దనందిపాడు మండలంలోని కొమ్మూరు గ్రామంలో జీవించారు. మహాలక్ష్మమ్మ, పరదేశయ్య వీరి తల్లిదండ్రులు.

**4.1.2. విద్యాభ్యాసం:** కరుణశ్రీ ప్రాథమిక, మాధ్యమిక విద్యను వారి స్వగ్రామమైన కొమ్మూరులోనే అభ్యసించారు. సంస్కృత భాషపై మక్కువతో శ్రీ భమిడిపాటి సుబ్రహ్మణ్యశర్మ, శ్రీ కుప్పా ఆంజనేయ శాస్త్రి గార్ల వద్ద సంస్కృత కావ్యాలు చదివారు. రాష్ట్ర భాషా విశారద, ఉభయ భాషా ప్రవీణ, హిందీ భాషా ప్రవీణ పరీక్షలలో ఉత్తర్ణులయ్యారు.

**4.1.3. ఉద్యోగం:** అమరావతిలోని శ్రీరామకృష్ణ హైస్కూల్లోను, గుంటూరులోని స్టాల్ గరల్స్ హైస్కూల్లోను కొంతకాలం ఉపాధ్యాయుడిగా పనిచేశారు. ఆంధ్రక్రైస్తవ కళాశాలలో 22 సంవత్సరాలు, మహావీర్ కళాశాలలో 3 సంవత్సరాలు, హిందూ కళాశాలలో 2 సంవత్సరాలు అధ్యాపకునిగా పనిచేశారు. తిరుమల తిరుపతి దేవస్థానం వారి పోతన భాగవతం ప్రాజెక్టుకి ప్రధాన సంపాదకునిగా పనిచేయడం వారి జీవితంలో మరపురాని సన్నివేశం.

**4.1.4. వివాహం-సంతానం:**

అనసూయా దేవి గారిని వీరు వివాహం చేసుకున్నారు. డా॥ జయకృష్ణ బాపూజీ, వెంకటరమణ వీరి కుమారులు. విజయలక్ష్మి అనే కుమార్తె ఉన్నారు.

**4.1.5. రచనలు:**

బాణభట్టుడు సంస్కృతంలో "కాదంబరి" అనే వచన కావ్యం రాశారు. దానిని పాపయ్య శాస్త్రిగారు సులభ శైలిలో తెలుగులోకి అనువాదం చేశారు. దానికి "కళ్యాణ కాదంబరి" అని పేరుపెట్టారు. పుష్ప విలాపము, కుంతీకుమారి, ఉదయశ్రీ, విజయశ్రీ, కరుణశ్రీ, ఉమర్ ఖయామ్, ఆనంద లహరి, ప్రేమమూర్తి (బుద్ధ చరిత్ర), అరుణ కిరణాలు అనురాగ లహరి వంటి రచనలు ప్రసిద్ధి పొందాయి. మహతి, మందారము, బాలభారతి, గురుదక్షిణ, ఇంద్రధనస్సు, చందమామలో కుందేలు, కలయన్ దంపతులు, పూజా పుష్పాలు, సింహం మెచ్చిన చిట్టెలుక, శైలజ, మత్స్య యంత్రం, బంగారు ముంగిస, భవ్యభారతి, ఆదర్శ భారతి పురాణ భారతి, కళ్యాణ భారతి, దళిత భారతి, వీర భారతి, విశ్వ భారతి, ప్రతిభా భారతి, వినోద భారతి, చమత్కార భారతి, ఉపదేశ భారతి, ముద్దు బాల శిక్ష వంటి ఎన్నో పిల్లల కథలు రాశారు. (బాల సాహిత్యం), మొత్తం 76 గ్రంథాలు వీరి లేఖిని నుండి వెలువడ్డాయి. పిల్లల పాఠ్యపుస్తకాలు కూడా రచించారు. వీరి రచనల్లో పుష్ప విలాపము, కుంతీకుమారి ప్రసిద్ధి పొందాయి.

**4.1.6. పురస్కారాలు, గౌరవాలు:**

కరుణశ్రీ జంధ్యాల పాపయ్య శాస్త్రిగారు ఎన్నో పురస్కారాలను సొంతం చేసుకున్నారు. 1985 ఏప్రియల్ 29 న మద్రాసు వారు "తెలుగు అకాడమి" పురస్కారంతో వీరిని గౌరవించారు. 1987 జూన్ 27 న రసమయి పురస్కారం (హైదరాబాదు) అందుకున్నారు. 1989 జనవరి 27 శుభాంగి పురస్కారం (హైదరాబాదు) వీరి సొంత మయ్యింది . 1989 ఏప్రిల్ 9 ఆభిరుచి పురస్కారం (ఒంగోలు) ఏప్రిల్ 17న బాపట్లలో నలంద కృష్ణరాయ పురస్కారం, నవంబర్ 8 సింధూజ పురస్కారం (సికిందరాబాదు) లభించాయి. అదే సంవత్సరం జూన్ 24 న హైదరాబాదులో డా॥ పైడి లక్ష్మయ్య పురస్కారం పొందారు. 1990 జూన్ 24 వ తేదీన హైదరాబాదులో "మహామంత్రి మాదన్న పురస్కారం" వీరిని వరించింది. 1990 అక్టోబర్ 26 న మద్రాసులో యార్లగడ్డ రంగనాయకులు పురస్కారం వశపరచుకొన్నారు. 1991 మార్చి 13న హైదరాబాదులో బూర్గుల రామకృష్ణారావు పురస్కారం లభించింది.

ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ విశిష్ట సభ్యత్వం అందుకున్నారు. ఢిల్లీలో అఖిల భారత కవి సమ్మేళనంలో పాల్గొన్నారు. విజయవాడలో "సువర్ణ ఘంటాకరణం, కనకాభిషేకం, సన్మానాలు" పొందారు. తెలుగు వెలుగుగా నాటి రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ యన్.టి. రామారావు గారి నుండి సత్కారం గ్రహించారు. రాష్ట్రపతి జ్ఞాని జైల్‌సింగ్ గారి చేత ఢిల్లీ ఆంధ్రభవన్‌లో గౌరవించబడ్డారు. శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం నుండి డి లిట్ పట్టా పొందారు.

**4.1.7. ఇతర అంశాలు:** పాపయ్య శాస్త్రిగారు ఇంకా అనేక అంశాలలో చురుకుగా పాల్గొని తన ప్రతిభను కనపరిచారు. 1951-53 కాలములో 11 సుభాషిణి అనే మాస పత్రికకు సంపాదకత్వం వహించారు. 1961 జనవరి 24 న కొత్త ఢిల్లీలో జరిగిన జాతీయ గోష్ఠిలో పాల్గొన్నారు. 1972 సెప్టెంబర్ 25న పుట్టపర్తిలో పుట్టపర్తి శ్రీ సత్యసాయిబాబాగారి "దైవ సన్మానం" స్వీకరించారు. వీరి "పుష్పవిలాపము", "కుంతికుమారి", "ఆనందలహరి" కావ్యాలను డా॥ అమరేంద్రగారు ఆంగ్లంలోకి తర్జుమా చేశారు. డా॥ సూర్యరాయ భానుగారు ఈ కావ్యాలను హిందీలోకి అనువాదం చేశారు. గాన గంధర్వులుగా పేరు పొందిన ఘంటసాల వెంకటేశ్వరరావుగారు "అద్వైత మూర్తి", "సంధ్యశ్రీ", "పుష్ప విలాపము", "కుంతీకుమారి", "అంజలి", "కరుణామయి", "ప్రభాతి" కావ్యాలను గానం చేశారు.

జంధ్యాలవారు "భువన విజయం" నాటకంలో ముక్కుతిమ్మనగా, "భారతావతరణము" నాటకంలో నన్నయగాను, "ఇందిర మందిరము" నాటకములో చేమకూర వెంకటకవిగా, "బ్రహ్మ సభ" నాటకంలో పోతనగాను పాత్రధారణ చేశారు. శాస్త్రిగారి ఉదయశ్రీ "స్వర్ణోత్సవం", "విజయశ్రీ", కరుణశ్రీ రజతోత్సవాలు నాటి గౌరవ ముఖ్యమంత్రి శ్రీ నందమూరి తారక రామారావు గారి ఆధ్వర్యంలో నిర్వహించబడటం గర్వించదగిన విషయం.

**4.1.8. నిర్యాణం:**

20వ శతాబ్దంలో తెలుగు సాహిత్యాన్ని కరుణ రసప్రధానంగా సాగించి ప్రజాదరణ పొందిన మహనీయులు పాపయ్య శాస్త్రిగారు. వీరు 1992 జూన్ 21 న స్వర్గస్తులయ్యారు.

## 4.2. పాఠ్యభాగ సందర్భం:

కరుణశ్రీ జంధ్యాల పాపయ్య శాస్త్రిగారు చదువుకునే రోజులలో కుప్పా శ్రీ ఆంజనేయ శాస్త్రిగారు భారతం పాఠం చెప్పేవారు. అప్పుడే వీరికి విజయుడి మీద (అర్జునునిపై) అపార అభిమానం కలిగింది. ఆంధ్ర క్రైస్తవ అధ్యాపకులుగా పనిచేసే రోజులలో ఈ కావ్యం రాశారు. డా॥ నందూరి రామకృష్ణమాచార్యులుగారు వీరిని ప్రేరేపించారు.

"విజయశ్రీ" వీరరస ప్రధానమైన పద్య ఖండిక. ఇందలి ఇతివృత్తం శ్రీమదాంధ్ర మహాభారతంలోనిది. కురువంశ వీరులైన కౌరవ పాండవులు మధ్య రాజ్యం కోసం "కురుక్షేత్ర సంగ్రామం" జరిపారు. రాజ్యం కొరకు పాండవ కౌరవుల మధ్య 3 రాయబారాలు జరిగాయి. ద్రుపద పురోహిత రాయబారం, సంజయ రాయబారాలు విఫలమయ్యాయి. తరువాత శ్రీకృష్ణుడు పాండవుల తరుపున రాయబారిగా వెళ్ళాడు. పాండవులకు ఐదుగురికి ఐదు ఊళ్ళు ఇస్తే చాలు అని చెప్పినా దుర్యోధనుడు సూది మొన మోపే స్థలం కూడా ఇవ్వనని నిరాకరించడం వల్ల యుద్ధం జరిగింది. ఆ ఇతివృతాన్ని స్వీకరించి శాస్త్రిగారు విజయశ్రీ కావ్యాన్ని రాశారు.

శ్రీకృష్ణరాయబారానంతరం పాండవులు యుద్ధ సన్నద్ధులవడం, యుద్ధ ప్రారంభం, అర్జునుని విషాదం, కృష్ణ ప్రబోధం తరువాత నరనారాయణులు విజృంభించడం ఇందలి కథ. స్వాతంత్ర్య సంగ్రామ కాలంలో వచ్చిన కావ్యం కావడం వల్ల ఇందలి కథ భారత ప్రజలలో సమరోత్సాహాన్ని కలిగించేదిగా ఉంది. ముఖ్యంగా కుంతీదేవి తన కుమారులకు పంపిన సందేశం భరతమాత తన పుత్రులకు ఇచ్చే సందేశమే అనిపిస్తుంది. శాస్త్రిగారు ఈ కావ్యాన్ని తన ప్రియమిత్రుడు "శ్రీ ఆదిపూడి శ్రీకృష్ణమూర్తికి" అంకిత మిచ్చారు.

అధర్మం ధర్మంపై విజృంభించింది. రారాజు దుర్యోధనుని అరాచకాలు మితిమీరాయి. పాండవులను ఎన్నో ఇబ్బందుల పాలు చేశాడు. కర్రలతో బాధించాడు. కత్తులతో పొడిపించాడు. కాళ్ళు చేతులు కట్టేసి కారాగారంలో ఉంచాడు. అన్నంలో కాలకూటం కలిపించాడు. లక్క ఇల్లు కాల్పించాడు. మోసంతో మాయపాచికలు వేసి రాజ్యం కాజేసి పాండవులను అడవుల పాలు చేశాడు. 13 సంవత్సరాలు అరణ్యవాసం, ఒక సంవత్సరం అజ్ఞాతం చేయించాడు. రాజ్యం కోసం రాయబారాలు నడిపినా సంప్రదింపులన్నీ విఫలమయ్యాయి. అప్పుడు పాండవులు యుద్ధానికి సిద్ధమయ్యారు. వారు సమావేశమై యుద్ధం చేయడానికి వారివారి అభిప్రాయాలు చెప్పే సందర్భంను స్వీకరించి పాపయ్య శాస్త్రిగారు ఈ కావ్యాన్ని రాశారు.

మంత్రాలోచనం, స్కంధావారం, విషాదం, ప్రబోధం, విజృంభణం అనే ఐదు భాగాలు ఈ ఖండికలో ఉన్నాయి. శ్రీకృష్ణుని మంత్రాలోచనతో పాఠ్యభాగం ప్రారంభమౌతుంది.

## 4.3. పాఠ్యభాగ సారాంశము:

**1. మంత్రాలోచనము:** కృష్ణ పరమాత్ముడు పాండవుల తరుపున రాయబారిగా కౌరవుల వద్దకు వెళ్ళాడు. ఆ ప్రయత్నం విఫలమయ్యింది. పాండవుల వద్దకు వచ్చి కౌరవులతో జరిగిన చర్చను వివరిస్తూ వారివారి అభిప్రాయాలను తెలుసుకుంటున్నాడు. వారి మధ్య చర్చ ఈ విధంగా జరిగింది.

**శ్రీకృష్ణుడు:** సంధి జరిపించాలి అనే కుతూహలం కూడా తీరిపోయింది. వీర భారత రణరంగం దగ్గర పడింది. మీరు ఆయుధాలు ధరించండి. రాయబార ప్రయత్నమంతా వృధా అయ్యింది. సంప్రదింపులు విఫలమయ్యాయి. జయాపజయాలు ఎలాఉన్నా మీ గుణగణాలు వారి గుణగణాలు ప్రజలంతా గ్రహించారు. మీకు వారికి పొందు కుదురుతుందని వెళ్ళాను. నా శ్రమ వ్యర్థమైపోయింది. రాజుకి స్వార్ధ బుద్ధి ముదిరిపోయింది. దుర్యోధనుడు తన చేతి మీదుగా సూదిమొనమోపే అంత భూమి కూడా ఇవ్వడట. కౌరవ ప్రభువుకి ఎక్కడి రాక్షస రాజ్యకాంక్షమా! (ఎవరి నుండి ఆ స్వార్ధ బుద్ధి నేర్చుకున్నాడో అని అర్థం).

భీష్ముడు అయిదూళ్ళు ఇమ్మన్నాడు. గురువైన కృపాచార్యుడు ఏదో ఒక విధంగా సంధి కానిమ్మన్నాడు. విచిత్ర వీర్యుని తనయుడు (ధృత రాష్ట్రుడు) విరోధ మెందుకు పోనివ్వండి అన్నాడు. వారి మాటలు విన్న తరువాత దుర్యోధనుడు తన తమ్ముళ్ళ

బలం చూసి, కర్ణుని మొఖం చూసి సంధి కుదరదు పొమ్మన్నాడు.

సంపదలు తొలగి ఘోరమైన వనాలలో చెట్టుకొక్కరు పుట్టకొక్కరై తిరిగి యాతన పడిన వారు మీరు. (పాండవులు). వారికి ఏమీ సంబంధం లేని సంపదను తింటూ హాయిగా దొరలై బ్రతుక మరిగినవారు (అలవాటు పడినవారు) వారు (కౌరవులు). యుద్ధంలో ఖడ్గాలు, గదలు, గాండీవాలు విహరించకుండా (కత్తి తిప్పకుండా) రాగాలాపపు మాటలతో వారు మీకు రాజ్యం ఇస్తారయ్యా? మదాంధులైన కౌరవులు కాలుని దున్నపోతు చిఱుగంటల మోతకు గాక (యమ ధర్మరాజు) సంధి వాక్యాలకు చెవి ఒగ్గదురటయ్యా? రాజులందరికి గుండె గాలమై యుద్ధం దాపురించింది. కురు చక్రవర్తికి (దుర్యోధనునికి) కాలం దాపురించింది. మాయ సంపదలు కలకాలం నిలుస్తాయా?

సంధి కుదర్చడానికి పోయిన నన్ను బంధించడానికి ప్రయత్నించారు. సంధి ప్రయత్నం చెరసాలలో బంధించడానికి త్రోవతీసింది. కాబట్టి ఈ సంధి ప్రయత్నం ఇంక చాలు. ద్రౌపది వేణి (జుట్టు) ముడి వేసికొనే సమయం ఆవశ్యకమయ్యింది. భీమునిచే ఈ క్రియ (ద్రౌపది కోపం చల్లారుట) జరుగుగాక! అని వారిని (పాండవులను) యుద్ధానికి సన్నద్ధులను చేసినట్లుగా (పురికొల్పినట్లుగా) కృష్ణుడు చెప్పాడు. కృష్ణుని మాటల సారాంశం తెలుసుకొని భీముడు తన అభిప్రాయం ఈ క్రింది విధంగా తెలియ జేస్తున్నాడు.

**భీముఁడు:** తాళ్ళతో కట్టి ప్రవహించే నీళ్ళల్లో నన్ను పడేశారు. విషం కలిపిన అన్నం తినిపించారు. ఏ ఇబ్బందీ కలుగలేదని మమ్మల్ని కాశీయాత్రకు పంపించారు. అక్కడ లక్క ఇల్లు తగలబెట్టారు. అడవులకు పంపించారు. అడువులలో తిరిగేటట్లు చేశారు. పరమ సాధ్వియైన ఈ ద్రౌపదికి ఆ పాట్లు కల్పించారు. (ఇబ్బందులు లేదా కష్టాలు) ఇప్పుడు మా భాగం మాకు ఇవ్వమంటున్నారు. ఎంత అబ్బా! వారు ఎంత మంచి తోబుట్టువులో!

ఒక వీరభారత కులస్త్రీ కంటినుండి వెచ్చని కన్నీళ్ళు భూమిపై పడేవిధంగా నీచ దుష్ట సాహసం చేసిన చెడుదినాలు అవి. ధర్మం మంచి రాక్షసత్వంతో ఒక మహాసాధ్విని (నిండుసభలో) పదిమందిలో పైట పట్టుకొని లాగిన దుర్ముహూర్తాలు అవి. అది పాంచాలి వస్త్రాపహరమ్మా! కాదు ఆ కౌరవులను ప్రేతల భూమికి పంపటమే. అవును అది నూటికి నూరుపాళ్ళు నిజం. అది వేణీ గ్రహణమా? కాదు వికృత నాట్యం చేస్తున్న మృత్యుభయం కలిగించే కాంతను చేపట్టుట (వివాహమాడిన) . భవిష్యత్తు (రాబోవు రోజులు) ఎంత ఘోరంగా ఉంటాయో ఆశ్చర్యం. విధి అలా జరగాలని ఉంది కాబోలు. ఆ దుష్ట చరిత్రులు, దుర్జనులు, దురాత్ములు, దుర్మద గ్రస్తులైన కౌరవులకు నేటికి కూడా పశ్చాత్తాపం కలుగుట లేదు. ఇంత జరిగినా, ఇప్పటికీ బుద్ధి రాలేదని అర్థం. ఆ పాపం పోవడానికి ప్రాయశ్చితం (బదులు) ఏమీ లేదు. ఘోర యుద్ధం జరగటమే కర్తవ్యం అవుతుంది.

దుర్యోధనుడెవ్వడు రాజ్యమేలడానికి! అధిక భుజ శక్తితో ఆ సేతు హిమాచలాన్ని రాజ్యంగా పరిపాలించిన వాడు పాండు మహారాజు. (పాండవుల తండ్రి) ఆ రాజ్యాన్ని (ఆయన కష్ట ఫలాన్ని) స్వాధీనం చేసుకొని సింగారించుకొని కొలువుండి తినడానికి వారి తల్లి గాంధారి కడుపున పెట్టి పుట్టారు. సముద్రంచే చుట్టబడిన ఈ రాజ్యమంతా (ద్వీపకల్పమైన భరతభూమి) మా తండ్రి వల్ల ఆ గుడ్డి రాజుకి (ధృతరాష్ట్రునికి) లభించింది. అటువంటి రాజ్యాన్ని నేడు ఏవిధంగా వదులుకుంటాడు లోభియైన ఆ దుర్యోధన చక్రవర్తి? ఐదు ఊళ్ళు కూడా ఇవ్వడు. ఓ కృష్ణా! పెద్దవారికి ఇక ప్రారంభం ఎలా ఉందో! అని భీముడు తన హృదయ ఆవేదనను తన కర్తవ్యాన్ని కృష్ణునికి తెలియజేశాడు.

**అర్జునుడు:** భీముని మాటలు విన్న అర్జునుడు ఈ విధంగా మాట్లాడాడు–

దొరలమని పట్టు పాన్పులపై రాజసంతో విర్రవీగుతూ దొర్లే రోజులు పోయినవి. ప్రపంచం మారిపోయింది. కుటిలురైన కురు కుమారులు మనల్ని కాదులే అని ఏమి పట్టనట్లు కళ్ళుమూసుకొని ఈ అర్జునుని ఆయుధమైన కఠోరమైన గాండీవాన్ని నిద్దుర మేల్కొల్పారు.

పచ్చని రాజ వంశాన్ని (రాజ్యాన్ని) పాడు చేయడానికి కారుచిచ్చులాగ దుర్యోధనుడు జన్మించాడు. కర్ణుని స్నేహం అతనికి తోడయ్యింది. శకుని ఆమంటలను పెచ్చు పెరిగి కీలలు పైకి లేచేటట్లు చేశాడు. మంట రగులుకొని ఆకాశాన్ని అంటింది. విశ్వశాంతికై ఇక అర్జునుడు బాణాల వర్షం కురిపించక తప్పదు. ఆ సభలో గాడిదల్లాగ స్త్రీని లాగి కౌరవులు చేసిన చేతలు, (పనులు) నీచమైన నాలుకలతో కూసిన (వాగిన) కూతలు (మాటలు) ఇప్పటికీ నా మనసును కోతకోసినట్లైనవి. అవి నేటికీ (ఆ గాయాలు) చెరగక అట్లే ఉన్నవి. కౌరవులకు, వారి బంధులకు ఓ కృష్ణా ఇక వాడియైన బాణపు గుంతలు రాసిపెట్టాయి. అంటే యుద్ధమే వారికి తగినదని నిర్ణయించబడిందని అర్థం.

యుద్ధం తప్ప వేరొక విధానం వారికి నచ్చదు. విల్లు ధరించడం తప్పు వేరొక కార్యం లేదు. మదించిన వేదండం లాగ దైవబలం ధరించిన భీముడు గదా దండు తిప్పితేనే కదా యుద్ధానికి కాలు దువ్వటం, పుట్టిన నాటినుండే (పుట్టినప్పటినుండే) అంటే పుట్టుకతోనే కౌరవులకు ద్వేషం అనే భయంకర అగ్ని కీలలుగా మారి వారి బుర్రల్లో మష్ఠు కట్టింది. క్రూరులైన వారు మంచి మాటలు చెవిని బెట్టి (విని) సంధికి ఒప్పుకుంటారా? ఒప్పుకోరు. కాబట్టి ఇక మాకు వారిని ఢీకొని చితకకొట్టక తప్పదు. ముసలి రాజు గుడ్డోడంట. యువరాజు (దుర్యోధనుడికి) మదంతో కళ్ళు కనపడవు. రాజు బంధువులు జూదగాళ్ళట. మరి మంచికి మార్గం ఎక్కడుంది. దట్టమైన గర్వపు చీకటిలో తడిసి స్వార్థమనే పిచాచి గజ్జ గట్టిగా (స్వార్థం అనే పిచాచి వారిలో నాట్యం చేస్తుంటే) మీరు ప్రేమగా చేసే ప్రయత్నాలు కొనసాగుతాయా? సంధి కుదురుతుందా?. (కుదరదు అని భావం).

సంధి ఎట్టి పరిస్థితిలో కుదరదు. ఆ స్వార్థ చింతనులకు యుద్ధమే శరణ్యం అన్న అర్జునుని మాటలు విని నకులుడు ఈ విధంగా చెప్పాడు.

**నకులుడు:** పాండవులు ద్వైత వనంలో ఉన్నప్పుడు దుర్యోధనుడు కర్ణుడు మొదలైన వారితో కలిసి గోవులను లెక్కించుటకు అనే నెపం చెప్పి తన తండ్రియైన దృతరాష్ట్రుని దగ్గర అనుమతి తీసుకొని పాండవులకు తమ వైభవం చూపించి హేళన చెయ్యాలని ప్రయాణమై వెళ్ళాడు. ఆ మార్గంలో ఒక నది ఒడ్డున గంధర్వులతో వివాదానికి దిగి చిత్రసేనుడు అనే గంధర్వుడి చేతిలో ఓడిపోయాడు. కర్ణుడు పారిపోగా మిగిలిన వారిన గంధర్వులు బంధించారు. ఆ విషయం తెలుసుకున్న యుధిష్ఠరుడు (ధర్మరాజు) అర్జునుని పంపించాడు. అర్జునుడు ఆగ్నేయాస్త్రం ఉపయోగించి ఒక్క దెబ్బతో 10 లక్షల మంది గంధర్వులను చంపాడు. చిత్రసేనుడు అర్జునుని నైపుణ్యానికి మెచ్చుకొని సమ్మోహనాస్త్రం ఇచ్చాడు. ఆ సందర్భం గుర్తు చేస్తూ కౌరవ కులాభరణమైన దుర్యోధనుడు ఘోషయాత్ర నాటి పాండవ బలం తెలుసుకోలేడా? చిత్ర సేనుని కఠిన శృంఖలాలతో బంధించబడ్డాడు. చేతికి వేసిన ఆ సంకెళ్ళు గుర్తులైనా లేవా? పాండవులు విరాట రాజు కొలువులో అజ్ఞాతవాసం ఉన్న సమయం చివరి గడియలలో కౌరవ సేన విరాటరాజు గోవులను తోలుకొని పోతుంటే ఉత్తరుని రథసారధిగా ఉన్న బృహన్నల (అర్జునుడు) వారిని చితక బాది గోవులను రక్షించాడు. అప్పుడు వీపు బద్దలైన తీరు కౌరవ వీరులు మరచి పోయారేమో! ఒక్కసారి బుర్రబెట్టి ఆలోచిస్తే గుర్తుకు వస్తుంది.

వంకర బుద్ధిగల వంద విషపురుగుల గుంపుకి చిక్కి కురుకులం అనే లతామతల్లి (శ్రేష్టురాలు) సౌందర్యం తరిగిపోయింది. నేటి నుండి కుంతి దేవి కుమారులు అనే ముత్యాల గొడుగు నీడన చేరి సేదదీరి సౌందర్యం పొందుగాక (కుంతీ కుమారులను 100 విషపురుగులుగా, పాండవులు ముత్యాల గొడుగా చెప్పబడింది).

ఆ నూరుతలల నాగు (100 మంది కౌరవులు) తన సామర్థ్యంతో సౌకుమార్య సుందరియైన ఆ కురుకుల యశస్సుని (కీర్తిని) మ్రింగాలని చూస్తుంది. అది పడగ పైకెత్తి నెత్తిమీద పడకముందే పౌరుషంగల నకులుడు మిక్కిలి ప్రకాశవంతంగా విజృంభించి నేలపై పడును. అంటే కౌరవుల చేతిలో చావు దెబ్బ దగలక ముందే నేను యుద్ధానికి సిద్ధం అని తన మాటగా చెప్పాడు.

**సహదేవుడు:** దోషమో మోసమో జూదము ఆడటం జరిగింది. కౌరవులు గెలిచారు. దుష్టుడైన దుశ్శాసనుడు చేయి ఎత్తి ద్రౌపదిని లాగుకొని వచ్చిన క్రూరమైన ప్రభుత్వము ముందు దాసిగామారి దోసిలి చాపి (రెండు చేతులు చాపి) ద్రౌపది రాజ్యం తెచ్చుకుంది. ధర్మజుడు ఇంద్రప్రస్థపురమునకు రాజై రాజసూయ యాగం చేశాడు. ఆ యాగానికి ధర్మరాజు దుర్యోధనుని కూడా ఆహ్వానించాడు. యాగానికి వచ్చిన అతిథులందరికి స్వయంగ ద్రౌపదియే సకల మర్యాదలు చేస్తుంది. పాండవ సభలో మణులతో కూడిన స్థలాన్ని చూసి దుర్యోధనుడు జలాశయం అనుకొని తన వస్త్రాలను పైకి తీసుకున్నాడు. తరువాత జలశయాన్ని చూసి మణిమయ స్థలమనుకొని బట్టలు తడుపుకొన్నాడు. అది చూసి ద్రౌపది నవ్వింది. ద్రౌపది తనను పరాభవింప చేసిందనుకొని ఆమెను వంచించడానికి నిశ్చయించుకొన్నాడు. కొంతకాలం గడిచిన తరువాత దుర్యోధనుడు హస్తినాపురానికి పాండవులు ఐదుగురిని, వారి భార్యయైన ద్రౌపదిని ఆహ్వానించాడు. ద్రౌపది గాంధార్విలను, ఆమె కోడండ్రతోను ముచ్చటాడుచుండెను. ధర్మరాజు పాచికలాడి ద్రౌపదిని ఓడిపోయను. ప్రాతికామి వచ్చి ధర్మరాజు నిన్ను ఓడిపోయాడు కాబట్టి దుర్యోధనుడు నిన్ను పిలుచుకొని రమ్మన్నాడని చెప్పెను. ద్రౌపది ఆశ్చర్యపోయి "ధర్మరాజు ఓడిన పిదప నన్ను ఓడెనా? యోటు పడకపూర్వమే యొడ్డెనా?" అని ప్రశ్నించెను. సభలో ఉన్నవారే నీ ప్రశ్నకు జవాబు నిర్ణయించెదరు.

రాజాజ్ఞకు భయపడి సభకి వెళ్ళి కురువృద్ధులకు దగ్గరగా నిలుచుంది. ఆమెను సభమధ్యలోకి ఈడ్చుకు రమ్మని దుర్యోధనుడు చెప్పగా దుశ్శాసనుడు జుట్టు పట్టుకొని లాగాడు. ద్రౌపది ఏడుస్తూ ఉంటే ఆమె వస్త్రం లాగివేయమని ఆజ్ఞాపించెను. వెంటనే దుశ్శాసనుడు వస్త్రము లాగుతూ ఉండగ తనను రక్షించేవారు లేక ద్రౌపది శ్రీకృష్ణుని వేడుకొనెను. కృష్ణుని అనుగ్రహంవల్ల దుశ్శాసనుడు ఎంతలాగినా ఆమెను వివస్త్రను చేయలేకపోయెను. ఆమె పాతివ్రత్య ప్రభావము తెలుసుకోలేని దుర్యోధనుడు నీచ సంజ్ఞలు చేసెను. ధృతరాష్ట్రుడు కొడుకుని మందలించి ద్రౌపదిని వరం కోరుకోమనెను. తన భర్తల దాస్యం పోగొట్టి వారి ఆయుధాలు వారికిమ్మని కోరెను. ఇంకా కోరుకోమనగ రాజకాంతలు రెండుకంటే ఎక్కువ వరాలు కోరకూడదు కావున తన భర్తలతో కలిసి ఇంద్రప్రస్థమునకు వెళ్ళెను. దానిని గుర్తు చేస్తూ అటువంటి రాజ్యం కోసం అయ్యో పాండరాజు పుత్రులు చావలేని వార్రై రాయబారం చేశారు.

ఆడాము, ఓడిపోయాము, తర్వాత దానిని ఆ గుడ్డిరాజు (ధృతరాష్ట్రుడు) అధికమైన కపట ప్రేమతో కోడలైన (తమ్ముని కోడలైన) ద్రౌపదికి ఇచ్చాడు. ముందు ఓడిపోయి మళ్ళీ దానినే ఓడిపోయి అడవులలో తిరిగి నేడేమీ మాట్లాడక భాగమిమ్మనుటయు కౌరవ రాజు ఇవ్వక పోవటమునూ! (వ్యంగ్యోక్తి). ఆడది ఏడ్చి దయారస భిక్షగా సంపాదించిన రాజ్యం కోసం భుజబలం కోల్పోయిన వార్రై కుంతీ కుమారులు చేయిచాపుట (దయగా అడగటం) సిగ్గు, ఎగ్గు విడిచి పెట్టటం కాదా? దేహీయని పగవారిని వేడుకుంటారా? చంద్ర వంశకుల ప్రతిష్టను నేడు ఈ విధంగా బూడిదపాలు చేశాముపో! (ఇంకా ఏమి

చేయగలం అంతా జరిగిపోయింది అని భావం).

బావను హస్తినాపురానికి పంపడం అనవసరమని నా మనస్సులోని భావాన్ని ముందే స్పష్టంగా చెప్పదలచి కూడా శుభం తలపెట్టి పోతున్న దానికి అశుభమని తలచి మనసులోనే దిగమింగాను. దాచుకున్నాను. మౌనంగా ఉన్నాను. మా బావ సుఖంగా తిరిగివచ్చాడు నేటికి అదే పదివేలు. అంటే కృష్ణుని బంధించకుండా పంపారు అంతే చాలు అని అన్నాడు.

**పాంచాలి:** సహదేవుని నలుగురు అన్నదమ్ములు వారి వారి అభిప్రాయాలు చెప్పిన తరువాత ద్రౌపది పాండవులను ఉద్దేశించి ఈ విధంగా ప్రశ్నిస్తుంది. భుజ బలం అధిగమించే విధంగా ముందుకు నడుస్తారో! (యుద్ధానికి పోతారో) పాండవ రథాలపై ఉండే జెండాల గుర్తులు (జెండాలు) వంగినట్లుగా వెనుతిరుగుతారో! బాణాలు పట్టి (ఆయుధాలు ధరించి) శౌర్యం చూపుతారో! చేతులు జోడించి విహారం చేస్తారో! క్షత్రియ కుల ప్రతిష్టతను విడిచిపెడతారో! శత్రువుల పాదపద్మాలను (కోమల పాదాలకు) పొగడుతారో! అడవులపాలై కందమూలాలు తింటారో! తత్వజ్ఞానంతో ఆలోచించి ధర్మశాస్త్రం సృజిస్తారో! గత కాలంలో మీరు చేసిన ప్రతిజ్ఞలను గుర్తు చేసుకోండి. విల్లులు, కత్తులు ధరించండి. గర్వంతో కరడుగట్టిన కౌరవులను నాశనం చెయ్యండి.

గౌరవ కాంతులు వెదజల్లుతూ రాజ్యాన్ని పొందండి. రథం అధిరోహించి యుద్ధం చేయుటలో మిక్కిలి గొప్పవాడైన యుధిష్ఠిరుడు ఎంతటి కార్యమైనా సాధించగలడు. అజాత శత్రువు అనిపించుకొనే కోరికతో సొంత ప్రజల మేల్కొలుపును మరచిపోతారా? అని ద్రౌపది వారిని యుద్ధానికి ఉత్తేజపరుస్తూ తన మాటలు వినిపించింది.

**ధర్మరాజు:** తన సోదరులు, ద్రౌపది అభిప్రాయాలు విన్నాక ధర్మజుడు శ్రీకృష్ణునితో తన ఆవేదనను ఇలా తెలియజేస్తున్నాడు. కృష్ణా! సంధి కుదిరితే మాకు కౌరవులకు చిన్నతనం నుండి ఉన్న ఆ భేదాభిప్రాయాలు తొలగుతాయి అనుకున్నాను. లోకశాంతి కోరే జగతికి బంధువుడవైన నిన్ను పంపాను. గాంధారి పుత్రులకు యుద్ధకాంక్ష తగునా? అన్నదమ్ముల మధ్య గొడవలు మంచిది కాదు. రాజ్యంలో సగభాగం ఇస్తే చాలు. అది న్యాయమని మేము ఇంతగా కోరుతుంటే ధృతరాష్ట్రుని కొడుకులు తెగించారు.

అయ్యా! హింస చేస్తూ జీవించే వారిని ధర్మ శాస్త్రజ్ఞులు ప్రశంసిస్తారా? దుఃఖమయ హింసాహుతులు లేకుండా ఈ సంసారపు యజ్ఞం సాగదా? (గడవదా?) సింహాసనం కోసం బంధువులను (అయినవారిని) చంపలేను. మా స్వార్ధ చరితతో "భారత సంహిత" కు మచ్చ తేలేను. ఓ కృష్ణా భయంకర యుద్ధ ఘోషతో మారణ కాండ సృష్టించి కౌరవులను చంపి వారి రక్త కిరణాలతో నిండిన రాజ్య సంపద పొందిన వాడినగుట నాకు సిగ్గుచేటు.

అయ్యా! ఓ కృష్ణా! ధనం కోసం (సంపదల కొరకు) పరమార్థాన్ని మరచి ఒకరితో ఒకరం పోటీపడి యుద్ధం చేస్తే భరత వంశం అభివృద్ధి చెందుతుందా? అయినవారిని చంపి రాజై సుఖంగా గడపాలనే కోరిక కంటే వైరాగ్యంతో కాషాయి వస్త్రాలు ధరించి అడవులకు పోయి తపస్సు చేసుకోవడం మంచిది కదా!

ధృతరాష్ట్రుని సంతానం సంధికి ఒప్పుకుంటుందని సంతోషించాను. ఇక శాంతియా? పరాక్రమమా? ముందుండి మమ్ములను ఓ కృష్ణా మీరే నడిపించి కాపాడండయ్యా! అని తన బాధను వ్యక్తపరిచాడు.

**పాంచాలి:** యుధిష్ఠురుని మాటలకు ద్రౌపదికి కోపం అధికమయ్యింది. ప్రతిసారి ఒకే మాటలు (సంధి అని) ఎందుకు? కూటికోసం తోటి రాజుతో బేరాలాడటం పలుచన. అంతేకాకుండ వారు సంధికి తిరస్కరించి యుద్ధానికి సిద్ధమని ఆయుధాలు ఎత్తుతుంటే కేవలం విచారించుకుంటూ మెడలు చాపి కన్నీరు కార్చటం ఎంతైనా నీచం. సంధి జరిపించడం అయిపోయింది.

మీరు నమ్మిన అహింస అయిన వారిలో హింసగా మారింది. ఇక చాలు. మనం పీడించబడి యాతన పడుతున్నామని తెలుసుకొని ఇప్పటికైనా ఆయుధాలు తీయకుండా ధర్మాన్ని వల్లెవేయడం నమ్మిన వారి గొంతులు కోయటం కాదా?

గౌరవప్రదుడైన ద్రుపద మహారాజుకి పుట్టాను. వారికి సమానుడైన పాండు మహారాజుకి కోడలయ్యాను. గొప్పవారు, అభిమానవంతులైన పాండవులకు భార్యనయ్యాను. పరాక్రమముగలవారు ధైర్యవంతులు అయిన కొడుకులను కన్నాను. (ప్రతిభుడు, సుతసోముడు, శృతకీర్తి, శతానీకుడు, శతకర్ముడు అనే ఉపపాండవులు ద్రౌపది కొడుకులు). భర్తలు సిగ్గుమాలిన వారైతే అయ్యో ఏ విధంగా దాస్యత్వం చేయగలను.

మా అన్నగారు, నాన్నగారు (దుష్టద్యుమ్నుడు, ద్రుపదుడు) వారి సంపూర్ణసైన్యంతో (4 రకాల సైన్యం) మీ అభ్యున్నతి కోరి యుద్ధం చేయడానికి వచ్చారు. మహాత్ములు మీరేమో ఈ విధంగా ఏమిచేయాలో తెలియక నీళ్ళు మ్రింగుచున్నారు. మీనమేషాలు లెక్కిస్తూ కూర్చుంటే పరిస్థితులు విషమిస్తాయి. బంధువులలో చిన్నతనం భరిస్తారా? యుద్ధం చేయకపోతే నలుగురూ “ఛీ పాండవులు చేతగానివారు” అని నవ్వరా?

కర్మసిద్ధాంతాన్ని తెచ్చి ఎప్పుడూ హింస, అహింస అనుకుంటూ మా రక్త మాంసాలను బలి ఇచ్చి ఇష్టం వచ్చిన విధ్వంస మార్గాన నడిచే తీరు ఇప్పటికి చాలు. దుష్టులను నాశనం చేయడానికి ఆయుధాలు ధరించండి. క్షత్రియధర్మం నిలబెట్టండి. (యుద్ధం చేసి రాజ్యం కాపాడుకోవడం రాజధర్మం), ధైర్యముంటే, యుద్ధం చేయగలమనుకుంటే ముందుకు సాగి మీ భార్యయైన పాంచాలి (ద్రౌపది) వెంట్రుకలు ముడివేయండి. విచారము తీర్చండి. మీకు ధైర్య పరాక్రమాలు లేకపోతే మీరు మౌనంగా ఉండండి. భారత భాగ్యమూర్తులై మీ పిల్లలు యుద్ధం చేసి ఈ భారం తీరుస్తారు.

పాండవ వంశాన్ని అలంకరించినవాడు మా అభిమన్యుడు. శత్రువులను ఖండించగల పరాక్రమవంతుడు ఘటోత్కచుడు. వారిద్దరు చాలు ధృతరాష్ట్రుని పుత్రులను చంపడానికి (పిండి పిండి చేయడాన్ని) ఇంకా ఎవరైనా మిగిలి ఉంటే ఎక్కువ తక్కువలు సరిచేయడానికి ఉపపాండవులు ఉన్నారు కదా! వారేమో కత్తి తిప్పలేనివారు కాదుగా! అంటే మిగిలినది వారు చూసుకుంటారు.

పాండవులు యుద్ధం చేసి రాజ్యం సంపాదిస్తే మా అత్తగారైన కుంతీదేవికి “భారత వీరమాత” అనే పేరు వస్తుందని ఇప్పటివరకు చూసీ చూడనట్లు అంతగా పట్టించుకోలేదు. ఆమెకు లభించని ఆ గౌరవ ప్రదమైన భాగ్యం హిడింబకు, సుభద్రకు నాకు (ద్రౌపదికి) దక్కుతుంది అని ద్రౌపది పలికింది. ఆమె మాటలు విన్న భీమసేనుడు ఏమీ ఇప్పటికైనా ముందడుగు వేయడం లేదా? అసత్య కర్మ సిద్ధాంత కథలకు అంతం ఉండదా? గదా దండం భుజాల మూపుకు తగిలించుకొని కురుక్షేత్ర సంగ్రామ భూమికి పరుగెత్తుకొని వెళ్ళి దుర్యోధనుడిని ప్రేమగా ఆలింగనం చేసుకొనేది ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తుంది అన్నాడు.

వారందరి మాటలు విన్న కృష్ణపరమాత్మ చెల్లీ! నీ ఆశ త్వరగానే నెరవేరుతుంది. సహదేవా నీ మాటలకు మెచ్చుకుంటున్నాను. భీమసేనా శాంతింపుము. నకులా సత్యం చెప్పావయ్యా! అర్జునా నీవు కోరినట్లే చేద్దాము. దయాసాగరా! ధర్మరాజేంద్ర! తమ్ముళ్ళు ఇక ఆగరు. అయ్యా! లేచి మమ్మల్ని యుద్ధానికి వెళ్ళడానికి ఆశీర్వదించు. చేత విల్లు పట్టవయ్యా. పాపపు కుండ నిండింది. పగలక మానదు. ఇక పండిన చెడుమార్గఫలం భళ్ళున రాలిపోకపోదు. పాండవులు రోషంతో ప్రజ్వలించగా ఆ భయదావాగ్నికీలల ధాటికి మహా అడవులు కూడా భగ్గుమని మండుతాయి. కౌరవ వంశమనే మహా అడవి కాలక మానదు అని కృష్ణుడు పురికొల్పగానే భీముడు భీష్ముడు, ద్రోణుడు, మద్రదేశపురాజు, కృపాచార్యుడు, జయద్రథ,

కర్ణులకు భయపడి మా శపథాలను విఫలం చేస్తామా? అన్యాయస్తులను బ్రతుకనిస్తామా? అని పౌరుషంగా పలికాడు. భీమునికి వంత పలికినట్లు అర్జునుడు "పరాభవ రోషంతో నిండిన నరుడు (అర్జునుడు) దాసుడై (పనివాడై) నిదురిస్తాడా? బాణ సమూహాల దెబ్బలతో శత్రువుల తలలను భూమిపై పడద్రోయడా? అన్నాడు.

పీడించి ఇబ్బంది పెట్టిన శత్రురాజు రక్తాన్ని పాండునందనులు కోపించి నదులుగా ప్రవహింప చేయకపోతే ద్రౌపది మనోవ్యధ తీరుతుందా? అని నకులుడు పౌరుషంగా అన్నాడు. భీముని భయంకర గదధ్వనులు, అర్జునుని గాండీవ ఘణ ఘణ మోతలు, భయంకరంగా చెవులను గాయాలై తాకుతూ ఉంటే కౌరవ రాజులు మా యుద్ధాన్ని చూస్తారు గాక అని సహదేవుడు బదులు చెప్పాడు. వారి యుద్ధ కుతూహలం విన్న ధర్మరాజు తన అనుమతిని ఈ విధంగా తెలిపాడు.

**ధర్మరాజు:** ముకుందా! నలుగురు సోదరులూ ఒక్కటై అలిగి అలుగులు, సింగాణాలు తీసుకొంటే ఎవరు నిలువగలుగుతారు. కులనాశనంను తలచుకుంటే మనస్సుకు బాధ కలుగుతుంది. మా భాగం మాకు ఇవ్వడానికి రాజుకి కొద్దిగన్నా మనస్సు రాలేదు. కోపిష్టులైన తమ్ముళ్ళు ఆయుధాలకు స్వార్థంతో పని పెట్టాడు. స్నేహంగా ఉందామని మేము రాయబారానికి పంపాము. వారు కయ్యానికి (యుద్ధానికి) దింపారు. నా ఆశంతా వృధా అయ్యింది. ఇక ఆ కురుకుల పరిస్థితి ఏమౌతుందో ఆ దేవుడే ఎరుగు.

ఏది ఏమైనా ఇక యుద్ధం తప్పదు. ఇక ఆపైన (ఆ తరువాత) నీవే మాకు దిక్కు. మా తల్లిగారు ఈ విషయం గూర్చి మీతో ఏమి చెప్పారు అని ధర్మజుడు శ్రీకృష్ణుని అడిగాడు. ఆ మాటలకు శ్రీ కృష్ణుడు కుంతీదేవి గూర్చి ఇలా చెప్పాడు.

**శ్రీకృష్ణుడు:** ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన వీరమాత కుంతీదేవి కళ్ళల్లో కన్నీళ్ళు యమున, గంగ, కృష్ణ వంటి నదుల ప్రవాహం వలే ఎడతెరిపి లేకుండా కన్నీరు కారుస్తూ కురురాజు కొంపలో పడి ఉంది. ఏడాది దూడను విడిచి భయంకర వనములో క్రూర మృగముల మధ్య చిక్కుకున్న గంగిగోవు వలే బిడ్డలకు దూరమై ఒక గుడ్డిరాజు రాజ్యమున చిక్కుకొని ఉంది మీ పూజ్య జనని (మీ తల్లి).

నన్ను చూచి కౌగలించుకొని ఆనందము కరుణ నిండియున్న గొంతుతో, బొంగురు పోయిన స్వరంతో నాకు స్వాగతం పలికింది. అత్తగారు కన్నబిడ్డలు, కోడళ్ళు చిన్ని మనుమళ్ళు ఎలా ఉన్నారు? అని మీ క్షేమం అడిగింది. పరాయివాళ్ళ పంచలో పడుతున్న అవమాన బాధ చెప్పుకొని గుండెలు చెరువులయ్యే విధంగా విలపించింది. కళ్ళల్లోన్ని కన్నీటిని ఆపుకొని జయ వచనం పలుకుతూ మీకు ఈ విధంగా "మాతృ సందేశం" తెలుపమన్నది.

**మాతృ సందేశం:** పవిత్రమైన వెన్నెలలు వెదజల్లే చంద్ర వంశంలో జన్మించారు. ఏక ఛత్రాధిపతియైన పాండురాజుకి బిడ్డలై పుట్టారు. భరత వంశ రక్తం పొంది మీ అంతట మీరే సంతోషంగా భవిష్యత్తును సుగమం చేసుకొని జీవితాన్ని మాధుర్యంగా మలచుకుంటారో! లేదా స్వేచ్ఛకి స్వస్తి చెప్పి (ఒద్దు అనుకొని) పరాయివారిని సేవిస్తారో! ప్రపంచ మహావిప్లవ ఆవిర్భావానికి (విప్లవం పుట్టించడానికి) మాయదారి పిచాచాలు రెక్కలు చాపి విపరీతంగా సముద్రాలపై గర్జించాయి. ఇప్పుడు కాదులే అనుకున్న యుద్ధం రానే వచ్చింది. శాంతి వినాశకులు సామ్రాజ్య కాంక్ష అనే కడుపు మంటతో మీ దొడ్డి గుమ్మం మెట్లెక్కారు.

భారత భాగ్య దివిటీలపై ఎవరు మపిపూయగలరు. అపారము, అనవద్యము, అపూర్వము, అఖండమైన మీ వీర విజృంభణకు విశ్వమే ఆశ్చర్య పడుతుంది. మీ పరాక్రమ సంపదకు సకల లోకాలు హారతులు పట్టును. రాజ్యాన్ని పాలించిన మీ తండ్రి మరణించాడు. ఆయన పిల్లలైన మిమ్మల్ని మీ పెద్దనాన్న నిందిస్తున్నాడు. కపట ప్రేమను చూపిస్తూ స్నేహం అనే గృహాన్ని కడుతున్నారు. ఆ తరువాత మీ మంచి, మీ ఔన్నత్యం, మీ వాసనే కాలక్రమంగా కౌరవులకు గిట్టలేదు.

దేశ కళ్యాణం కొరకు ఈ దైవ సందేశ దీక్షను చేపట్టండి. స్వాతంత్ర్యం కొరకు ఆయుధాలు పట్టుకోండి. భారతీయ భవిష్యత్ సౌభాగ్యం కొరకు స్వాతంత్ర్య సమరం అనే రథం కదులును గాక. పౌరుషం గల భరతభూమిలో పుట్టి బానిస బతుకు ఎందుకు? ఈ తికమకలు పెట్టే సంకెళ్ళు తెంచుకొని బైటపడి ఇకనైనా యుద్ధానికి విజృంభించరేమి? తన బిడ్డల బానిస బ్రతుకు చూసి తల్లి హృదయం పడే బాధ, తపన ఎందుకనో ఎవరూ తెలుసుకోవడం లేదు. నా బిడ్డల అపారమైన భుజ బలంపై ఆశపెట్టుకొని ఉన్నాను. దిక్కు లేక బాధపడుతున్న మీ తల్లిని చూడండి. మీ గుండెలలో మంటలు (ఆవేశం) తెచ్చుకోండి. దాస్యం అనే దరిద్ర గాఢాంధకారంలో యుగ అభ్యుదయానికి జ్యోతి వెలిగించండి.

ఎంతో గొప్ప ఆశయసాధనతో రాజమాత బిడ్డలను కంటుంది. ఆ మహా ఉద్దేశాన్ని సాధించాలని మనస్సులో నిశ్చయించుకొని నడుములు బిగించి ముందుకు నడవండి. రాజ తేజస్సును భరతభూమి అనే పొలమంతా చల్లబోయే శ్రమజీవులైన వ్యవసాయదారులు మీరు. కృష్ణుడు అనే మేఘం మీ పై దయచూపింది. విజయం పొందడం మీకు చాలా సులభమైనది. (రైతు పండించాలంటే వర్షం కావాలి. రైతు శ్రమకు తోడు సకాలంలో వర్షం కురిస్తే మంచి పంట పడుతుంది. అలాగే పాండవులకు కృష్ణభగవానుని అండతోడయ్యింది. ఇక విజయం తథ్యం అని భావం). అని అత్త గారు (కుంతీ దేవి) మీకు తెలుపమన్నది. పాఠం అప్పగించినట్లు పొల్లుపోకుండ మీకు చెప్పాను. కురుక్షేత్ర సంగ్రామానికి ఇక గదలు, గాంఢీవాల వంటి ఆయుధాలు సిద్ధపరచండి. అయ్యా! బావలారా! మీ తల్లి చెప్పిన మాటలు విన్నారా? రేపటి నుండే యుద్ధం మొదలు. మీ బలం చూపించండి. రాయబారం చేసే పని ఎలాగూ అయిపోయింది. ఒక నేను రథం నడిపే పని చేస్తాను అని శ్రీకృష్ణుడు చిరునవ్వు నవ్వుతూ అర్జునుని తట్టి మౌనంగా ఉన్నాడు. అప్పుడు అర్జునుడు కృష్ణా అనుభవించిన కోరిక యందలి ఆశ శత్రువులకు భయం కలిగించడాన్ని కనిపెట్టింది. ధర్మజుడు నిర్మలంగా చూశాడు. భీముడు గదను కదిలించాడు. అర్జునుడు గాండీవాన్ని చూశాడు. నకుల సహదేవులు సంతోషించారు అని చెప్పాడు.

ఆ సభలోనే యుద్ధ విషయాలన్నీ చర్చించుకొని వారి ప్రియతల్లి పంపిన సందేశాన్ని భక్తితో స్వీకరించి సంతోష భాష్పాలతో "వందేమాతరం" అంటూ నినాదాలు చేసి యుద్ధానికి సిద్ధమయ్యారు.

**స్కంధావారము: (సైన్యము లేదా యుద్ధభూమి)**

పాండవులు యుద్ధం చేయడానికి రథాలు సిద్ధం చేసుకున్నారు. కృష్ణుడు అర్జునుడికి రథసారథిగా సిద్ధమై అర్జునుని యుద్ధానికి ఈ విధంగా పురికొల్పుతున్నాడు. పార్థా! (అర్జునా) మణులతో పొదగబడి బంగారు చిరుగంటల మనోహర మోతలతో శత్రువులకు భీతికలిగించే కపి కేతనంతో (ఆంజనేయ స్వామి గుర్తున్న జెండా యుద్ధరంగంలో) ఉవ్వెత్తున లేచే పొడవైన తెల్లని గుర్రాల పరుగులతో జయాన్ని చేకూర్చే విధంగా నీ రథం కదులుతుంది. ఇంతకుముందు నీకు పరిచయమైన కష్టాలతో కూడిన యుద్ధభూమి, భయంకరులైన కర్ణ, దుశ్శాసనులు; నవయుగానికి స్వాగతం పలుకుతూ విజయానికి శంఖారావాలు సంతోషంగా వినిపిస్తున్నాయి.

వెంటనే శత్రు సమూహాన్ని ఓడించమని దేవతలు తెలుపుతున్నట్లు మిరుమిట్లు కొలిపే వెలుగులు. అణగదొక్కబడిన కోట్లకొలది ధనస్సుల సంభ్రమముతో గాండీవం వెలుగొందుతుంది. నేను ముందు కూర్చొని రథం నడుపుతాను. నీవు విల్లు పట్టు లక్ష్యం తప్పిపోకుండా యుద్ధం చెయ్యి. యుద్ధానికి బయలు దేరవయ్య! అర్జునా! అని కృష్ణుడు అర్జునుని యుద్ధానికి సిద్ధం చేశాడు.

**అర్జునుడు:** కృష్ణుడు రథం తోలుతూ ఉండగా అర్జునుడు కృష్ణా! యుద్ధ సమయం దగ్గరపడింది. కొద్దిసేపటిలో యుద్ధ భేరీ మోగనుంది. ఒక్క క్షణం మనం సైన్యాన్ని పరిశీలిద్దామా! దుష్టుడైన దుర్యోధనుని కొరకు కష్టపడి యుద్ధం చేయడానికి వచ్చిన రాజులెవరో చూద్దాము. మన రాజకుమారులు దుర్యోధనునికి అనుకూలంగా వచ్చారు. ధర్మజుడు చేసిన రాజసూయ యాగం మరచిపోయారా? కృష్ణా! సైన్యానికి మధ్యగా రథం నడుపు నేను దుర్యోధనునికి అనుకూలురైన రాజులను చూస్తాను అన్నాడు. కృష్ణుడు రథం సైన్య మధ్యభాగంలో నడుపుతూ వచ్చిన రాజలను చూపుతున్నాడు.

**శ్రీకృష్ణుడు:** అర్జునా! ఇదిగో ఇక్కడున్నవారు అతిరథులు. (అనేక మంది విలుకాండ్రతో పోరాడగలిగే వారు అతిరథులు). అల్లదిగో అక్కడున్న వారు అర్ధ రథులు. వీరు సమ రథులు. ఇక్కడ మహారథులు ఉన్నారు. (మహారథుడు అంటే 11 వేల మంది విల్లు ధరించిన యోధులతో పోరాడే వీరుడు. ఇతను తనను, సారథిని, అశ్వాలను కాపాడుకుంటూ యుద్ధం చేస్తాడు. వీనిలో సగము మందితో, యుద్ధం చేయగలవాడు అర్ధరథుడు. మహారథుడు అంటే గొప్ప వీరుడు). వీరంతా వారివారి రథాల గుర్తులు వెలుగొందేవిధంగా యుద్ధానికి సిద్ధమైన రాజులు. ఒక ప్రక్క భటుల అరుపులు, మరొక ప్రక్క ఏనుగుల ఘీంకారాలు. భయంకరమైన ఛ్ఛేదించడానికి వీలులేని యుద్ధ భేరీల మోతలు ఇంకొక దిక్కున. అక్కడక్కడా విల్లులు ధ్వజాల మోతలు.

ఓ అర్జునా! మీ తాతగారు (భీష్మాచార్యుడు) చేతిలో పెద్ద విల్లు, బంగారు తాటిచెట్టు గుర్తుగా ఉన్న రెపరెపలాడే జెండాలో దుర్యోధనుని సేనలో యుద్ధోన్ముఖుడై ప్రకాశిస్తున్నాడు. నడుస్తూ వచ్చిన హిమాలయ పర్వతమా, శిలగామారిన పురుష పుంగవుడా? లేక వీరరసం ఈ ఆకారం దాల్చిందా? అన్నట్లు ముసలివాడైన గంగపుత్రుడు (భీష్ముడు) ఉన్నాడు.

వేకువనే విచ్చుకున్న పుష్పాల వలే బ్రహ్మచర్య దీక్షతో ఆ కన్నులు ఎంత వెలుగొందుచున్నవో! క్షత్రియ తపస్సు చేయడం వల్ల తెల్లబడి కదులుచున్న ఆగడ్డం ఎంత పండిపోయిందో! మహామహుడైన ఈ తాతగారికి మీ మీద అధిక ప్రేమ ఉంది. కానీ యుద్ధం చేయక తప్పదు. మీ తాతా మనుమళ్ళ యుద్ధం చూడడానికి ఆకాశంలో దేవతలు గుమిగూడారు.

భీష్ముని ప్రక్కన ధైర్యం మూర్తీభవించినట్లు గంభీరంగా కురుకుల గురువు ద్రోణాచార్యుడు ఉన్నాడు. ఆయన "బంగారు వేదిక" జెండాని చూశావా? యుద్ధం అనే లక్ష్మీదేవి అక్కడే విశ్రాంతి తీసుకుంటుంది. నీవంటే ద్రోణాచార్యునికి అధికమైన ప్రేమ. అస్త్రవిద్యా రహస్యాలన్నీ నీకు నేర్పాడు. బాల్యదశలో నీవు నేర్చుకున్న విలుప్రదర్శనను ఉత్తమ గురువుగారు నేడు పరీక్షిస్తాడు. ద్రోణాచార్యునకు అటు ప్రక్కన శౌర్యసంపదతో అపర శంకరుని వలే ఉన్నవాడు కృపాచార్యుడు. ధృతరాష్ట్రుని తిండి తిని బ్రతుకుతున్నాడు కాబట్టి దుర్యోధనుని పక్షంగా యుద్ధం చేయడానికి ఈ రోజు వచ్చాడు అదిగో అతడే శకునాల పక్షి. మాయ పాచికలు ఆడడంలో పండితుడు. ఆ దొంగ కనురెప్పలు చూశావా! దొంగ పాచికలాడి సంపదలు దోచుకున్న దుర్యోధనుని గారాబపు మేనమావ శకుని. అల్లదిగో అక్కడ సింధుదేశాధిపతి, మీ ముద్దుల బావ (దుస్సల భర్త) జయద్రథుడు ఉన్నాడు. సోదరీమణి పాంచాలి జోలికి వచ్చి తియ్యగా తన్నులు తిన్నాడు. (పాండవులు వనాలలో ఉన్నప్పుడు సైంధవుడు సాల్వ కన్యను పెళ్ళి చేసుకోడానికి పోతూ మార్గం మధ్యలో దౌపదిని తీసుకొని రథముపై వెళుతుండగా పాండవులు వెంటాడి చితకబాది చంపబోవుచుండగా ధర్మరాజు సోదరి భర్త కాబట్టి అలా చెయ్యవద్దని చెప్పడం వల్ల అతనికి గుండుకొట్టి అవమానపరచి పాండవుల దాసుణ్ణి అని చెప్పుకొని బ్రతకమని వదిలేశారు)

భద్ర గజముపై ఎక్కి పదకొండు అక్షెహిణుల సైన్యం అతిశయించి తనను కొలుస్తూ ఉండగా తెల్లగొడుగు క్రింద ఉన్నవాడు మీ పెద్దనాన్న పెద్దకొడుకైన దుర్యోధనుడు. ఇళ్ళు కాల్చడం ఇల్లాళ్ళ వస్త్రాలు ఊడదీయడంలో గొప్ప ధురంధరుడు. నీచబుద్ధిగలవాడు. పడగ విప్పిన నాగుపాము వంటి క్రూరుడు. ధుర్యోధనుని ప్రక్కన అంగరాజు ఉన్నాడు చూశావా?

శక్తివంతుడు, సూర్యపుత్రుడు, కర్ణుడు. కోరమీసాలపై పౌరుషం పుట్టింది. ఇతడు బ్రాహ్మణ శాపం పొందినవాడు. (కర్ణుడు విలువిద్య నేర్చుకునే సమయంలో బాణం దెబ్బతగిలి ఒక బ్రాహ్మణుని ఆవు పెయ్య చనిపోయింది. అప్పుడు ఆ బ్రాహ్మణుడు నీవు భీకరంగా యుద్ధంలో పోరాడే సమయంలో రథచక్రం భూమిలోకి క్రుంగుతుంది. ఎవరితో పోరాడతావో వారి చేతిలోనే చస్తావు అని కర్ణుని శపించాడు)

ఓ అర్జునా దుశ్శాసనుడు మిగిలిన సోదరులంతా రాజుకి ఇరుప్రక్కల ఉన్నారు. లక్ష్మణుడు మొదలైన కురువంశ కిశోరాలు (యవ్వనులు) యుద్ధానికి వచ్చారు. మనకి సహాయకుడిగా వస్తున్న శల్యుడిని మాయచేసి దుర్యోధనుడు తన ప్రక్కకి మళ్ళించుకున్నాడు. వారంతా ఉన్నారు చూశావా?

భగదత్తుడు, బృహద్బలుడు, కృతవర్మ, భూరిశ్రవస్సు, బాహ్లీక, సుదక్షణ, సోమదత్తుడు మొదలైన వారంతా వచ్చారు. వీరంతా దుర్యోధనునికి ఆప్తులు. అధిక పరాక్రమం శౌర్యం, ధైర్యం గలవారు. ఎట్టి పరిస్థితిలోనూ యుద్ధం నుండి వైతొలగమని శపథం చేసి వచ్చారు . ఒకరకమైన యుద్ధానికి చిన్నపాటి తృప్తిచెందరు (అంటే భయంకరంగా యుద్ధం చేస్తేనే వారికి తృప్తి). కురుసైన్యమంతా మహాసముద్రం వలే అందలి రథాలు దీవుల మాదిరిగా బాణాలు ధూళివలే గుర్రాలు తరంగాలా అన్నట్లుగా ఎగసి పడుతున్నాయి. అర్జునా! అని కృష్ణుడు కౌరవ సైన్యాన్ని చూపిస్తూ చెప్పాడు.

**విషాదము:** యుద్ధ రంగంలో కృష్ణుడు రథాన్ని నడుపుతుండగా అర్జునుడు ఆ సైన్యాన్ని చూసి మనసు కలత చెందినవాడై యుద్ధం చేయడానికి మనస్సు అంగీకరించక కృష్ణునితో బావా! అంత వేగము ఎందుకు కొద్దిగా ఆగండి. నా హృదయాంతరంగంలోని బాధ ఆపుకోలేక (అణచుకోలేక) పోతున్నారు. మాధవా! నా మనస్సు మారుతుంది. అంతరంగంలో ఏవో నూతన భావాలు పుడుతున్నాయి. ఒళ్ళు కంపిస్తుంది. (వణుకుతుంది) నేను చేసేది మంచిదికాదని మనస్సులో ఎక్కడో ప్రేమ అనేది కృంగజేస్తుంది. గాండీవం చేయిజారిపోతుంది. గుండె గజగజ వణుకుతుంది. గొంతు ఎండిపోతుంది. నేను నిలబడలేను. బంధువులందర్నీ చంపి నేనేమి సంపాదించగలను. రాజ్యము, సంపద, వైభవం, అంతఃపుర జీవనం నాకు వద్దుగాకవద్దు అని బాధ పడుతుంటే కృష్ణుడు అర్జునునికి ఈ విధంగా బోధించాడు

**శ్రీకృష్ణుడు:** వీరాగ్రేసరుడా! కిరిటీ! ఇదిఏమి? వృథాగా బాధపడుతున్నావు. అనుకోని రీతిగా నీవు ఇలా మారడమేమిటి? గ్రహదోషమా? సరసానికి అంటున్నావా? సురాపాన మహాత్యమా! నిద్రలో మాట్లాడుతున్నావా? మనస్సు నిబ్బరం చేసుకో కుంతీకుమారా! గాండీవం చేయిజారింది. శరీరం కంపిస్తుంది. కళ్ళవెంట నీళ్ళు కారుతున్నాయి. ఇంత దాకా వచ్చాక యుద్ధం చేయకపోతే కౌరవ సైన్యాన్ని చూసి "బండారం బైటపడింది" అని ఎగతాళి చెయ్యరా? రాజుకి విజయమా? వీరమరణమా? ఈ రెండే వేరేమార్గం లేదు.

కర్ణుని చూచి భయపడ్డావా? ద్రోణాచార్యుని చూడగానే తత్తరపాటు కలిగిందా? దృతరాష్ట్రుని కొడుకులు విసుగు కలిగించారా? భీష్మాచార్యుని చూచిన ఆతురతా? (తొందరపాటా) లేదంటే యుద్ధము చెడుతుంది. రాజరికంలో పుట్టి అయ్యో! ఇంత వ్యాకులమా? ఇంతమంది శౌర్యపరాక్రమం కల రాజులు అధర్మం పక్షంగా యుద్ధం చేయడానికి కొద్దిగకూడా సంశయం లేకుండా వస్తే మన ఆయుధాల దెబ్బకి చిందరవందరగా పడకతప్పదు ధనుంజయా! అని యుద్ధానికి పురికొల్పాడు. ఆ మాటలకు అర్జునుడు బాధగా ఇలా అన్నాడు.

**అర్జునుడు:** గాండీవాన్ని ఎక్కు పెట్టాలా? కంఠాలు తెగగొట్టాలా? మొండాలతో ఈ భూమి నిండిపోవాలా? తాతలు, తండ్రులు, గురువులు, సోదరులను చంపడానికి నాకు చేతులు రావడం లేదు. నేను ఏవిధంగా యుద్ధం చేయను? ఆప్తమిత్రులు,

ప్రియమైన బిడ్డలను నిర్దయగా బలిగొని ఏవిధంగా తృప్తి పడగలనని మనసులో ఆవేదన కృష్ణా! ఖాండవ వనాన్ని దహిస్తున్నప్పుడు ఈ ఘోరాన్ని పాండు కుమారుడు ఎరుగడు. ఎంత పనికి ఒడిగడుతున్నాను. మనస్సు వేదన చెందుతుంది. దయమాలి సుచ్చరితుడైన తాతగారు భీష్మాచార్యుని ఎలా చంపగలను? పెద్దలుచే ప్రశంసించబడే నా గురువు ద్రోణాచార్యుని ఎలా ఎదిరించేది? అది గౌరవం కాదుకదా?

రాజ్య కాంక్షతో మహోన్నతమైన, మనోజ్ఞమైన గాండీవాన్ని పూజ్యులపై ఉపయోగించి, పురుష కార్యం చెయ్యాలా? దుష్ట దుర్యోధనుడు లోభియై పనికిమాలిన మనస్సుతో రాజ్యకాంక్షతో ఇష్టజనులను విధ్వంసం చేయడానికి ఇష్టపడ్డాడు. మోసగాడినై స్వార్థ బుద్ధితో ఆ ధృతరాష్ట్రుని సంతానం కోసం అధికకోపినై రాజ్యకాంక్షతో వారిని చంపి కీర్తి సంపాదించుకొనేదా? ఇటువంటి దారుణ మారణ క్రియకు నా హృదయం ఎలా ఓర్వగలదు? కౌరవులు నన్ను కొట్టినా నేను చేతులు కట్టుకొని ఉంటాను. ముల్లోకాలూ వచ్చినా, నా పేరు మానిపోయినా నేను సొంత జనులను నా సుఖం కోసం చంపలేను. రాజులందర్నీ చంపి వారి భార్యా బిడ్డలను ఏడిపించి నెత్తురుకూడు తినలేను. కక్షతో ఇరువర్గాలు ఎదురుపడి చంపుకోవటం మంచి లక్షణం కాదు కదా? ధర్మాన్ని నాశనం చేసి మాటి మాటికి శోకించలేను. పుణ్య పదవిని వీడలేను, కార్పణ్య, హత్య దోషం గలవాడిని. నాకు ఏది దిక్కు? ఆర్తులను రక్షించే నీవే నా శరణ్యం అని వేడుకున్నాడు. దానికి శ్రీకృష్ణుడు గొప్ప పరాక్రమ శాలివి. మతి తప్పి ఈ విధంగా మాట్లాడుతున్నావు. ఇంత వివేకం అనుకోకుండా నేడెక్కడి నుండి ఊడిపడింది నీకు. నీ స్థితి చూసి రాజులు పక్కున నవ్వరా? మనస్సు నిబ్బరం చేసుకో. పిరికితనం వదులు. మొఖం పెకెత్తు. ధైర్యం చెదరనియ్యకు. నీ ముఖాన్ని శత్రువులు పసిగట్టారంటే కొంప మునుగుతుంది. ఆ చెట్టు నీడకు రథం పోనిస్తారు. అక్కడ నీతో మాట్లాడతాను అని అన్నాడు.

**ప్రబోధము:**

అర్జునుడు దుఃఖితుడై యుద్ధం చేయడానికి వెనుకాడుతుండగా శ్రీకృష్ణుడు ఈ విధంగా బోధించాడు. అదిగో వారు లక్క ఇంటిని తగులబెట్టిన ఆ మంటలు ఆరనేలేదు. మహోజ్వలమైన గాండీవ మనోజ్ఞంగా బాణాల వర్షం కురిపించలేదు. ఈ భయం నీకెక్కడ దాపురించింది. సర్వాంగాలు స్థంభించాయి. లోక కళ్యాణం కోరి సంధి జరుపబోతే ధృతరాష్ట్రుని అంతఃపురంలో మధాంధులై కన్నుగానిక గాంధారి పుత్రులు కాలదన్నారు. సంధికార్యం సంగరానికి దారితీసింది. గాండీవానికి పనిబడింది. ఇంక ఎటువంటి సంబంధ బాందవ్యాలూ లేవు. హింస తప్పదు నీకు వ్యర్థమైన బాధ ఎందుకు? రథాన్ని వెనక్కి త్రిప్పితే మీకు సహాయం చేయడానికి వచ్చిన రాజులంతా “ఆ సభలో మీసాలు త్రిప్పారు. గొప్పలు చెప్పారు” అని దెప్పిపొడవరా? అప్పుడు పౌరుషంగా మాట్లాడి ఇప్పుడు దిగులుతో దిగ్భ్రాంతి చెందడం సరిపోతుందా? అని కృష్ణుడు ప్రశ్నించగా అర్జునుడు ఇలా అంటున్నాడు.

**అర్జునుడు:** అచ్యుతా! గుండెలు రాయి చేసుకొని క్రూరుడనై కురురాజు సేనపై గాండీవాన్ని ఎక్కు పెట్టి శత్రువుల కంఠాలు తెగనరికి వారి రక్త ప్రవాహంలో డాకినీ పిచాచాలు మత్తిల్లి తాండవం చేసే విధంగా (వారి రక్తం తాగి మత్తులో నాట్యం చేసేవిధంగా) ఈ భూమిని చేయడానికి నా నా మనస్సు ఒప్పుకోవడం లేదు. ఇక యుద్ధం చేయాలనే ఉత్సాహం నేను పొందజాలను. నా భుజాలు సంకోచిస్తున్నాయి. సొంత జనులను సంహరించడానికి మనస్సు అంగీకరించకే గాని నిజంగా ఆ మహేశ్వరుని సాక్షిగా చెబుతున్నాను యుద్ధమంటే భయమేసికాదు. స్వజనుల రక్తం నదుల వలే ప్రవహింప చేయడానికి సాహసించలేను.

పెద్దన్నయ్య (ధర్మజుడు) అహింసనే కోరాడు. నా అభిప్రాయం కూడా మారింది. ఏవో తెలియని వ్యామోహ మేఘాలు

నన్ను ఆవరించాయి. ఈ గద్దెలు (సింహాసనాలు) అంతఃపురాలు అశాశ్వతాలు. కక్షలు కార్పణ్యాలు ఇక చాలు. ప్రత్యర్థులను చంపే మారణ యుద్ధాలు ఇక వద్దయ్యా!

కత్తులతో పొడిచినా, బాణాలతో కొట్టినా, విల్లుతో మొత్తినా, నెత్తి మీద గదలతో కొట్టినా, గొంతుక కోసి నెత్తురు పీల్చినా, పైనబడి కొట్టినా, తిట్టినా, ఎవరు ఏమి చేసినా నోరు మెదపక ఊరకుందును అన్నాడు. దానికి కృష్ణుడు ఈ విధంగా చెప్పాడు.

**శ్రీకృష్ణుడు:** మహా ప్రళయమువలే ఇదిగో శత్రుసైన్యం నలుమూలల నుండి ముంచుకొస్తుంది. శోకింప దాని కోసం శోకిస్తూ ఉండటం అపకీర్తి కలిగిస్తుంది. ఈ చంచల స్వభావం అపవిత్రమైనది. అనవసరమైన మాటలు ఏల, మూర్చ ఏవగింపు ఇకచాలు ఆపు. మనస్సున పిరికితనంతో పేదరికానికి ఓడి రాజఠీవి విడిచి పలుచని మాటలు ఈ విధంగా ఎందుకు మాట్లాడు తున్నావు. శివుని సైతం ఆపిన మగసిరి ఎక్కడికిపోయింది. ఎన్నడూ నీ కళ్ళలో చూడని చిన్న తనపు చూపులు ఈ రోజే నేను చూస్తున్నాను. మన రాజులకు రక్తపు కూడు గాక నేతి భోజనం లభిస్తుందా? రాజధర్మాన్ని విడిచి పెడతావా? చావు పుట్టుకలు తప్పవు. పూర్వకాలపు పాప పుణ్యాలే ప్రాణుల సుఖ దుఃఖాలకు కారణం. సృష్టి అంతా ఈ కర్మ సిద్ధాంతం మీదే ఆధారపడి చేయబడింది.

చంపడమో, చావడమో క్షత్రియ ధర్మం. అపారమైన విష సంపదను చూచి గుండె దిగజారి ఆకారణంగా (కారణం లేకుండ) ఆశ్చర్య కంపితుడవగుట చెల్లునయ్యా!. (చెల్లదు) కులధర్మం విడుచుట న్యాయమయ్యా? మీ కొంపలు కాలుస్తున్న దుండగులపై అనుకూలత ఎందుకలా? క్షుద్రులైన కౌరవ అధములు మోసం చేసి జూదం ఆడించి ఉక్కు పాదాలతో మిమ్మల్ని అణగ దొక్కారు. ద్వేషంతో విషపు మంటలు కుక్కారు. లక్క ఇంటిలో పెట్టి కాల్చారు. అయ్యో! అటువంటి ఆ కుటిలాత్ములతో అన్నదమ్ములని చక్కటి బంధుత్వం కలుపుతున్నావు. హింస చేయను అన్నావు సరే. మిమ్మల్ని హింసల పాలు జేసిన విధ్వంస కారులను దయదాల్చడం ధర్మాన్ని హింస చేయడం కాదా? నేను మా మామని (కంసుని) చంపి లోకం కష్టాలు తీర్చలేదా? తిండికై కన్నీరు కారుస్తూ అలమటించడం రాజవంశంలో పుట్టిన వారికి తగునా? ధనుంజయా లెగువు. విధి బలీయమైనది. న్యాయం గెలుస్తుంది. స్వార్థం నశిస్తుంది. సత్యం గెలుస్తుంది. గ్రహచారం తప్పి వస్తే వందమంది కొడుకులను కన్న తండ్రికైనా పిండం పెట్టడానికి ఎవ్వరూ ఉండరు. దానినే సత్యకాలం అంటారు. యుగధర్మం ఎప్పుడూ ఇలాగే ఉంటుంది. విజయానికి, భోగభాగ్యాలకి, రాజ్యాధికారానికై సంపదలు (వేసుకోను) కోరుకోను అంటూ ధర్మాలు ప్రారంభించావేమి? పార్థా! (అర్జునా) ప్రగల్భాలు కట్టిపెట్టు. స్వార్థ త్యాగం చాలు. తల్లి పిలుపు విని శంఖం పూరించు. విచారకర సంకుచిత స్వభావం గలవారు, వ్యర్థమైన సందేహం గలవారు, కర్తవ్యం ఎరుగని మూర్ఖులు కురుక్షేత్రంలో నిలువకూడదు. బాణం సంధిస్తావో లేక దుర్యోధనునికి విజయం ఇస్తావో నీ ఇష్టం. ఇక వేరే మార్గంలేదు (యుద్ధం చేయక తప్పదు).

ధర్మ రక్షణ అనే దీక్ష చేపట్టి కురుక్షేత్రం అనే ధర్మ పొలంలో (ధర్మభుమిలో) విద్రోహులను నిర్మూలించు. స్వతంత్ర్య భారతావని వీరసంతానమై భూదిగంతాలను నీ దేవదత్తం అనే శంఖాని మారుమ్రోగించు. రాజ్యకాంక్షతో కత్తులు (ఆయుధాలు) బాణాలు ధరించి గర్వంతో ఉప్పొంగుతూ స్వార్థబుద్ధితో మధించిన ఏనుగులు కుంభస్థలాలపైకి సింహం వలే దూకి రాక్షస సమూహాన్ని చీల్చి చెండాడక ఈ విధంగా ధైర్యహీనులై ఉండటం జాతికి దౌర్భాగ్యమురా! నిద్రాణ స్థితిలో ఉన్న జాతిని పురికొల్పి స్వతంత్ర్య భారతాన్ని పునర్నిర్మాణం చేయడం మంచిది. అది రాజులకి తగినది. ఆ విధంగా స్ఫూర్తి దాయకంగా ఉండక నిరుత్సాహ, నిట్టూర్పులతో చల్లబడి పోవడం నీకు న్యాయమేనా?

జెండా జాతికి జీవగఱ్ఱ. సమతికి గుర్తు. జెండాయే జాతికి సమస్తం. అటువంటి జెండా వంగిపోవడం జాతి శిరస్సు ఖండించినట్లే. అది సహించజాలనిది. ఇక లే. లేచి జాతిని శాంతియుతంగా ఉంచే జెండా కాపాడడానికి, ప్రపంచమంతా కొనియాడే ఆయుధం ధరించి జేజే నాదాలు వినిపించే విధంగా చెయ్యి. నీ దయనీయ స్థితి ఇక చాలు. గుండె ఉంటే ఆయుధం స్వీకరించు. లేదా ద్వారకకు నాతో రా! వేరెవ్వరో ఎందుకు బావలు ఐదుగురికి ఐదూళ్ళు నేనే ఇస్తాను. ఎంతో ప్రశాంతంగా వేదాంత ఉపన్యసిస్తూ పరబ్రహ్మాన్ని వెతకండి. భుజబలంతో యుద్ధ క్రీడ సలిపే శత్రు భయంకరుడు, దైవగణ క్షేమం కోరేవాడు అర్జునుడు ఇదిగో ఇక్కడున్నాడు. అదిగో అక్కడున్నాడని నీ యుద్ధం చూడడానికి విమానాలపై వచ్చి ఆకాశ వీధులలో గుంపుకూడి ఉన్న దేవతలు చెప్పుకొంటూ ఉన్నారు. నీ విషయం తెలిస్తే మనం ఇక్కడ నిలబడడానికి కూడా ఉండదు.

యుద్ధ భేరీ మోగింది. ధణ, ధణ అని భేరీ ధ్వనులు వీర విహార యాత్రకి వీరులను పిలుస్తున్నాయి. ప్రళయకాల వాహినిలా మహా శ్మశాన వాటికలో విళయ తాండవం చేసే నటుల వలే పాండవుల మెడలోని చంద్ర హాసాలు అల్లాడుతాయి. అర్జునా ఉదాసీనత విడిచి పరాక్రమ శాలివై యుద్ధరంగంలోకి అడుగు పెట్టు. నీ స్వాతంత్ర్య శంఖ ధ్వనులు వేదవ్యాసుని భారత రచనలో మారుమ్రోగుతాయి. రాబోవు కాలంలో భారతీయులు నిన్ను ఆదర్శమూర్తిగా భావిస్తారు. నేర్పరియై చీల్చి చెండాడే అర్జునుడు కన్నెర్ర చేసి గాండీవం తీసుకుంటే శత్రువుల గుండెలు క్రుంగి కూలవా? నీ బాహు బలానికి ఓర్వగలిగిన వాడు ఎవడు? తరువాత ఏమి జరుగుతుందో నాకు తెలుసు. ధర్మజుడు విజయానికి సంకేతమిచ్చాడు. నీకు దేవదత్తం ఉంది. మహోన్నతిని చేకూరిస్తుంది. అర్జునునికి మును పెన్నడూ లేని వైవర్ణ్యం కమ్మింది. అర్జునుడు ఉద్యమిస్తే అపజయమనేది లేదు విజయా! (అర్జునా!)

ధర్మరాజు అజాత శత్రువు. మహాత్ముడు. శాంతమూర్తి. విశ్వ విఖ్యాతి గడించినవాడు. అతని ధార్మిక శక్తికి అసాధ్యమనేది లేదు. భీష్మాచార్యుల వంటి వారైనా లోబడిపోతారు. అటువంటిది ధర్మ విరుద్ధ శక్తులకు ఏ విధంగా బలం చేకూరుతుంది. సస్యశ్యామలమైన రత్నాల రాశి, మమతా సంపన్నురాలు మీ తల్లి. తన హృదయాన్ని దయనీయ స్థితికమ్ముకోగా నిద్రా హారాలుమాని శత్రుగృహంలో దాస్యత్వంతో బ్రతుకు ఈడుస్తుంది. ఇక చాలు. ఓ కురుకుల సింహా! దాస్య సంకెళ్ళు వ్యతిరేకించి తెంచుము.

కన్నతల్లి పరాయి పంచలో బడి కన్నీరు కారుస్తుంటే బిడ్డ సహించి ఓర్చుకోగలదా? బ్రతుకుని బలిపెట్టైనా తల్లి దాస్యత్వాన్ని పోగొట్టకుండా దయనీయంగా పడి ఉండటం చేతగాని తనం. మునుపు బృహన్నల అన్న పేరు సార్థకం అవుతుంది. (అడంగిలివాడు)

అర్జునా, విజయలక్ష్మిని చేకూరుస్తావని నీసోదరులంతా ఆశతో ఎదురుచూస్తున్నారు. నీవు ఈ విధంగా శౌర్యహీనుడవైతే ఆంజనేయునికి, గాండీవానికి పరువుపోయిందని మూడు లోకాలూ నవ్వుతాయి. చుట్టాలలో కుంతీదేవి తల ఎత్తుకోగలదా?. నీకు శుభం జరుగుతుంది. లేచి వెలుగులు విరజిమ్ముతూ విజయయాత్ర నల్దిక్కులా సాగించు. నిర్బంధం లేని దైవ రాజ్య భవిష్యత్తుకు దారితీయుము. స్వతంత్ర్య ఆనంద భాష్పాలతో మీ తల్లి పాదాలు కడుగుము. అర్జునుడు ధనస్సు తీసుకుంటే మూడులోకాలలో సాధించలేనిదంటూ లేదు. ఎటువంటి ఆటంకపరిచే శక్తులు కూడా నీ దాపుకు చేరలేవు. నేడు యుద్ధ భూమిలో నరనారాయణులు ఒక్కటై నిలిస్తే ఇక చెప్పడానికి ఏముంటుంది.

గాండీవం ధరించి అర్జునుడు యుద్ధం చేస్తుంటే సారధిగా శ్రీ కృష్ణుడు శౌర్యంతో రథం నడుపుతుంటే శివుడైనా యుద్ధ

రంగంలో పోరాడి నిలువగలడా? వ్యర్థమైన దుఃఖం నీకు ఎందుకు? వీర భారత కుమారా! ఆయుధం చేపట్ట రా! సమయం ఆసన్నమయ్యింది. దుర్మార్గులైన కౌరవ నాశనం మీరువక యుద్ధ రంగంలో క్రీడించుట ఆరంభించు. ఏదైనా సాధించగలవు. యుద్ధ నేర్పరివి. ప్రాణికోటి స్తుతికి సాక్షీభూతుడవు. పారాక్రమాన్ని విస్మరించకు.

పాశుపతాన్ని ఇస్తూ అర్జునా! సమస్త దుష్టనాశనం చేకూర్చు. నీకు విజయం చేకూరుగాక అని మహేశ్వరుడు ఆజ్ఞాపించాడు. అది ఏ విధంగా తుడిచి వేయుదువు. క్రూరులైన శత్రు తలలు నరకకుండ గాండీవంతో పిట్టలు కొట్టుకుంటావా? శత్రు భేద్యం కాని కిరీటాన్ని తాకట్టుబెట్టి బ్రతకడానికి తలపెట్టావా? రాజ్య వైరాగివై (సన్యాసత్వంతో) చెట్టులు పుట్టలు తిరుగుతూ (అడవుల్లో తిరుగుతూ) జెపం చేస్తూ బ్రతుకుతావా? గెలిశావా! సర్వరాజ్యం నీ శిరస్సుకు మణిమాణిక్యాలతో కూడిన కిరీటం ధరింపచేస్తుంది. ఓడితే కీర్తి కాంత అందమైన మంగళ పుష్పాలతో సిగ్గలు చిందిస్తూ నమస్కరిస్తుంది.

రాజ్యం వీరభోజ్యం. పరాక్రమశాలిమైనవాడే భరత భూమిని పాలిస్తాడు. రణరంగంలో సత్యశౌర్యవంతునితో పొత్తు కలిగింది. (కృష్ణుడు తోడయ్యా) పిరికి పందవై పారిపోవద్దు. గౌరవమైన యుద్ధభూమిని విడువవద్దు. అఖండ విజయం సాధించు. ఇక ఓటమి కలుగదు. ద్రౌపది పరాభవ ప్రతీకారం అనే మేఘం నీ శత్రువులు శిరసులపై ఘర్జించింది. వెంటనే లేచి నీ గాండీవం తీసుకొని శత్రు రాజుల తలలను రక్తపు వర్షంగా కురిపించు. శ్రీమద్భాంత భాగ్యరేఖ అనే విజయలక్ష్మిని చేకూర్చిన వీరుడు మా అర్జునుడా అని దేవలోకంలో ఉన్న మీ తండ్రి పాండు మహారాజు చూచి ఆనందిస్తాడు. భయంకర గదని పట్టుకొని ద్రౌపదిని జుట్టుపట్టి ఈడ్చిన కిరాతుని సంహరించి పాంచాలి కొప్పు ముడివేస్తానని దుశ్శాసనుని గర్జించిన సింహం భీమసేనుడు నిద్రాణస్థితిలో ఉంటాడా?

ఏనుగులపైకి గర్జిస్తూ దూకే సింహం వలే కౌరవ సైన్యంపైకి భీముడు గదతో దూకబోతున్నాడు. ధర్మరాజు ధర్మబంధాలలో ఇప్పటివరకు ఉన్నాడు. ఇంక భీముణ్ణి ఎవరూ ఆపలేరు. అగ్నికి వేడి వలే రాజ వంశీయ పురుషులకు పౌరుషం అందాన్నిస్తుంది. నీ బోటివాడు పౌరుషం విడిచి జాలిగా మాట్లాడటం సౌఖ్యాన్నిస్తుందా? మంచివాడివే. బలహీనులను బలవంతులు బూడిదను తన్నుకు పోయినట్లు పోతారు.

గాండీవీ! చంద్రకుల ఆభరణమా! (అర్జునా!) గుర్రాలు ఆగటం లేదు. ఎంతసేపు పగ్గాలు లాగి గట్టిగా పట్టి ఆపగలను. యుద్ధ సమయం దగ్గర పడింది. భేరీ మోగకముందే లే. స్వరాజ్య లక్ష్మికై మనస్సు దిటవు చేసుకొని ఆహ్వానం పలుకు. నీ పక్షంగా యుద్ధం చేయడానికి అనేక రాజ్యాల రాజులు ఆయుధ ధరులై వచ్చారు. స్వధర్మంతో ధైర్యహీనుడవై నీవు ఈ విధంగా ఉంటే నిరపరాధులైన నీ పక్షం వారిని దృతరాష్ట్రుని పుత్రులు నిలువున కాల్చి చంపుతారు. అయ్యా! పరుల ధనాన్ని హరించి స్త్రీలను చెరపట్టి ధర్మాత్ములను బానిసలను చేసిన దుండగులపై జాలి పడవచ్చా! నిరంకుశ మనుజాధములు మానవ జాతికి ఘోరమైన శత్రువులు.

ముద్దుల మరిదీ ముమ్మాటికి నమ్ము. రథం నడపడానికి నేనున్నాను. సమస్తం నేనే చూసుకుంటాను. సందేహం విడిచి నామీద భారం వేసి నీవు కేవలం నిమిత్త మాత్రుడిగా నిలబడు మనదే విజయం. అధర్మం నిలవదు. కుంతీ పుత్రా! సమస్త భూతాలకీ కర్తను నేనే. సర్వం నేనే అవతారమెత్తి ధర్మాన్ని నిలుపుతాను, భూ భారాన్ని తీరుస్తాను. దుఃఖం ఎందుకు. నీవు నిమిత్త మాత్రంగా ఉండు. నీ కర్తవ్యం గుర్తెరిగి గాండీవం చేపట్టు.

అర్జునా! మంచిని రచ్చకీడ్చిన పాపిష్టి జనం నశించుటే ధర్మం. నీ రాద్ధాంతం చాలించి కార్యసిద్ధికై నారి సారించు.

వీర భారత యుద్ధం విజయశాంతిని చేకూరుస్తుంది గాండీవం ధరించి శత్రు సైన్యాన్ని ఖండించి, నీ భుజ భలం చూపించక భయంతో క్రుంగి కూర్చుంటే పాశుపతం మైలపడిపోదా. పాండు భూపాలుని ప్రసన్నతకు లోటు వాటిల్లదా! వనవాసం తీరిపోయింది. అజ్ఞాత వాసం అనే నిరాశలు అయిపోయాయి. నీ దేవదత్తాన్ని వినిపించే వేళయ్యింది. ఎంతోకాలంగా నిద్రబుచ్చిన గాఢ చీకట్లు తొలగిపోయి తూర్పుదిక్కున తెల్లవారింది. వెలుగులు విరజిమ్ముతుంది.

స్మశాన భూమి కురుసైన్యాన్ని చూసి గుండె బ్రద్దలై తత్తరపాటుతో రథం దిగి పరుగెత్తుచున్న ఉత్తరుని ఆపి దిగులు తీర్చి, ధైర్యం చెప్పి రథం ఎక్కించిన వీరుని చేతులే ఈ రోజులు గాండీవాన్ని జారవిడిచాయి. పెద్ద నియంతనై అర్జునుడు అంతటి వానికి క్షత్రీయ ధర్మం ఉపన్యసించడం సరికాదు. కానీ కొండంత ధైర్యవంతుడే సమయానికి మెల్లగా దిగ్భ్రాంతిలోకి జారడం పరాక్రమం కాదని ఉపదేశించడానికి పూనుకున్నాను. తుమ్ముళ్ళ బలం చూసుకొని దుర్యోధనుడు మిమ్ముల్ని మరచాడు. కర్ణుని మీసాలు, దుశ్శాసనుని భుజాలు, శకుని కనుబొమ్మలు మనస్సున పెట్టుకొని యుద్ధాన్ని నెత్తిన పెట్టుకున్నాడు. అతని భుజాలు కృంగి శృంగ భంగం కలుగుతుంది. దురధికారంతో మదాంధుడైన రాజుకి విజయం చేకూరుతుందా?

గర్వాంధులను తుదముట్టించాలనేగాని నీవు నాకేమైనా జీతబత్యాలు ఇస్తావా? నీ గుర్రాలను తోలేపని నాకెందుకు? మా ఇంటిలోనే గుర్రాలను తోలుకునే వాడినిగదా! ధర్మాన్ని రక్షించడానికే అర్జునునికి రధసారధి నయ్యాను. ఇది నిజం. గాండీవాన్ని సవర్తిస్తే చాలు దుష్ట, దుర్మార్గ, అన్యాయస్తుల ప్రభుత్వంలో భూకంపం పుడుతుంది. దుష్ట దుర్యోధనుని ప్రాకారాలు బ్రద్దలైపోతాయి. కురు సామ్రాజ్యం కృంగి కృషిస్తుంది. గురువు, తాతలతో పోరుకి సంకోచిస్తున్నావు కదా! మరి వారెందుకు ఊరకుండక అధర్మంను సమర్థిస్తూ యుద్ధానికి ముందుకొచ్చారు. భీష్ముని మనుమడివి కదా పరి యుద్ధానికి సిద్ధపడు.

శత్రువులను జయించువాడా! ఇది నీకు అగ్ని పరీక్ష. క్షత్రియ స్ఫూర్తితో కర్మవీరుడవై వేడిరక్తంతో విల్లందుకొని జీవిత లక్ష్యాన్ని నిరవేర్చి నీ మాతృ రుణం తీర్చుకోవోయీ! యుద్ధం. ఇది మహా స్వేచ్ఛా యుద్ధం, నీవు యాగ్నకుడవు. నేను శ్రోతను. గాండీవం విరోదులను మట్టుపెట్టే ఆయుధం. యజ్ఞఫలం స్వరాజ్యం లభించుట. మూడు లోకాలను ఏలే దేవేంద్రుని కిరీటానికి తగిన వాడిగా మౌళిని ధరించావు. (దేవేంద్రుని పుత్రుడవు) దేవతలు, దేవేంద్రుని తలదించుకునే విధంగా చేయకుండా వారి గౌరవాన్ని నిలుపువయ్యా! నీకు విజయం చూకూర్చడానికి జెండాపై ఆంజనేయ స్వామి నిలిచాడు. ఈ విధంగా చేస్తే నీవసలు నరుడవేనా (అర్జునుడివేన) అని తోక జాడించి ఆంజనేయుడు పరుగెడతాడు.

కొడుకులు ముక్తి చేకూరుస్తారని తల్లి కొండంత ధైర్యంగా ఉంది. శత్రుజాతి కనుసంజ్ఞలతో దిగ్గుమాలినదై ఎన్ని దినాలు పడిగాపులు కాస్తుంది? పార్థుడు (క్రియాశీలి) అనే పదానికి అపార్థం కలిగించడం, నీరసించి నశించడం రాజ న్యాయం కాదు. దైవ లోకంలో ఉన్న పాండురాజు నా కొడుకు ఇటువంటివాడా అని కుమిలిపోతాడు.

దేవదత్తం (శంఖం) పరువు, గాంధీవ గౌరవం, తెల్ల గుర్రాల మహత్మ్యం, ఆంజనేయ స్వామి గుర్తున్న జెండా ప్రతిష్టకి కవుల గ్రంథాలలో కళంకం కాకూడదు. ఇంటికి నిప్పుపెట్టిన ఈ క్రూరులను చంపక కంట తడిపెట్టుకున్న కరుణ ఇక చాలు. ఏడ్వడానికి ఇది సమయం కాదోయీ! విల్లు ఎక్కుపెట్టి ఓయీ! సందిగ్ధంతో మూర్ఛపోకు. ఆత్మగౌరవంతో ముందడుగు వేయి. పౌరుషం తెచ్చుకొని భరతవీరా! లేవవోయీ ! నీవు నరుడవు. నేను నారాయణుడను. కర్మవీరా! లేచి నిలబడి నీ కన్నీళ్ళు తుడుచుకోరా! ధర్మం చేపట్టి విజయ కేతనం ఎత్తురా! అని కృష్ణుడు అర్జునునికి ధైర్యం పురికొల్పి రాజు కర్తవ్యం, ధర్మం తెలిపాడు.

**విజృంభణము:** కృష్ణుని బోధ అని అర్జునుడు యుద్ధానికి తన ఆమోదాన్ని తెలియజేసి ఈ విధంగా విజృంభించాడు.

**అర్జునుడు:** జగద్రక్షకా! మోహం చల్లారింది. ధర్మ సందేహాలు తొలగిపోయాయి. దిగులు తీరింది. మనస్సులోని కలత తీరింది. విగత ధర్మడనైన నాకు ధర్మం తెలియజేసి ఉత్సాహాన్ని నింపిన మీ కృపకు ధన్యవాదాలు. మీ మహా ఉపన్యాసం ఉదయ కరుణ సంపన్నమైన హృదయాన్ని కదిలించింది. యుద్ధ ఉత్సాహాన్ని నా మదిలో నిలిపి కర్తవ్యాన్ని తెలియజేసింది. రథాన్ని ముందుకు నడుపు. శివుని ఆజ్ఞను నెరవేరుస్తాను. శత్రు గుండెలు భయంతో కంది కూలేలా చేస్తాను. తల్లికి అఖండానందము కలిగిస్తాను. ద్రౌపది దుఃఖ భారం తీరుస్తాను. నీవు పాంచజన్యం ఊదు. నేను దేవదత్తం ఊదుతాను. మహోదయ నీ దయ, స్నేహంతో మదోన్మత్తులను త్రుంచి వేస్తాను. ఈ దురభిమాన నిరంకుశ రాక్షస పాలనకి స్వస్తి చెప్పి “నవభారత వీర పతాక” ఎగురవేస్తాను అని యుద్ధానికి విజృంభించాడు. అని యుద్ధానికి విజృంభించాడు.

**శ్రీకృష్ణుడు:** ఈ విజయశ్రీ వెలుగులో నూతన భారతము సంపద వెలుగొందుగాక. ఈ సృష్టి శాంతియుతమగు గాక. బంగారు భారతం ఈ సందేశం ద్వారా ఏర్పడునుగాక అని దీవించాడు.

**ఆధార గ్రంథం:**

1) విజయశ్రీ - కరుణశ్రీ

**- డా॥ డి. సుజాత**

పాఠం - 5

# విజయశ్రీ

## - కరుణశ్రీ

### 5.1. కఠిన పదాలకు అర్థాలు:

1. విచిత్రవీర్యతనయుడు = ధృతరాష్ట్రుడు
2. తెకతేరకు = మిక్కిలి వ్యర్థమైన లేక బొత్తిగా సంబంధం లేని
3. అలతిమాటలు = రాగాలాపనతో కూడిన మాటలు
4. చెరలాడుట = వ్యాపించుట లేదా విహారము
5. కాలుని = యముని
6. ఆలము = యుద్ధము
7. కురుచక్రవర్తి = దుర్యోధనుడు
8. బంధనమ్ము = చెరసాల, బంధించేది (కట్టివేయడం)
9. కృష్ణ = ద్రౌపది
10. కపరీ బంధము = కొప్పు
11. కవోష్ణ బాష్పముల్ = వేడి కన్నీరు
12. దిగద్రావి = విడచి
13. ప్రేతము = నరకంలో ఉండే జంతువు
14. దుర్వేదగ్ధులు = దుర్జనులు
15. ఆజి = యుద్ధం
16. ప్రావృతము = కప్పబడిన
17. లుబ్ధాగ్రేసర = మిక్కిలి లోభియైన రాజు
18. ఉపేంద్రా = హరీ! (కృష్ణా!)
19. ప్రారబ్ధం = ప్రారంభించబడిన
20. ముష్కరులు = కుటిలులు
21. అవి = స్త్రీ
22. అబ్ధి = సముద్రం
23. వివ్వచ్చుడు = అర్జునుడు
24. రాసభము = గాడిద
25. శాత = వాడియైన

| | | | |
|---|---|---|---|
| 26. | శరప్రఘాతముల్ | = | బాణాల దెబ్బల వల్ల ఏర్పడిన గుంతలు |
| 27. | కోదండము | = | విల్లు |
| 28. | మత్త | = | మథించిన |
| 29. | కర్జము | = | కార్యము |
| 30. | కదనానకు | = | యుద్ధానికి |
| 31. | చిట్టె గట్టె | = | ఇనుము కాల్చిన తరువాత వచ్చె మురికి |
| 32. | శీర్షము | = | శిరము, తల. |
| 33. | బెట్టిదుల్ | = | క్రూరులు |
| 34. | ద్యూత బంధులు | = | జూదగాళ్ళు |
| 35. | తమస్తమస్వినులు | = | తమోగుణంలో మునిగి పోయినవారు (చీకటిలో) |
| 36. | నయ ప్రయత్నములు | = | ప్రేమగా చేసే ప్రయత్నాలు |
| 37. | అహులు | = | గర్వాంధులు |
| 38. | కుటిల | = | వంకర |
| 39. | ఛట | = | గుంపు |
| 40. | కలిత | = | సామర్థ్యం |
| 41. | గ్రసన | = | మింగిన |
| 42. | పుడమి | = | నేల |
| 43. | విస్ఫూర్తి | = | మిక్కిలి అధికం లేక మిక్కిలి ప్రకాశం |
| 44. | నృశంస | = | క్రూర |
| 45. | గూడలు | = | భుజాలు |
| 46. | అమృతాంశుకులము | = | చంద్రవంశం |
| 47. | నిదమిత్థ | = | అనవసరం |
| 48. | ధ్వజ | = | గురుతు, జెండా |
| 49. | పరిక్రమము | = | విహారము |
| 50. | శాత్రవ | = | శత్రువు (శత్రు) |
| 51. | హరింపుడు | = | నాశనం చేయండి |
| 52. | గర్వసంహతులు | = | ధృఢమైన గర్వేష్టులు |
| 53. | గౌరవద్యుతుల్ | = | గౌరవ వెలుగులు |

| | | | |
|---|---|---|---|
| 54. | రథి | = | రథము |
| 55. | యుధిష్ఠిరుడు | = | ధర్మరాజు |
| 56. | గ్రంథి | = | ముడి, కణితి |
| 57. | చనునె | = | తగునా? |
| 58. | మహా మఖంబు | = | మహాయజ్ఞం |
| 59. | శ్రీరమణుడు | = | సంపదలు గలవాడు |
| 60. | కావిపుట్టు | = | కాషాయి వస్త్రము |
| 61. | కరవాలము | = | కత్తి, ఖడ్గం. |
| 62. | శోచ్యము | = | కన్నీరు |
| 63. | నైచ్యము | = | భక్తి చేత కలుగు అథమ భాగం |
| 64. | మిన్నులు | = | మీనమేషాలు (మంచి చెడులు) |
| 65. | క్షాత్ర దీపికల్ | = | క్షత్రీయధర్మం |
| 66. | కబాలి | = | వెంట్రుకలు |
| 67. | మండిత | = | అలంకరించబడిన |
| 68. | ద్విష | = | శత్రువు |
| 69. | క్షేణి | = | నేల |
| 70. | మిధ్య | = | అసత్య భ్రాంతి |
| 71. | స్కంధము | = | మూపు |
| 72. | అవని | = | భూమి |
| 73. | అని | = | యుద్ధం |
| 74. | త్రిపథగాసుత | = | భీష్ముడు (గంగ కుమారుడు) |
| 75. | కుంభజ | = | ద్రోణుడు |
| 76. | ఓడి | = | భయపడి |
| 77. | కింకరుడు | = | దాసుడు, పనివాడు. |
| 78. | కుపిత | = | కోపించిన |
| 79. | ద్విష | = | శత్రువు |
| 80. | తాడిత | = | తన్నబడిన, ఇబ్బందిపడిన |
| 81. | రుజుల్ | = | రోగగ్రస్తులు |

| | | | |
|---|---|---|---|
| 82. | వ్రణము | = | గాయము |
| 83. | జ్యోత్స్న | = | వెన్నెల |
| 84. | వత్సము | = | ఏడాది దూడ, బిడ్డ |
| 85. | గర్హింపన్ | = | నిందించుటకు లేదా దూరుటకు |
| 86. | కంపు | = | వాసన |
| 87. | ప్రసన్న | = | నిర్మల |
| 88. | ప్రసూ | = | తల్లి |
| 89. | కుతుకమ్ము | = | అనుభవించని కోరికయందలి |
| 90. | వడముడి | = | శత్రువులకు భయం కలిగించేవాడు లేదా భీముడు |
| 91. | అయోధనం | = | యుద్ధం |
| 92. | స్కంధావారం | = | సైన్యం, యుద్ధభూమి, దండువిడిచిన చోటు |
| 93. | అరి | = | శత్రువు |
| 94. | ఉత్తుంగ | = | పొడవైన |
| 95. | తురగము | = | గుర్రము |
| 96. | త్రాస | = | భయం |
| 97. | సంభృతము | = | చక్కగా ధరించబడిన |
| 98. | అరాతి | = | శత్రువు |
| 99. | సంచయము | = | సమూహము |
| 100. | శమిత | = | అణగదొక్కబడిన |
| 101. | అభీలం | = | కష్టం |
| 102. | పరి | = | యుద్ధం |
| 103. | అతిరథులు | = | అనేక మంది విలుకాండ్రతో యుద్ధం చేయువారు |
| 104. | మహారథులు | = | పదకొండు వేలమంది విలుకాండ్రతో యుద్ధం చేయగలవారు |
| 105. | అర్థరథులు | = | మహారథిలో సగం మందితో యుద్ధం చేయువాడు (5,500 మందితో) |
| 106. | జ్యాట | = | విల్లు |
| 107. | ఉత్తాల | = | అదిరిపడు (రెపరెపలాడు) |
| 108. | జయద్రథుడు | = | సైంధవుడు (దుశ్శల భర్త) |
| 109. | వెల్లగొడుగు | = | తెల్లని గొడుగు |

| | | |
|---|---|---|
| 110. భద్ర | = | ఏనుగు జాతి విశేషణం |
| 111. ఉక్కలుండు | = | ధురంధరుడు |
| 112. సూర్యసన్నిభుడు | = | కర్ణుడు |
| 113. సమితి | = | యుద్ధం, సమూహం |
| 114. ప్లవంగ | = | కోతి |
| 115. రజము | = | ధూళి, దుమ్ము |
| 116. సంశప్తకుడు | = | యుద్ధంలో ఎంత కష్టమొచ్చినా వెనుతిరగనని ఒట్టు పెట్టుకొనువాడు |
| 117. అంగేశుడు | = | కర్ణుడు |
| 118. వైక్లబ్యము | = | వ్యాకులము |
| 119. సజ్జ్యము | = | మనోజ్ఞము |
| 120. ధూర్తమతి | = | మోసగాడు |
| 121. జుగుప్స | = | ఏవగింపు |
| 122. అశోచ్యులు | = | శోకింపదగని వారు |
| 123. అనార్యజుష్టము | = | సేవించబడనిది |
| 124. కశ్మీలత | = | మూర్ఛ |
| 125. వాహినులు | = | సైన్యాలు |
| 126. చిద్విలాసము | = | చిన్నతనపు చేష్ట |
| 127. ఘృతము | = | నెయ్యి |
| 128. స్మయము | = | గర్భం, ఆశ్చర్యం |
| 129. ప్రముక్కడి | = | అల్పము, క్షుద్రము |
| 130. దురోదరము | = | జూదం |
| 131. రూషా విషార్చులు | = | కోపావేశపు మంటలు |
| 132. చక్కటికము | = | చుట్టరికం |
| 133. అశ్రువు | = | కన్నీరు |
| 134. శంక | = | సందేహం, అనుమానం |
| 135. దేవదత్తం | = | అర్జునుని శంఖం |
| 136. ఖరాసి | = | రాక్షస సమూహం |
| 137. భీరులు | = | ధైర్యహీనులు |
| 138. కొండాడు | = | స్తుతించు, పొగరు |

| | | |
|---|---|---|
| 139. నిస్వన | = | ధ్వని |
| 140. దభ్రవాహిని | = | సూక్ష్మ ప్రవాహం |
| 141. ఔదాసీన్యం | = | ఉదాసీనత |
| 142. ఉజ్జగించుము | = | విడిచిపెట్టుము |
| 143. స్తవనీయ | = | పొగడబడు |
| 144. విదగ్ధాఖండ | = | ఖండించుటలో నేర్పరి |
| 145. ప్రభవిష్ణు | = | నరుడు (అర్జునుడు) |
| 146. డగ్గర లేవు | = | దరిచేరలేవు |
| 147. రథి | = | యుద్ధ వీరుడు |
| 148. ప్రధనమ్ము | = | యుద్ధం |
| 149. సాంయుగీనుడు | = | యుద్ధం నందు నేర్పుగలవాడు |
| 150. భవద్దోర్దండ | = | అధిక దండన |
| 151. శశిశేఖరుడు | = | శివుడు |
| 152. కట్టడి | = | క్రూరుడు |
| 153. పరంతపా! | = | శ్వేతముఖుడు లేదా అర్జునుడు |
| 154. పాఱబోదు | = | పిరికిపంద |
| 155. కదుష్ణము | = | ఇంచుకవేడి |
| 156. పరికీర్ణ | = | కిరాతుకంగా లాగబడిన |
| 157. పోడిమి | = | సౌఖ్యం |
| 158. జన్యము | = | యుద్ధం |
| 159. క్లైబ్యము | = | దుఃఖము |
| 160. డిండీరము | = | ఫేనము, నురుగు |
| 161. పాండిమము | = | తెలుపు |
| 162. ఆహవము | = | యుద్ధం |
| 163. ఉపద్రష్ట | = | సాక్షి లేదా పర్యవేక్షకుడు |
| 164. ఘర్మకణములు | = | చెమటలు |
| 165. సోమశేఖరుడు | = | శివుడు |
| 166. పాంచజన్యము | = | శ్రీకృష్ణుని శంఖం |
| 167. పతాకము | = | జెండా. |

## 5.2. సందర్భ సహిత వ్యాఖ్యలు:

**1) "సుయోధనుండనుఁగు తమ్ములున్ రొమ్ములుబ్బింపగన్".**

కవి పరిచయం: ఈ పద్యపాదం కరుణశ్రీ నామధేయులు జంధ్యాల పాపయ్య శాస్త్రిగారు రచించిన "విజయశ్రీ ఖండ కావ్యము" లోనిది.

సందర్భం: శ్రీకృష్ణుడు రాయబార సందేశాన్ని పాండవులకు వివరిస్తూ భీష్ముడు ఐదూర్లు ఇవ్వమన్నాడు. ఏదో ఒక విధంగా సంధి చేసుకోమని ద్రోణాచార్యుడు చెప్పాడు. ధృతరాష్ట్రుడు విరోధం ఎందుకో పోనిమ్మన్నాడు. కర్ణుని మొఖం చూసి, తమ్ముళ్ళ రొమ్ము బలంతో దుర్యోధనుడు పాండవులతో పొందువద్దు వెళ్ళిపో అన్నాడు అని చెప్పే సందర్భంలో ఈ మాటలు చెప్పబడినవి.

| | | |
|---|---|---|
| అర్థాలు: | అనుంగు తమ్ములు | = సొంత తమ్ముళ్ళు |
| | రొమ్ములు బ్బపగన్ | = రొమ్ము బలం చూపగా |
| | సుయోధనుడు | = దుర్యోధనుడు |

భావం: తమ్ముళ్ళ బలం చూసుకొని దుర్యోధనుడు సంధి కుదరదు పొమ్మన్నాడని భావం.

**2) "కృష్ణ కబరీ బంధ మవశ్య మ్మింకన్**

కవి పరిచయం: ఈ పద్యపాదం కరుణశ్రీ నామధేయులు జంధ్యాల పాపయ్య శాస్త్రిగారు రచించిన "విజయశ్రీ ఖండ కావ్యము" లోనిది.

సందర్భం: కృష్ణుడు కౌరవులకు పాండవులకు మధ్య సంధి కుదుర్చుటకు పోగా దుర్యోధనుడు సంధికి నిరాకరించాడు. సంధి కుదుర్చుట వెళ్ళిన కృష్ణభగవానునే బంధించడానికి ప్రయత్నం చేశారు. ఆ విషయాన్ని కృష్ణుడు పాండవులకు వివరిస్తూ ఇక సంధి చాలు. సంధి కొరకుపోతే అది బంధనములకు దారితీసింది. ద్రౌపది వెంట్రుకలు ముడివేయుటకు భీమునికి అవకాశం వచ్చింది. అది తప్పనిసరి అని చెప్పే సందర్భంలో ఈ మాటలు చెప్పబడినవి. దుశ్యాసనుడు ద్రౌపది జుట్టుబట్టి లాగి, చీర విప్పుటకు ప్రయత్నించి అవమానించినప్పుడు భీముడు అతన్ని చంపి ఆ రక్తంతో ద్రౌపది వెంట్రుకలు తడుపుతాను అని శపథం చేసిన సందర్భాన్ని గుర్తుచేస్తూ ఆ సమయం ఆసన్నమయ్యింది అని చెప్పే సందర్భంలో ఈ పాటలు చెప్పబడినవి.

| | | |
|---|---|---|
| అర్థాలు: | కృష్ణ | = ద్రౌపది |
| | కబరీ బంధం | = జుట్టు ముడివేయుటగ |
| | ఇకెన్ | = ఇకను |
| | అవస్యమ్ము | = తప్పనిసరి. |

భావం: ద్రౌపది వెంట్రుకలను దుశ్శాసనుని రక్తంతో తడిపే రోజు దగ్గరపడిందని అర్థం.

**3) "వింటనింక శరవర్షము తప్పదు విశ్వశాంతికై"'**

కవి పరిచయం: ఈ పద్యపాదం కరుణశ్రీ నామధేయులు జంధ్యాల పాపయ్య శాస్త్రిగారు రచించిన "విజయశ్రీ ఖండ కావ్యము" లోనిది.

సందర్భం: పచ్చని రాజవంశాన్ని పాడుచేయడానికి కార్చిచ్చువలే దుర్యోధనుడు జన్మించాడు. దానికి కర్ణుని స్నేహం తోడయ్యింది.

మంటకి గాలి తోడై అగ్నికీలలు రేపినట్టు ఆ శకునిగాడు తోడయ్యాడు. మంటలు రగులుకున్నాయి. ఇక నేను (అర్జునుడు) బాణం వర్షం కురిపించక తప్పదు అని అర్జునుడు యుద్ధం గూర్చి తన అభిప్రాయం కృష్ణునితో చెప్పే సందర్భంలో ఈ మాటలు చెప్పబడినవి.

| | | |
|---|---|---|
| అర్థాలు: | విశ్వశాంతికై | = ప్రపంచశాంతికి (రాజ్యం) |
| | ఇక | = ఇకను |
| | వింట | = విల్లుతో |
| | శర వర్షము | = బాణాల వర్షం |
| | తప్పదు | = కురిపించక తప్పదు. |

భావం: విశ్వశాంతికై ఇక యుద్ధం చేయకతప్పదు అని భావం.

**4) "కుడువంగ బుట్టిరి దొరల్ గాంధారి గర్భమ్మునన్"**

కవి పరిచయం: ఈ పద్యపాదం కరుణశ్రీ నామధేయులు జంధ్యాల పాపయ్య శాస్త్రిగారు రచించిన "విజయశ్రీ ఖండ కావ్యము" లోనిది.

సందర్భం: దుర్యోధనుడెవడు రాజ్యం ఏలడానికి ఆనాడు బహుపరాక్రమశాలియై తన భుజబలంతో యుద్ధంలో రాజులను ఓడించి పాండురాజు సంపాదించిన రాజ్యాన్ని గాంధారి పుత్రులు తినబుట్టారు. కొలువు శింగారించుకొని పరిపాలిస్తున్నారు. తమది కాని సొమ్ము తినడానికి, గాంధారి కడుపున పుట్టారు అని భీముడు కృష్ణునితో చెప్పే సందర్భంలో ఈ మాటలు చెప్పారు.

| | | |
|---|---|---|
| అర్థాలు: | దొరల్ | = దొరలై |
| | గాంధారి గర్భమ్మునన్ | = గాంధారి కడుపున |
| | కుడువంగ | = తినటానికి |
| | పుట్టారు | = జన్మించారు. |

భావం: పొరుగువారి సొమ్ము తినడానికి కౌరవులు గాంధారి గర్భాన పుట్టారు అని భావం.

**5) "చేసిరి రాయబారము లిసీ! పసచాలని పాండునందనుల్"**

కవి పరిచయం: ఈ పద్యపాదం కరుణశ్రీ నామధేయులు జంధ్యాల పాపయ్య శాస్త్రిగారు రచించిన "విజయశ్రీ ఖండ కావ్యము" లోనిది.

సందర్భం: దోసమో మోసమో జూదం ఆడటం జరిగింది . కౌరవులు గెలిచారు. దుష్టదుశ్శాసనుడు చేయి ఎత్తిన రాక్షస ప్రభుత్వము ముందు దాసియై దోసితి పట్టి ద్రౌపది రాజ్యం తెచ్చుకుంది. ఆ రాజ్యం కోసం ఛీ! పాండు రాజు పుత్రులు సంధి జరిపారు అని సహదేవుడు కృష్ణునితో చెప్పే సందర్భంలో ఈ మాటలు చెప్పబడినవి.

| | | |
|---|---|---|
| అర్థాలు: | ఇసీ! | = ఛీ! |
| | పసచాలని పాండునందనుల్ | = ధైర్యహీనులైన లేదా శక్తిహీనులైన |
| | పాండునందనులు | = పాండుపుత్రులు |

రాయబారము = సంధి

చేశారు = సంధి చేయడానికి కోరుకున్నాను.

భావం: ఆడది కన్నీరు కార్చి దోసిలి చాపి దయనీయంగా అడుక్కున రాజ్యాన్ని శక్తిహీనులై పాండురాజు పుత్రులు సంధిచేయడానికి పూనుకున్నారని భావం.

**6) "సంసార మహామఘంబు సాగదటయ్యా!"**

కవి పరిచయం: ఈ పద్యపాదం కరుణశ్రీ నామధేయులు జంధ్యాల పాపయ్య శాస్త్రిగారు రచించిన "విజయశ్రీ ఖండ కావ్యము" లోనిది.

సందర్భం: శ్రీకృష్ణునితో తన తమ్ముళ్ళు, ద్రౌపది వారి అభిప్రాయం చెప్పిన తరువాత ధర్మరాజు ధర్మశాస్త్రం తెలిసిన జ్ఞానులు హింసించే వారిని మెచ్చుకుంటారా ! హంస చేయనిదే ఈ సంసార సాగరం సాగదటయ్యా! అని ప్రశ్నించే సందర్భంలో ఈ మాటలు చెప్పబడినవి.

అర్థాలు: సంసార = సంసారం అనే

మహామఘంబు = మహాయగన్నం

సాగదటయ్యా! = గడవదా! కృష్ణా!

భావం: ప్రాణిహింస చేయనిదే సంసార మహాయజ్ఞం సాగదా? అని భావం.

**7) "గురు తింపుడు పీడిత జాతి యాతనల్".**

కవి పరిచయం: ఈ పద్యపాదం కరుణశ్రీ నామధేయులు జంధ్యాల పాపయ్య శాస్త్రిగారు రచించిన "విజయశ్రీ ఖండ కావ్యము" లోనిది.

సందర్భం: చుట్టాలను చంపి సింహాసనమధిష్టించి రాజ్యమేలే కంటే కాషాయి వస్త్రాలు కట్టుకొని తపస్సు చేసుకోవడం మంచి పనికదా? అని ధర్మరాజు చెప్పగా ద్రౌపది కోపంతో "ద్రుపద మహారాజుకి పుట్టాను. పాండురాజుకి కోడలయ్యాను. అభిమాన ధనులైన భర్తల్ని పొందాను. శౌర్యగుణం, ధైర్యం గుణంగల కొడుకుల్ని కన్నాను. ఇకనైన ఆయుధం ధర్మశాస్త్రం వల్లె వేయుట నమ్మిన వారి గొంతుకోయడమే అని అన్న సందర్భంలోనివి ఈ మాటలు.

అర్థాలు: పీడిత జాతియాతనల్ = సొంతవారి కష్టాలు

గురుతింపుడు = గుర్తించండి

భావం: పీడించబడుతున్న సొంత జనుల కష్టాలను గుర్తించమని భావం.

**8) "క్రూర మృగముల మధ్య గంగ గోవువోలె".**

కవి పరిచయం: ఈ పద్యపాదం కరుణశ్రీ నామధేయులు జంధ్యాల పాపయ్య శాస్త్రిగారు రచించిన "విజయశ్రీ ఖండ కావ్యము" లోనిది.

సందర్భం: కుంతీదేవి బిడ్డలకు దూరమై ఒక గుడ్డిరాజు రాజ్యంలో చిక్కుకొని ఉంది. ఏడాది దూడని విడిచి భయంకరమైన అడవిలో క్రూర మృగాల మధ్య చెక్కిన గంగిగోవు వలే మీ పూజ్యజనని ఉంది అని కృష్ణుడు ధృతరాష్ట్రుని అంతఃపురంలో

ఉన్న కుంతీదేవిని ఉద్దేశించి చెప్పే సందర్భంలో ఈ మాటలు చెప్పబడినవి.

అర్థాలు: క్రూర = క్రూరమైన

మృగములు = జంతువులు

మధ్య = మధ్యలో ఉన్న

గంగగోవు వలే = గంగగోవు మాదిరిగా

భావం: క్రూర మృగాల మధ్య చిక్కిన గంగిగోవులా కుంతీదేవి శత్రువు మధ్యలో ఉంది అని అర్థం.

**9) ""నడుములు బిగించి ముందుకు నడుపు".**

కవి పరిచయం: ఈ పద్యపాదం కరుణశ్రీ నామధేయులు జంధ్యాల పాపయ్య శాస్త్రిగారు రచించిన "విజయశ్రీ ఖండ కావ్యము" లోనిది.

సందర్భం: క్షత్రియ వనిత ఏ ఉద్దేశంతో కొడుకులను కంటుందో ఆ మహోద్దేశాన్ని నెరవేర్చడానికి నడుములు బిగించి యుద్ధానికి ముందుకు సాగండి అని కుంతీదేవి తన కొడుకులకు తెలిసిన విషయాన్ని కృష్ణుడు పాండవులకు చెప్పే సందర్భంలో ఈ మాటలు చెప్పబడినవి.

అర్థాలు: నడుములు బిగించి = నడువులు కట్టుకొని

ముందుకు = యుద్ధానికి

నడువుడయ్యా ! = నడవండి పుత్రులా!

భావం: పుత్రులారా! నడుములు బిగించి యుద్ధానికి ముందుకు సాగండి అని అర్థం.

**10) "తియ్యతియ్యగ తన్నులు తిన్నవాడు"**

కవి పరిచయం: ఈ పద్యపాదం కరుణశ్రీ నామధేయులు జంధ్యాల పాపయ్య శాస్త్రిగారు రచించిన "విజయశ్రీ ఖండ కావ్యము" లోనిది.

సందర్భం: శ్రీకృష్ణుడు స్కంధవారంలో యుద్ధ వీరులను చూపిస్తూ అల్లదిగో అక్కడ మీ ముద్దుల బావ సింధూ దేశాధిపతి జయద్రథుడు వచ్చాడు. సోదరీమణి ద్రౌపది జోలికిపోయి పాండవుల చేతిలో మెత్తగా తన్నులు తిన్నవాడు అని సైంధవుని (దుస్సలభర్తని) అర్జునునికి చూపించే సందర్భంలో ఈ మాటలు చెప్పబడినవి.

అర్థాలు: తియ్య తియ్యగా = మెత్త మెత్తగా

తన్నులు = దెబ్బలు

తిన్నవాడు = కొట్టించుకున్నవాడు

భావం: ద్రౌపది జోలికి వచ్చి పాండవుల చేతిలో తన్నులు తిన్న సైంధవుడు అని భావం.

**11) "ముద్దుల మరందీ! నమ్ము ముమ్మాటికిన్"**

కవి పరిచయం: ఈ పద్యపాదం కరుణశ్రీ నామధేయులు జంధ్యాల పాపయ్య శాస్త్రిగారు రచించిన "విజయశ్రీ ఖండ కావ్యము" లోనిది.

సందర్భం: అర్జునుడు యుద్ధం చేయుటకు నిరాకరించినప్పుడు రథం నడపడానికి నేనున్నాను. నీవు నామ మాత్రంగా ఉండు. నేను సమస్తము నడిపిస్తాను. సందేహం విడిచి భారమంతా నాపైన వేయి. అధర్మం నిలువదు. ముద్దుల మరిదీ నన్ను నమ్ము అని కృష్ణుడు అర్జునునికి చెప్పే సందర్భంలో ఈ మాటలు చెప్పబడినవి.

| | | |
|---|---|---|
| అర్థం: | ముద్దుల మరందీ | = ప్రియమైన మరిదీ! |
| | ముమ్మాటికిన్ | = ముమ్మాటికి (నిశ్చయంగా) |
| | నమ్ము | = నన్ను నమ్ముము. |

భావం: అర్జునా నన్ను నమ్ము అని భావం.

**12) "నవభారత వీర పతాక నెత్తెదన్"**

కవి పరిచయం: ఈ పద్యపాదం కరుణశ్రీ నామధేయులు జంధ్యాల పాపయ్య శాస్త్రిగారు రచించిన "విజయశ్రీ ఖండ కావ్యము" లోనిది.

సందర్భం: కృష్ణుని ప్రబోధం విని అర్జునుడు తన సందేహాలన్నీ తీరిన తరువాత కృష్ణా నీవు నీ పాంచజన్యం ఊదు. నేను దేవదత్తం ఊదుతాను. నీ దయ, ప్రేమతో ఈ మదోన్మాదులను తుంచి వేస్తాను. దురభిమాన నిరంకుశత్వ సంపత్తికి స్వస్తి చెప్పి "నవభారత వీర పతాక" నెత్తుతాను.

| | | |
|---|---|---|
| అర్థాలు: | నవభారత | = నూతన భారతానికి |
| | వీర | = పౌరుష |
| | పతాక | = జెండాను |
| | ఎత్తెదన్ | = ఎగురవేస్తాను. |

భావం: భారత ప్రతాపాన్ని తెలియజేసే జెండాను రెపరెపలాడే విధంగా ఎగురవేస్తానని భావం.

**- డా॥ డి. సుజాత**

పాఠం - 6

# ప్రశ్నలు-సమాధానాలు

**వ్యాసరూప ప్రశ్నలు:**

**1) విజయశ్రీ పాఠ్యభాగ సారాంశమును వివరించుము?**

**జ) కవి పరిచయము:**

కరుణ రసం ప్రధానంగా ఉన్న కొన్ని కావ్యాలు రాసి "కరుణశ్రీ" గా పేరు గాంచిన జంధ్యాల పాపయ్య శాస్త్రిగారు క్రీ.శ.1912 ఆగస్టు 4 వ తేదీన గుంటూరు జిల్లా పెద్దనందిపాడు మండలం కొమ్మూరులో జన్మించారు. మహాలక్ష్మమ్మ, పరదేశయ్య వీరి తలిదండ్రులు ప్రాథమిక, మాధ్యమిక విద్యను స్వగ్రామంలోనే అభ్యసించారు. శ్రీ భమిడిపాటి సుబ్రహ్మణ్య శర్మ, శ్రీ కుప్పా ఆంజనేయ శాస్త్రి గార్ల వద్ద సంస్కృత కావ్యాలు చదివారు. రాష్ట్ర భాషా విశారద, ఉభయ భాషా ప్రవీణ, హిందీ భాషా ప్రవీణ పరీక్షలలో ఉతీర్ణులయ్యారు.

అమరావతిలోని శ్రీ రామకృష్ణ హైస్కూల్లోను, గుంటూరులోని స్టాల్ గరల్స్ హైస్కూల్లోను ఉపాధ్యాయుడిగా పనిచేశారు. గుంటూరులోని ఏ.సి. కాలేజి, హిందూ కాలేజి, మహవీర్, కాలేజీలలో అధ్యాపకునిగా పనిచేశారు. టి.టి.డి. వారి "భాగవతం ప్రాజెక్టుకి ప్రధాన సంపాదకునిగా" పనిచేశారు.

అనసూయా దేవిగారు వీరి జీవిత భాగ స్వామి. ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. పుష్పవిలాపము, కుంతీకుమారి, ఉదయశ్రీ, విజయశ్రీ, కరుణశ్రీ, ఉమర్‌ఖయాం, అరుణకిరణం, ఆనందలహరి వంటి మొత్తం 76 గ్రంథాలు రాశారు. బాణుని "కాదంబరి" కావ్యాన్ని "కళ్యాణ కాదంబరి" అనే పేరుతో అనువాదం చేశారు. బాల సాహిత్యం వీరి ప్రత్యేకత. 1985 నుండి 1991 వరకు "తెలుగు అకాడమి", "రసమయి", "శుభాంగి" వంటి ఎన్నో పురస్కారాలు వీరి సొంతమయ్యాయి. సువర్ణఘంటూ కంకణం, కనకాభిషేకం వంటి సన్మానాలు ఎన్నో పొందారు. నాటి ముఖ్యమంత్రి యన్.టి. రామారావుగారు, ప్రధాని జ్ఞానీ జైల్‌సింగ్ గార్ల చేతులమీదగా సత్కారాలు అందుకున్నారు. శ్రీ వెంకటేశ్వరా విశ్వవిద్యాలయం (తిరుపతి) డి.లిట్ పట్టాను ఇచ్చి గౌరవించింది. 1951-53 వరకు "సుభాషిణి" అనే మాస పత్రికను నడిపారు.

20వ శతాబ్ధంలో తెలుగు సాహిత్యంలో గొప్ప కవులలో ఒకరిగా నిలిచిన పాపయ్య శాస్త్రి గారు 1992 జూన్ 21 వ తేదీన స్వర్గస్తులయ్యారు.

**పాఠ్యభాగ సందర్భం:**

పాండవులు 13 సంవత్సరాలు అరణ్యవాసం, ఒక్క సంవత్సరం అజ్ఞాతవాసం గడిపారు. హీనం ఐదుగురికి ఐదు ఊర్లు ఇచ్చినా చాలు పరిపాలించుకొని బ్రతుకుతామని శ్రీకృష్ణుని రాయబారిగా పంపారు. దుర్యోధనుడు పాండవులకు సూది మోపే అంత స్థలం కూడా ఇవ్వనన్నాడు. కౌరవ సభలో జరిగిన విషయాలను కృష్ణుడు పాండవులకు తెలియజేసి వారివారి అభిప్రాయాలు తెలుసుకొని వారిని యుద్ధానికి సిద్ధం చేసిన తీరు, అర్జునునిలోని అనుమానాలను నివృత్తి చేసి అర్జునుని చేత యుద్ధం చేయించినతీరు (యుద్ధానికి పురికొల్పిన విధానం) విజయశ్రీ కావ్యంలో జంధ్యాల పాపయ్యశాస్త్రిగారు తెలియజేశారు.

1) మంత్రాలోచనం

2) స్కంధావారం

3) విషాదం

4) ప్రబోధం

5) విజృంభణం

అనే ఐదు భాగాలలో పాపయ్య శాస్త్రి గారు విషయాన్ని వివరించారు.

**1) మంత్రాలోచనం:**

శ్రీకృష్ణుడు పాండవులకు కౌరవ సభలో జరిగిన రాయబార చర్చ జరిగిన తీరును వివరిస్తూ సంధి జరిపించాలనే కోరిక కూడా తీరిపోయింది. భారత రణరంగం దాపురించింది. రాయబార ప్రయత్నం విఫలమయ్యింది. మీకు వారికి పొందు కుదురుతుందని వెళ్ళాను. నాశ్రమ వ్యర్థమయ్యింది. జయాపజయాలు ఎలా ఉన్నా మీ గుణగణాలు వారి గుణగణాలు ప్రజలంతా గ్రహించారు. సుయోధనుడు సూదిమొన మోపేటంత భూమి కూడా ఇవ్వనన్నాడు. భీష్ముడు ఐదూళ్ళు ఇవ్వమన్నాడు. గురువు గారు (కృపాచారి) ఏదో ఒక విధంగా సంధి కానివ్వమన్నాడు. ధృతరాష్ట్రుడు విరోధమెందుకు అన్నాడు. కానీ దుర్యోధనుడు కర్ణుని, తన తమ్ములను చూసుకొని సంధి కుదరదు పొమ్మన్నాడు. కౌరవ ప్రభువుకి ఆ రాక్షస రాజ్యకాంక్ష ఏవిధంగా అబ్బిందో తెలియదు. మీరు ఘోర అరణ్యాలలో చెట్టుకొక్కరు, పుట్టకొక్కరై తిరుగుతున్నారు. కౌరవులు దొరలవలె హాయిగా వారిది కాని సంపదను అనుభవిస్తూ సుఖంగా ఉన్నారు.

యుద్ధ రంగంలో ఆయుధాలు తిప్పకుండా సామరస్యంగా వారు మీకు రాజ్యం ఇవ్వరు. రాజులందరికీ పోయే కాలం దాపురించింది. మాయ సంపద కలకాలం నిలువదు. సంధి చేయడానికి పోయిన నన్నే వారు బంధించడానికి ప్రయత్నించారు. సంధి బంధకాలకు దారి తీసింది. సంధి ప్రయత్నం ఇక చాలు. దుశ్శాసనుని చంపడానికి, ద్రౌపది కురులు రక్తంతో తడపడానికి సమయం దగ్గరపడింది అని చెప్పాడు.

కృష్ణుని మాటలు విన్న భీముడు తాళ్ళతో బంధించారు. నీళ్ళలో పడవేశారు. విషం కలిపిన అన్నం పెట్టారు. కాశీయాత్రకు పంపారు. ద్రౌపదిని అగచాట్లపాలు జేశారు. అబ్బా! వాళ్ళెంత మంచి సోదరులో! కులస్త్రీ కన్నీళ్ళు భువిపై పడేటట్లు చేశారు. ధర్మం మరచి మహాసాధ్విని నిండు సభలో అందరూ చూస్తూ ఉండగ జుట్టుపట్టి లాగారు, దుర్భాషలాడారు. వస్త్రం లాగారు . అది ద్రౌపది వస్త్రాపహరణము కాదు. ఆ కౌరవులను పాతాళానికి పంపడమే. దుష్టచరిత్ర గల దుర్జనులు, దురాత్ములు, దుర్మద గ్రస్తులు. వారికి ఇప్పటికీ పశ్చాత్తాపం కలుగుట లేదు.. ఘోర యుద్ధం జరుగుటే కర్తవ్యం.

దుర్యోధనుడెవడు రాజ్యమేలుటకు. ఆసేతు హిమాచలానాన్ని పరిపాలించినవాడు పాండురాజు. అతని రాజ్యం తీసుకొని సింగారించుకొని ఉన్నారు కౌరవులు. వారి తల్లి గాంధారి కడుపున పెట్టిపుట్టారు. మా తండ్రి వల్ల కలిగిన రాజ్యాన్ని ఆ గ్రుడ్డిరాజు ఇప్పుడు ఎలా వదులుకోగలడు. పరమ లోభి ఎలా రాజ్యం వదలడు. ఐదూళ్ళు కూడా ఇవ్వడు ఓ కృష్ణా ఇక ఆ వృద్ధుల గతి ఏవిధంగా ఉందో? అని భీముడు తన అభిప్రాయాన్ని వివరించారు.

భీముని మాటలు వినగానే అర్జునుడు ప్రపంచం మారింది. దొరలమని పట్టు పరుపులపై పడుకొని రాజసంగా దొర్లే రోజులు పోయాయి. కుటిలులైన కురు కుమారులు ఏమీ పట్టనట్లుండి ఈ అర్జునుని గాండీవాన్ని నిద్దుర లేపారు, పచ్చని రాజ వంశాన్ని నాశనం చేసే కార్చిచ్చు వంటి దుర్యోధనుడికి కర్ణుడు తోడయ్యాడు. శకుని ఆ మంటలను ఎగదోసి అగ్ని కీలలు

రేపాడు. మంట ఆకాశాన్నంటింది. విశ్వశాంతికై ఇక అర్జునుడు బాణ వర్షం కురిపించక తప్పదు. ఆనాడు సభలో స్త్రీని కూసిన కూతలు, చేసిన చేతలు ఇప్పటికీ నా మనస్సుల్లో గాయాలుగా మిగిలిపోయాయి. గాడిదల వంటి కౌరవులు బంధువులకు ఇక యుద్ధమే నిర్ణయించబడింది . విల్లు పట్టి యుద్ధం చేయడం తప్ప వేరే మార్గం లేదు. భీముడు గద తిప్పితేనే కదా యుద్ధానికి కాలు దువ్వటం. పుట్టుకతోనే కౌరవుల బుర్రలో రాజ్యకాంక్ష మట్టుకట్టుకుంది. వారు సంధికి ఎదుకు ఒప్పుకుంటారు?

ముసలిరాజు గుడ్డోడు, యువరాజు మధాంధుడు బంధువులు జూదరులు మరి సంధికి మార్గం ఎక్కడుంది. మీరు ప్రేమగా చేసే సంధి కుదరదు. యుద్ధం తప్పదని తన మనస్సులోని భావం బయటపెట్టాడు.

అర్జునుని మాటలు విని నకులుడు దుర్యోధనుడు ఘోష యాత్ర నాటి పాండవ బలం తెలుసుకోలేదా? చిత్రసేనుడు చేతికి వేసిన సంకెళ్ళైనా రారాజుకి గుర్తులేవా? బృహన్నల గోసంరక్షణలు మరచారా? బుర్రబెట్టి ఆలోచిస్తే గుర్తొస్తాయి కదా? జరిగిన సంగతులు. కుటిల బుద్ధి గల వంద విషపురుగుల గుంపుకి చిక్కి కురుకులమనే శ్రేష్టురాలు సౌందర్యం కోల్పోయింది. కుంతీ కుమారులు అనే ముత్యాల గొడుగు కింద ఇక సేదదీరుతుంది. నూరు తలల నాగు బుసగొట్టి నెత్తిపై పడక ముందే నేను యుద్ధానికి సిద్ధం అన్నాడు నకులుడు.

తరువాత సహదేవుడు దోసమో మోసమో జూదం ఆడటం జరిగింది . కౌరవులు గెలిచారు. దుష్ట దుశ్శాసనుడు ద్రౌపదిని లాగడానికి చెయ్యి ఎత్తిన క్రూరప్రభుత్వాన్ని ద్రౌపది దోసిలి యొగ్గి (దాసిగా మారి) తెచ్చుకున్న రాజ్యం కోసం, ఆడది ఏడ్చి తెచ్చుకున్న దానికోసం ఛీ! పాండుపుత్రులు శక్తిహీనులై రాయబారం నడిపారు. ముందు ఓడిన దానినే మళ్ళీ ఓడి అడవులలో తిరిగి భాగము ఇవ్వమనడం. ఆ కౌరవరాజు ఇవ్వకపోవడం ఆడది ఏడ్చి తెచ్చిన రాజ్యాన్ని దేహీయని పగవారిని వేడటం సిగ్గు విడవడం కాదా? పగవారిని అలావేడటం చంద్రవంశానికి కళంకం కాదా?. బావను హస్తినాపురానికి పంపడం అనవసరం అనిపించినా అశుభం పలుకకూడదని ఊరకున్నాను. సుఖంగా తిరిగి వచ్చాడు అది పదివేలు అని అన్నాడు.

నలుగురి సోదరుల అభిప్రాయం విన్న తరువాత ద్రౌపది పాండవులను ఉద్దేశించి అధిక భుజబలంతో యుద్ధానికి పోతారో? కేతనాలు తల ఒగ్గేటట్లు వెనుతిరుగుతారో? ఆయుధాలు పట్టి శౌర్యం చూపుతారో? చేతులు జోడించి విహారం చేస్తారో? క్షత్రియ కుల ప్రతిష్టతను విడుస్తారో? శత్రు పాద పద్మాలను భజిస్తారో? అడవుల పాలై కందమూలాలు తింటారో? తత్వజ్ఞానంలోని ధర్మం సృజిస్తారో మీ ఇష్టం. గతంలో మీరు చేసిన ప్రతిజ్ఞలు గుర్తు చేసుకొని ఆయుధాలు ధరించి కౌరవ నాశనం చెయ్యండి. గౌరవ ప్రదంగా రాజ్యం పొందండి. యుద్ధం చేయుటలో యుధిష్టిరుడు ఎంతటి కార్య సాధకుడో! అజాత శత్రువు అనిపించుకోడానికి సొంత జాతిని మరుస్తారా? అని ద్రౌపది పాండవులలో పౌరుషం రేకెత్తించేలా మాట్లాడింది.

వారందరి మాటలు విన్న ధర్మజుడు కృష్ణా! సంధి జరిగితే కౌరవులకు మాకు మధ్య ఉన్న భేదాభిప్రాయాలు తొలగుతాయనుకొన్నాను. లోకశాంతికోరి జగతికి బంధుడవైన నిన్ను పంపారు. అన్నదమ్ముల మధ్య గొడవ వద్దని ఐదూళ్ళు ఇచ్చినా చాలని మేమింతగా ప్రాధేయపడుతుంటే వారు వారు యుద్ధానికి తెగించారు. హింస చేయనిదే సంసార యజ్ఞం సాగదా? సింహాసనం కోసం హింస చేసి “భారత సంహితకు” మచ్చ వొనర్చలేను. అయిన వారిని చంపి రాజయ్యే కంటే అడవులకు పోయి తపస్సు చేసుకోవడం మంచిది. ధృతరాష్ట్రుని బిడ్డలు సంధికి ఒప్పుకుంటారని ఆశించాను. ఇక శాంతా? పరాక్రమమా? మీరే మమ్మల్ని నడిపించి కాపాడాలి అని తన ఆవేదనను తెలిపాడు.

యుధిష్ఠురుని మాటలు విన్న ద్రౌపది అధిక కోపంతో ప్రతిసారి ఒకే మాట. కూటికోసం బేరాలాడటం పలుచన. వారు సంధికి తిరస్కరించి ఆయుధాలు పట్టుకుంటుంటే కేవలం బాధతో కన్నీరు కారుస్తూ విచారించడం నీచం. సంధి జరుపుట

తీరింది. మీరు నమ్మిన హింస అహింసగా మారింది ఇకచాలు. మనం పీడనతో యాతన పడుతున్నామని గ్రహించి ఆయుధాలు తీయడం మాని ఇంకా ధర్మం వల్లె వేయడం నమ్మిన వారి గొంతు కోయడమే.

గౌరవప్రదమైన ద్రౌపదుని కూతురుగా పుట్టాను. పాండు రాజు కోడలయ్యాను. అభిమాన ధనులైన పాండవులకు భార్యనయ్యాను. పరాక్రమ శాలురైన కొడుకులను (ఉప పాండవులను) కన్నాను. అయ్యో! ఏవిధంగా దాసిగా మారగలను? మా అన్న, నాన్నలు మీతో కలిసి యుద్ధం చేయడానికి వచ్చారు. మీరేమో మీనమేషాలు లెక్కిస్తూ నీళ్ళు తాగుతున్నారు. యుద్ధం చేయకపోతే నలుగురు “ఛీ పాండవులు చేతగానివారని” నవ్వుతారు.

కర్మ సిద్ధాంతం చెబుతూ మారక్త మాంసాలను బలిచ్చే విధ్వంస మార్గాన నడవడం ఇకచాలు. దుష్టనాశనానికి ఆయుధాలు ధరించండి. క్షత్రియ ధర్మం నిలబెట్టండి. ధైర్యం ఉంటే యుద్ధానికి ముందుకెళ్ళి మీ భార్య వెంట్రుకలు ముడివేయండి. ధైర్య పరాక్రమాలు లేకుంటే మౌనంగా ఉండండి. మీ పిల్లలు అభిమన్యుడు, ఘటోత్కజుడు యుద్ధం చేస్తారు. వారికి వాడు ఉపపాండవులున్నారు. వారు కత్తి తిప్పలేని వారు కారు కదా?

పాండవులు యుద్ధం చేసి రాజ్యం సంపాదిస్తే కుంతీదేవికి “భారత వీర మాత” అన్న గౌరవం దక్కుతుందనుకున్నాము. ఆమెకి లభించని ఆ గౌరవం నాకు, సుభద్రకి, హిడింబికి దక్కుతుంది అన్నది. ఆ మాటలు విన్న భీముడు పౌరుషంతో ఏమి? ఇప్పటికైనా ముందడుగు వేయడం లేదా? నా గదాదండం దుర్యోధనుని ప్రేమగా ఆలింగనం చేసుకొనుట ఎప్పుడా అని ఎదురు చూస్తుంది అని హాస్యోక్తులు పలికాడు.

వారందరి మాటలు విన్న కృష్ణ పరమాత్ముడు చెల్లీ! నీ ఆశ త్వరలోనే తీరుతుంది. సహదేవా నీ మాటలను మెచ్చుకున్నాను. భీమసేనా శాంతించు. నకులా సత్యం చెప్పావు. అర్జునా నీ కోరిక ప్రకారమే చేద్దాము. దయాసాగరా! ధర్మనందనా సోదరులు ఇక ఆగరు. లేచి మమ్మల్ని యుద్ధానికి ఆశీర్వదించు అన్నాడు. చేత విల్లు పట్టవయ్యా! పాపపు కుండ నిండింది. పగలక మానదు. చెడు అనే ఫలం పండింది. రాలక మానదు. పాండవుల రోషాగ్నికి కౌరవ వంశమనే అడవి కాలక మానదు అని కృష్ణుడు యుద్ధానికి పురికొల్పాడు. భీష్ముడు, ద్రోణుడు, మద్రరాజు, కృపాచార్యుడు, జయద్రథ, కర్ణులకు భయపడి మా శపథాలు విఫలం చేస్తామా? అన్యాయస్తులను బతకనిస్తామా? అని భీముడు, పౌరుషోక్తులు పలికాడు. భీమునికి వంత పలికి పరాభవ రోషంతో నిండిన నరుడు దాసుడై నిద్రిస్తాడా? శత్రువుల తలలు భూమిపై పడద్రోయడా? అని పౌరుషంగా అన్నాడు.

పీడితుడైన శత్రురాజు రక్తాన్ని పాండునందనులు ప్రవహింప చేయకపోతే ద్రౌపది మనోవ్యధ తీరుతుందా? అని నకులుడన్నాడు. భీముని గద, అర్జునుని గాండీవం ధ్వనిస్తుంటే శత్రురాజులు మా యుద్ధాన్ని చూచెదరుగాక అని సహదేవుడున్నాడు. తమ్ముళ్ళ కుతూహలం చూసి ధర్మజుడు ఈ విధంగా బదులిచ్చాడు.

ముకుందా! నలుగురు సోదరులలో అలిగి అలుగులు, సింగాణాలు తీసుకొంటే ఎవరు నిలువ గలరు? కుల నాశనం తలచుకుంటే బాధగా ఉంది. మా భాగం మాకు ఇవ్వడానికి ఆ రాజుకి ఏమాత్రం మనసొప్పలేదు. స్నేహ భావంతో మేము రాయబారానికి పంపాము. వారు కయ్యానికి దింపారు. నా ఆశ వృథా అయ్యింది. ఇక ఆ కురుకుల పరిస్థితి ఏమౌతుందే దేవునికే ఎరుగు. ఏది ఏమైనా ఇక యుద్ధం తప్పదు. ఇక నీవే మా దిక్కు. మా మాత ఏ సందేశం పంపిందో తెలుపండి అని ధర్మజుడు కృష్ణుని కోరాడు.

కృష్ణుడు “మాతృ సందేశాన్ని” ఈ విధంగా పాండవులకు వివరించాడు. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన వీరమాత

కుంతీదేవి కన్నీరు గంగ, యమున, కృష్ణలై ప్రవహిస్తున్నాయి. ఏడాది దూడను విడిచి క్రూర మృగాలకు చిక్కిన గంగగోవు వలే కురురాజు కొంప లోబడి విలపిస్తుంది మీ పుజ్య జనని. నన్ను కౌగిలించుకొని బొంగురు పోయిన గొంతుతో కన్న బిడ్డలు, కోడళ్ళు, చిన్ని మనుమళ్ళ క్షేమం అడిగింది. పరాయి పంచన పడుతున్న బాధలు చెప్పుకొని గుండెలు చెరువులయ్యేలా! విలపిస్తూ ఆ కన్నీటిని ఆపుకొని మాకు ఈ విధంగా తన సందేశాన్ని తెలుపమంది.

పవిత్రమైన చంద్రవంశంలో జన్మించారు. ఏకఛత్రాదిపతియైన పాండురాజుకి బిడ్డలై పుట్టారు. భరతవంశంలో పుట్టిన మీరు స్వయంగా జీవితాన్ని సుగమంగా మలచుకుంటారో? పరాయి వారిని సేవిస్తారో? ఇప్పుడు కాదులే అనుకున్న యుద్ధంరానే వచ్చింది. శాంతి వినాశకులు మీ దొడ్డి గుమ్మం మెట్లెక్కారు. భారత భాగ్య దివిటీని ఎవరూ ఆర్పలేరు. మీ వీర విజృంభణకు విశ్వమే ఆశ్చర్యపడుతుంది. మీ పరాక్రమానికి సకల లోకాలూ హారతి పట్టి స్వాగతిస్తాయి. రాజ్యం పాలించిన మీ తండ్రి మరణించాడు. ఆయన బిడ్డలైన మిమ్మల్ని పెద్ద తండ్రి నిందిస్తున్నాడు. కపట ప్రేమతో స్నేహగృహం కదుతున్నాడు. మీ వాసనే కౌరవులకు వెగటయ్యింది. దేశ కళ్యాణానికి ఈ సందేశ దీక్షను చేపట్టండి. స్వాతంత్ర్య సమర రథం కదులుతుంది. భవిష్యత్ సౌభాగ్యం కొరకు ఆయుధాలు ధరించండి. భరత భూమిలో పుట్టి బానిస బతుకెందుకు. తికమక సంకెళ్ళు తెంచుకొని యుద్ధానికి విజృంభించండి. నా బిడ్డల అపార భుజబలంపై ఆశతో ఎదురుచూస్తున్నాను. దిక్కు లేక బాధపడుతున్నాను. దాస్యం అనే దరిద్ర గాఢాంధకారంలో యుగ అభ్యుదయానికి జ్యోతి వెలిగించండి.

గొప్ప ఆశయ సాధనతో రాజమాత కొడుకులను కంటుంది. ఆ మహోద్దేశాన్ని సాధించాలని నడుములు బిగించండి. ముందుకు సాగండి. భరత భూమిని పండించబోయే వ్యవసాయధారులు మీరు. కృష్ణ మేఘం మీకు తోడయ్యింది. ఇక విజయం తథ్యం అని అత్త గారు చెప్పిన విషయం మీకు క్షుణ్ణంగా అప్పగించాను. కురుక్షేత్ర సంగ్రామానికి ఆయుధాలు సిద్ధపరచండి. బావలారా! తల్లి పిలుపు విన్నారా? రేపటి నుండే యుద్ధం. మీ బలం చూపండి. రాయబారం నడిపే పని ఎలాగూ అయిపోయింది. ఇక రథం నడిపే పనికి ఉపక్రమిస్తా అని కృష్ణుడు చిరునవ్వు నవ్వుతూ అర్జునుని తట్టాడు. దానికి అర్జునుడు కృష్ణా! అనుభవించని కోరికయందలి ఆశ శత్రువులకు భయం కలిగించడాన్ని కనిపెట్టింది. ధర్మజుడు నిర్మలంగా చూశాడు. భీముడు గదను కదిపాడు. అర్జునుడు గాండీవాన్ని చూశాడు. నకులసహ దేవులు సంతోషించారని చెప్పాడు. తమ సమ్మతిని తెలిపాడు.

అప్పుడే అందరూ చర్చించుకొని తల్లి సందేశాన్ని శిరసావహించి సంతోష భాష్పాలతో పాండవులు " వందేమాతరం" అంటూ నినాదాలు చేశారు.

**స్కంధావారము:**

కృష్ణుని సారథ్యంలో అర్జునుడు యుద్ధభూమికి వెళ్ళాడు. పొడవైన తెల్లని గుర్రాలు కపికేతనంతో అర్జునుని రథం ప్రకాశిస్తుంది. ఎవరెవరు రాజులు యుద్ధానికి వచ్చారో పరిశీలిద్దాము. రథాన్ని సైన్యం మధ్యగా పోనిమ్మని అర్జునుడు కోరాడు. కృష్ణుడు ఆవిధంగానే తోలుతూ శత్రుపక్ష రాజులను చూపిస్తున్నాడు.

అర్జునా అతిరథ, అర్థరథ, మహారథులంతా యుద్ధానికి వచ్చారు. చేత పెద్ద విలుబట్టి బంగారు తాటిచెట్టు గుర్తుతో దుర్యోధనుని పక్షంగా యుద్ధం చేయడానికి మీ తాతగారు భీష్మాచార్యుడు సిద్ధంగా ఉన్నాడు. నడిచే హిమాలయమా? శిలగా మారిన పురుష పుంగవుడా? లేదా వీరరసం ఈ ఆకారం దాల్చిందా? అన్నట్లు గాంగేయుడు ఉన్నాడు. బ్రహ్మచర్య దీక్షతో వెలుగొందే కళ్ళు, క్షత్రియ తపస్సు వల్ల తెల్లబడ్డ గడ్డం. ఈ తాతగారికి మీరంటే అధిక ప్రేమ. తాతామనవళ్ళ యుద్ధం చూడడానికి దేవతలు విమానాలు వేసుకోని వచ్చి ఆకాశవీధుల్లో గుమికూడి ఉన్నారు. ఆ ప్రక్క కురుకుల గురువు ద్రోణుడున్నాడు.

“బంగారు వేదిక” జెండా చూశావా? అక్కడే విజయలక్ష్మి విశ్రాంతి తీసుకుంటుంది. నీవంటే ద్రోణాచార్యునికి అమితమైన ప్రేమ. చిన్నతనంలో నేర్పిన విద్యని గురువు నేడు పరీక్షించును. ద్రోణాచార్యునికి ఆ ప్రక్క కృపాచార్యుడున్నారు. ధృతరాష్ట్రుని తిండి తిని బ్రతుకుతున్నాడు కదా. అందువల్ల నేడు వారి తరుపున యుద్ధానికి వచ్చాడు.

అదిగో శకునాల పక్షి, మాయ పాచికలాడటంలో పండితుడు. దొంగ పాచికలాడి సంపద దోచుకున్న దుర్యోధనుని గారాబపు మేనమామ శకుని. సోదరీ మణి పాంచాలి జోలికొచ్చి తియ్యగా తన్నులు దిన్న ముద్దుల బావ జయద్రధుడు అదిగో అక్కడున్నాడు. భద్రగజంపై కూర్చొని పదకొండు అక్షౌహిణుల సైన్యం తనని కొలువగా తెల్లగొడుగు కింద సేదదీరుతున్నవాడు దుర్యోధనుడు. దుర్యోధనుని ప్రక్కన ఉన్న అంగరాజు కర్ణుడు. సూర్యపుత్రుడు, శక్తివంతుడు, బ్రాహ్మణ శాపం పొందినవాడు. దుశ్శాశనాది సోదరులు రాజుకి ఇరుప్రక్కలా ఉన్నారు. మన పక్షాన రాబోతున్న శల్యుని దుర్యోధనుడు మోసంతో తన ప్రక్కకు మరల్చుకున్నాడు. అదిగో అక్కడ శల్యుడున్నాడు.

భగదత్తుడు, బృహద్బలుడు, కృతవర్మ, భూరిశ్రవస్సు, బాహ్లిక, సుదక్షిణ, సోమదత్తుడు, మొదలైన వారంతా యుద్ధానికి వచ్చారు. వీరంతా దుర్యోధనునికి ఆప్తులు. ఒకరకమైన చిన్నపాటి యుద్ధానికి తృప్తి చెందరు. ఎట్టి పరిస్థితిలోనూ వెనుతిరగమని ఒట్టుపెట్టుకున్నవారు వీరు. మహాసముద్రంలో తేలియాడే దీవుల మాదిరిగా వారి రథాలు ఉన్నాయి అని కృష్ణుడు కౌరవ సైన్యాన్ని అర్జునునికి చూపించాడు.

**విషాదము:**

యుద్ధ భూమిలో కృష్ణుడు రథాన్ని నడుపుతూ సైన్యాన్ని చూపిస్తున్నాడు. అర్జునుడు కృష్ణునితో బావా నా మనస్సు కలత చెందుతుంది. అంతరంగంలో నూతన భావాలేవో ఉద్భవిస్తున్నాయి. ఒళ్ళు వణుకుతుంది. గాండీవం జారిపోయింది. గుండె గజగజ వణుకుతుంది. గొంతు ఎండుతుంది. నేను నిలబడలేను. రాజ్యము, సంపద, వైభవాలు నాకు వద్దు అని బాధ పడుతుంటే కృష్ణుడు కిరీటీ! వీరాగ్రేసరా ఇదేమి? వృధా వ్యథ ఎందుకు. గ్రహదోషమా? నిద్రమత్తా! లేక సరసానికి ఇలా అంటున్నావా? గుండె నిబ్బరం చేసుకో. ఇంతదాకా వచ్చాక యుద్ధం చేయకపోతే “బండారం బైటపడింది” అని ఎగతాళి చేస్తారు. రాజుకి విజయమా? వీర మరణమా? రెండే వేరే మార్గం లేదు. కర్ణుడు, ద్రోణాచార్యుడు, ధృతరాష్ట్రుని కొడుకులు, భీష్మాచార్యులను చూసి భయకంపం కలిగిందా? ఇంత మంది శూరులు అధర్మం పక్షాన యుద్ధం చేయడానికి వస్తే వారికి లేని సంశయం నీకెందుకు. వారంతా నశించక తప్పదు అని కృష్ణుడు అర్జునునికి ధైర్యం కలిగే విధంగా మాట్లాడాడు. ఆ మాటలకు అర్జునుడు. ఇలా అన్నాడు.

గాండీవం ఎక్కుపెట్టాలా? వీరి కంఠాలు తెగగొట్టి భూమిపై పడవేయాలా? తాతలు, తండ్రులు, గురువులు సోదరులను చంపడానికి నాకు చేతులు రావడం లేదు. మిత్రులు, ప్రియ బిడ్డలను ఏవిధంగా చంపగలను? వానిని బలిగొని ఎలా తృప్తి పడగలను? దయమాలి సుచ్చరితుడైన భీష్ముని ఎలా చంపగలను. పెద్దలచే ప్రశంసించబడే నా గురువు ద్రోణాచార్యుల వారిని ఎలా ఎదిరించగలను? అది గౌరవం కాదు గదా! మహోన్నత మనోజ్ఞమైన గాండీవాన్ని రాజ్యకాంక్షతో పూజ్యులపై ఉపయోగించలేను.

దుష్ట దుర్యోధనుడు లోభియై పనికి మాలిన మనస్సులో రాజ్యకాంక్షతో ఇష్టజనులను నాశనం చేయడానికి ఇష్టపడ్డాడు. మోసగాడినై స్వార్ధ బుద్ధితో ధృతరాష్ట్రుని చంపనా? ఈ దారుణ మారణ క్రియకి నా హృదయం అంగీకరించుట లేదు.

ముల్లోకాలు ఏకమై వచ్చినా, కౌరవులు కొట్టినా తిట్టినా, నాపేరు మాసిపోయినా మౌనంగా ఉంటాను. స్వజనులను చంపలేను. ధర్మాన్ని నాశనం చేయలేను. నీవే నా దిక్కు అని కృష్ణుని వేడుకున్నాడు. (అర్జునుడు) ఆ మాటలు విని కృష్ణుడు అర్జునుని గొప్ప పరాక్రమ శాలివే. మతి తప్పి మాట్లాడుతున్నావు. ఈ వివేకం అనుకోకుండా ఎక్కడ నుండి వచ్చింది? నీ స్థితి చూసి రాజులు పక్కున నవ్వరా? పిరికితనం వదులు. మనస్సు నిబ్బరం చేసుకో. ధైర్యం చెడనియ్యకు. నీ మొఖంలో పిరికితనం శత్రువులు గ్రహించారంటే కొంప మునుగుతుంది అని రధాన్ని చెట్టు నీడకు తీసుకుపోయి ఆపి కృష్ణుడు ఈ విధంగా హితబోధ చేశాడు.

**ప్రబోధము:**

లక్క ఇల్లు తగుల బెట్టిన మంటలు ఆరనే లేదు. గాండీవం బాణాల వర్షం కురిపించనేలేదు. ఈ భయం నీకెక్కడ దాపురించింది. జగత్తు రక్షణ కోరి సంధి చేయబోతే గాంధారి పుత్రులు కన్ను గానక మదాంధులై కాలదన్నారు. సంధి సంగరానికి దారితీసింది. హింస తప్పదు. గాండీవానికి పని పడింది. ఇక ఎటువంటి బాంధవ్యాలూ లేవు. వ్యర్థమైన వ్యధ వద్దు. రథాన్ని వెనక్కి తిప్పితే మీకు సహాయం చేయడానికి వచ్చిన రాజులు "పాండవులు అప్పుడు గొప్పలు చెప్పారు, మీసాలు తిప్పారు" అని దెప్పిపొడుస్తారు. అప్పుడు పౌరుషంగా మాట్లాడినేడిట్లు దిగ్భ్రాంతి చెందుట తగదు అని కృష్ణుడు అర్జునుని హెచ్చరించాడు.

ఆ మాటలు విన్న అర్జునుడు అచ్యుతా! గుండె రాయిచేసుకొని గాండీవంతో కురుసైన్యాన్ని చంపి వారి రక్త ప్రవాహంలో ఢాకినీ పిచాచాలు మత్తిల్లే విధంగా చేయలేను. నా భుజాలు సంకోచిస్తున్నాయి. సొంత వారిని చంపడానికి మనస్కరించుటలేదు. యుద్ధం చేయాలనే ఉత్సాహం ఇక నేను పొందలేను. మహేశ్వరుని సాక్షిగా చెబుతున్నాను. యుద్ధం చేయడానికి భయం లేదు. సొంత జనులను చంపడానికి, వారి రక్తం నదుల వలే ప్రవహింప చేయడానికి సాహసించలేను.

పెద్దన్న ధర్మజుడు శాంతినే కోరాడు. నా మనస్సు కూడా మారింది. అంతఃపురాలు, సంపదలు అశాశ్వితాలు. కక్షలు, కార్బణ్యాలు ఇక చాలు. ప్రత్యర్థులను చంపే మారణ యుద్ధాలు ఇక వదయ్యా!. కత్తులతో పొడిచినా, బాణాలతో పొడిచినా, విల్లుతో మొత్తినా, గదలతో నెత్తి మీద మోదినా, గొంతుగోసి నెత్తురు పీల్చినా, పైబడి కొట్టినా తిట్టినా ఎవరు ఏమి చేసినా నోరు మెదపక మౌనంగా ఉంటాను అని అర్జునుడు తన మనో వ్యథను చెప్పాడు. అప్పుడు కృష్ణుడు అర్జునా అనవసరంగా శోకింపకూడదు. అనవసర శోకం అపకీర్తిని తెస్తుంది. అనవసరమైన మాటలు, చంచలత్వం, ఏవగింపు, మూర్ఛ ఇకచాలు. పిరికితనంతో ఎందుకు ఈ విధంగా మాట్లాడుతున్నావు. శివుని కూడా ఆపిన మగసిరి ఏమయ్యింది. రాజులకు రక్తపు కూడుగాక నేతి భోజనం లభించదు. చావు పుట్టుకలు తప్పవు. రాజధర్మం వీడి ఈ విధంగా దుఃఖించడం మాను. పూర్వకాలపు పాపపుణ్యాలే సుఖ దుఃఖాలను కారణం. ఈష్టి అంతా ఈ కర్మ సిద్ధాంతంపైనే ఆధారపడి చేయబడింది.

యుద్ధంలో చంపడమో చావడమో రాజధర్మం. కుల ధర్మం వీడుట న్యాయమా? మీ కొంపలు కుల ధర్మం వీడుట న్యాయమా? మీ కొంపలు కాలుస్తున్న వారిపై అనుకూలత ఎందుకు?. క్షుద్రులైన కౌరవులు జూదంలో మోసం చేసి ఉక్కుపాదాలతో మిమ్మల్ని అణగ దొక్కారు. ద్వేషంతో విషం పెట్టారు. లక్ష ఇల్లు కాల్చారు. అరణ్యాల పాలు చేశారు. అట్టివారిపై ప్రేమతో అన్నదమ్ములని చక్కటి బంధుత్వం కలుపుతున్నావు. హింస చేయనన్నావు. మరి మిమ్మల్ని హింసల పాలు చేసిన విధ్వంసకారులపై దయదాల్చడం హింస కాదా? నేను కంసుని చంపి మేనమామని లోక కష్టం తీర్చలేదా? రాజవంశంలో పుట్టిన వారికి కేవలం కూటికోసం అలమటించడం తగునా? ధనుంజయ విధి బలీయమైనది. న్యాయం గెలుస్తుంది.. స్వార్థం నశిస్తుంది. సత్యానిదే విజయం. గ్రహచారం తప్పితే వందమంది కొడుకులున్న తండ్రికైనా పిండం పెట్టడానికి కూడా ఎవ్వరూ

మిగలరు. దానినే సత్య కాలం అంటారు. యుగధర్మం ఎప్పుడూ ఇలాగే ఉంటుంది. విజయ సంపదలు, రాజాధికారం వద్దనే ప్రగల్భాలు మాని తల్లి పిలుపు విని లేని ఆయుధం సంధించు. యుద్ధం చేస్తావో? దుర్యోధనునికి విజయం చేకూరుస్తావో ఇంక నీ ఇష్టం. యుద్ధం చేయక తప్పదు.

ధర్మ దీక్షతో ధర్మ రక్షణ చేపట్టి కురుక్షేత్ర పొలందున్ని ద్రోహ నిర్మూలన చెయ్యి. స్వతంత్ర్య భారతావని వీర సంతానమై ఆయుధాలు ధరించి దేవదతం మారుమ్రోగించు. మదాంధుల కుంభ స్థలాలపైకి సింహంవలే దూకి రాక్షస సమూహాన్ని చీల్చి చెండాడక ఈ విధంగా ఉండటం జాతిహీనత కాదా? నిద్రాణ స్థితిలో ఉన్న జాతిని జాగృతం చేసి స్వతంత భారత నిర్మాణం చేయడం రాజులకి తగినది. స్ఫూర్తిదాయకంగా ఉండవలసిన నీవే నిరుత్సాహ, నిట్టూర్పులతో ఉండటం న్యాయమేనా.

జెండా జాతికి జీవం. సమతకి గుర్తు. జెండాయే జాతికి సమస్తం జెండా వంగడం జాతి శిరస్సు ఖండించినట్లే. అది సహించజాలనిది. ఇకలే లేచి జాతి శాంతికి కేతనమైన జెండాని ప్రపంచమంతా కొనియాడే విధంగా ఆయుధం ధరించు. జేజేనాదాలు వినిపింపజేయి. గుండె ఉంటే ఆయుధం ధరించు లేదా నాతో ద్వారకకు రా. ఐదుగురు బాబలకి ఐదూర్లు ఇస్తాను. వేదాంతం వల్లెవేస్తూ ప్రశాంతంగా బ్రతుకుతూ బ్రహ్మని వెతకండి.

భుజ బలంలో శత్రనాశనం చేసేవాడు, దైవ నిర్ణయం నెరవేర్చే అర్జునుని చూడడానికి దేవతలంతా విమానాలలో వచ్చి ఆకాశ వీధుల్లో గుంపులు కూడారు. నీ విషయం తెలిస్తే మనం ఇక్కడ నిలవనుకూడా నిలువలేము. యుద్ధ భేరిమోగింది. వీరులను పిలుస్తుంది. ప్రళయ కాల వాహినిలా రక్తం ప్రవహించే శ్మశాన వాటికలో విలయ తాండవం చేసే నటుని వలే పాండవుల చంద్రహాసాలు అల్లాడుతాయి. అర్జునా ఉదాసీనత విడువు. నీ స్వతంత్ర శంఖ ధ్వనులు వేదవ్యాసుని (భారత రచనలో) రచనలో మారుమ్రోగుతాయి. రాబోవు కాలంలో భారతీయులు నిన్ను ఆదర్శమూర్తిగా భావిస్తారు. నీ బాహుబలానికి ఎవ్వరూ నిలువ లేరు. తరువాత ఏమి జరుగుతుందో నాకు తెలుసు. నీ చేతిలో దేవదత్తముంది. నీవు విజృంభిస్తే అపజయమనేది లేదు విజయా!

ధర్మజుడు అజాత శత్రువు. మహాశాంత మూర్తి. విశ్వ విఖ్యాతుడు. అతని ధర్మ శక్తికి భీష్మాచార్యులంతటి వారుకూడా లోబడతారు. అధర్మ మూర్తులకు ఏల విజయం చేకూరుతుంది? సస్యశ్యామల రత్నాల రాశి, సమతా సంపన్నురాలు మీ తల్లి. ఆమె నిద్రాహారాలు మాని శత్రువుల గృహంలో దాస్యత్వంతో బ్రతుకుతుంది. ఓ కురుకుల సింహమా! తల్లి దాస్య సంకెళ్ళు తెంచు

కన్న తల్లి పరాయి పంచనబడి ఏడుస్తుంటే బిడ్డ సహించగలదా? బ్రతుకు బలి పెట్టైనా తల్లిని రక్షించడం మగశిరి. ఇలా పడి ఉండటం చేతనానితనం. బృహన్నల అన్నపేరు సార్ధకమౌతుంది. విజయలక్ష్మి చేకూరుస్తావని నీ సోదరులంతా ఎదురు చూస్తున్నారు. నీవు శౌర్యహీనుడువైతే జెండాపై ఉన్న ఆంజనేయస్వామికి, గాండీవానికీ పరువుపోతుంది. బంధువులతో కుంతి తల ఎత్తుకో లేదు. స్వతంత్ర భాస్పాలతో నీ తల్లి పాదాలు కడుగు. అర్జునుడు విల్లుతీస్తే ఎదురులేదు. ఎటువంటి ఆటంకకర శక్తులైనా నీ దాపుకి చేరవు. నరనారాయణులు ఒకటై యుద్ధ భూమిలో నిలిస్తే ఇక చెప్పడానికి ఏముంటుంది. (ఎదురు ఉండదు). రథసారధిగా కృష్ణుడుండి అర్జునుడు పోరాడుతుంటే శివుడు కూడా నిలువలేడు. వీర భారత కుమారా! అనవసర దుఃఖం మాని ఆయుధం చేపట్టి యుద్ధ రంగంలో కౌరవులపై క్రీడసలుపు. పరాక్రమాన్ని మరువకు. యుద్ధ నేర్పరివి. ఏదైనా సాధిస్తావు.

మహేశ్వరుడు పాశుపతం ఇస్తూ దుష్టనాశనం చేయమని దీవించి ఇచ్చాడు. ఆ మాట వమ్ము చేస్తావా? గాండీవంతో

పిట్టలు కొట్టుకుంటావా? దుర్భేద్యమైన కిరీటాన్ని తాకట్టుబెట్టి బ్రతకడానికి తలపెట్టావా? రాజ్యా వైరాగివై చెట్లూ, పుట్టలూ తిరుగుతూ జపం చేస్తావా? గెలిసినా, ఓడినా నీకు గౌరవమే. రాజ్యం వీర భోజ్యం. పరాక్రమవంతుడే భరత భూమిని పాలిస్తాడు కృష్ణుడు నీకు తోడున్నాడు. పిరికి పందగా పారిపోవద్దు. యుద్ధం భూమిని విడువవద్దు. విజయం సాధించు. ద్రౌపది పరాభవం అనే మేఘం శత్రువుల శిరసులపై మోగింది. శత్రు రాజులు రక్త వర్షం కరిపించు. భారత భాగ్యరేఖ అనే విజయలక్ష్మిని సంపాదించింది మా అర్జునుడా? అనిమీ తండ్రి దేవలోకంలో ఉండి సంతోషిస్తాడు. ద్రౌపది జుట్టు ముడి వేస్తానని దుశ్శాసనునిపై గర్జించిన సింహం భీమసేనుడు గదపట్టకుండా ఉంటాడా? ఏనుగులపైకి గర్జిస్తూ దూకే సింహంలా భీముడు శత్రువులపైకి దూకబోతున్నాడు. భీముణ్ణి ఎవరూ ఆపలేరు. అగ్నికి వేడి తోడైనట్లు రాజవంశీయులకు పౌరుషం అందాన్నిస్తుంది. పౌరుషం విడిచి జాలిగా మాట్లాడితే బూడిదను తన్నుకుంటూ పోయినట్లు బలవంతుడు బలహీనుని తన్నుకుంటూ పోతాడు.

చంద్ర కుల ఆభరణమా! ఎంత సేపు పగ్గాలు పట్టగలను. గుర్రాలు ఆగటం లేదు. భేరీ మ్రోగక ముందే లేచి మనసు స్వరాజ్యలక్ష్మికై దిటవు చేసుకో. నీ పక్షంగా యుద్ధం చేయడానికి అనేక మంది రాజులు సిద్ధంగా ఉన్నారు. నీవు ఈ విధంగా ఉంటే అనవసరంగా వారు బలైపోతారు. ధర్మాత్ములను బానిసలను చేసిన దుండగులపై జాలి పడవచ్చా? నిరంకుశ మనుజాధములు మానవ జాతికి, ఘోరమైన శత్రువులు. ముద్దుల మరిదీ నేనున్నాను. సమస్తం నేను చూసుకుంటాను. సందేహం వీడు. నాపై భారం వేసి నిలబడు. విజయం మనదే. అధర్మం నిలువదు. కుంతీ పుత్రా "సర్వ భూతాలకీ కర్తను నేనే. సర్వం నేనే అవతారమైతి ధర్మాన్ని నిలుపుతాను. భూభారాన్ని తీరుస్తాను. దుఃఖమెందుకు. నీవు నిమిత్త మాత్రుడవు. గాండీవం చేపట్టి నీకర్తవ్యం నిరవేర్చు.

అర్జునా! మంచిని రచ్చకీడ్చిన పాపిష్టి జనం నశించుటే ధర్మం. నీ రాద్ధాంతం చాలించి కార్యసిద్ధికై నారిసారించు. వీర భారత యుద్ధం చేసి విజయశాంతిని సాధించు. నీ భుజ బలం చూపించకపోతే పాశుపతం మైలపడుతుంది. వనవాస, అజ్ఞాత వాసాలు తీరాయి. దేవదత్తం వినిపించే వేళయ్యింది. ఎంతో కాలంగా ఆవరించిన చీకట్లు అంతరించి తూర్పుదిక్కు వెలుగులు విర జిమ్ముతుంది.

ఉత్తురుని బలపరచిన చేతులే నేడు గాండీవం జార విడిచాయి. నీకు నేను ఉపన్యసించడానికి పూనుకున్నాను. కారణం కొన్నిసార్లు కొండంత ధైర్యవంతుడే ధైర్యం కోల్పోవడం మంచిది కాదని తెలపడానికే. కర్ణుని మీసాలు, దుశ్శాసనుని భుజాలు, శకుని కనుబొమ్మలు, తమ్ముళ్ళ బలం చూసుకొని దుర్యోధనుడు యుద్ధ భారం నెత్తిన పెట్టుకున్నాడు. దురహంకారికి విజయం చేకూరదు. గర్వాంధులను తుద ముట్టించాలనే గాని, నీవేమైనా నాకు జాత బత్యాలిస్తావా? నీ గుర్రాలు తోలేపని నాకెందుకు. మా ఇంటిలోనే గుర్రాలు తోలుకునే వాడిని కదా? ధర్మ రక్షణకే అర్జునుని రథ సారథినయ్యాను. ఇది నిజం. నీవు గాండీవం సవరిస్తే చాలు. అన్యాయ ప్రభుత్వంలో భూకంపం పుడుతుంది. దుష్టుని పరాక్రమం బద్దలవుతుంది. కురుకులం క్రుంగి కృషిస్తుంది. గురువు, తాతలను చూచి సంకోచిస్తున్నావు కదా? మరి వారెందుకు ఊరకుండక అధర్మంను సమర్థిస్తూ యుద్ధానికి వచ్చారు.

శత్రుంజయా ! ఇది నీకు అగ్ని పరీక్ష. క్షత్రయ స్ఫూర్తితో కర్మవీరుడవై వేడి రక్తంతో విల్లందుకొని జీవిత లక్ష్యం నెరవేర్చి మాతృరుణం తీర్చుకో. ఇది మహా స్వేచ్ఛా యుద్ధం. నీవు మాగ్నకుడవు. నేను శ్రోతను. గాండీవం విరోధులను మట్టుబెట్టే ఆయుధం. స్వరాజ్య సాధన యజ్ఞఫలం. ముల్లోకాలను ఏలే ఇంద్ర కిరీటం ధరించావు. దానికి సిగ్గు వాటిల్లేటట్లు చేయకు.

నీవు ఈ విధంగా ఉంటే "నరుడేనా" అని అనుమానం వచ్చి ఆంజనేయస్వామి వెళ్ళిపోతాడు.

కొడుకులు ముక్తి చేకూరుస్తారని తల్లి కొండంత ఆశతో ఉంది. శత్రు కను సంజ్ఞల్లో ఎంతకాలం పడిగాపులు కాస్తుంది? పార్ధుడనే పేరుకి అపకీర్తి తేకు. నీరసించి నశించడం రాజన్యాయం కాదు. వీడా ! వీడా! నాకొడుకు అని ఇంద్రలోకంలో ఉన్న మీ తండ్రి బాధపడతాడు. దేవదత్త, గాండీవాల, గౌరవ మర్యాదలు మంట గలపకు, తెల్ల గుర్రాల గొప్పదనం, అంజనేయ కేతనానికి కవుల రచనల్లో కళంకం తేవద్దు. ఇంటికి నిప్పుపెట్టిన క్రూరుల్ని చంపక కంట తడిపెట్టిన కరుణ ఇకచాలు. ఏడ్వడానికి ఇది సమయం కాదు. భరత వీరా! లేవవోయి! నీవు నరుడవు. నేను నారాయణుడను.

కంటి నీరు తుడుచుకో, ధర్మం చేపట్టి విజయ కేతనం ఎగురవేయి అని కృష్ణుడు అర్జునునికి ప్రబోధించాడు.

**విజృంభణము:**

కృష్ణుని ధర్మ ప్రభోధకి అర్జునుడు తెప్పరిల్లి జగద్రక్షకా! మోహం చల్లారింది. ధర్మ సందేహం తొలగిపోయింది. విగత ధర్ముడవైన నన్ను ధైర్యపరచావు. ధర్మం తెలిసి ఉత్సాహపరిచావు. మీ కృపకు ధన్యవాదాలు. మీ మహా ఉపన్యాసం ఉదయ కిరణం వలే నన్ను నిద్ర మేల్కొల్పింది. కర్తవ్యాన్ని తెలియచేసింది శివుని ఆజ్ఞ నెరవేరుస్తాను. తల్లికి అఖండ ఆనందం చేకూరుస్తాను. ద్రౌపది దుఃఖ భారం తీరుస్తా. రథం ముందుకు నడుపు. పాంచజన్యం ఒతు. నేను దేవదత్తం ఊదుతాను. నీ దయతో ఈ మదోన్మత్తులను త్రుంచి దురభిమాన నిరంకుశ రాక్షస పాలనకి స్వస్తిచెప్పి "నవభారత వీర పతాక" ఎగుర వేస్తాను అని యుద్ధానికి విజృంభించాడు.

ఈ విజయశ్రీ వెలుగులో నూతన భారత సంపద వెలుగొందు గాక. ఈ సృష్టి శాంతించు గాక. ఈ సందేశం ద్వారా "బంగారు భారతం" ఏర్పడుగాక అని కృష్ణుడు దీవించాడు.

## 2. ద్రౌపది ఆవేదనను వివరించుము?

**అ) కవిపరిచయం:**

కరుణశ్రీ జంధ్యాల పాపయ్య శాస్త్రి క్రీ.శ. 1912 ఆగస్టు 4 వ తేదీన గుంటూరు జిల్లా పెద్దనందిపాడు మండలం, కొమ్మూరులో జన్మించారు. మహాలక్ష్మమ్మ పరదేశయ్య వీరి తల్లిదండ్రులు. కొమ్మూరులోనే ప్రాథమిక, మాధ్యమిక విద్య అభ్యసించారు . శ్రీ భమిడిపాటి సుబ్రహ్మణ్యశర్మ, శ్రీ కుప్పా ఆంజనేయ శాస్త్రి గార్ల వద్ద సంస్కృత కావ్యాలు నేర్చుకున్నారు. రాష్ట్ర భాషా విశారద, ఉభయ భాషా ప్రవీణ, హిందీ భాషా ప్రవీణ పరీక్షలలో ఉత్తర్యులయ్యారు.

అమరావతిలోని శ్రీ రామకృష్ణా హైస్కూలు, గుంటూరులోని స్టాల్ గరల్స్ హైస్కూల్లో ఉపాధ్యాయుడిగా పనిచేశారు. గుంటూరులోని మహవీర్, హిందూ, ఏ.సి. కళాశాలలలో అధ్యాపకునిగా పని చేశారు. టి.టి.డి. వారి "భాగవతం ప్రాజెక్టుకి ప్రధాన సంపాదకులుగా " పనిచేశారు

అనసూయా దేవిగారిని వివాహమాడారు. వీరికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. పుష్పవిలాపం, కుంతీకుమారి, ఉదయశ్రీ, విజయశ్రీ, కరుణశ్రీ, ఉమర్ ఖయాం, బాల సాహిత్యం వంటి 76 గ్రంథాలు రాశారు. బాణుని కాదంబరి కావ్యాన్ని "కళ్యాణ కాదంబరి" అనే పేరుతో అనువాదం చేశారు. 1985 నుండి 1991 వరకు "తెలుగు అకాడమి" "రసమయి" "శుభాంగి" వంటి ఎన్నో పురస్కారాలు పొందారు. సువర్ణ ఘంటా కంకణం, కనకాభిషేకం వంటి సన్మానాలు ఎన్నో పొందారు.

యన్.టి. రామారావుగారు, జ్ఞాని జైల్‌శింగ్ గార్ల నుండి సత్కారాలు అందుకున్నారు. శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి, వారు వీరికి డి.లిట్. పట్టాను ఇచ్చి గౌరవించారు. 1951-53 వరకు "సుభాషిణి" అనే మాస పత్రికను నడిపారు.

తెలుగు సాహిత్యంలో 20 వ శతాబ్దంలో మేటి కవులలో ఒకరిగా నిలిచిన పాపయ్య శాస్త్రి గారు 1992 జూన్ 21వ తేదీన పరమపదించారు.

**పాఠ్యభాగ సందర్భం:**

పాండవులు 13 సంవత్సరాలు అరణ్యవాసం, ఒక సంవత్సరం అజ్ఞాతం ముగించుకొని కృష్ణుని ధృతరాష్ట్రుని వద్దకు రాయబారానికి పంపారు. పాండవులను ఐదు ఊర్లు ఇచ్చినా చాలు వారు పరిపాలించుకొని బ్రతుకుతారని రాయబారం చేయబోయిన కృష్ణుని మాటలు దుర్యోధనుడు నిరాకరించి సూదిమొన మోపేటంత భూమికూడా ఇవ్వనన్నాడు. ఆ విషయం కృష్ణుడు పాండవులకు తెలిపే సందర్భంలో పాండవులు వారివారి అభిప్రాయాలు తెలియజేయడంతో పాఠం ప్రారంభమయ్యింది.

**ద్రౌపది వేదన:**

శ్రీకృష్ణుడు రాయబారిగా ధృతరాష్ట్రుని వద్దకు వెళ్ళాడు. ద్రోణ, కృపాచార్య, ధృతరాష్ట్రులు ఏదో ఒక విధంగా సంధికి ఒప్పుకొని బ్రతకండని చెప్పారు. దుర్యోధనుడు కర్ణుని అండ, తమ్ముళ్ళ బలం చూసి సూదిమోపే అంత భూమి కూడా ఇవ్వనన్నాడు. కృష్ణునే నిర్బంధించబోయారు. రాయబారం యుద్ధానికి దారితీసింది. మీరు చెట్టుకొకరు పుట్టకొకరై వనాలు తిరుగుతున్నారు. ఏ సంబంధం లేనవారు హాయిగా సంపదలు అనుభవిస్తున్నారు. సంధి ప్రయత్నం ఇకచాలు ద్రౌపది కురులు రక్తంతో తడిపే సమయం ఆసన్నమయ్యింది అని కృష్ణుడు రాయబార సారాంశం చెప్పాడు.

భీమ, అర్జున, నకుల, సహదేవులు వారి వారి అభిప్రాయాలు అభిప్రాయాలు తెలియజేశారు. వారి మాటలు విన్న ద్రౌపది పాండవులను "భుజబలం" అధిగమించే విధంగా ముందుకు నడుస్తారో? పాండవ కేతనాలు వంగేటట్లు వెనుదిరుగుతారో? ఆయుధాలు ధరించి శౌర్యం చూపుతారో? చేతులు జోడించి విహారం చేస్తారో? క్షత్రియ కుల ప్రతష్టతను విడిచి పెడతారో? శత్రు పాదపద్మాలను పొగడుతారో? అడవుల పాలై కందమూలాలు తింటారో? తత్వజ్ఞానం ఆలోచిస్తూ ధర్మశాస్త్రం రాస్తారా? గతకాలంలో మీరు చేసిన ప్రతిజ్ఞలను గుర్తుచేసుకొని ఆయుధాలు ధరించండి. గర్వంతో కరుడుగట్టిన కౌరవులను నాశనం చేయండి. గౌరవ కాంతులు వెదజల్లుతూ రాజ్యం పొందండి. రథం అధిరోహించి యుద్ధ నేర్పరియైన యుధిష్ఠురుడు ఎంతటి కార్యమైనా సాధించగలడు. అజాత శత్రువని అనిపించుకొనే కోరికతో సొంత వారి మేల్కొల్పు మరచిపోతారా?" అని ద్రౌపది తన ఆవేదన తెలిపింది.

అన్నదమ్ములు, భార్యమాటలు విన్న ధర్మజుడు యుద్ధం చేసి సొంతవారిని నాశనం చేయలేను. హింస చేయనిదే సంసార యజ్ఞం సాగదా? కృష్ణా ధర్మశాస్త్రజ్ఞులు హింసను ఇష్టపడతారా? అని శాంతివచనాలు పలికినప్పుడు కూడా ద్రౌపది ఆవేశంతో "ప్రతిసారి ఒకే మంత్రం వల్లవేయడం ఎందుకు. కూటికోసం తోటి రాజులతో బేరాలాడటం పలుచన. అంతేకాక వారు సంధికి తిరస్కరించి యుద్ధానికి సిద్ధమని ఆయుధాలు ఎత్తుతుంటే కేవలం విచారించుకుంటూ మెడలు చాపి కన్నీరు కార్చడం ఎంతైనా నీచం. సంధి జరిపించడం అయ్యింది. మీరు నమ్మిన హింస అయిన వారిలో హింసగా మారింది. ఇక చాలు. మనం పీడించబడి యాతన పడుతున్నామని గ్రహించి కనీసం ఇప్పటికైనా ఆయుధాలు పట్టకుండా ధర్మాన్ని వల్లెవేయడం నమ్మిన వారి గొంతులు కోయడం కాదా?

గౌరవప్రదుడైై ద్రుపద రాజుకి పుట్టాను. పాండుల భూపతికి కోడలయ్యాను. గొప్పవారు, అభిమానవంతులైన పాండవులకు భార్యనయ్యాను. ధైర్య పరాక్రమాలు గల కొడుకులను కన్నాను. ఇంత ప్రసిద్ధికెక్కి భర్తలు సిగ్గుమాలిన వారైతే అయ్యో! ఏ విధంగా దాసిగా బ్రతకగలను? మా అన్న, నాన్నలు మీ అభివృద్ధి కోరి వారి సంపూర్ణ సైన్యంతో యుద్ధం చేయడానికి వచ్చారు. మహాత్ములు మీరేమో మీనమేషాలు, మంచి చెడులు లెక్కిస్తూ నీళ్ళు తాగుతున్నారు. ఇలా ఉంటే పరిస్థితులు విషమిస్తాయి. చిన్నతనం భరిస్తారా? యుద్ధం చేయకపోతే "ఛీ పాండవులు చేతగాని వారని" నలుగురూ నవ్వరా?.

కర్మసిద్ధాంతంతో హింస, అహింస అనుకుంటూ మా రక్త మాంసాలు బలిఇచ్చి ఇష్టం వచ్చిన విధ్వంస మార్గాన నడిచే తీరు ఇకచాలు. దుష్ట నాశనానికి ఆయుధాలు ధరించండి. క్షత్రియ ధర్మం నిలబెట్టండి. యుద్ధం చేయగలమనే ధైర్యం ఉంటే నా వెంట్రుకలు శత్రురక్తంతో తడిపి ముడివేయండి. మీకు ధైర్య పరాక్రమాలు లేకుంటే మౌనంగా ఉండండి. భారత భాగ్యవంతులైన మీ బిడ్డలు యుద్ధం చేసి ఈ భారం తీరుస్తారు. పాండవ వంశాన్ని అలంకరించిన మా అభిమన్యుడు, శత్రువులను ఖండించగల పరాక్రమశాలు ఘటోత్కచుడు చాలు. వారిద్దరు చాలు ధృతరాష్ట్రుని పుత్రులను చంపడానికి. మిగిలిన వారుంటే ఎక్కువ తక్కువలు సరిచూడడానికి ఉపపాండవులు కత్తి తిప్పడం చేతగాని వారు కాదు కదా?

పాండవులు యుద్ధం చేస్తే మా అత్త గారు కుంతీదేవికి "భారత వీరమాత" అనే పేరు వస్తుందని ఆశించం. ఆమెకు లభించని ఆగౌరవం నాకు, సుభద్రకి, హిండింబికి దక్కుతుంది. అంటే మీరు చేయలేనిది పిల్లలు చేస్తారని భావం. ఈ విధంగా ద్రౌపది వ్యంగ్య, పౌరుషోక్తులతో పాండవులను ప్రశ్నించింది. తన ఆవేదనను, తన యుద్ధ వాంచను తెలియజేస్తూ పాండవులలో పౌరుషం రేకెత్తేవిధంగా మనోవ్యధను, అభిలాషను తెలిపింది.

## 3. జంధ్యాల వారు ధర్మజుని పాత్రను తీర్చిదిద్దిన విధమును తెలుపుము?

**జ) కవిపరిచయం:**

కరుణశ్రీ జంధ్యాల పాపయ్య శాస్త్రి గారు క్రీ.శ. 1912 ఆగస్టు 4 వ తేదీన గుంటూరు జిల్లా, పెద్దనందిపాడు మండలం కొమ్మూరు గ్రామంలో జన్మించారు. మహాలక్ష్మమ్మ, పరదేశయ్య వీరి తల్లిదండ్రులు. స్వగ్రామంలోనే ప్రాథమిక, మాధ్యమిక విద్యను అభ్యశించారు. శ్రీ భమిడిపాటి సుబ్రహ్మణ్య శర్మ, శ్రీ కుప్పా ఆంజనేయ శాస్త్రి గార్ల వద్ద సంస్కృత కావ్యాలు చదువుకున్నారు. రాష్ట్ర భాషా విశాద, ఉభయ భాషా ప్రవీణ, హిందీ భాషా ప్రవీణ పరీక్షలలో ఉత్తీర్ణులయ్యారు.

అమరావతిలోని శ్రీ రామకృష్ణా హైస్కూలు, గుంటూరులోని స్టాల్ గరల్స్ హైస్కూల్లో ఉపాధ్యాయునిగా పని చేశారు. గుంటూరులోని మహవీర్, హిందూ, ఏ.సి. కళాశాలలలో అధ్యాపకునిగా పనిచేశారు. టి.టి.డి. వారి "భాగవతం ప్రాజెక్టుకి ప్రధాన సంపాదకులు" గా పని చేశారు.

అనసూయాదేవి గారిని వివాహమాడారు. వీరికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. పుష్ప విలాపం, కుంతీకుమారి, ఉదయశ్రీ, విజయశ్రీ, కరుణశ్రీ, ఉమర్ ఖయామ్, బాలసాహిత్యం మొదలగు 76 గ్రంథాలు రాశారు. బాణుని కాదంబరీ కావ్యాన్ని "కళ్యాణ కాదంబరీ" అనే పేరుతో అనువాదం చేశారు. 1985 నుండి 1991 వరకు "తెలుగు అకాడమి" "రసమయి" "శుభాంగి" వంటి ఎన్నో పురస్కారాలు పొందారు. సువర్ణ ఘంటా కంకణం, కనకాభిషేకం వంటి సన్మానాలు ఎన్నో నాటి ముఖ్యమంత్రి శ్రీ ఎన్.టి. రామారావు గారు, జ్ఞాని జైల్‌సింగ్ గార్ల నుండి సత్కారాలు అందుకున్నారు. శ్రీ

వెంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి, వారు వీరికి డి.లిట్. పట్టాను ఇచ్చి గౌరవించారు. 1951–53 వరకు “సుభాషిణి” అనే మాస పత్రికను నడిపారు.

తెలుగు సాహిత్యంలో 20వ శతాబ్ధంలో మేటి కవులలో ఒకరిగా నిలిచిన పాపయ్య శాస్త్రిగారు 1992 జూన్ 21వ తేదీన పరమపదించారు.

**పాఠ్యభాగ సందర్భం:**

పాండవులు 13 సంవత్సరాలు అరణ్యవాసం, ఒక సంవత్సరం అజ్ఞాతం ముగించుకొని శ్రీకృష్ణుని కౌరవుల వద్దకు రాయబారానికి పంపారు. పాండవులకు ఐదుగురికి ఐదు ఊళ్ళు ఇస్తే చాలు అని కృష్ణుడు చెప్పగా భీష్మ, ద్రోణ, కృపాచార్యులు, ధృతరాష్ట్రుడు ఒప్పుకున్నారు. కాని దుర్యోధనుడు తన తమ్ముళ్ళ బలాన్ని, కర్ణుని అండదండలు కాని సూదిమొనమోపేటంత భూమి కూడా ఇవ్వనన్నాడు. ఆ విషయాన్ని కృష్ణుడు పాండవులకు తెలుపగా పాండవులు వారి వారి అభిప్రాయాలు కృష్ణునితో చెప్పే సందర్భంలోనిది ఈ పాఠం. (విజయశ్రీ కావ్యం)

కృష్ణుడు కౌరవులు సంధి వమ్ము చేసిన తీరును కృష్ణుడు వివరించాడు. ఏ సంబంధం లేని గాంధారి పుత్రులు సకల సంపదలు అనుభవిస్తున్నారు. మీరు అడవులలో తిరుగుతూ కందమూలాలు తింటూ బాధపడుతున్నారు. సంధి ప్రయత్నం ఇక చాలు. ద్రౌపది కురులు ముడివేసే సమయం ఆసనమయ్యింది. యుద్ధానికి సిద్ధం అవ్వండని చెప్పాడు. కృష్ణుని మాటలు విన్న భీముడు తాను యుద్ధానికి సిద్ధమని తెలిపాడు. అర్జున, నకుల, సహదేవులు కూడా యుద్ధమే శరణ్యమన్నారు. ద్రౌపది వారిని యుద్ధానికి వెళతారా? వెనుదిరుగుతారా? మీ ఇష్టం అని ఆవేదన తెలిపింది. వారి పాటలు విన్న ధర్మనందనుడు ఎంతో ఆవేదనతో కృష్ణునితో ఈ విధంగా అన్నాడు.

కృష్ణా! సంధి కుదిరితే మాకు కౌరవులకు బాల్యం నుండి ఉన్న బేధాభిప్రాయాలు తొలుగుతాయని అనుకున్నాను. లోకశాంతి కోరి జగతికి బంధువుడవైన నిన్ను రాయబారిగా పంపాను. యుద్ధ కాంక్ష తగునా? అన్నదమ్ముల మధ్య గొడవలు మంచిది కాదు. రాజ్యంలో సగభాగం ఇస్తే చాలు. అది న్యాయమని ఇంతగా కోరుతుంటే ధృతరాష్ట్రుని కొడుకులు ఇంతకు తెగించారు. అయ్యా! హింస చేస్తూ జీవించే వారిని ధర్మశాస్త్రజ్ఞులు ప్రశంసిస్తారా? దుఃఖమయ హింసాహుతులు లేకుండా ఈ సంసార యజ్ఞం సాగదా? సింహాసనం కోసం బంధువులను చంపలేను. మా స్వార్థం కోసం “భారత సంహితకు’ మచ్చ తేలేను. ఓ కృష్ణా! భయంకర యుద్ధ ఘోషతో మారణకాండ సృష్టించి కౌరవ రక్త కిరణాలతో నిండిన రాజ్య సంపద పొందిన వాడినగుట నాకు సిగ్గు చేటు. అయ్యా! ఓ కృష్ణా ! ధనం కోసం పరమార్థం మరచి అన్న దమ్ములం పోటీపడి యుద్ధం చేసే వంశం అభివృద్ధి చెందుతుందా? అయిన వారిన చంపి రాజై సుఖంగా గడపాలనే కోరికకంటే వైరాగ్యంతో కాషాయి వస్త్రాలు ధరించి అడవులకు పోయి తపస్సు చేసుకోవడం మంచిది కాదా!

ధృతరాష్ట్రుని సంతానం సంధికి ఒప్పుకుంటుందని సంతోషంతో ఉన్నాను. ఇక శాంతియా? పరాక్రమమా? ముందుండి మమ్మల్ని మీరే నడిపించి కాపాడండయ్యా! అని ఆవేధన వ్యక్త పరిచాడు. తరువాత పాంచాలి దెప్పిపొడువులు, తమ్ముళ్ళ ఆవేశం తెలుసుకొన్నప్పుడు కూడా ముకుందా! నలుగురు సోదరులూ ఒకటై అలిగి అలుగులు, సింగాణాలు తీసుకుంటే ఎవరు నిలువగలరు? కుల నాశనం తలచుకుంటే మనసులో బాధ కలుగుతుంది . మా భాగం మాకు ఇవ్వడానికి రాజుకి కొద్దిగ కూడా మనస్సు రాలేదు. కోపిష్టులైన తమ్ముళ్ళ ఆయుధాలకు స్వార్ధంతో పనిపెట్టాడు. స్నేహంగా ఉందామని మేము రాయబారానికి పంపాం. వారు కయ్యానికి దింపారు. నా ఆశంతా వృథా అయ్యింది. ఇక ఆ కురుకుల పరిస్థితి దేవుడే ఎరుగు.

ఏది ఏమైనా ఇక యుద్ధం తప్పదు. ఇక ఆపైన నీవే మాకు దిక్కు. ఈ విషయమై మా మాత మీకు ఏమి చెప్పారు అని ధర్మజుడు కృష్ణుని అడిగాడు. ఈ విధంగా జంధ్యాల వారు ధర్మజుని శాంతి కాముకుడిగా, శత్రువుకి కూడా అపకారం చేయని వాడిగా, ధర్మ చింతన కలవాడిగా, తను ఎంత వేదన అనుభవించినా శాంతిని కోరేవాడిగాను చిత్రించారు. అంతేకాక తన తల్లి అభిప్రాయాన్ని తెలుసుకొని చివరికి తల్లిపై గౌరవంతో ఆమె మాటలు శిరసావహించి యుద్ధానికి సరేనన్నాడు. అంటే తాను ఎంత గొప్పవాడైనా తల్లి సలహా తీసుకొనే ఉత్తమ కుమారుడు ధర్మజుడు. కృష్ణా ఇక నీవే మాకు దిక్కు? అని దైవం మీదే ఆన భారం మోపిన వినయశీలిగా యుధిష్ఠురుడు కనిపిస్తాడు.

**4) విజయశ్రీ కావ్యంలో అర్జునుని పాత్ర చిత్రణను తెలుపుము?**

**లేదా**

**విజయశ్రీ కావ్యంలో అర్జునుని మానసికస్థితిని వివరింపుము?**

**జ) కవిపరిచయం:**

కరుణశ్రీ జంధ్యాల పాపయ్య శాస్త్రి గారు క్రీ.శ. 1912 ఆగస్టు 4 వ తేదీన గుంటూరు జిల్లా, పెద్దనందిపాడు మండలం కొమ్మూరు గ్రామంలో జన్మించారు. మహాలక్ష్మమ్మ, పరదేశయ్య వీరి తల్లిదండ్రులు. స్వగ్రామంలోనే ప్రాథమిక, మాధ్యమిక విద్యను అభ్యశించారు. శ్రీ భమిడిపాటి సుబ్రహ్మణ్య శర్మ, శ్రీ కుప్పా ఆంజనేయ శాస్త్రి గార్ల వద్ద సంస్కృత కావ్యాలు చదువుకున్నారు. రాష్ట్ర భాషా విశారద, ఉభయ భాషా ప్రవీణ, హిందీ భాషా ప్రవీణ పరీక్షలలో ఉత్తీర్ణులయ్యారు.

అమరావతిలోని శ్రీ రామకృష్ణా హైస్కూలు, గుంటూరులోని స్టాల్ గరల్స్ హైస్కూల్లో ఉపాధ్యాయునిగా పని చేశారు. గుంటూరులోని మహవీర్, హిందూ, ఏ.సి. కళాశాలలలో అధ్యాపకునిగా పనిచేశారు. టి.టి.డి. వారి "భాగవతం ప్రాజెక్టుకి ప్రధాన సంపాదకులు" గా పని చేశారు.

అనసూయాదేవి గారిని వివాహమాడారు. వీరికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. పుష్ప విలాపం, కుంతీకుమారి, ఉదయశ్రీ, విజయశ్రీ, కరుణశ్రీ, ఉమర్ ఖయామ్, బాలసాహిత్యం మొదలగు 76 గ్రంథాలు రాశారు. బాణుని కాదంబరీ కావ్యాన్ని "కళ్యాణ కాదంబరీ" అనే పేరుతో అనువాదం చేశారు. 1985 నుండి 1991 వరకు "తెలుగు అకాదమి" "రసమయి" "శుభాంగి" వంటి ఎన్నో పురస్కారాలు పొందారు. సువర్ణ ఘంటా కంకణం, కనకాభిషేకం వంటి సన్మానాలు ఎన్నో నాటి ముఖ్యమంత్రి శ్రీ ఎన్.టి. రామారావు గారు, జ్ఞాని జైల్‌సింగ్ గార్ల నుండి సత్కారాలు అందుకున్నారు. శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి, వారు వీరికి డి.లిట్. పట్టాను ఇచ్చి గౌరవించారు. 1951-53 వరకు "సుభాషిణి" అనే మాస పత్రికను నడిపారు.

20వ శతాబ్ధంలో తెలుగు సాహిత్యంలోని మేటి కవులలో ఒకరిగా నిలిచిన పాపయ్య శాస్త్రిగారు 1992 జూన్ 21 వ తేదీన పరమపదించారు.

**పాఠ్యభాగ సందర్భం:**

పాండవులు 13 సంవత్సరాలు అరణ్యవాసం, ఒక సంవత్సరం అజ్ఞాతం ముగించుకొని శ్రీకృష్ణుని కౌరవుల వద్దకు రాయబారానికి పంపారు. పాండవులకు ఐదుగురికి ఐదు ఊళ్ళు ఇస్తే చాలు అని కృష్ణుడు చెప్పగా భీష్మ, ద్రోణ, కృపాచార్యులు,

ధృతరాష్ట్రుడు ఒప్పుకున్నారు. కాని దుర్యోధనుడు తన తమ్ముళ్ళ బలాన్ని, కర్ణుని అండదండలు కాని సూదిమొనమోపేటంత భూమి కూడా ఇవ్వనన్నాడు. ఆ విషయాన్ని కృష్ణుడు పాండవులకు తెలుపగా పాండవులు వారి వారి అభిప్రాయాలు కృష్ణునితో చెప్పే సందర్భంలోనిది ఈ విజయశ్రీ కావ్యం.

**అర్జునుని పాత్ర:**

కృష్ణుడు రాయబారం చేయడం అయ్యింది. ఇక యుద్ధమే శరణ్యం. భీముడు దుశ్శాసనుని రక్తంతో ద్రౌపది జుట్టు ముడివేసే సమయం ఆసన్నమయ్యింది. భీముడు మాకు విషాన్నం పెట్టారు, తాళ్ళతో బంధించి నీళ్ళలో పడవేశారు. లక్క ఇల్లు తగుల బెట్టారు. కులస్త్రీని దుర్భాషలాడారు. మా తండ్రి రాజ్యాన్ని పాలిస్తూ, కనీసం ఐదూళ్ళు కూడా ఇవ్వనన్నాడు. ఆ లోభిమైన దుర్యోధనుడు. దొరలల్లే సింగారించుకొని తినడానికి గాంధారి కడుపున పుట్టారు అని తన ఆవేదన పడిన కష్టాలు వల్లె వేశాడు. ఆ మాటలు విని అర్జునుడు దొరలమని పట్టు పాన్పులపై రాజసంతో ఎర్రవీగుతో వారు దొర్లే రోజులు పోయాయి. రోజులు మారాయి. కౌరవులు మమ్మల్ని కాదన్నట్లున్నారు. ఇక అర్జునుడు గాండీవాన్ని మేల్కొల్పాలి.

పచ్చని రాజ్యాన్ని పాడు చేయడానికి కారు చిచ్చులాగా దుర్యోధనుడు జన్మించాడు. కర్ణుని స్నేహం తోడయ్యింది. శకుని ఆ మంటలు కీలలు పైకి లేచేటట్లు చేశాడు. విశ్వశాంతికై అర్జునుడు ఇక బాణవర్షం కురిపించక తప్పదు. గాడిదల్లాగా ఆ సభలో కౌరవులు ఒక స్త్రీని కూసిన కూతలు చేసిన చేతలు నేటికీ నా చెవులలో రింగుమని మోగుతునే ఉన్నాయి. యుద్ధమే వారికి రాసిపెట్టింది. భీముడు గదాదండం తిప్పితేనే కదా యుద్ధానికి కాలుదువ్వటం. పుట్టుకతోనే కౌరవుల తలల్లో ద్వేషమనే మష్టుకీలలు కట్టింది. కూరులు మంచి మాటలను చెవిని పెట్టరు. ఇక మేము వారిని ఢీకొని చితకకొట్టక తప్పదు'. ముసలి రాజు అంధుడు, కొడుకు మధాంధుడు, రాజ బంధువులు జూదగాళ్ళు. వారిలో గర్వమనే పిచాచి గజ్జగట్టి నాట్యం చేస్తుంది. మీరు ప్రేమగా చేసే ప్రయత్నాలు కొనసాగుతాయా? వారి స్వార్థ చింతనకు యుద్ధమే శరణ్యం అన్నాడు. తల్లి సందేశం కృష్ణుని ద్వారా విన్నాడు. యుద్ధానికి సిద్ధమయ్యాడు.

కృష్ణుని సారధ్యంలో అర్జునుడు స్కందవారంలో ధృతరాష్ట్రుని కుమారుని తరుపున వచ్చిన రాజులను చూస్తానంటే శ్రీకృష్ణుడు ఆ సైన్యాన్నంతా చూపించాడు. తాతలు, తండ్రులు, అన్నదమ్ములు, బంధుమిత్రులను చూసి అర్జునుడు చలించాడు. కృష్ణా నేను యుద్ధం చేయలేను. వీరందర్నీ చంపలేను. మా పెద్దన్నయ్య మొదట నుండీ శాంతమే కోరుతున్నాడు. నాకుకూడా అది ఇష్టమే. విద్యనేర్పిన గురువుని, తాతని ఎదిరించలేను అని దుఖం ఆపులేకపోయాడు. మూర్ఛపోయాడు. గాండీవం వదిలేశాడు. భయకంపాలకు గురయ్యాడు. సొంతవారిని చంపలేను. ఆ భోగభాగ్యాలు ఆరాజ్యం నాకు వద్దు. వారు కొట్టినా, తిట్టినా మౌనంగా ఉంటాను. బంధువులందర్నీ చంపి నేనేమి సంపాదించగలను అని వైరాగ్యానికి గురై మూర్ఛపోయాడు. మొదట కృష్ణుడు కొంత ధైర్య పరిచినా వినలేదు. కృష్ణుడు రథం ఆపి రాజధర్మం వివరించాడు. యుద్ధం చేయడమే క్షత్రియ ధర్మం. రాజుకి ఓటమైనా, విజయమైనా వీరవంతమైనవేనని ప్రబోధించాడు.

కృష్ణుని బోధవిని అర్జునుడు కార్యసాధకుడు భగవంతుడే తాను నిమిత్త మాత్రుడేనని తెలుసున్న తరువాత దుష్టశిక్షణ భగవంతుని సంకల్పమేనని గ్రహించి యుద్ధానికి సిద్ధమయ్యాడు. కృష్ణుని ద్వారా తన ధర్మసందేహాలన్నీ తీరిన తరువాత యుద్ధం చేయడం క్షత్రియ ధర్మమని తెలుసుకుని యుద్ధం చేయడానికి విజృంభించాడు. "వందేమాతరం" అని సంతోషంతో నినాదాలు చేశాడు.

ఈ విధంగా అర్జునుడు ఎంతటి బలశాలియైనా, తన చేతిలో గాండీవం, దేవదత్తం, పాశుపతం ఉన్నా, శివుని సైతం నిలబెట్టిన బలవంతుడైనా దేశరక్షణ ముఖ్యం అని తెలుసుకుని యుద్ధానికి విజృంభించిన వీరుడు. బంధుప్రీతి కలవాడు, ధర్మాధర్మాలు ఆలోచించగల జ్ఞాని, వినమ్రుడు. తల్లి సందేశాన్ని గౌరవించిన వినయ మనస్కుడు. జాతి శృంఖలాలు తెంచుటకు తెగించిన తెరువరిగా విజయశ్రీ కావ్యంలో అర్జునుడు కనిపిస్తాడు.

**5. మాతృ సందేశాన్ని వివరించుము?**

**లేదా**

**జంధ్యాల వారు కుంతీపాత్ర ద్వారా దేశాన్ని, ప్రజలను జాగృతి చేసిన విధానాన్ని వివరించుము.**

**జ) కవిపరిచయం:**

విజయశ్రీ కావ్యాన్ని జంధ్యాల పాపయ్య శాస్త్రి గారు రాశారు. వీరు క్రీ.శ. 1912 ఆగస్టు 4 వ తేదీన గుంటూరు జిల్లా, పెద్దనందిపాడు మండలం కొమ్మూరు గ్రామంలో జన్మించారు. మహాలక్ష్మమ్మ, పరదేశయ్య వీరి తల్లిదండ్రులు. స్వగ్రామంలోనే ప్రాథమిక, మాధ్యమిక విద్యను అభ్యశించారు. శ్రీ భమిడిపాటి సుబ్రహ్మణ్య శర్మ, శ్రీ కుప్పా ఆంజనేయ శాస్త్రి గార్ల వద్ద సంస్కృత కావ్యాలు చదువుకున్నారు. రాష్ట్ర భాషా విశాద, ఉభయ భాషా ప్రవీణ, హిందీ భాషా ప్రవీణ పరీక్షలలో ఉత్తీర్ణులయ్యారు. అనసూయాదేవి గారిని వివాహమాడారు. వీరికి సంతానం ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె.

అమరావతిలోని శ్రీ రామకృష్ణా హైస్కూలు, గుంటూరులోని స్టాల్ గరల్స్ హైస్కూల్లో ఉపాధ్యాయునిగా పని చేశారు. గుంటూరులోని మహవీర్, హిందూ, ఏ.సి. కళాశాలలలో అధ్యాపకునిగా పనిచేశారు. టి.టి.డి. వారి "భాగవతం ప్రాజెక్టుకి ప్రధాన సంపాదకులు" గా పని చేశారు.

పుష్ప విలాపం, కుంతీకుమారి, ఉదయశ్రీ, విజయశ్రీ, కరుణశ్రీ, ఉమర్ ఖయామ్, బాలసాహిత్యం మొదలగు 76 గ్రంథాలు రాశారు. బాణుని కాదంబరీ కావ్యాన్ని "కళ్యాణ కాదంబరీ" అనే పేరుతో అనువాదం చేశారు. 1985 నుండి 1991 వరకు "తెలుగు అకాడమి" "రసమయి" "శుభాంగి" వంటి ఎన్నో పురస్కారాలు పొందారు. సువర్ణ ఘంటా కంకణం, కనకాభిషేకం వంటి సన్మానాలు ఎన్నో నాటి ముఖ్యమంత్రి శ్రీ ఎన్.టి. రామారావు గారు, జ్ఞాని జైల్‌సింగ్ గార్ల నుండి సత్కారాలు అందుకున్నారు. శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి, వారు వీరికి డి.లిట్. పట్టాను ఇచ్చి గౌరవించారు. 1951-53 వరకు "సుభాషిణి" అనే మాస పత్రికను నడిపారు.

**పాఠ్యభాగ సందర్భం:**

మహాభారతంలో పాండవులు పాచికలు ఓడిపోయి 13 సంవత్సరాలు అరణ్యవాసం, ఒక సంవత్సరం అజ్ఞాతం ముగించుకొన్న తరువాత శ్రీకృష్ణుడు కౌరవుల వద్దకు రాయబారానికి వెళ్ళారు. పాండవులకు ఐదుగురికి ఐదు ఊళ్ళు ఇచ్చినా వారు బ్రతుకుతారు అని అడిగాడు. పెద్దలంతా ఒప్పుకున్నా దుర్యోధనుడు తిరస్కరించాడు. సూదిమొనమోపేటంత స్థలం కూడా ఇవ్వను పొమ్మని కృష్ణుని నిర్బంధించ బోయారు. ఆ సారాంశాన్ని కృష్ణుడు పాండవులకు వివరించిన సందర్భాన్ని తీసుకొని శాస్త్రిగారు విజయశ్రీ కావ్యం రాశారు.

పాండవులు కృష్ణునితో కౌరవులు మాట్లాడిన మాటలు విని వారి వారి అభిప్రాయాలు తెలియజేశారు. తమ్ముళ్ళు,

ద్రౌపది మాటలు విన్న ధర్మజుడు యుద్ధం తప్పదన్న విషయం గమనించి మా తల్లి మీకు ఏమి సందేశం పంపిందో చెప్పండని అడిగాడు. దానికి కృష్ణుడు "మాతృ సందేశాన్ని" ఈ విధంగా వివరించాడు.

## మాతృ సందేశం:

ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన వీరమాత కుంతీ దేవి కన్నీళ్ళు నదులై ప్రవహిస్తున్నాయి. ఏడాది దూడను విడిచి క్రూర మృగాల మధ్య చిక్కుకున్న గంగ గోవువలే మీ తల్లి గుడ్డి రాజు రాజ్యంలో చిక్కుకుంది. నన్నున్ను చూచి దుఃఖాన్ని ఆపుకొని బిడ్డలు, కోడళ్ళ, మనుమ సంతాన క్షేమమడిగింది. పరాయి పంచనబడి పడుతున్న వేదనను చెప్పుకొని గుండెలు చెరువులయ్యేలా విలపించింది. మాకు ఈ విధంగా "మాతృ సందేశం" తెలుపమన్నది.

పవిత్రమైన వెన్నెలలు వెదజల్లే వంశంలో (చంద్ర వంశంలో) జన్మించారు. ఏక ఛత్రాధిపతియైన పాండురాజుకి పుత్రులుగా పుట్టారు. భరత వంశ రక్తం మీలో ప్రవహిస్తుంది. స్వతంత్రంగా మీ భవిషత్తును మీరే సుగమం చేసుకొని జీవితాన్ని మధురంగా మలచుకుంటారో లేక స్వేచ్ఛకి స్వస్తి చెప్పి పరాయి వారిని సేవిస్తారా? ప్రపంచ మహావిప్లవ పిచాచి రెక్కలు చాపి సముద్రాలపై గర్జిస్తుంది. ఇప్పుడు కాదులే అనుకున్న యుద్ధం రానే వచ్చింది శాంతి వినాశకులు మీ దొడ్డిదారి మెట్లెక్కారు. భారత భాగ్య దివిటీ ఎవరూ ఆపలేరు. అపారము, అనవద్యమ, అపూర్వమైన మీ వీర విజృంభణకు విశ్వమే ఆశ్చర్యపోతుంది. మీ పరాక్రమ సంపదకు సకల లోకాలు హారతులు పడతాయి. రాజ్యం పాలించిన మీ తండ్రి మరణించాడు. ఆయన పిల్లలైన మిమ్మల్ని మీ పెద్దనాన్న కపట ప్రేమతో మోసం చేసున్నాడు. మీ మంచి, ఔన్నత్యం, వాసనలే అతనికి గిట్టడం లేదు.

దేశ కళ్యాణానికి ఈ దైవ సందేశ దీక్ష చేపట్టండి.స్వాతంత్ర్యం కొరకు ఆయుధాలు పట్టండి. భారత భవితవ్యం కొరకు స్వాతంత్ర్య సమర రథం కదులుతుంది. పౌరుషం గల భరత భూమిలో పుట్టి బానిస బ్రతుకు ఎందుకు బ్రతుకుతారు? తికమకలు పెట్టే సంకెళ్ళు (మంచా, చెడా అనే ఆలోచనలు) తెంచుకొని యుద్ధానికి ఇకనైనా విజృంభించండి.

తన బిడ్డల బానిస బ్రతుకు చూసి తల్లడిల్లే తల్లి (భరతమాత) వేదనను ఎవరూ అర్ధం చేసుకోవడం లేదు. నా బిడ్డల అపారమైన భుజబలంపై ఆశపెట్టుకొని ఉన్నాను. దిక్కు లేక బాధపడుతున్న మీ తల్లిని చూడండి. మీ గుండెలలో మంటలు తెచ్చుకోండి. దాస్యం అనే దరిద్ర గాడాంధకారంలో యుగ అభ్యుదయానికి జ్యోతి వెలిగించండి

ఎంతో గొప్ప ఆశయ సాధనతో రాజమాత బిడ్డలను కంటుంది. ఆ మహా ఉద్దేశాన్ని సాధించాలని నిర్ణయించుకొని నడుములు బిగించుకొని ముందుకు నడవండి. రాజ తేజస్సును భరత భూమి అనే పొలమంతా జల్లబోతున్న వ్యవసాయ ధారులు మీరు. కృష్ణుడు అనే మేఘం (దైవబలం) మీపై దయచూపింది. విజయం పొందడం మీకు చాలా సులభమయ్యింది. ఇక విజయం తథ్యం అని మీ తల్లి చెప్పమంది అని కృష్ణుడు పాండవులకు తల్లి కుంతీమాత సందేశాన్ని వివరించాడు. పాండవులు తల్లి పిలుపు మేర విజృంభించారు. అదేవిధంగా "మాతృ సందేశం" జాతిని జాగృతం చేస్తుంది. శాస్త్రి గారు ఈ రచన చేసే సమయంలో దేశం స్వాతంత్ర్యం కొరకు పోరాడే రోజులు. ఇక్కడ కుంతీమాత భరత మాతకు సాదృశ్యం. విజయ శ్రీ లో కుంతీదేవి తన బిడ్డలను బానిస బ్రతుకు వద్దంటుంది. అది భరతమాత పిలుపు. భారతదేశం సస్య సౌభాగ్య దేశం. ఆంగ్లేయుల పాలనలో మగ్గిపోయి బ్రతుకు బ్రతుకుతుంది. భరతమాత స్వేచ్ఛ కొరకు తన బిడ్డల్ని పిలుస్తుంది.

ఎంతోమంది వీరులు పుట్టిన పుణ్యభూమిలో పుట్టి పరాయి వారి పాలనలో మగ్గిపోతున భారతదేశానికి దాస్యశృంఖలాలు పోగొట్టే బాధ్యత భారత పౌరులందరిదీ. మన దేశానికి వ్యాపారం నిమిత్తము వచ్చి మనకు పాలకులుగా మారిన నియంతలైన

బ్రిటీషు ఉక్కు పాదాలనుండి దేశాన్ని రక్షించుకోవలసిన బాధ్యత మనదే. ఎవరో వస్తారని ఏదో చేస్తారని ఎదురుచూడక దేశ స్వేచ్ఛ కోసం పాటుపడాలి. కర్మ సిద్ధాంతం మాని, దేశ రక్షణ కోసం ధర్మ పోరాటం చేయడం, దేశం కోసం యుద్ధ వీరులుగా విజృంభించడం మన బాధ్యత పౌరుషం గల దేశంలో పుట్టి చేవచచ్చిన వారిగా ఉండటం తగదు. దేశ రక్షణ కోసం యుద్ధం చేయడానికి కంకణం కట్టుకొని అందరూ "జై భారతమాత", "జై మాతృ భూమి", "వందేమాతరం" నినాదాలు చేసి శత్రు గుండెల్లో భయం కలిగించాలి. నినాదం సాధించడానికి భారత పౌరులుగా పోరాడాలి.

"పోరాడితే పోయేది ఏముంది. బానిస సంకెళ్ళు తప్ప", మనం ఎవరికీ బానిసలుగా బ్రతుకనవసరం లేదు. మన దేశం మన సంపద. పరాయివాడు అనుభవిస్తుంటే చూస్తూ ఊరుకోవడం కాదు వీరోచితంగా దేశం కోసం పోరాడాలి. దేశపోరాటం తప్పుకాదు. సందేహం వదలి శత్రు గుండెల్లో భయం కలిగించాలి. భరత మాత రక్షణ మనందరి బాధ్యత అని జాతిని జాగృతిని చేసే విధంగా జంధ్యాల వారు భారత కథని "విజయశ్రీ" కావ్యంలో వినూత్నంగా తీర్చిదిద్ది. "మాతృ సందేశం" ద్వారా దేశాభిమానాన్ని తెలిపారు. అర్జునుని వలే, పాండవుల వలే మనం కూడా దేశాభిమానంతో దేశ రక్షణ కొరకు పాటుపడాలి.

**- డా॥ డి. సుజాత**

## పాఠం - 7

# పెన్నేటిపాట

### - విద్వాన్ విశ్వం

**విషయ క్రమం:**

**7.1.** కవి పరిచయం

**7.2.** పాఠ్యభాగ సందర్భం

**7.3.** పాఠ్యభాగ సారాంశం

## 7.1. కవి పరిచయం:

రాయలసీమలో వెలసిన రత్నాలలో విద్వాన్ విశ్వం గారొకరు. కవిగా, రచయితగా, సంపాదకుడిగా, సంస్కృత, ఆంధ్ర, ఆంగ్ల భాషా కోవిదునిగా, అనువాదకునిగా, ఉద్యమ నేతగా ఎన్నో సేవలందించినవారు కళాప్రపూర్ణ విద్వాన్ విశ్వం.

అనంతపురం జిల్లాలోని తరిమెల గ్రామంలో 1915 అక్టోబరు 21 వ తేదీన జన్మించారు విద్వాన్ విశ్వం. అసలు పేరు మీసరగండ విశ్వరూపాచారి. వీరి తల్లిదండ్రులు లక్ష్మమ్మ, మునిరామాచార్యులు. విద్వాంసులకు విద్వాంసుడిగా పలువురి ప్రశంసలు పొందిన విద్వాన్ విశ్వం గారి తాత, తండ్రి కూడా గొప్ప పండితులు, రచయితలు. మదరాసు విశ్వవిద్యాలయం నుండి విద్వాన్ పట్టా పుచ్చుకుని విశ్వరూపాచారి విద్వాన్ విశ్వం అయ్యారు.

విద్వాన్ విశ్వం తన 15వ ఏటనే కవితలల్లడం ప్రారంభించారు. తన ఇరవయ్యవ యేట 'విరికన్నె' అనే తొలి ఖండకావ్యాన్ని రచించారు. రాయలసీమ కరువు కాటకాలను 'పెన్నేటిపాట' కావ్యం ద్వారా వినిపించారు. బ్రిటిషు వారి పాలనలో రాయలసీమలోని గుత్తి ప్రాంతంలో 1893వ సంవత్సరంలో జరిగిన కథకు కావ్యరూపమిస్తూ 'ఒక నాడు' అనే ఖండకావ్యం రచించారు. నాగులమ్మ అనే పల్లె పడుచును తెల్ల సైనికులు మానభంగం చేయబోతున్న సమయంలో హంపన్న అనే వీరుడు ప్రాణాలకు తెగించి ఆ సైనికుల్ని ఎదిరించి ప్రాణాలను కోల్పోయిన సంఘటనను ఈ కావ్యంలో అద్భుతంగా వర్ణించారు విద్వాన్ విశ్వం. 'ఆంధ్ర కథా సరిత్సాగరం' లోతులను చూపారు. 'మేఘ సందేశా'లను అందించారు. రాతలూ, గీతలూ, నా హృదయం, స్టాలిన్, నీడలు- జాడలు మొదలగు ఎన్నో రచనలు చేశారు. సహజ సిద్ధంగా, హృదయాలకు హత్తుకునే విధంగా, మధురంగా కవిత్వాన్ని సృజించడంలో సిద్ధ హస్తులు విద్వాన్ విశ్వం. సమాజాభ్యుదయం, మానవీయ విలువలు వీరి రచనలో మెండుగా కన్పిస్తాయి.

పత్రికా రంగానికి వీరు చేసిన సేవ అమూల్యమైనది. విశిష్ట పాత్రికేయులుగా సుప్రసిద్ధులైన విద్వాన్ విశ్వం 'మీజాన్', ప్రజాశక్తి, ఆంధ్ర పత్రిక, ఆంధ్రజ్యోతి పత్రికలలో పనిచేశారు. వీరు ఎక్కువకాలం సంపాదకునిగా పనిచేసిన పత్రిక 'ఆంధ్రప్రభ'. 'ఆంధ్రప్రభ' సచిత్ర వార పత్రికలో పదవి విరమణ చేసిన తర్వాత 1981వ సంవత్సరం నుండి తిరుమల తిరుపతి ప్రచురణల విభాగానికి ప్రధాన సంపాదకుడిగా వ్యవహరించారు. వామపక్ష రాజకీయ వాదుల సాహచర్యంతో కమ్యూనిస్టుగా తన రాజకీయ జీవితం ఆరంభించిన స్వాతంత్ర్య సమరయోధులు విద్వాన్ విశ్వం.

వీరి జీవితంలో ఉద్యమం, సాహిత్యం, జర్నలిజం ముప్పేటగా కలిసిపోయాయి. వామపక్ష ఆలోచనలను, భారతీయ లోచనాన్ని కలిపి చూసిన సమన్వయవాది, ఛాందస మెరుగని సంప్రదాయవాది. మనసున్న మానవతావాది విద్వాన్ విశ్వం.

రాయలసీమ కన్నీటి పాటను పెన్నేటి పాటగా ఆయన మలచిన తీరు అపూర్వం తన మాణిక్య వీణ శీర్షిక ద్వారా (ఆంధ్రప్రభ సచిత్రవార పత్రిక) అనంతమైన జనజీవన రాగాలను పలికించిన ఆయన 1987 అక్టోబరు 19వ తేదిన ఈ లోకాన్ని విడిచిపెట్టారు.

## 7.2. పాఠ్యభాగ సందర్భం:

**ఉపోద్ఘాతం:** "రాయలసీమలోని పెన్నేటి గట్టున ఉన్న పల్లెల బ్రతుకు నీడ ఇందులో కానవస్తుంది. అక్కడి పలుకుబడులూ, ఊరు, పేరులు ఇందులో కనిపిస్తాయి. ఇది కావ్యం. చరిత్రగానీ, కథ గానీ కాదు. కాబట్టే ఏ ఒక్క పల్లెనో, ఏ వ్యక్తి జీవితాన్నో ఉద్దేశించి వ్రాసినది కాదు" అని పెన్నేటి పాటకు ముందుమాట రాస్తూ విద్వాన్ విశ్వం అన్న మాటలను బట్టి ఈ కావ్యంలోని అంశాలన్నీ మనకు అవగతమవుతాయి.

పెన్నేటిపాట ఒక కన్నీటిపాట రాయలసీమ పరిస్థితులను తెలుసుకోవడానికి ఉపయోగపడే కావ్యమిది. రాయలసీమ ప్రజల తెలుగు పలుకుబడులు, మాండలికం, అక్కడి ప్రజల జీవన విధానం, పేద ధనిక తారతమ్యాలు మొదలగు అంశాలను తెలియచేసే కావ్యమిది. పెన్నేటి పాట ఐదు భాగాలుగా విభజింపబడిన కథా కావ్యం. ఐదు సర్గలుగా విభజించి రాయబడిన ఈ కావ్యంలో పెన్నా నది ఎండిపోవడం దాన్నంటిపెట్టుకు వచ్చిన కరువు కాటకాలు, పేదరికం, మనిషి ఆశపోతుతనానికి నాశనమవుతున్న పర్యావరణం, అస్తవ్యస్తమవుతున్న సాంఘిక జీవనం అంతరించిపోతున్న మానవీయ విలువలు మొదలగు అంశాలు, నిర్మలమైన ప్రేమతో పెనవేసుకున్న ఒక నిరుపేద జంట జీవిత నేపథ్యాన్ని, ఆధారం చేసుకుని చిత్రింపబడ్డాయి. కవి చెప్పినట్లుగా ఈ పాట 'మొదలుండునే కాని తుది లేని బాట'.

ఈ కావ్యానికి శ్రీరాళ్ళపల్లి అనంత కృష్ణశర్మ గారు పీఠికను రచించారు. విద్వాన్ విశ్వంగారు ఈ కావ్యాన్ని నార్ల వారికి అంకిత మిచ్చారు.

ఒకనాడు రాయలసీమ సర్వసంపదలతో విలసిల్లింది. సకల కళలతో వర్ధిల్లింది. వీధులలో రత్నాలు రాసులు పోసి అమ్మేవాళ్ళని చరిత్ర చెప్తుంది. ఆ విధంగా భోగ భాగ్యాలతో తులతూగిన రాయలసీను అనావృష్టి పరిస్థితుల వల్ల దయనీయంగా మారిపోయింది. పచ్చగా ఉండాల్సిన పొలాలన్నీ రాళ్ళు రప్పలతో నిండిపోయాయి. కళలు కళ తప్పాయి. కరువు రక్కసి కరాళ నృత్యం చేసింది. ప్రజల జీవితాలు దుర్భరం అయ్యాయి. ఈ పరిస్థితులను పరికించిన విద్వాన్ విశ్వంగారి హృదయం ద్రవీభవించింది. రాయలసీమల ప్రజల నిజాయితీని నిండు మనస్సుని, గొప్పతనాన్ని వర్ణిస్తూ, ఆ ప్రాంతపు వైభవాన్ని, వాతావరణాన్ని, భాషని కీర్తించారు. రాయలసీమ పూర్వవైభవాన్ని కీర్తించడంతో ఆగిపోలేదు కవి. ఎందుకంటే అది గతం. కాని నేటి పరిస్థితి గతంలా లేదు. దుస్థితిలో ఉంది. కనుకనే కళ్ళముందు కనిపించే నిజాలన్నింటికి కావ్యరూపమిచ్చారు కవి.

## 7.3. పాఠ్యభాగ సారాంశం:

వరిపైరును కాపలా కాసే వారి పాటల ప్రస్తావనతో ఈ కావ్యం ప్రారంభమవుతుంది. ఒకనాడు రాయలసీమలో పంటపొలాలను కాపలా కాసేవారు పాడే యాలపాటలు మధురంగా వినిపించేవి. అల్లసాని పెద్దన లాంటి మహాకవుల మధుర వాక్కులు గుబాళించేవి. రంగురంగుల జరీవస్త్రాలు కన్నుల మిరుమిట్లు గొలిపేవి. అద్భుతమైన మేధస్సు ప్రకాశిస్తూ ఉండేది. ధైర్యానికి నిలయంగా ఉండే వీరులుండేవారు. కటిక రాళ్ళను కూడా కవ్వించి గజ్జకట్టి చిందుత్రొక్కించే మాయల జిలుగు రథం ఉండేది. రాయలసీమ బజారులో 'పచ్చలు' అమ్ముతుండేవారు. అచట ముత్యాల పంటలు, కావ్యాల ప్రవాహం,

భాష్యాల జల్లులు సమృద్ధిగా దర్శనమిచ్చేవి. వేయంచుల కత్తి విహారం చేస్తూ ఉండేది. అయితే ఇప్పుడు గతించిన కథలా మిగిలిపోయింది. ఈనాటి రాయలసీమ కన్నీటి పాటను కోటిగొంతుల కిన్నెర మీటుకుంటూ, కోటి గుండెల కంజరి కొట్టుకుంటూ వినిపిస్తాను. అదిగో పెన్న నిదానంగా నడువు అంతా ఎడారి మయం. భాదను కలిగించే వాతావరణం ఏది! పెన్న? ఎక్కడ పినాకినీ! ఇదే పెన్న! ఇదే పినాకిని ఒకప్పటి ఆ నీరు, ఆ హోరు ఇప్పుడు లేవు. ఇదే ఇసుక వాలు అదే పెన్న నిదానంగా నడువు. కడుపు తరుక్కుపోతుంది. పారతో చీల్చినా ఇక్కడ నీటి చుక్క కూడా కనిపించదు. కుండపోతగా వర్షాలు కురిసినా పట్టుమని పది రోజులు కూడా నిలవకుండా నీరు ఇసుక పాతర్లలోకి వెళ్ళిపోతుంది. ఒకప్పుడు చిటపటమని కురిసిన చినుకులకే నురుగులు కక్కుకుంటూ గట్టుల పైగా, నింగికెగసినట్లుగా ప్రవహించేది. తన గర్భంలో ఎగురుతున్న చేపలా ఎగురుతూ తన సమీపంలో చేరిన జీవరాశుల్ని మింగుతుంది. ఇది పట్టని మొండిపట్టు, చేయని ఆకస్మికమైన పనులు లేవు. కాని ఈ ఏటి నీరు కమ్మగా ఉంటుంది. ఒకసారి పుక్కిలిస్తే జన్మసార్థకమౌతుంది. గుండెను జలదరింపచేస్తూ రండతనాన్ని తొలగిస్తుంది. ఖండిత వాదిని చేస్తుంది. ఇది గొప్ప మనసున్న తల్లి కండ లేక ఎండిపోయినా నిండు మనసుని, నిజాయితీని ధర్మ దీక్షను పండిస్తుంది. రండి! ఈ తల్లికి నమస్కరించి సేవించి వెళ్ళండి. ఇంతమంచి పెన్నతల్లి ఎందుకు ఎండిపోయింది. ఇలా ఎందుకు మారింది తన సంతానం కోసం ఆమె ఎక్కువగా దుఃఖించడం వల్ల ఆమె గొంతు ఎండిపోయింది.

ఈ ఏటి కాల్వ లోతులుగా పారుతుంది. దీనిలోని ప్రతి నీటిబొట్టు రైతుల నెత్తుటి ఛాయల్ని స్ఫురింపచేస్తూ విచారాన్ని కలిగిస్తుంది. ఈ ఏటి ప్రక్కల నక్కబావలే తిరుగుతుంటాయి. అనేకమైన శవాలకు ఇక్కడే అంత్యక్రియలు జరుగుతుంటాయి. సుర, గరుడ, నాగ, విద్యాధరాది దేవతా స్త్రీల పాదపద్మాల ముద్రలిక్కడ లేవు. కేవలం ముసలి నక్కలే తిరుగుతుంటాయి. నాగకన్యలిక్కడ లేరుకాని నాగుపాములున్నాయి. గరుడ గంధర్వ స్త్రీలు కనిపించరు కాని బొంత గద్దలు గుంపు ఉంది. సువాసనా భరితమైన తీగెలు లేవుకాని తిప్పతీగలు ఉన్నాయి. పూల పొదరిళ్ళు లేవు కాని తిప్పతీగలు ఉన్నాయి. పూల పొదరిళ్ళు లేవు కాని ముళ్ళ పొదలున్నాయి. తుమ్మ తోపులు, చిట్టీత డొంకలు మెండుగా ఉన్నాయి. గులాబీలు లేవు కాని తంగేళ్ళు గడ్డి గాదం దర్శనమిస్తాయి. పల్లేరు కాయల బీళ్ళు కనిపిస్తాయి కాని పచ్చని పంట పొలాలు కనిపించవు. చిలుకలు, కోకిలలు, గోరువంకల గొంతులు వినిపించవు. గుడ్లగూబల రొదలు గుండెల్ని చీల్చి వేస్తాయి. దిగులు పుట్టిస్తాయి. తోడేళ్ళు, నక్కలు మనస్సు చెదిరే విధంగా కూతలు పెడతాయి. పెన్నకు రెండువైపులా స్మశానమే ఉండి పుఱ్ఱెల పంటలు పండుతాయి.

బల్లులు, తొండలు, ఎలుకలు, పిల్లులు, కుక్కలు, చెవుల పిల్లులు ఎక్కువగా ఉంటాయి. తేళ్ళు, జెర్రులు ఎక్కువగా ఉండి ఆ ప్రాంతం పాములకు నిలయమై ఉంటుంది. బాధను కలిగించే రకరకాల రాళ్ళు అక్కడ కనిపిస్తాయి. అనేక బాధలకు ఆలవాలమైన చింత చెట్లు, తుమ్మ చెట్లు, ఈత చెట్లు, బోద గడ్డి, ఇసుక దిబ్బలకు ఆలవాలం ఆ ప్రాంతం. ఇక్కడి ఈ డొంకలో ఎన్ని దోపిడీలు జరిగాయో, ఎంతమంది కాళ్ళు, చేతులు విరిగిపోయాయో, ఈ డొంకలో మంచినీళ్ళెత్తుకుని వచ్చే కొత్త కోడళ్ళు ఎంతగా బాధలు పడ్డారో, ఇక్కడ ఎండలో విశ్రాంతి కోసం పశువులు ఎంతగా తపించిపోయాయో.

ఇది ఆవుల మందలకు, గొర్రెలకు విడిది. మేకల్ని కూడా ఇక్కడికే తోలుకుని వస్తారు. ఇక్కడ నీటి ఎద్దడి ఉన్నా ఇక్కడికే వస్తారు. ఇది పులులకు నిలయం. వర్షం వచ్చినపుడు వాగులు, వంకలిక్కడ పారతాయి. ఆ ప్రక్కనే మంచినీటి చెలమ ఉంది. అదిగో పారల్ని తీసుకొని రైతులు ఈ కాలవను బాగు చేయడానికి వస్తున్నారు కుప్పల్ని నూర్చే వరకు ప్రతి రైతు, ప్రతి రోజూ ఆ పని చేయాలి. రైతులు ఒక్కరోజు పనిమానినా పొలాలు బీడులౌతాయి. ప్రభుత్వం ఏమి చేయకపోయినా పన్నులు మాత్రం వేస్తుంది. కాలవను బాగుచేయడానికి వస్తున్న ఆ గుంపులో రంగన్న యాలపాట పాడుకుంటూ వస్తున్నాడు.

ఇదే అతనికి యాగం, యోగం, భాగంగా రోజులు గడిచేకొద్దీ రోగం కూడా అవుతుంది. అంటూ మొదటి సర్గలో పెన్న నది ఎండిపోవుటను గూర్చి, నది ఎండిపోవడం వల్ల సామాన్య ప్రజల జీవితాల్లో నెలకొన్న దుర్భర పరిస్థితుల్ని వర్ణించారు విద్వాన్ విశ్వం.

రెండవ సర్గలో రంగడి కుటుంబ పరిస్థితులు వర్ణించబడ్డాయి. రంగడి తండ్రి నారపరెడ్డి ఊరిలో పెద్ద మోతుబరి. సన్నకారు రైతులనెందరినో ఆదుకున్నాడు. పేదసాదలను పోషించాడు. ఆయనను పొగిడే కవిగాయకులకు, ఊరి దేవాలయానికి చేతికి ఎముక లేనట్లు దానాలు చేశాడు. దానాలు చేయగా చేయగా ధనం తరిగిపోయింది. కీర్తి సంపద మాత్రం పెరిగిపోయింది.

సర్కారు సిబ్బందికి కొంత, ఊరి పెద్ద వకీలు పిళ్ళెకు కొంత, ప్రక్క ఊరి ప్రభువులకు కొంత, కాంపౌండరు మునుస్వామికి కొంత, కొడెరెడ్లకు, గుర్రాలకు, బగ్గీలకు కొంత తాను చేసుకున్న నాలుగు వివాహాలకు ఈ విధంగా ఖర్చులు కొండంత అయ్యాయి.

ఎదిగిన కూతుళ్ళిద్దరి పెళ్ళి వేడుకలు ఎనిమిది రోజులపాటు చేశాడు. ఈ ఎనిమిది రోజుల పెళ్ళిళ్ళకు వేలు వేలు ఖర్చయ్యాయి. ఆ ఎనిమిది రోజులు కాకులు కూడా నేతి వంటకాలు రుచి చూశాయి. అదిగదీ పెద్దింటి వారి పెళ్ళంటే అని పొగిడారు జనాలు.

ముగ్గురు భార్యలు మరణించిన తర్వాత నాలుగో భార్య అయిన రామమ్మ కొడుకు ఈ రంగడు. నారపరెడ్డి తాను చేసిన అప్పుల వల్ల, ఇతరులు చేసిన మోసాల వల్ల వానలు లేక పొలాలు పండకపోవడం లాంటి కారణాల వల్ల నెమ్మదిగా ఆస్తి మొత్తం కోల్పోయి దివాలా తీశాడు. అయితే బాకీదారులందరికీ ఒక్క పైసా కూడా ఎగ్గొట్టకుండా మిగిలిన మిద్దెలు, మేడలు చివరికి నల్లపూసలతో సహా అమ్మి వడ్డీతో సహా మొత్తం బాకీలు తీర్చాడు నారపరెడ్డి. తెల్లవారే సరికి నారపరెడ్డి దివాలా తీశాడనే వార్త ఊరంతా తెలిసిపోయింది. ఈ వార్త వినగానే నారపరెడ్డి భార్య రామమ్మ 'రామ' అంటూ తన చీర చెంగు ముట్టించుకొని తనను తానే దహించుకుని మరణించింది. నారపరెడ్డి నారప్ప అయ్యాడు. ఊరి మోతుబరి ఉప్పరి అయ్యాడు. చిన్ని రండడే అతనికి తోడయ్యాడు. పూరికొట్టంలా చేరి కుళ్ళి కుళ్ళి యేడుస్తూ కుక్కి మంచం నుండి లేవలేక, పనిచేయు చేవ లేక రంగడిని అనాధను చేసి నారపరెడ్డి కూడా చనిపోయాడు. అనాధగా మిగిలిన రంగడిని బంధుమిత్రులెవరూ చేరదీయలేదు. పసివాడే అయినా కసువులూడ్చి, పశువుల్ని కాసి, చేతనైన పని చేసుకుంటూ కూలీ వాడయ్యాడు రంగడు. అంత చిన్నతనంలోనే కొర్రలు దంచాడు, గంపలకొద్దీ రాగుల్ని విసిరాడు. బిందెల కొద్ది నీళ్ళు మోశాడు. ఇంత అరవ చాకిరీ చేయించుకుని కూడా కటిక కారం, సంగటి లేదా ఎండు రొట్టెలు పెడితే వాటిని తినలేక, తిన్నా అరాయించుకోలేక అల్లాడిపోతూ పెరిగాడు రంగడు. ఒక్కోసారి ఆ మాత్రం ఆహారం కుడా దొరక్క బావి నీళ్ళు తాగి ముడుచుకుపడుకున్న రోజులెన్నో అతని జీవితంలో.

అయితే అలాంటి పరిస్థితుల్లోనూ రంగడికి తన బాధలన్నీ మరిపించేది అతని పాట. రంగడిది కోయిల కంఠం. చదువు లేదు కాని పుట్టుకవి, గాయకుడు, నటరాట్టు అతడు. ఆ రంగన్నే కాలువ త్రవ్వకానికి పోతూ యాలపాటలు పాడుతున్నాడు. వాని తీయని గొంతులో తీగలు సాగుతుంది ఉద్వేగరవం. తన పాటతో ప్రకృతిని సైతం నిద్రలేపుతున్నాడు. అతడు పాడుతుంటే పిన్నాపెద్దా అందరూ బొమ్మల్లా నిలిచిపోతారు. ప్రతిరోజు రమారమి మైలున్నర వరకు కాలువ త్రవ్వకం జరుగుతుంది. విరామమెరుగక ఆ పని నిర్వహించే ఆశ్రమ జీవులకు రంగన్న పాడే యాలపాటలే ఆనందాన్నిచ్చేవి.

మూడవ సర్గలో రంగన్న, అతడి భార్య గంగమ్మ వారి అన్యోన్య అనురాగం వారి కుటుంబపు దారిద్ర్య వర్ణన కనిపిస్తుంది.

ఎన్నో కష్టాలు, బాధలు, అనుభవిస్తూ పెరిగి పెద్దవాడయిన రంగడికి రత్నంలాగా లభించింది అతడి భార్య గంగమ్మ. పారపని పూర్తిచేసి రాగానే చేతులు కడుక్కోవడానికి నీళ్ళందిస్తుంది. కుండలో ఉన్న సంగటినంతటిని గోకి తీసి మూకుళ్ళో పెట్టి నిండా మజ్జిగ పోసి పచ్చిమిరపకాయ ఒకటి తెచ్చి ఇస్తుంది. ఇదే అతని ఉదయకాల భోజనం.

గంగమ్మ పదహారేళ్ళ అమ్మాయి. చక్కటి అందం, అందాన్ని మించిన సౌశీల్యం ఆమె సొంతం. ఆమెకి అమ్మానాన్న లేరు. గంగమ్మను అక్కాబావలే తల్లిదండ్రులై కన్న కుతురిలా చూసుకున్నారు. పెంచి పెద్ద చేసి చదువు చెప్పించిన బావ యెద్దు పొడిచి చనిపోతాడు. అక్క దేవమ్మ గడ్డిమోపులమ్మి పోషించింది గంగమ్మను తాను తిన్నా తినకపోయినా చెల్లెలికి మాత్రం ఏ విషయంలోనూ కొదువలేకుండా చూసుకుంది దేవమ్మ. పేదరాలు కనుక వెదికి వెదికి చివరికి కష్టజీవి, మంచి మనసున్న వాడు అయిన రంగడికిచ్చి గంగమ్మ పెళ్ళి చేసింది దేవమ్మ.

రంగడు గంగమ్మలది అన్యోన్య దాంపత్యం. రంగన్న బ్రతుకెల్ల గంగమ్మ బ్రతుకే. గంగమ్మ మనసెల్ల రంగన్నమనసె. వారి మధ్య ఉన్న ఆ ప్రేమే వారిని బ్రతికించే ఆదరువు.

రంగడిని గంగన్నా అని, గంగమ్మని రంగమ్మ అని రకరకాలుగా పిలిచేవారు ఆ ఊరి ప్రజలు. అలా పిలవడం కంగారు వల్ల కాదు. వారి అనురాగ దాంపత్యాన్ని చూసిన ప్రజలకి వారు వేరు వేరు కాదు అని అనిపించడం వల్ల తమకు తెలియకుండానే ఆవిధంగా పిలిచేవారు. వారిరువురు నిరంతర శ్రమజీవులు. వారున్న ఊరికి చేరువుగా ఉన్న కొండకవతల పెద్ద అడవికి మేతమోపుకై కొడవలి, పగ్గం తీసుకొని వెళ్తాడు రంగన్న. అతనే కాదు చాలామంది అక్కడికి ఆ పూట బతకడానికి ఏమైనా దొరుకుతాయనే ఆశతో వెళుతుంటారు. అయితే వేయేండ్లకొకసారి వాన పడుతుంటే అక్కడ మాత్రం గడ్డి ఎలా మొలుస్తుంది. పచ్చదనం అనేది ఎంత వెదికినా కనపడని ప్రాంతం కదా అది. నాలుగు చినుకులు పడితే ఆ అడవి గ్రామాన్నంతా సాకగలదు. వారికి కావలసినవన్నీ ఆ అడవిలోనే దొరుకుతాయి. కలివి పండ్లు, బలసకాయలు, రేణగాయలు, సీమచింతలు, ఆకలి తీర్చే రకరకాల ఆకులు, తేనెతుట్టెలు ఎన్నో దొరుకుతాయి. అయితే ఇవన్నీ పెద్దవాళ్ళ కళ్ళపడనంత వరకే బడుగు జీవుల కవి దక్కుతాయి. పెద్దవాళ్ళ కళ్ళ పడితే వారి నోట పడ్డట్లే. ఇక్కడ ఇంకే న్యాయము చెల్లదు. ఇక్కడ ఏడాదంతా కూలి పనులు దొరకవు. కూలి పనులు లేనప్పుడు అడవికెళ్ళి గడ్డి మోపో, కట్టెలమోపో తెచ్చి అమ్ముకుని కలో, గంజో తాగి ప్రాణం నిలుపుకోవలసిందే. కనుకనే రంగడు ఎర్రటెండలో అడవికి వెళ్ళి ఏడుమూరల గడ్డిమోపు మెడలు విరిగేలా మోసుకొస్తాడు. సరైన తిండి లేక మూడు మట్ల లోతుకుపోతాయి అతని కన్నులు. వీపు పొట్టనంటుకుంది. అతనినాస్థితిలో చూసిన గంగమ్మకు కన్నీళ్ళాగవు రంగడు చూస్తాడని గబగబా చెంగుతో కన్నీళ్ళొత్తుకుని ఇంట్లోకి వెళ్తుంది. భర్త అంత కష్టపడుతుంటే గంగమ్మేమి చూస్తూ కూర్చోదు. భర్త కొండకు వెళ్ళిన మరుక్షణమే గదిని వారింటికి వడ్లుదండడానికి వెళ్తుంది. తనవంతుకి వచ్చిన వడ్లు తెచ్చి దంచి, అన్నం వండి చింతకాయ పచ్చడి చేసి తయారుగా ఉంచుతుంది పొంతనీళ్ళు తోడి ప్రేమగా తన చేతులతో నిమిరి నిమిరి రంగన్న శరీరాన్ని కడుగుతుంది. ఆ నిర్మల ప్రేమ స్పర్శతో వాని గాయాలు ఉపశమిస్తాయి. వళ్ళు హూనమైనందున వచ్చిన వంటి నొప్పులు కొంత వదిలినట్లనిపించి నెమ్మది కలుగుతుంది రంగడికి. అంత బాధలో కూడా ఇన్ని కష్టాలు నీకోసమే పడుతున్నానని అతనెప్పుడు అనడు. నీ సుఖం కోసమే బ్రతుకుచున్నానని ఆమె అనదు. మనసు నిండా ప్రేమ ఉండగా వారికింక మాటలతో పనియేమి. అతని అడుగుల చప్పుడు చాలు ఆమె ముఖం వికసిస్తుంది. అతని మాట వినబడితే చాలు ఆమె కన్నులలో వసంతాలు విరబూస్తాయి.

ఒకరికొకరుగా బ్రతుకుతున్న నిరుపేద భార్యభర్తల మధ్య ప్రేమ, ఒళ్ళు హూనమయ్యేటట్లు శ్రమ పడినా కడుపునిండా తిండి దొరకని పేదరికం – ఈ రెండు అంశాలు ఈ సర్గలో కవి కళ్ళకు కట్టినట్లుగా ఆవిష్కరించారు. శ్రమకు ఫలితం శూన్యమైన భౌతిక పరిస్థితుల వర్ణన పాఠకుల హృదయాలను కదిలిస్తుంది.

నాల్గవ సర్గలో రంగడు నివసించే గ్రామంలోని ధనిక పేదల జీవితాల మధ్య ఉన్న తారతమ్యాలు ప్రధానాంశం. పెద్ద రైతులు పేదల శ్రమను దోచుకునే వైనాన్ని కళ్ళకు కట్టినట్లు వర్ణించారు కవి.

రంగడు గంగమ్మ పెట్టిన అన్నం త్వరత్వరగా నాలుగు ముద్దలు మింగి రెడ్డిగారింటికి నీళ్ళు తేవడానికి కడవ భుజాన పెట్టుకుని ఊరబావికి వెళతాడు. కడవ బరువుకి అతనికి గుండెపోటు వచ్చినంత పనవుతుంది. అంత పెద్ద కడవలవి. ఎన్ని కడవలు పోసినా ఆ గాబులో నీళ్ళు పైకైనా రావు. అన్ని నీళ్ళు ఏమి చేసుకుంటారనేది అతనికి అర్థమయ్యేది కాదు. తీరా ఇంత పనిచేసినా ఫలితం వారిచ్చేది పూటకొక ముంత మజ్జిగ మాత్రమే. ఆ పేదవారి పాలిట కదే అమృతం. కూరనారల పేర్లు కూడా వారికి తెలియవు. మిరపకాయ, ఉల్లిగడ్డ, మజ్జిగ ఇవే వారి ఆహారాలు. ఊరి మోతుబరులకు గుండెలు పగులునట్లుగా వడ్లు దంచి ఇస్తే వారిచ్చే కాసిని వడ్లే గంజి కాచుకొనుటకు ఆధారం. ఆ ఊరిలో ఒకే ఒక సంపన్న భవనాన్ని వర్ణిస్తూ ఆ యింట ఆ యింట మంచాలు, మనిషెత్తు పరుపులు, దోమ తెరలు, లాంతరులు మొదలగు వాటితో కో అంటే కోటి సామాను, ఆ ఇల్లు దాటితే ఎటు చూసినా పూరి గుడిసెలు, రాళ్ళ గుట్టలే. ఆ ఇంట ఏ మూల చేయి పెట్టినా వరహాలు రాలతాయి. ఆ ఊరి సిరిసంపదలన్నీ ఆ ఇంటి పెట్టెల్లోనే ఉండే ఊరి ప్రజలకేమో కడగండ్లే మిగిలాయి. ఆ ఇంట త్రేన్పులే కాని నిట్టూర్పులుండవు. లక్ష్మీ సరస్వతులకది నిలయం. కాని ఆ ఇంట లేనిదొక మానవ హృదయమే అంటారు కవి.

ఆ ఇంటి యజమాని విద్యావంతుడు ఎప్పుడూ భాగవతాన్ని చదువుతుంటాడు. ఆ ఇంటి పిల్లలందరూ విద్యావంతులే. సామ్యవాద భావాలను వల్లె వేస్తుంటారు. కాని ఆచరణలో మాత్రం శూన్యం. అన్నివిధాలా వైభవోపేతమైన ఆ సంపన్న గృహంలో ఆత్మయే శూన్యం అంటారు కవి. ఆ ఇల్లు ఎడారిలోని ఒయాసిస్సే కావచ్చు కాని పేదసాదలకది వట్టి ఎండమావి. ఎంతో ధనం, చదువు, బలగం ఉన్నా ఆ ఇంట్లో ఎవరికి హాయి అనేది సున్నా అంటారు కవి. ఆ ఇంట్లో ఒక్కొక్కరు ఒక్కో లోకం, ఒక్కో తీరు. ఆ ఇంట ప్రొద్దుపోకకే చదువు, మెతుకు, బ్రతుకు. ఊరంతటిని మింగి ఉబ్బినట్టుగా ఉంది ఆ ఇల్లు అని వర్ణిస్తారు కవి.

ఆ ఇంట పని ముగించి వారిచ్చిన కొద్దిగా పుల్లగూర, కొంచెం మజ్జిగ తీసుకుని ఇంటి దారిపట్టాడు రంగడు. అప్పటికే బాగా చీకటి పడింది. దారులన్నీ నిర్మానుష్యంగా ఉన్నాయి. ఎటుచూసినా గుంతలు, పదునైన రాళ్ళు, అచట అడుగు తీసి అడుగు వేయడం చాలా కష్టమైన పని. అలవాటయిన వాళ్ళే ఎంతో జాగ్రత్తగా మెల్లగా నడవవలసి ఉంటుంది. గ్రామ ప్రజలప్పటికీ గూట్లో దీపం పెట్టి ఆ వెంటనే భోజనాలు కూడా పూర్తి చేసేస్తారు. ఎందుకంటే భోజనాలు చేసేవరకే ఆ దీపం. తినడానికే సరిగ్గా జరుగుబాటు కాని ఆ కుటుంబాలకు దీపానికి అవసరమైన చమురెక్కడిది. ఆ తర్వాత చుక్కల వెలుతురే వారికి వెలుగు. ఆ చుక్కల వెలుతురులోనే చూడడం అలవర్చుకున్నారా గ్రామ ప్రజలు. ఊరి మొత్తానికి కరణం గారింట్లోనూ రెడ్డి గారింట్లోనూ మాత్రమే వెలుగు. ఊరి మొత్తంలో ఈ రెండే ఇళ్ళు ఉన్నాయనిపించేలా ఆ రెండు ఇళ్ళల్లోనే వెలుతురు ఉంటుంది. మిగతా ఊరంతా అంధకారంలోనే ఉంటుంది. ఆ చీకటిలో వెళ్తున్న రంగడికి నరసన్న అనే వ్యక్తికి పాము కరిచిందనే విషయం తెలుస్తుంది. అక్కడ చేరిన వారంతా తలో మాట మాట్లాడుతూ వట్టి కబుర్లు చెప్తున్నారే కాని నేను పోయి

ప్రక్క ఊరిలో ఉన్న మంత్రగాడిని పిలుచుకొస్తానని మాత్రం అనడం లేదు. నరసన్న భార్య శోకాలు పెట్టి ఏడుస్తుంది. ఆమె కష్టానికి కరిగిపోయిన రంగడు నేను పోయి మంత్రగాడిని పిలుచుకు వస్తానని మజ్జిగ ముంత అక్కడ పెట్టి ఆ చీకటిలో పడి బయలు దేరాడు రంగడు.

ఎంత గుండెలు తీసిన బంటులైనా ఆ రాత్రి సమయంలో కొండ దారిలో కనుమ దాటి వెళ్ళడానికి సాహసించరు. పురుగు పుట్టకు ఆలవాలమైన ఆ దారిలో కన్ను పొడుచుకున్నా కానరాని ఆ చీకటిలో మంత్రగాడి కోసం పరుగుల మీద వెళ్ళాడు రంగడు. ఎదుటి వాళ్ళు కష్టంలో ఉన్నారన్న ఆలోచనే తప్ప అతనికా క్షణాన గంగమ్మ సైతం గుర్తుకు రాలేదు. భయం కూడా వేయలేదు. ఊరు తగలబడిపోతున్న తనకేమి పట్టనట్టుగా ఉండే సంపన్న భవనం లోనుంచి మాత్రం భాగవతం వినబడుతూ ఉంది.

గ్రామీణ పేదరికం, ధనవంతులు పేదలతో బండెడు చాకిరీ చేయించుకుని ఏదో తృణమో పణమో విదిలించే తత్త్వం ఈ సర్గలో కళ్ళకు కట్టించారు కవి.

ఐదవ సర్గలు రంగడు-గంగమ్మల దైన్యస్థితిని వర్ణించారు విద్వాన్ విశ్వం రంగడు ఇంట్లో లేని సమయంలో అంబటి వారింటికి అటుకులు దంచడానికి వెళ్తుంది గంగమ్మ. అటుకులు దంచడం మహాశ్రమతో కూడిన పని. మిట్ట మధ్యాహ్న సమయం ఎండనిప్పులు చెరుగుతుంది. దంచి దంచి చేతులు బొబ్బలెక్కాయి. పెనం మీద పేలగింజలా విలవిలలాడిపోయింది. అయినప్పటికీ పంటి బిగువున ఓర్చుకుని దంచుతూనే ఉంది. ప్రొద్దు వాలింది కాని పని మాత్రం పూర్తి కాలేదు. రంగడు గంగమ్మను కంటిపాపలవలె చూసుకుంటాడు. ముంతెడు గింజలైతే చాలు మన భుక్తికి. ఆ ముంతెడి గింజలు ఏదోవిధంగా కష్టం చేసి నేనే తీసుకువస్తాను బరువైన పనులు తల మీద వేసుకోవద్దని గంగమ్మతో చెప్తూ ఉంటాడు రంగడు. అయినా గంగమ్మ మనసూరుకోదు. భర్త రెక్కలు ముక్కలు చేసుకుంటూ కష్టపడుతుండడాన్ని చూడలేక తనకు చేతనైన పని చేయాలని సంకల్పించుకోండి గంగమ్మ. అతనికి అన్ని విషయాల్లో తోడునీడగా ఉండాలనేది ఆమె తపన. ఆవిధంగా ఆ దంపతులిద్దరూ కోడి కూతతో లేచి ఊరు మాటు మణిగే వరకు చెమటోడ్చి విశ్రాంతనేది లేకుండా శ్రమించే శ్రమజీవులు. గంగమ్మ తనకు నలతగా ఉన్నప్పటికీ లెక్కచేయకుండా శ్రమిస్తూనే ఉంటుంది.

గంగమ్మ మదిలో ఎన్నో కోర్కెలు ఒక చిన్న మట్టి మిద్దె ఏర్పరచుకోవాలని, రెక్కలు ముక్కలు చేసుకు కష్టపడైనా బాకీలు తీర్చుకోవాలని త్రుళ్ళింతలు, కేరింతలు కొట్టే పాపడిని తన చేతులతో మామకిచ్చి "నువ్వు సుల్తానువి" అని రంగడితో చెప్పాలని ఇలా ఆమె మదిలో ఎన్నో కోరికలు, ఆశలు.

అటుకులు దంచిన తర్వాత ఇంటికి వచ్చి బావి నీళ్ళు కోసం వెళ్ళిన గంగమ్మ కళ్ళు తిరిగి క్రింద పడిపోతుండగా చుట్టుప్రక్కల వారు చూచి పట్టుకుని అయ్యో ఇదేమిటి? వాతం కమ్మినదో, మూర్ఛరోగమేమైనా ఉందా అనుకుంటూ మోహంపై నీళ్ళు చల్లారు. కాళ్ళు చేతులు చల్లబడిపోవడాన్ని చూచి పసుపు, రాగుల పిండి రుద్ది, వేడివేడిగా గంజి తాగించి మరల స్పృహలోకి వచ్చేంత వరకు విసనకర్రలతో విసిరి గంగమ్మ కళ్ళు తెరిచిన తర్వాత ఊరట చెందారు. వారిలో ఇద్దరాడవాళ్ళు ఆమెను చెరోవైపు పట్టుకుని ఆమె గూటికి చేర్చారు. ప్రమిద వత్తి, ఆముదం, అగ్గిపుల్ల మొదలైన సామగ్రిని ఒక్కొక్కరు ఒక్కోటి తీసుకువచ్చి దీపం వెలిగించి ఈతచాప వేసి ఆమెను పడుకోబెట్టి వారి పనుల మీద వారు వెళ్ళిపోయారు.

గంగమ్మకు కళ్ళమ్మట నీళ్ళు కాలువ కట్టాయి. ఇంతలో తడిక చప్పుడు కాగా మామ వచ్చెనని దుఃఖాన్ని ఆపుకోబోయి

పెద్దగా ఏడవసాగింది. పిల్లికూన ఆ ఏడుపుకి బెదిరి మజ్జిగ ముంతను త్రోసి పారిపోయింది. అయ్యో మామకి మజ్జిగెట్లా అనుకుంటూ గబాలున లేవబోయి చెవులు గింగురుపెట్టగా విసురునపోయి పసరు కక్కుకుంటుంది గంగమ్మ. ఇంతలో బారెడు అంగలేసుకుంటూ వచ్చిన రంగడు గంగమ్మ స్థితిని చూచి చెంగున చేతుల్లోకి చేర్చుకొని చాపవద్దకు చేర్చాడు. ఏమి జరిగిందో బోధపడక గంగమ్మను తన ఒడిలో చేర్చుకుని తల నిమురుతూ సమాధిగతుడైన యోగి వలె నిశ్చలంగా ఉండుటకు అతని చేతి స్పర్శలో సేద తీరిన గంగమ్మ కొంతసేపటికి మామ అని పిలువగా తెప్పరిల్లుకున్న రంగడు పిల్లా అంటూ కళ్ళల్లో నీరు క్రమ్ముచుండగా ప్రేమగా గంగమ్మను కౌగిట చేర్చుకున్నాడు.

బడుగుజీవుల కండలు కరిగించి, నెత్తురులు పిండి, పీల్చి పిప్పి చేసిన విధంగా శ్రమ చేయించుకొని కూడా జీతము మాటేమో కాని సరైన తిండి కూడా పెట్టకుండా వారి శ్రమ దోపిడి చేసే దుష్టులైన పాషండుల వల్లకాదు గాని ఇది, మానవ సంఘమెట్లవుతుందని కవి ప్రశ్నిస్తారు.

గుండెలు సైతం కోసి ఇవ్వగల ప్రేమ, కొండలు సైతం మోయగల సహనం, ఎర్రటెండలో బండలు బద్దలు కొట్టగల చేవ గలిగిన ఇట్టి బడుగు జీవులను రాచి రంపాన పెట్టే ఈ పాతక మేమిటని దైవాన్ని నిలదీస్తారు కవి. అంతేకాక దైవమా ఉంటివా! చచ్చినావా నీవు! ధర్మమా నిన్ను భూమిపై నుంచి గెంటివేశారా!, హృదయమా! మానవుడు నిన్ను బహిష్కరించాడా? ఈ లోకానికి ఆత్మసాక్షి అనేదే లేకుండా పోయింది అంటూ ఎంతో ఆవేదన చెందుతారు కవి.

మానవ జీవితంలో నది ఎండిపోవడం ఒక గొప్ప విషాదం. నది లాంటి హృదయం ఎండిపోవడం అంతకన్నా గొప్ప విషాదం. నదిని ఆధారంగా చేసుకుని రాయలసీమ కరువు కాటకాలను, బడుగు జీవుల స్థితిగతులను హృదయ విదారకంగా ఈ పెన్నేటి పాట కావ్యం ద్వారా వినిపించారు విద్వాన్ విశ్వం.

**ఆధార గ్రంథం:**

1) పెన్నేటిపాట - విద్వాన్ విశ్వం

**- డా॥ కె. సుజాత**

## పాఠం - 8

# పెన్నేటిపాట

### కఠిన పదాలకు అర్థాలు, సందర్భ సహిత వ్యాఖ్యలు

**విషయ క్రమం:**


**8.1. కఠిన పదాలకు అర్థాలు**

**8.2. సందర్భ సహిత వ్యాఖ్యాలు**


## 8.1. కఠిన పదాలకు అర్థాలు:

| | |
|---|---|
| కలమ పాలికలు | = వరి పైరును కాపలా కాసేవారు |
| గుడారు | = గుడారము |
| కొఠారు | = ధాన్యపు రాశులుంచే చోటు |
| కఠారు | = కత్తి |
| కిన్నెర | = వాద్యవిశేషం (వీణ లాంటి వాయిద్యం) |
| కంజరి | = వాద్య విశేషం (డప్పు లాంటి వాయిద్యం) |
| విదారించు | = చీల్చు |
| ఉత్కటమై | = అధికమై |
| జఠర | = ఉదర సంబంధమైన |
| లుఠత్ | = ఎగురుతున్న |
| ఝషము | = చేప |
| హఠము | = మొండితనం |
| దుల్చివేయు | = తొలగిస్తుంది |
| దండి తల్లి | = గొప్ప తల్లి |
| వంత | = దిగులు |
| వఱదు | = ముసలినక్క |
| డోలికలు | = ఉయ్యాలలు |
| కుంజములు | = పొదరిళ్ళు |
| రేణి గంపల | = ముళ్ళ కంపల |
| లలి | = మనోహరమైన |
| లవంగకుడగ | = కరాపువు పొదరిల్లు |

| | |
|---|---|
| నారీకేళ | = కొబ్బరి |
| శుక | = చిలుక |
| పిక | = కోకిల |
| శారికా | = గోరువంక |
| తీతువు | = తీతువు పిట్టలు (అశుభాన్ని పలికేవి) |
| పులిన స్థలి | = ఇసుక దిన్నె |
| పాపరకాయలు | = తినడానికి పనికి రాని చేదుగా ఉండే కాయలు |
| నిట్రాళ్ళు | = నిలువుగా ఉండే రాళ్ళు |
| చెట్రాళ్ళు | = చదరంగా ఉన్న రాళ్ళు |
| బేట్రాళ్ళు | = చీలిన రాళ్ళు |
| పేట్రేగును | = పగులుతుంది |
| కాఱ | = చెరసాల |
| ఊలుగాయ | = తుంటరి |
| చండాలు | = చర్మం |
| తిమిరము | = చీకటి |
| కల్లకంప | = పరుషమైన కంప |
| మహాధ్వము | = గొప్పమార్గం |
| ఆయకం | = తనఖా |
| కణజం | = ధాన్యం పోసేవి |
| పాతర | = ధాన్యం నిల్వచేసే నేలమాళిగలు |
| జీవాలు | = గొఱ్ఱెలు, మేకలు |
| కాయం | = శరీరం |
| పదరలేదు | = పలకలేదు |
| గవి నీళ్ళు | = గుంటలోని నీరు |
| విభావరి | = రాత్రి |
| ఉద్వేగ రవము | = ఎదుటి వారి హృదయాలను కదిలించే ధ్వని |
| ప్రభాతం | = వేకువ, ప్రాతఃకాలం |
| యవనిక | = తెర |

| | |
|---|---|
| సారంగమ్ము | = జింక |
| లగువు | = చురుకుదనం |
| బిగువు | = నిండుదనం, గంభీరమైన |
| సౌరు | = అందం |
| కురంగనయనా | = లేడి కన్నులు వంటి కన్నులు కలిగిన |
| స్నిగ్ధ | = స్నేహం ఉన్న స్త్రీ |
| పిన్న పెద్ద | = పెద్దమనిషి, కాలవ్రత్వేవారికి పెద్ద |
| మడక | = నాగలి |
| బిగిగిత్తలైనా | = శక్తివంతమైన కోడెలైనా |
| ఎన్ని తూరులు | = ఎన్నిసార్లు |
| కిస్తీ | = వంతు చొప్పున చెల్లించే ద్రవ్యం |
| కస్తీ | = కష్టం, అప్పు వసూలు చేయడంలో చేసే వత్తిడి |
| పాలు | = కేలు |
| పరష | = తిరణాల, తీర్థం |
| చామీకర భూషలు | = బంగారు నగలు |
| మన్నీలు | = ప్రభువులు, భూస్వాములు |
| దస్త్రము | = ప్రామిసరీ నోట్ల కట్టలు, 'పదివేల దస్త్రం ఉన్నవాడు' అంటే పదివేలు వడ్డీకి ఇచ్చి ఉన్నవాడు అని అర్థం. |
| అలేకార్లు | = ఉద్యోగులు, ఆఫీసర్లు |
| మహడీ | = మేడ |
| దూము | = కలరా |
| దూడ వయసు | = పసితనం, ప్రాయం |
| రూకలు | = రూపాయలు |
| బిరాన | = శీఘ్రంగా |
| వఱపు | = అనావృష్టి, కాటకం, కఱువు |
| కుమ్మక్కు | = ప్రోత్సాహం |
| చక్కరోలు | = కట్టురోలు |
| పై నిమిరి | = వళ్ళు రుద్ది |

| | |
|---|---|
| పై | = వళ్ళు, శరీరం |
| మెట్లు | = చెప్పులు |
| ఔతుఖానా | = స్నానాల గదిలో నీళ్ళు నిల్వచేసేందుకు కట్టిన పెద్ద తొట్టి |
| మున్నూరు | = మూడు వందలు |
| పుట్టి | = చిన్న తెప్ప |
| గౌరి | = వీధి |
| బసివి | = బసువురాలు, ఊరిలోని దేవదాసీలాంటిది |
| ఎనుము | = గేదె |
| ఆకు | = కన్నప్పుడు చక్కపెడతారు, ఆకు ఇస్తారు. వేడికల్గించే వ్యాధి నివారణ చేసే ఔషధి |
| ఆకుమాట | = పై పంచకొసన ఆకు, వక్క, పొగాకు, సున్నం వగైరాలు కట్టుకున్న మూట |
| మాల పున్నమి | = మహాలయ అమావాస్య |
| కట్లపొడి | = పొగాకు కాడలు దంచి పెట్టినపొడి ఆకు వక్కలతో కలిపి ఆడవాళ్ళు వేసుకుంటారు |
| కనుమ | = కొండదారిలో కొండదాటే ఇరుగుదారి |
| పరువు | = రెండున్నరమైలు |
| అంబటివారు | = ఇంటి పేరు (వైశ్యులు ముఖ్యంగా) |
| తనకలాట | = బాధ |
| ముంతెడ | = రెండు తవ్వలు |
| మామ | = మగడు. ఈ వర్గాలలోనే ఎక్కువగా ఈ అర్థంలో ఉపయోగిస్తారు. |
| నల్తుము | = నాలుగు తూములు |
| వల్లె | = పంచ |
| పై దిరుగు | = వళ్ళు తిరగడం, కళ్ళు తిరుగుట |
| పొంత | = పొయ్యి ప్రక్కనే మంట తలిగే విధంగా పెట్టిన కుండ |
| సందెకాడ | = సాయంకాలం |
| నాల్నాళ్ళు | = నాలుగు రోజులు |
| బాకీ | = అప్పు |
| మామూలు | = ఇనాము. ప్రతి పండుగకో పర్వానికో ఇచ్చే బహుమతి |

| | |
|---|---|
| పొడుముల్ | = కాంతులు, అందాలు |
| గమియించు | = చేరు, ప్రయాణం చేయు |
| విపర్యయం | = ఆపద |
| శైవల జాలం | = నాచు |
| తమకం | = తహతహ, తొందర, మోహం |
| ప్రణవం | = ఓంకారం |
| కూళలు | = దుష్టులు, నీచులు |
| కూరిమి | = అనురాగం, ప్రేమ |
| తాలిమి | = ఓర్పు |

## 8.2. సందర్భ సహిత వ్యాఖ్యలు:

**1. ఇది గతించిన కథ**

పరిచయం: విద్వాన్ విశ్వం రచించిన 'పెన్నేటి పాట' అనే పాఠ్యభాగం నుండి ఈ వాక్యం గ్రహించబడింది.

సందర్భం: కవి నాటి రాయలసీమ వైభవాన్ని స్మరించే సందర్భంలోనిదీ వాక్యం.

వివరణ: రాయలసీమలో ఒకప్పుడు ముత్యాల పంటలు పండాయి, కావ్యాల జాలుతో నిండాయి, భాష్యాల జల్లులు కురిశాయి, వేయంచుల విచ్చుకత్తి విరిసింది. అది అంతా జరిగిపోయిన కథ. ఇంక ఇప్పటి రాయలసీను కన్నీటిపాటను వినిపిస్తాను.

**2. ఖండితవాదిని జేయును**

పరిచయం: విద్వాన్ విశ్వం రచించిన 'పెన్నేటి పాట' అనే పాఠ్యభాగం నుండి ఈ వాక్యం గ్రహించబడింది.

సందర్భం: పెన్నానది నీటి గొప్పదనాన్ని కవి వర్ణించే సందర్భంలోనిదీ వాక్యం.

వివరణ: ఈ పెన్నానది నీటిలో క్రమ్మదనం ఊరుతుంటుంది. ఒక్కసారి దోసిలితో పుక్కిలిస్తే చాలు జన్మ సార్ధకమవుతుంది. నిష్కల్మషత్వం అబ్బుతుంది, గుండెలను జలదరింపజేసే మోసాన్ని పోగొట్టి మాటమీద నిలబడే సత్యవాదిని చేస్తుంది.

**3. ఇల్లూ వాకిలి యిదే ఫణింద్రుల కెల్లన్**

పరిచయం: విద్వాన్ విశ్వం రచించిన 'పెన్నేటి పాట' అనే పాఠ్యభాగం నుండి ఈ వాక్యం గ్రహించబడింది.

సందర్భం: ఎండిపోయిన పెన్నానది దుస్థితిని గురించి కవి చెప్పే సందర్భంలోనిదీ వాక్యం.

వివరణ: చిలుక, కోకిల, గోరింకల శ్రావ్యమైన శబ్దాలు ఇక్కడ వినిపించవు. గుడ్లగూబల మూలుగులు గుండెలు పిండి దిగులు కలిగిస్తాయి. తీతువులు, నక్కలు, తోడేళ్ళు మతిపోయేటట్లు కూస్తాయి. పెన్నకు రెండు ప్రక్కల గట్టులు పుర్రెలతో పండి వల్లకాడులా ఉంటాయి. బల్లులు, తొండలు, ఎలుకలు, పిల్లులు, కుక్కలు, చెవుల పిల్లలు కావలసినన్ని ఉంటాయి. తేళ్ళు, జెర్రులు, పాములకు ఇదే ఇల్లూ వాకిలి.

**4. పాటగట్టే నీయనపయి మేటియనుచు**

పరిచయం: విద్వాన్ విశ్వం రచించిన 'పెన్నేటి పాట' అనే పాఠ్యభాగం నుండి ఈ వాక్యం గ్రహించబడింది.

సందర్భం: రంగడి తండ్రి అయిన నారపరెడ్డి గొప్పతనాన్ని కవి స్మరించే సందర్భంలోనిదీ వాక్యం.

వివరణ: ఒకప్పుడు రంగన్న తండ్రి ఊరిలో పెద్ద సంసారి, పెద్ద రైతు. మిగిలిన సన్నకారు రైతులను ఆదుకొనేవాడు, పేదసాదలకు దానధర్మాలు చేసేవాడు. నెలకొకరోజు ఊరి దేవాలయంలో పూజకి ఇచ్చాడని పెద్ద పుణ్యవంతుడని ప్రతిరోజు తంబళ్ళ సుబ్బమ్మ మెచ్చుకొంటుంది.. దాసరి ఓబిళేసు గరుడగంబంలో వెండికాసు వేసే భాగవతుడని అతడి గురించి పాడతాడు. గుడిసె ముందు నీడలో కూర్చుని ఈత చాపల నల్లుకుంటూ దొంగ సుంకన్న తిరణాలలో ఈయన మేటి అని పాటకట్టారు.

**5. కొంత కొంతయె ఖర్చు కొండంతయయ్యె**

పరిచయం: విద్వాన్ విశ్వం రచించిన 'పెన్నేటి పాట' అనే పాఠ్యభాగం నుండి ఈ వాక్యం గ్రహించబడింది.

సందర్భం: నారపరెడ్డి కీర్తి సంపద పెరిగి, ఉన్న సంపద ఎలా తరిగిందో కవి చెప్పే సందర్భంలోనిదీ వాక్యం.

వివరణ: సర్కారు సిబ్బందిని సరిచేయటానికి, సంవత్సర జమాబందీకి, పోరుగూరి మన్నీల సరఫరాకు, ఆలేకార్ల లంచాలకు, పెద్ద వకీలుకు, కాంపౌండరు మునిస్వామికి, కోడెరెడ్లకు, గుర్రాలకు, బగ్గీలకు కొంత కొంత ఖర్చు అయిపోయింది. పెద్ద మహడీలు కట్టడానికి, తన నాలుగు పెళ్ళిళ్ళకు కొంత కొంతగా ఖర్చయి మొత్తం ఖర్చంతా కలిసి కొండంత అయ్యింది.

**8. సాయపడుట కింక కాయమొకటె**

పరిచయం: విద్వాన్ విశ్వం రచించిన 'పెన్నేటి పాట' అనే పాఠ్యభాగం నుండి ఈ వాక్యం గ్రహించబడింది.

సందర్భం: తల్లిదండ్రి చనిపోగా మిగిలిన చిన్నవాడు రంగన్న గురించి చెప్పే సందర్భంలోనిదీ వాక్యం.

వివరణ: తల్లి తండ్రి లేరు, తన వారెవరూ లేని చిన్నవాడైన రంగడి గతిని విన్నా కూడా బంధువులు, మిత్రులు పలకనైనా లేదు. సహాయం చేయటానికి ఉన్నది అతడి శరీరం ఒక్కటే.

**8. ఎంత యెంత దురపిల్లెనో / వాని యింత యెదద**

పరిచయం: విద్వాన్ విశ్వం రచించిన 'పెన్నేటి పాట' అనే పాఠ్యభాగం నుండి ఈ వాక్యం గ్రహించబడింది.

సందర్భం: చిన్న పిల్లవాడైన రంగడి కష్టాలు చెప్పే సందర్భంలోనిదీ వాక్యం.

వివరణ: చిన్నవాడైన రంగడు ఒకరింటి గాటిలో గంజి ఎత్తి పోయటానికి ఎంతగా ఏడ్చాడో, ఒకరింటి దొడ్డిలోని కసువంతా ఊడవటానికి ఎంత బాధపడ్డాడో, ఒకరి నట్టింట్లో కొర్రలన్నిటినీ దంచటానికి ఎంతగా వణికిపోయాడో, ఒకరింటిలోని రాగులన్నీ విసరటానికి ఎంతగా విసిగిపోయాడో, ఒకరి ఇంటిలో పిల్లలను ఊపటానికి, మరొకరి ఇంటిలో పక్కలు వేయటానికి, ఒకరింట్లో అరవచాకిరీ చేయటానికి ఎంతగా అతడి చిన్న మనసు దుఃఖించిందో!

**8. పుట్టుకవి, గాయకుడు / నటరాట్టు నతడు**

పరిచయం: విద్వాన్ విశ్వం రచించిన 'పెన్నేటి పాట' అనే పాఠ్యభాగం నుండి ఈ వాక్యం గ్రహించబడింది.

సందర్భం: రంగడి గళమే కావ్యమని కవి చెప్పే సందర్భంలోనిదీ వాక్యం.

వివరణ: రంగన్న కోలుకోలో అని కోలగొడితే వేయి భారతాలు జాలువారతాయి. ఓ అని ఆలపిస్తే చాలు వందల గాథా సప్తశతులు జారతాయి. మచ్చుదిగవే అని మరులపాట పాడితే చాలు పదుల సంఖ్యలో అష్టపదులు ప్రవిస్తాయి. గరుడగమనా అని గొంతెత్తితే మూక పంచశతులు పొంచి చూస్తాయి. ఖంగుమనే గుండె చిక్కదనం ఉంటే మాణిక్యవీణ ఎందుకు, పలికించగలిగితే వెదురే సరిపోతుంది. అతడు సహజ కవి, గాయకుడు, నటరాజు.

**9. భంగుల భంగుల పిలుచుట / కంగారునేకాదు వారి కలయిక దెలుపున్**

పరిచయం: విద్వాన్ విశ్వం రచించిన 'పెన్నేటి పాట' అనే పాఠ్యభాగం నుండి ఈ వాక్యం గ్రహించబడింది.

సందర్భం: రంగన్న, గంగమ్మల అన్యోన్యతను వివరించే సందర్భంలోనిదీ వాక్యం.

వివరణ: రంగన్న గంగమ్మలు ఒకరు ఎరుపురంగైతే, ఇంకొకరు ఆ ఎరుపు, ఒకరు ఆకాశమైతే ఇంకొకరు ఆకాశంలోని నీలి వర్ణం, రంగన్న గంగమ్మలు సింగారాలు చిందించే రంగారు బంగారు పొంగారు గోపురాలు. రంగడంటే గంగమ్మ భర్తే. గంగమ్మ అంటే రంగడి భార్యే. రంగన్న బ్రతుకంతా గంగమ్మ బ్రతుకే, గంగమ్మ మనసంతా రంగన్న మనసే. రంగడిని గంగన్నా అన్ని, గంగను రంగమ్మ అని ఊరివారు పిలవటం కంగారుతో మాత్రమే కాదు, వారి కలయికను తెలియజేయటానికి కూడా.

**10. పేదవాని కదే అమృతోదనంబు**

పరిచయం: విద్వాన్ విశ్వం రచించిన 'పెన్నేటి పాట' అనే పాఠ్యభాగం నుండి ఈ వాక్యం గ్రహించబడింది.

సందర్భం: మజ్జిగ మాత్రమే ఇచ్చే పెద్ద వారి గొప్పతత్వాన్ని చెప్పే సందర్భంలోనిదీ వాక్యం.

వివరణ: కష్టపడి తెచ్చి ఎన్నో కడవల నీళ్ళు పోసినా రంగడు పనిచేసే రెడ్డిగారింటి పెద్ద ఔతుఖానాలో నీళ్ళు పైకి రానేరావు. అన్ని నీళ్ళు, ఉన్నవారు ఏమి చేసుకుంటాలో రంగడికి అర్థం కాదు. ఉట్టి మాటలే కాని పనిచేయించుకొని వారు ఏ ధనము ఇవ్వరు. ఒక ముంత మజ్జిగ పోస్తారంతే. ఆ ముంత మజ్జిగే పేదవాడికి అమృతంతో సమానం.

**11. ఇచట లేనిది మానవ హృదయమొకటే**

పరిచయం: విద్వాన్ విశ్వం రచించిన 'పెన్నేటి పాట' అనే పాఠ్యభాగం నుండి ఈ వాక్యం గ్రహించబడింది.

సందర్భం: రంగడు పనిచేసే ఇంటి గురించి చెప్పే సందర్భంలోనిదీ వాక్యం.

వివరణ: ఈ ఇంటిలో తొంగిచూస్తే ఊరి చెమట నీడ కనిపిస్తే ఊరిలో తొంగిచూస్తే ఈ ఇంటి భూతపునీడ కనిపిస్తుంది. ఈ ఇంట్లో నీడలు కనిపించే పాలరాతి నేలలు, మబ్బుల సొనలూరే మహడీలు ఉంటాయి. ఈ ఇంటి పిల్లి కూడా ఊరి పెద్ద రైతులనైనా నిలవేస్తుంది. ఈ ఇంటిలో త్రేన్పులే వినిపిస్తాయి, డబ్బులు గలగలలే వినిపిస్తాయి. లక్ష్మీ సరస్వతులు ఈ ఇంటిలో నివసిస్తారు, ఈ ఇంటిలో మానవ హృదయం ఒకటి మాత్రం లేదు.

**12. భయము తోచదు కర్తవ్య భారమున్న**

పరిచయం: విద్వాన్ విశ్వం రచించిన 'పెన్నేటి పాట' అనే పాఠ్యభాగం నుండి ఈ వాక్యం గ్రహించబడింది.

సందర్భం: పాము కాటు తిన్న నరసన్నను రక్షించటానికి మంత్రగాడిని తేవటానికి రంగడు వెళ్ళే సందర్భంలోనిదీ వాక్యం.

వివరణ: ఈ రోజు అమావాస్య పాము కరిచింది, కష్టమే అని కట్ట మీద కూర్చుని రామయ్య, మాల పున్నమి తరువాతి రోజే

కదా పాము కరిచి రాముడు చచ్చాడని సాలె నారణమ్మ అన్నారు. రంగడు ఒక్కొక్క మాటే వింటూ రగిలిపోతూ చెంగు పైకి ఎగకట్టి ఆ చీకటిలో వెళుతున్నాడు మంత్రగాడి కోసం. కర్తవ్య భారమున్న దగ్గర భయమనిపించదు కదా!

**13. అన్నమాట ఒక్కటె / కొండ అనువదించె**

పరిచయం: విద్వాన్ విశ్వం రచించిన 'పెన్నేటి పాట' అనే పాఠ్యభాగం నుండి ఈ వాక్యం గ్రహించబడింది.

సందర్భం: ఊరిలో ఏ కష్టమొచ్చినా చలనం లేనిది రెడ్డి గారి మేడకే అని చెప్పే సందర్భంలోనిదీ వాక్యం.

వివరణ: ఊరు తగలబడిపోతున్నా సరే, రెడ్డిగారి మేడ మీద రామశాస్త్రిగారు ప్రతి రాత్రి రాగయుక్తంగా భారతం చెపుతారు. అతడి పెద్ద గొంతు ఊరిబయటకు వినిపిస్తుంది. ఊరంతా దద్దరిల్లే విధంగా అంత పురాణంలోనూ 'ధర్మమొకటే తనకు తోడుగా వస్తుంది' అనే మాట ఒక్కదాన్నే కొండ ప్రతిధ్వనించింది.

**14. ఎంతల పరించినదియో దైవమెఱుగు**

పరిచయం: విద్వాన్ విశ్వం రచించిన 'పెన్నేటి పాట' అనే పాఠ్యభాగం నుండి ఈ వాక్యం గ్రహించబడింది.

సందర్భం: గంగమ్మ అనారోగ్యం గురించి చెప్పే సందర్భంలోనిదీ వాక్యం.

వివరణ: మొన్న రాత్రి కడుపులో సన్నగా మొదలైన నొప్పి తెల్లవారే సరికి ఎక్కువై బాధ తట్టుకోలేక చుట్టజుట్టుకొని ఎంతగా బాధపడిందో దేవుడికే తెలుసు.

**15. హృదయ మంత మృదువు**

పరిచయం: విద్వాన్ విశ్వం రచించిన 'పెన్నేటి పాట' అనే పాఠ్యభాగం నుండి ఈ వాక్యం గ్రహించబడింది.

సందర్భం: పేదవారైనప్పటికీ సాటిస్త్రీల హృదయమెంత సున్నితమో చెప్పే సందర్భంలోనిదీ వాక్యం.

వివరణ: అటుకులు దంచుతూ పడిపోయిన మంగను రెండువైపుల ఇద్దరు స్త్రీలు పట్టుకొని సందు దాటించి కొట్టానికి తెచ్చారు. అక్కడ ముసురుకొనిన చీకట్లు గుబులు కలిగిస్తున్నాయి. ప్రమిద, ఒత్తి, ఆముదం, అగ్గిపుల్ల ఒక్కొక్కరొకటి తెచ్చి దీపం వెలిగించారు. గూడు తీసి ఈత చాపలేసి గంగను పడుకోబెట్టి వారి పనుల మీద వారు వెళ్ళిపోయారు. అంతకంటే వారు మరే సాయం చేయలేని పుట్టు పేదవారు. అయినా వారి హృదయం ఎంతో మృదువు.

**ఆధార గ్రంథం:**

1) పెన్నేటిపాట - విద్వాన్ విశ్వం

**- డా॥ కె. సుజాత**

**పాఠం - 9**

# పెన్నేటిపాట

## ప్రశ్నలు - సమాధానాలు

**1. రాయసీమ కన్నీటిపాటను విద్వాన్ విశ్వం వర్ణించిన తీరును తెల్పండి?**

**లేదా**

**2. రాయలసీమ ఖండికలో రాయలసీవల నేటి స్థితిని కవి ప్రకటించిన విధానాన్ని గూర్చి రాయండి?**

**లేదా**

**3. ఒకనాటి రతనాల సీమ నేడు రాళ్ళసీమగా మారిన స్థితిని కవి వర్ణించిన విధానాన్ని వివరించండి?**

జ) ఒకనాడు రాయలసీమలో సితారు పాటలను మించే వరిచేల కాపలాదారుల యాల పాటలు మధురంగా వినిపించేవి. అల్లసాని పెద్దన మొదలగు కవుల మధురమైన వాక్కులు పరిమళించేవి అందమైన వస్త్రాలుండేవి. ప్రతిభావంతులు, శౌర్యరస పూరితులైన వీరులు ఎక్కడ చూసినా దర్శనమిచ్చేవారు. రత్నాలను రాశులు పోసి బజారులలో విక్రయించేవారు. అక్కడ ముత్యాల పంట పండింది. కావ్యాల ప్రవాహం పొంగిపొరలింది. భాష్యాల జల్లు కురిసింది. వేయంచుల విచ్చుకత్తి విరిసింది. ఇది పూర్వగాథ.

నేటి రాయలసీమ దయనీయమైన స్థితిలో ఉంది. అలాంటి రాయలసీమ కన్నీటి కథ కోటి గొంతుల కిన్నెర మీటుకుంటూ, కోటి గుండెల కంజరి కొట్టుకుంటూ వినిపిస్తానని కవి పలికారు. నిదానంగా నడుస్తూ పెన్నానదిని గమనిస్తే గుండెలవిసి పోతాయి. పెన్న నీరు, హోరు, జోరు పూర్తిగా తగ్గిపోయింది. పెన్నానది ఎడారిగా మారిపోయింది. ఒక్క నీటి చుక్క కూడా కనిపించడం లేదు. కుండపోతగా వర్షాలు కురిసినా కొద్ది రోజులోనే నీరు కనిపించకుండా పోతుంది. వర్షాలు కురిసినపుడు వచ్చిన నీరంతా ఎండిపోయి ఉన్న ఇసుకలోకి ఇంకిపోతుంది. వర్షం కురిసిన వెంటనే ఆకాశాన్ని తాకే అలలతో సాగిపోతూ దరి చేరిన జీవరాశుల్ని తన గర్భంలో ఇముడ్చుకుంటుంది. ఇది పట్టని మొండిపట్టు, చేయని కఠోర క్రియా విహారం లేదు.

కానీ ఈ యేటి నీరు కమ్మగా ఉంటుంది. ఒక్కసారి పుక్కిలిస్తే జన్మ సార్థకమౌతుంది. మాలిన్యం తొలిగిపోతుంది. గుండెను జలదరింప చేస్తుంది. రండతనాన్ని తొలిగిస్తుంది. ఖండితవాదిని చేస్తుంది. ఇది గొప్ప మనసున్న తల్లి. కండలేక ఎండిపోయినా నిండు మనసుని, నిజాయితీని, ధర్మ దీక్షను పండిస్తుంది. అలాంటి తల్లికి నమస్కరించి సేవించమని కవి పలికారు.

ఎంతోమందికి కన్నతల్లిలాంటి పెన్న దయనీయంగా ఎందుకు మారిపోయిందో ఆలోచించమని కవి సూచనప్రాయంగా తెలియ చేస్తారు. దుఃఖంతో, దిగులుతో ఏడ్చి ఏడ్చి ఆమె గొంతులోని తడి ఆరిపోయింది అని చెప్పడంలో నదులు ఎండిపోవడంలో మానవుల పాత్ర ఎంత ఉందో పరిశీలించుకోవాలని పరోక్షంగా మానవలోకానికి హితవు పలికారు. పెన్నానది కాల్వల్లోని ప్రతి నీటి బొట్టు రైతుల నెత్తుటి ఛాయల్ని స్ఫురింపచేస్తాయి. ఆ నది ప్రక్కన ఉన్న ఇసుక తిన్నెల మీద నక్కలు తిరుగుతూ ఉంటాయి. ఎన్నో శవాలకు అక్కడ అంతక్రియలు జరుగుతూ ఉంటాయి.

పెన్నానది సమీపంలో నాగుపాములు ఉన్నాయి కాని నాగకన్యలు లేరు. బొంత గద్దలు గుంపు కడుతున్నాయి కానీ

గరుడ గంధర్వ కాంతలు కనిపించరు. తిప్పతీగెలు, ముళ్ళపొదలు, తుమ్మతోపులు, చిట్టీత డొంకలు, గడ్డి గాదం, పల్లేరు కాయల బీళ్ళు మాత్రమే ఉన్నాయి కాని ఆనందాన్ని కలిగించే తీగలు కానీ, పొదరిళ్ళు కాని, నారికేళాది వన భూములు కాని, పైరు పచ్చలు కాని లేవు. మనస్సుకు ఆహ్లాదాన్ని కలిగించే చిలక పలుకలు, కోకిల పాటలు, గోరువంకల ధ్వనులు వినిపించవు. గుడ్లగూబల మూల్గులు గుండెల్ని పీల్చి వేస్తాయి. తీతువు పిట్టల ధ్వనులు దిగులు పుట్టిస్తాయి. తోడేళ్ళు నక్కలు మనసుల్ని చెదరగొడతాయి. నదీ తీరాన ఉన్న ఇసుక తిన్నెలందు పుర్రెల పంటలు పండుతాయి. బల్లులు, పిల్లులు, తేళ్ళు, జెర్రులు, తొండలు, పాములకది నిలయం. పుట్టలు, గుట్టలు, కఠిన శిలలకది పెట్టింది పేరు. ముందు వెనకలు చూసుకుంటూ జాగ్రత్తగా నడవకపోతే పదునైన రాళ్ళు పాదాలను చీల్చివేస్తాయి. పొరపాటున గాని కిందపడిపోతే తల బద్దలవుతుంది.

ఆ చింతచెట్టు కొమ్మే చిన్నిగాని ఊపిరితీసింది. ఆ తుమ్మ చెట్టు దిమ్మే సీతిగాని చెరసాలకు పంపిన తుంటరి. ఆ ఈత చెట్టు పట్టే ఎంకి కడియాలను తొలగించిన తీర్పులో ఒక సాక్షి. ఆ బోద పోచ రెమ్మే బుర్ర ఎరుకలసాని చర్మాన్ని బాధపెట్టిన జాణ. అక్కడ అడుగుతీసి అడుగు పెట్టడానికే గుండెలవిసిపోతాయి. ఆ చిక్కటి ఇసుక తిన్నెల మీద పోటుగిత్తలే బళ్ళను లాగలేక తల్లడిల్లిపోతాయి. ఇక సామాన్య మానవుల సంగతి వేరే చెప్పనవసరం లేదు. ఆ డొంకలో ఎన్నిమార్లు దొంగలు దారికాచి దోచుకున్నారో, ఈ డొంకదారిలో ఎంతమంది మొనగాళ్ళ కాళ్ళు చేతులు విరిగాయో, ఎన్ని బండ్ల ఇరుసులు పుటుక్కుమని విరిగాయో, మంచినీళ్ళు ఎత్తుకువచ్చే కొత్త కోడళ్ళు ఎన్ని బాధలనుభవించారో ఆ డొంక దారిని నడవలేక అంటూ రాళ్ళమయమైన ఆ డొంక దారులను గూర్చి వర్ణిస్తారు కవి. ఆ డొంకే ఆలమందకు విడిది. గొర్రెలు, మేకలకు కూడా అక్కడికే తోలుకు వస్తారు. పులులకు కూడా అదే నిలయం. ఎంత నీటి ఎద్దడి ఉన్నప్పటికి అన్నిటికి అదే విశ్రాంతి స్థలం. అచటనే వర్షం వచ్చినపుడు మాత్రమే ప్రవహించే వాగు, ఆ ప్రక్కనే కాల్వ, మార్గం ప్రక్కన మంచి నీటి చెలమ దర్శనమిస్తాయి.

అదిగో పారల్ని తీసుకుని రైతులు ఆ కాల్వను బాగుచేయడానికి వస్తున్నారు. కుప్పల్ని నూర్చే వరకు ప్రతి రైతు ప్రతిరోజూ ఆ పని చేయవలసిందే. లేకుంటే పొలాలు బీడులౌతాయి. ఊరికి చేరువగా ఉన్న కొండ సమీపంలోని అడవికి ఒకపూట భుక్తికైనా ఏమైనా దొరుకుతుందనే ఆశతో వస్తుంటారు గ్రామ ప్రజలు. వేయేళ్ళకొకసారి వానలు పడుతుంటే అక్కడ మాత్రం గడ్డెలా మొలుస్తుంది పచ్చదనం అనేది అడవిలో సైతం కనిపించకపోవడం ఎంతో విషాదం. నాలుగు చినుకులు పడితే అడవే ఆ గ్రామాల ప్రజల్ని సాకుతుంది. వారికి కావలసినవన్నీ అందిస్తుంది. అందులో సందేహమేమి లేదు కానీ వర్షాలు పడితే కదా.

కాస్త వర్షాలు పడితే కలివి పళ్ళు, బలసకాయలు, రేణగాయలు, సీమ చింతలు కోసుకుని అమ్ముకోవచ్చు. తేనె తెట్టులు, రకరకాల ఆకులు, మడక మొదలు కాడిమాను వరకు అన్నింటిని అడవే అందిస్తుంది. కాని ప్రస్తుత పరిస్థితుల్లో తేనె కూడా డబ్బులిచ్చే కొనుక్కువలసి వస్తుంది. గ్రామ వాసులకి ఏడాది పొడవున ఆ ప్రజలకి పొలం పనులు దొరకవు. కాబట్టి మిగిలిన రోజుల్లో అడవికి లేదా కొండమీదికి వెళ్ళి గడ్డిమోపో, కట్టెల మోపో తెచ్చుకుని అమ్ముకుంటే తప్ప భుక్తి గడవదు.

ఒక పక్క వర్షాలు లేక నదులెండి పోయి ప్రకృతి రీత్యా వచ్చిన కరువు పరిస్థితులిట్లు ఉంటే మరొక ప్రక్క ధనవంతులు బడుగుజీవులను పీల్చి పిప్పిచేసేలా అరవ చాకిరీ చేయించుకుని బదులుగా నాలుగు కానీలు డబ్బులివ్వకపోగా పూటకు ముంత మజ్జిగో, కొద్దిగా పుల్లగూరో ఇచ్చి చేతులు దులిపేసుకుంటారు. నోరెత్తి ఇదేమని ప్రశ్నించలేని అమాయక జనులు అంతమాత్రం దొరికినా చాలనుకుని ఊపిరి నిలుపుకుంటున్న స్థితిని చాలా హృదయ విదారకంగా వర్ణిస్తారు కవి.

ఊరికంతటికీ ఒకే ఒక సంపన్న భవనం. ఊరిలోని సిరిసంపదలన్నీ అక్కడే పోగుపడి ఉంటాయి. ఊరి ప్రజలందరికి కడగండ్లే మిగులుతాయి. ఊరంతా రాళ్ళు రప్పలతో పూరి గుడిసెలతో ఉంటే ఆ భవనంలో మాత్రం విలాసవంతమైన సామాగ్రితో నిండి ఉంటుంది. ఊరునంతా మింగి ఉబ్బినట్లుగా ఉందా భవనమని వర్ణిస్తారు కవి. ఊరికంతటికి రెండే ఇళ్ళు ఉన్నాయా అన్నట్లుగా కరణం గారింట్లో, రెడ్డి గారింట్లో మాత్రమే వెలుగు ఉంటుంది. ఊరంతా అంధకారంలో ఉంటుంది అని ఊర్లో ధనిక పేద వ్యత్యాసాలను గూర్చి వర్ణిస్తారు కవి.

ధనికుల దుష్టత్వాన్ని, పేదల పాట్లను చూడలేకపోయిన కవి హృదయం కరిగి నీరై చివరకు

**"దైవమా!**

**ఉంటివా!**

**చచ్చినావ నీవు!**

**ధర్మమా!**

**గెంటిరా!**

**నిన్ను ధరిణి నుంచి?....**

**హృదయమా!**

**మానవుడు**

**నిన్ బహిష్కరించె ......**

**చచ్చె నీ లోకమున**

**నాత్మసాక్షి యనుచు**

**నెత్తి నోరిడి**

**కొట్టుకోనిందు నన్ను"**

అంటూ ఆవేదన వ్యక్తం చేస్తూ ముగిస్తారు ఈ కావ్యాన్ని కవి. ఈ కావ్యంలో కథ రేఖ మాత్రమే కానీ పేదరికం వల్ల కలుగుతున్న సామాజిక, మానవీయ విధ్వంసానికి ప్రాధాన్యమిస్తూ రాయలసీమ బడుగుజీవుల కన్నీటి పాటను పెన్నేటి పాటగా పాఠకుల హృదయాలను కదిలించేలా వినిపించారు కవి విద్వాన్ విశ్వం.

## 2. పెన్నేటి పాట కావ్యమాధారంగా రంగడి పాత్ర చిత్రణ చేయండి?

జ) మనిషి స్వార్థానికి నాశనమవుతున్న ప్రకృతిని, అస్తవ్యస్తమవుతున్న సాంఘీక జీవనాన్ని, మంటకలిసిపోతున్న మానవీయ విలువలను-స్వచ్ఛమైన ప్రేమతో పెనవేసుకున్న ఒక నిరుపేద దంపతుల జీవిత చిత్రణ ఆధారంగా పాఠకుల కళ్ళముందు 'పెన్నేటి పాట' కావ్యరూపంలో నిలిపారు విద్వాన్ విశ్వం. అనావృష్టి వల్ల ఒకనాటి రతనాలసీమ అయిన రాయలసీమ నేడు రాళ్ళసీమగా మారిపోయింది. రాయలసీమలోని సామాన్య ప్రజల కన్నీటిపాటను 'పెన్నేటి పాట' గా వినిపించారు కవి విద్వాన్ విశ్వం.

ఈ కావ్యంలోని నిరుపేద జంట రంగన్న - గంగమ్మ. రంగన్న తండ్రి నారపరెడ్డి ఒకప్పుడు ఊరిలో పెద్ద మోతుబరి పట్టాదారు. పదిమందిలో మంచి అనిపించుకున్నవాడు.

సన్నకారు రైతులకీ, పేదసాదలకీ, ఊరి దేవాలయానికే కాకుండా తన చుట్టూ చేరే భజన పరులకి కూడా అడిగినది లేదనక దానాలు చేసేవాడు. ఆయనను పొగిడే కవి గాయకులకు చేతికి ఎముక లేనట్లుగా దానాలు చేశాడు.

సర్కారు సిబ్బందికి కొంత, పెద్ద వకీలు పిళ్ళెకు కొంత, ప్రక్క ఊరి ప్రభువులకు కొంత, కాంపౌండరు మునుస్వామికి కొంత, కోడెరెడ్లకు, గుర్రాలకు, బగ్గీలకు కొంత తాను చేసుకున్న నాలుగు వివాహాలకు మరికొంత ఈవిధంగా ఖర్చులన్నీ కలిపి కొండంత అయ్యాయి.

ఎదిగిన కూతుళ్ళిద్దరి పెళ్ళి వేడుకలు ఎనిమిది రోజుల పాటు చేశాడు. ఈ ఎనిమిది రోజుల పెళ్ళిళ్ళకు వేలు వేలు ఖర్చయ్యాయి. ఆ ఎనిమిది రోజులు కాకులు కూడా నేతి వంటకాలు రుచి చూసాయి. పెద్దింటి వారి పెళ్ళంటే ఇది కదా అని పొగిడారు జనాలు.

ముగ్గురు భార్యలు మరణించిన తర్వాత నాలుగో భార్య అయిన రామమ్మ కొడుకే రంగడు. నారపరెడ్డి తాను చేసిన అప్పుల వల్లా, ఇతరులు చేసిన మోసాల వల్ల వానల్లేక పంటలు పండకపోవడం లాంటి కారణాల వల్ల నెమ్మదిగా ఆస్తి మొత్తం కోల్పోయి దివాలా తీశాడు. అయితే బాకీదారులందరికి ఒక్క పైసా కూడా ఎగ్గొట్టకుండా మిగిలిన మిద్దెలు, మేడలు చివరికి నల్లపూసలతో సహా అమ్మి అసలు వడ్డీతో సహా మొత్తం బాకీలు తీర్చాడు నారపరెడ్డి. అంత నిక్కచ్చియైన మనిషి నారపరెడ్డి. అతని అమాయకత్వం వల్ల నైతేనేమి, మంచితనం వల్ల ఐతేనేమి కీర్తి సంపద పెరిగింది గాని అసలు సంపద హరించుకు పోయింది. తెల్లవారేసరికి నారపరెడ్డి దివాలా తీశాడనే వార్త ఊరంతా తెలిసిపోయింది. ఈ వార్త వినగానే నారపరెడ్డి భార్య రామమ్మ 'రామ' అంటూ తన చీర చెంగు ముట్టించుకుని తనను తానే దహించుకొని మరణించింది. నారపరెడ్డి, నారప్ప అయ్యాడు. ఊరి మోతుబరి ఉప్పరి అయ్యాడు. పసిప్రాయంలో ఉన్న చిన్ని రంగడే తోడయ్యాడు. పూరికొట్టంలో చేరి కుళ్ళి కుళ్ళి యేడుస్తూ కుక్కి మంచంనుండి లేవలేక, పని చేయు చేవలేక రంగడిని అనాధను చేసి నారపరెడ్డి కూడా చనిపోయాడు. అనాధగా మిగిలిన రంగడిని బంధుమిత్రులెవరు చేరదీయలేదు. పసివయసులోనే బ్రతుకు బరువు మీద పడిన రంగడు ఊరి వాళ్ళ కసువు లూడ్చి, పశువుల్ని కాసి చేతనైన పని చేసుకుంటూ పొట్టపోసుకున్నాడు. పసిప్రాయంలోనే కొర్రలు దంచాడు. రాగులు విసిరాడు. బిందెల కొద్ది నీళ్ళు మోశాడు. ఇంత అరవచాకిరి చేయించుకుని కూడా కనికరం లేకుండా కటిక కారం, సంగటి లేదా ఎండు రొట్టెలు పెడితే వాటిని తినలేక, ఒకవేళ తిన్నా అరాయించుకోలేక అల్లాడిపోతూ పెరిగాడు రంగడు. ఒక్కోసారి అంతమాత్రం ఆహారం కూడా దొరక్కపోతే బావి నీళ్ళు తాగి ముడుచుకు పడుకున్న రోజులెన్నో అతని జీవితంలో.

రంగడిది కోయిల కంఠం. చదువు లేదు కాని పుట్టుకవి. చక్కగా కవితలల్లగలడు గాయకుడు. రంగడు యాల పాట పాడితే ప్రకృతి సైతం మైమరచిపోతుంది . ఇక మనుషుల సంగతి చెప్పనేల. కలతలన్నిటిని మరిచి రంగడు యాల పాట పాడితే మనుషులే కాదు ప్రకృతి సైతం ఆ గానలయామృతంలో స్థంభించిపోతుంది.

ఎన్నో కష్టాలు, అవమానాలు, బాధలనుభవించిన రంగడికి రత్నం లభించినట్లుగా లభించింది భార్య గంగమ్మ. వారిరువురిని చిక్కనైన చక్కనైన అన్యోన్య అనురాగం. రంగడికి గంగమ్మంటే ప్రాణం. ఆమెను బాగా చూసుకోవాలనే తపనతో కోడి కూతతో నిద్ర లేచింది మొదలు ఊరు మాటు మాటు మణిగే వరకు రెక్కలు ముక్కలయ్యేలా పనిచేస్తూనే ఉంటాడు. అయితే ఇన్ని కష్టాలు నీ కోసమే అని అతనెప్పుడూ ఆమెతో అనలేదు. మనసునిండా గంగమ్మ పట్ల ప్రేమ నిండి ఉండగా ఇక మాటలతో పనియేమి?

ఒకనాటి రాత్రి రెడ్డిగారింట పనిపూర్తి చేసి వారిచ్చిన ముంతెడు మజ్జిగ తీసుకుని ఇంటికి వెళ్తుండగా దారిలో ఒక వ్యక్తికి పాము కరిచిందనే వార్త తెలుస్తుంది. కొండ దారిలో కనుమ దాటి మంత్రగాడిని తీసుకు వచ్చేందుకు ఎవ్వరు ముందుకు రాలేదు. అక్కడున్న వారందరూ వట్టి మాటలాడచు నిలుచున్నారే కాని మేము వెళ్ళి పిలుచుకొస్తామని అనడంలేదు. ఆ ఇంటి వారి కష్టం చూడలేక మజ్జిగ ముంతను అక్కడ పెట్టి నేను వెళ్ళి మంత్రగాడిని పిలుచుకు వస్తానని పరుగు మీద వెళ్తాడు రంగడు. చిమ్మ చీకటి, అమావాస్య, రాళ్ళ దారి అయినప్పటికి జంకు గొంకు లేకుండా, పురుగు పుట్రకు నిలయమైన ఆ దారిలో పడి వెళ్తాడు రంగడు. అతని దృష్టంతా మంత్రగాడిని పిలుచుకు వచ్చి పాము కరిచిన వ్యక్తిని రక్షించడం మీదే ఉంటుంది కనుక అతనికా క్షణంలో నిరంతరం కళ్ళల్లో మెదిలే గంగమ్మ సైతం గుర్తుకు రాదు. గుండెలు తీసిన బంటయినా ఆ రాత్రి సమయంలో ఆ దారిలో వెళ్ళడానికి సాహసించరు. అయితే తన కర్తవ్యం మీదే దృష్టి నిలిపిన రంగడికి భయం వేయలేదు. ఎదుటి వాళ్ళు కష్టంలో ఉంటే చూడలేని గొప్ప మనసు రంగడిది. ఆ రోజు రంగడు ఇంటికి వెళ్ళేసరికి గంగమ్మ నలతపడి వాంతి చేసుకుంటూ కనిపిస్తుంది. ఆమె నా స్థితిలో చూసిన రంగడు తల్లడిల్లి పోతాడు. ఆమెను జాగ్రత్తగా చాపపై చేర్చి, ఆమె తలను తన ఒడిలో చేర్చుకుని చెక్కిలి నిమురుచు కళ్ళనీళ్ళు పెట్టుకుంటాడు. ఏమి జరిగిందో తెలియక సమాధిగతుడైన యోగిలా నిశ్చలుడై పోతాడు. అతని చేతి స్పర్శకు కోలుకున్న గంగమ్మ 'మామ' అని పిలిచిన తర్వాత గాని అతని హృదయం కుదుటపడదు.

భార్య గంగమ్మను కంటిపాపలా చూసుకుంటాడు రంగడు, గంగమ్మను బరువైన, కష్టమైన పనులు చేయవద్దని చెప్తాడు. నిరంతర శ్రమజీవి. ప్రేమమూర్తి ఎదుటి వారి కష్టాన్ని తన కష్టంగా భావించే గొప్ప మనసున్న వ్యక్తి అయిన రంగడు ధనం విషయంలో నిరుపేద కావచ్చు కాని వ్యక్తిత్వం విషయంలో మాత్రం మహోన్నతమూర్తి రాయలసీమలో దుర్భర దారిద్ర్యం అనుభవిస్తున్న అమాయక బడుగు జీవులకు ప్రతీకగా, ప్రతినిధిగా ఈ పాత్రను తీర్చిదిద్దారు విద్వాన్ విశ్వం.

### (3) 'పెన్నేటి పాట' కావ్యమాధారంగా గంగమ్మ పాత్ర చిత్రణ.

జ) మనిషి స్వార్థానికి నాశనమవుతున్న ప్రకృతిని, అస్తవ్యస్తమవుతున్న సాంఘీక జీవనాన్ని, మంట కలిసిపోతున్న మానవీయ విలువలను – స్వచ్ఛమైన ప్రేమతో పెనవేసుకున్న ఒక నిరుపేద దంపతుల జీవిత చిత్రణ ఆధారంగా 'పెన్నేటి పాట' రూపంలో పాఠకుల కళ్ళముందు నిలిపారు విద్వాన్ విశ్వం. అనావృష్టి వల్ల ఒకనాటి రతనాల సీమ అయిన రాయలసీమ రాళ్ళసీమగా మారిపోయింది. దాంతో రాయలసీమలోని సామాన్య ప్రజల జీవితం దుర్భరమై పోయింది. ఆ ప్రజల దయనీయమైన కన్నీటి పాటను పెన్నేటి పాటగా వినిపించారు కవి.

ఈ కావ్యంలోని నిరుపేద జంట రంగన్న–గంగమ్మలు. గంగమ్మ పదహారేళ్ళ అమ్మాయి. మంచి మనసున్న రంగడికి తగిన ఇల్లాలు. నిండుదనం, చురుకుదనం రంగరించుకుని పుట్టిన బంగారు బొమ్మ. వెండి కడియాలు, చెవులకు కమ్మలు, తలలో మల్లెలు ఇదే ఆమె అలంకారాలు. "కొప్పులోనే గలదు గొప్పదనము" అంటారు కవి గంగమ్మను వర్ణన చేస్తూ. ఎన్ని తిప్పలు పడుతున్నా, ఇంట్లో ఉప్పు, పప్పు లేకపోయినా, ఎంత కష్టంలో ఉన్న పైకి పొంగనీయక గుంభనగా జీవించే గంభీరమూర్తి కనుకనే కవి "నిప్పు వంటి బ్రదుకు గొప్పనిచ్చె" అంటారు గంగమ్మను గూర్చి. చక్కని అందం, అందాన్ని మించిన సౌశీల్యం కలిగిన పడతి గంగమ్మ. గంగమ్మకు అమ్మా నాన్నలు లేరు. అక్కా బావలే ఆమెకు తల్లిదండ్రులై కన్నబిడ్డలాగా పెంచారు. పెంచి, పెద్దచేసి చదువు చెప్పించిన బావ యెద్దు పొడిచిన కారణాన చనిపోతాడు. గంగమ్మ అక్క దేవమ్మ దేవత లాంటి మనిషి. గడ్డిమోపులమ్మి గంగమ్మను పోషించింది. భర్త పోయి కొండంత దిగులు కమ్ముకుని ఉన్నప్పటికీ బయట పడక తాను

తినో తినక చెల్లెలికి మాత్రం ఏ కొదువ రానియ్యక ప్రేమతో పెంచుకొచ్చింది. ఎన్ని సమస్యలొచ్చినా వాటిని చెల్లెలి దాకా రానిచ్చేది కాదు. పేదరాలు కనుక వెదికి వెదికి మంచి మనసున్న రంగడికిచ్చి చెల్లెలి పెళ్ళి చేసింది.

రంగడు–గంగమ్మలది అన్యోన్య దాంపత్యం.

**"రంగడంటే ఒక్క గంగమ్మ మగడె –**
**గంగమ్మ అన నొక్క రంగన్న పడుచె**
**రంగన్న బ్రతుకెల్ల గంగమ్మ బ్రతుకె**
**గంగమ్మ మనసెల్ల రంగన్న మనసె"**

అంత పేదరికంలోనూ వారి మధ్య ఉన్న ప్రేమే వారికి ఆదరువు. పంచభక్ష్య పరమాన్నం. రంగడిని గంగన్నా అని, గంగమ్మని రంగమ్మా అని రకరకాలుగా పిలిచేవారు ఆ ఊరిజనాలు. అలా పిలవడం కంగారు వల్ల కాదు వారి అనురాగ దాంపత్యాన్ని చూసిన ప్రజలకి వారు ఇరువురు కాదు ఒక్కరే అని అనిపించడం వల్ల తమకు తెలియకుండానే ఆ విధంగా పిలిచేవారు.

రంగడు ఒకనాడు కొండ సమీపంలో ఉన్న అడవికి వెళ్ళి ఎర్రటెండలో ఏడు మూరల గడ్డిమోపు మోసుకువస్తాడు. మెడలు విరిగినంత పనవుతుంది. వీపు పొట్టలో చేరుకుంటుంది. సరైన తిండి తిప్పలు లేని కారణాన కళ్ళు లోతుకుపోతాయి. అతనినాస్థితిలో చూసిన గంగమ్మను కన్నీరాగదు. భర్త చూస్తాడని చెంగుతో కళ్ళొత్తుకుంటూ వేగంగా ఇంట్లోకి వెళ్తుంది గంగమ్మ. భర్త తనను బరువైన పనులు నెత్తికెత్తుకోవద్దని ఎంత చెప్పినా వినిపించుకోదు గంగమ్మ. భర్త పనికి వెళ్ళిన వెంటనే తాను కూడా వడ్లు దంచడానికో, అటుకులు దంచడానికో ఏదో ఒక పనికి వెళ్తూనే ఉంటుంది తప్ప ఖాళీగా కూర్చోదు. భర్త అంత కష్టపడుతుంటే చూస్తూ ఉండలేక తాను ఎంతో కొంత పని చేస్తూ అతనికి తోడు నీడగా నిలవాలని సంకల్పించాలంటుందామె. ఆమె మదిలో ఎన్నో కోర్కెలు, ఆశలు తాముండేందుకు చిన్న మట్టి మిద్దయినా కట్టుకోవాలని, బాకీలన్నీ తీర్చేసుకోవాలని, త్రుళ్ళింతలు, కేరింతలు కొట్టే బిడ్డని తన చేతులతో మామకిచ్చి 'సుల్తానువు నువ్వు' అని చెప్పాలని ఎన్నో ఆశలామెకి. కంటిపాపలా తనను చూసుకునే దేవుడి లాంటి భర్తని బాగా చూసుకోవాలనే తపనతో తనకు చేతనైన పని చేస్తూనే ఉంటుంది గంగమ్మ. నలతగా ఉన్నా కూడా లెక్కచేయక ఏదో ఒక పనికి వెళ్తూనే ఉంటుంది.

నిరంతరం విశ్రాంతి లేకుండా పనిచేయడం వల్ల ఒకనాడు జొన్న సంగటి తయారు చేస్తూ కళ్ళు మసక కమ్మి తూలి పొయ్యి మంటలో పడబోతుంది. మరొకనాడు గడ్డిమోపు మోసుకువచ్చి తడికకుమోపు ఆనిస్తూ పడిపోతుంది. ఒకనాడు విపరీతమైన కడుపునొప్పితో అల్లాడిపోతుంది. మనిషి చిన్న వయస్సుదే అయినప్పటికీ విశ్రాంతి లేక శ్రమించడం వల్ల నానాటికి బలహీనపడుతూ వచ్చింది. ఒకనాడు అంబటి వారింటికి అటుకులు దంచడానికి వెళ్తుంది. అటుకులు దంచడం మహాశ్రమతో కూడిన పని. మిట్ట మధ్యాహ్న సమయం, ఎండ నిప్పులు చెరుగుతుంది. దంచి దంచి చేతులు బొబ్బలెక్కాయి. పెనం మీద వేగే పేలగింజలా విలవిలలాడిపోయింది. అయినప్పటికీ పని మాత్రం ఆపలేదు. పంటి బిగువున ఓర్చుకుంటూ దంచుతూనే ఉంది. ప్రొద్దు వాలింది కాని పని మాత్రం పూర్తి కాలేదు. అటుకులు దంచే పని పూర్తయిన తర్వాత ఇంటికి వచ్చి బావి నీళ్ళ కోసం వెళ్ళిన గంగమ్మ కళ్ళు తిరిగి కింద పడిపోతుండగా చుట్టు ప్రక్కల వారు చూచి కింద పడిపోకుండా పట్టుకుంటారు. మొహం మీద నీళ్ళు చల్లుతారు. కాళ్ళు చేతులు చల్లబడిపోవడాన్ని చూసి పసుపు, రాగుల పిండి రుద్ది వేడి వేడిగా గంజి తాగించి మరల స్పృహలోకి వచ్చేంతవరకు విసనకర్రలతో విసిరి గంగమ్మ కళ్ళు తెరిచిన తర్వాత ఊరట చెందారు. వారిలో ఇద్దరాడవాళ్ళు

ఆమెను చెరోవైపు పట్టుకుని ఆమె ఇంటికి చేర్చారు. ప్రమిద, వత్తి ఆముదం, అగ్గిపుల్ల మొదలైన సామగ్రిని తలా ఒకటి తెచ్చి దీపం వెలిగించి ఈత చాప వేసి ఆమెను పడుకోబెట్టి వారి పనుల మీద వారు వెళ్ళిపోయారు.

గంగమ్మకు కళ్ళమ్మటనీళ్ళు కాలువ కట్టాయి. ఇంతలో తడిక చప్పుడు కాగా మామ వచ్చెనని దుఃఖాన్ని ఆపుకోబోయి పెద్దగా ఏడుస్తుంది. వచ్చిన పిల్లికూన ఆమె ఏడుపుకి బెదిరి మజ్జిగ ముంతను త్రోసి పారిపోయింది. అయ్యో మామకి మజ్జిగెట్లా అనుకుంటూ గబాల్న లేవబోయి చెవులు గింగురుపెట్టగా విసురున పోయి పసరు కక్కుకుంటుంది. గంగమ్మ ఇంతలో బారెడు బారెడు అంగలేసుకుంటూ వేగంగా గూటికి చేరిన రంగడు గంగమ్మ దుస్థితిని చూసి చెంగున చేతుల్లోకి చేర్చుకుని చాపవద్దకు చేర్చాడు. ఏమి జరిగిందో అర్థంకాక గంగమ్మను తన ఒడిలో చేర్చుకుని తల నిమురుతూ ఉలుకు పలుకు లేని బొమ్మలా ఉండిపోయాడు. అతని చేతి స్పర్శతో సేదతీరిన గంగమ్మ కొంతసేపటికి మామ అని పిలువగా అప్పటికి మనసు కుదుటపడిన రంగడు పిల్లా అంటూ కళ్ళల్లో నీరు కమ్ముచుండగా ప్రేమగా గంగమ్మను కౌగిట చేర్చుకుంటాడు.

గంగమ్మ అన్నివిధాల రంగడికి సరైన జోడిగా, తోడునీడగా నిలిచిన సహధర్మచారిణి, కోమల హృదయిని భర్త కష్టం చేసి తీసుకొచ్చిన వాటిని కదిలించకుండా ఏ రోజుకారోజు కష్టంచేసుకొని వచ్చిన వాటితో ఇల్లు నెట్టుకు వచ్చే జాగ్రత్తయిన ఇల్లాలు. ప్రేమమయి 'పెన్నేటి పాట' కావ్యంలో విద్వాన్ విశ్వం గారు గంగమ్మ పాత్రను తీర్చిదిద్దిన తీరు అపూర్వం.

### 4. 'పెన్నేటి పాట' కావ్యమాధారంగా రంగడు, గంగమ్మల దాంపత్య జీవనాన్ని వర్ణించండి?

జ) మానవుని అత్యాశకు నాశనమవుతున్న ప్రకృతిని, అస్తవ్యస్తమవుతున్న సామాజిక జీవనాన్ని, మంటకలిసిపోతున్న మానవీయ విలువలకు ఒక నిరుపేద జంట జీవిత చిత్రణ ఆధారంగా పెన్నేటి పాట రూపంలో కళ్ళముందుకు తెచ్చారు విద్వాన్ విశ్వం. అనావృష్టి వల్ల ఒకనాటి రతనాల సీమ అయిన రాయలసీమ రాళ్ళ సీమగా మారిపోయింది. అందువల్ల రాయలసీమలోని సామాన్య ప్రజల జీవితం దుర్భరమైపోయింది. ఆ ప్రజల దయనీయమైన కన్నీటి గాథను పెన్నేటి పాటగా వినిపించారు విద్వాన్ విశ్వం. ఇది రాయలసీమ ప్రాంతపు హృదయఘోష.

ఈ కావ్యంలోని నిరుపేద జంట రంగడు – గంగమ్మలు. వీరిది అన్యోన్య దాంపత్యం. ప్రేమ ఉంటే లేమి ఏమి చెయ్యగలదను మాటకు నిదర్శనంగా నిలిచిన జంట.

వీరి అన్యోన్య దాంపత్యాన్ని వర్ణిస్తూ

**రంగడంటే ఒక్క గంగమ్మ మగడె**
**గంగమ్మ అననొక్క రంగన్న పడుచె**
**రంగన్న బ్రతుకెల్ల గంగమ్మ బ్రతుకె**
**గంగమ్మ మనసెల్ల రంగన్న మనసె**

అంటారు కవి. రెక్కాడితే గాని డొక్కాడని బతుకులు వారివి. అయితే అంత పేదరికంలోనూ వారి మధ్య ఉన్నప్రేమే వారికి ఆదరువు, పంచభక్ష పరమాన్నాలూనూ.

ఒకరికొకరుగా నిలిచిన ఆ జంటను చూసి ఆ గ్రామ జనులు కూడా మురిసిపోయేవారు. రంగడిని గంగన్నా అని, గంగమ్మని రంగమ్మా అని రకరకాలుగా పిలిచేవారు ఆ ఊరి జనులు. అలా పిలవడం కంగారు వల్ల కాదు. వారి అనురాగ

దాంపత్యాన్ని చూసిన ప్రజలకి వారు ఇరువురు ఒక్కరే అని అనిపించడం చేత తమకు తెలియకుండానే వాళ్ళు ఆ విధంగా పిలిచేవారు.

వారిరువును నిరంతర శ్రమజీవులు గంగమ్మను కంటిపాపవలె చూసుకోవాలనే తపన రంగడిది. రంగడు తమ భుక్తి కోసం పడే కష్టాన్ని చూడలేక తనకు చేతనైన పనులు చేసి అతనికి తోడునీడగా నిలవాలనే తపన గంగమ్మది. కోడి కూతతో లేచి ఊరు మాటు మణిగే వరకు విరామమెరుగక శ్రమించే రంగడెప్పుడూ నీకోసమే ఇంత కష్టపడుతున్నానని మాటవరసకైనా అనడు. నీ కోసమే నేను బ్రతుకుతున్నానని గంగమ్మ అనదు. అతను పని మీద బయటికెళ్ళగానే వడ్లు దంచే పనికో, అటుకులు దంచే పనికో వెళ్తుంది గంగమ్మ. వేడి నీళ్ళకు చన్నీళ్ళు తొడన్నట్లు అతనికి ఆసరాగా నిలవాలని, మామను బాగా చూసుకోవాలనే ఆశ గంగమ్మది.

తమ భుక్తి కోసం అతను పడుతున్న అవస్థలు చూస్తే గంగమ్మకు కన్నీళ్ళాగవు. భర్త బాధపడతాని తన కన్నీళ్ళను అతని కంట పడనివ్వదు. తనకు చేతనైన పని పూర్తి చేసుకు వచ్చి ఫలితం వాళ్ళిచ్చిన వడ్లను దంచి, అన్నం వండి, చింతకాయ పచ్చడి చేసి భర్త వచ్చే సమయానికి తయారుగా ఉంచుతుంది. పొంత నీళ్ళు తోడి నిమిరి నిమిరి స్నానం చేయిస్తుంది. తన ఇల్లాలి చేతిస్పర్శ వేయి సంజీవనులగా మారి తన నొప్పులు, గాయాలు పోయినట్లనిపిస్తుంది రంగడికి.

అతని అడుగుల చప్పుడు వినబడితే చాలు ఆమె మొహంలోకి గొప్ప వెలుగొస్తుంది. అతని మాట వినబడితే ఆమె కన్నులలో వసంతాలు విరబూస్తాయి. మూడు నాలుగు మాటలే మూడు వేల ప్రేమ గీతాలు అంటారు కవి.

**"చూపులతోనె వలపుల**
**రూపు దిద్దుకొనుచు**
**ఆ పడంతి బువ్వ బెట్టె**
**దాపున గూర్చొనుచు"**

అని వారి అన్యోన్య అనురాగాన్ని వర్ణిస్తారు కవి. ఇద్దరి మధ్య ఎట్టి దాపరికాలుండవు. కష్టమైనా, సుఖమైన చెప్పుకుంటారు. ఏదో పని మీద వెళ్ళినట్లు వెళ్ళి పండగకో పబ్బానికో చీర కొనుక్కొచ్చిస్తాడు రంగడు. తాను చేసే కష్టం తమ భుక్తికి సరిపోతుందని గంగమ్మను ఎక్కువ కష్టపడవద్దని చెప్తాడు రంగడు. తన పాలిట దేవుడి లాంటి మామ నిరంతరం చెమటోడ్చి పని చేయడాన్ని చూసి సహింపలేక ఒక్కరోజు కూడా విడిచిపెట్టకుండా పని చేస్తూనే ఉంటుంది గంగమ్మ.

ఒకనాడు అంబటి వారింటికి అటుకులు దంచడానికి వెళ్ళింది గంగమ్మ. అటుకులు దంచడం మహా శ్రమతో కూడిన పని. మిట్ట మధ్యాహ్న సమయం. ఎండ నిప్పులు చెరుగుతుంది, దంచి దంచి చేతులు బొబ్బలెక్కాయి. పెనం మీద వేగే పేలగింజలా విలవిలలాడిపోయింది గంగమ్మ. అయినా పని మాత్రం ఆపలేదు. బాధ పంటి బిగువున ఓర్చుకుంటూ దంచుతూనే ఉంది. ప్రొద్దు వాలింది కాని పని పూర్తి కాలేదు. అటుకులు దంచే పని పూర్తయిన తర్వాత ఇంటికి వచ్చి బావి నీళ్ళకోసం వెళ్ళిన గంగమ్మ కళ్ళు తిరిగి కింద పడిపోతుండగా చుట్టుప్రక్కల వాళ్ళు చూసి కిందపడకుండా పట్టుకుంటారు. మొహం మీద నీళ్ళు చల్లుతారు. కాళ్ళు చేతులు చల్లబడిపోవడాన్ని చూసి పసుపు, రాగుల పిండి రుద్ది, వేడి వేడిగా గంజి తాగించి మరల స్పృహలోకి వచ్చేంత వరకు విసిన కర్రలతో విసిరి గంగమ్మ కళ్ళు తెరిచిన తర్వాత ఊరట చెందారు. వారిలో ఇద్దరాడవాళ్ళూ ఆమెను చెరోవైపు పట్టుకుని ఇంటికి చేర్చారు. దీపం వెలిగించి, ఈత చాప వేసి పడకోబెట్టి వెళ్ళిపోయారు.

గంగమ్మకు కన్నీళ్ళు కాలవ కట్టాయి. ఇంతలో తడికె చప్పుడు కాగా మామ వచ్చెనని దుఃఖాన్ని ఆపుకోబోయి పెద్దగా ఏడుస్తుంది. వచ్చిన పిల్లికూన ఆమె ఏడుపుకి బెదిరిపోయి మజ్జిగ ముంతను త్రోసి పారిపోయింది. అయ్యో! మామకి మజ్జిగెట్లా అనుకుంటూ గబాల్న లేవబోయిన గంగమ్మ వంట్లో సత్తువ లేని కారణం చేత వట్టిమనిషి కూడా కాకపోవడంచేత, ఆ కారణం చేత, తూలి పడబోయి చెవులు గింగురు పెట్టగా విసురున పోయి పసరు కక్కుకుంటుంది. ఇంతలో బారెడు బారెడు అంగలేసుకుంటూ వేగంగా గూటికి చేరిన రంగడు గంగమ్మ దుస్థితిని చూసి ఏమి జరిగిందో అర్థంకాక ఖిన్నుడయ్యాడు.

గంగమ్మను తన ఒడిలో చేర్చుకుని తలనిమురుతూ ఉలుకు పలుకు లేని బొమ్మలా ఉండిపోయాడు. అతని చేతి స్పర్శతో సేద తీరిన గంగమ్మ కొంతసేపటికి తెప్పరిల్లుకుని 'మమ' అని పిలువగా, ప్రాణం తిరిగొచ్చినట్లయింది రంగడుకి. మనసు కుదుట పడిన రంగడు 'పిల్లా' అంటూ కళ్ళల్లో నీరు కమ్ముచుండగా ప్రేమగా గంగమ్మను కౌగిట చేర్చుకున్నాడు.

విరామమెరుగక నిరంతరం బండెడు చాకిరీ చేస్తూనే ఉన్నా కడుపునిండా కూడు కూడా తినలేని ఆ బడుగుజీవుల దుర్భర స్థితికి పాఠకుల హృదయాలు కరిగి నీరైపోతాయి. బండెడు చాకిరీ చేయించుకుని కాసిని వడ్లో, ముంత మజ్జిగో లేదంటే కొద్దిగా పుల్లగూరో విదిలించే ధనవంతుల దుర్మార్గానికి కవికే కాదు పాఠకులకు కూడా గుండెలు మండిపోతాయి. ప్రతిరోజు వళ్ళు హూనమయ్యేలా పనిచేస్తూ కూడా కడుపునిండా తిండి లేక ప్రాణాలు కళ్ళల్లో పెట్టుకుని బతుకుతున్న ఆ నిరుపేద జంట, పరిస్థితికి ఏ పాఠకుడి హృదయం చలించకుండా ఉండగలదు. అదేవిధంగా ఒకరికొకరుగా బ్రతికే వారి అన్యోన్య అనురాగాన్ని చూసి ముచ్చట పడని పాఠకులు కూడా ఉండరు. ఈ విధంగా రంగడు-గంగమ్మల కుటుంబ జీవన చిత్రణ ఆధారంగా రాయలసీమ దయనీయ పరిస్థితులను వివరించారు విద్వాన్ విశ్వం.

**- డా॥ కె. సుజాత**

పాఠం - 10

# వజ్రాయుధం

## -ఆవంత్స సోమసుందర్

### 10.1. కవి పరిచయము:

ఆవంత్స సోమసుందర్ ప్రముఖ అభ్యుదయ కవి, రచయిత, విమర్శకుడు. ఈయన తూర్పుగోదావరి జిల్లా అన్నవరం సమీపంలో ఉన్న శంఖవరం గ్రామంలో కాళ్ళూరి సూర్యప్రకాశరావు, వెంకాయమ్మ దంపతులకు నవంబర్ 18, 1924 న ద్వితీయ సంతానంగా జన్మించారు. తన పినతల్లి ఆవంత్స వెంకాయమ్మకు సంతానం లేకపోవటం వలన చిన్నతనంలోనే సోమసుందర్ వారింటికి దత్తతకు వెళ్ళాడు. ఆవిధంగా కాళ్ళూరి అనే ఇంటి పేరు ఆవంత్సగా మారింది.

సోమసుందర్ దత్తత తల్లిదండ్రులు ఆయనకు పదేళ్ళ వయసుండగానే పరమపదించారు. చిన్నతనం నుంచి జులాయిలా తిరుగుతూ వ్యసనాలకు బానిస అయినప్పటికీ చిన్నారి సోమసుందర్ మనసుపై ఆ పుణ్య దంపతులు వేసిన సాహిత్య ముద్ర మాత్రం అలాగే నిలిచిపోయింది. ఈయన ప్రాథమిక విద్యాభ్యాసం అంతా పిఠాపురంలోనే జరిగింది. 1943వ సంవత్సరంలో కాకినాడ పి.ఆర్. కళాశాలలో చేరి, ఉన్నత విద్యను అభ్యసించారు.

**10.1.1. సాహితీ ప్రయాణం:** సోమసుందర్ నాలుగో ఫారం చదువుతున్న రోజుల్లో పద్య ప్రక్రియపై మోజు కలిగి, వార్తా పత్రికలను క్షుణ్ణంగా అధ్యయనం చేశారు. ఈ ప్రక్రియలో ప్రతీ రోజూ అభ్యాసం కొరకు తాను వ్రాసిన వివిధ పద్యాలను మిత్రులకు, ఉపాధ్యాయులకు చూపేవారు. ఆవంత్స సోమసుందర్ తన జీవిత కాలంలో 77 పుస్తకాల వరకు రచించారు.

**10.1.2. వజ్రాయుధం:** నిజాం వ్యతిరేక పోరాటానికి మద్దతుగా వ్రాసిన కవితా సంకలనం. 1946 అక్టోబర్ 26న దొడ్డి కొమరయ్య మరణంపై వ్రాసిన ఖబడ్దార్ అనే కవితతో ఇది మొదలవుతుంది. ఈ పుస్తకాన్ని బ్రిటిష్ ప్రభుత్వం నిషేధించింది. 1956వ సంవత్సరంలో నీలం సంజీవరెడ్డి ప్రభుత్వం నిషేధాన్ని ఎత్తివేసింది.

**10.1.3. కాహళి:** ఇవి ఆంధ్రరాష్ట్ర ఉద్యమ సమయంలో వ్రాసిన కవితలు. అమరజీవి పొట్టి శ్రీరాములు ఉద్యమిస్తున్న సమయంలో వారానికి ఒకటి చొప్పున 'జ్వాల' అనే వారపత్రికలో ప్రచురించబడ్డాయి. 1953వ సంవత్సరంలో పుస్తక రూపంగా వచ్చాయి.

**10.1.4. గోదావరి జల ప్రళయం:** 1953వ సంవత్సరంలో వచ్చిన గోదావరి వరదల సందర్భంలో సోమసుందర్ రాజమండ్రి, అమలాపురం, కపిలేశ్వరపురం వంటి ప్రాంతాలను సందర్శించి గోదావరి వరద బీభత్సాన్ని కరుణ రసాత్మకంగా కవిత్వీకరించారు.

**10.1.5. రక్తాక్షి:** ఫ్యూడల్ చట్రంలో సమాజం ఎదుర్కొన్న నిరంకుశత్వాలు, అమానుషత్వాలను కథా వస్తువుగా తీసుకొని చేసిన చందోబద్ధ కావ్యం ఇది. ఈ కావ్య ప్రత్యేకత ఏమిటంటే ఆధునిక కాలంలో విస్మరించబడ్డ శ్రీవృత్తం, వనితా వృత్తం వంటి ప్రాచీన ఛందస్సులను తీసుకొని రచించడం.

**10.1.6. మేఘరంజిని:** 1954వ సంవత్సరంలో వెలువడ్డ కథాకావ్యం. దీర్ఘ వచన పద్యం. మొత్తం ఆరు అధ్యాయాలు ఉన్నాయి.

**10.1.7. సోమరసం-సుందరకాండ:** ఇది తాత్విక చింతనామయ కావ్యం. ఏమిటీ లోకం? ఎందుకీ బాధలు? వంటి ప్రశ్నలు, వాటికి కవి కనుగొన్న సమాధానాలతో ఈ కావ్యం రచింపబడింది.

**10.1.8. మిణుగురులు:** అద్భుతమైన పదచిత్రాలతో కూడిన ఆధునిక కవితా సంకలనం.

**10.1.9. అనల కిరీటం:** 1975వ సంవత్సరంలో వెలువడిన కవితా సంపుటి.

**10.1.10. వెన్నెలలో కోనసీమ:** 1977వ సంవత్సరంలో అమలాపురంలో ఆవిష్కరించబడిన గీత సంపుటి. సంగీతానికి అనుకూలంగా ఉండే గీతాల రచన. ఈ గీతాలలో చాలావాటిని రేడియోలలో పాటలుగా పాడారు.

**10.1.11. రాలిన ముత్యాలు:** మినీ కవితల ఉద్యమానికి ముందే లఘు కవితల పేరిట వ్రాసినటువంటి చిన్ని చిన్ని కవితలు.

**10.1.12. మా ఊరు మారింది:** సోమసుందర్ ఎమర్జన్సీని సమర్ధించారు. ఈ విషయం నార్ల వెంకటేశ్వరరావును కలవరపరచి, ఈయనతో భేటీ అయి అయిదురోజుల పాటు చర్చించగా, ఈయన ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా తన భావాలను మార్చుకొని, ఒక ప్రకటన ఇవ్వడం జరిగింది. ఆ భావ పరిణామక్రమంలో వ్రాసిన 7 భాగాల కావ్యమే మా ఊరు మారింది.

**10.1.13. ఆగతనికి శుభారంభం:** వచన కవితలు

**10.1.14. బృహత్కావ్యాలు (నాలుగు సుదీర్ఘ కవితలు):** నాలుగు దీర్ఘకావ్యాలు. సుమారు 300 పేజీల పుస్తకం. ఈ పుస్తకంలో అక్షయ తరంగిణి, కాలం వీలునామా, ముక్తచ్ఛాయ, అరచే లోయలు అనే నాలుగు దీర్ఘ కవితలు ఉన్నాయి. దీనిలో ముక్తఛ్ఛాయలో మన నుండి మననీడ విడిపోవడం, అసలు మన నీడ అంటే ఏమిటి అనే విషయాలపై తాత్విక, భౌతిక చింతనలతో కూడిన భావాలుంటాయి.

**10.1.15. ఆధునిక కవిత్వం:** వ్యాసావళి

**10.1.16. క్షితిజ రేఖలు:** అయిదు దీర్ఘకావ్యాలు

**10.1.17. మార్క్సిజం – కవిత్వం:** వ్యాసావళి

**10.1.18. ఒక్క కొండలో వేయి శిల్పాలు:** 120 పేజీలు దీర్ఘ కవితల సంకలనం.

**10.1.19. ఆంగ్ల సీమలో ఆమని వీణలు (యాత్రా సాహిత్యం):** 1983వ సంవత్సరంలో ఈయన ఆంగ్ల సీమలో చేసిన ప్రయాణ విశేషాలతో కూడిన ట్రావెలాగ్.

**10.1.20. గంధ మాధవం:** రచనా కాలం 1995/96. హనుమంతుడు సీతను అన్వేషించటానికి వెళ్ళినపుడు మధ్యలో మకాం చేసిన పర్వతం పేరు గంధమాధవం. జీవితం యొక్క అన్వేషణకు గ్రంథాలయం ప్రాతిపదిక అనే భావనతో వ్రాసిన దీర్ఘకావ్యం.

**10.1.21. చేతావని:** చేతావని అంటే హెచ్చరిక. ఇది 1994వ సంవత్సరంలో వెలువడింది. బాబ్రి మసీదు కూల్చినపుడు వ్రాసిన దీర్ఘకావ్యం.

**10.1.22 దోనా పాలా:-** ఇది ఒక ప్రదేశం పేరు. గోవా ప్రయాణంలో వ్రాసిన కవితలు.

**10.1.23. రక్తరేఖ:** బాబ్రి మసీదు కూలగొట్టిన తరువాత ముంబాయిలో మతకలహాలు చెలరేగాయి. ఇలాంటి మత కలహాలు పాకిస్తాను విడిపోయినప్పుడు కూడా జరగలేదు. వాటికి స్పందిస్తూ వ్రాసిననటువంటి దీర్ఘ కవితా సంపుటి.

**10.1.24. హృదయంలో హిరోషిమా:** 1997వ సంవత్సరంలో హిరోషిమా ఉదంతాన్ని స్మరించుకొంటూ వ్రాసిన కవితలు.

**10.1.25. ధూపచ్ఛాయ:** నక్సలైట్లు రైలు పెట్టిని కాల్చివేస్తే దాన్ని నేపథ్యంగా తీసుకొని వ్రాసిన దీర్ఘకావ్యం.

**10.1.26. జీవన లిపి:** 120 పేజీల సంపూర్ణ కావ్యం. మానవుడు విప్లవానికై జరిపే కృషి అనే అంశంపై వ్రాసిన దీర్ఘ కావ్యం.

**10.1.29. సీకింగ్ మై బ్రోకెన్ వింగ్:** దేశంలో వామపక్ష అతివాద పార్టీలన్ని విడిపోతున్నాయి. దాన్ని సింబలైజ్ చేస్తూ అన్వేషాత్మకమైన దీర్ఘ కవిత.

**10.1.30. సోమసుందర్ కథలు:** 1984వ సంవత్సరంలో ప్రచురించబడిన బానిసల దేశం వగైరా కథలు.

**10.1.31. బుద్ధదేవ్ బోస్:** బుద్ధదేవ్ బోస్ అనే ఆయన ప్రముఖ బెంగాలీ కవి. వీరి మోనోగ్రాఫ్, కొన్ని కవితల యొక్క అనువాదాలతో కూడిన రచన.

**10.1.32. లియోనార్డో దావిన్సీ:** డావిన్సీ జీవిత చరిత్ర. ఆయనను ఒక సంపూర్ణ మానవునిగా దర్శింపచేసే పుస్తకం.

**10.1.33. హంసధ్వని:** భారతీయ ఆధునిక సంగీతకారుల జీవిత చిత్రణలు.

**10.1.34. ఖాజీ నజ్రుల్ ఇస్లాం:** ఖాజీ, బెంగాలీ విప్లవ కవి. వీరి కవిత్వాన్ని, జీవితాన్ని ఈ పుస్తకం ద్వారా తెలుగు పాఠకులకు పరిచయం చేశారు.

**10.1.35. కాళిదాసు రామ కథ:** రఘువంశంలో కాళిదాసు చెప్పిన రామకథకు, వాల్మీకి రామకథకు గల సునిశితమైన వ్యత్యాసాలను తెలుపుతూ వ్రాసిన విశ్లేషణాత్మక పుస్తకం.

**10.1.36. రుధిర జ్యోతిర్దర్శనం:** శ్రీరంగం నారాయణబాబు కవిత్వం లోతుపాతులను క్షుణ్ణంగా అధ్యయనం చేసి చూపించిన గొప్ప విమర్శనాత్మక గ్రంథం. నారాయణ బాబు వ్రాసిన రుధిర జ్యోతి కావ్య సౌందర్యాన్ని ఈ పుస్తకం ద్వారా తెలుగు ప్రజలకు పరిచయం చేశారు.

**10.1.37. జాతికి జ్ఞాన నేత్రం:** కొడవటిగంటి కుటుంబరావు రచనలపై వ్రాసిన విశ్లేషణాత్మక గ్రంథం.

**10.1.38. కవిత్వం కాలాతీత కాంతిరేఖ:** ఆధునిక కవిత్వానికి ఉండవలసిన లక్షణాలపై సూత్రీకరణ చేస్తూ వ్రాసిన విశ్లేషణాత్మకమైన గ్రంథం.

**10.1.39. ఆధునిక కావ్య ప్రకాళిక:** ఇతరులు పుస్తకాలకు వ్రాసిన పీఠికలలో కొన్నింటిని ఏర్చి కూర్చి చేసిన సంకలనం.

**10.1.40. అమృత వర్షిణి:** తిలక్ కవిత్వంపై వ్రాసిన విమర్శనాత్మక వ్యాసావళి.

**10.1.41. సాహిత్యంలో సంశయ కల్లోలం:** వి.ర.సం. ఆవిర్భవించిన కొత్తలో విజయనగరం నుంచి చిత్తూరు దాకా ప్రయాణించి సభలు జరిపి, ఆ సభల్లో పలువురు వెలిబుచ్చిన సందేహాలకు ఇచ్చిన సమాధానాల సంకలనం.

**10.1.42. అక్షర సుమార్చన:** తిక్కన, వేమన ఇత్యాదులపై వ్రాసిన వ్యాసావళి. వావిలాల గోపాల కృష్ణయ్యకు అంకితమీయబడింది.

**10.1.43. పురిపండా ఎత్తిన పులి పంజా:** పురిపండ అప్పలస్వామిపై వ్రాసిన వ్యాస సంపుటి.

**10.1.44. నూరు శరత్తులు:** 1990వ సంవత్సరానికి నూరేళ్ళు నిండిన కృష్ణశాస్త్రి, విశ్వనాధ మొదలైనవారిపై వ్రాసిన వ్యాసావళి.

**10.1.45. ఆ తరం కవితా తరంగాలు:** భావకవుల తరువాత వచ్చిన పఠాభి, పాలగుమ్మి పద్మరాజు వంటి వారిపై వ్రాసిన వ్యాసావళి.

**10.1.46. నారాయణ చక్రం:** డా. సి. నారాయణరెడ్డి కవిత్వంపై విశ్లేషణాత్మకంగా వ్రాసిన గ్రంథం.

**10.1.47. గోపుర దీపాలు:** చలం పురూరవపై వ్రాసిన పుస్తకం.

**10.1.48. కృష్ణ శాస్త్రి కవితాత్మ:** కృష్ణశాస్త్రి కవిత్వంపై సమగ్ర విమర్శ.

**10.1.49. గురజాడ గురుత్వాకర్షణ:** కృష్ణశాస్త్రి కవిత్వంపై సమగ్ర విమర్శ.

**10.1.50. శరచ్చంద్రిక:** శ్రీ శ్రీ నుంచి కుందుర్తి ఆంజనేయులు వరకూ ఆధునిక కవులపై వ్రాసిన పరిశీలనాత్మక వ్యాసావళి.

**10.1.51. ఉర్దూ సాహిత్యంలో ఉన్నత శిఖరాలు:** కబీర్ నుంచి ఖైఫీ అహ్మద్ వరకు గల గొప్ప ఉర్దూ కవులను పరిచయం చేస్తూ వ్రాసిన పుస్తకం.

**10.1.52. శేషేంద్ర జాలం:** శేషేంద్ర కవిత్వంపై వ్రాసిన వ్యాసావళి.

**10.1.53. అగ్నివీణ ఆలాపించిన అణుసంగీతం:** అనిసెట్టి సుబ్బారావు కవిత్వంపై వ్రాసిన విశ్లేషణాత్మక పుస్తకం.

**10.1.54. కవితా కల్పవల్లి:** ఆధునిక కవిత్వం-విమర్శనాత్మక విశ్లేషణ.

**10.1.55. ఆగామి శతాబ్దానికి ఆహ్వానం:** వ్యాసాలు.

**చరమ దశాబ్ది-కవితా రసాబ్ది:** 1990వ సంవత్సరాలలో కవిత్వంపై వచ్చిన వ్యాసాలు.

## 10.2. పురస్కారాలు:

1) సోమసుందర్ 1979వ సంవత్సరంలో అత్యంత ప్రతిష్ఠాకరమైన సోవియట్ - నెహ్రూ బహుమతి పొందారు.

2) రాజ్యలక్ష్మీ ఫౌండేషన్ అవార్డు

3) పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ప్రతిభా పురస్కారం, గౌరవ డాక్టరేట్

4) 2008 సంవత్సరానికి గాను ఎన్టీఆర్ జాతీయ పురస్కారాన్ని అందుకున్నారు.

5) 1986వ సంవత్సరంలో అ.ర.సం. గుంటూరు శాఖ వారిచే కొండేపూడి సాహితీ సత్కారం అందుకున్నారు.

ఇలా తెలుగు భాషకు, సాహిత్యానికి, సమాజానికి విశేష సేవలందించిన సోమసుందర్ గారు 2016, ఆగష్టు 12వ తేదీన కాకినాడలో మరణించారు.

## 10.3. వజ్రాయుధం కావ్యం-నేపథ్యం:

**"తన చరిత్ర తనే పఠించి**
**ఫక్కున నవ్వింది ధరణి**
**తన గాథను తనే స్మరించి**
**భోరున ఏడ్చింది ధరణి"**

అనే అవగాహనతో పాటు.....

**"వృద్ధ జగతి సమాధిపై సమధర్మం ప్రభవించును**
**నిద్దుర చీకటి వెలుపల వేకువ మెలుకువ పుట్టును"**

అన్న చారిత్రక ఆశావాదంతో 1949 మార్చి మాసంలో వెలువడిన అభ్యుదయ కావ్యం 'వజ్రాయుధం'. ఆవంత్స సోమసుందర్ రచించిన ఈ కావ్యం 'కళాకేళి' ప్రచురణలు' ద్వారా ప్రచురింపబడింది. నైజాం పైశాచిక నిర్బంధాల నుంచి తెలుగు జాతిని విముక్తం చేయడానికి అకుంఠిత దీక్షతో పోరాడి తమ సర్వస్వాన్ని అర్పించిన అమర వీరులందరికీ తెలంగాణా పోరాట జ్యోతిగా భాసించిన శ్రామిక జన మహానాయకులు శ్రీరావి నారాయణ రెడ్డి గారికి హృదయ నీరాజనంగా ఈ కృతిని సోమసుందర్ అంకితమిచ్చారు. నిజాం దురాగతాలకు బలైపోతున్న సాటి తెలుగు వారి వేదనను అక్షరబద్ధం చేసి నిజాం గుండెలలో ఈటెలుగా దించిన కావ్యం ఇది. నాటి తెలంగాణా సాయుధ రైతాంగ పోరాటమే ఈ కావ్యానికి నేపథ్యం.

**ఈ కావ్యంలో మూడు భాగాలున్నాయి. అవి:**

1) సమధర్మం, 2) బానిసల దండయాత్ర 3) మలయా ప్రభంజనం.

నిజాం రాజరిక వ్యవస్థపై ధర్మాగ్రహం, పెట్టుబడిదారీ అసమసమాజ చిత్రణ, సమసమాజ నిర్మాణ ఆకాంక్ష ఈ కావ్య వస్తువులు.

**"యుగ ధర్మం చైతన్యం**
**జనహృదయం పోరాటం"**

అని నిర్వచిస్తూ......

**"ఉన్నదొక్క జీవితమే**
**మానవునిగ వీరునిగా బ్రతుకుము**
**నరుడా! చరిత్ర నీ కోసం ప్రసవ బాధ పడుతున్నది.**
**నీ త్యాగం వృధా కాదు**
**నీ త్యాగం వృధా కాదు"**

అన్న ఉత్తేజకరమైన సందేశాన్ని అందిస్తున్న కావ్యం "వజ్రాయుధం".

## 10.4. వజ్రాయుధం కావ్యం సారాంశం:

**సమ ధర్మం:**

అభ్యుదయ సాహిత్య చరిత్రలో 'వజ్రాయుధం' మరో ఉదయ బింబం. సోమసుందర్ కృతుల్లో ప్రముఖమైందీ, ప్రత్యేకంగా పేర్కొనదగిందీ, ఇతని అభ్యుదయ వ్యక్తిత్వాన్ని వెలుగులోకి తెచ్చింది. ఈ కావ్యం 'సమధర్మం' కవితతో మొదలవుతుంది.

**"ధరణీచక్రం గిరగిర**
**పరిభ్రమిస్తోందదిగో!**
**నిమ్నోన్నతముల జగతికి**
**ఉద్వాసన చదువుతోంది".**

అంటూ సాగే 'సమధర్మం' వజ్రాయుధం లక్ష్యాన్ని నిర్దేశించే గేయం. ఇందులో మౌలికమైన సమస్య పురాతనమైన

శిథిలమైన వ్యవస్థను రూపుమాపి నూతనమైన అభ్యుదయాత్మకమైన వ్యవస్థను నెలకొల్పడం. ఈ మార్పు ఇరుశక్తుల పరస్పర సంఘర్షణలో జనించే ఆవేశం, ఆవేదన, ఉద్దేశం ఈ రచనలో ఉత్కటమైన స్థాయి నంది వైప్లవ్య రూపాన్ని పొందాయి.

అశేష ప్రజా ప్రయోజనం కోసం, నియంత్రితమైన సమసమాజాన్ని రూపొందించే ధోరణిలో అచంచల విశ్వాసంతో క్రొత్త వ్యవస్థను నిర్మించే ప్రయత్నం జరుగుతున్న సమయం అది. పాలితులు పాలకుల మధ్య, పీడితుల పీడకుల మధ్య చెలరేగే తిరుగుబాటుతో సంఘర్షణలోని తీవ్రదశ చైతన్యాత్మకమైన యుగధర్మంగా భావితమైంది.

**"పగిలిన నిశ్శబ్దం వలె**
**పగ[త్రా]చులు లేచినవో!"**

ఇంతకాలం నోరులేక పడి ఉన్న ప్రజల మనస్సు తాడితమై విజృంభించి వెంటాడే స్థితిని వ్యంజ్యమానం చేసే పై పంక్తులు సోమసుందర్ కవితాత్మను ప్రఫుల్లం చేసేవి. "వృద్ధ జగతి సమాధిపై సమధర్మం ప్రభవింప" జేసే ఆశారూపానికి క్రియాశక్తిగా విప్లవం రూపొందింది. చరిత్రగతిలో వచ్చిన పరివర్తనా వేగంతో సంఘర్షణ పర్యవసానంగా నిమ్నోన్నతాలు నశించి, పరాధీనత్వం, పురాలోకం, కృతకత్వం, వక్రగతి స్థానంలో స్వాధీనత్వం, నవలోకం, సహజత్వం, ఋజుగతి అవతరించి క్రమంగా అవనిపై "నిన్న నేడుల కృషియే రేపై" సమధర్మం ప్రభవిస్తుందన్న ఆశాకేతనం ఆవిష్కృతమైంది.

**"భువి యొక విప్లవమూర్తై**
**నిలువు కాళ్ళ నిలుస్తోంది**
**అరుణారుణ పతాకమై**
**ఆకాశం మెరుస్తోంది"**

వైప్లవ శక్తులు విజృంభించి, జడమూ, స్తబ్ధమూ అయిన సమాజాన్ని చైతన్యంతో జ్వలింపజేసి "భువి సమస్త సంపదలకు" సామాన్య మానవులను 'అధినాదులు' గా నెలకొల్పే ప్రయత్నంతో,

**"నిద్దుర చీకటి వెలుపల**
**వేకువ మెలకువ పుట్టును**
**ఇదిగో విప్లవ దుందుభి**
**వినిపించిన సందేశం"**

ఆలోచనా రూపంలో వికసించిన అభ్యుదయ భావన స్ఫుటంగా ప్రతీతమయ్యే లయాత్మక పదవిన్యాసంతో చీకటి నుండి ఉదయమై భవిష్యత్తు వెలుగుతూ రూపొందిన కాంతి చిత్రం 'సమధర్మం'.

వజ్రాయుధం కావ్యంలో సమధర్మంతోపాటు పేర్కొదగిన మరో కవిత 'ఖరార్ నామా'.

**"జన్మెత్తిన మానవునకు**
**జీవితమే పరమధనం**
**అయి అది ఒక మారే**
**అతని కొసగబడిన వరం"**

సంఘంలో పురుగులవలె పుట్టిపెరిగి, అస్తిత్వమూ, ప్రయోజనమూ ఎరుగకుండా తన చరిత్ర చెరిగిపోయే మానవుడిక ఉండబోడని కవి విశ్వాసం. భూతకాలపు మర్యాదలనే బూజును దులిపి భవిష్యత్తు కోసం తిరుగుబాటు తత్త్వాన్ని ప్రకాశమానం చేస్తుంది. దోపిడి, పిరికితనం, బీదరికం నుండి విముక్తమైన జీవితంలో ఆనందం, శాంతి కవి ఆశించే ఉదాత్త లక్ష్యాలు. కాలం నిల్వదు. జీవితం ఆగదు. గతం తిరిగిరాదు. అందువల్ల జీవితంలో ప్రతిక్షణం ఎంతో విలువైందిగా భావితమైంది. మరోజన్మ, పరలోకం మొదలైన మూఢ విశ్వాసాలు, పరోక్షంగా తిరస్కృతమయ్యాయి. వారి పేరిట జరిగే అన్యాయం, నెలకొనే అజ్ఞానం సూచిస్తూ యథార్థాన్ని గుర్తించి వివేకంతో జీవతమనే పరమ ధనాన్ని ఉపయోగించుకోవాలన్న ఆరాటం ఈ గేయంలో గుర్తించవచ్చు ఇది ప్రబోధాత్మక రూపంలో క్లుప్తత కలిగి సూక్తి సదృశంగా ఉంది. ఈ గేయంలో సామాన్య మానవుని రూపంలో కవి గొంతు కొసల దేశభక్తి నిర్వచనాలతో గొంతే విడివడిన పూర్ణ ధ్వనిలో సామ్యవాద వ్యాఖ్యానంతో, ఉత్సాహం, త్యాగం, విప్లవం, ఆశ మొదలైన గుణాలు పుంజీభవించుకున్న మూర్తిగా కన్పిస్తాడు.

**"గాయపడిన సింహం వలె**
**గర్జించనీ కంఠధ్వనీ**
**రాబోయే స్వర్ణయుగానికి జయభేరీ!**
**నీ జీవిత మొక రహదారీ"**

సమాజంలోని పీడితుల నావహించవలసింది సింహత్వం. కంఠంలో నినదించవలసింది గర్జాధ్వని. ఇది భవిష్యత్ సామ్యవాద విజయానికి జయభేరిగా భావించడంలో విప్లవ సమరం సూచితం. ఇది చైతన్య శీలమైన కవి మనస్తత్వానికి చిహ్నంగా, ఆ తరువాత కవిలోని అరాజక ధోరణికన్నా నిర్మాణాత్మకమైన ప్రవృత్తికి నిదర్శనంగా కనిపిస్తుంది.

మౌన ఘోష గేయంలో మృత్యుప్రాయమైన దుర్భర స్థితిలో, సుప్తమైన అంగారకణాలు మేల్కొని ఎగిసిపడే దృశ్యాలు. ఒకమారు కీలా నృత్యంతో, మరో మారు జ్వాలా హోమంతో సంఘర్షణ, విప్లవానికి సూచీ రేఖలుగా కన్పిస్తాయి.

**"ఆకలి! అమ్మా ఆకలి!!**
**అన్నపూర్ణ గర్భగుడిని**
**ఆఖరి గంటలు మ్రోగెను!**
**ఆరని ఆకలి కీలలు**
**భైరవనాట్యము చేసెను;**
**ఘోర పరాజయమా ఇది?**
**మానవ మారణ హోమం!**
**తల్లీ! ఆకలి....! ఆకలి....!!"**

అన్న మాటల్లో ఆవహించిన సంప్రదాయ శృంఖలాలను చీల్చుకొని "ఆకలి గంటల" ధ్వనిలో అభ్యుదయాత్మక భావ తరంగం నినందిస్తుంది. 'ఆకలి! అమ్మా ఆకలి!' అన్న శబ్దాల్లో కరుణాత్మకమైన కవి దృష్టి మెరుపువలె మెరుస్తూ దేశం పొందుతున్న దారిద్ర్య స్థితి దర్శింపజేస్తుంది.

**"నాలో నరాల లోపలి**

**గడియారం తలుపుకు**

**గడియ పడిందెపుడో"**

ఇది అత్యంతాధునికమైన భావచిత్రం. గడియారం ఎన్నికలో నవ్యమైన భావ నిర్మితిపట్ల కవి ఔత్సుక్యం కన్పిస్తుంది. ఇందులో దయనీయమైన సామాజిక రూపదర్శనంతో కవి పొందిన నిశ్చేష్టారూపమూ ఉంది.

భగత్సింగు గురించి వ్రాసిన గేయంలో వీరుని చరిత్ర ఆధారంగా దేశభక్తి విప్లవరూపం రెండింటి సమన్వయ రూపం లోకాన్ని ముంచెత్తే "క్రాంతి కాల జాగృతి" భాసితమవుతుంది. రచన ఉద్రేకం, ఆలోచనతోపాటు నియతమైన శబ్ద శిల్పాన్ని సంతరించుకొని సాగింది.

**"ఒక వీరుడు**

**ఒక తారక**

**మహా కాంతి**

**మహా క్రాంతి!"**

వర్తమానంలో భగత్సింగు మరణం, భవిష్యత్తుకు క్రాంతిపథంగా భావితమైంది.

తారను పీక నులిపి చీకటి చంపింది. వీరుని పీక నులిమి పిశాచి చంపింది. ఒక తారకపోతే వేయి తారకలు అవతరించాయి. చీకటి గుండెకు తూట్లు పడేట్లుగా ఒక వీరుడు మరణిస్తే వేలాది వీరులు విప్లవయోధులై నిలచేరు. చీకటి పిశాచం అంతంతో స్వాతంత్ర్యోదయమైంది.

**"చీకటి పిశాచి చచ్చెను**

**తాటకి వలె, పూతన వలె**

**మేరువుగా శవం పడెను"**

మొదట ప్రాణం గల రెండు రాక్షస రూపాల నిర్జీవమైన దశ, తరువాత ప్రాణరహితమైన మేరు ప్రసక్తీ, క్రమంగా భయాన్ని చేకూర్చే క్రూర ప్రవృత్తినీ (జడమయమైన పర్వతం) ఆశ్చర్యాన్ని కలిగించే మౌఢ్య ప్రభావాన్ని సూచించేవి. చీకటీ, మెరువూ, ఇక్కడ అంధప్రాయమైన, స్పందన రహితమైన లక్షణానికి ప్రతీకలు.

కవి భావించే కార్మిక లోకానికి ప్రతినిధిగా ఫ్యాక్టరీ గీతం నిర్మితమైంది. దీని చిమ్నీ నుంచి వచ్చే పొగ నిర్దయవలె ఉందనీ, దాని గర్జనలో భువి పేగులు దద్దరిల్లాయనీ శ్రామికుల కష్టాలకు కవి గీసిన చిత్రం, చరిత్రలో సంకట స్థితిలో పీడితులూ, పీడకుల మధ్య అవిచ్ఛిన్నంగా సాగే ఘర్షణ ధ్వనింపజేస్తుంది. ఎన్నో ఏండ్లుగా సాగుతున్న ఈ వ్యవస్థలో "దేవుడు న్యాయం చేస్తాడా!! అన్న ప్రశ్నకు సమాధానంగా ఉక్తి చమత్కృతితో యజమానులు భూరి విరాళాలతో దేవుని కొనేశారంటాడు. దేవుని, ధనస్వామ్యం నమ్మినబంటుగా భావిస్తాడు. సమస్త కష్టాలకూ భగవంతునిపై భారం వేసి, కూర్చునే మనస్తత్వాన్ని నిరసిస్తూ కర్తవ్యోన్ముఖులను చేసే లక్షణం ఈ కవితకు ఉంది. దేవుని పేరిట తమ ఉనికినీ, స్థిరత్వాన్ని కాపాడుకొనే పీడకుల మనస్తత్వమూ ఈ కవితలో సూచితమవుతుంది. దేవుడు, మతం మానవ కల్పితాలు. ఇవి మార్పుకెపుడు వ్యతిరేకం, పురోగతికి

నిరోధం అన్నదే కవి అభిప్రాయం. కాల్పనిక జగత్తులో విహరించే కన్నా యథార్థ జీవితంలో ఆచారణ కవి పరమ లక్ష్యంగా కనిపిస్తుంది. ఇదే సమాజాన్ని పురోగమింపజేస్తుందన్న విశ్వాసమూ ఈ కవితలో కనిపిస్తుంది. అదేవిధంగా ధనస్వాముల ఔద్ధత్వానికి అంతం లేకపోలేదన్న ఆశ కూడా చూడవచ్చు. ఈ సందర్భంలో శక్తి లేని హీన స్వరంతో, స్పృహ తప్పిన భుజగంతో పెట్టుబడి దారీ వ్యవస్థను పోల్చడం దాని వినాశ దశ సూచితం అయినా బెబ్బులి మాదిరిగా అది గర్జించడం మానలేదు. చిమ్నీ భుగ భుగ మని పొగ చిమ్ముతూనే ఉంది ఇంకా.

**"యజమానుల లోహపు గుండెల**

**అమానుషత్వానికి హదలె"**

కూలీలంతా ఈ క్లిష్ట పరిస్థితిని సంఘటితమైన శక్తితో ఎదుర్కొని ధన మదాంధుల, అధికారుల 'కనికారరహిత గర్వ ఆకృతియై' నిల్చిన ఫ్యాక్టరీ ప్రజాయత్తం కావలసిన అవసరం ప్రపంచితమైంది.

'లోపలి కోరిక' అన్న గేయం తల్లి–కవీ, ఇరువురి సంవాద రూపం. తల్లి మాటల్లో ప్రశ్నారూపంలో మాతృహృదయం, కవి మాటల్లో సమాధానంగా దేశ ప్రజల బంధనమూ, ఆర్తి; కోరిక, నిశ్చయం, ప్రయత్నమూ, గమ్యం వరుసగా చిత్రితమైనాయి. ఈ క్రమంలో వర్తమాన స్థితి నుండి కవి కాంక్షించే భవిష్యత్ దర్శనమిస్తుంది.

**"నీ బిడ్డలు**

**దిక్కులేని పిట్టల వలె,**

**గూడులేక, కూడులేక**

**అల్లాడుట చూడలేక, తల్లీ!**

**నలుబది కోట్లకు మించిన**

**సంతానం కన్న తల్లి!**

**నీ చల్లని దీవెనతో**

**పురోగమిస్తామమ్మా"**

దుర్భరమైన దారిద్ర్యంతో నీడలేక, తిండిలేక మ్రగ్గే దీనజనుల దుస్థితి కరుణ రసాత్మకంగా ఈ కవితలో చిత్రితమయింది. ఒక వైపు కవి హృదయంలో క్షోభనూ, ఆవేదననూ వెల్లడిస్తునే మరొక వైపు "ఇది జనలందరికీ సరిపోయే సిరిసంపద" గల దేశమని మొక్కవోని ఆత్మస్థైర్యాన్ని, ఆశను కవి ఈ కవితలో సూచించారు.

**"నీ చేతుల బంధించిన**

**సంకెళ్ళను త్రెంచాలని**

**నీ సంతతి స్వేచ్ఛలోన**

**ఊపిరి పీల్చాలని**

**వర్గరహిత స్వర్గమ్మును**

**స్థాపించుట కోసం, తల్లీ !**

**ఇది నా లోపలి కోరిక**

**ఇది నా తీరని తపస్సు"**

పై పంక్తులు కవి కవిత్వతత్వానికి స్పందన రూపాలు. ఇందులో రెండు అంశాలు గమనించవచ్చు. మొదటిది స్వదేశ దాస్య విముక్తితో స్వాతంత్ర్యం పొందాలన్న ఆకాంక్ష. రెండవది వర్గరహిత సమాజాన్ని నెలకొల్పాలనే ఆరాటం. మొదటిది తక్షణం సాధించవలసింది. ఆపై కవి ఆదర్శమైన వర్గరహిత సమాజం నెలకొల్పడం. ఈ కవిత సామాజిక స్పృహకు నిదర్శనం.

ధ్రువతారలో లెనిన్ గురించి వ్రాస్తూ –

**"నీ పవిత్ర దేశం – ఈ**

**భువిలో నిర్మిత స్వర్గం**

**నరజాతికి విముక్తిగా**

**పరమావధి ధ్రువతారగా"**

చిరకాలం వెలుగుతుందన్న ఆశాభావాన్ని కవి ప్రకటించారు. మార్క్స్ ప్రతిపాదించిన సామ్యవాద సిద్ధాంతం ప్రపంచంలో అసాధారణమైన క్రొత్త ఆలోచనా వికాసానికీ, వ్యవస్థా నిర్మాణానికీ కేంద్రమైంది. సోవియట్ రష్యా లెనిన్ నాయకత్వంలో మహత్తరమైన శ్రామిక విజయాన్ని సాధించి సామ్యవాద రాజ్యంగా రూపొందడంలో ప్రపంచాన్ని ఆకర్షించింది. చారిత్రకమైన పరివర్తన దశలో పీడితులు దళితులపట్ల నిలిచి పోరాడే వారికి ఆశాబింబంగా రష్యా నిలిచింది. సోమసుందర్ ఆదర్శం కూడా వర్గరహిత, సమసమాజమే కావడం వలన సామ్యవాద రష్యా, దాని స్థాపకుడు లెనిన్ అతనిని బాగా ఆకర్షించడానికి ఈ కవిత ద్వారా చెప్పవచ్చు.

బాడుగ గోడీలు కవితలో –

**"లేనివాళ్ళు**

**పచ్చని పండులాంటి**

**నూరేళ్ళ జీవితంపై**

**పగబట్టి వెంటాడే**

**నాగుపాము లోకం**

**దొంగకాటు లోకం**

**బుసబుస పొంగే**

**విషభాండం లోకరి**

**దొంగచాటు లోకం"**

అంటూ సోమసుందర్ ప్రస్తుత సమాజంలో పేదల దైన్యతను దృశ్యమానం చేశారు. అదే సమయంలో

**"నూరేళ్ళూ నిండిన**

**ఈ లోకం**

**చావక తప్పదు**

**పాపం పండిన**

**ఈ లోకపు**

**నెత్తి మీద నిండుకుండ**

**రెపో ఎల్లుండో**

**భళ్ళున బద్దలవక మానదు**

**లేనివాళ్ళ**

**నరాల రక్తం సారా**

**త్రాగి త్రాగి మత్తెక్కిన**

**కలవారల పొగరుమోతు లోకం**

**రెపో ఎల్లుండో**

**కూలిపోక మానదు"**

అంటూ భవిష్యత్తులో వర్గరహిత, సమసమాజం ఏర్పడుతుందనీ, అభాగ్యులు, పీడితులు ఉండరనే ఆశాభావాన్ని కూడా వ్యక్తం చేశారు.

'సమధర్మం' కవితలో చివరిది 'ఆకలి నాలుకలన్నీ' గేయం. ఇది ఒక విధంగా ఫ్యాక్టరీ గేయంలోని భావరూపానికి క్రియారూపంగా భావించవచ్చు, ఒక ముదుసలి చరిత్ర పూర్వగాథను నెమరువేసే స్మృతిరూపం ఇది. ఆమె నులివెచ్చని జ్ఞాపకాల్లో అన్నార్తుల లోకం, పేదలు, శ్రమజీవుల కష్టాలు, కలవారి కండకావరం, నిరంకుశుల కఠోర పరిపాలన, ఫలితంగా చెలరేగిన కల్లోల జనసందోహం కన్పిస్తాయి. ఆకలి నాలుకలన్నీ ప్రళయంవలె గర్జిస్తే కుబేర దుర్గాలు గుభిల్లున కూలి పేద జనుల "స్వామ్యజగతి" అవతరించడమన్న లక్ష్యం కవి ఆదర్శ రూపంగా కనిపిస్తుంది.

**"తన చరిత్ర తనె పఠించి**

**ఫక్కున నవ్వింది ధరణి;**

**తన గాథను తనే స్మరించి**

**భోరున ఏడ్చింది ధరణి"**

అంటూ మొదలైన ఈ కృతి చారిత్రక భౌతిక దృక్పథంతో నిర్వహింపబడింది. ధరణి తన చరిత్ర తానే పఠించి ఫక్కున నవ్వడంలో–భోరున ఏడ్వడంలో అతి నిబిడమైన వేదన వెనుక దయనీయమైన యథార్థ జీవితం ఉంది. ఎంతో కాలం గతించినా, ఎందరో రాజులు మారినా చరిత్రలో సామాన్యుని జీవితం ఏ మార్పు లేకుండా ఏ విధంగా అన్యాయానికి గురైందో ఒక్కమారు గుర్తుకు తేవడమే కవి ప్రయత్నమంతా. చివర ఈ దుర్దశ పరాస్తమై నెలకొనే ఆనందరూపం చిత్రమైంది.

**"ఓహోహో! స్వప్నం కాదుకదా!**

**ఎంతలోనే ఎంత మార్పు!"**

సమాప్తిలో "కాలగతికి", "నూతన జగతికి" ప్రభవించే పురిటిబిడ్డగా ఆశారూపమైన సమధర్మం ఆవిష్కృతమైంది. ఈ విధంగా సామ్యవాద భావన ఆద్యంతాలు, అతి నూతనంగా ప్రవహించే ఈ కృతిలో భావైక్యం స్ఫుటంగా కనిపిస్తుంది.

శ్రమజీవుల ఆకలి నాలుకల గర్జాధ్వనితో చైతన్యం పొందిన జన సమూహం, రేఖ దాటి శ్రమ ఎరుగని వారి ఆడంబరం ఆర్భాటం అంతరించి, క్రొత్తగాలి విసురుతో ధనస్వామ్య వ్యవస్థ ఛిన్నాభిన్నమైన స్థితీ కర్కశ పరిపాలనం అంతమొందిన దశ ప్రశక్తమైంది. చారిత్రకంగా పరిస్థితుల ఆరోహణ క్రమంతో, భౌతికవాద గతితో చివరకు సామాన్యుని జీవిత వికాసం వ్యంజితమైంది. వాస్తవంగా ఈనాటికి సామాన్యుని జీవితం ఒక స్థాయికి చేరుకోలేదు. ఎప్పటికప్పుడు ఆర్థిక వ్యవస్థలో కుదురుబాటు లోపిస్తునే ఉంది. రాజకీయ సంక్షోభం ఉండనే ఉంది. వీటన్నింటిని విశ్లేషించి చూస్తే ఈ కావ్యం గొప్పతనం అవగతమవుతుంది.

## బానిసల దండయాత్ర

తెలంగాణా సాయుధ రైతాంగ పోరాటాన్ని భావావేశంతో చిత్రీకరించిన కవి సోమసుందర్. భూస్వామ్య వ్యవస్థను త్రోసిరాజని బూర్జువా పెట్టుబడిదారీ వ్యవస్థ కాలూనుతున్న దశలో, చరిత్రలో ఒక పరిణామ దశలో వెలువడిన కావ్యం వజ్రాయుధం.

**"ఖబద్దార్ ! ఖబద్దార్!**

**నైజాం పాదుషాహీ**

**బానిసత్వ విముక్తికై**

**రాక్షసత్వ నాశనముకై**

**హిందూ ముస్లిం పీడిత**

**శ్రమజీవులు ఏకమైరి...."**

అంటూ నిజాంను తీవ్రంగా హెచ్చరించాడు కవి, "బానిసల దండయాత్ర' అన్న శీర్షికతో రాయబడిన ఈ గేయంలో దొడ్డి కొమరయ్య ప్రాణత్యాగం, జనగామ, బాలేముల, నల్లగొండల్లో నిజాంకు వ్యతిరేకంగా జరిగిన వీరోచిత పోరాటాల ప్రస్తుతి ఉద్వేగంగా రచించబడింది.

**"ఒక వీరుడు మరణిస్తే**

**వేలకొలది ప్రభవింతురు!**

**ఒక నెత్తుటి బొట్టులోనె**

**ప్రశయాగ్నులు ప్రజ్వరిల్లు!"**

అంటూ ఉద్యమకారులని ఉత్తేజితం చేస్తూ, వారిలో నూతన సమాజ నిర్మాణానికై పురిగొల్పుతుంది ఈ కావ్యం.

## మలయా ప్రభంజనం

**"పాటల శబ్దం చీల్చిన నిశీధి నిశ్శబ్దం వలె**

**ఆగత కాలపు కాంతులు చీల్చిన గత కాలపు చరిత్ర తిమిరం మలయా విప్లవం!"**

ఈ వచన కవిత గురజాడ అప్పారావుగారి "వెనుకచూసిన కార్యమేమోయి మంచి గతమున కొంచమేనోయ్ " అన్న మాటలను గుర్తుకుతెస్తుంది. గతకాలపు దురాగతాలను పునరుద్దరించాలని ప్రయత్నించే సాంప్రదాయవాదుల ప్రయత్నాలను కవి తీవ్రంగా విమర్శించాడు. సమ సమాజం నిర్మితం కావాలని, ప్రజలంతా సుఖశాంతులతో జీవించాలని వాంఛించారు.

**"బానిసల విప్లవం – ఉత్సాహ సమరం**

**శ్రామికుల స్వప్నం – పోరాట ఫలితం**

**పీడనా రహితం – సౌజన్య జీవితం"**

అంటూ మలయా ప్రభంజనం యొక్క దశదిశను కవి నిర్దేశించారు.

చరిత్ర ఒక పరిణామ దశకి ఈ కృతి ప్రతిబింబం. ఒక వ్యవస్థ నుండి మరో వ్యవస్థకు మారే ప్రగతి మూర్తికి ఈ కవి ప్రతినిధి. 'మహాప్రస్థానం' తరువాత పరిగణింపదగిన అభ్యుదయ కృతుల్లో ఉత్తమ కృతి 'వజ్రాయుధం" అన్న శ్రీ మాదిరాజు రంగారావుగారి మాటలు అక్షరసత్యం.

**– డా॥ టి. ఓగేశ్వరరావు**

## పాఠం - 11

# వజ్రాయుధం

### -ఆవంత్స సోమసుందర్

### 11.1. కఠిన పదాలకు అర్థాలు:

| | |
|---|---|
| దనుజులు | = రాక్షసులు |
| కృపాణం | = కత్తి, ఖడ్గం |
| అక్షౌహిణి | = భారతీయ కొలమానాలలో అక్షౌహిణి ఒక కొలత. సైన్యాన్ని అక్షౌహిణిలో కొలుస్తారు. |
| మేరువు | = మేరు పర్వతం |
| ఘూర్ణిల్లు | = మ్రోగు |
| భుజంగం | = నాగుపాము |
| శలభం | = మిడత, కీటకం |
| కులాయం | = పక్షిగూడు |
| పాంచజన్యం | = పాంచజన్యం శ్రీమహావిష్ణువు పంచ ఆయుధాలలో ఒకటి, శ్రీ మహావిష్ణువు చేతిలోని శంఖం పాంచజన్యం. |
| గాండీవము | = అర్జునుడి చేతిలోని ధనస్సు పేరు గాండీవము. |
| శర్వరి | = చీకటి |

### 11.2. సందర్భ సహిత వాక్యాలు:

**1. నిన్నా నేడుల కృషియే రేపై జన్మించుతుంది;**

**ఒహోహో ! మానవుడా ! సంధించుము ధనుష్కోటి.**

వాక్య పరిచయం: ఈ వాక్యం ఆవంత్స సోమసుందర్ రచించిన 'వజ్రాయుధం' కావ్యంలోని 'సమధర్మం' కవితా ఖండిక నుండి స్వీకరించబడినది.

సందర్భం: గత కాలపు దౌర్జన్యాలు, పీడల నుండి విముక్తి పొందాలనీ, అభ్యుదయ మార్గంలో సమసమాజం వైపు ప్రయాణించాలని కవి చెప్పిన సందర్భంలోనిది ఈ వాక్యం.

భావం: నిరంకుశులు, పీడకుల దుర్మార్గాలు, అన్యాయలతో చరిత్ర మొత్తం నిండిపోయింది. అటువంటి వృద్ధజగతి సమాధిపై సమధర్మం ప్రభవించాలనీ, నిద్దుర చీకటి వెలుపల వేకువ మెళుకువ పుట్టాలని కవి ఆకాంక్షించారు. సమ సమాజ నిర్మాణం కోసం పీడుతులంతా ఏకమై పోరాడాలని, నిన్న నేడు చేసిన పోరాటాల ఫలితం రేపై ఉదయిస్తుందని భావం.

**2. నవశక్తి విధాతా**

**సమ జగతీ నేతా!!**

వాక్య పరిచయం: ఈ వాక్యం ఆవంత్స సోమసుందర్ రచించిన 'వజ్రాయుధం' కావ్యంలోని 'ధృవతార' కవితా ఖండిక నుండి స్వీకరించబడినది.

సందర్భం: కారల్ మార్క్స్ సామ్యవాద సిద్ధాంతాల ప్రాతిపదికపై అవతరించిన తొలి సామ్యవాద దేశం రష్యా. అందుకు కృషి చేసిన వ్యక్తి లెనిన్. అటువంటి లెనిన్ యొక్క సాహసాన్ని, త్యాగనిరతిని కవి కీర్తిస్తూ గానం చేసిన సందర్భంలోనిది ఈ వాక్యం.

భావం: ప్రపంచ వ్యాప్తంగా పెట్టుబడిదారులు, భూస్వాముల దౌర్జన్యాలకు కష్టాలు అనుభవిస్తున్న శ్రామిక, కార్మిక, రైతాంగానికి ధృవతారలా కనిపించింది లెనిన్ నిర్మిత సామ్యవాద రష్యా, లెనిన్ మార్గం వర్గరహిత సమాజం. గతకాలపు పీడకలలకు విప్లవ శంఖం. పరపీడన పరాయణుల ఎదలో నాటిన బాకు. నరహంతక ధరాధిపుల బ్రతుకలకే స్మశానమై లెనిన్ ఎత్తిన ఆ ఎర్రజెండా నరజాతికి విముక్తిగా, పరమావధిగా, ధృవతారగా కలకాలం వెలుగొందాలనీ కవి భావించారు. లెనిన్‌ను నవశక్తి విధాతగా, నవ జగతి నిర్మతగా కవి కీర్తించాడని భావం.

**3. లోకం నరహంతక కంటకముల**

**కావృతమై ఘోంద్రిస్తోంది.**

వాక్య పరిచయం: ఈ వాక్యం ఆవంత్స సోమసుందర్ రచించిన 'వజ్రాయుధం' కావ్యంలోని 'మౌనఘోష' కవితా ఖండిక నుండి స్వీకరించబడినది.

సందర్భం: అన్నపూర్ణగా, సిరి సంపదలకు నెలవుగా వెలసిల్లిన భారతావనిలోని పేదలు, అభాగ్యుల దైన్యతను తలచుకొని కవి చెప్పిన సందర్భంలోనిది ఈ వాక్యం.

భావం: భారతదేశం అన్నపూర్ణ, సకల సంపదలకు నెలవు సస్యశ్యామలమైన దేశం. అటువంటి భారతావని ప్రస్తుతం కొందరు ధనికులు, పాలకుల చేతిలో బంధీగా ఉందనీ, పేదలు పీడితులు దారిద్ర్యంలో మగ్గుతున్నారనీ భావం.

**4. ఇది నా లోపలి కోరిక!**

**ఇది నా తీరని తపస్సు!!**

వాక్య పరిచయం: ఈ వాక్యం ఆవంత్స సోమసుందర్ రచించిన 'వజ్రాయుధం' కావ్యంలోని 'లోపలి కోరిక' కవితా ఖండిక నుండి స్వీకరించబడినది.

సందర్భం: ఈ ఖండిక తల్లి – కవి మధ్య సంభాషణగా సాగుతుంది. ఈ ఖండికలో పరదాస్యం నుండి భారతదేశం విముక్తి పొందాలని, తదనంతరం వర్గరహిత సమాజం ఏర్పడాలని రచయిత తన కోరికను వ్యక్తపరిచిన సందర్భంలోనిది ఈ వాక్యం.

భావం: అమ్మా ! భారతమాత నీ బిడ్డలు పరదాస్యంలో దిక్కులేనివారిగా అల్లాడుతున్నారు తల్లి. నలభై కోట్ల మంది సంతానం కన్న తల్లి, నీ చల్లని దీవెనతో స్వాతంత్ర్యం కోసం పోరాడుతున్నాము తల్లి. నీ పిల్లలను బందీలుగా, బానిసలుగా చేసి, హింసించిన దుర్మార్గులను మా రక్తం దారబోసి దేశం నుండి తరిమి నీకు స్వేచ్ఛను కానుకగా ఇస్తాము తల్లి. స్వాతంత్ర్య భారతావనిలో నీ బిడ్డలందరం సుఖశాంతులతో, సమధర్మంతో, వర్గ రహిత సమాజంలో జీవించే విధంగా మమ్ము ఆశీర్వదించవే తల్లి.

**5. చీకటి పిశాచి చచ్చెను;**

**తాటకి వలె, పూతన వలె.**

వాక్య పరిచయం: ఈ వాక్యం ఆవంత్స సోమసుందర్ రచించిన 'వజ్రాయుధం' కావ్యంలోని 'భగత్సింగు' కవితా ఖండిక నుండి స్వీకరించబడినది.

సందర్భం: భారత స్వాతంత్ర్య ఉద్యమంలో అశువులు బాసిన విప్లవ జ్యోతులను స్మరిస్తూ కవి పలికిన సందర్భంలోనిది ఈ వాక్యం.

భావం: ఈ కవితా ఖండికలో కవి చీకటిని పరాయి పాలకులతో పోల్చగా, తారలను విప్లవ యోధులతో పోల్చారు. తారలు ఏ విధంగా చీకటిని చీల్చి వెలుతురును ప్రసరిస్తాయో, విప్లవ యోధులు తమ త్యాగనిరతిలో దాస్యంలో కష్టాలు అనుభవిస్తున్న తమ జాతి జనుల జీవితంలో వెలుతురును, సుఖ శాంతులను ప్రసరింపజేస్తారని భావం.

**6. చెవుల్లేని కారు రాతిదేవుడు;**

**గుండెలేని బండ వెధవ దేవుడు.**

వాక్య పరిచయం: ఈ వాక్యం ఆవంత్స సోమసుందర్ రచించిన 'వజ్రాయుధం' కావ్యంలోని 'ఫ్యాక్టరీ' కవితా ఖండిక నుండి స్వీకరించబడినది.

సందర్భం: 'ఫ్యాక్టరీ' కవితా ఖండిక వర్గ సంఘర్షణ గురించి తెలియజేస్తుంది. పెట్టుబడిదారి వ్యవస్థ దుష్పరిణామాలను కవి వివరిస్తున్న సందర్భంలోనిది ఈ వాక్యం.

భావం: గత కాలపు భూస్వామ్య వ్యవస్థకు, ఇప్పటి పెట్టుబడిదారి వ్యవస్థకు ప్రతినిధిగా రచయిత 'ఫ్యాక్టరీ' సూచించారు. పై రెండు వ్యవస్థలు రైతులను, కార్మికులను, శ్రామికులను హింసించి, వారి శ్రమను దోచుకొని లాభపడ్డాయి. అవి మార్పును, సామ్యవాదని అంగీకరించవు. వారు కష్టించకుండా సంపాదించిన ధనంలో కొంత దేవాలయాలకు, మసీదులకు, చర్చిలకు కానుకగా ఇస్తున్నారు. ఇలా వాళ్ళు ఇచ్చిన ధనంతో కులికే ఆ దేవుడు సామాన్యుల కష్టాలను చూడటం లేదని భావం.

**7. లేనివాళ్ళ నరాల కర్తం సారా త్రాగి త్రాగి మత్తెక్కిన**

**కలవారల పొగరుమోతు లోకం రేపో ఎల్లుండో కూలిపోక మానదు.**

వాక్య పరిచయం: ఈ వాక్యం ఆవంత్స సోమసుందర్ రచించిన 'వజ్రాయుధం' కావ్యంలోని 'బాడుగ గోడీలు' కవితా ఖండిక నుండి స్వీకరించబడినది.

సందర్భం: ధనవంతుల విలాసాలు, పేదవారి కష్టాలను దృశ్యాత్మకంగా వ్యక్తీకరిస్తూ, ఏనాటికైన ధనవంతుల స్వార్థ భరిత జీవితం బద్దలై శ్రామిక రాజ్యం అవతరిస్తున్న ఆశాభావాన్ని వ్యక్తీకరిస్తూ కవి చెప్పిన సందర్భంలోనిది ఈ వాక్యం.

భావం: ఫ్యాక్టరీని కవి పెట్టుబడిదారీ వ్యవస్థకు ప్రతీకగా వర్ణించారు. ధనస్వామ్యం దుర్మార్గాలకు బలైపోయిన కూలీల దైన్యతను ఈ కవితలో దృశ్యమానం చేశారు. దేవుడు సైతం ధనవంతుల పక్షాన చేరిపోయి, నిర్భాగ్యుల ఆర్తనాదాలు వినడానికి సిద్ధంగా లేడని భావం.

**8. కల్లోలిత జనసందోహం చూస్తూ**

**గజగజ వణికెను భీతికి**

**చరిత్ర ముసల్ది పాపం!**

వాక్య పరిచయం: ఈ వాక్యం ఆవంత్స సోమసుందర్ గారు రచించిన వజ్రాయుధం కావ్యంలోని 'ఆకలి నాలుకలన్నీ...' అనే కవితా ఖండిక నుండి స్వీకరించబడినది.

సందర్భం: 'ఆకలి నాలుకలన్నీ....' కవితా ఖండిక ఒక ముసల్ది తన గత చరిత్ర తల్చుకుంటూ గతంలో తాను ఎదుర్కొన్న కష్టాలను, అనుభవించిన అవమానాలు స్మరించుకునే సందర్భంలోనిది ఈ వాక్యం.

భావం: ముసల్ది గతాన్ని స్మరించుకుంటుంది. గత కాలంలో తనను దోపిడీకి గురిచేసిన వ్యక్తులను, వ్యవస్థలను తలచుకొని వణుకుతుంది. గతంలో నిరంకుశుల దుర్మార్గం, దానిని ఎదిరించే క్రమంలో అమరులైన త్యాగధనులు తత్ఫలితంగా చెలరేగిన కల్లోలాలు గురించి ముసల్ది తలచుకొని దుఃఖిస్తుంది అని భావం.

**9. ఖబద్దార్ ఖబద్దార్**

**నైజాం పాదుషా హే!**

వాక్య పరిచయం: ఈ వాక్యం ఆవంత్స సోమసుందర్ గారు రచించిన 'వజ్రాయుధం' కావ్యంలోని 'బాససల దండయాత్ర' అనే వచన కవిత నుండి స్వీకరించబడినది.

సందర్భం: నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా ప్రజల పోరాటాన్ని, ఆ ప్రయత్నంలో అమరులైన వీరుల త్యాగాన్ని కీర్తిస్తూ, ఉద్యమకారులను ఉత్తేజపరస్తూ, కార్యోన్ముఖులను ఉత్తేజపరుస్తూ కవి పలికిన సందర్భంలోనిది ఈ వాక్యం.

భావం: ప్రజల మాన ప్రాణాలను హరిస్తున్న నిజాం నిరంకుశ పాలనను విమర్శిస్తూ 'ఖబద్దార్! బానిసత్వ విముక్తికై, రాక్షస పాలన నాశనానికై హిందూ ముస్లిం శ్రమ జీవులు ఏకమయ్యారు. తమపై స్వారీ చేసి నిజాం ప్రతినిధులను ప్రతిఘటించి, హంత మొందిస్తారు. సూర్యపేట, బాలేములతో పోరాట వీరుల ప్రయత్నాలు ఫలిస్తాయి అమరుడు కొమరయ్య. అతని త్యాగం స్ఫూర్తిగా తెలంగాణ సమాజం మొత్తం పోరాటాని సమాయత్తం అవుతుంది' అని భావం.

**10. విరుల వాన కురిపిస్తూ**

**పకపక నవ్వుతున్న**

**నల్లని కొండలు.**

వాక్య పరిచయం: ఈ వాక్యం ఆవంత్స సోమసుందర్ గారు రచించిన 'వజ్రాయుధం' కావ్యంలోని 'బాససల దండయాత్ర' అనే వచన కవిత నుండి స్వీకరించబడినది.

సందర్భం: నిజాం, అతని ప్రతినిధుల దుర్మార్గాలకు, నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా నల్గొండ పరిసర ప్రాంతాలలో జరిగిన సాయుధ పోరాటాన్ని వివరించే సందర్భంలోనిది ఈ వాక్యం.

భావం: నిజాం పాలనకు సమాంతరంగా నల్గొండ పరిసర ప్రాంతాల ప్రజలు ప్రజా పాలనను ఏర్పాటు చేసుకున్నారు. సామూహిక వ్యవసాయ క్షేత్రాలలో అందరూ వ్యవసాయం చేస్తున్నారు. ప్రజలు ఆనందిగా ఉన్నారు. ఇది తెలిసిన నిజాం వాళ్ళపైకి తన మూకలను పంపించాడు. నల్గొండ పరిసరాల్లోని కొండలు సాయుధ రైతులకూ, శ్రామికులకు ఆవాసాలుగా, గెరిల్లా యుద్ధ క్షేత్రాలుగా ఉపయోగపడ్డాయి, నిజాం ముకులు తొగముడిచాయి, దీనికి సాక్షులైన నల్గొండ కొండలు వీరులపైకి కుసుమాల వర్షం కురిపించి, పకపక నవ్వాయని భావం.

**11. ఉషోమూర్తి అమరమానవుడు**

**కాలంవలె ప్రభవిస్తున్నాడల్లదిగో....**

వాక్య పరిచయం: ఈ వాక్యం ఆవంత్స సోమసుందర్ గారు రచించిన 'వజ్రాయుధం' కావ్యంలోని 'మలయా ప్రభంజనం' అనే వచన కవిత నుండి స్వీకరించబడినది.

సందర్భం: భూత కాలపు నిరంకుశత్వ నీడల నుండి, దుర్మార్గాల నుండి విముక్తి కోసం అనేక మంది వీరులు పోరాడారు. ఈ పోరాటం కాలం వలె నిత్యనూతనం అని కవి చెప్పిన సందర్భంలోనిది.

భావం: గత కాలపు చీకట్లను ఛేదిస్తూ, నూతన సమాజ నిర్మాణానికై అదిగో అమర మానవుడు సూర్యుని మాదిరిగా నిత్య నూతనంగా కాలం వలె ఉదయిస్తున్నాడని భావం.

**12. తొడిమ విడిన నవ్వుల నువ్వుపూలు**

**గత కాలం మెడలో అలంకరిస్తున్నాదా**

**ఓ మలయా మన అరివర్గం!**

వాక్య పరిచయం: ఈ వాక్యం ఆవంత్స సోమసుందర్ గారు రచించిన 'వజ్రాయుధం' కావ్యంలోని 'బాససల దండయాత్ర' అనే వచన కవిత నుండి స్వీకరించబడినది.

సందర్భం: సమధర్మం, సమన్యాయంతో కూడిన సమ సమాజం నివ్వెరపోతుందని, బోరున ఏడుస్తుందని కవి చెప్పిన సందర్భంలోనిది ఈ వాక్యం.

భావం: నూతన సమాజ నిర్మాణానికి జరుగుతున్న ప్రయత్నాలు, వాటిని అడ్డుకోవడానికి సాంప్రదాయవాదుల దుశ్చర్యలను కవి ఈ కవితలో వివరించారు. నూతన మార్పు అనే వికసించిన నువ్వు పూవ్వును నిరంకుశుల, పాత కాలపు నియంతల మెడలో అలంకరించడానికి ఈ ఛాందస అరివర్గం ప్రయత్నిస్తుందనీ, ఇది సాధ్యం కాదని భావం.

**– డా॥ టి. ఓగేశ్వరరావు**

**పాఠం - 12**

# వజ్రాయుధం

## -ఆవంత్స సోమసుందర్

**12.1. ప్రశ్నలు-జవాబులు:**

**1. 'సమధర్మం' కవిత ఆధారంగా ఆవంత్స సోమసుందర్ అభ్యుదయ భావాలను వివరించండి?**

జ) ఆవంత్స సోమసుందర్ అభ్యుదయ కవి. వర్గరహిత సమాజాన్ని ఆకాంక్షించారు. దాని సాధనకై తన కలాన్ని ఆయుధంగా ఉపయోగించుకున్నారు. ఆయన చేత విరచితమైన ప్రతీ రచన కార్మిక, శ్రామిక, రైతాంగ పక్షాన నిలచి, పెట్టుబడిదారీ, భూసామ్య వ్యవస్థలను ప్రశ్నించేదిగా ఉంటుంది. ఆయన రచించిన 'వజ్రాయుధం' కావ్యం ఆయనలోని అభ్యుదయ దృక్పథానికి పరాకాష్టగా చెప్పవచ్చు.

'వజ్రాయుధం' కావ్యంలో మొదటి భాగమైన 'సమధర్మం' వచన కవితలో రచయిత అభ్యుదయ భావాలు స్పష్టంగా కనిపిస్తాయి.

**"నిరంకుశుల ఆక్రమణకు**
**శరణాగతుడే నరుడా?**
**నరకాసుర చెరసాలల**
**పుడమితల్లి పసిగందులే బందీలా?**
**ధరణి తనూజులు నేటికి దనుజులకే బానిసలట!**
**తరుణ జీవన జ్యోతులు నిశాచరుల బాటలకే దీపాలట!!"**

అంటూ ఆవంత్స సోమసుందర్ గారు చారిత్రక కాలం నుండి నిరంకుశుల దౌర్జన్యాలకు సామాన్యులు పడ్డపాట్లను దృశ్యమానం చేశారు. ఇక్కడ నిరంకుశులను దనుజులతోనూ, నిశాచరులతోనూ రచయిత పోల్చారు. అదే సమయంలో సామాన్య మానవుడిని వారి చేతులతో బాధించబడే వారి శరణాగతుడిగా, పసిగందుగా చిత్రించారు.

అదే సమయంలో కవి భవిష్యత్తుపై ఆశాభావాన్ని కూడా వ్యక్తంజేశారు.

**"వృద్ధ జగత్సమాధిపై సమధర్మం ప్రభవించును;**
**నిద్దుర చీకటి వెలుపల వేకువ మెళుకువ పుట్టును".**

అనే కవితలో ఇది గమనించవచ్చు.

'ధ్రువతార' కవితలో కవి వర్గరహిత, సామ్యవాద రష్యా స్థాపకుడైన లెనిన్‌ను కొనియాడాడు.

**"నీ నామమె సమ జగతీ**
**నిర్మాణోత్సవ మాయెను;**
**నీ మాటయె వర్గరహిత**
**స్వర్గానికి బాటాయెను".**

అనే కవిత ద్వారా కవి లెనిన్ ఆశయాలను విశ్వవ్యాప్తం కావాలని ఎంతగా ఆశించారో అనే విషయం అవగతం అవుతుంది.

మానవునిగా ఈ భూమ్మీద జన్మించడం ఒక వరమనీ, అంత గొప్ప జీవితాన్ని పుట్టలో పురుగు వలె, జీవించం తప్పనో, పిరికితనంతో గత కాలపు దుర్మార్గానికి తలవంచవద్దనీ, వీరుని వలె తిరుగుబాటు చేయమని ఆవంత్స సోమసుందర్ గారు 'ఖరార్ నామా' కవితలో వివరించారు.

**"ఉన్నదొక్క జీవితమే;**
**మానవునిగ: వీరునిగా**
**బ్రతుకుము నరుడా!**
**చరిత్ర నీ కోసం**
**ప్రసవబాధ పడుతున్నది!**
**భవిష్యత్తు నీకోసం**
**పడిగాపులు పడుతున్నది!"**

అంటూ మానవ జీవిత పరమార్థాన్ని బోధించారు కవి.

సస్యశ్యామలమైన ఈ భారతదేశంలో నిర్భాగ్యులు, పీడితులు రోజువారి ఆహారం కోసమే వారు పడుతున్న వ్యతలనూ, అదే సమయంలో ధనవంతులు అనుభవిస్తున్న సహేతుకం కాని సౌకర్యాలను 'మౌన ఘోష' కవితలో కవి అద్భుతంగా, ఆర్ద్రత ఉట్టిపడేలా వివరించారు.

**"ఆకలి వేస్తోందమ్మా !**
**అన్నం పెట్టమ్మా!!**
**స్వర్ణారుణ**
**సస్యశ్యామలమగు**
**ఈ జగతిని దరిద్రమున**
**ఆకలితో చావలేను!"**

అంటూ కవి మన దేశంలోని అసమానతలను వ్యంగ్యంగా విమర్శించారు.

"లోపలి కోరిక' కవిత ఆవంత్స సోమసుందర్ కవిత్వ లక్ష్యాన్ని స్పష్టంగా నిర్దేశించే కవిత. తల్లి-కవి మధ్య జరిగే సంభాషణగా ఉండే ఈ కవిత ఇది. 'నీ లోపలి కోరిక ఏమిటి?' అని తల్లి అడిగిన ప్రశ్నకు కవి –

**"నీ చేతుల బంధించిన**
**సంకెళ్ళను తెంచాలని"**
**"నీ సంతతి స్వేచ్ఛలోన**
**ఊపిరి పీల్చాలని"**

**"వర్గ రహిత స్వర్గమ్మును**

**స్థాపించుట కోసం తల్లీ!"**

అని తన లక్ష్యాలను చెబుతాడు. ఇవి కవి హృదయం నుండి పొంగివచ్చిన మాటలు. ఆవంత్స సోమసుందర్ భారతదేశ స్వాతంత్ర్యాన్ని, భారతీయుల స్వేచ్ఛాయుత జీవనాన్ని, వర్గరహిత సమాజాన్ని ఆకాంక్షించారు అని ఈ కవితలో కనిపిస్తాయి.

'ఫ్యాక్టరీ' 'ఆకలి నాలుకలనీ...' కవితలలో ఆవంత్స సోమసుందర్ గారు పెట్టుబడిదారి వ్యవస్థ దోపిడి విధానాలను నిశితంగా విమర్శించారు. ఈ సందర్భంలో కవి దైవాన్ని కూడా ధనస్వాముల పక్షపాతిగా, ఫ్యాక్టరీల యజమానులు భారీ విరాళాలు ఇచ్చి దేవుడ్ని కొనేశారనీ, అందుకే అతడు కార్మికుల శ్రమను దోచుకునే ధనస్వాములు అధికారాన్ని ప్రశ్నించడం లేదని వివరించారు. కార్మికులు అందరూ ఏకమై విప్లవ శంఖం పూరించాలనీ, అప్పుడు మాత్రమే

**"ధనస్వామి దోపిడితో**

**కట్టిన బలవద్దుర్గం**

**పునాదితో 'కదులుతోంది;**

**ఫటఫటమని పేలుతోంది"**

అని కార్మికుల ఐక్యత యొక్క ఆవశ్యకతను వివరించారు.

**"పేద జనుల కుచేల లోకపు**

**ప్రతీకార జ్వాలల్లో....**

**దుశ్శాసన కర్కశ పరిపాలన**

**పటాపంచలై భస్మీపటలమ్మై**

**నశించిపోతున్నది త్వరగా"**

అని కవి భవిష్యత్తులో సామ్యవాద సమాజం ఏర్పడి, దోపిడి దారి వ్యవస్థ నశిస్తుందనే ఆశాభావాన్ని వ్యక్తంజేశారు.

ఆవంత్స సోమసుందర్ తన లక్ష్యమైన వర్గరహిత సమాజ స్థాపనకై 'తిరుగుబాటు', ఒక్కటే మార్గమని బలంగా నమ్మారు. అదే విషయం ఆయన కావ్యాలలో అనేక చోట్ల పేర్కొన్నారు.

**"భువి యొక విప్లవ మూర్తై**

**నిలువకాళ్ళ నిలుస్తోంది;**

**అరుణారుణ పతాకమై**

**ఆకారం మెరుస్తోంది".**

యుగధర్మం: చైతన్యం-జనహృదయం: పోరాటం తిరుగుబాటు! తిరుగుబాటు!! తిరుగుబాటు-బావుటా!!! మొదలైన కవితలను పరిశీలిస్తే ఈ విషయం అర్థమవుతుంది.

"చరిత్రలో ఒక పరిణామ దశకీకృతి ప్రతిబింబం. ఒక వ్యవస్థ నుండి మరో వ్యవస్థకు మారే ప్రగతిమూర్తికీ కవి ప్రతినిధి, 'మహాప్రస్థానం' తరువాత పరిగణింపదగిన అభ్యుదయ కృతుల్లో ఉత్తమ కృతి 'వజ్రాయుధం' అన్న మాదిరాజు రంగారావు గారి మాటలు అక్షరసత్యం.

## 2. 'వజ్రాయుధం' కావ్యంలో ఆవంత్స సోమసుందర్ వర్ణించిన తెలంగాణ పోరాటాన్ని గురించి రాయండి.

జ) సోమసుందర్ సామ్యవాది. కమ్యూనిస్టుగా అభ్యుదయ ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నారు. సోమసుందర్ గారి రచనలలో విశేషంగా ప్రాచుర్యం పొందినదీ, కలకాలం సాహిత్య లోకంలో నిలిచిపోయేది అతని 'వజ్రాయుధం' కావ్యం. ఈ కావ్యంలో తెలంగాణ సామాన్య ప్రజానికం నిజాం నిరంకుశ పాలనను వ్యతిరేకంగా చేసిన సాయుధ పోరాటాన్ని ఈ కావ్యంలో 'బానిసల దండయాత్ర' అనే కవితలో అద్భుతంగా చిత్రించారు సోమసుందర్. తెలంగాణా బయటి నుంచి తెలంగాణా పోరాటానికి స్పందించి కవితా వేగంతో రాసిన కావ్యం 'వజ్రాయుధం'.

సోమసుందర్ అభ్యుదయ వాది. వర్గ సంఘర్షణ గురించిన పూర్తి అవగాహన ఉన్న వ్యక్తి. తెలంగాణా పోరాటాన్ని కూడా సోమసుందర్ అభ్యుదయ దృక్పథం నుండే చూశాడు.

**"అసుర వృద్ధ వృకోదరుల**
**అంధకార జాత్యంధుల**
**అభివృద్ధిని నిరోధించు**
**ధనస్వామ్య స్వార్థాలకు**
**అభ్యర్థుల, ప్రతినిధుల**
**ఏహ్యమాన రజాగర్భ**
**తిరోగామి లోకమొకటి"**

అంటూ నిజాం, అతని ప్రతినిధులను నిరంకుశ పరిపాలకులకు ప్రతినిధులుగా కవి ఈ కావ్యంలో చిత్రించారు. అదే విధంగా

**"ప్రజాతంత్ర యుగోద్భూత**
**శాంతి కాల దీపికలై**
**పీడిత జన సందోహపు**
**సందేశపు ప్రతిధ్వనులై**
**స్వాతంత్ర్యాభ్యుదయాలకు**
**శాంతిమయ వ్యవస్థకై**
**పురోగామి లోకమొకటి"**

అంటూ తిరుగుబాటుదారులను ప్రజాస్వామ్య స్థాకులుగా, పురోగాములుగా కవి పేర్కొన్నారు. ఈ రెండు వ్యవస్థల మధ్య జరిగే పోరాటాన్ని కవి ఈ కావ్యంలో వివరించారు. నిజాం, అతని ప్రతినిధులు పాత సాంప్రదాయ వ్యవస్థను

కొనసాగించాలని ప్రయత్నించేవారిగానూ, ఉద్యమకారులను పాత వ్యవస్థ దుర్మార్గాలను పారద్రోలి నూతన సమాజ స్థాపకులుగా కవి భావించారు.

**"రావణులు, మారీచ**
**కీచకులు, వంచకులు;**
**యుగధర్మ మెదురీది**
**భస్మమైపోయారు!**
**హిట్లర్లు, టోజోలు**
**జార్లు, గోరింగులూ**
**యుగ ధర్మ మెదురీది**
**మట్టిలో కలిశారు"**

అని కవి చెప్పిన మాటలను విశ్లేషిస్తే ఏ నాటికైన పాత వ్యవస్థ మారక తప్పదనీ, మార్పును ఎదురించినవారికి చివరికీ పరాభవమే మిగులుతుందని కవి వివరించినట్లు తెలుస్తుంది. అదేవిధంగా నిజాం నిరంకుశ పాలన కూడా అంతమవుతుందని సోమసుందర్ బలంగా నమ్మినట్లు స్పష్టమవుతుంది.

'బానిసల దండయాత్ర' కవితలో సోమసుందర్ గారు దొడ్డి కొమరయ్య త్యాగాన్ని, నల్గొండ, సూర్యపేట, బాలేముల మొదలైన ప్రాంతాలలో జరిగిన తెలంగాణా సాయుధ రైతాంగ పోరాటాన్ని వివరించారు.

**"ఖబడ్దార్ ఖబడ్దార్**
**నైజాం పాదుషాహే**
**బానిసత్వ విముక్తికై**
**రాక్షసత్వ నాశముకై**
**హిందూ ముస్లిం పీడిత**
**శ్రమ జీవులు ఏకమైరి"**

అంటూ నిజాం రాజును హెచ్చరించాడు.

దొడ్డి కొమరయ్యను హత్య చేసిన నిజాం రాజును, అతని ప్రతినిధులను హెచ్చరిస్తూ

**"ఒక వీరుడు మరణిస్తే**
**వేల కొలది ప్రభవింతురు;**
**ఒక నెత్తుటి బొట్టులోనె**
**ప్రళయాగ్నులు ప్రజ్వరిల్లు;**
**ఖబడ్దార్ ! ఖబడ్దార్!!"**

అని సోమసుందర్ పలికిన ఉద్రేకపూరిత పలుకులు అతని కవితా ప్రతిభకూ, అతనిలోని అభ్యుదయ స్పర్శకు నిదర్శనం.

ఆవంత్స సోమసుందర్ గారు ఈ కావ్యంలో తెలంగాణా వీరుల పట్ల సానుభూతి చూపిస్తూ తుపాకులూ, ఫిరంగులూ విషవాయువులు ప్రజాశక్తిని ఆపలేవని నినందించారు.

**"నిరవధికం, నిరంకుశం**
**సహింపనీ, భరింపనీ**
**ధీర ప్రజాకోటి కొరకు**
**త్రవ్వించే గోరీల్లో**
**నీ అమానుషత్వాన్నే**
**పాతేస్తాం, పాతేస్తాం**
**పాతేస్తాం, ఖబడ్దార్**
**విశాలాంధ్ర ప్రజాస్వామ్య**
**మమరుస్తాం ఖబడ్దార్"**

అన్న సోమసుందర్‌గారి గొంతు తెలంగాణా సాయుధ పోరాటానికి కొత్త ఊపిరిని ఇవ్వడంతో పాటూ, నిజాం రాజు గుండెల్లో మర ఫిరంగులను పేల్చించడం నిర్వివాదం. అందుకే నాటి బ్రిటిష్ ప్రభుత్వం ఈ కావ్యాన్ని నిషేధించింది. 1956వ సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్ ఏర్పడిన తరువాత మాత్రమే దీనిపై నిషేదం తొలగింది.

### 3. 'మలయా ప్రభంజనం' కవిత ఆధారంగా సోమసుందర్ సాహిత్యతత్వాన్ని వివరించండి.

జ) ఆవంత్స సోమసుందర్ సామ్యవాది. అభ్యుదయ సమాజాన్ని ఆకాంక్షించారు. వర్గరహిత సమాజ స్థాపనకై కలం పట్టి, జీవిత కాలం పోరాడారు.

**"ఓహోహో మలయా**
**క్రాంతికీల నిలయా**
**ఏనాడో చికాగోలో– మాస్కోలో**
**ఏనాడో పారిస్ లో – బెర్లిన్‌లో**
**ఏనాడో మీరట్‌లో – క్యాన్టన్‌లో**
**కరిగిన శ్రామిక విప్లవ మహానదులు నీలో**
**నీ నాడులలో, నరాలలో ప్రవహిస్తున్నవి మలయా!"**

అంటూ సాగే 'మలయా ప్రభంజనం' కవిత రచయిత యొక్క అంతర్జాతీయ దృక్పథానికి నిదర్శనం. చరిత్రలో ప్రపంచ వ్యాప్తంగా ఉన్న నిరంకుశ పాలకుల దుర్మార్గ పాలనను గుర్తు చేస్తూనే, వారి పాలనను అంతమొందించిన శ్రామిక, కార్మిక విప్లవాలను కూడా గుర్తుకు తెచ్చారు.

**'మాక్డోనాల్డు – నియన్తలను, చరిత్ర**
**దస్టుబిన్‌లో పడేస్తుందిలే మలయా"**

అని కవి అన్న మాటలు గతంలో కాని, వర్తమానంలోగాని, భవిష్యత్తులోగాని నిరంకుశుల జీవితాలు చివరికి విషాదంతోనే ముగుస్తాయని, దీనికి గత చరిత్రయే కాక నిదర్శనం అని తెలియజేస్తున్నాయి.

'మలయా ప్రభంజనం' కవితలో రచయిత అభిప్రాయాలు గురజాడ అప్పారావుగారి అభిప్రాయాలతో పోలిక కలిగి ఉన్నాయి. గురజాడ "వెనుక చూసిన కార్య మేమోయి మంచి గతమున కొంచమేనోయ్" అంటే ఆవంత్స సోమసుందర్ గారు

**"ఎర్రపడిన తొలివేకువ తెల్లారే లోపల**
**ఉదయకాంతి హాసంలో, ఉషోమూర్తి వేషంలో**
**ప్రజ్వలుడై మానవుడే**
**కాలంవలె ఉదయిస్తాడని**
**చరిత్ర మా చెవిలో రహస్యాన్ని ఊదినదే...!"**

అంటూ భవిష్యత్తు పట్ల ఆశాభావాన్ని వ్యక్తంచేశారు. వీరు ఇద్దరూ గత కాలం మొత్తం భూస్వాములు, పెట్టుబడిదారులు, నిరంకుశుల దుర్మార్గాలతోనూ, శ్రామికులూ, రైతులూ, కార్మికుల కష్టాలతోనూ నిండిపోయిందని బలంగా నమ్మారు. భవిష్యత్తులో వర్గరహిత సమాజం ఏర్పడి, ప్రజలందరూ సుఖశాంతులతో జీవించాలని ఆకాంక్షించారు.

కొందరు ఛాందసులు మార్పును అంగీకరించక, గతకాలము హేతుబద్ధతలేని సాంప్రదాయాలను తిరిగి నిర్మించడానికి ప్రయత్నిస్తున్నారని, వారికి నిరాశే మిగులుతుందని హెచ్చరించారు.

**"ఓ మలయా మన అరివర్గం**
**చూస్తూ చూస్తూ వస్తుందా మరి!**
**ఆలోచిస్తూ...... యోచిస్తూ.......**
**వెనక్కి వెనక్కి నడుస్తుంది!!"**

అంటూ గత కాలపు దుర్మార్గాలను పునరుద్దరించాలని ప్రయత్నించేవారిని సోమసుందర్ నిశితంగా విమర్శించారు. ఒకప్పటి భూస్వాముల ఆధీనంలో బీడుపట్టిన సుక్షేత్రం తనను పచ్చని పంట భూమిగా మార్చుకోవడం కోసం పొందిన ఉద్రేకం, ఆర్తులు తమ ఆకలిని తీర్చుకోవడానికి రగిల్చిన ఉజ్వలార్తి, టెక్ స్టయిల్ మిల్లులో నైట్ డ్యూటీ ముగించుకొని కార్మికుడు ఇంటికి చేరేలోగా మరణించిన కుమారుని కళేబరం చూసి పొందిన నిర్వేదం, చెరుకుతోట బోదెలు తవ్వుతున్న కూలీ పారమొనకు తెగిపోయిన బొటన వ్రేలి నరాల రక్తం ఇవనీ తన పోరాటానికి మూలమని ఆవంత్స సోమసుందర్ గారు పేర్కొన్నారు. కార్మికులు, శ్రామికులు, రైతులు, కులీల ఆర్తులే తన కవిత్వానికి మూలమని కవి అంతర్లీనంగా పై వాక్యాలలో వివరించారు.

**"పాటల శబ్దం చీల్చిన నిశీధి నిశ్శబ్దం వలె**
**ఆగత కాలపు కాంతులు చీల్చిన గతకాలపు చరిత్ర తిమిరం**
**మలయా విప్లవం!"**

అంటూ 'మలయా ప్రభంజనం' కవిత యొక్క ప్రధాన ఉద్దేశాన్ని సోమసుందర్ గారు వివరించారు.

పాతకాలపు పాలకులు మన మెదళ్ళలో నాటిన విద్వేషాలు, విభేదాలు తొలగి -

**"ఎండిన పొలాల నెరియల నతికిన వానజల్లు వలె**
**మన గుండె బీటల నతికెను ఈ అమృత గమ్యం నేటికి?**
**ఓహోహో మలయా**
**విలయానిల నిలయా!"**

అంటూ కవి ఆశాభావం వ్యక్తం చేశారు.

**"రారాజు గాథలకు ఇదె స్వస్తివాక్యం**
**శత్రువుల చరిత కిది అంతిమ స్కంధం**
**కాలవాహిని కిదే నూత్నఘట్టం"**

ఇదే మలయా ధ్యేయం, వ్యూహం అని ఆవంత్స సోమసుందర్ గారు పేర్కొన్నారు.

**"బానిసల విప్లవం-ఉత్సాహ సమరం**
**శ్రామికుల స్వప్నం-పోరాట ఫలితం**
**పీడనా రహితం-సౌజన్య జీవితం"**

**"మలయా విప్లవం!**
**మలయా విప్లవం!"**

**- డా॥ టి. ఓగేశ్వరరావు**

## రెండోభాగం - నాటకం

# కన్యాశుల్కం నాటకం - గురజాడ అప్పారావు

## పాఠం - 13

13.0 : నాటక పరిచయం

13.1 : నాటక కథా వివరణ

### 13.0 నాటక పరిచయం :

విభిన్నరుచులు కలిగిన జనావళికి ఏకత్రసమారాధన చేసేది నాటకం అంటాడు కాళిదాసు. జాతిని జాగృతం చేసేదీ జాతిజీవనాన్ని ప్రతిబింబించేదీ నాటకం అంటాడు ఆధునికుడు. కదిలేదీ కదిలించేదీ.... మునుముందుకు నడిపించేది పరిపూర్ణపు బ్రతుకుకు దారులు వేసేదీ నాటకం. సాహిత్యాన్ని శ్రవ్యమూ - దృశ్యమూ అని రెండురకాలుగా విభజించారు. వినడానికి మాత్రమే యోగ్యమైనది శ్రవ్యం. వినుటకేకాక చూచుటకు కూడా యోగ్యమైనది నాటకం. అందుకే సాహిత్యంలో నాటకానికి పెద్దపీటవేశారు. 'కావ్యేషు నాటకం రమ్యం' అని 'నాటకాంతం హి సాహిత్యం' అని నిర్వచించారు. దృశ్యకావ్యాలు పదిరకాలు. అవి నాటకం, ప్రకరణం, డిమం, ఈహామృగం, సమవాకారం, వీథి, భాణం, అంకం, వ్యాయోగం, ప్రహసనం. అనేవి ప్రదర్శన తీరు, ప్రయోజనం అనే విస్తృతిని బట్టి దశరూపకాలలో నాటకానికి పెద్దపీటవేశారు. అక్షర రూపం దాల్చిన ఒకేఒక సిరాచుక్క లక్షమెదళ్లకు కదలిక. అక్షరానికే మాటొస్తే..., దానికి హావభావాలు జతకలిస్తే అదొక గొప్ప కళారూపమౌతుంది. ఈ కళారూపపరంపరలో నాటకం పదునైనది, పరమోత్కృష్టమైనది.

జడత్వం నుంచి జాగృతి వైపుకు.. అంధకారం నుంచి వెలుగువైపుకు నడిపించేదీ నాటకం. కందుకూరితో ప్రారంభమైన తెలుగు నాటకం వర్తమానం వరకూ ప్రజాచైతన్యానికి ఒక దీపికగా విజ్ఞాన వినోద ప్రదాయిగా నిలిచింది. తెలుగునాటక ప్రపంచంలో గురజాడ కన్యాశుల్కం ఒక పెద్దకుదుపుగా నిలిచింది. కన్యాశుల్కం పేరుతో ప్రజల మూలిగలను తుదికంటా పీల్చివేస్తున్న దురాచారాన్ని తనకలాన్ని కత్తిగా చేసుకొని చీల్చిచెండాడిన యుగపురుషుడు గురజాడ. జీవితానికి దర్పణం నాటకమైతే కన్యాశుల్కం నాటకంలో ఒక కాలంనాటి అవ్యవస్థను ... దురవస్థను కళ్లకు కట్టినట్లు చూపి ప్రజలలో ఒక మార్పుకు, ఒక స్పందనకు, ఒక చైతన్యానికి దారులు వేసిన వైతాళికుడు గురజాడ. గురజాడ కన్యాశుల్కం నాటకం సమస్య నిర్మూలనకు ఒక ప్రధాన హేతువుగానే కాకుండా సమగ్రమైన తెలుగునాటకానికి నిలువెత్తు అద్దంగా నిలిచింది. నాటికీ నేటికి ఏనాటికీ ఉత్తమమైన తెలుగునాటకానికి అసలుసిసలైన నిర్వచనంగా ఎదిగింది. తెలుగుజాతి అదృష్టవశాత్తూ పుట్టి కలంపట్టిన ఆ మహనీయుని ఆశయం ఎంతో ఉన్నతమైనది.

20వశతాబ్దం తెలుగుసాహిత్య వికాసానికి అడుగుజాడ గురజాడ. సమాజాన్ని పట్టిపల్లారుస్తున్న ఎన్నో రుగ్మతలను తన కవిత్వాన్ని సాధనంగా ఆయుధంగా చీల్చిచెండాడిన కళారవి పవి గురజాడ. తెలుగు వెలుగులుగా నూతనభావాలూ; క్రొత్తఛందస్సూ; నవ్యకవిత్వం, నవీననాటకం జాతికి అందించి జాతికి మహోపకారం చేసిన మార్గదర్శక మహర్షి గురజాడ. సాంఘిక దురాచారానికి గొడ్డలిపెట్టులా వ్యావహారిక భాషలో వెలువడిన తొలితెలుగు స్వతంత్రనాటకమైన కన్యాశుల్క సృష్టికర్తగా సామాజిక స్పృహగల నవయుగ వైతాళికునిగా గురజాడ స్థానం తెలుగుభాష, తెలుగుజాతి ఉన్నంతకాలం సుస్థిరం, అజరామరం. ప్రభుత్వశాసనాలూ... చట్టాల ద్వారా సాధించలేనిది., నాటక రచన ద్వారా కన్యాశుల్క దురాచారాన్ని కూకటివేళ్లతో కూల్చి వేయగలిగింది గురజాడ కలంబలం. కన్యాశుల్కం అంటే ఆధునిక భాషా సాహిత్యాల అపూర్వసృష్టి. ఆధునిక యుగానికి ఆది కావ్యం. సాహిత్య సామాజికాల ప్రయోగశాల. సజీవపాత్రల సమగ్ర చిత్రణం. ఇటువంటి రచన చేసిన తెలుగు వారి నిలువెత్తు సంతకమైన గురజాడ జీవనరేఖలను తెలుసుకోవలసి వుంది.

కృష్ణాజిల్లా గురజాడ గ్రామం నుంచి గురజాడ తాతముత్తాతలు విశాఖమండలానికి తరలివెళ్లారు. గురజాడ తండ్రి వెంకట రామదాసు. తల్లి కౌసల్యమ్మ. తండ్రి రామదాసు సంస్కృతపండితులు. ఆయన విజయనగర ఆస్థానంలో పేష్కారుగా, రెవెన్యూ సూపర్‌వైజర్‌గా, ఖిల్లేదార్‌గా ఉద్యోగం చేశారు. విజయనగరం సమీపంలోని ఊటగెడ్డ అనే ఏరును బండిలో దాటుతూ వుండగా హఠాత్తుగా ఏరుపొంగడంతో నీటమునిగి చనిపోయారు. 1862 సెప్టెంబర్ 21న విశాఖజిల్లా ఎలమంచిలి తాలూకా రాయవరం గ్రామంలో గురజాడ మాతామహుల ఇంట జన్మించారు. తండ్రి చీపురుపల్లిలో ఉద్యోగం చేస్తున్నప్పుడు పదేళ్లవయస్సు వరకూ అక్కడే గురజాడ చదువు సంధ్యలు జరిగాయి. విజయనగరంలో బి.ఏ చదివారు. కలసి చదువుకొన్న గిడుగు రామ్మూర్తిపంతులు గురజాడకు ప్రాణమిత్రులు. పాఠశాల చదువులోనే గురజాడ సంస్కృతంలో శ్లోకాలను వ్రాసేవారు. పేదరికం ప్రతిభకు ప్రతిబంధకం కావటంతో గురజాడ అసాధారణ తెలివితేటలను గుర్తించిన విజయనగరం మహరాజా కళాశాల ప్రిన్సిపాల్ చంద్రశేఖరశాస్త్రి తన ఇంట్లో ఆశ్రయమిచ్చారు. 1882 - 84 కాలంలో యఫ్.ఏ.పూర్తి చేశారు. 1883 లో సారంగధర అనే ఇంగ్లీషుకావ్యాన్ని రచించారు.

తమ్ముడు శ్యామలరావుతో కలసి విజయనగరంలోని ఇండియన్ లీడర్ అవర్, తెలుగుహార్ప్ అనే పత్రికల్లో పద్యాలు వ్రాసేవారు. ఇండియన్‌లీడర్ అవర్‌లో ప్రచురించబడిన సారంగధరను మెచ్చుకొన్న ఆనాటి కలకత్తాలోని బెంగాలీపత్రిక రీస్ అండ్ రయ్యత్ ఇంగ్లీషు పత్రికాధిపతి శంభూచంద్ర ముఖర్జీ దానిని తన పత్రికలో ప్రచురించారు. 1884లో విజయనగరం మహారాజా కాలేజి హైస్కూలులో నెలకు 25 రూపాయల జీతంపై ఉపాధ్యాయునిగా చేరారు. 1885లో అప్పలనరసమ్మను వివిహమాడారు. 1886లో ఉపాధ్యాయవృత్తికి సెలవుపెట్టి డిప్యూటీ కలెక్టర్ ఆఫీసులో హెడ్‌క్లర్క్‌గా చేరారు. 1887లో విజయనగరం మహారాజు ఆనందగజపతితో పరిచయం గురజాడ జీవితాన్ని సరికొత్త మలుపు తిప్పింది. ఆనందగజపతి ఆస్థానంలోని డిబేటింగ్ క్లబ్ ఉపాధ్యక్షులుగా నియమితులయ్యారు. 1891లో మూడవ లెక్చరర్‌గా నియమితులై యఫ్.ఏ.,బి.ఏ. విద్యార్థులకు ఇంగ్లీషు వ్యాకరణం, సంస్కృతం, తర్జుమా, గ్రీక్, రోమన్ చరిత్రలను బోధించారు. 1892 కన్యాశుల్కం మొదటి రచనను ఆగస్ట్ 13న విజయనగరం ఆస్థానంలో ప్రదర్శించారు. 1895లో విజయనగర సంస్థాన శాసన పరిశోధన పదవిని చేపట్టారు.

1897లో మొదటి కన్యాశుల్కంను ముద్రించి ఆనందగజపతికి అంకితమిచ్చారు. ఈ పీఠికలో గ్రాంధిక భాషలోని అసౌకర్యాలనూ, ఇబ్బందులనూ వివరంగా చెప్పి వాడుకభాషను కావ్యభాషగా పెంపొందించడం వల్ల కలిగే ప్రయోజనాలను స్పష్టంగా నొక్కివివరించారు. ఇది సాహిత్య భాషగా వాడుక భాషస్థాపనకు., ఆధునిక భాషావ్యాప్తికి అంకురార్పణగా నిలిచింది. 1906లో పాఠశాలల్లో సులభ తెలుగుబోధనా భాష కోసం తూర్పుజిల్లాల విద్యాధికారి జె.ఎ.ఏట్స్, విశాఖపట్నం మిసెస్ ఏవియన్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస అయ్యంగార్, పర్లాకిమిడి కళాశాల లెక్చరర్ గిడుగురామ్మూర్తి కలిసి వాడుక భాషా మహోద్యమానికి నడుంకట్టారు. 1906లో కొండుభట్టీయం నాటకం రచించారు. 1907లో నీలగిరి పాటలను రచించారు. 1909లో కన్యాశుల్కం రెండవకూర్పును ప్రచురించారు.1910లో బరంపురంలో సకలకులాల వారితో సహపంక్తి భోజనం చేశారు. 1910లో ముత్యాలసరాలు, 1911లో లవణరాజుకలను రచించి ప్రచురించారు. 1911లో మద్రాసు విశ్వవిద్యాలయం బోర్డ్‌ఆఫ్ స్టడీస్ సభ్యులుగా నియమితులయ్యారు. అదే సంవత్సరం వాడుక భాషోద్యమంలో భాగంగా ఆంధ్ర సాహిత్యపరిషత్తును స్థాపించారు. 1912లో కన్యకను రచించి ప్రచురించారు.1913లో మద్రాసు విశ్వవిద్యాలయంలో ఫెల్లో పదవిని చేపట్టి విశ్వవిద్యాలయాలు-సంస్కృత మాతృభాషలు అనే నివేదికను సమర్పించారు. 1914లో మద్రాసు విశ్వవిద్యాలయాల పాఠ్యాంశాల్లో వాడుకభాషను చేర్చడానికి విరుద్ధంగా చేసిన నిర్ణయానికి అసమ్మతిగా అసమ్మతి పత్రాన్ని (డిసెంట్) సమర్పించారు. 1915లో అనారోగ్యంతో విజయనగరంలో మరణించటంతో తెలుగు సాహిత్య వినీలాకాశంలో వేగుచుక్క రాలిపోయింది.

**నేపథ్యం:**

## గురజాడకు ముందు తెలుగు నాటకం:

19వ శతాబ్దం వరకూ తెలుగులో సంస్కృత రూపకాల వంటివి లేవనడం చారిత్రక సత్యం. కానీ తెలుగునేలపై యక్షగానాలవంటి ప్రక్రియలు దృశ్యరూపకాలుగా పండిత పామర ప్రజానీకానికి విజ్ఞాన వినోద దాయకాలై విలసిల్లాయి. తెలుగులో నాటక రచన ఆరంభవికాసాలు

పాశ్చాత్య నాటక రంగ ప్రభావాన జరిగాయనడం నిర్వివాదాంశం. రవి అస్తమించని బ్రిటీష్ సామ్రాజ్యము భారతదేశంలో విస్తరించి వేళ్లూను కొన్న తర్వాత సుస్థిరతకోసమై ఆంగ్లభాషను ప్రవేశపెట్టారు. భారతీయులు ఉద్యోగాలను పొందే నిమిత్తం, ఆంగ్లభాషను మాట్లాడుట ద్వారా సంఘములో పరువు ప్రతిష్ఠలు పెంచుకొను నిమిత్తం ఆంగ్లభాషను నేర్చుకోడానికి ఉత్సాహం ప్రదర్శించారు. కాలక్రమంలో భారతదేశంలో కూడా ఆంగ్లభాష రాజభాషగా పాతుకుపోయింది. ఆంగ్లభాషను అభ్యసించుటవలన ఆంగ్లభాషలోని అనేక నాటకములను చూడడం మూలంగా ఇటువంటి రసవత్తరములైన నాటకాలను తెలుగులో కూడా రచించాలనే బలీయమైన కోరిక మనవారికి కలిగింది. ఆంగ్లేయులపాలన ఆరంభదశలో వ్యాపారార్ధమై ఈస్టిండియా కంపెనీ భారతదేశంలో నెలకొల్పబడింది. ఆ తరుణంలో ఆంగ్లేయులు, ఆంగ్లవర్తకులు పాశ్చాత్యనాటకాలను భారతదేశంలో విస్తృతంగా ప్రదర్శించారు. భారతదేశంలోని ముఖ్యనగరాలైన కలకత్తా, బొంబాయి, మద్రాసు వంటి చోట్ల ఆంగ్లనాటకాలను ప్రదర్శించారు. ఈ ప్రదర్శనలకు భారతీయులలో ఆంగ్లవిద్యావంతులను, సంపన్నులు, జమీందారులు, రాజులను ఆహ్వానించేవారు. అద్భుతమూ, మనోహరమైన ఆంగ్లనాటక ప్రదర్శనలను చూసి ఆశ్చర్యచకితులై భారతీయ నాటకరంగాన్ని పునరుద్ధరించుకొనే కోరిక నానాటికీ బలీయమై పోయింది.

ఈ స్ఫూర్తితో పందొమ్మిదో శతాబ్దిలో భారతీయులు ముఖ్యనగరాలలో సంస్కృత రూపకాలను, వాటి అనువాదాలూ.అనుసరణలను ప్రదర్శించడం ప్రారంభించారు. భారతదేశంలో ఆంగ్లభాషాచార్యులుగా పనిచేస్తున్న నాటకాభిమానులు కళాశాలలో పాఠ్యగ్రంథాలుగా నిర్ణయింపబడిన నాటకాలతోపాటు షేక్స్పియర్ వంటి ప్రముఖుల నాటకాలను విద్యార్థులచేత ప్రదర్శింపచేశారు. ఈ పరంపరలో కలకత్తా, బొంబాయి, పూనా వంటి నగరాలలో విద్యార్థులు అనేక ఆంగ్లనాటకాలను ప్రదర్శించారు. సమాజంలోని ప్రముఖుల నాటక ప్రదర్శనల్లో పాల్గొనడం మూలంగా అప్పటి వరకూ నటునిపై ఉన్న న్యూనతాభావం క్రమంగా అంతరించి పోసాగింది. అంతకు పూర్వం నటుడన్నచో సమాజంలో నీచమైన భావం ప్రతివారిలో పొంగి పొర్లేది. ఎంత ప్రతిభాపాటవాలు కలవాడైనప్పటికీ అతడు పంక్తి బాహ్యుడు. కనుకనే తక్కువ కులాలకు చెందిన వారు మాత్రమే వీధి నాటకాలు,వీధి భాగవతాలు, తోలుబొమ్మలాటలలో పాల్గొనేవారు. ఆంగ్లనాటకాల మూలంగా నటుడంటే ఎంతో ఉన్నతుడనే అభిప్రాయం ప్రతివారితో కలిగింది. దీనితో విద్యార్థులతో పాటు నాటకాభిలాష ఉన్న ఎందరో నటన పట్ల ఆసక్తి, అనురక్తిని పెంచుకొన్నారు. ఆంగ్లనాటకంతో ప్రభావితమైన పార్శీ నాటక రంగం ప్రదర్శనలను అత్యంత వ్యయప్రయాసలతో ఇచ్చేవారు. రంగస్థలంపై వెనుకతెర (BACK DROP) వింత వింత రంగులతో చిత్రించబడేది. రాక్షసులు, ప్రతినాయక పాత్రలు రణగొణధ్వనులతో పెడబొబ్బలు పెట్టేవారు. భూతాలు గాలిలోఎగురుతూ విన్యాసాలు చేసేవి. కథానాయకులు, కోటగోడలపైనుండి దూకేవారు. కత్తులు తళతళలతో మెరుపులు మెరిసేవి. 1842లో సాంగ్లీ ప్రభువు అప్పా సాహెబ్, విష్ణుదాస్ భావేను నాటకాన్ని రచించాలని ఆదేశించారు. భావే సీతాస్వయంవరమనే నాటకాన్ని రచించి 1843లో ప్రదర్శించెను. ఇదే మరాఠీ నాటక రంగ ప్రదర్శనలకు శుభారంభమైంది. దీనితో పాటు పార్శీరంగ ప్రభావంతో ఉర్దూ, గుజరాతీ భాషల్లో ఎన్నోనాటకాలు వెలువడ్డాయి. ఈ పార్శీ, మహారాష్ట్ర నాటక సమాజాలు భారతదేశంలోని అన్ని ప్రాంతాలకు వెళ్ళి ప్రదర్శనలు ఇవ్వడం మొదలు పెట్టారు. ఈ స్థితిలో ఆంధ్రనాటకరంగంపై పార్శీ, మరాఠీ నాటకాల ప్రభావం బలీయంగా పడింది.

తెలుగుదేశంలోని కోరాడ రామచంద్రశాస్త్రి, కొక్కొండ వేంకటరత్నం పంతులు, పరవస్తు వేంకట రంగాచార్యులు, వావిలాల వాసుదేవశాస్త్రి వంటి పండితులు తెలుగులో నాటకరచనకు ఉద్యమించారు. 1860లో కోరాడ రామచంద్రశాస్త్రి మంజరీ మధుకరీయము అనే నాటకాన్ని రచించారు. సంస్కృతనాటక లక్షణాలకు లోబడి తెలుగులో వచ్చిన తొలి స్వతంత్ర నాటకం ఇది. సంస్కృత నాటకాలలో ఉత్తమ, మధ్యమ పాత్రలకు సంస్కృతాన్ని, స్త్రీ, నీచ పాత్రలకు తద్భవ దేశ్య బహుళమైన భాషనూ వినియోగించారు. ఆంధ్రా జాన్సన్ గా పేరుపొందిన కొక్కొండ వెంకటరత్నం పంతులు 1871లో వారణాసి ధర్మసూరి సంస్కృతంలో రచించిన నరకాసురవిజయము అనే వ్యాయోగాన్ని తెలుగులోనికి అనువదించారు. సీసము అనే లోహము పేరుతో ఛందస్సు ఉండగా వెండి, బంగారం అనే పేరుతో క్రొత్త ఛందస్సును సృష్టించారు. వావిలాల వాసుదేవశాస్త్రి ఆంగ్లనాటకాలను ఆంధ్రీకరించడానికి శ్రీకారం చుట్టారు, షేక్స్పియర్ రచించిన జూలియస్ సీజర్ ఆంగ్లనాటకాన్ని సీజరు చరిత్రను అనువాదంచేశారు. వాసుదేవశాస్త్రి తొలి ఆంగ్లనాటక అనువాదకులుగా కాకుండా తొలి విషాదాంత రచయితగా పేరుపొందారు. 1880లో వావిలాల నందకరాజ్యము అనే సాంఘిక నాటకాన్ని రచించారు.

ఈ రచయితల నాటకాలు ఏవీ ప్రదర్శనలకు నోచుకోలేదు. అనంతరకాలంలో కందుకూరి కొండు భొట్ల సుబ్రహ్మణ్యశాస్త్రి, నాదెళ్ల పురుషోత్తమకవి, వడ్డాది సుబ్బారాయుడువంటి వారు ఎన్నో నాటకాలను రచించారు. కందుకూరి, కులాచార విషయాలలోనూ, రాజకీయ వ్యవహారాలలోనూ గల అనేక దురాచారాలకు వినోదాత్మకమైన సంభాషణలతో వెల్లడిచేయడానికి హాస్యసంజీవిని పత్రికను ప్రారంభించారు. అందులో ప్రచురించిన బ్రాహ్మవివాహమును కేవలము వినోదము కొరకు కాక అతిబాల్య వివాహము, వృద్ధవివాహము, కన్యాశుల్కము మొదలైన దురాచారముల వలన అనర్థకములను చూసి జనులకు వానినుండి విముఖులను చేయతలంపులతో వ్రాసితిని, అని కందుకూరి పేర్కొన్నారు. అనంతరం వ్యావహారిక భాషలో కందుకూరి వ్యవహార ధర్మబోధిని అనే నాటకాన్ని వ్రాశారు.

తెలుగు నాటక ఆరంభదశలో ధార్వాడ నాటకసమాజంవారి ప్రదర్శనలు ఎంతో ఆసక్తిని రేకెత్తించాయి. 1885లో ధార్వాడ నాటక సమాజం వారు భట్టుజోషి, సీతారామ్‌జోషి నాయకత్వంలో ఆంధ్రదేశంలో విస్తృతంగా నాటకాలను ప్రదర్శించారు. అప్పటికే కందుకూరి 1880వ సంవత్సరంలో రాజమండ్రిలోని శ్రీ విజయనగరం మహారాజావారి బాలికా పాఠశాలలో నాటకాన్ని తొలిసారిగా ప్రదర్శించారు. కందుకూరికన్న పూర్వం ఉన్న మహాపండితులు నాటక రచన చేసినా తొలి తెలుగు నాటక రచయిత అనే ఖ్యాతి కందుకూరికే లభించింది. ఎందుకంటే నాటకం దృశ్యప్రక్రియ. నాటకం ప్రదర్శనయోగ్యమైనది. ఆ కవుల నాటకాలన్నీ ప్రదర్శనకు నోచుకోలేదు. ప్రదర్శనే నాటక రచనకు సార్థకతను కలిగిస్తుంది కాబట్టి తొలిప్రదర్శన పొందిన నాటకం వ్యవహార ధర్మబోదిని కాబట్టి తెలుగు నాటక కర్త అనే ఖ్యాతి కందుకూరికే లభించింది. ధార్వాడ నాటక సమాజం రాజమండ్రిలో నెలరోజులపాటు పాకలను నాటకశాలలను నిర్మించి నాటకాలను ప్రదర్శించారు. అనంతరం ఆపాకలలో తాను నెలకొల్పిన నాటకసమాజము వారికే రత్నావళి, చమత్కార రత్నావళి, అనే తన రచనలను ప్రదర్శించారు. ఈ నాటకాల్లో కందుకూరితో పాటు సోమంచిశంకరం, అడవికొల్లు కనకరాజు అనే వారు కూడా నటించారు.

ఈ స్ఫూర్తితో బళ్లారిలో ఆంధ్రనాటక పితామహుడైన ధర్మవరం రామకృష్ణమాచార్యులు 1897లో చిత్రనళీయము, విషాదసారంగధర వంటి పలునాటకాలను రచించి ప్రదర్శించారు. ఆంధ్రచారిత్రక నాటక పితామహుడైన కోలాచలం శ్రీనివాసరావు ధర్మవరానికి పోటిగా రామరాజుచరిత్ర, కీచకవధ, ప్రహ్లాదనాటకం, పాదుకా పట్టాభిషేకం వంటి నాటకాలను ప్రదర్శించారు. ధర్మవరం మేనల్లుడైన బళ్లారి రాఘవ మామకు పోటిగా కోలాచలం సమాజంలో పాత్రలను ధరించేవారు. గురజాడ శ్రీరామమూర్తి మర్చెంట్ ఆఫ్ వెనిస్ నాటకాన్ని వెనీజువణిజ నాటకము లేదా సుహృత్సుభాషితము అనేపేరుతో అనువదించారు. వసురాయకవిగా సుప్రసిద్దులైన వడ్డాది సుబ్బారాయుడు వేణీసంహారము, విక్రమోర్వశీయము, ప్రబోధచంద్రోదయం, అభిజ్ఞానశాకుంతలం వంటి ఏడునాటకాలను రచించారు. నాదెళ్ల పురుషోత్తమకవి హరిశ్చంద్ర, చంద్రహాస నాటకము, సారంగధర, ద్రౌపదీ వస్త్రాపహరణము అనే నాటకాలను రచించారు.

పందొమ్మిదవ శతాబ్దం చివరి అధ్యాయంలో తెలుగునాటకరంగంలో ఒక సువర్ణ అధ్యాయం ప్రారంభమైనది. వ్యావహారిక భాషకు పట్టంకడుతూ గురజాడ కన్యాశుల్కాన్ని, పాత్రోచితభాషకు ప్రాధాన్యం ఇచ్చి వేదం వేంకటరాయశాస్త్రి ప్రతాపరుద్రీయం నాటకాన్ని రచించారు. వేదంవారు బొబ్బిలియుద్ధం, మాళవికాగ్నిమిత్రము వంటి నాటకాలను రచించారు. తెలుగునాటక సర్వస్వంలో వేదం వారి ప్రతాపరుద్రీయం నాటకంలో నీచపాత్రలకు గ్రామ్యభాషను సరసమధురంగా ప్రయోగించారు. కందుకూరి వారితో పుట్టి పురుడుపోసుకున్న తెలుగునాటకం గురజాడ కన్యాశుల్కంతో బలమైన కుదురుతో నిలదొక్కుకుంది.

## 13.1. నాటక కథావివరణ:

**ప్రథమాంకం - 1వ స్థలం :**

పూటకూళ్ళమ్మ దగ్గర ఇరవైరూపాయలు అప్పు చేసి ఖర్చుపెట్టిన గిరీశం, ఆమె నుంచి తప్పించుకోడానికి విజయనగరం నుంచి వెళ్ళిపోవాలనుకుంటాడు. పరీక్షల్లో తప్పిన శిష్యుడు వెంకటేశ్వర్లుతో వాళ్ళ ఊరికి వెళితే బాగుంటుందనుకుంటాడు. గిరీశం చుట్ట తాగడం తప్ప తనకేమీ నేర్పలేదని, ఆతని సాహసంతోనే చెడిపోయానాని వెంకటేశం అంటే తనగురించి గొప్పగా చెప్పుకుంటాడు గిరీశం.

తాను వెంటేశంతో వాళ్ళ ఊరువచ్చి పరీక్షల్లో పాసయినట్లు చెబుతాడు. సెలవులయిన తరువాత పైక్లాసులో చేర్పిస్తానని చెప్పి చదువుకోవడానికి కొత్త పుస్తకాల జాబితా చెప్పి కొనుక్కోమంటాడు. తాను తన పనులు చక్కబెట్టుకువస్తానని, రాత్రికి బయలుదేరుదామని, ఈ విషయం రహస్యంగా ఉంచమని చెప్పి వెంకటేశాన్ని పంపిస్తాడు. ఫోటోలు తీయించుకున్నందుకు ఇవ్వవలసిన బకాయి కోసం బంట్రోతు వస్తే చెవిటివాడుగా నటిస్తాడు. బంట్రోతు పెద్దగా అరవడం ప్రారంభిస్తాడు. అతనికి చుట్ట ఒకటి లంచంగా ఇచ్చి రేపొద్దున పూటకూళ్ళమ్మ ఇంటికి వస్తే బాకీ తీర్చేస్తానని నమ్మకం కలిగేటట్లు చెప్పి గాయత్రి మీద ప్రమాణం చేస్తాడు. అతడిని పంపించి మధురవాణి ఇంటికి బయలుదేరుతాడు.

**2వ స్థలం:- మధురవాణి ఇంట్లోగది :**

రామప్పంతులు అనే వ్యక్తి మధురవాణిని ఉంచుకుంటానని తనతో రమ్మని అంటాడు. తాను గిరీశంతో ఉన్నానని, అతనితో తెగతెంపులు చేసుకురావాలంటే రెండు వందలు కావాలని అంటుంది. రామప్పంతులు రెండు వందలు ఇస్తాడు. గిరీశాన్ని నిందిస్తాడు. అంతలో గిరీశం వస్తున్నాడని చెబితే, అతడు తంతాడని భయపడ్డ పంతులు మంచం కింద దూరుతాడు. గిరీశం వచ్చి తనకు హైదరాబాదులో ఉద్యోగం వచ్చిందని కోతలు కోస్తాడు. తనతో హైదరాబాదు రమ్మంటాడు. పూటకూళ్ళమ్మను తీసుకుపొమ్మని మధురవాణి అంటే ఎవరో తన గురించి అబద్దాలు చెప్పారని ఆ చెప్పిన వాడెవడో చెప్పమని అంటాడు గిరీశం. తన పేరు చెప్తుందేమానని రామప్పంతులు భయపడతాడు. ఇంతలో గిరీశం కోసం పూటకూళ్ళమ్మ వస్తుంది. ఆమెను చూసిన గిరీశం మంచం కింద దూరతాడు. కింద రామప్పంతులు కనబడతాడు. రామప్పంతుల్ని ముందుకు జరిపి గిరీశం మంచం కింద గోడప్రక్క కి చేరతాడు. పూటకూళ్ళమ్మ చీపురుకట్టతో వచ్చి గిరీశం గురించి మధురవాణిని అడుగుతుంది. తనకు గిరీశం గురించి తెలియదంటూనే మంచం క్రింద ఉన్నాడని మధురవాణి సైగ చేస్తుంది. పైటకూళ్ళమ్మ చీపురుకట్టతో మంచం క్రింద ఉన్నవాడిని కొడితే ఆ దెబ్బలు రామప్పంతులికి తగులుతాయి. ఆయన బయటకు వస్తాడు. తనను కొట్టినందుకు తిడుతూ గిరీశం మంచం కిందే ఉన్నాడని చెబుతాడు. పూటకూళ్ళమ్మ మంచం క్రిందికి దూరుతుంది. గిరీశం రెండోవైపు నుంచి బయటకు జారుకుంటాడు.

## ద్వితీయాంకం

**1వస్థలం - కృష్ణరాయపురంలో అగ్నిహోత్రావధాన్లు ఇల్లు :**

అగ్నిహోత్రావధాన్లు, వెంకమ్మ వెంకటేశం తండ్రి, తల్లి. అతని మేనమామ కరటక శాస్త్రి అతని శిష్యుడు కూడా అక్కడే ఉంటారు. వెంకటేశానికి ఇంగ్లీషు చదువు చెప్పించడం వలన డబ్బంతా నాశనం అవుతున్నదని తండ్రి బాధపడితే, అవసరమయితే తన పసుపు కుంకానికి ఇచ్చిన భూమి అమ్మయినా చదివించాల్సిందేనని వెంకమ్మ వాదిస్తుంది. అంతలో గిరీశం వెంకటేశం వస్తారు. వెంకటేశం పరీక్ష పాసయ్యాడని మూడేళ్ళు తన దగ్గర ఉంచితే పోలీసు పరీక్ష పాస్ చేయిస్తానని గిరీశం చెప్తాడు. కరటక శాస్త్రి తనకు తెలుసునని పొగుడుతాడు. తనకు గతిలేక అక్కడికి రాలేదని, వెంకటేశం మీద ప్రేమతో చదువు చెప్పడానికి అంగీకరించానని నమ్మబలికి వెంకమ్మ అభిమానం సంపాదిస్తాడు.

అగ్నిహోత్రావధాన్లు తన కూతురు బుచ్చమ్మను పదిహేనువందలకు అమ్మడం, భర్త చనిపోయిన ఆమె విధవగా పుట్టింటికి రావడం ప్రస్తావనకు వస్తుంది. ఆ సన్నివేశాన్ని ఆధారం చేసుకొని గిరీశం రాజమహేంద్రవరంలో ఉన్న రామావధాన్లు తన మేనమామ అని, ఆయన అగ్నిహోత్రావధాన్లను కీర్తిస్తాడని చెప్పి ఆయన మనసు చూరగొంటాడు. ఆయనిచ్చిన కొన్ని ఇంగ్లీషు కాగితాలను తర్జుమా చేసిపెడతానంటాడు. వెంకమ్మ కోరికపై గిరీశం, ఇంగ్లీషులో మాట్లాడినట్లు ఏవేవో పొంతనలేని వాక్యాలు చదువుతాడు. వెంకటేశం తెలుగుపద్యం చెప్పి అర్థం చెప్పలేకపోతే గిరీశం సర్దిచెబుతాడు. రామచంద్రపురంలో ఉన్న లుబ్ధావధాన్లు తన రెండో కూతురు సుబ్బమ్మను పద్దెనిమిదివందలకు బేరం ఆడి పెళ్ళి చేస్తానని అంటారు. లుబ్ధావధాన్లు తన బంధువని, ఆయనకు అరవయ్యేళ్ళుంటాయని గిరీశం చెప్పి కన్యాశుల్కం తప్పని చెప్తాడు. తాంబూలం కూడా ఇచ్చానని భర్త అంటే వెంకమ్మ ఆదౌర్భాగ్యపు సంబంధం వద్దని ఆ సంబంధం చెడిపోయే మార్గం ఆలోచించమని కరకటశాస్త్రికి, గిరీశానికి చెబుతుంది. ఉపాయం చెప్తానని వెంకమ్మని, కరటకశాస్త్రి ప్రక్కకు తీసుకుపోతాడు. అన్నానికి పిలవడానికి

వచ్చిన బుచ్చమ్మను చూచిన గిరీశం ఆమె అందాన్ని మనసులోనే మెచ్చుకుంటాడు.

**2 వస్థలం - దేవాలయం :**

కరటకశాస్త్రి శిష్యుడు తనకు గురువు సరిగ్గా చదువు చెప్పడం లేదని, గిరీశం దగ్గర ఇంగ్లీషు చదివితే బాగుంటుందని అనుకుంటాడు. ఆడపిల్ల వేషంలో లుబ్ధావధానులను పెళ్ళిచేసుకొంటే తాను ఇంగ్లీషు చదువు చెప్పించడంతో పాటు తన కూతురునిచ్చి వివాహం జరిపించి ఇల్లరికం ఉంచుకుంటానని మాట ఇస్తాడు.

**3వ స్థలం - అగ్నిహోత్రావధాన్లుఇంటి యదటివీధి :**

ఆ రాత్రి భోజనాల సమయంలో గిరీశం కన్యాశుల్కానికి వ్యతిరేకంగా లెక్చరు ప్రారంభించాడు. ఇంగ్లీషు మాటలు వినబడే సరికి అగ్నిహోత్రావధాన్లు మండిపడ్డాడు. సపోర్టు చేస్తానన్న కరటక శాస్త్రి నోరెత్తలేదు. దాంతో గిరీశం లెక్చరు ఆపేశాడు. అంతలో బుచ్చమ్మ వచ్చి చెల్లికి లుబ్ధావధాన్లుతో పెళ్ళివద్దని అంటుంది. అవధాని కోపంతో పెరుగన్నం బుచ్చమ్మ నెత్తిన కొడతాడు. కోపం వచ్చి కరకటశాస్త్రి శిష్యుడుతో ఊరెళ్ళిపోతాడు. వెంకమ్మ ఏడుస్తూ ఉంటుంది. గిరీశం నీళ్ళు కాగ బెట్టి బుచ్చమ్మను స్నానం చేయమన్నాడు. లుబ్ధావధాన్లు తన మాట వినడని గ్రహించిన గిరీశం అతడు చెప్పిండంతా నిజమేనని కన్యాశుల్కం మంచి సంప్రదాయమని లుబ్ధావధాన్లు వాదనను అంగీకరించాడు.

జరిగిన ఈ సంగతంతా చెప్పి గిరీశం విధవావివాహాలు చేసే అవకాశం ఉండడం వల్ల కన్యాశుల్కం మంచిదని వెంకటేశానికి హితబోధ చేశాడు. లుబ్ధావధాన్లను తను లోబరచుకున్నానని చెప్పాడు. వెంకటేశం తెచ్చిన పోగాకుతో చుట్టముట్టించి విడోమీద తాను రాసిన ఇంగ్లీషు కవిత్వాన్ని వినిపించాడు. కాసేపు తర్వాత వచ్చిన లుబ్ధావధాన్లుకు దావాల విషయంలో సహాయం చేస్తానని ప్లీడరుకుఫీజు లేకుండా చేస్తానని నమ్మబలికాడు. లుబ్ధావధాన్లు పూర్తిగా గిరీశానికివశమై అతను చెప్పినట్లు దావాలువేయడానికి అంగీకరించాడు.

**తృతీయాంకం - 1వ స్థలం - రామచంద్రపురం - రామప్పంతులు ఇల్లు :**

రామప్పంతులు ఆర్థికస్థితి బాగా లేకపోవడం వల్ల మధురవాణి తనకు నష్టం కలుగుతుందేమో అని అనుమానిస్తుంది. లుబ్ధావధాన్లు పెళ్ళి ఆపించమని అడుగుతుంది. లుబ్ధావధాన్లు డబ్బున్న పరమలోభి. పెళ్ళాడితే ఆయనకు ధనం వస్తుందని సిద్ధాంతి, పండాగారు చెప్పారు. పెండ్లి, ధనం జంటగా వస్తాయని ఈ వయసులోపిల్ల నెవరూ ఇవ్వక, పెళ్ళికాకపోతే గొప్ప కీడు వస్తుందని, ఆ కీడు పోవాలంటే శాంతి చేసి బ్రాహ్మణులకు పెట్టాలని వాళ్ళిద్దరూ కల్పించి చెప్పారు. అతగాడు వివాహ ప్రయత్నాలు ప్రారంభించారు. అగ్నిహోత్రావధాన్లు కూతురు జాతకం బాగుందని కల్పించి చెప్పి ఆయిద్దరికీ వివాహం కుదిర్చారు. ఇదంతా రామప్పంతులు డబ్బు కోసం చేసిన కుట్ర అని మధురవాణి అతని చేతనే చెప్పించింది. లుబ్ధావధాన్లు కూతురు మీనాక్షి ప్రవర్తన మంచిదికాదని రామప్పంతులు అంటాడు. పెళ్ళి ఆపమంటూ మధురవాణి గొడవ చేస్తుంది.

రామప్పంతులు ఇన్స్పెక్టరు పేరుతో రామినాయుడు దగ్గర డబ్బు కాజేశాడని తెలిసి, రామప్పంతులును తీసుకు వెళ్ళడానికి కానిస్టేబులు వస్తాడు. అతను అవమానంగా మాట్లాడితే రామప్పంతులు మధువాణి ముందు గౌరవం పోతుందని అతడిని బతిమలాడుకొని అక్కడి నుంచి వెళ్ళిపోతాడు.

**2వ స్థలం - రామప్పంతులు ఇంట్లో పడక గది :**

కరకట శాస్త్రులు శిష్యుడికి ఆడవేషం తగిలించుకొని, మధురవాణి దగ్గరకు వస్తాడు. అతను కొంత కాలం ఆమెను చేరదీసిన వాడే గిరీశానికి ఆమెతో ఉన్న సంబంధం తెలుసుకుంటాడు. తన చెల్లెలు కూతురు సుబ్బమ్మకు లుబ్ధావధాన్లుతో పెళ్ళి నిశ్చయమయిందనీ, దానిని తప్పించాలని, సుబ్బమ్మకు ఇస్తానన్న కన్యాశుల్కం కంటే తక్కువ డబ్బుతో ఆడవేషంలో ఉన్న తన శిష్యుడితో పెళ్ళి జరిపే విధంగా చేయమని, అందుకు కొంత డబ్బు ఇస్తానని కరటకశాస్త్రులు చెబుతాడు. మధురవాణి సరే అంటుంది. రామప్పంతులతో మాట్లాడి దానికి వ్యూహం తయారు చేసుకోవాలని అనుకుంటారు.

రామప్పంతులుకి ముందుగా పాతిక రూపాయలు ఇచ్చి అతని మనస్సు ఆకట్టుకున్న కరకట శాస్త్రులు, లుబ్ధావధాన్లు పెళ్ళి సుబ్బమ్మతో ఆపేటట్లు, తన శిష్యుడితో జరిగేటట్లు అతనిచ్చిన కన్యాశుల్కంలోసగం రామప్పంతులుకి ఇచ్చేటట్లు బేరం ఖాయం చేసుకుంటాడు. రామప్పంతులు పెళ్ళి ఆపడానికి ప్రయత్నాలు ప్రారంభిస్తాడు.

### 3వ స్థలం: అగ్రిహోత్రావధాన్లు ఇల్లు :

బుచ్చమ్మను లోబరుచుకొని లేవదీసుకుపోయి పెళ్ళి చేసుకోవాలని గిరీశం అనుకుంటాడు. వెంకటేశానికి పాఠం చెబుతున్నట్లు నటిస్తూ, విధావా వివాహం శాస్త్రసమ్మతం అని విధవా వివాహం చేసుకోవడం బ్రహ్మచారుల కర్తవ్యమని ఆ వివాహాలను అడ్డుకోవడం తప్పని బుచ్చమ్మకు వినబడేటట్లు చెబుతాడు. విధవలు పెళ్ళాడి, పిల్లలను కనకపోతే పాపమని చెబుతాడు. అగ్నిహోత్రావధాన్లు వస్తే అతను వినేటట్లుగా తండ్రిని గౌరవించాలని, లోకంలో కోర్టులే ముఖ్యమయినవని లెక్చరు నిస్తాడు. తనను గిరీశమే రక్షించాలని అగ్నిహోత్రావధాన్లు చెప్పి పెళ్ళిపనుల్లో సాయం చేయమంటాడు.

### 4వ స్థలం - పెరడు :

బుచ్చమ్మ గిరీశం గురించి అడిగితే, ఆయన చాలా గొప్పవాడని, సంఘసంస్కర్త అని వెంకటేశం కోతలు కోస్తాడు. గిరీశం వచ్చిన తరువాత పెళ్ళి ఎందుకు చేసుకోలేదని బుచ్చమ్మ అడుగుతుంది. ఎవరికీ చెప్పవద్దని మాట తీసుకొని తాను విధవావివాహాలు చేయడానికి వేశ్యావృత్తిని మానిపించడానికి పెళ్ళి చేసుకోలేదని చెప్తాడు. మాటవరసకు అంటూ బుచ్చమ్మ వంటి బంగారు బొమ్మ దొరికితే వివాహమాడుతానని, పెళ్ళి, పిల్లలు, సంసారం అని మాటలు చెప్పి ఆమె కళ్ళ ముందు ఒక లోకాన్ని కల్పిస్తాడు. బుచ్చమ్మకు తెలియని అనేక విషయాలు చెప్పి ఆమెదృష్టిలో గొప్పవాడిగా ఎదిగిపోతాడు. అచ్చమ్మను చేసుకోమని చెబితే, తాను బుచ్చమ్మలాంటి అమ్మాయి అయితేనే వివాహమాడతానని అంటాడు. బుచ్చమ్మ బదులు చెప్పదు.

అగ్నిహోత్రావధాన్లు వస్తే అతనికి ఇంగ్లీషు చదువులో చెట్లెక్కడం నేర్పుతారని, అది నేర్చుకుంటే తాసిల్దారు కావచ్చని చెప్తాడు. చెట్టెక్కి కోసితెచ్చిన జామకాయల్లో గిరీశం వాటా అడిగితే వెంకటేశం బాధపడుతూ ఇస్తాడు.

### చతుర్థాంకం - 1వ స్థలం - రామప్పంతులు ఇల్లు :

రామప్పంతులు, మధురవాణి, గిరీశం లుబ్ధావధాన్లు పెళ్ళికి వస్తాడని రామప్పంతులిని గొడవ చేస్తాడని ఆ గొడవ తప్పించుకోవాలంటే పూటకూళ్ళమ్మను పెళ్ళికి వంటలక్కగా పిలిపిస్తే మంచిదని అనుకుంటూ ఉంటే ఒక ఉత్తరం తీసుకొని లుబ్ధావధాన్లు వస్తాడు. అది గిరీశం అతనికి రాసిన ఉత్తరం అందులో అగ్నిహోత్రావధాన్లుకు కోపం ఎక్కువని , కోపం వస్తే కొడతాడని, ద్రవ్యాశ ఎక్కువని, పెళ్ళికి ఆర్భాటంగా వస్తున్నాడని కనుక పెళ్ళి ఖర్చు అధికంగా చేయవలసిన అవసరం ఉంటుందని, పెళ్ళికూతురుకు పెయ్యనాకుడు జబ్బు ఉందని, ఆ జబ్బు ఉంటే వైధవ్యం కలుగుతుందనే నమ్మకం ఉందని, ఈ పెళ్ళి పిల్ల తల్లికి ఇష్టంలేదని, పెళ్ళిసమయానికి బావిలోపడాలని అనుకుంటూ ఉన్నదని, పిల్ల జాతకం నిజం కాదని, బనాయించినదని గిరీశం వ్రాశాడు. ఆ ఉత్తరం చదివిన లుబ్ధావధాన్లు అగ్గి మీద గుగ్గిలం అయ్యాడు. అప్పుడే అతనికి అగ్నిహోత్రావధాన్లు రాసినట్లుగా రామప్పంతులు వ్రాసిన ఉత్తరం వచ్చింది. అందులో లుబ్ధావధాన్లు పిసినిగొట్టు కనుక ఆసంబంధం తమకు అవసరం లేదని, ముసలివాడు, క్షయరోగి అయిన అతనికి తన కూతురిని ఇవ్వనని, లుబ్ధావధాన్లు కూతురు ప్రవర్తన మంచిది కాదని, రాసి ఉంది. ఆ ఉత్తరంలో విశేషాలకు కోపం పొందిన లుబ్ధావధాన్లు ఆపెళ్ళి వద్దని, తక్కువ కన్యాశుల్కంతో మరో సంబందం చూడమంటాడు. రామప్పంతులు కరకటశాస్త్రి శిష్యుడిని ఆడవేషంలో తీసుకువచ్చి చూపిస్తాడు. లుబ్ధావధాన్లు సరేనంటాడు. పన్నెండువందల రూపాయలు కన్యాశుల్కంగా ఇచ్చేటట్లు కరకటశాస్త్రులను ఒప్పించినట్లు రామప్పంతులు నాటకం ఆడతారు. బంగారం ముందే పెట్టాలని అడుగుతున్నారు గనుక మధుర వాణి కంటెను ముందు తగిలించేద్దాం అంటాడు రామప్పంతులు.

### 2వ స్థలం- లుబ్ధావధాన్లు ఇల్లు :

కరటక శాస్త్రి, లుబ్ధావధాన్లు మాట్లాడుకుంటూ ఒక రాత్రి వివాహం అయితే ఖర్చు తక్కువ కనుక ఏకరాత్రి వివాహం జరపాలని నిర్ణయించుకుంటారు. ఈ విషయం రామప్పంతులుతో చెప్పవద్దనుకుంటారు.

**3వ స్థలం : లుబ్ధావధాన్లు ఇంటి పెరడు :**

సిద్ధాంతి రాత్రికి ముందే లగ్నమని, మంగళస్నానాలు చేయించండని హడావిడి చేస్తాడు. రామప్పంతులు రాత్రికి అనుకుంటున్నాడని, ముందే జరిపిస్తే గొడవ చేస్తాడని లుబ్ధావధాన్లు భయపడతాడు. పెళ్ళిపనులు జరుగుతుంటాయి.

**4వ స్థలం:- లుబ్ధావధాన్లు ఇంటి అరుగు :**

వివాహం అయిపోతుంది. కరటకశాస్త్రి డబ్బుతో వెళ్ళిపోయ్యాడు. రామప్పంతులు తన వాటా తనకు అందకపోయేసరికి హడావుడి చేస్తాడు. పెళ్ళి సమయంలో మధురవాణి హెడ్డుగారితో మాట్లాడిందని తెలుసుకొని మండిపడతారు. తను లేకుండా పెళ్ళి జరిగినందుకు చిందులు వేస్తాడు. సిద్ధాంతి రహస్యంగా మాట్లాడి రామప్పంతులి కోపాన్ని తగ్గిస్తాడు. మధురవాణి హెడ్డుగారితో ఉండి ఉంటుందని అనుమానించిన రామప్పంతులు కొండి భట్లును తీసుకొని వెళ్ళి, ఇంటివెనుక కాపలా ఉంచి తలుపు తడతాడు. కొండి భట్లు రామప్పంతులు దగ్గర తీపుకున్న డబ్బుతో పాటు హెడ్డుగారి దగ్గర లంచం తీసుకొని హెడ్డుగారు రాలేదని చెప్తాడు. తన గుట్టు కాపాడినందుకు మధురవాణి అతనికో ముద్దు ఇస్తుంది. వాడి ఆనందానికి అవధులుండవు.

**5వ స్థలము - అగ్నిహోత్రవధానుల ఇంటిపెరడు**

గిరీశం వెంకటేశంతో మతసారాంశం గురించి, పొగాకు గురించి, చుట్టకాల్చడం వల్ల కలిగే లాభాల గురించి, నరకానికిపోతే దేవుడితో చేసేవాదన గురించి, తనకు అధికారం ఇస్తే లోకంలో తాను సరిచేసే లోపాల గురించి చెబుతాడు. బుచ్చమ్మ వచ్చి తన చెల్లెల్ని తప్పించమని అడిగినా ఆ పని చేయలేనంటాడు. తాను రెండు పేజీల ఉత్తరం వ్రాసినా లుబ్ధావధానులు సమాధానం ఇవ్వలేదని బాధపడి బుచ్చమ్మ తనతో లేచివస్తే పెళ్ళి ఆగిపోతుందని అంటాడు. తాను రానంటుంది బుచ్చమ్మ. ఆమె రాకపోతే తాను చస్తానని, ఆమె చెల్లెలు పెళ్ళి ఆగిపోవాలంటే అంతకంటే గత్యంతరం లేదని బలవంతం చేస్తాడు. బుచ్చమ్మ అతనితో వెళ్ళడానికి అంగీకరిస్తుంది.

## పంచమాంకం :

**1వ స్థలం - లుబ్ధావధాన్లు పడక గది :**

లుబ్ధావదాన్లు తన భార్య మొదటి మొగుడు గొంతునులిమి చంపబోతున్నట్లు కలగంటాడు. అతని అరుపులకు అతని కూతురు మీనాక్షి వచ్చింది. పెళ్ళికూతురుకు అంతకు పూర్వం పెళ్ళి అయి ఉండదని, ఆ అమ్మాయి మంచిదని అంటుంది. తాను చస్తే ఇద్దరూ పెళ్ళిళ్ళు చేసుకుంటారని అంటూ లుబ్ధావధాన్లు మీనాక్షిని అక్కడే పడుకోమంటాడు. అతనికి మాదిరిగానే తన మొదటి మొగుడు కలలోకివచ్చాడని, రెండో మొగుడిని చంపుతానని అంటున్నాడని పిన్ని చెప్పిందని మీనాక్షి అంటుంది. ఆడవేషంలో ఉన్న శిష్యుడు వచ్చి లుబ్ధావధానుల్ని కౌగిలించుకుంటాడు. మీనాక్షి అతనిని కొట్టబోతే తప్పించుకోవడం వలన ఆదెబ్బలు ఆమె తండ్రికి తగులుతాయి. శిష్యుడు మీనాక్షిని కరిచి పారిపోతాడు.

**2వ స్థలం- రామప్పంతులు ఇల్లు :**

మధరవాణి పోలిశెట్టి, సిద్ధాంతి, మొదలైన వారితో పేకాట ఆడుతూ ఉంటుంది. ఇంతలో తలుపు తట్టిన చప్పుడు వినిపిస్తుంది. రామప్పంతులు వచ్చి ఉంటాడని చెప్పి, మధురవాణి అక్కడున్న వాళ్ళను ఒక గదిలో పెట్టి బయటకు వస్తుంది. తలుపు తీస్తే కరటక శాస్త్రి శిష్యుడు వస్తాడు. కంటె మధురవాణికి ఇస్తాడు. దాసరి వేషంతో అతడిని తన గురువు దగ్గరకు పంపు తానని మధురవాణి మాట ఇస్తుంది. రామప్పంతులు గొంతుతో మాట్లాడిన శిష్యుడి మాటలు విని గదిలో ఉన్న వాళ్ళు భయపడతారు. మధురవాణి రామప్పంతులు కాదని చెబితే సంతోషించి మరల పేకాట ప్రారంభిస్తారు. ఇంతలోనిజంగానే రామప్పంతులు వస్తాడు. ఉన్న వాళ్ళందరినీ దాచి మధురవాణి తలుపు తీస్తుంది. లుబ్ధావధాన్లు పెళ్ళాన్నిరామప్పంతులే లేవదీసుకుపోయాడని, తనకంటె తన కిస్తేనే లోనికి రానిస్తానని దబాయించి మధురవాణి రామప్పంతులిని తిట్టి, బయటకు నెట్టి తలుపువేస్తుంది. కంటె కోసం వెళితే లుబ్ధావధాన్లు తంతాడని భయపడతాడు రామప్పంతులు.

**3వస్థలం- లుబ్ధావధాన్లు ఇంటివాకిలి :**

ఇంటినుంచి వెళ్ళిపోయిన భార్య చనిపోయిందేమో అని లుబ్ధావధాన్లు భయపడతాడు. రామప్పంతులు కారణంగానే తనకీ అవస్థ ఏర్పడిందని భావిస్తాడు. అపుడే అక్కడికి వచ్చిన రామప్పంతులు తన కంటె ఇప్పించమని అడుగుతాడు.దయ్యాలను సీసాలో బంధించానని గురవయ్య చెప్తాడు. కంటెతో పాటు ఆ అమ్మాయి రామప్పంతులు ఇంటికే వెళ్ళిఉంటుందని లుబ్ధావధాన్లు గొడవచేస్తాడు.

**4వస్థలం-రామచంద్రపురం-సారాయి దుకాణం :**

ఒకబైరాగి, ఒకయోగిని, మునసబు, సాతాని, వీరేశమొదలయిన వారు సారాయి తాగి ఆకాశంగురించి బంగారం చేసే విద్యగురించి సిద్ధులను గురించి మాట్లాడుకుంటూ ఉంటారు. వారితోహెడ్ బాల్యవివాహాలగురించి, రండా గర్భాలగురించి హవల్దారు అచ్చన్నతో ముచ్చటిస్తాడు, రామప్పంతులు వచ్చి యోగినికి సైగచేస్తే ఆమె అతనితో మాట్లాడి, హెడ్‌ను తీసుకుపోతుంది. పారిపోయిన పిల్ల దగ్గర నుండి కంటెను యిప్పించమని, లేదా లుబ్ధావధాన్లును బెదిరించి కంటె విలువైన సొమ్మును గాని ఇప్పించమని రామప్పంతులు హెడ్‌ను కోరతాడు. సాక్ష్యం కోసం దుకాణదారునూ, బైరాగిని తీసుకుని లుబ్ధావధాన్లు ఇంటికి బయలు దేరుతారు.

**5వస్థలం- దేవాలయం గుమ్మందగ్గర :**

హెడ్ లుబ్ధావధాన్లును కంటె గురించి బెదిరించి పన్నెండు రూపాయలు తీసుకుని వదిలిపెడతాడు. కంటె లేకుండా ఇంటికి వెళ్ళ లేనని రామప్పంతులు హెడ్ దగ్గర వాపోతాడు. తానేమీ చేయలేనంటూ మూడురూపాయలు ఇచ్చి హెడ్ వెళతాడు. శిష్యుడు బావిలో దూకి చనిపోయి ఉండడని, మీనాక్షిని అడిగితే విషయం తెలుస్తుందని వాళ్ళ ఇంటికి వెళ్ళి అసిరిగాడికి లంచం ఇచ్చి మీనాక్షిని పిలుచుకురమ్మంటాడు.

**6వస్థలం -లుబ్ధావధాన్లు ఇంటినడవ :**

మీనాక్షి రామప్పంతులుకి వడపప్పు కొబ్బరిముక్కలు పెడితే, అవి దెయ్యానికి పెట్టినవని చెప్పి వాటిని తీసుకుంటాడు, మీనాక్షిని పెళ్ళాడుతానని, మధురవాణిని ఇంట్లోంచి పంపుతానని చెప్పి సరుకులు తీసుకురమ్మంటాడు. తాళంలేదంటే మారు తాళంతో తీస్తానంటాడు రామప్పంతులు. దీపం ఆర్పి ప్రమాణం చేసిన రామప్పంతులు చీకట్లో మీనాక్షిని కౌగిలించుకుంటాడు లుబ్ధావధాన్లు వచ్చి రామప్పంతులిని కొట్టి, మీనాక్షిని, రామప్పంతులినిబయటకు తరిమి వేస్తాడు. రామప్పంతులుఇంటికి వెళ్ళి తలుపు తడతాడు. మధురవాణి కంటె తెస్తేనే తలుపు తీస్తానంటుంది. ఇంతలో మీనాక్షి వచ్చి తనను రాజమండ్రిలో వివాహంచేసుకుంటానని ప్రమాణం చేశాడని, మధురవాణిని వదిలేస్తానన్నాడని చెబుతుంది. మీనాక్షిని చేసుకుంటేనే తలుపు తీస్తానంటుంది మధురవాణి. మంగళ హారతి తెచ్చి ఇద్దరినిలోనికి ఆహ్వానిస్తానంటుంది ఆమె. ఆమె వచ్చేలోపు రామప్పంతులు పారిపోతాడు. దాసరి వేషంలో శిష్యుడు పాటలు పాడుతుంటాడు,

## షష్ఠాంకము :

**1వస్థలం-రామచంద్రపురం :**

పెళ్ళి బస్సులోవచ్చిన అగ్నిహోత్రావధాన్లుకి రామప్పంతులు కనబడతాడు. లుబ్ధావధాన్లుకు పెళ్ళయి పోయిందని చెప్పాడు. లుబ్ధావధాన్లు ఇంటికి వెళ్ళడానికి అతడు తనతో మాట్లాడడని చెప్పి దాసరి వేషంలో ఉన్న శిష్యుడిని పంపి ఇల్లు చూపించమంటాడు. వాడు కొంత దూరం వెళ్ళి అగ్నిహోత్రావధాన్లు కోప్పడ్డం వల్ల ఇల్లు చూపకుండానే వెళ్ళిపోతాడు.

**2వ స్థలం-చెరువు గట్టు :**

లుబ్ధావధాన్లును కొట్టిన అగ్నిహోత్రావధాన్లు క్రిమినల్ కేసు కూడా తీసుకురావాలను కుంటాడు. అతనికి రామప్పంతులు సాయం చేస్తానంటాడు. దావావేయడానికి పోలిశెట్టి దగ్గర నగలు కుదువపెడదామనుకుంటారు. నగల కోసం బుచ్చమ్మ ఎక్కడ ఉందో చూస్తే బుచ్చమ్మ, గిరీశం నగలతో పారిపోయారని తెలుస్తుంది.

**3వ స్థలం-మధురవాణి బస ఎదుటి వీధి :**

పోలిశెట్టి దగ్గర తెచ్చిన డబ్బంతా అయిపోవడంతో ఏమి చెయ్యాలో అర్థంకాని అగ్నిహోత్రావధాన్లుకు తాకట్టు పెట్టడానికి ఏదన్నా తీసుకురమ్మని రామప్పంతులు చెబుతాడు. ఆయన తన తాతల నాటి కడియం తీసియిచ్చి తాకట్టుపెట్టమంటాడు. రామప్పంతులు తన చేతికి ఆ కడియం తొడుక్కుంటాడు. ప్లీడరు నాయుడుతో మాట్లాడి అగ్నిహోత్రావధాన్లుకు అతని మీద నమ్మకం లేదని, భీమారావు పంతులు గారికి వకాల్తా ఇచ్చామని చెప్తాడు. అతనికి కోపంవస్తుంది.

**4వ స్థలం-లుబ్ధావధాన్లు బస :**

వృద్ధాప్యంలో వివాహం తప్పని గ్రహించిన లుబ్ధావధాన్లు , తనకూతురు మీనాక్షికి డబ్బాశతో పెళ్ళి చేసినందుకు బాధపడతాడు. సౌజన్యారావు పంతులు దయవల్ల ఈ కేసులో తప్పించుకుంటే మీనాక్షిని మఠంలో ఉంచి కాశీకి వెళ్ళాలని అనుకుంటాడు రామప్పంతులు వచ్చి తాను కంటెకోసం రాలేదని, ఈ కేసులో ఉరిశిక్ష తప్పించుకోవాలంటే డిప్టీకలక్టరుకు, ఇన్సపెక్టరుకు లంచం ఇవ్వాలని, ప్రస్తుతం

డబ్బు లేకపోతే అప్పు ఇప్పిస్తామని చెప్తాడు. లుబ్ధావధాన్లు అంగీకరించడు. సౌజన్యరావు పంతులు వచ్చి రామ పంతులును వెళ్ళి పొమ్మంటాడు. ఎవరికి లంచాలు ఇవ్వనవసరంలేదని చెప్తాడు. గుంటూరు శాస్త్రులు గుంటూరు వాడు కాడని, అతని మాటతీరు, యాస ఎలాగుంటుందో గుర్తు చేసుకోమని చెప్తాడు.

**5వ స్థలం - విశాఖపట్టణంలో వీధి :**

కరటకశాస్త్రి శిష్యుడితో కంటె మధుర వాణికి ఇవ్వడం వలన ఈ కేసు జరుగుతూ ఉందని, ఈ గొడవ లేకుండా చేసుకోవాలంటే మధురవాణి దగ్గర కంటె తెచ్చి, దానితో పాటు పన్నెండు వందలు లుబ్ధావధాన్లుకు పంపిస్తే ఖూనీ కేసు పోతుందని, రామప్పంతులు కంటబడకుండా మధురవాణిని కలుసుకోవడం మంచిదని అంటాడు.

**6వ స్థలం - మధురవాణి బస** :

కరటక శాస్త్రి, శిష్యుడితో మధురవాణి ఇంటికి వెళ్ళి కంటె ఇస్తే తాము బతికి బయటపడతామని అంటారు. ఇద్దరికీ జైలుశిక్ష పడుతుందని మధురవాణి బెదిరిస్తుంది. తాను జీవితంలో ఆడవేషాలు వేయనని, మధురవాణికి శిష్యరికం చేస్తానని శిష్యుడు చెబుతాడు. కంటె డబ్బు పంపించాలని అనుకుంటున్నట్లు కరటక శాస్త్రి చెప్పాడు. సౌజన్యారావు పంతులు మంచివాడని. ఆయన మధురవాణి కంటె ఆమెకు ఇప్పిస్తాడని, ఆయన వేశ్యలతో మాటాడరని కరటక శాస్త్రి చెబుతాడు. మధురవాణి డిప్టీకలక్టరు తనమీద కోరికతో ఉన్నాడని చెప్పగానే, అతనితో గడిపి తనకు ఆపద తప్పేటట్లు చూడమంటాడు శాస్త్రి మధురవాణి మనుషుల స్వార్థతత్వాన్ని గురించి చెప్పి, శిష్యుడికి తప్పకుండా పెళ్ళిచేయమని చెప్పి కంటె కరటక శాస్త్రి చేతికి ఇస్తుంది. మధురవాణి శిష్యుడి చేత తత్వాలు పాడిస్తుంది.

**7వ స్థలం-సౌజన్యారావు పంతులు ఇల్లు :**

సౌజన్యారావు పంతులు అగ్నిహోత్రావధాన్లును పిలిపించి పిల్లలను అమ్మడం తప్పని, రెండోపిల్లకి మంచివరుడినిచూచి పెళ్ళిచేయమని, పెద్ద పిల్లని మఠంలో చేర్పిస్తేసుఖంగా ఉంటుందని. ఆమె ఆస్తి ఆమెకి ఇస్తే మంచిదని ఈ విధంగా చెయ్యకపోతే తానే దావావేస్తానని బెదిరించాడు. తానుచెప్పినట్లు చేస్తే లుబ్ధావధాన్లు తెచ్చిన కేసు లేకుండా చేస్తాననిమాటయిచ్చి ఆలోచించుకోమని సలహా ఇచ్చారు. అగ్నిహోత్రావధాన్లు విధవావివాహం చేయమన్నాడని, గిరీశం పక్షం మాట్లాడాడని సౌజన్యారావు పంతులిని తిట్టి వెళ్ళిపోయాడు.

## సప్తమాంకం :

**1వ స్థలం-విశాఖపట్టణంలోవీధి :**

బైరాగి తాను కాశీనుంచి వస్తున్నట్లు శూద్రులతో చెప్పేసమయంలో సారాయి దుకాణదారువచ్చి తనడబ్బు ఇమ్మంటూ బైరాగిని పట్టుకున్నాడు. అంతలో హెడ్ వచ్చి అతడిని విడిపించి ఆ రోజు లుబ్ధావధాన్లు దగ్గర డబ్బు తీసుకున్న తరువాత తన కంటె రాలేదని

రామప్పంతులు అర్జీలు పెట్టాడని, ఖూనీకేసు మాపు చేసినట్లు తనను తాసీల్దారు తిడుతున్నాడని, గుంటూరు శాస్త్రులు ఎక్కడున్నాడో తెలిస్తే సౌజన్యారావు పంతులు తనను రక్షించగలడని, ఆ శాస్త్రుల జాడ తెలిసేమార్గం చెప్పమని అడుగుతాడు. బైరాగి సరేనంటాడు. హెడ్ అతడిని తీసుకుపోతాడు.

**2వస్థలం-డిప్టీకలెక్టరు కచేరీ :**

డిప్టీకలెక్టరు అగ్నిహోత్రావధాన్లు కేసు గురించి అడుగతాడు. భీమారావు, నాయుడు కేసుగురించి చెప్తారు, గిరీశం బుచ్చమ్మను లేవదీసుకుపోయిన విషయం గురించిన చర్చ వస్తుంది. పిల్లవయసు పదహారు లోపని నిరూపించడానికి జాతకం ఇస్తారు. భీమారావు, నాయుడు అగ్నిహోత్రావధాన్లు తమకే వకాల్త ఇచ్చాడని తామేమాట్లాడాలని వాదించుకుంటారు.జాతకంలోఉన్న సంవత్సరం తప్పని తెలుసుకున్న కలెక్టరు తిడతాడు. ముద్దాయి ఇంటిపేరు, సాకీను లేకుండా అర్జీపెట్టినందుకు కేకలేస్తాడు. ముద్దాయిపేరు గిరీశం అని తప్పతనకింకేమీ తెలియదని అగ్నిహోత్రావధాన్లు చెబుతాడు. డబ్బిస్తే గాని ఇంకమాట్లాడనని భీమారావు అంటే రామప్పంతులు ఎప్పుడోజారుకున్నాడని నాయుడు చెబుతాడు. ఫోర్జరీ కేసుకింద జైలుశిక్ష పడుతుందని నాయుడు అగ్నిహోత్రావధాన్లును బెదిరిస్తాడు.

**3వస్థలం-సౌజన్యారావు పంతులు కచేరిగది :**

సౌజన్యారావు పంతులు పోలిశెట్టిని పిలిపించి లుబ్ధావధాన్లును కాపాడడానికి సాక్ష్యం చెప్పమంటాడు. తాను ఎవరు ఏమిచెప్పినా వింటానని, తనను ఈసాక్ష్యం విషయంలో వదలిపెట్టమని, తన భార్యకు జబ్బుగా ఉందని పోలిశెట్టి వాపోతాడు. పోలిశెట్టి భయపడుతున్నాడనిగ్రహించిన సౌజన్యారావు పంతులు అతడివల్ల ప్రయోజనం ఉండదని పంపించివేస్తాడు.

**4వస్థలం -వీధి :**

భీమారావు వల్ల కేసు పోయిందని, రామప్పంతులు కడియం, కంటె కాజేశాడని, ఫోర్జరీ కేసు లేకుండా చేసినందుకు తనకు సొమ్ముముట్టజెప్పమని నాయుడు అగ్నిహోత్రావధాన్లును అడుగుతాడు. తనవద్ద ఏమీలేదని, ప్రామీసరీనోటు వ్రాయనని, తమ ఊరువస్తే రెండుపుట్లు మిరపకాయలు ఇస్తానంటాడు అవధాన్లు. సౌజన్యారావు పంతులు లుబ్ధావధాన్లుకు సహాయపడుతున్నాడని అందుచేత లుబ్ధావధాన్లుకు శిక్షపడదని చెప్తాడు నాయుడు. అంతలో గిరీశం కనబడతాడు. అగ్నిహోత్రావధాన్లు కాళ్ళుపట్టి లాగి మావగారికి నమస్కారం అంటూ పారిపోతాడు. అగ్నిహోత్రావధాన్లు తిట్లదండకం ప్రారంభిస్తాడు.

**5వస్థలం- లుబ్ధావధాన్లు బస :**

తన వద్దకు వచ్చిన గిరీశంతో అగ్నిహోత్రావధాన్లు కూతుర్ని లేవదీసుకుపోయి తగిన శాస్తి చేశావంటూ లుబ్ధావధాన్లు మెచ్చుకుంటాడు. సౌజన్యారావు పంతులు సలహా చెప్పమని పంపించాడని, తనకు పెంచుకోవలసిందనీ, దత్తతపత్రిక రాయడం మంచిదనీ గిరీశం లుబ్ధావధాన్లుతో అన్నాడు. పంతులుగారు మంచివారనీ, ఆయన చెప్పినట్లు చేస్తాననీ సమాధానం ఇచ్చిన అవధానితో గిరీశం తాను ఉత్తరంలో చెప్పినట్లు చేస్తే అవస్థ ఉండేది కాదని అంటాడు. అంతలో హెడ్ వచ్చి బైరాగి ఎటో వెళ్ళాడని, గుంటూరు శాస్త్రుల విషయం తెలియలేదని అంటే దుకాణదారు తాను సాక్ష్యం చెప్పను అని అంటాడు. అసిరిగాడు వచ్చి తమ ముసల్ది చనిపోయిందని తాను వెళ్ళాలి కాబట్టి సాక్ష్యం చెప్పలేనని అంటాడు. తాను అసిరిగాడిచేత సాక్ష్యం చెప్పిస్తానని గిరీశం అంటాడు. గిరీశాన్ని నమ్మకోవడం మంచిదని హెడ్ అవధాన్లుకి హితబోధ చేస్తాడు. గవరయ్యవచ్చి మాయలు, మంత్రాలు అని మోసం చేయబోతాడు. గిరీశం అతనిని నమ్మడు. తాను సాక్ష్యం చెప్పనని వెళ్ళిపోతాడు.

**6వస్థలం - సౌజన్యారావు పంతులు ఇల్లు :**

గిరీశం సౌజన్యారావు పంతులుతో మాట్లాడుతూ అబద్ధం ఆడడం పాపమని, తాను అసత్యాన్ని సహించలేనని, గుంటూరు శాస్త్రులు తెలిసే మార్గం చెబితే పట్టుకొస్తానని, తాను సంఘసంస్కరణ కోసమే బుచ్చమ్మను వివాహమాడదలచానని, తనను లుబ్ధావధానులు పెంచుకోక పోయినా బుచ్చమ్మనే పెళ్ళాడుతానని తాను వేశ్యావృత్తికి వ్యతిరేకిని చెబుతుంటాడు. అప్పుడు మారు వేషంలో మధురవాణి

వస్తుంది. ఆమెను చూచి గిరీశం గతుక్కుమంటాడు. ఆమె తానెవరో చెప్పకుండా మనుషుల్లో మంచితనం గురించి ప్రస్తావిస్తే గిరీశం, సౌజన్యారావు పంతులు ఆవిషయం గురించే చర్చ సాగిస్తారు. గిరీశం తనకు తెలుసు అని మధురవాణి చెప్పేసరికి గిరీశం చిన్నగా జారుకుంటాడు. వేశ్యావృత్తి గురించి సౌజన్యారావు మధురవాణి కొంతసేపు సంభాషిస్తారు. వేశ్యలంటే తనకున్న ఏహ్యాభావాన్ని పంతులు వివరిస్తే, వేశ్యల్లో కూడా మంచివాళ్ళు ఉంటారని మధురవాణి వాదిస్తుంది. తను వేశ్యనని, తనకొక ముద్దు అనుగ్రహిస్తే లుబ్ధావధానుల కేసు విషయం చేస్తానని అంటుంది. ముందు కాదన్నా, కేసు కోసం సరే అంటాడు. గుంటూరు శాస్త్రులు అంటే కరటక శాస్త్రి అని, పారిపోయినది అమ్మాయి కాదని, అతడు కరటక శాస్త్రి శిష్యుడని చెప్పి ఎవ్వరికి హాని కలుగకుండా చేయమని మధురవాణి కోరుతుంది. పంతులు అంగీకరిస్తాడు. తన ఫీజు ఇవ్వమని మధురవాణి అడుగుతుంది. వ్రతభంగం అయినా ఇస్తానంటాడు పంతులు. చెడనివారిని చెడగొట్టనని ఆమె నిరాకరిస్తుంది. అక్కడ ఉన్న భగవద్గీతను గురించి అడిగి తెలుసుకుంటుంది. ఆపుస్తకం అడిగి తీసుకుంటుంది. వృత్తిమాని వేస్తానని అప్పుడప్పుడు దర్శనం చేస్తానని చెబుతుంది.

గిరీశం గురించి పంతులు అడిగితే ఉన్న విషయం అంతా చెబుతుంది. బుచ్చమ్మ బ్రతుకు చెడకుండా చేయాలని అనుకున్న పంతులు గిరీశాన్ని పిలిచి బుచ్చమ్మకు చదువు చెప్పిస్తానని, అతని ప్రవర్తన మార్చుకుంటే చదివిస్తానని అంటాడు. మధురవాణి బుచ్చమ్మను కాపాడి మహోపకారం చేసింది కనుక ఆమెకు షేక్‌హండ్ ఇచ్చి గిరీశాన్ని, వెళ్ళిపొమ్మంటాడు.

"డామిట్! కథ అడ్డంగా తిరిగింది" అంటూ గిరీశం వెళ్ళిపోతాడు.

డా॥ కందిమళ్ల సాంబశివరావు

### రెండోభాగం - నాటకం

# కన్యాశుల్కం నాటకం - గురజాడ అప్పారావు

## పాఠం- 14.0

**14.0 : కన్యాశుల్కంలోని ప్రధాన పాత్రలు**

**14.1 : అప్రధాన పాత్రల ప్రాముఖ్యం**

**14.2 : సందర్భ సహిత వ్యాఖ్యలు**

### 14.0 : కన్యాశుల్కంలోని ప్రధాన పాత్రలు :

నాటకమంటే కేవలం మాటలు కాదు. అందులోని పాత్రలూ వారి భావాలు., ప్రభావం మంచిచెడూ., యుక్తి కుయుక్తి మాటకారితనం, లోభితనం, ఇలా ఎన్నోగుణాల సమ్మేళనం. కన్యాశుల్కం నాటకాన్ని చిరంజీవిగా చేసిన ముఖ్య హేతువుల్లో పాత్రచిత్రణ బలీయమైనది. కన్యాశుల్కంలోని ప్రతిపాత్ర ఒక దృక్పథానికి ప్రతినిధి. ఒక వ్యవస్థకు, అవ్యవస్థకు ప్రతినాధులు. పాత్రలన్నీ జీవశక్తితో మన కళ్లెదుట ప్రత్యక్షమౌతాయి. ప్రతిపాత్ర మన చెట్టూ వున్న మనుషుల రూపంలో ప్రత్యక్షమౌతుంది. ఒక్కొక్క సందర్భంలో ఆ పాత్ర లక్షణం మనలోనూ కనిపిస్తుంది. భుజాలు తడుముకోవడం మన వంతు. ఏ మనిషీ మంచివాడు కాదు. అలాగని చెడ్డవాడూ కాదు. చేదు అనుభవమూ., ఎదురైన ఆటుపోట్లు ఒక మనిషిలో పంతాన్ని రేపి చెడువైపు నడిపిస్తే., అనుభవాల పాఠాలు చదివి., తీపి జ్ఞాపకాలతో మంచివారుగా చక్కబడతారు. ఒక రచన ద్వారా మానవ సంస్కారాన్ని పెంపొందించడానికి రెండుపద్ధతులు కనిపిస్తాయి. ఆదర్శవంతులైన వారిని ప్రధానపాత్రలుగా స్వీకరించి ఒక ఆశయం కోసం ఆదర్శం కోసం వారు చేసే ఘనకార్యాలూ., త్యాగాలనూ కథావస్తువుగా తీసుకోవడం ఒక పద్ధతి. సాదాసీదా మనుషులు ; సర్వసాధారణమైన సంఘటనలు; మామూలు పరిస్థితిలోనే మనిషి చేసే తప్పులు, ఒప్పులు., వాటి ప్రభావంతో ఇతరులు గిలగిలా కొట్టుకోవడం దరిమిలా మానవ జీవితం తిరిగే మలుపులను తెలియజేసేది రెండవ పద్ధతి. గురజాడ రెండవ పద్ధతినే ఎన్నుకొని సాధారణమైన నాటక ఫలితాన్ని రాబట్టారు.

### కన్యాశుల్కంలోని పాత్రలు :

| పురుషపాత్రలు | స్త్రీ పాత్రలు |
|---|---|
| అగ్నిహోత్రావధానులు | వెంకమ్మ |
| వెంకటేశం | బుచ్చమ్మ |
| కరటక శాస్త్రి | మీనాక్షి |
| కరటక శాస్త్రి శిష్యుడు | మధురవాణి |
| లుబ్ధావధాన్లు | |
| రామప్పంతులు | |
| గిరీశం | |
| సౌజన్యారావుపంతులు | |
| భీమారావు పంతులు | |
| నాయుడు | |
| పూజారిగవరయ్య | |

వీరితోపాటు డిప్టీకలెక్టర్, హెడ్‌కనిస్టేబు, పోలిశెట్టి సిద్ధాంతి, బైరాగి, దుకాణుదారు, గ్రామమునసబ్, హవల్దారు, యోగిని

లుబ్ధావధానుల నౌకరు, అసిరిగాడు, మనవాళ్ల, వీరేశ మొదలైన వారు

## ప్రధాన పాత్రలు :

గిరీశం : లుబ్ధావధానుల పినతల్లి కొడుకు, దురాచారి, స్త్రీలోలుడు, వేశ్యాలంపటత్వం కలవాడు, అనర్గళంగా ఇంగ్లీషు ధారాళంగా తెలుగు మాట్లాడగల వాక్చాతుర్యం కలవాడు. ఎప్పటికి ఏది ప్రస్తుతమో దానికి అనుగుణంగా మాట్లాడగల సమయస్ఫూర్తి ఇతని సొత్తు. స్త్రీ లోలత్వానికి ఎక్కడి డబ్బూ చాలదు. పూటకూళ్లమ్మను మాయచేసి డాన్సింగ్ గర్ల్ క్రింద ఖర్చు చేస్తాడు. మొఖం చాటువేయడానికి వెంకటేశానికి వేసవిలో చదువు చెప్పే మిషతో కృష్ణరాయపురం చేరుకొంటాడు. వెంకటేశం అక్క బుచ్చమ్మను ఒక పథకం ప్రకారం లొంగదీసుకుంటాడు. ఒకపక్క మధురవాణితో స్నేహం కొనసాగిస్తుంటాడు. లుబ్ధావధాన్లుకు మాయమాటలు చెప్పి ఆస్తిని తనపేరు వ్రాయించుకోవడానికి ప్రయత్నిస్తాడు. బుచ్చమ్మని తీసుకొని వెళతాడు. నెపోలియన్ ఆఫ్‌యాంటీనాచ్‌గా పోజుపెట్టి సౌజన్యారావు పంతుల మెప్పును పొందుతాడు. మధురవాణి గిరీశం నిజస్వరూపాలన్నీ బట్టబయలు చేయడంతో సౌజన్యారావు గిరీశాన్ని గెంటివేస్తాడు. తన బండారం బట్టబయలు కావడంతో డామిట్ కథ అడ్డం తిరిగింది అంటూ మరో మజిలీకి ప్రయాణం కడతాడు.

రామప్పంతులు:- రామచంద్రాపుర అగ్రహారం కరణం. లౌక్యం ఇతని నరనరాల్లో జీర్ణించుకొనిపోయింది. దొంగ సాక్ష్యాలు, ఫోర్జరీలు, జాతాకాల బనాయింపులు, డామేజీ దావాలు, పెళ్లిబేరాలు, కమీషన్లు ఇతని ప్రవృత్తి. కుటిలుడు, ద్రోహబుద్ధికలవాడు. నక్కజిత్తులతో ఎత్తుకుపై ఎత్తులు వేస్తూ తాను చిత్తవుతూ ఉంటాడు. గిరీశం మాటల్లో చెప్పాలంటే గుంటనక్క. అటకల మీద మోపులు తాటాకులు, రకరకాల సిరాలు, బుర్రలో మోసకారిత్వంతో దొంగ పిటీషన్లు పెట్టడం ఇతని నైజం. మధురవాణిని తెచ్చి రామచంద్రాపురంలో ఒక చోట ఉంచుతాడు. వయసుమళ్లినా మీసాలకు రంగువేసుకొని లేని ఆడంబరాలతో డంబాలు పలికే విలాసపురుషుడు. గొడవలు సృష్టించడం వరకే తెలిసిన రామప్పంతులు అది అటుతిరిగి యిటుతిరిగి తనపీకలమీదకు వచ్చినపుడు పిరికిపందలా ఉడాయిస్తాడు. లుబ్ధావధానులు విధవాకుమార్తె మీనాక్షితో సరససల్లాపాలు చేస్తూ ఆమెను మోసం చేస్తుంటాడు. అబద్ధపు సాక్ష్యం చెప్పబోయి సౌజన్యారావు పంతులు చేత పరాభవం పొందుతాడు.

## అగ్నిహోత్రావధానులు :

అతికోపిష్ఠి: ఎదుటివారిని లక్ష్యపెట్టక తనమాట చెల్లించుకోవాలనే మొండి పట్టుదల కలవాడు. ఇంగ్లీషు చదువులు చదివితే ప్రాణం మీదకు అపాయం ముంచుకువస్తుందని ఇతని గుడ్డి నమ్మకం. కొడుకు చదువు కొంపగుండమై పోతుందని భార్యపై దుర్వాసునిలా నిప్పులు కక్కుతాడు. ఆడపడుచులను అమ్ముకోవడం శిష్టాచారమని ఇతని వాదం. సంఘసంస్కరణ ఇతనికి పీడకల. చిన్నపిల్లలను పెద్దవాళ్లకు కట్టబెట్టకపోతే శుల్కము లభించదు. కాబట్టి సుబ్బిని 1800వందలకు అమ్మివేయడానికి నిర్ణయించాడు. ఎవరైనా సలహా యిస్తే చెడతిట్లు తిడతాడు. బుచ్చమ్మ లేచిపోయిందని బాధపడటం మానివేసి తిట్లపురాణం చదువుతాడు. తాను పట్టిన కుందేటికి మూడేకాళ్లని బల్లగుద్ది వాదిస్తాడు. భార్యతో చెప్పకుండా సుబ్బిపెళ్ళిని ఖాయం చేయడంతో, భార్య గొడవ చేయడంతో 'తాంబూలాలిచ్చాను తన్నుకు చావండి' అంటూ కేకలు వేస్తాడు. లుబ్ధావధానులపై దావావేసి ఫకీరైపోయాడు. తాను దావాలో ఓడిపోయినా లుబ్ధావధానులకు శిక్షపడలేదని కుమిలిపోతాడు. పూర్వాచారాలు ఊబిలో బిగుసుకొని అందులోనే సుఖం ఉందనుకొనే ఛాందసుడు.

## లుబ్ధావధానులు :

సార్థక నామధేయుడు లుబ్ధావధానులు డబ్బు అయాచితంగా వస్తుందంటే చావడానికైనా సిద్ధం. కాటికి కాళ్లు చాపిన వృద్ధుడు. ఈ లోభితనాన్ని ఆసరాగా చేసుకొని లుబ్ధావధాన్లని రామప్పంతులు పెళ్లికి ప్రోత్సహిస్తాడు. జాతకరీత్యా వల్లమాలిన ధనం వస్తుందని ఆశపెడతాడు. పెళ్లి చేసుకోకపోతే మారకమో (అంటుకొనెడి చెడ్డ వ్యాధి) ధననష్టమో వస్తుందని తాను తయారుచేసిన జ్యోతిష్యుల చేత రామప్పంతులు చెప్పిస్తాడు. దీనితో లుబ్ధావధానులు పెళ్లికి సిద్ధమయ్యాడు. ఇదే ఇతని కొంపముంచి ఖూనీకేసు మెడకు చుట్టుకుంటుంది. సౌజన్యారావు పంతులు మూలంగా చావుతప్పి కన్నులొట్టబోయి బ్రతుకుజీవుడా అంటూ ఈ జంఝాటం నుంచి బైటపడతాననే అంత

దురదృష్టవంతుడు లోకంలో ఎవరూ లేడు. తప్పంతా నాయందుంచుకొని విధిని నిందించడం ఎందుకు. డబ్బుకు లొభపడి ఒక్కగానొక్క కూతుర్ని ముసలాడికమ్మాను. నాజీవానానికి ఉసూరంటూ అది కాని తిరుగుళ్ళ తిరిగిందంటే దాని తప్పా! బుద్ధితక్కువ వెధవని. ముసలితనంలో నాకు పెళ్లేమిటి, ఆ మాయగుంట పారిపోవడమేమిటి. ఆ ఇనసపెకటరు ఖూనీ చేశామని మమ్మిలను సలపెట్టడమేమిటి. అంతా ఘోరకలి. ఏమి చిత్రాలు. వెధవలకు మఠం కట్టారట. ఎన్నడూవినలేదు అమ్మని వెళ్లి ఆ మఠం చూడమంటాను. దానికి ఇష్టం కలిగిందా దానికి కావలసిన డబ్బు ఇస్తాను అంటూ చిట్టచివరకు తన ఛాందసపు కల్మషంలో నుంచి వెలుపలికి వస్తాడు.

## సౌజన్యరావు పంతులు

సౌజన్యారావు విశాఖపట్టణంలో పేరు ప్రఖ్యాతులున్న ప్లీడరు. సత్యంవద ధర్మంచర అనే సూక్తిని అక్షరాలా ఆచరణలోపెట్టే దయాగుణ సంపన్నుడు. సంఘసంస్కరణాభిలాషి పరోపకారపరాయణుడు. యాంటీనాచ్‌గా ధృఢమైన దీక్షకలవాడు. వేశ్యలను అసహ్యించుకొనే సౌజన్యారావు మధురవాణి ఉన్నత వ్యక్తిత్వాన్ని గుర్తించి ఆమెను యథోచితంగా గౌరవించి భగవద్గీతను బహుమతిగా ఇస్తాడు. లుబ్ధావధానులపై వచ్చిన ఖూనీకేసు అబద్ధమని తెలుసుకొని దానినుంచి అవధానిని తప్పించడానికి శాయశక్తులా కృషి చేస్తాడు. భగవద్గీతలోని శ్రీకృష్ణభగవానుని ఉపదేశము ఇతని లక్ష్యము. సౌజన్యారావు మంచికి మారు పేరు. మానవాళికి మరోపేరన్న సార్థక నామధేయుడు.

## మధురవాణి:

వేశ్యావృత్తితో శరీరం మాలిన్యమైనా మనసుకు ఎటువంటి మలినం అంటని మంచితనం, గూనవత్వం ఉన్న మంచిమనిషి మధురవాణి. సంగీత సాహిత్యాలలో అందెవేసిన చేయి. గిరీశం వద్ద ఇంగ్లీషు నేర్చుకుంటుంది. కొన్నాళ్లు అతని ప్రాపకంలో ఉన్న రాయప్పంతుల మాయలోపడి రామచంద్రాపురం చేరుకొంటుంది. తనతెలివితేటలు రామచంద్రాపురంలో అడవిగాచిన వెన్నెలవలె వృథాగా పోతున్నట్లు బాధపడుతున్న సమయంలో కరటకశాస్త్రికి తోడుగా మాయవివాహానికి సూత్రధారిగా వ్యవహరిస్తుంది. క్రమంగా మధురవాణి తన వృత్తిలోని హీనత్వాన్ని గుర్తిస్తుంది. స్త్రీ జీవితం పరిపూర్ణత చెందడానికి డబ్బు, వేశ్యావృత్తి కారణాలు కాజాలవని జ్ఞానోదయం చెంది సౌజన్యారావు వద్ద గిరీశం మోసకారిత్వాన్ని బట్టబయలు చేస్తుంది. వేశ్యజాతి చెడ్డదేకాని తాము సెలవిచ్చినట్లు చెడ్డలో మంచి ఉండకూడదా అని సౌజన్యారావును ప్రశ్నిస్తుంది. మధురవాణి వేశ్య అయినా ఆమెది సరళస్వభావం. నిర్మలమైన అంతఃకరణ, పరోపకారబుద్ధి, నిస్వార్థతా, కొంపలు కూలదోసే గాలివానలో కూడా ముచ్చటగా నాట్యంచేసే విలక్షణ స్వభావమూ తన చతురతతో ఎంతటి ప్రళయాగ్నినైనా వారించే ధీమా, ముగ్ధమనోహరమైన అమాయకత్వం ఆమె స్వభావం.

## 14.1. అప్రధాన పాత్రల ప్రాముఖ్యం :

### కరకటశాస్త్రి:-

కరకట శాస్త్రి మంచిపండితుడు. గొప్ప లోకజ్ఞానం ఉన్నవాడు. రామప్పంతులు సహాయంతో మాయసుబ్బిని లుబ్ధావధానులకు అంటగట్టి ఆఖరికి రామప్పంతులుకి టోపీవేసి ఆయన ఊళ్లోలేని సమయంలో ముహూర్తాన్ని ఎనిమిది ఘడియలు ముందుకు లాగించి పెళ్లి అయిందనిపించి డబ్బుతో అగ్రహారానికి ఉడాయిస్తాడు. విజయనగరంలో సంస్కృత నాటకాలు వేసే అనుభవంతో తను గుంటూరు శాస్త్రులై శిష్యుడు మహేశాన్ని మాయసుబ్బిగా చేసి నాటకం నడిపిస్తాడు. అభం శుభం తెలియని తన మేనకోడలిని పెళ్లితప్పించడం ఇతని ఉద్దేశం. ఈ వ్యూహరచనలో మధురవాణి సహాయసహకారాలను స్వీకరిస్తాడు.

### వెంకటేశం

వెంకటేశం అగ్నిహోత్రావధానుల కుమారుడు. మందమతి తెలివితేటలు పూజ్యం. ఒక్కొక్క క్లాసులో మూడేళ్లకుపైగా బైఠాయించే మొద్దబ్బాయి. ఎంతసేపూ తిండియావ. చేగోడిలు, పులుసటుకులు, గేదెపెరుగు, జామపళ్లు వీటితో పొద్దుపుచ్చేవాడు. గిరీశం పుణ్యామా

అని చుట్ట అలవాటు చేసుకొన్నాడు. గిరీశం ఎలా చెబితే గొఱ్ఱెలాగా తల ఊపడమేగానీ స్వతహాగా తెలివితేటలు లేవు. పెళ్లికి ఏనుగులు, గుఱ్రాలతో దర్జాగా వెలుతున్నప్పుడు వెంకటేశాన్ని బుచ్చమ్మను ఒక బండిలో కూర్చోబెడతారు. దారిలో బుచ్చమ్మను తీసుకొనిపోవాలనే ఎత్తుగడతో గిరీశం వెంకటేశాన్ని ఏనుగు ఎక్కిస్తాడు. ఏనుగెక్కిన సరదాయే కానీ అక్క బాధ రవ్వంతలేదు. తెల్లవారాక తండ్రిచేత చావుదెబ్బలు తింటాడు.

### వెంకమ్మ:-

వెంకమ్మ అగ్నిహోత్రావధానుల భార్య. కరటకశాస్త్రికి స్వయనా తోడబుట్టిన చెల్లెలు. బాల్య వివాహాలకు విరుద్ధం. ధనాశతో చిన్నపిల్లలను ముసలివాళ్లకు యిచ్చి పెళ్లిచేయడం అమానుషమని పెద్దకూతురు బుచ్చమ్మను చూసి అనుభవపూర్వకంగా తెలుసుకొంటుంది. తన రెండవ కుమార్తె సుబ్బమ్మను లుబ్ధావధానులుకు ఇచ్చి పెళ్లిచేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తుంది. కొడుకు వెంకటేశానికి పెళ్లిచేయడానికి పుట్టింటి వారిచ్చిన తన పొలాన్ని అమ్మివేయమని గొడవపెడుతుంది. భర్త మూర్ఖత్వాన్ని భరించలేక నిస్సహాయంగా నూతిలో దూకి ఆత్మహత్యకు పాల్పడుతుంది. గిరీశం ఆమెను రక్షిస్తాడు.

### మీనాక్షి:

పరమలుబ్ధాగ్రేశ్వర చక్రవర్తి అయిన లుబ్ధావధానుల కుమార్తె మీనాక్షి. బాల్యవితంతవు, తనకు సౌఖ్యాలను రుచిచూపించిన రామప్పంతులను వివాహమాడి జీవితం గడపాలని కలలుకంటుంది. రాత్రిపూట దొంగతనంగా వచ్చిన రామప్పంతులు తనను ముద్దుపెట్టుకొని పెళ్లాడతానని చెప్పినా అతనిని పూర్తిగా విశ్వసించక దీపం ఆర్పి ప్రమాణం చేయమంటుంది. దీనితో తన కష్టాలన్ని గట్టెక్కాయని భ్రమించిన మీనాక్షి మధురవాణితో నిన్నువదిలేసి నన్ను రాజమహేంద్రవరం తీసుకుపోయి పెళ్లాడతానన్నాడు. దీపమార్పి ప్రమాణం కూడా చేశాడు అన్న అమాయకురాలు. కన్యాశుల్క వ్యవస్థకు తన జీవితాన్ని నైవేద్యంగా అర్పించుకొని తెల్లనివన్నీ పాలు నల్లనివన్నీ నీళ్లు అని నమ్మే అమాయకురాలు.

### బుచ్చమ్మ:-

బాల్యవితంతువులకు సంఘం నిర్దేశించిన అన్ని పనులనూ తలవంచుకొని గొడ్డుచాకిరి చేసే అభాగ్యురాలు బుచ్చమ్మ. మినప్పప్పురుబ్బడం, నీరుతోడడం, విస్తళ్లు కుట్టడం వంటివి ఆమె దినచర్యలో భాగాలు. అగ్నిహోత్రావధానుల పెద్దకుమార్తె. తమ్ముడికి పెళ్లిచేయాలంటే నాడబ్బు ఇచ్చివేయండి. కానీ సుబ్బిబ్రతుకును బుగ్గిపాలు చేయవద్దని తండ్రిని ప్రాధేయపడుతుంది. తండ్రి ధనలోభ పిశాచానికి తనలాగే తనచెల్లిలి బ్రతుకు అడవిగాచిన వెన్నెల కాకూడదని ఈపెళ్లి తప్పించే ఉపాయాన్ని చెప్పమని గిరీశాన్ని ప్రాధేయపడుతుంది. గిరీశం మాయమాటలునమ్మి అతనితో వెళ్లిపోతుంది. సౌజన్యారావు పంతులు మూలంగా గిరీశం వలలో నుండి తప్పించుకొంటుంది.

## 14.2. సందర్భసహితవ్యాఖ్యలు - ప్రథమాంకము :

**1. నాతో మాట్లాడటమే ఒక ఎడ్యుకేషన్ !**

**పరిచయం:-** ఈ వాక్యం గురజాడ అప్పారావు గారు రచించిన కన్యాశుల్కం నాటకంలోని ప్రథమాంకం నుంచి గ్రహింపబడింది.

**సందర్భం:-** పరీక్షలో తప్పిపోయిన వెంకటేశం గిరీశం వద్దకు వెళ్లాడు. గిరీశం వెంకటేశం పరీక్షలో తప్పినట్లు గ్రహించి ఆతడ్ని ఓదారుస్తూ మాటాడిన సందర్భంలోనిది.

**వివరణ:-** పరీక్షలో తప్పినపోయిన వెంకటేశం గిరీశం వద్దకు వెళ్లాడు. గిరీశం వెంకటేశాన్ని ఓదార్చి తనవైపు తిప్పుకోవాలని భావించాడు. "మీ మాష్టారే నిన్ను ఫెయిల్ చేశాడు. లేకపోతే మఖ్ఖ ఫెయిలయ్యేవాడివికాదు. ఆతనికి నాకు కొంతకాలంగా విరోధం

వుంది. ఆయన చెప్పేదంత తప్పులు తడక. ఆ విషయాన్నే నేను పత్రికల ద్వారా విమర్శించాను. అప్పటి నుండి ఆయనకు నేనంటే కడుపుమంట. అందుకే నాశిష్యుడవైన నిన్ను పరీక్ష తప్పించాడు. ఇకనైనా నిజం తెలుసుకో. నన్ను విమర్శించటం మానుకో. నిజం ఆలోచిస్తే నాతో మాట్లాడటమే ఒక ఎడ్యుకేషన్ ఈ విషయాన్ని గ్రహించు అని గిరీశం వెంకటేశంతో చెప్పాడు.

**2. పొగతాగనివాడు దున్నపోతైపుట్టున్ !**

**పరిచయం:-** ఈ వాక్యం గురజాడ అప్పారావు గారు రచించిన కన్యాశుల్కం నాటకంలోని ప్రథమాంకం నుంచి గ్రహింపబడింది.

**సందర్భం:-** పొగ తాగడం యొక్క ఆవశ్యకాన్ని వివరిస్తూ గిరీశం వెంకటేశంతో చెప్పిన సందర్భంలోనిది.

**వివరణ:-** మనవాళ్ళు ఉత్తవెధవాయలోయ్. చుట్టనేర్పినందుకు థాంక్ చేయక తప్పుపడుతున్నావ్. చుట్టకాల్చడం యొక్క మజా నీకు ఇంకా బోధపడక పోవడం చాలా ఆశ్చర్యంగా వుంది. చుట్టకాల్చబట్టేకదా దొరలంత గొప్పవాళ్ళు అయ్యారు. చుట్ట పంపిణీ మీదనే స్టీమయంత్రం వగైరా తెల్లవాడు కనిపెట్టాడు. గరుత్మంతుడు అమృతాన్ని తెస్తున్నప్పుడు అది భగభగమండి ఒకచుక్క భూమిమీద పడింది. అది పొగచెట్టుగా జన్మించింది. కావున అమృతము వంటి ఆ చుట్టకాల్చనివాడు మరుజన్మలో దున్నపోతుగా జన్మిస్తాడు. ఈ విషయం బృహన్నారదీయం నాలుగో ఆశ్వాసంలో స్పష్టంగా వుంది. చుట్టకాల్చడంలో ఎటువంటి తప్పులేదని గిరీశం వెంకటేశంతో పెద్ద లెక్చరిచ్చాడు.

**3. మాటల్లో కార్యం లేదు.**

**పరిచయం:-** ఈ వాక్యం గురజాడ అప్పారావు గారు రచించిన కన్యాశుల్కం నాటకంలోని ప్రథమాంకం నుంచి గ్రహింపబడినది.

**సందర్భం:-** రామప్పంతులు గారి బంట్రోతు గిరీశం దగ్గరికి బాకీవసూలు కోసం వచ్చి, వాని బడాయి మాటల్ని విమర్శించిన సందర్భంలోనిది.

**వివరణ:-** రామప్పంతులు తన బాకీ వసూలు నిమిత్తం ఒక బంట్రోతును గిరీశం వద్దకు పంపాడు. బంట్రోతు గిరీశాన్ని గట్టిగా డబ్బుల్ని గూర్చి ప్రశ్నించాడు. రేపు ఉదయం పూటకుల్లమ్మ ఇంటికి వస్తే అణాపైసల్తో చెల్లిస్తాను. మా పంతులు గార్కి స్నేహం, మంచిచెడులు అక్కర్లేదా' అని గిరీశం ప్రశ్నించగా 'మాటల్లో మజాయే గాని చేతుల్లో నిజంలేదు' అని బంట్రోతు పలికాడు.

**4. ఇటుపైని మీతోవ మీది వాతోవ వాది.**

**పరిచయం:-** ఈ వాక్యం గురజాడ అప్పారావుగారు రచించిన కన్యాశుల్కం నాటకంలోని ప్రథమాంకం నుంచి గ్రహింపబడినది.

**సందర్భం:-** రామప్పంతులు మధురవాణిని ఉంచుకోవటానికి సిద్ధపడి, తన ఉద్దేశాన్ని చెప్పినపుడు ఆమె తన ఇబ్బందుల్ని తెలియజేసిన సందర్భంలోనిది.

**వివరణ:-** రామప్పంతులు మధురవాణిని ఉంచుకోవటానికి సిద్ధపడ్డాడు. అయితే ఆయన చులకనగా మాట్లాడటం మాత్రం సహించలేకపోయింది. 'వేశ్య అంటే అంత చులకనా! సానిదానికి మాత్రం నీతినియమాలు ఉండవా? అని పంతులుగార్ని పిలిచి 'అయ్యా యికనుండి మీదారిమీది నాదారినాది' అనే చెప్పేదాకా నేను పరాధీనురాలనే. మీరు చెప్పినట్లే గిరీశం ఎటువంటి వాడైతే నాకేమి? నన్ను చక్కగా పోషిస్తున్నాడు. మీరు కూడా గొప్పరసికులే! నామనస్సును ఆకర్షించిన వారే. అయినా నాకు మాత్రం ఆయన మీద విశ్వాసం తగ్గలేదు అని మధురవాణి రామప్పంతుల్తో పల్కింది.

**5. నేను డబ్బు కక్కుర్తి మనిషినికాను !**

**పరిచయం:-** ఈ వాక్యం గురజాడ అప్పారావుగారిచే రచించబడిన కన్యాశుల్కం నాటకంలోని ప్రథమాంకం నుంచి గ్రహింపబడినది.

సందర్భం:- గిరీశం నుంచి విడాకులు తీసుకోవటానికి మధురవాణికి 200/-లు ఇస్తూ రామప్పంతులు ఆమెచేతిని గట్టిగా పట్టుకొని లాగినపుడు ఆమె కోపాన్ని ప్రదర్శించిన సందర్భంలోనిది.

వివరణ:- రామప్పంతులు మధురవాణిని ఉంచుకోటానికి సిద్ధపడ్డాడు. గిరీశం నుంచి తెగతెంపులు చేసికోవటానికి 200/-లు కూడా ఇచ్చి, ఆమె చేతిని గట్టిగా పట్టుకొని లాగాడు. మధురవాణి కోపంతో చేతిని విదిలించుకొని అతని నోట్లుదూరంగా పారేసి 'మీతో కాలక్షేపం చేయటం చాలాకష్టం. ఒక స్థిరమైన నిర్ణయం మీద ఉండరు. అటువంటి నిన్ను ఎలా నమ్మాలి. నేను మనస్ఫూర్తిగా నిన్ను నమ్మాను కాబట్టి నీతో రావటానికి సిద్ధపడ్డాను. ఇంతటి రసికులైవుండి కూడా నన్ను అర్థం చేసుకోలేకపోయారు. మీ నోట్లు మీవద్దే వుంచండి. నేను డబ్బు కక్కుర్తి మనిషిని కాను' అని పలికింది.

**6. సానివాళ్లకి కర్ణ పిశాచి వుంటుంది కాబోలు !**

**పరిచయం:-** ఈ వాక్యం గురజాడ అప్పారావుగారిచే రచించబడిన కన్యాశుల్కం నాటకంలోని ప్రథమాంకం నుంచి గ్రహింపబడినది.

**సందర్భం:-** తాను ఊరొదిలి వెళ్లే విషయాన్ని మధురవాణి గ్రహించిందని భ్రమించిన గిరీశం తనలోతాను అనుకొన్న సందర్భంలోనిది.

**వివరణ:-** గిరీశం మధురవాణి ఇంటికి వచ్చి ప్రేమతో ఆమె భుజాన్ని పట్టుకోబోయాడు. ఆమె అక్కడనుంచి దూరంగా తొలగిపోయింది. గిరీశం అందుకు కారణాన్ని ప్రశ్నించాడు. 'ఇది ఆఖరు వికారం' అని ఆమె జవాబిచ్చింది. అప్పుడు గిరీశం 'నేను ఉడాయిస్తానని దీనికెలాతెల్సింది? సానివాళ్లకి కర్ణపిశాచి వుంటుంది కాబోలు, అని అనుకున్నాడు.

**7. వెధవముండకి పాతివ్రత్యం అన్నమాట!**

**పరిచయం:-** ఈ వాక్యం గురజాడ అప్పారావుగారిచే రచించబడిన కన్యాశుల్కం నాటకంలోని ప్రథమాంకం నుంచి గ్రహింపబడినది.

**సందర్భం:-** 'పూటకూళ్లమ్మ యోగ్యురాలు, ఉత్తమ పతివ్రత' అని గిరీశం పొగిడినపుడు మధురవాణి ఆ మాటల్ని భరింపలేక బదులు పల్కిన సందర్భంలోనిది.

**వివరణ:-** మధురవాణి పూటకూళ్లమ్మను నిందించింది. గిరీశం ఆమాటల్ని వినలేకపోయాడు. 'సిదుర్మార్గం కూతలు ఆమె చెవినబడితే చాలా బాధపడుతుంది. ఆ పాపమంతా నిన్నే చుట్టుకుంటుంది. ఆమె యోగ్యురాలు ఉత్తమ పతివ్రత అని పొగడగా వెధవముండకి పాతివ్రత్యమన్నమాట ఈనాడే విన్నాను' అని మధురవాణి తిరస్కారంగా పలికింది.

## ద్వితీయాంకం :

**8. పుచ్చకాయలు దొంగంటే బుజాల్తడుముకున్నట్లు !**

**పరిచయం:-** ఈ వాక్యం గురజాడ అప్పారావుగారు రచించిన 'కన్యాశుల్కం' నాటకం ద్వితీయాంకంలోనిది.

**సందర్భం:-** గిరీశాన్ని చులకనగా చూచిన అగ్నిహోత్రావధాన్లతో కరటకశాస్త్రి మాట్లాడిన సందర్భంలోనిది.

**వివరణ:-** వెంకమ్మ పట్నం నుంచి వచ్చిన కొడుకును చూసుకొని మురిసిపోయింది. 'ఈ సారైనా పాసయ్యావా' అని అగ్నిహోత్రావధాన్లు కొడుకును ప్రశ్నించాడు. వెంకటేశం తెల్లమొగం వేశాడు. 'వెంకటేశం పస్టుక్లాసుతో పాసయ్యాడు. వాడికి నేనే చక్కగా కష్టపడి చదువు చెప్పాను' అని గిరీశం చెప్పాడు. అగ్నిహోత్రావధాన్లు గిరీశాన్ని చులకనగా మాట్లాడాడు. గిరీశం చదువుచెప్పిన

మాష్టారని వెంకటేశం తల్లికి చెప్పాడు. అప్పుడు కరటకశాస్త్రి 'పెద్ద మనిషి ఇంటికి వస్తే ఇంతేనా మాట్లాడేది. ఆయన కుర్రవాడితో ఇంగ్లీషులో మాట్లాడుతూ వుంటే పుచ్చకాయలదొంగంటే భుజాలు తడుముకున్నట్లుగా నామీద పెట్టుకుంటావేమి'? అని అగ్నిహోత్రావధాన్లతో అన్నాడు.

**9. ఇదంతా టోపీ వ్యవహారంగా కనబడుతుంది.**

**పరిచయం:-** ఈ వాక్యం గురజాడ అప్పారావుగారు రచించిన 'కన్యాశుల్కం' నాటకం ద్వితీయాంకంలోనిది.

**సందర్భం:-** అగ్నిహోత్రావధాన్లు గిరీశం మాటల్ని, చేతల్ని, ప్రవర్తన్ని సందేహించి, ఊళ్లో నుంచి పంపాలని భావించి వెంకమ్మ, కరటకశాస్త్రుల్తో మాట్లాడిన సందర్భంలోనిది.

**వివరణ:-** అగ్నిహోత్రావధాన్లు గిరీశాన్ని సందేహించాడు. అతడ్ని ఊళ్లో నుంచి పంపేయాలని భావించాడు. కాని వెంకమ్మ గిరీశాన్ని ఇంట్లోనే పెట్టుకొని కొడుక్కి బాగా చదువు చెప్పించుకోవాలనుకుంది. గిరీశం కూడా మూడేళ్లలో వెంకటేశాన్ని పోలీసు పరీక్ష పాసయ్యేలా చేస్తానని వాగ్దానం చేశాడు. 'సంవత్సరానికి పుస్తకాల ఖర్చు ఎంతవుతుంది అని అగ్నిహోత్రావధాన్లు కొడుకును అడిగాడు. పదిహేను రూపాయలవుతుందని వెంకటేశం చెప్పాడు. అప్పుడు అగ్నిహోత్రావధాన్లు అగ్గిమీదగుగ్గిలమై 'నేను చిల్లిగవ్వకూడ యివ్వను. వీళ్ళిద్దరూ ఆడబ్బులు పంచుకొని తినేటట్లు కనపడుతుంది. ఇదంతా టోపీ వ్యవహారంలాగుంది' అని వెంకమ్మ కరటకశాస్త్రుల్తో అన్నాడు.

**10. పడుపడు అన్న నానవితేగాని పడ్డనానవితి లేదంది.**

**పరిచయం:-** ఈ వాక్యం గురజాడ అప్పారావుగారు రచించిన కన్యాశుల్కం నాటకం ద్వితీయాంకంలోనిది.

**సందర్భం:-** అగ్నిహోత్రావధాన్లు తన రెండవకూతురైన సుబ్బమ్మను లుబ్ధావధాన్లకిచ్చి పెండ్లిచేయాలని నిశ్చయించినట్లు వెంకమ్మకు చెప్పాడు. ఆమె అందుకు అంగీకరించలేదు. ఈపెళ్ళి జరిగితే నుయ్యో, గొయ్యో చూసుకుంటానని కూడా హెచ్చరించింది. ఈ విషయాన్నంతటిని వెంకటేశం గిరీశంతో చెప్పే సందర్భంలోనిది.

**వివరణ:-** అగ్నిహోత్రావధాన్లు తన రెండువకూతురైన సుబ్బమ్మను లుబ్ధావధాన్లకిచ్చి పెండ్లిచేయాలనుకున్నాడు. ఆ విషయాన్ని భార్యతో చెప్పాడు. ఆమె తనకు ఇష్టంలేదని చెప్పింది. ఈపెళ్ళి జరిగితే ఏనుయ్యో, గొయ్యో చూసుకుంటానని కూడా సోదరుడైన కరటకశాస్త్రితో హెచ్చరించింది. వెంకటేశం ఈవిషయాన్ని గిరీశానికి చెప్పాడు. అప్పుడు 'పడుపడు అనే నవితేగాని పడ్డనానవితిలేదు' అని ఒకామె అంది యీవ్యవహారం కూడా అలాగే వుంది'అని వెంకటేశంతో చెప్పాడు.

**11. పెద్దమనుషుల్తో వ్యవహారం మాట్లాడుతూవుంటే రామాయణంలో పిడకల వేట్లాటలాగా అదే పిలవడమా ?**

**పరిచయం:-** ఈ వాక్యం గురజాడ అప్పారావుగారిచే రచింపబడిన కన్యాశుల్కం నాటకం ద్వితీయాంకంలోనిది.

**సందర్భం:-** అగ్నిహోత్రావధాన్లు రామావధాన్లతో తనకు ఏర్పడిన గోడ తగాదా గురించి గిరీశంతో చెప్పే సమయంలో అక్కడకు వచ్చిన బుచ్చమ్మను అగ్నిహోత్రావధాన్లు కసురుకొన్న సందర్భంలోనిది.

**వివరణ:-** అగ్నిహోత్రావధాన్లు తనకు లుబ్ధావధాన్లతో వచ్చిన గోడ తగాదా గురించి గిరీశానికి చెప్తున్నాడు. అప్పుడు ఆయన కూతురైన బుచ్చమ్మ అక్కడకువచ్చి తల్లిస్నానం చెయ్యమన్నట్లుగా చెప్పింది. ఆయన సరేనని చెప్పి మరల వ్యవహారంలో నిమగ్నమయ్యాడు. చాలా సమయం గడిచింది. అగ్నిహోత్రావధాన్లు స్నానానికి లేవలేదు. బుచ్చమ్మ మరలవచ్చి స్నానం మాటను గుర్తు చేసింది. ఆ సమయంలో అగ్నిహోత్రావధాన్లు మండిపడుతూ' పెద్ద మనుషుల్తో వ్యవహారం మాట్లాడుతూవుంటే రామాయణంలో పిడకల వేట్లాటలాగా అదేపిలవటమా! అని బుచ్చమ్మను కసురుకున్నాడు.

## తృతీయాంకము :

**12. చట్లకి చావనలుపు మనిషికి చావతెలుపు!**

**పరిచయం:-** ఈ వాక్యం గురజాడ అప్పారావుగారు రచించిన 'కన్యాశుల్కం' నాటకం తృతీయాంకంలోనిది.

**సందర్భం:-** రామప్పంతులు భూములన్నీ అప్పులపాలయ్యాయని తెలుసుకున్న మధురవాణి ఆ విషయాన్ని గూర్చి రామప్పంతుల్ని ప్రశ్నించిన సందర్భంలోనిది.

**వివరణ:-** రామప్పంతులు భూములన్నీ అప్పులపాలయ్యాయని మధురవాణికి తెల్సింది. ఆ విషయాన్ని ఆమె రామప్పంతుల్ని అడిగింది. ఈ సంగతి ముందుగా తెలిసివుంటే నీదగ్గర 200/-లు తీసుకొనేదాన్నేకాదు. నాకు మీరు మహరాజులా కన్పించారు. కాబట్టే యిల్లూ, వాకిలీ వదిలి మానం ప్రాణం మీపాలు చేసి నమ్మి మీతో వచ్చాను. నన్ను మాత్రం మోసం చేయకండి. మిమ్మల్ని పాపం చుట్టుకుంటుంది. నిజంగా మీకు మోసం చేసే ఉద్దేశ్యం లేకపోతే లుబ్ధావధాన్లుకు పెళ్లి ఎందుకు కుదిర్చారు. ఆ ముసలాడికి పెండ్లేమిటి? అని నిలదీసింది. నాకు కొంచెం గడ్డంనెరిసింది. అంతమాత్రాన ముసలాణ్ణి అంటావా? అని లుబ్ధావధాన్లు ప్రశ్నించాడు. అప్పుడు మధురవాణి చట్లకి చావ నలుపు, మనిషికి చావతెలుపు. ఈ విషయం తెలియదా అని లుబ్ధావధాన్లును అడిగింది.

**13. వెర్రికుదిరింది రోకలితలకి చుట్టమన్నాట్ట!**

**పరిచయం:-** ఈ వాక్యం గురజాడ అప్పారావుగారు రచించిన కన్యాశుల్కం నాటకం తృతీయాంకంలోనిది.

**సందర్భం:-** లుబ్ధావధాన్ల పెళ్లిమాన్పించకపోతే నేను నీతో మాట్లాడను అని మధురవాణి రామప్పంతులు పలికిన సందర్భంలోనిది.

**వివరణ:-** రామప్పంతులు మధురవాణి ఇంటికి వచ్చి సరసంలో భాగంగా ముద్దును కోరాడు. మధురవాణి అయిష్టతతో చేతులు అడ్డంపెట్టుకొని ముద్దుకు వేళాపాళా లేదా? లుబ్ధావధాన్ల పెళ్ళి తప్పిస్తేనే ముద్దుపెట్టుకోనిస్తాను మోటుసరసం చాలించు' అని కసరికొట్టింది. 'వెర్రికుదిరింది రోకలికి తలకు చుట్టమన్నాట్ట' అట్లాగే రెండేళ్ళు కష్టపడి పెళ్లికి సిద్ధంచేస్తే ఇప్పుడు తప్పించమంటే ఎలా' అని రామప్పంతులు మధురవాణితో అన్నాడు.

**14. నమ్మించోట చేస్తే మోసం నమ్మంచోట చేస్తే లౌక్యం !**

**పరిచయం:-** ఆ వాక్యం గురజాడ అప్పారావుగారు రచించిన కన్యాశుల్కం నాటకం తృతీయాంకంలోనిది.

**సందర్భం:-** లుబ్ధావధాన్లను జాతకం పేరుతో మోసంచేసిన విధానాన్ని రామప్పంతులు మధురవాణితో చెప్పిన సందర్భంలోనిది.

**వివరణ:-** మధురవాణి రామప్పంతుల్తో లుబ్ధావధాన్ల పెళ్లి విషయం ప్రస్తావించి పెళ్లివల్ల లాభం యెలావస్తుంది? అని అడిగింది. రామప్పంతులు తాను ముందుగా తర్ఫీదు యిచ్చిన సిద్ధాంతిద్వారా లుబ్ధావధాన్లుకు వివాహ, ధనలాబాలు వున్నట్లు, మరల మరొక సిద్ధాంతి ద్వారా అదే విషయాన్ని చెప్పించి, గ్రహం శాంతికి బ్రాహ్మలకు భోజనంపెడ్తే మంచిదని చెప్పించినట్లు ఆమెతో చెప్పాడు. బ్రాహ్మల్లో పెళ్లిళ్ల కోసం పంపే జాతకాలేవి నిజమైనవికావు. అని కూడా రామప్పంతులు చెప్పగా 'ఇది మోసం కాదా' అని మధురవాణి ప్రశ్నించింది. నమ్మించోట చేస్తే మోసం, నమ్మంచోట చేస్తే లౌక్యం అని రామప్పంతులు సమాధానం చెప్పాడు.

**15. ఆపదకడ్డంబడ్డవారే బంధువులు.**

**పరిచయం:-** ఈ వాక్యం గురజాడ అప్పారావుగారు రచించచన కన్యాశుల్కం నాటకం తృతీయాంకంలోనిది.

**సందర్భం:-** రామప్పంతులు ఇన్‌స్పెక్టర్ దగ్గరకు వెళ్తూ తలుపులు బిగించికొని జాగ్రత్తగా వుండు అని మధురవాణికి చెప్పాడు. తర్వాత కాసేపటికి కరటకశాస్త్రి శిష్యునితో వచ్చి తలుపుతట్టి మధురవాణితో మాట్లాడిన సందర్భంలోనిది.

**వివరణ:-** ఇన్‌స్పెక్టర్ రమ్మన్నాడని హెడ్‌కానిస్టేబుల్ రామప్పంతులుకు చెప్పాడు. రామప్పంతులు స్టేషన్‌కుపోతూ మధురవాణికి జాగ్రత్తలు చెప్పాడు. ఎవరు వచ్చినా తలుపు తీయవద్దని హెచ్చరించాడు. ఆయన వెళ్ళిన తర్వాత కొద్దిసేపటికి కరటకశాస్త్రి కన్యవేషంలోనున్న శిష్యునితో వచ్చి యింటి తలుపుతట్టాడు. 'ఎవరూమీరు' అని మధురవాణి లోపలనుండే ప్రశ్నించింది. మేము మీకు బంధువులంకాము అని మీరు మాకు బంధువులుకాగలరు. ఆపదకడ్డంబడ్డవారే బంధువులు గదా! అని కరటకశాస్త్రి చెప్పాడు.

**16. ఉదరనిమిత్తం బహుకృతవేషం!**

**పరిచయం:-** ఈ వాక్యం గురజాడ అప్పారావుగారు రచించిన కన్యాశుల్కం నాటకం తృతీయాంకంలోనిది

**సందర్భం:-** కన్యవేషంతో వున్న శిష్యుని వెంటబెట్టుకొని వచ్చిన కరటకశాస్త్రి మధురవాణితో శిష్యుని మారువేషాన్ని గూర్చి చెప్పిన సందర్భంలోనిది.

**వివరణ:-** కరటకశాస్త్రి తన శిష్యునకు కన్యవేషం వేసి వెళ్ళి మధురవాణి యింటి తలుపుతట్టాడు. "మీరెవరని' మధురవాణి లోపలనుండే ప్రశ్నించింది. మేము మీకు బంధువులంకాము కాని మీరు మాకు బంధువులుకాగలరు. ఆపదకడ్డంబడ్డవారే బంధువులు గదా' అని శాస్త్రి చెప్పాడు. 'పంతులుగారికి బంధువులు అప్పులు కాకపోతే తలుపుతీయవచ్చు' అని చెప్పి మధురవాణి తలుపుతీసింది. శాస్త్రి మధురవాణిని చూచి ఆశ్చర్యపోయాడు. మధురవాణి ముక్కుమీద వేలువేసుకొని 'యేమిటి ఈవేషం' అని ప్రశ్నించింది. 'ఉదరనిమిత్తం బహుకృతవేషం. ఇది దేవుడిచ్చిన వేషం కూడా' అని కరటకశాస్త్రి సమాధానం చెప్పాడు.

**17. నా దగ్గరకు వచ్చివాడల్లా చెడిపోయినాడే!**

లేదా

**తనకు రొట్టా ఒకనికి ముక్కానా?**

**పరిచయం:-** ఈ వాక్యం గురజాడ అప్పారావుగారు రచించిన కన్యాశుల్కం నాటకం తృతీయాంకంలోనిది.

**సందర్భం:-** గిరీశం ప్రవర్తన మంచిదికాదని కరటకశాస్త్రి చెప్పినప్పుడు మధురవాణి వానితో గిరీశాన్ని గూర్చి మాట్లాడిన సందర్భంలోనిది.

**వివరణ:-** డిప్యూటీ కలెక్టరు కొడు నన్ను ఉంచుకొన్నాడు. ఆవిషయం తెలిసిన తండ్రి ఆయన్ని చదువు వంకతో చెన్నపట్నం పంపాడు. అయినా కూడా ఆయన నాకు గిరీశం ద్వారా డబ్బులు పంపేవాడు. ఇట్లా కొంతకాలం సాగింది. తర్వాత కొన్నాళ్లకు గిరీశమే నన్నుంచుకున్నాడు. అప్పుడు డబ్బులకు చాలా ఇబ్బందిగా వుండేది. అని మధురవాణి కరటకశాస్త్రితో చెప్పింది. గిరీశం నిన్నుంచుకున్నాడా? ఆయన నా మేనల్లుడికి చదువు చెప్పటం కోసం కుదుర్చుకున్నాడే. వాడికి వెంటనే ఉద్వాసన చెప్పాలి' అని కరటకశాస్త్రి మధురవాణితో చెప్పాడు. అప్పుడు మధురవాణి 'నా దగ్గరకు వచ్చిన వాడల్లా చెడిపోయినాడే. నా దగ్గరకు మీరు రాకుండా అవరోధం కల్పించారని మీరు డిప్యూటీకలెక్టర్ని తిట్టారు కదా. ఆయనకొకన్యాయం! మీకొకన్యాయమా! నాదగ్గరకు వచ్చినందుకు మీ భార్య నిన్ను మెడబట్టుకొని తరవాల్సింది. తనకి రొట్టా! ఒకడికి ముక్కానా! అని మధురవాణి కరటకశాస్త్రితో పలికింది.

**18. ఈ పిల్లదగ్గర వాలొట్లు దివిటీముందర దీపాలు !**

లేదా

**ఆడది మెచ్చిందే అందం !**

**పరిచయం:-** ఈ వాక్యం గురజాడ అప్పారావుగారు రచించిన కన్యాశుల్కం నాటకం తృతీయాంకంలోనిది.

**సందర్భం:-** కరటకశాస్త్రి కన్యవేషంలో వున్న శిష్యునితో మధువాణి వద్దకు వచ్చి ఆపిల్ల పెళ్లి విషయం ప్రస్తావించగా ఆమె సౌందర్యానికి ముగ్ధురాలైన మధురవాణి కరటకశాస్త్రితో మాట్లాడిన సందర్భంలోనిది.

వివరణ:- కరటకశాస్త్రి కన్యవేషంలోవున్న శిష్యునితో మధురవాణి వద్దకు వెళ్ళి ఈపిల్లకు పెళ్లిచేయటానికే నీవద్దకు తీసు కొచ్చాను అని చెప్పాడు. 'మాపంతులుకేనా పెళ్లి' అని మధురవాణి ప్రశ్నించింది. 'త్రిలోకసుందరివి నువ్వు ఉండగా పంతులుగారికి ఇంకా పెళ్లెందుకు' అని శాస్త్రి అన్నాడు. అలాగైతే నేనే మగవేషం వేసేకొని పెళ్లిపీటలమీద కూర్చుంటాను. ఇలాంటి పెళ్లాం దొరకటం ఎలాగ? జగత్ప్రసిద్ధులైన కరటకశాస్త్రులవారి అల్లుడు కావటం ఎలాగ? దివ్యసుందరవిగ్రహం అని పొగడగానే భుజాలు పొంగుతాయనుకున్నారు కాబోలు.'ఈపిల్లదగ్గర నాబోంట్లు దివిటీ ముందర దీపాలు. ఆడది మెచ్చిందే అందం. మగవాడి కన్నుమనసక మీకేం తెలుసు. నాపెళ్లాన్ని నాకిచ్చేసి మీదారిన మీరు పొండి' అని మధురవాణి కరటకశాస్త్రితో పలికింది.

**19. బుద్ధికి అంతా అసాధ్యమేకాని డబ్బుకి ఎక్కడా అసాధ్యంలేదు !**

**పరిచయం:-** ఈ వాక్యం గురజాడ అప్పారావుగారు రచించిన కన్యాశులక్కం నాటకం తృతీయాంకంలోనిది.

**సందర్భం:-** కరటకశాస్త్రి స్త్రీవేషంలో వున్న శిష్యుణ్ణి వెంటబెట్టుకొని మధురవాణి వద్దకు వెళ్ళి తనను ఆపదనుంచి తప్పించమని కోరిన సందర్భంలోనిది.

**వివరణ:-** కరటకశాస్త్రి స్త్రీవేషంలోని శిష్యునితో మధురవాణి వద్దకు వెళ్లి 'ఓమధురవాణి! దేవుడు నాకు నిన్ను చూపించాడు. పంతుల్లేని సమయంలో వచ్చాను. నామాటలు విని ఆపదనుండి తప్పించు. మావూళ్లో లుబ్ధావధాన్లు అనే ముసలాడున్నాడు. వాడికి మామేనకోడల్ని యివ్వాలని మా బావ నిశ్చయించాడు. ఈ సంబంధం నాచెల్లికి యిష్టంలేదు. ఒక వేళ ఈపెళ్ళి జరిగితే నాచెల్లెలు నుయ్యో గొయ్యో చూచుకుంటుంది. దాని ప్రాణం కాపాడాలి. నాకు నీవే దిక్కు అని చెప్పాడు. ఈ పిల్లను తక్కువ సొమ్ముకు అమ్మితే లుబ్ధావధాన్లు చంకలు గుద్దుకొని చేసికొంటాడు. సమస్యా తీరుతుంది. అందాకా యెందుకు? నేనే కొనుక్కుంటాను. అయితే యింతకు ముందే నిర్ణయమైన సంబంధం ఎలా తప్పిపోతుంది అని మధురవాణి ప్రశ్నించింది. 'నీ బుద్ధికి అసాధ్యం వుందా? డబ్బులకు అసాధ్యం వుందా?' అని కరటకశాస్త్రి అన్నాడు. అప్పుడు మధురవాణి బుద్ధికి అంతా అసాధ్యమేకాని డబ్బుకు ఎక్కాడా అసాధ్యం లేదు అని కరటకశాస్త్రితో చెప్పింది.

**20. పొగమకత్తెలకి అలక కూడా అదొక శృంగారం!**

**పరిచయం:-** ఈ వాక్యం గురజాడ అప్పారావుగారు రచించిన కన్యాశుల్కం నాటకం తృతీయాంకంలోనిది.

**సందర్భం:-** కరటకశాస్త్రితో వచ్చిన పిల్లను పెళ్లాడతానని రామప్పంతులు చెప్పగా మధురవాణి కొరకొరచూసింది. అప్పుడు రామప్పంతులు అందగత్తెలకు కోపం కూడా అందమే అని పలికిన సందర్భంలోనిది.

**వివరణ:-** రామప్పంతులు మధురవాణి ఇంటికి వెళ్ళేసరికి కరటకశాస్త్రి స్త్రీవేషంలో వున్న శిష్యునితో కనిపించాడు. 'వచ్చిన పనేమిటి' అని పంతులు ప్రశ్నించాడు. 'ఈపిల్లకు పెళ్లి నిశ్చయించి పుణ్యం కట్టుకోమని శాస్త్రులు ప్రార్థించాడు. వివాహం జరిపించటానికి నేను వైదికుణ్ని కాను. నాకు మంత్రాలు రావు. ఈ రోజుల్లో వైదికమంత్రాల మహిమపోయింది. నియోగప్రభువుదే మంత్రమయ్యింది. మరి నేను ఈ పిల్లను పెళ్ళాడనా? అని మధురవాణిని అడగగా ఆమె కొరకొర చూసింది. అందగత్తెలకు కోపంకూడా అందమే అని పంతులుగారు మధురవాణిని ప్రశంసించాడు.

**21. ఇయ్యా ఇప్పించగల అయ్యలకేగాని మీపమయ్యలకేలా! రామయ్యకు చేవాబారెడు!**

**పరిచయం:-** ఈ వాక్యం గురజాడ అప్పారావుగారు రచించిన కన్యాశుల్కం నాటకం తృతీయాంకంలోనిది.

**సందర్భం:-** అప్పులపాలైన కరటకశాస్త్రి తన అప్పుల్ని యీపిల్ల పెళ్లి ద్వారా వచ్చే సొమ్ముతో తీర్చాలనుకున్నట్లు రామప్పంతులుతో చెప్పి సహాయపడవలసిందిగా కోరిన సందర్భంలోనిది.

**వివరణ:-** కరటకశాస్త్రి రామప్పంతులు వద్దకు వెళ్ళి తన దుస్థితిని తెలిపి మీరు నియోగ ప్రభువులు. అందువల్ల మంత్రబలంతో అడ్డుకుంటారని వచ్చాను. మీ పినతల్లి కొడుకు డిప్యూటీ కలెక్టరేకాని వానివల్ల లాభంలేదు. వాడు బంధువుల్ని దగ్గరకు రానివ్వడు.

బంధువులు పంపించిన కూరనారల్ని తీసికోడు. పెట్టడానికి, పుచ్చుకోవటానికి నియోగప్రభువులైన మీకే చెల్లిందికాని, మావాళ్ల ఉద్యోగాలు మంటిగడ్డ ఉద్యోగాలు! ఇయ్యాఇప్పించగల మీసమున్యలకేలా! రామయ్యకు లేవా బారెడు' అని ఒక కవీశ్వరుడన్నాట్ట. అలాగే ఇవ్వటం, ఇప్పించటం చేతగాని వాళ్లకి రామయ్యలమాదిరిగా మీసాలెందుకు? అని కరటకశాస్త్రి రామప్పంతుల్తో అన్నాడు.

**22. అది రంగువేసిన గాజుపూస- ఇది ప్యూర్ డైమండ్ !**

లేదా

**Two birds at one shot !**

**పరిచయం:-** ఈ వాక్యం గురజాడ అప్పారావుగా రు రచించిన కన్యాశుల్కం నాటకం తృతీయాకంలోనిది.

**సందర్భం:-** మధురవాణి, బుచ్చమ్మల మధ్యనున్న తారతమ్యాన్ని గిరీశం గుర్తించిన సందర్భంలోనిది.

**వివరణ:-** బుచ్చమ్మ అమాయకత్వానికి, నిర్మలత్వానికి గిరీశం ఈశ్వర్యపడ్డాడు. మధురవాణి మాటల్ని, చేతల్ని, ప్రవర్తనని అస్యహించుకున్నాడు. ఇంతకాలం మధురవాణి వలలోనే వున్నందుకు చింతించాడు. మధురవాణి రంగువేసిన గాజుపూస. బుచ్చమ్మ ప్యూర్ డైమండ్- దీన్ని మాయోపాయంతో లేవదీసికొనిపోయి విడోమ్యారేజి చేసుకొంటే కీర్తి, సుఖం రెండు దక్కుతాయి. Two birds at one shot ఒక్కదెబ్బకు రెండుపిట్టలు. ఇటువంటి అమాయకత్వం విడోని ఒప్పించి పెళ్లాడితే మజావుంటుంది అని గిరీశం భావించాడు.

**23. పాముకక్కరలేదు. పాగబెడితే చాలు !**

**పరిచయం:-** ఈ వాక్యం గురజాడ అప్పారావుగారు రచించిన కన్యాశుల్కం నాటకం తృతీయాంకంలోనిది.

**సందర్భం:-** ఈనాడు లోకం తప్పుడు దారిలో నడుస్తూవుంది. దాన్ని సరియైన దారిలోకి మళ్లించాలి. విధవా వివాహాన్ని ప్రోత్సహించాలి. సానివాళ్లని హతమార్చాలి అని గిరీశం బుచ్చమ్మతో చెప్పిన సందర్భంలోనిది.

**వివరణ:-** బుచ్చమ్మను ఆకర్షించాలని గిరీశం భావించాడు. సంఘసంస్కారాన్ని గూర్చి, విధవావివాహం గూర్చి ఉపన్యసించాడు. సానివాళ్లను చంపాల్సిన పనిలేదు. పాముకక్కరలేదు. పాగబెడితే చాలన్నట్లుగా పెళ్లిళ్లకు పిలవకపోవటం ఉంచుకోకపోవటం, కనబడ్డచోటల్లా నిందించటంలాంటివి చేయాలి. అలా చేస్తే కొంత కాలానికి సానివాళ్లు అంతరిస్తారు అని గిరీశం బుచ్చమ్మతో చెప్పాడు.

## చతుర్థాంకం !

**24. మాటలు నేర్చిన శునకాన్ని వేటకి పంపితే ఉసుకోమంటే ఉసుకోమందిట !**

**పరిచయం :-** ఈ వాక్యం గురజాడ అప్పారావుగారు రచించిన 'కన్యాశుల్కం' నాటకం చతుర్థాంకంలోనిది.

**సందర్భం:-** గిరీశం తెలివితేటల్ని, గొప్పతనాన్ని ఒప్పుకోలేని రామప్పంతుల్తో మధురవాణి మాట్లాడిన సందర్భంలోనిది.

**వివరణ:-** గిరీశం తెలివైనవాడు. చురుకైనవాడు. శాస్త్రాలు చదివినవాడు. ఇంగ్లీషులో ధారాళంగా మాట్లాడగలిగినవాడు అని మధురవాణి ప్రశంసించటాన్ని రామప్పంతులు భరింపలేకపోయాడు. "నేనే చిన్నతనంలో ఇంగ్లీషు చదివుంటే జడ్జీల యెదుట ఫెళఫెళలాడించేవాడ్ని. నాకు వాక్స్థానమందు బృహస్పతి వున్నాడు. అందువల్ల ఇంగ్లీషు రాకపోయినా నాప్రభ యీలా వెలుగుతుంది" అని రామప్పంతులు ఆత్మస్తుతి చేసుకున్నాడు. "మాటలు నేర్చిన శునకాన్ని వేటకు పంపితే ఉసుకోమంటే ఉసుకోమందిట" నీ వ్యవహారం కూడా అంతేవుంది. గిరీశం వాక్శూరుడు, కార్యశూరుడు. నీవు కార్యశూరుడవు కాదు కాని వాక్శూరుడువు అని మధురవాణి రామప్పంతుల్తో అంది.

25. పావంటి దానికి విరుగుడుంది. పంతులుకుండవా!

పరిచయం:- ఈ వాక్యం గురజాడ అప్పారావుగారు రచించిన కన్యాశల్కం నాటకం చతుర్ధాంకంలోనిది.

సందర్భం:- ఏదో విధంగా రామప్పంతులు నోరుమూయించాలని లుబ్ధావధాన్లు కరటకశాస్త్రితో మాట్లాడిన సందర్భంలోనిది.

వివరణ:- పెద్ద పెద్ద ఉద్యోగస్థులు కూడా యిప్పటి రోజుల్లో ఏకరాత్ర వివాహాలు చేసుకొంటున్నారు. కోదండ రామస్వాముల వారి ఆలయంలో హనుమంతుని విగ్రహ ప్రతిష్ఠాపన జరుగుతుంది. కావున ఆ పవిత్రస్థలంలో నీవు కూడా వివాహం చేసేకుంటే బాగుటుంది. ఈ విషయాన్ని పుస్తెకట్టేదాకా పంతులుగారికి తెలియనీయవద్దు అని కరటకశాస్త్రి లుబ్ధావధాన్లుతో అన్నాడు. సిద్ధాంతికి రెండురూపాయలు పడవేస్తే అంతా ఆయనే చూసుకుంటాడు. పంతులుగారు ఆయన ఎదుట నోరు మెదపడు అని లుబ్ధావధాన్లు అన్నప్పుడు పావంటిదానికి విరుగుడున్నప్పుడు పంతులకు ఉండదా అని కరటకశాస్త్రి ఆయనతో అన్నాడు.

## పంచమాంకం :

26. వీడి పిండం పిల్లులకు పెట్ట !

పరిచయం :- ఈ వాక్యం శ్రీగురజాడ అప్పారావుగారు రచించిన కన్యాశుల్కం నాటకం పంచమాంకంలోనిది.

సందర్భం:- లుబ్ధావధాన్లు తాను పెళ్లాడినపిల్ల మొదటి మొగుడు రాత్రివేళవచ్చి గొంతుపిసికాడని మీనాక్షితో చెప్పిన సందర్భంలోనిది.

వివరణ:- లుబ్ధావధాన్లు నిద్రనుండి మేల్కొని పెద్దపెద్దగా అరుస్తూ కాళ్ళు చేతులు కొట్టుకుంటూ, వణుకుతూ లేచి కూర్చున్నాడు. అసిరిగాడు, మీనాక్షి వెళ్ళి తలుపుతట్టారు. లుబ్ధావధాన్లు తలుపుతీసి అసిరిగాడ్ని దూరంగా వెళ్లిపొమ్మన్నాడు. వాడు వెళ్లిపోయాడు. 'రెండవ పెళ్లాం మొగుడు వచ్చి నీ పీక పిసికాడు.' అని లుబ్ధావధాన్లు మీనాక్షికి చెప్పాడు. మీనాక్షి తండ్రికి తోడుగా అక్కడే పండుకుంటానని చెప్పివెళ్లింది. తర్వాత కొంచెంసేపటికి మరలావచ్చి 'నాన్నా! నీవు చెప్పినమాట యదార్ధం. నీరెండవ పెళ్లాం మొదటిమొగుడు దానిక్కూడా కలలో కన్పించి 'నీ కొత్త మొగుడు పీకపిసికేస్తాను అని అన్నాడట' అని చెప్పింది. అప్పుడు లుబ్ధావధాన్లు 'వీడి యిల్లు వల్లకాడు కానూ, యెక్కడ కల్పించాడే ఈ మాయపెళ్లి? వీడి పిండం పిల్లులకు పెట్ట' అని తీవ్రంగా రామప్పంతుల్ని తిట్టాడు.

27. తలచినప్పుడేనా తాతకి పెళ్లి?

పరిచం:- ఈ వాక్యం శ్రీగురజాడ అప్పారావుగారు రచించిన కన్యాశుల్కం నాటకం పంచమాంకంలోనిది.

సందర్భం:- రాజమహేంద్రవరం వెళ్లి పెళ్లి చేసుకుందాం అన్న మీనాక్షితో రామప్పంతులు పలికిన సందర్భంలోనిది.

వివరణ:- రామప్పంతులు మీనాక్షిని నమ్మించి మధురవాణి కంటెను తెప్పించాలనుకున్నాడు. పెళ్లి చేసుకుంటానని ప్రమాణం చేశాడు. ఇనుపమిలికి సాయంతో తాళం తీస్తానన్నాడు. ఇంతలో లుబ్ధావధాన్లు వచ్చి చీకట్లో కర్రతో రామప్పంతుల్ని కొట్టాడు. మీనాక్షిని బయటకునెట్టి తలుపువేశాడు. రామప్పంతులు మీనాక్షిని ఇంట్లోకి వెళ్లమన్నాడు. 'నేను ఇంట్లోకి అడుగుపెట్టాను. సరుకులు లేకపోతేపోయెను. రాజమహేంద్రవరం వెళ్లి పెళ్లి చేసుకుందాం' అని మీనాక్షి అంది. అప్పుడు రామప్పంతులు తలచినప్పుడే నా తాతకి పెళ్లి' అని మీనాక్షితో అన్నాడు.

## షష్ఠాంకం :

28. చేసేవి మాఘస్నానాలు దూరేవి దొమ్మరకొంపలు.

పరిచయం:- ఈ వాక్యం శ్రీ గురజాడ అప్పారవుగారిచే రచింపబడిన 'కన్యాశుల్కం' షష్ఠాంకంలోనిది.

సందర్భం:- అగ్నిహోత్రావధాన్లు తన కూతురైన బుచ్చమ్మను లేవదీసుకొనిపోయిన గిరీశాన్ని వెదుక్కుంటూ వెళ్లి రామప్పంతుల్తో మాట్లాడిన సందర్భంలోనిది.

**వివరణ:-** గిరీశం బుచ్చమ్మను నమ్మించి లేవదీసుకొనిపోయాడు. అగ్నిహోత్రావధాన్లు రామప్పంతుల్ని వెంటబెట్టుకొని గిరీశం కోసం వెదకటంతో చేతిలో వున్న డబ్బంతా ఖర్చయిపోయింది. ఆ సమయంలో ఆయన డబ్బులేని పరిస్థితిని రామప్పంతులుకు చెప్పాడు. "నాకు తాకట్టుపెట్టి డబ్బులు తీసుకొందాం" అని రామప్పంతుల్లు సలహా ఇచ్చాడు. అప్పుడు అగ్నిహోత్రావధాన్లు "చేసేవి మాఘస్నానాలు. దూరేవి దొమ్మరకొంపలు" అన్నట్లు నన్నుముండలకొంపకు తీసికెళ్తావా' అని రామప్పంతుల్తో అన్నాడు.

**29. పాలమ ముంచినా మీరే నీళ్లమ ముంచినా మీరే.**

**పరిచయం:-** ఈ వాక్యం శ్రీ గురజాడ అప్పారావుగారిచే రచింపబడిన 'కన్యాశుల్కం' షష్ఠాంకంలోనిది.

**సందర్భం:-** లుబ్ధావధాన్లు సౌజన్యారావుపంతులు వద్దకు వెళ్లి తనకు కలిగిన యిబ్బందుల్ని వివరించాడు. తాను యెటువంటి నేరం చేయలేదని విన్నవించుకున్న సందర్భంలోనిది.

**వివరణ:-** రామప్పంతులుగారు ఇనస్పెక్టర్‌కి, డిప్యూటీ కలెక్టర్‌కి లంచం యివ్వమని బలవంతం చేస్తున్నట్లు చెప్పాడు. "డిప్యూటీ కలెక్టర్ నాకు మంచి స్నేహితుడు. ఆయన లంచం తీసుకోడు. మీరు కనుక లంచాలు ఇచ్చే ప్రయత్నం చేస్తే నేను మీకేసును వాదించను" అని సౌజన్యారావు పంతులుగారు లుబ్ధావధాన్లను హెచ్చరించాడు. అప్పుడు లుబ్ధావధాన్లు మీరు చెప్పినట్లే నడుచుకుంటాను. భగవంతుడు మీ రూపంలో సాక్షాత్కరించాడు. పాలముంచినా మీరే, నీళ్ళముంచినా మీరే. మిమ్మేనమ్ముకున్నాను" అని సౌజన్యారావు పంతుల్ని ప్రార్థించాడు.

**డా॥ కందిమళ్ల సాంబశివరావు,**

రెండోభాగం - నాటకం

# కన్యాశుల్కం నాటకం - గురజాడ అప్పారావు

## పాఠం-15

15.0: కన్యాశుల్క నాటకంలోని నాటకీయ శిల్పం

15.1: ప్రశ్నలు - సమాధానాలు

15.2: రాదగిన ప్రశ్నలు

15.3 : ఆచూకీ గ్రంథాల

### 15.0 కన్యాశుల్క నాటకంలోని నాటకీయ శిల్పం :

"దేశమును ప్రేమించుమన్న... మంచి అన్నది పెంచుమన్నా దేశమంటే మట్టికాదోయ్ దేశమంటే మనుషులోయ్" అని గొంతెత్తిపాడిన నవయుగ వైతాళికుడు గురజాడ మహాకవి. సాహిత్య రంగంలో నవ్యమార్గాలు వెలిగించి నవ్యరీతులు వెలయించిన స్రష్ట. సాహిత్యముఖంగా సంఘసంస్కారానికి దోహదం చేసిన ద్రష్ట. ఆధునిక వచనరచనకు ఆద్యుడు గురజాడ. వ్యావహారిక భాషను చేపట్టి సాహిత్య ప్రపంచంలో దానికి సుస్థిరమైన స్థానాన్ని కలిగించిన దిట్ట. కవిగా .. నాటకకర్తగా, కథారచయితగా .. వ్యాసకర్తగా బహుముఖాలుగా లబ్ధప్రతిష్ఠుడైన యుగకర్త గురజాడ. కందుకూరి రచనలు తెలుగు సాహిత్యంలో సంస్కార ధోరణులను ప్రవేశపెడితే విప్లవాత్మకమైన మార్పులు తీసికొనివచ్చిన ఖ్యాతి గురజాడకు దక్కింది. అంధకార బంధురమైన వ్యవస్థకు వేగుచుక్క గురజాడ. వీరేశలింగం అగ్నిపర్వతమైతే గురజాడ మేరుపర్వతంలాంటివాడు. ఒక్కమాటలో చెప్పాలంటే ఆధునిక సాహిత్యానికి సరిహద్దు రేఖ గురజాడ.

సమాజం వీపుపై లేచిన కన్యాశుల్కం అనే రాచపుండుకు నాటక రచన ద్వారా షాక్‌ట్రీట్‌మెంట్ ఇచ్చిన గురజాడ ఆనాటి సమాజంలో అమ్మకాలు కొనుగోళ్ల మధ్య నలిగి నాశనమౌతున్న స్త్రీ జాతికి అండగా నిలిచారు. కన్యాశుల్క వ్యవస్థను నిరసిస్తూ కన్యాశుల్కం నాటకాన్ని రచించారు. ఎన్నో సంచలనాలకు కేంద్రబిందువైన కన్యాశుల్కం నాటకరచనకు ఉన్న నేపథ్యాన్ని విధిగా తెలుసుకోవాలి. విజయనగరం మహరాజా ఆనందగజపతి మద్రాస్ లెజిస్లేటివ్ కౌన్సిల్ సభ్యులుగా ఉన్న కాలంలో కన్యాశుల్క నిషేధశాసనాన్ని ప్రవేశపెట్టాలని భావించారు. ఇందు నిమిత్తం విశాఖజిల్లాలో (నేటి శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్టణం జిల్లాలు కలిపి) గురజాడ అప్పారావు ద్వారా ఆడపిల్లల్ని డబ్బుకు అమ్ముకునే కుంటుంబ వివరాలను సేకరించారు. ఈ 1034 కుంటుంబాల వివరాలను సేకరించారు. ఈ నివేదికలో తొంభైతొమ్మిది మంది 3 సంవత్సరాలలోపు బాలికలకు, నలభై నలుగురికి నాలుగవ ఏట, ముప్పైఆరుగురికి మూడవ ఏట, ఆరుగురికి రెండవ ఏట ముగ్గురికి సంవత్సరకాలంలో వివాహాలు జరిగినట్లు గురజాడ పేర్కొన్నారు. ఈ శాసనం చేయడానికి మద్రాస్ ప్రభుత్వం సుముఖత వ్యక్తం చేయలేదు. ఒక వేళ ప్రభుత్వం అంగీకరించిన ప్రభుత్వం రూపొందించే శాసనం ఇంగ్లీషులో ఉంటుంది గనుక మారుమూల పల్లెల్లోని ప్రజలకు అర్థంకావు. ప్రజలు వారు అవలంబిస్తున్న కన్యాశుల్కం యొక్క దుష్ప్రభావాన్ని రంగస్థలం మీద చూపి సిగ్గుతో తలలువంచుకొనే విధంగా రచనకావాలని ఆనందగజపతుల వారు గురజాడను కోరారు. ప్రజాచైతన్యానికి ఒక కథ, ఒక కావ్యంకన్నా నాటక ప్రక్రియ పదునైనా వజ్రాయుధంగా భావించి గురజాడ కన్యాశుల్క నాటక రచనకు శ్రీకారం చుట్టారు. కత్తిపోటుకంటె బలీయమైన కలంపోటుతో సంఘాన్ని మరమ్మత్తు చేయడానికి గురజాడ ఉద్యమించారు. కందుకూరి సాంఘిక విప్లవం, గిడుగుభాషా విప్లవాలను జీర్ణించుకొన్న గురజాడ ప్రజల నాలుకలపై లాస్యంచేసే వాడుక భాషతో కళ్లముందు కనిపించే సమాతీరుతెన్నులను, మనుషుల మనస్తత్వాలను కన్యాశుల్కం నాటకంలో ఎక్స్‌రే తీశారు. ఈ నాటకంలోని ప్రతిసంఘటనా, ప్రతిపాత్రను

చూసి ప్రతిఒక్కరూ భుజాలు తడుముకొనేలా చేసింది. ఈ నాటకాన్ని 1892లో రచించి ఆనందగజపతి మహారాజులకే కృతజ్ఞతాపూర్వక నైవేద్యంగా అంకితం చేశారు.

1892 ఆగష్టునెలలో విజయనగరం జగన్నాథ విలాసినీ నాటక సమాజం కన్యాశుల్కం నాటకాన్ని మొదటి సారిగా ప్రదర్శించారు. కన్యాశుల్కం తొలిరచనలో ఐదు అంకములు, 27 రంగాలున్నాయి. ఈ నాటక ప్రదర్శన గొప్పగా విజయవంతమైనటు,; ఒక సంచలనాన్ని సృష్టించినట్లు తెలుగు హర్ప్‌వంటి పత్రికల సమీక్షల వలన తేటతెల్లమౌతుంది. సంఘసంస్కరణ ఉద్యమాన్ని ముందుకు నడిపించడం, నాటకరచనకు వ్యావహారిక భాష నప్పదనే భాషాఛాందసవాదుల అభిప్రాయాన్ని పూర్వపక్షం చేయడం కోసం కన్యాశుల్కం నాటకాన్ని రచించినట్లు పేర్కొన్న గురజాడను ఏదో వెలితి కలవరపెట్టింది. మారుతున్నకాలంలో ఒకటిరెండు పాత్రల మనస్తత్వాలపట్ల ఆయన ఉద్దేశ్యాలలో వచ్చినమార్పు ఆప్తుడైన శ్రీనివాస అయ్యంగార్ చేసిన సూచనలు, మధురవాణి పాత్ర గురించి అప్తమిత్రుడైన ఒంగోలు ముని సుబ్రమణ్యం ఆక్షేపణలు; దీనితో కన్యాశుల్కం నాటకాన్ని పునర్ముద్రణ చేయదలిచారు. కొద్దిపాటి మార్పులు చేద్దామనే తలంపుతో పునర్ముద్రణకు పూనుకొనగా అది సరికొత్త రంగు రుచి వాసనతో కొత్త కన్యాశుల్కమై 1909లో ఆవిర్భవించింది.

కన్యాశుల్కం తొలిరచన కాలంలో సంఘసంస్కరణోద్యమం ఉధృతంగా సాగుతుంది. రెండవ కూర్పునాటికి జాతీయోద్యమం మొదటి స్థానంలో సంఘసంస్కరణోద్యమం రెండవ స్థానంలోనూ వున్నాయి. కన్యాశుల్కం స్వీకరించడం నీతిబాహ్యమని, చట్టవిరుద్ధమని మద్రాస్ హైకోర్టు ఇచ్చిన తీర్పు సంఘసంస్కరణోద్యమానికి ఒక బలాన్ని చేకూర్చింది. సంఘసంస్కరణ అంటే కన్యాశుల్కాలు, బాల్యవివాహలూ, సానిమేళాలూ నిషేధించడం కాదు. సంఘపరివర్తనకు, పురోగమనానికి అవరోధంగా ఉన్న శక్తులను ఎదుర్కొని సవరించి సామాజిక వికాసానికి తోడ్పడటం. సామాజిక వికాసానికి సాహిత్యవిద్యారంగాలు ఉత్తమసాధనాలు. అందుకే గురజాడ దృష్టి వాటిపై ప్రసరించింది. మలికూర్పు వెలువడే నాటికి తెలుగు నాటకరంగంలో సామాజిక ఇతివృత్తం గల నాటకాలు లేవు. సంచారమరాఠీ నాటక సమాజాలవారు తెలుగునాట నాటకాలాడి డబ్బు సంపాదిస్తున్నారు. స్థానిక సమాజాలు వాటిని అనుకరిస్తున్నాయి. అజ్ఞానంలోని మహదానందానికి ఇంతకన్న చక్కని ఉదాహరణ లేదని గురజాడ భావించారు. అందుకే ప్రజలకు అవసరమైన ఇతివృత్తాన్ని ప్రజల భాషలో వ్రాసి ఆనాటి కాలానికే కాదు తెలుగునాటకానికే మహోపకారం చేశారు. సమకాలీనమైన ఇతివృత్తం, సజీవమైన వ్యావహారికభాష, ఒక వంక గిలిగింతలు పెడుతూ మరోవైపు ఛెళ్ళున చరిచే హాస్యంతో అరురూపమైన త్రివేణీసంగమంలా కన్యాశుల్కం అమరింది. సమస్యలకు నూరేళ్లునిండినా ఆనాటకం మాత్రం ఇప్పటికీ సజీవంగానే వుంది. శ్రీ శ్రీ మాటల్లో చెప్పాలంటే కన్యాశుల్కం నాటకం గొప్పది. మానవత్వానికీ సమానత్వానికీ కన్యాశుల్కం ఒక నివాళి. ఇందులో దేవతలూ దానవులూ లేరు. నిజమైన మనుషులున్నారు. అన్నీ సజీవపాత్రలే.

ప్రతిరచనలోనూ రచయిత ఏ అంశాన్ని చెప్పాడు. ఎలా చెప్పాడు అనే రెండు అంశాలు ఉంటాయి. మొదటి అంశాన్ని వస్తువు అని; రెండవ అంశాన్ని శైలి అంటారు. రచయిత రచనకు తీసుకొన్న జీవితాంశమూ దానిపట్ల రచయితకు ఉన్న అవగాహనాశక్తి అనే రెండూ కలిసి వస్తువుగా రూపుదిద్దుకొంటాయి. ఈ వస్తువును పాఠకులకు, ప్రేక్షకులకు అందించడానికి రచయిత తయారుచేసుకొన్న ప్రణాళిక, అనుసరించిన విధానాన్ని శిల్పం అంటారు. ప్రతిరచనలో వస్తువూ, శిల్పమూ రెండు కలగలిసేవుంటాయి. వస్తువును అటు పాఠకులకు, ప్రేక్షకులకూ అందించడానికి ఉపయోగపడే సాధనం శిల్పం. సామాజిక వాస్తవికతకు ప్రతిబింబమే కళ. అందువలన కళలో.. రచనలో వస్తువుకు ప్రాధాన్యముంటుంది. అలాగని శిల్పాన్ని నిరాకరించడం కుదరదు. వస్తుశిల్పాల సమాహార స్వరూపమే కళ. వస్తువును మింగేసే శిల్పం కేవలం శిల్పంగానే మిగిలిపోతుంది. అసలు శిల్పమే లేని వస్తువు కేవలం అలంకార ప్రాయమైన వార్తగా మిగిలిపోతుంది. వస్తువును ఆశ్రయించి ఉన్న శిల్పం ఒక సంపూర్ణ సిద్ధికి దోహదం చేస్తుంది.

నూరేళ్ల క్రితం రచించబడిన కన్యాశుల్కం నాటకంలో గురజాడ సంఘసంస్కరణాభిలాష. ఆశయ దీక్ష.. సిద్ధాంత బలం అడుగడుగునా ప్రత్యక్షమౌతాయి. అస్తవ్యస్థమైన ఒక అవ్యవస్థనూ; సమస్యల సుడిగుండాలలో గిరికీలు కొడుతున్న సమాజాన్ని ప్రతిబింబించడమే గురజాడ లక్ష్యం.. ధ్యేయం. జీవితంలో నైతిక విలువలూ; ఉన్నత సంస్కారం., అత్యున్నతమైన నాగరికతను కన్యాశుల్కం రచన ద్వారా ప్రతిబింబిచడమే ఆశయంగా వ్రాయబడిన కన్యాశుల్కంలో గురజాడ దీక్షాదక్షతలు గోచరిస్తాయి. ఇందుకు

అనుగుణమై ఇతివృత్తాన్ని స్వీకరించడంలో; దానిని సంఘటనలుగా విడగొట్టి ఏక సూత్రంగా తీర్చిదిద్దడంలో; ఆ ఇతివృత్తాన్ని సజావుగా నడిపించడానికి పాత్రలను సృష్టించడంలో.. ఆ పాత్రలకు మాటలను అద్దడంలో.. తదను గుణమైన భాషను ఉపయోగించడంలో గురజాడ నాటక రచనా శిల్పచాతుర్యం గోచరిస్తుంది. ఈ నాటక శిల్పాన్ని మూడు విభాగాలుగా విభజించవచ్చు. అవి 1. కథాశిల్పం 2. పాత్రచిత్రణాశిల్పం 3. సంభాషణరచనా శిల్పం.

**కథాశిల్పం:** కథలో పలు వైవిధ్యమైన సంఘటనలుంటాయి. ఆ సంఘటనలన్నీ ఒక సామాజిక ప్రయోజనానికి; నాటక కార్యానికీ దోహదపడడమే కథాశిల్పం. నాటకంలో ప్రధాన ప్రయోజనానికి ఉపయోగపడని సంఘటన ఉంటే కథాశిల్పం దెబ్బతింటుంది. కన్యాశుల్కం నాటకం మీద ఉన్న ప్రధానమైన విమర్శలు; చెలరేగిన వాదోపవాదాలూ కథైక్యత విషయంపైనే కేంద్రీకరించబడడం విశేషం. కన్యాశుల్కం నాటకంలో కథ ముప్ఫైమూడు స్థలాల్లో నడుస్తుంది. ఈ ఇతివృత్తాన్ని యేడంకాల్లో పకడ్బందీగా బిగించారు. విజయనగరం, కృష్ణారాయపురం; రామచంద్రపురం, అగ్రహారం వంటి అనేక స్థలాల్లో కథనడుస్తుంది. అగ్నిహోత్రావధానులు తనకుమార్తె సుబ్బిని లుబ్ధావధానులకు ఇచ్చి వివాహం చేయడానికి ప్రయత్నిస్తున్న సందర్భంలో కరటక శాస్త్రి మధురవాణి సహాయంతో భగ్నం చేయడం.. తద్వారా జరిగిన పరిణామాలను గుదిగుచ్చి గురజాడ కన్యాశుల్కంగా రచించారు. ఈ విషయంతో పాటు ఆనాటి సమాజంలో ఉన్న వేశ్యాలంపటత్వాన్ని విస్పష్టంగా చెప్పాలనేది గురజాడ ఆశయం. వీనితో పాటు విద్యా వ్యవస్థతీరు తెన్నులను కూడా గురజాడ ఈ నాటకంలో చర్చించారు.

నాటకం ప్రారంభం ముగింపుల మధ్య అందమైన సంవిధానం, సమన్వయం పాటించకపోతే నాటక శిల్పంలో వెలితి కొట్టవచ్చినట్లుగా కన్పిస్తుంది. కన్యాశుల్కం నాటకం గిరీశంతో ప్రారంభమై గిరీశంతోనే ముగుస్తుంది. విజయనగరంలోనే కథ ప్రారంభమై విజయనగరంలోనే ముగుస్తుంది. ఈ విధంగా దేశకాల పాత్రల దృష్ట్యా కన్యాశుల్కం నాటకంలో ఆద్యంతాల మధ్య చక్కని సమన్వయం కుదిరింది. నాటకారంభంలో పూటకూళ్లమ్మ చేత గెంటబడిన గిరీశం నాటకాంతంలో సౌజన్యారావుచేత గెంటడంతో ముగుస్తుంది. ఇది ఆద్యంతాల మధ్య చక్కగా కుదిరిన సమన్వయం. నాటకారంభంలో మధురవాణిచేత వదిలించుకోవడంతో మొదలైన గిరీశం పాత్ర పాపం అతనిని బ్రతకనివ్వండి అనే మధురవాణి సానుభూతివాక్యాలతో నాటకం ముగుస్తుంది. నాటక ఆరంభ ముగింపుల మధ్య శిల్ప మర్యాద చక్కగా పోషించబడింది.

**పాత్ర చిత్రణా శిల్పం:-** సమాజంలో మానవ ప్రవృత్తులే రచనలలోని పాత్రలకు ప్రతిబింబాలుగా ఉంటాయి. ఒక భావానికి.. స్వభావానికీ అనేక పాత్రలను.. ప్రతినిధులుగా చేయడం రచయితలు చేసేపని. పాత్రలను అర్థవంతంగా ప్రయోగించడం రచయిత ఔన్నత్యానికి నికషోపలంగా నిలుస్తుంది. ఒక భావానికీ ఒక స్వభావానికి అనేక పాత్రలు ప్రతినిధులను చేయడం సామూహిక పాత్ర చిత్రణ అని అంటారు. కన్యాశుల్కం నాటకంలో గురజాడ పాత్ర చిత్రణను సమర్థవంతంగా నిర్వహించారు. పాత్రపోషణ విషయంలో గురజాడ చూపిన శిల్ప నైపుణ్యం అనంతమైనది. మానవతా దృక్పథంతో ఆ పాత్రలను చిత్రిస్తూనే వానిని నాటకానికి మాధ్యమంగా వడుకోవడానికి గురజాడ ఎన్నుకొన్న ముఖ్యమైన పద్ధతి పాత్రల్ని తులనాత్మకంగా చూపడం. మూసపాత్రలను తీసుకొని వారికి వ్యక్తిత్వ లక్షణాలతో ప్రాణం పోసి మరొక పాత్రతో పోల్చి చూపి తద్వారా ఆ పాత్రల ప్రతిపత్తిని ఇనుమడింప చేశారు. ఉదాహరణకు ఛాందస ఒక మూస పాత్ర. గురజాడ కన్యాశుల్కంలో ఇద్దరు ఛాందస బ్రాహ్మణుల్ని సృష్టించారు. ఒకరు అగ్ని హోత్రావ ధానులు... ఒకరు లుబ్ధావధానులు. ఇద్దరూ మూర్ఖులు. తమకు తోచిందే వేదం. కానీ పాత్రలను సృష్టించిన తరువాత ఇద్దరి మధ్యా హస్తి మసికాంతర వ్యత్యాసముంది. నశిస్తున్న ఒక సంస్కృతికి, క్షీణిస్తున్న ఒక సంప్రదాయానికి వారు ప్రతినిధులు. పూట కూళ్ళమ్మా; బుచ్చమ్మా, మీనాక్షి ఈ నాటకంలో వితంతువులు. వితంతువుల జీవితంలోని వైవిధ్యానికి వారు ప్రతి నిధులు. పూట కూళ్ళమ్మ స్వేచ్ఛా జీవి. బుచ్చమ్మ తల్లి దండ్రుల కట్టడిలో శృంఖలాబద్ధంగా ఉంది. మీనాక్షి రామప్ప పంతుల వంటి దుర్మార్గుల మూలంగా అల్లరి పాలైపోయింది. నాయుడు, భీమారావు పంతులు; సౌజన్యారావు అనే ముగ్గురూ న్యాయ మూర్తులు. నాయుడు నాటు వకీలు. భీమారావు సౌజన్యారావు ఆధునికులు.

భీమారావుకు డబ్బే సర్వస్వం. సౌజన్యారావుకు న్యాయమే సర్వస్వం. గిరీశం; కరటక శాస్త్రి ఇద్దరూ గురువులు. శిష్యులను తమ స్వార్థానికి వాడుకొంటారు. వెంకటేశం, మహేశం ఇద్దరూ విద్యార్థులు వెంకటేశం ఇంగ్లీషు విద్యనూ, మహేశం సంస్కృత విద్యనూ అభ్యసిస్తూ వుంటారు. గిరీశాన్ని సంకీర్ణ పాత్రగా గురజాడ తీర్చి దిద్దారు. పూటకూళ్ళమ్మను, మధుర వాణిని అబద్ధాలు చెప్పి మోసం చేస్తాడు. మంచి చెడుల సంగమ పాత్రగా గురజాడ మలిచారు. పాత్ర చిత్రణలో ఇది అరుదు.

**సంభాషణ రచనా శిల్పం :** సంభాషణ రచన నాటక రచనలో అత్యంత ప్రాముఖ్యం వహిస్తుంది. పాత్రల ఆర్థిక సాంఘిక రాజకీయాది నేపథ్యాన్ని వివరించాలన్న, కథలోని దేశకాల పాత్రలను సూచించాలన్నా అన్నింటికీ సంభాషణా రచనే బలమైన సాధనం. కన్యాశుల్కంలోని సంభాషణలు మానవ మనస్తత్వ పరిశీలనకు, సమాజ పరిశోధనా శక్తికి, నిదర్శనాలుగా నిలుస్తాయి. పాత్రలను సమూహాలుగా చిత్రించిన గురజాడ సంభాషణలను సైతం సమూహాలుగా చిత్రించారు. ఒకే రకమైన సన్నివేశాలలో ఒక పాత్ర, అనేక పాత్రలు ఒకే రకంగా మాట్లాడటం సామూహిక సంభాషణా శిల్పం. మధురవాణి పురుష పాత్రల అనైతికతను బట్టి బయలు చేసే అనేక సందర్భాలలో ఒకే తీరుగా మాట్లాడుతుంది.

కన్యాశుల్కం నాటకంలో కొన్ని పాత్రలు నాటకంలో ప్రవేశిస్తూ పలికే తొలి మాటలు ఆ పాత్రల స్వభావాలను వ్యక్తం చేసేవిగా ఉండడం ఒక వైచిత్రి. ఆ మాటల ద్వారా ఆయా పాత్రలు తమ మనస్తత్వాలను తామే ఆవిష్కరించుకొంటాయి. గిరీశం తన తొలి మాటల్లోనే "పేషెన్స్ ఉంటేగానీ లోకంలో నెగ్గలేం'' అంటూ ప్రవేశిస్తాడు. నాటకంలోని అన్ని దశల్లోనూ గిరీశం అదే మాటలను ఆలంబనగా చేసుకొని నడుస్తాడు. "మొగవాడికైనా ఆడదానికైనా ఒక నీతి ఉండాలి'' అంటూ మధురవాణి ప్రవేశిస్తుంది. నాటకంలో తన దైన నీతిని ప్రదర్శిస్తూ ఎదుటి వారి దుర్నీతిని ఎండగడుతుంది. "పిల్లా అగ్గి పుల్లా'' అంటూ ప్రవేశించిన రామప్ప పంతులు స్త్రీలను మోసం చేయడం; కొంపలను నిలువునా కూల్చడం చేస్తాడు. అపురూపమైన శిల్ప నిర్మాణ చాతుర్యంతో అత్యుత్తమమైన నాటకంగా తీర్చి దిద్దిన కన్యాశుల్కం ఒక తరగని గని. తవ్విన కొద్దీ అనేక అనర్ఘ రత్నాలు మన చేతికి అందుతాయి.

## 15.1 ప్రశ్నలు - సమాధానాలు :

ప్రశ్న :

1. **గిరీశం పాత్ర చిత్రణా నైపుణ్యాన్ని వివరించండి.**

**లేదా**

**ఆనాడు మారుతూన్న వ్యక్తుల ప్రతిబింబం గిరీశం పాత్ర అనే మాటలను సోదాహరణంగా చిత్రించండి.**

అభ్యుదయ నాటక సాహిత్యానికి గురజాడ అప్పారావు దిశా నిర్దేశకుడు. కన్యాశ్కులంతో సరితూగే నాటకం తెలుగు నాటక సాహిత్యంలో మరొకటి లేదంటే అతిశయోక్తి లేదు. కన్యాశుల్కం నాటక మంతా ఒక ఎత్తు. గిరీశం పాత్ర చిత్రణ ఒక ఎత్తుగా కనిపిస్తుంది. గిరీశం పాత్ర చిత్రణలో గురజాడ చూపిన ప్రతిభ అనన్య సామాన్యం. గురజాడ పేరు చెప్పగానే గిరీశం; గిరీశం పేరు చెప్పగానే గురజాడ చటుక్కున మనస్మృతి పథంలో కనిపిస్తారు. గిరీశం లుబ్ధావధానుల పినతల్లి కొడుకు. లక్ష్మీ కటాక్షం సరస్వతీ అనుగ్రహం చిన్న చూపు చూడడంతో చదువు సంధ్యలు అబ్బలేదు. సిరీ సంపదా అతని వైపు చూడడానికే సుతరామూ అంగీకరించలేదు. కానీ మాటల గారడి మాత్రం శరీరంలోని నరనరంలో పెల్లుబుకుతూ వుంటుంది. నయవంచన, డాంబికం, ఎప్పటికి ఏది ప్రస్తుతమో అలా క్షణాలలో ప్లేటు ఫిరాయించే ఊసరవెల్లి తనం, మింగమెతుకు లేకపోయినా మీసాలకు సంపంగినూనె వ్రాసుకొనే ఆడంబరత్వం గిరీశం సొత్తు. తాను నవ్వకుండా తన మాటలూ చేతలతో భళ్ళున హాస్యాన్ని చిలికిస్తూ ఎటువంటి విషమ పరీక్షనైనా గోటితో ఎదుర్కొంటూ దానిని తనకు అనుకూలంగా మలచుకొనే సమయస్ఫూర్తి అతని సొత్తు.

నాటక ప్రారంభంలో బొంకుల దిబ్బవద్ద ప్రత్యక్షమైన గిరీశం, 'పూటకూళ్ళమ్మకు సంతలో సామానుకొనిపెడతానని నెలరోజుల కిందట ఇరవై రూపాయలు పట్టుకెళ్ళి డాన్సింగర్ల్సు కింద ఖర్చు పెట్టాను. ఇవాళ ఉదయం పూటకూళ్ళమ్మకూ నాకూ యుద్ధమైపోయింది. బుర్రబద్దలు కొడదామా అన్నంత కోపం వచ్చిందికానీ పూర్రిచర్డు చెప్పినట్లు పేషెన్సు ఉంటేగానీ లోకంలో నెగ్గలేం. ఈ ఊళ్ళో మరి మనపప్పు ఉడకదు. ఎటుచూసినా అందరికీ బాకీలే. వెంకుపంతులుగారి కోడలికి లవ్‌లెటర్ రాసినందుకు ఎప్పుడో ఒహప్పుడు సమయం కనిపెట్టి దేహశుద్ధి చేస్తారు. "శీఘ్రంగా ఇక్కడనుండి బిచాణా ఎత్తివేయడమే'' అనే నిర్ణయానికి వస్తాడు. బిక్కమొగం వేసుకొని వస్తున్న ప్రియ శిష్యుడు వెంకటేశాన్ని చూసి వీడి వైఖరి చూస్తే పరీక్ష ఫెయిలైనట్లు కనబడుతుంది. వీణ్ణి కొంచెం ఓదార్చి వీడికి సెలవుల్లో చదువుచెప్పే మిషమీద వీడితో వీడి ఊరికి ఉడాయిస్తే చాలా చిక్కులు వదులుతాయి అంటూ తన సమస్యకు పరిష్కారాన్ని తానే సూచించుకొంటాడు. 'మీ సావాసం చేయడంచేత నా పరీక్షపోయిందని మా మాష్టారు మీతో మాట్లాడొద్దన్నారు.' అన్న వెంకటేశ్వర్లు మాటలు విని తన శీలాన్ని శంకించిన మాష్టారుపై అగ్గిరాముడిలా విరుచుకుపడతాడు. 'నాతో మాట్లాడటమే ఒక ఎడ్యుకేషన్. ఆ మాటకొస్తే నీకున్న లాంగ్వేజీ నీ మాష్టరుకుందీ. విడోమేరియేజ్ విషయమై., కొశ్చిన్ విషయమై నీకు ఎన్ని లెక్చర్లిచ్చాను. నా దగ్గర చదువుకున్నవాడు ఒహడూ అప్రయోజకుడుకాలేదు. పూనా డక్కన్ కాలేజీలో నేను చదువుతున్నపుడు ది ఇలెవెన్ కాజెస్ ఫర్దీ డిజనరేషన్ ఆఫ్ ఇండియాను గూర్చి మూడుఘంటలు ఒక్కబిగిన లెక్చర్ ఇచ్చేసరికి ప్రొఫెసర్లుడంగయి పోయినారు. మనవాళ్లు ఉత్తవెధవాయిలోయ్. చుట్టనేర్పినందుకు థ్యాంక్ చేయక తప్పుపడుతున్నవ్. చుట్టకాల్చడం యొక్క మజా నీకు బోధపడకపోవడం చాలా ఆశ్చర్యంగా ఉంది. చుట్టకాల్చబట్టేగదా దొర్లంతా గొప్పవాళ్లపోయారు. చుట్టకాల్చని ఇంగ్లీషు వాళ్లని చూశావు. చుట్టపంపిణీ మీదనే స్టీముయంత్రం వగయిరా తెల్లవాడు కనిపెట్టాడు. గరుత్మంతుడు అమృతాన్ని తీసుకొని వెళుతున్న సందర్భంలో ఒక చుక్కభూమిమీద రాలిపడింది. అది పొగచెట్టుగా జన్మించింది. కావున పొగతాగనివాడు దున్నపోతుగా పుడతాడని బృహన్నారదీయం నాలుగవ ఆశ్వాసంలో ఉందని తన ఔన్నత్యం గూర్చి పొగతాగడం యొక్క ప్రాశస్త్యాన్ని తాటవలచి నొక్కివక్కాణిస్తాడు. నువ్వు బుద్ధిగా ఉండి చెప్పిన మాటల్లా వింటూవుంటే సురేంద్రనాథ్‌బెనర్జీ అంత గొప్పవాణ్ణి చేస్తానని గిరీశం వెంకటేశాన్ని చుక్కల్లో కూర్చోబెడతాడు.

ఫోటోగ్రాఫర్ బంట్రోతువచ్చి గిరీశాన్ని పాతబాకీ ఇమ్మని నిలేశాడు. అతగాడి నుండి తప్పించుకోవడానికి చెవిటివాడిలాగా నటించాడు. బంట్రోతుకు ఒక సిగారులంచమిచ్చి రేపు సాయంత్రానికి ఇస్తానని గాయత్రిపై ప్రమాణం చేశాడు. ఈ విధంగా బంట్రోతుకు టోపీవేసి మధురవాణి ఇంటికి హుషారుగా వెళ్లిన గిరీశానికి ఉత్సాహభంగం జరిగింది. చీపురుకట్టతో పూటకూళ్లమ్మ భద్రకాళిగా ప్రత్యక్షమైతే రామప్పంతుల్ని ఆమె ఆగ్రహానికి ఆహారంగా వేసి బ్రతుకు జీవుడా అంటూ బైటపడతాడు. పకడ్బందీగా పథకం వేసుకొని వెంకటేశం ఇంటికి వెళ్లగానే అహిరావణ; మైరావణుల వంటి కరటకశాస్త్రి; అగ్నిహోత్రావధానులు గిరీశాన్ని ఓ పట్టుపట్టారు. కరటకశాస్త్రి పాండిత్యాన్ని వేనోళ్ల పొగడి బుట్టలో వేసుకొన్నాడు. కానీ అగ్నిహోత్రావధానులు గిరీశానికి ఓ పట్టాన కొరుకుడుపడలేదు. ఈ శషభిషలు నాకేంపనికిరావు. ఇతడి వైఖరిచూస్తే ఇక్కడే బసచేసేటట్టు కనపడుతుంది. మా ఇంట్లో భోజనం ఎంతమాత్రం వీలుపడదు అంటూ అగ్నిహోత్రావధానులు తెగవేసి చెప్పాడు. వెంకటేశం చదువు విషయంలో అగ్నిహోత్రావధానుల దంపతుల విభేదాలను చూసి "ఇక మూడేళ్ల నా తరీఫీదులోనుంచితే క్రిమినల్లో వరుసగా పోలీసు పరీక్ష ప్యాసుచేయిస్తాను'' అంటూ వెంకాయమ్మను తనవైపు తిప్పుకొంటాడు. కోర్టురికార్డులను ముక్క ముక్క తర్జుమా చేసి పెడతానని అగ్నిహోత్రావధానుల తాటాకు కోపాన్ని మాటల నీటి మూటలతో చప్పున చల్లబరుస్తాడు.

బుచ్చమ్మను చూసి గిరీశం మనసు మంచులాగా కరిగిపోతుంది, ' పల్లెటూరు ఊసు పోదనుకొన్నాను గానీ పెద్ద క్యాంపెయిన్‌కు అవకాశం ఇక్కడా కూడా దొరకడం నా అదృష్టం.' అంటూ బుచ్చమ్మను వలలో వేయడానికి పటిష్టమైన పథకరచనకు పూనుకొంటాడు. గిరీశం మాటలగారడి తెలియని వెంకటేశం అమాయకత్వంతో ఇన్నాళ్లూ ఇది కూడదని చెప్పినారే నాతో అంటే " ఒపీనియను అప్పుడప్పుడు ఛేంజి చేస్తూంటేగాని పొలిటీషియన్ కానేరుడు'' అంటూ చిత్రవిచిత్రమైన వాదన చేసి పరువునిలబెట్టుకుంటాడు. ప్యూర్ డైమండ్ వంటి బుచ్చమ్మను పెళ్లిచేసుకొంటే మొత్తం మీద లాభమనీ దినదినగండం లేకుండా బ్రతుకు సాగిపోతుందని గిరీశం నిర్ణయించుకొంటాడు. బుచ్చమ్మ గిరీశం ఉపన్యాసాలకు లొంగలేదు. సుబ్బి పెళ్లి గొడవను అస్త్రంగా చేసుకొని బుచ్చమ్మ మీద సమ్మోహనాస్త్రం ప్రయోగించాడు.

తనతో లేచిపోయి రావడం ఒక్కటే పెళ్లితప్పించడానికి ఏకైక తరుణోపాయమని నూరిపోశాడు. పెళ్లికి వెళుతూ దారిలో బుచ్చమ్మ బండి తప్పించి లేవదీసుకుపోయాడు. సౌజన్యారావు పంతులు వద్దకు చేరి ఆయన మనస్సుకు నచ్చేటట్లు ప్రవర్తిస్తాడు. లుబ్ధావధానుల ఆస్తినికాజేసి బుచ్చమ్మతో సుఖించాలని కలలుకనే సమయంలో మధురవాణి మారువేషంలో రావడంతో తన పథకం రచ్చకెక్కింది. తన బండారం బద్దలుకావడంతో డామిట్ కథ అడ్డం తిరిగింది అంటూ వెళ్లిపోతాడు.

గిరీశం అబద్ధాలు ఆడతాడు. ఎన్నోడాబులు కొట్టాడు. అతివినయం నటించాడు. ఎవరిదగ్గర తాళం వారిదగ్గర వేస్తాడు. మిడిమిడి జ్ఞానం ఉపయోగించి లెక్చర్లు దంచాడు. విదూషకుడిలా నవ్విస్తాడు. వేదాంతిలా ఆలోచనలను రేకెత్తిస్తాడు. అడుగడుగునా ఎదురైన చిక్కులను ఉపాయంతో తప్పించుకొన్నాడు. కానీ ఎదుటివాళ్ల కొంపలు కూల్చి మేడలు మిద్దెలు కట్టాలనే ఆలోచన ఏ కోశానా గిరీశానికి లేదు. జానెడు పొట్టకోసం బ్రతుకు తెరువు కోసం జీవితంలో నటించాడు. నటనలో జీవించాడు. తెలుగునాటక సాహిత్యంలో కన్యాశుల్కం మొదటి మైలురాయి. ఈ నాటకానికి గిరీశం గొప్ప అలంకారం. సమర్థుడైన దౌర్భాగ్యుడు గిరీశం. అందుకే గిరీశానికి సాటి గిరీశమే. గిరీశానికి పోటీ కూడా గిరీశమే.

## ప్రశ్న. 2. గురజాడ మధురవాణి పాత్రచిత్రణ గావించిన తీరును వివరించండి.

దేశమంటే మట్టికాదు, మనుష్యులు అన్నారు గురజాడ. అలాగే కావ్యమన్నా, నాటకమన్నా కేవలం పదప్రయోగం, మాటలగారడి కాదు. అందులో ప్రజలకు ప్రాతినిధ్యం వహించే పాత్రలు. అవి వ్యక్తం చేసే భావాలు ప్రధానం. కన్యాశుల్కంలో కొట్టవచ్చినట్లు కన్పించేది, గురజాడ కీర్తిపతాకకు అసలైన నిదర్శనంగా కనిపించేది పాత్రచిత్రణా నైపుణ్యం. "రచయిత తాను రూపొందించే పాత్రలనన్నింటినీ జీవితం నుండి పరిగ్రహించడు. పరిగ్రహించిన పాత్రలను అచ్చంగా పరిగ్రహించినట్లుగానే చిత్రించడు. వెనుకటి కవులు నిర్మించిన భావనాత్మకమూర్తుల లక్షణములు అతనికి తెలియకుండానే అతనిలో ద్యోతకమౌతాయి" అనే గురజాడ మాటలకు ప్రజల సాక్ష్యం మధురవాణి పాత్రచిత్రణ. కన్యాశుల్కం నాటకంలో మధురవాణి పాత్ర కీలకమైనది. నాటకం చుట్టూ తాను తిరుగుతుంది. తన చుట్టూ నాటకాన్ని తిప్పుకొంటుంది. కథ సూటిగా ప్రయాణించడానికి, ప్రవహించడానికి సరైన దారులు వేస్తుంది. కథకు ఎక్కడైనా ఎప్పుడైనా అడ్డు ఎదురైతే ఆ చిక్కుముడులను తానే విప్పుతుంది. అవసరమైతే తానే చిక్కుముడులు వేస్తుంది. జవంజీవం తొణికిసలాడే మధురవాణి చిత్రణలో గురజాడ సునిశితమైన ప్రజ్ఞను ప్రదర్శించారు.

'మొగవాడికైనా.. ఆడదానికైనా నీతి ఉండాలి. వేశ్య అనగానే అంతచులకనా, సానిదానికి మాత్రం నీతి ఉండొద్దా' అంటూ నాటకం ప్రారంభంలోనే పురుషాధిక్యతపై కొరడా ఝుళిపిస్తుంది. "నేను డబ్బుకక్కుర్తి మనిషిని కాదు" అంటూ తన మనస్తత్వాన్ని తేటతెల్లం చేస్తుంది. పరువైన ఆడది నీ ఇంటికి ఎందుకువస్తుంది అన్న గిరీశంతో "పరువైన మొగాళ్లు వచ్చినప్పుడు పరువైన ఆడవాళ్లెందుకు రాకూడదు". అంటూ పురుషాహంకారంపై చురకలు వేస్తుంది. నాకు డబ్బు గడ్డిపరక అంటూ తనకు డబ్బుపై వ్యామోహంలేదని రామప్పంతులితో చెబుతుంది. జడతోకొడతాను శాస్త్రంలో కాముకులకు చెప్పిన ఆయుధమిది అంటూ రామప్పంతుల్ని గిలిగింతలు పెడుతుంది. తనమేనకోడలికి పెళ్లిజరిగితే మా చెల్లెలు నూతిలో పడతానని అంటున్నందున ఏదైనా ఉపాయం ఆలోచించి ఆ పెళ్లి చెడకొట్టమని కరటకశాస్త్రి మధురవాణిని ప్రాధేయపడతాడు. వృత్తిచేత వేశ్యను గనుక చెయ్యవలసిన చోట్ల ద్రవ్యాకర్షణ చేస్తాను. మధురవాణికి దయాదాక్షిణ్యాలు సున్న అని తలచారా" అని కరటకశాస్త్రికి అభయమిచ్చి ఆ పెళ్లి తప్పించడానికి పథక రచన చేస్తుంది.

సంపూర్ణమైన మానవత్వం మూర్తీభవించిన పూర్ణకుంభం మధురవాణి. నవ్వినా.. కోపించినా.. మాటలాడినా.. మన్ననచేసిన, మంత్రాంగం చెప్పినా, తంత్ర రచన చేసినా ఏమి చేసినా చేయకపోయినా నిండైన మాధుర్యం, ఒయ్యారం, రసజ్ఞత ఒలికి పరిమళించి ఎదుటివారిని సైతం గుభాళింపచేస్తాయి. ఆ స్పందనకు లోబడని వ్యక్తి మానవాతీతుడైనా కావాలి లేదా మగవాడు కానివాడైనా కావాలి. మసిపాతరకప్పినా మాణిక్యం ప్రభలు దాగనట్లు ఏజన్మయోగమో భ్రష్టమై కాలుజారి ఆమె వేశ్యాకులంలో పుట్టినా మంచితనం, మానవత్వం పరిమళిస్తూనే వుంటుంది. రామప్పంతులు వంటి మహాలౌక్యులను కూడా కించిత్తు లెక్క చేయకుండా నిలువునా నిలబెట్టి వాళ్ల అక్రమాలను దులిపి బుద్ధిచెబుతుంది. మధురవాణి ప్రతిమాటా ప్రతిచేష్టా మెత్తని చెప్పుతో కొట్టినట్లుగా ఉంటుంది. "తాను చేస్తే

లౌక్యం మరొకడు చేస్తే మోసం అనరాదా అబద్ధానికి అర్థం ఏమిటి'' అని రామప్పంతుల్ని దులిపివేస్తుంది. యోగ్యుడైన కరటకశాస్త్రికి ఎంతో సహాయం చేసినా అతగాడు కూడా పప్పులో కాలువేసినప్పుడు మెత్తమెత్తగా అంటిస్తుంది. "చిత్రగుప్తుడికి లంచం ఇవ్వగలరా? అతగాడి దగ్గరకు కూడా మధురవాణిని పంపి చేసిన పాపాలు అన్నీ తుడుపుపెట్టించుకోవడానికి వీలు ఉండదు కాబోలు'' అని కరటకశాస్త్రిని దులిపివేస్తుంది. మధురవాణి మధురసంస్కారం, అమలిన హృదయమూ అడుగడుగునా ప్రత్యక్షమౌతుంది. పంకంలో పుట్టినా పద్మినీ జాతికి చెందిన స్త్రీ రత్నం మధురవాణి.

"మధురవాణి అంటూ ఒక వేశ్యశిఖామణి ఈ కళింగరాజ్యంలో పుట్టి ఉండకపోతే భగవంతుడి సృష్టికి ఎంతో లోపం వచ్చి ఉండును.'' అని కరటకశాస్త్రి మాటలను పరిశీలిస్తే కన్యాశుల్కం నాటకంలో మధురవాణి సహజసుందరి. గిరీశం మాటల్లో బ్యూటిఫుల్‌నాచ్ డెవిల్. ఆమె వలలో చిక్కిన ప్రాణి మరి తప్పించుకుపోలేడు. డిప్యూటీకలెక్టర్ నుండి కొండిభట్లుదాకా అందరూ ఆమె పరిచయం కోసం దేవుళ్లాడినవారే. పూజారికి ఆమె పుత్తడి బొమ్మ. కరటకశాస్త్రికి త్రిలోకసుందరి. మధురవాణి చాలా తెలిసిన మనిషి. లుబ్ధావధానుల పెళ్లినాటకంలో నాందీ ప్రస్థావన భరతవాక్యాలను తానే పలుకుతుంది. తెలివితేటలతోపాటు మధురవాణికి ఆత్మవిశ్వాసం కూడా ఎక్కువే. తాను తిప్పేయంత్రం ఎప్పుడు ఎదురుతిరిగినా చక్రం అడ్డువేస్తుంది. కొంపమునిగితే చాకచక్యంతో తేలుస్తుంది. యాంటీనాచ్‌గా ముద్రపడిన సౌజన్యారావును కలవడానికి మగవేషంతో నిశిరాత్రి సమయంలో వస్తుంది. వేశ్యను అర్ధరాత్రి పడకింటిలో పెట్టుకొని మాట్లాడటం మూలంగా తనకు వ్రతభంగమైనదని, బాధపడుతున్న సౌజన్యారావును తనవాదనతో కనువిప్పు కలిగిస్తుంది. "భగవంతుని దర్శనమునకు పోవచ్చునుగదా? తమ దర్శనమునకు మాత్రము విరోధమా'' అంటూ ముందరికాళ్లకు బంధాలు వేస్తుంది. నా శత్రువులు ఎవరో నిన్ను నాదగ్గరకు పంపారు అన్నమాటలకు అలాగైతే మంచే తనకు శత్రువై వుండాలి. అని మాటకు మాట బదులిస్తుంది. "వేశ్యజాతి చెడ్డజాతి కావచ్చు. తాము సెలవిచ్చినట్లు చెడ్డలో మంచి ఉండకూడదా? మంచి ఎక్కుడున్నా గ్రాహ్యం కాదా? అని సౌజన్యారావు నోరు కట్టివేస్తుంది. అట్టేసేపు నీవు నా ఎదుటగానీ నిలిచి ఉంటే నువ్వు ఏ తగువు తీరిస్తే ఆ తగువుకు ఒప్పుదల అవుతానో అని భయమేస్తుందని'' అంటూ సౌజన్యారావు బింకం మధురవాణిని చూసి కరిగిపోతుంది.

సౌజన్యారావు మధురవాణితో వెయ్యిరూపాయిలిస్తాను బ్రాహ్మణ్ణి కాపాడు అని బేరంపెట్టాడు. మధురవాణి ముద్దు ఇవ్వమని బేరం పెడుతుంది. నీవు సొగసరివి.. ముద్దు చేదనికాదు వ్రతభంగం కదా అని దిగులు అని మధనపడతాడు. మధురవాణిది లాలనకాదు. మోహం అంతకన్నా కాదు. మంచిని ఆశ్రయించాలనే ప్రబలవాంఛతో నిండిన మనస్సు యొక్క ఆవేశమూ; సౌజన్యతను ఆస్వాదించడానికి అతిశయించిన తృష్ణ, నిరాధారంగా ఉన్న తన జీవితానికి ఒక పట్టుగొమ్మకోసం వెదుకులాడే స్త్రీ సహజమైన బలీయమైన కోరిక, సజ్జనసేవయందు అనురక్తి, సౌజన్యారావు ముద్దు ఇవ్వబోయిన సందర్భంలో ఆమె మనస్సులోని స్పటికంలాంటి మంచితనాన్ని సౌజన్యారావు గుర్తించి భగవద్గీతను కానుకగా ఇస్తాడు. వ్రతభంగమని కూడా సంకోచించక ఆమెకు షేక్‌హ్యాండ్ ఇచ్చి అభినందించి సగౌరవంగా సాగునంపుతాడు. సామాన్యమైన వేశ్యకంటే నిష్ఠాగరిష్ఠులైన అధికులకంటె వేయిరెట్లు గొప్పదని సౌజన్యారావు భావిస్తాడు. మధురవాణి సంప్రదాయానికి వ్యతిరేకంగా నిలిచి వ్యక్తిత్వం పరిధులు స్పృశించిన స్త్రీ పాత్ర. అందరి తత్వాలకు అనుగుణంగా మసులుకొంటూ ఉన్నట్లే నటిస్తూ ఆకుకు అందకుండా పోకకు పొందకుండా తప్పించుకొని తిరిగే వేశ్య అయినా మానవ సంఘమునుగడకు కావలసిన నీతినిజాయితీ చూపించిన శీలవతి, మహామేధావి మధురవాణి. తన ఆంతర్యాన్ని ఎవరికీ చిక్కనీయనంత చిక్కని చక్కని మనిషి మధురవాణి. మధురవాణి పాత్ర పోషణలో గురజాడ ఒక ఆదర్శనిరూపణ. నిజనిర్ధారణను తగిన రీతిలో అద్భుతమైన నిపుణతతో మేళవించారు. అందుకే తెలుగు నాటక సర్వస్వంలో మధురవాణి పాత్ర ఒక అపురూపసృష్టి.

## 15.2 రాదగిన ప్రశ్నలు:-

1. గురజాడ ఆశించిన సంఘసంస్కరణ, భాషాసంస్కరణలు కన్యాశుల్కం నాటకం ద్వారా ఏ మేరకు నెరవేరాయో చర్చిండి.

2. ఆనాటి జీవిత ప్రతిబింబం కన్యాశుల్కం - పరిశీలించండి.

3. ఈ నాటికీ కన్యాశుల్కం గొప్పనాటకం- కారణాలను అన్వేషించండి.
4. కన్యాశుల్కం నాటకంలోని వాస్తవికతను వివరించండి.
5. కన్యాశుల్కం నాటకంలో హాస్యరస పోషణను చర్చించండి.
6. గిరీశం ఆనాడు మారుతున్న పరిస్థితులకు ప్రతినిధి - పరిశీలించండి.
7. ఈనాడు కన్యాశుల్కం లేదు... కానీ కన్యాశుల్కం నాటకం చిరంజీవి-కారణాలను చర్చిండి.
8. పాత్ర చిత్రణలో గురజాడ ప్రతిభను వివరించండి.
9. కన్యాశుల్కం నాటకంలోని ఉత్తరాంధ్ర మాండలికాన్ని సోదాహరణంగా వివరించండి.
10. కన్యాశుల్కం నాటకంలోని స్త్రీ పాత్రల ప్రాముఖ్యాన్ని చర్చించండి.

## 15.3. ఆధార గ్రంథాలు :


1. కన్యాశుల్కం - నూరేళ్ల సమాలోచనం.
   విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్: హైదరాబాద్: 1990
2. కన్యాశుల్కం శతజయంతి ఉత్సవం - ప్రత్యేక సంచిక
   ఉత్సవ కమిటి ప్రచురణ - విజయనగరం- 1992 - నవంబర్.
3. GURAZADA- COMMEMORATIVE VOLUME - SOUTH DELHI, ANDHRA ASSOCIATION-1976
4. కోలాచలం శ్రీనివాసరావు, నాటక సాహిత్య సమాలోచనం - ఆచార్య ఎస్. గంగప్ప
   శశీప్రచురణలు - 1977
5. తెలుగు నాటక వికాసము - డాక్టర్ పి.యస్. ఆర్. అప్పారావు
   నాట్యమాలా ప్రచురణలు - హైదరాబాద్ - 1967
6. కన్యాశుల్క నాటక కళ - సర్దేశాయి తిరుమలరావు.


**డా॥ కందిమళ్ల సాంబశివరావు**

401TL21

# M.A. TELUGU :: 4th SEMESTER :: PAPER-I

## AADHUNIKA SAHITYAM (PRESCRIBED TEXTS)

## ఆధునిక సాహిత్యం (నిర్ణయించిన పాఠ్యాంశాలు)

## మాదిరి ప్రశ్నాపత్రం

---

**సమయం: 3 గంటలు** **మార్కులు: 70**

**1. ఈ క్రింది వాటిలో ఐదింటికి సందర్భ సహిత వ్యాఖ్యలు రాయండి** **5 × 2 = 10 మార్కులు**

i) ఈ ధ్యానమేలరా! యీవలకు రమ్మురా

ii) బ్రతుకుదారుఁజూపి రక్షించరా దొరా

iii) కృష్ణ కబరీబంధ మవశ్యమ్మింకన్

iv) నవభారత వీర పతాక నెత్తెదన్

v) నవశక్తి విధాతా / సమ జగతీ నేతా

vi) ఉషోమూర్తి అమరమానవుడు
కాలంవలె ప్రభవిస్తున్నాడల్లదిగో

vii) ఇంతమంది కన్నతల్లి
ఎందుకిట్లు మారెనో

viii) ఎంత యెంత దురపిల్లెనో
వాని యింత యెదద

ix) చట్లకి చావనలుపు మనిషికి చావ తెలుపు

x) పొమ్మనక్కరలేదు, పొగబెడితే చాలు

**ఈ క్రింది ప్రశ్నలలో నాల్గింటికి సమాధానాలు రాయండి.** **4 × 15 = 60 మార్కులు**

2. శంకరంబాడి సుందరాచారి గీతాంజలిని ఆంధ్రీకరించిన విధానాన్ని విశ్లేషించండి?
3. గీతాంజలి ఆధారంగా కవి తాత్త్విక భావాలను వివరించండి?
4. విజయశ్రీ పాఠ్యభాగ సారాంశాన్ని రాయండి?
5. ధర్మరాజు పాత్రచిత్రణ చేయండి?
6. సమధర్మం ఆధారంగా ఆవంత్స సోమసుందర్ అభ్యుదయ భావాలను వివరించండి?
7. 'కరుణ రసాత్మక కావ్యం పెన్నేటిపాట' విశ్లేషించండి?
8. కన్యాశుల్కంలోని ఉత్తరాంధ్ర మాండలిక భాషను వివరించండి?
9. కన్యాశుల్కంలోని స్త్రీ పాత్రలను పరిచయం చేయండి?